వ్యాస మహాభారతం

(తెలుగు వచనం)

వన పర్వం - 1



డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి

డాక్టర్ సూరం శ్రీనివాసులు

శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్

విజయవాడ - 12.

వ్యాస
మహాభారతం

(తెలుగు వచనం)

వన పర్వం - 1

డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
డాక్టర్ సూరం శ్రీనివాసులు

894.8278/
రామ - మహా

వ్యాస

మహాభారతం (తెలుగు వచనం)

వన పర్వం - 1

ప్రథమ ముద్రణ : వికృతి ఉగాది (మార్చి) 2010

18 సంపుటాల వెల : రూ. 720/-

C-27451

సుందరయ్య గ్రంథాలయ నంబర్
A.C.No 46354
గచ్చిబౌలి, హైదరాబాద్-500032

ప్రతులకు :
డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
శివాలయం వెనుక, **పోలకంపాడు,**
తాడేపల్లి పోస్టు, గుంటూరు జిల్లా - 522501,
ఫోన్ : 08645-272093, సెల్ : 9491727611

ప్రచురణ & ప్రతులకు :
శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్
డోర్ నెం. 76-8/1-28, లలితానగర్,
భవానీపురం, విజయవాడ - 520 012.
ఫోన్ : 0866-2414322, సెల్ : 9440346287

అమ్మనాన్నలు : **కరెడ్ల గోపాలకృష్ణమూర్తి, కమలమ్మ**

జన్మనిచ్చిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలతో....

వెంకట సీతారామశాస్త్రి, సుందరశర్మ, శ్రీనివాస్



టైటిల్ ముద్రణకు సహకరించినవారు

శ్రీ కమ్ముల వెంకటేశ్వరరావు దంపతులు

శ్రీనివాస ఆఫ్‌సెట్ ప్రింటర్స్, విజయవాడ.

కీ॥శే॥ పరుచూరు నాగేశ్వరరావు గారు

వారి జ్ఞాపకార్థం

టైటిల్ బోర్డు ఇచ్చినవారు

కుమారులు :

శ్రీయుతులు వెంకటమోహన్ బాబా

వెంకటరామ సురేష్

కీ॥శే॥ కోడిదాసు సోమేశ్వరరావు

వారి జ్ఞాపకార్థం

ప్రింటింగ్ ఖర్చులు ఇచ్చినవారు

కుమారులు :

శ్రీయుతులు శ్రీనివాస్, సత్యనారాయణ (చినబాబు)

భవాని, విశాలాక్షి

చదివి ముందుకు సాగండి

మనిషికి కోరికలు సహజాతాలు. కోరికలు తీర్చుకొనే ప్రయత్నం సహజాతం. కోరికలు తీరినా, తీరకున్నా ఏదో ఒక దశలో ఏదో ఒక కారణం వల్ల కోరికలు దూరం కావాలన్న ఆలోచనా సహజం. ఈ ప్రవృత్తిని అధ్యయనం చేసి, ఆనుపానులు గ్రహించి మహర్షులే మార్గదర్శనం చేశారో, వారి బోధనలు గ్రహించి మనిషే అలా మారాడో కానీ భారతీయులు ఆ ప్రవృత్తికి అద్భుతంగా స్పష్టంగా రూపకల్పన చేసికొన్నారు. ఆ ప్రవృత్తినే నాలుగుగా విభజించి పురుషార్థాలని పేరు పెట్టుకొన్నారు. అవే ధర్మ - అర్థ - కామ - మోక్షాలు. వాఙ్మయమంతా ఏదో ఒక కోణంలో ఈ అంశాలనే ప్రస్తావిస్తుంది. ప్రస్తుతిస్తుంది. వాటిలో తలమానికం, ఆ వాఙ్మయానికి మూలకందం శ్రీమహాభారతం. దానికి స్రష్ట, ద్రష్ట, కర్త అన్నీ వ్యాసమహర్షియే. పురుషార్థాలకు సంబంధించి భారతంలో ఉన్నదే మరెక్కడయినా ఉంటుందని, ఇక్కడ లేనిది మరెక్కడ ఉండదని ఘంటాపథంగా చెప్పగలిగాడు వ్యాసమహర్షి.

వేదశాస్త్రాలు దేవఋణం, పితృఋణం, ఋషిఋణమని మూడు ఋణాలతో మనిషి జన్మిస్తాడని చెప్తే వ్యాసమహర్షి మనుమార్గంలో మనుష్యఋణాన్ని కూడా చెప్పారు. సామాజికదృష్టిలో ఇది చాలా అద్భుతమూ, ఆదరణీయమూ, ఆచరణీయమూ అయిన అంశం. ఆ మనుష్యఋణాన్ని తీర్చుకొనే మార్గంలో ఆనృశంస్యాన్ని (భూతదయ) ఉద్బోధించారు వ్యాసమహర్షి. ప్రాణులన్నింటిపై కరుణ చూపగలగటమే మనుష్య ఋణవిముక్తికి మార్గం. ఆ విలువను ప్రతిపాదించటానికి తనవారినే భీష్మ, ధర్మరాజు; ధృతరాష్ట్ర, దుర్యోధనులు ప్రతినిధులనుగా స్వీకరించి భారతాన్ని నిర్మించాడు. తానూ ఆ మహానిర్మాణంలో పాత్ర అయి, తన వారిలోని గుణదోషాలనే హేతుబద్ధంగా ప్రస్తావిస్తూ మనిషి ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో **స్పష్టారుంధతీన్యాయంగా** భారతంలో ప్రదర్శించాడు వ్యాసమహర్షి. అన్నమాటకు ఒదిగి ఉండటంతో పాటు అమ్మమాటకు విలువనివ్వటాన్ని కూడా మానవజాతికి నేర్పాడు. దానికి ఇబ్బంది కలుగుతున్న స్థితిలో తానే స్వయంగా వచ్చి పరిష్కరించాడు (పాండవులందరూ

ఎందరో మహానుభావులు

వన పర్వం ఇలా సర్వాంగసుందరంగా సకల జనహితంగా తీర్చిదిద్దడానికి ప్రత్యక్షంగాను, పరోక్షంగాను మాకు సహకరించిన డాక్టర్ కాళ్లకూరి అన్నపూర్ణ, డాక్టర్ రేమెళ్ల వేంకట రామకృష్ణ శాస్త్రి, డాక్టర్ నిట్టల సుబ్రహ్మణ్యేశ్వర శాస్త్రి, డాక్టర్ ధూళిపాళ రామకృష్ణ, డాక్టర్ ఆకొండి విశ్వనాథం, శ్రీ జన్నాభట్ల వీరేశ్వర శాస్త్రి, డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ గార్లకు మా హృదయపూర్వక కృతాజ్ఞతాంజలులు సమర్పిస్తున్నాము.

ఏ పనికైనా భగవంతుని ఆశీస్సులతో పాటు మానుషదైవముల సహాయ సహకారాలు కూడా అవసరమే. కొంతమంది అవ్యక్తముగా వెనక వుండి సత్ కార్యక్రమ నిర్వహణం చేయడంలో సిద్ధహస్తులై ఉంటారు. వారు భగవదాదేశాన్ని పాటిస్తున్నట్లు తమంతా తామే దైవం మానుషరూపేణా అన్నట్లు వచ్చి అవ్యక్తముగా సహకరిస్తారు. అది అభిగమ్యకృతే దానం అన్నట్లుగా నిర్వహింపబడుతుంది. అటువంటి అవ్యక్త సుందరులు మా కరెడ్ల సుందరశర్మ గారు. వారు దీనివెనుక వెన్నెముకలా వుండి సర్వంతానే అయి వ్యవహరించారు. ఈ విషయంలో మేము వారికి కృతాజ్ఞతాబద్ధులమై నిలుస్తున్నాము. అటువంటి పెద్దల సహకారంతో **శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్** ఏర్పడినది.

పంచమవేదమూ, సకలశాస్త్రసారమూ, భారతీయ సంస్కృతికి మూలకందమూ అయిన వ్యాసభారతం మొత్తం పద్దెనిమిది పర్వాలు యథాతథంగా, ఉన్నదిఉన్నట్లుగా సరళమైన తెలుగు వ్యావహారిక భాషలో

సామాన్యపాఠకులకు కూడా అర్థమయ్యేటట్లు **తక్కువ వెలలో** అందించాలని మా సంకల్పం.

ఈ ఆశయాలతో భారతీయ తత్త్వానికి, ఆధ్యాత్మిక తత్త్వానికి, సాహిత్య వైభవానికి సంబంధించిన గ్రంథాలను ముద్రించి తక్కువ వెలలో ప్రజలకు అందివ్వాలని మా ఆకాంక్ష. దీనిని ఆదరించే అభిమానులందరు మా కృతజ్ఞతకు పాత్రులు. ఈ సంస్థ వివిధ పదవులలో పాలుపంచుకుంటున్న పెద్దలు...

1.	గౌరవాధ్యక్షులు	శ్రీ కరెడ్ల సుందరశర్మ
2.	అధ్యక్షులు	డా। తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
3.	ఉపాధ్యక్షులు	డా॥ సూరం శ్రీనివాసులు
4.	కార్యదర్శి	డా। పాలపర్తి శ్యామలానందప్రసాద్
5.	కోశాధికారి	డా। ధూళిపాళ రామకృష్ణ
6.	సహాయకార్యదర్శి	డా॥ ఉపద్రష్ట వెంకట రమణమూర్తి
7.	కార్యవర్గసభ్యులు	శ్రీ యండూరి గోవిందరావు
8.	।	శ్రీ మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి
9.	॥	శ్రీ జన్నాభట్ల వీరేశ్వరశాస్త్రి

అందరికీ వందనాలు

కార్యదర్శి
శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్

ద్రౌపదిని పెళ్ళి చేసికొనే విషయంలో ద్రుపదుని ఒప్పించి). అమ్మమాటమేరకు తనకవసరం లేకున్నా బిడ్డలను కన్నాడు. తలచుకొంటే చాలు ప్రత్యక్షమవుతానని అమ్మకు మాట ఇచ్చి దాన్ని నిలబెట్టుకొన్నాడు. మానవుడు సంపాదించవలసిన వాటిల్లో ధనం ముఖ్యం అనుకొంటాం. అంతకన్న ముఖ్యం తపస్సు. లోకకళ్యాణంకోసం ఆ తపస్సును కూడా ఖర్చుచేయటానికి వెనుదీయనివాడు వ్యాసుడు. అందుకే అందరికీ కనువిప్పు కల్గించటానికి భారతమృతవీరులను కూడా చూపించారు.

మహాభారతం మానవజీవనగమనంలో కరదీపిక. ధర్మాధర్మనిర్ణయంలో ఒరపిడిరాయి. కర్తవ్యాకర్తవ్యజ్ఞానాన్ని ఉపదేశించడంలో ఒక ఉత్తమగురువు. నిరాశకు లోను కాకుండా మనిషి బ్రతకటానికి ఒక ఒరవడి. అదుపులేని, అలవిమాలిన ఆశలను తెంచుకోవటానికి ఒక కొడవలి. తనను తాను సజీవశిల్పంగా తీర్చిదిద్దుకొవటానికి ఒక ఉలి.

అయినా భాషకారణంగా దానిని ప్రేమించే వారు, సంశయించే వారు కూడా చాలామంది దానిని చదవలేకపోతున్నారు. అందుకే తెలుగు వారికి ఆ వ్యాసభావాలను యథాతథంగా అందించేందుకే ఈ ప్రయత్నం - వ్యాస మహాభారతం (తెలుగు వచనం).

రామాయణ మహాభారతాలను ఆధ్యాత్మికవాదులు నెత్తికెత్తుకొని మోయటం ప్రారంభమైన తరువాత ఇవి ముసలివాళ్ళకు సంబంధించినవి అన్న భావం లోకంలో ప్రబలింది. ఇది దురదృష్టకరం. యౌవనంలోనే వీటిని చదువగలిగితే జీవితాన్ని సరిగా నడుపుకొనే జవజీవాలు గలుగుతాయి. సర్వమానవసౌభ్రాత్రం, సర్వప్రాణిసమత్వం మనస్సులో మెదిలి నిష్కల్మషంగా నడువగల ప్రవృత్తి కలుగుతుంది. ఇహలోకానికి ఇంతకంటే ఏం కావాలి...?

ఇట్లు
అనువక్తలు

★ మహాభారతం యథాతథంగా అనగా అధికపాఠాలతో సహా ఇచ్చాం. అధికపాఠాలు చిన్నసైజులో, బ్రాకెట్లలో ఇచ్చాం.

విషయసూచిక

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
	1. అరణ్య పర్వము - 10	
1.	పాండవుల వనవాసగమనము. (46)★	19
2.	ధర్మరాజుతో శౌనకుడు ప్రసంగించుట. (84)	22
3.	యుధిష్ఠిరుడు సూర్యుని ఉపాసించి అక్షయపాత్రను పొందుట. (86)	28
4.	హితమును ఉపదేశించిన విదురునిపై ధృతరాష్ట్రుడు కుపితుడగుట. (22)	33
5.	పాండవులు కామ్యకవనమును ప్రవేశించుట, విదురుని ఆగమనము. (22)	35
6.	ధృతరాష్ట్రుడు సంజయుని పంపి వనము నుండి విదురుని రప్పించుట, అతనిని క్షమింపుమని ప్రార్థించుట. (25)	36
7.	దుష్టచతుష్టయము పాండవులను చంపబూనుట -వ్యాసాగమనము. (24)	38
8.	ధృతరాష్ట్రునికి వ్యాసుని హితోపదేశము. (12)	39
9.	ఇంద్రసురభి సంవాదమును వ్యాసుడు చెప్పుట. (23)	40
10.	మైత్రేయుడు దుర్యోధనుని శపించుట. (39)	41
	2. కిర్మీరవధ పర్వము - 1	
11.	భీమసేనుడు కిర్మీరుని చంపుట. (75)	44
	3. అర్జునాభిగమన పర్వము - 26	
12.	శ్రీకృష్ణాదుల ఆగమనము. (136)	48
13.	ద్యూతసమయమున తాను రాకపోవుటకు శ్రీకృష్ణుడు కారణము చెప్పుట. (17)	55
14.	శ్రీకృష్ణుడు సాల్వుని చంపుట. (22)	56
15.	ద్వారకలోని యుద్ధ రక్షణ సంసిద్ధత. (23)	58
16.	శాల్వుని సైన్యము యాదవులను చుట్టుముట్టుట - యుద్ధము. (33)	59
17.	ప్రద్యుమ్న శాల్వుల ఘోరయుద్ధము. (25)	61
18.	మూర్ఛితుడయిన ప్రద్యుమ్నుడు సారథిని నిందించుట. (33)	62
19.	ప్రద్యుమ్నుడు శాల్వుని ఓడించుట. (27)	64

★ బ్రాకెట్లలోని మొదటి సంఖ్య సంస్కృతంలో ఆ అధ్యాయంలోని శ్లోక సంఖ్య. రెండవ సంఖ్య అధికపాఠశ్లోక సంఖ్య

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
20.	శ్రీకృష్ణశాల్వుల భయంకరయుద్ధము. (41)	66
21.	శాల్వుని మాయచే శ్రీకృష్ణుడు మూర్ఛనొందుట. (30)	68
22.	సౌభ వధ - కృష్ణాదులు తమ నగరములకు వెడలుట. (54)	70
23.	ద్వైతవనమునకు వెళ్ళు పాండవులను చూచి ప్రజలు వ్యాకులపడుట. (16)	72
24.	పాండవులు ద్వైతవనమునకు వెళ్ళుట. (26)	74
25.	మార్కండేయమహర్షి పాండవులకు ధర్మమునుపదేశించి, ఉత్తరదిక్కుగా వెళ్ళుట. (19)	75
26.	బకదాల్భ్యుడు యుధిష్ఠిరునికి బ్రాహ్మణ ప్రభావమును చెప్పుట. (25)	77
27.	ద్రౌపది తన క్రోధమును యుధిష్ఠిరునికి తెలుపుట. (40)	78
28.	ప్రహ్లాద-బలి సంవాదమును ద్రౌపది వర్ణించుట. (36)	81
29.	యుధిష్ఠిరుడు క్రోధమును నిందించుట -సహనమును ప్రశంసించుట. (52)	83
30.	ద్రౌపది యుధిష్ఠిరుని బుద్ధి, ధర్మాదులను ఆక్షేపించుట. (43)	86
31.	యుధిష్ఠిరుడు ద్రౌపది ఆక్షేపమునకు సమాధానము చెప్పుట. (42)	89
32.	ద్రౌపది పురుషార్థ సాధనకు ప్రోత్సహించుట. (62)	92
33.	భీమసేనుడు పురుషార్థమును ప్రశంసించుట, యుధిష్ఠిరుని యుద్ధము చేయుమని ప్రార్థించుట. (90)	96
34.	యుధిష్ఠిరుడు ధర్మమునకు కట్టుబడి ఉందునని ప్రకటించుట. (22)	101
35.	భీమసేనుడు యుధిష్ఠిరుని యుద్ధమునకు ఉత్సాహపరచుట. (35)	103
36.	వ్యాసుడు యుధిష్ఠిరునికి ప్రతిస్మృతి విద్యనిచ్చుట, పాండవులు కామ్యకవనమునకేగుట. (45)	106
37.	అర్జునుడు సోదరులందరితో కలసి ఇంద్రకీలాద్రికేగి ఇంద్రుని దర్శించుట. (59)	108
	4. కైరాత పర్వము - 4	
38.	అర్జునుని ఉగ్రతపస్సు, ఆ విషయమును ఋషులు శంకరునితో చర్చించుట. (35)	111
39.	కిరాతార్జునుల యుద్ధము, శంకరుడు ప్రసన్నుడగుట, అర్జునుడు స్తుతించుట. (84)	113

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
40.	శంకరుడు అర్జునునకు వరమునిచ్చి తన ధామమునకు బయలుదేరుట. (29)	118
41.	అర్జునునికి దిక్పాలకులు దివ్యాస్త్రములనిచ్చుట, స్వర్గమునకు వెళ్ళుమని ఇంద్రుడు ఆదేశించుట. (49)	119
	5. ఇంద్రలోకాభిగమన పర్వము - 10	
42.	అర్జునుడు మాతలితో స్వర్గలోకమునకు ప్రయాణమగుట. (42)	122
43.	అర్జునుడు దేవేంద్రుని దర్శించుట, ఇంద్రుడు అతనిని స్వాగతించుట. (32)	124
44.	అర్జునుడు అస్త్రములను సంగీతమును నేర్చుకొనుట. (11)	126
45.	చిత్రసేనోర్వశీసంవాదము. (16)	127
46.	ఊర్వశిని అర్జునుడు తిరస్కరించుట, ఆమె అతనిని శపించుట. (63)	128
47.	లోమశుడు స్వర్గము నుండి కామ్యకవనమున కేగుట. (35)	131
48.	అర్జునుని వృత్తాంతము విన్న ధృతరాష్ట్రుని చింత. (18)	133
49.	సంజయుడు ధృతరాష్ట్రుని మాటలను ఆంగీకరించుట, ధృతరాష్ట్రుని సంతాపము. (23)	134
50.	అరణ్యమున పాండవుల ఆహారము. (12)	136
51.	శ్రీకృష్ణాదులు దుర్యోధనాదులవధకై ప్రతిజ్ఞ చేసిరని సంజయుడు ధృతరాష్ట్రునికి వినిపించుట. (46)	137
	6. నలోపాఖ్యాన పర్వము - 28	
52.	నలోపాఖ్యాన ప్రారంభము. (59)	139
53.	హంస సందేశము. (32)	142
54.	దిక్పాలురు దమయంతీ స్వయంవరమునకు వచ్చుట. (31)	144
55.	నలుడు అంతఃపురములోని దమయంతికి దేవతల సందేశము చెప్పుట. (25)	146
56.	దమయంతి సందేశము. (31)	147
57.	దమయంతీ స్వయంవరము - వివాహము. (47)	149
58.	నలుని సద్గుణములను విని కలి కోపించుట. (14)	152
59.	కలి ఆవేశించిన నలుడు పుష్కరునితో జూదమాడుట. (18)	153
60.	దమయంతి తన సంతానమును కుండినపురమునకు పంపుట. (25)	154
61.	నలదమయంతులు అడవుల పాలగుట - నలుని వస్త్రాపహరణము. (36)	155

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
62.	నిద్రించుచున్న దమయంతిని విడిచి నలుడు వెళ్లిపోవుట. (29)	157
63.	దమయంతి పాతివ్రత్యప్రభావముతో వ్యాధుడు మరణించుట. (39)	158
64.	దమయంతి సార్థవాహులతో కలిసి వెళ్లుట. (132)	160
65.	దమయంతి చేదిరాజగృహమును చేరుట. (76)	167
66.	నలుడు కర్కోటకుని రక్షించుట. (26)	170
67.	నలుడు ఋతుపర్ణుని కడ అశ్వాధ్యక్షుడగుట. (19)	172
68.	భీమమహారాజు పంపిన బ్రాహ్మణుడు చేదిరాజు యొక్క భవనమున దమయంతిని చూచుట. (39)	173
69.	దమయంతి తండ్రి ఇంటికి వెళ్ళుట. నలుని కొఱకు బ్రాహ్మణులను పంపుట. (50)	175
70.	తనకు ద్వితీయ స్వయంవరమని దమయంతి ఋతుపర్ణునకు సందేశము పంపుట. (27)	178
71.	ఋతుపర్ణుడు విదర్భకు వెళ్ళుట. (36)	179
72.	నలుడు ఋతుపర్ణుని నుండి ద్యూతవిద్యారహస్యము గ్రహించుట – నలుని శరీరమునుండి కలి నిష్క్రమించుట. (43)	181
73.	దమయంతి ఆలోచనము. (36)	184
74.	బాహుక కేశినీ సంవాదము. (31)	186
75.	దమయంతి తన పుత్రికను, పుత్రుని బాహుకుని దగ్గరకు పంపుట. (28)	188
76.	నలుడు ప్రకటమగుట – నలదమయంతుల సమాగమము. (53)	189
77.	నలుని నుండి అశ్వవిద్యను గ్రహించి ఋతుపర్ణుడు అయోధ్యకు వెడలుట. (20)	192
78.	పుష్కరుని ఓడించి నలుడు నిజనగరమున ప్రవేశించుట. (37)	193
79.	బృహదశ్వుడు ద్యూతాశ్వవిద్యల రహస్యము తెలిపి వెడలుట. (27+5)	195
	7. తీర్థయాత్రా పర్వము - 77	
80.	అర్జునుని గురించి పాండవుల చింత. (30)	197
81.	యుధిష్ఠిరుని వద్దకు నారదుడు వచ్చి తీర్థయాత్రా ఫలము గురించి తెలుపుట. (22)	199

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
82.	భీష్మునికి పులస్త్యుడు చెప్పిన తీర్థయాత్రా మాహాత్మ్యము. (128)	200
83.	కురుక్షేత్ర తీర్థాల మాహాత్మ్యము. (208)	206
84.	వివిధ తీర్థాల మహిమ. (162)	215
85.	గంగాసాగర, చిత్రకూట, ప్రయాగ, గంగాది తీర్థప్రభావ వర్ణనము. (132)	223
86.	యుధిష్ఠిరుడు పుణ్యతపోవనాశ్రమాల గురించి ధౌమ్యుని ప్రశ్నించుట. (21)	230
87.	ధౌమ్యుడు తూర్పుదిక్కున ఉన్న తీర్థాలను వర్ణించుట. (28)	231
88.	ధౌమ్యుడు వర్ణించిన దక్షిణ తీర్థాలు. (27)	233
89.	ధౌమ్యుడు పశ్చిమదిక్కున ఉన్న తీర్థాలను వర్ణించుట. (18)	234
90.	ధౌమ్యుడు ఉత్తరదిక్కున గల తీర్థాలను వర్ణించుట. (34)	235
91.	లోమశుడు వచ్చి ధర్మరాజుకు ఇంద్రసందేశము, అర్జునుని అస్త్రప్రాప్తి చెప్పుట. (25)	237
92.	లోమశుని ద్వారా ఇంద్రసందేశము విని ధర్మరాజు తనవారితో తీర్థయాత్రకు పోవుట. (27)	239
93.	ఋషులకు నమస్కరించి పాండవులు తీర్థయాత్రకు వెడలుట. (29)	240
94.	రాజులదృష్టాంతాలతో లోమశుడు యుధిష్ఠిరునికి తీర్థయాత్ర, అధర్మహానులను వివరించుట. (22+1)	242
95.	పాండవులు నైమిశారణ్యాది తీర్థాలు తిరుగుచు గయుని యజ్ఞాల మహిమ వినుట. (29)	243
96.	వాతాపి, ఇల్వలుల చరిత్ర, అగస్త్యుని వివాహవృత్తాంతము. (30+$\frac{1}{2}$)	245
97.	అగస్త్యుడు లోపాముద్రను వివాహమాడి ధనసంగ్రహణము చేయగోరుట. (25)	246
98.	ధనప్రాప్తికై అగస్త్యుడు వివిధరాజుల వద్దకు వెళ్ళుట. (20)	248
99.	అగస్త్యుడు ఇల్వలుని, వాతాపిని శిక్షించుట, పరశురాముడు తిరిగి శక్తిమంతుడగుట. (71+3)	249
100.	దేవతలకు దధీచమహర్షి వెన్నెముక ఇచ్చుట. వజ్రాయుధము నిర్మించుట. (25)	254
101	వృత్రునివధ, జగన్నాశముకొరకు అసురుల దుర్మంత్రణము. (23)	255

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
102.	సముద్రములోని ఋషులను దైత్యులు నాశనము చేయుట. దేవతలు నారాయణుని శరణుకోరుట. (26)	256
103.	విష్ణువు ఆజ్ఞపై దేవతలు అగస్త్యాశ్రమమునకు చేరుట. సముద్రమును ఇంకింపజేయుమని ప్రార్థించుట. (18)	258
104.	అగస్త్యుడు వింధ్యవృద్ధిని నివారించి, దేవతలతో సముద్రతీరము చేరుట. (24+$\frac{1}{2}$)	259
105.	అగస్త్యుడు సముద్రజలము త్రాగుట- దేవతలు దైత్యసంహారము చేయుట. (20+1)	260
106.	సగరుడు సంతానము కొరకు శివునికై తపస్సు చేసి వరములను పొందుట. (23)	261
107.	సగరపుత్రులు కపిలక్రోధాగ్నిలో నశించుట. అంశుమంతుడు సగరయజ్ఞమును పూర్తిచేయుట. (70+3$\frac{1}{2}$)	262
108.	భగీరథుడు తపస్సు చేయుట, గంగను భరించుటకు శంకరుని కోరుట. (27+1)	265
109.	గంగావతరణము - సగరపుత్రుల ఉద్ధరణము. (21+1)	267
110.	నంద,కౌశికల గొప్పతనము, ఋష్యశృంగుని కథ-లోమపాదుడు ఋష్యశృంగుని తీసుకొనివచ్చుట. (58)	268
111.	వేశ్యలు ఋష్యశృంగుని ప్రలోభపరచుట - విభాండకుడు పుత్రుని చింతకు కారణమడుగుట. (23)	271
112.	వేశ్యను మునికుమారుడు అని భావించిన ఋష్యశృంగుడు తండ్రితో అతనియందు ఆసక్తి తెలియజేయుట. (19)	273
113.	ఋష్యశృంగుడు లోమపాదకన్యను గ్రహించుట. (25+$\frac{1}{2}$)	274
114.	కౌశికి, గంగా సాగరాది నదులలో స్నానమాచరించి ధర్మరాజు మహేంద్రపర్వతమును చేరుట. (30)	276
115.	అకృతవ్రణుడు ధర్మరాజుకు పరశురామవృత్తాంతము చెప్పుట. (45)	278
116.	పరశురాముడు తల్లిని చంపుట. కార్తవీర్యుని చంపుట. రాజపుత్రులు జమదగ్నిని చంపుట. (29)	280
117.	పరశురాముడు తండ్రికై విలపించుట. క్షత్రియ సంహారము, ధర్మజుడు పరశురాముని పూజించుట. (18)	282

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
118.	యుధిష్ఠిరుడు ప్రభాసక్షేత్రమున తపస్సు చేయుట - యాదవ పాండవుల కలయిక. (23)	283
119.	ప్రభాసతీర్థమున బలరాముడు పాండవులకు సానుభూతి తెల్పుట. (22)	285
120.	సాత్యకి పౌరుషవచనాలు, శ్రీకృష్ణుని ఆజ్ఞపై పాండవులు పయోష్ణినదీతీరమున వసించుట. (32)	286
121.	గయుని ప్రశంస, నర్మదామాహాత్మ్యము, సుకన్యాచ్యవనుల కథ. (24+1)	289
122.	చ్యవనమహర్షి సుకన్యను పొందుట. (29)	290
123.	అశ్వినీదేవతల అనుగ్రహముచే చ్యవనునికి యౌవనము, అందము కల్గుట. (24+2)	292
124.	శర్యాతి ఇంద్రుని చంపుటకు రాక్షసుని సృష్టించుట. (25)	293
125.	ఇంద్రుడు ఆపదనుండి బయటపడుట - లోమశుడు చెప్పిన తీర్థాల మాహాత్మ్యము. (26)	295
126.	మాంధాతపుట్టుక, సంక్షిప్త చరిత్ర. (47+1$\frac{1}{2}$)	296
127.	సోమక-జంతువుల కథ. (21)	299
128.	సోమకునికి నూరుగురు కుమారులు కలుగుట - సోమకపురోహితులు నరకస్వర్గములను అనుభవించుట. (21+$\frac{1}{2}$)	300
129.	కురుక్షేత్రద్వారము యమునాతీర్థము సరస్వతీ తీర్థమాహాత్మ్యము. (22+$\frac{1}{2}$)	302
130.	విభిన్నతీర్థాలమహిమ, ఉశీనరరాజు కథ. (24)	303
131.	డేగకు శిబి తనశరీర మాంసము ఇచ్చి పావురమును రక్షించుట. (34)	305
132.	అష్టావక్రముని జన్మవృత్తాంతము, జనకుని సభకు ఆయన రాక. (23)	307
133.	అష్టావక్రుడు ద్వారపాలకునితో, జనకునితో మాట్లాడుట. (30+1)	308
134.	అష్టావక్రుడు బందిని ఓడించుట. (41)	311
135.	యవక్రీత చరిత్ర. (60)	315
136.	యవక్రీతుడు రైభ్యుని కోడలితో వ్యభిచరించి రాక్షసునిచేతిలో చనిపోవుట. (20)	318
137.	భరద్వాజుడు పుత్రశోకముతో విలపించి రైభ్యుని శపించి అగ్నిలో ప్రవేశించుట. (19)	320

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
138.	బ్రహ్మ హత్య నుండి పరావసువు విముక్తుడగుట. వైభ్య భరద్వాజ యవక్రీతులు తిరిగి జీవించుట. (28)	321
139.	పాండవుల ఉత్తరదిగ్యాత్ర. (20)	322
140.	పాండవులు గంధమాదన హిమాలయాలకు బయలుదేరుట. (29)	324
141.	ధర్మరాజు గంధమాదనమునకు పోవుటకు నిశ్చయించుట. (28)	325
142.	లోమశుడు వరాహావతారమును వర్ణించుట. (63)	327
143.	గంధమాదనయాత్రలో పాండవులపై గాలితో కూడిన జడివాన. (23)	330
144.	ద్రౌపది మూర్ఛ, ఘటోత్కచుని రాక. (28)	331
145.	ఘటోత్కచుడు పాండవులను గంధమాదనమునకు చేర్చుట. (54)	332
146.	భీమసేనుడు సౌగంధికపుష్పాలు తెచ్చుటకు పోవుట - హనుమంతుని కలియుట. (96)	335
147.	హనుమద్భీమసేనుల సంభాషణ. (34)	340
148.	హనుమంతుడు సంక్షేపముగా రాముని చరిత్ర వినిపించుట. (22)	342
149.	హనుమంతుడు యుగధర్మాలు వర్ణించుట. (40)	343
150.	తన పూర్వశరీరమును హనుమంతుడు చూపుట, చాతుర్వర్ణ్య ధర్మ ప్రకటనము. (52)	345
151.	హనుమంతుడు భీముని ఊరడించి అంతర్ధానమగుట. (19)	348
152.	భీముడు సౌగంధిక వనమునకు వెడలుట. (14)	349
153.	కుబేరుని అనుచరులు భీమునిరాకను గురించి ప్రశ్నించుట. (16)	350
154.	భీముడు క్రోధవశులను జయించి సౌగంధికపుష్పాలు సంగ్రహించుట. (27)	351
155.	యుధిష్ఠిరాదులు గంధమాదనము చేరుట. (34)	353
156.	అశరీరవాణి ఆదేశము - పాండవులు నరనారాయణుల ఆశ్రమము చేరుట. (21)	355
	8. జటాసుర వధ పర్వము - 1	
157.	జటాసుర వధ. (72)	356
	9. యక్షయుద్ధ పర్వము - 7	
158.	పాండవులు ఆర్ష్టిషేణుని ఆశ్రమము చేరుట. (103)	359

॥ శ్రీమాత్రే నమః ॥

వ్యాస
మహాభారతం
(తెలుగు వచనం)
వన పర్వం - 1

1. పాండవుల వనవాసగమనము.

ముందుగా నారాయణునికి, నరోత్తముడయిన అర్జునునికి, సరస్వతీదేవికి, వ్యాసునికి నమస్కరించి, తరువాత జయమనే ఈ భారతాన్ని పరించాలి. చెప్పాలి.

జనమేజయుడు ఇలా అన్నాడు - ద్విజోత్తమా ! దుర్మార్గులైన ధార్తరాష్ట్రులు తమ మంత్రులతో కలిసి, మోసంతో పాండవులను జూదంలో ఓడించి, వారికి కోపాన్ని కల్గించారు. పరుషంగా మాట్లాడి వారితో వైరాన్ని పెంచుకొన్నారు కదా! అపుడు మా పూర్వపితామహులు యుధిష్ఠిరాదులు ఏం చేశారు? హఠాత్తుగా ఐశ్వర్యభ్రష్టులై, గొప్ప దుఃఖాన్ని పొంది, ఇంద్ర సమాన తేజస్సుకల పాండవులు వనంలో ఏ విధంగా సంచరించారు? అంతటి పెద్ద కష్టం పొందిన మహాత్ములైన ఆ పాండవులను ఎవరు అనుసరించారు? వారు అరణ్యంలో ఎటువంటి ఆచారవ్యవహారాలు పాటించారు? ఏం తిన్నారు? ఎక్కడ నివసించారు? మహర్షీ ! శూరులైన ఆ పాండవులు పన్నెండు సంవత్సరాలు అరణ్యంలో ఏ విధంగా గడిపారు? తపోధనా! స్త్రీలందరిలో సౌందర్యవతి, పతివ్రత, సత్యవాదిని, మహానుభావురాలు అయిన రాజపుత్రి ద్రౌపది, వనవాసమంతటి దారుణదుఃఖాన్ని నిజంగా అనుభవింపదగింది కాదు, అయినా అంతటి భయంకర దుఃఖాన్ని ఎలా సహింపగల్గింది ? ఈ విషయాలన్నింటిని నాకు విస్తరంగా చెప్పు. విప్రవరా! మహాపరాక్రమవంతులు, తేజస్సంపన్నులూ అయిన పాండవుల చరిత్రను నీవు చెపితే వినాలని నాకు కుతూహలంగా ఉంది.'

వైశంపాయనుడు ఇలా అన్నాడు - 'ఆ విధంగా అమాత్యులతో పాటుగా దుర్మార్గులైన ధార్తరాష్ట్రులు పాండవులను జూదంలో ఓడించి వారికి కోపం కల్గించారు. పాండవులు హస్తినాపురాన్ని విడిచివెళ్లారు. శస్త్రధారులైన పాండవులు ద్రౌపదితోపాటు వర్ధమాన

పురద్వారంనుండి ఉత్తరాభిముఖులై నగరంనుండి నిష్క్రమించారు. ఇంద్రసేనాది సేవకులు పదునలుగురికంటె ఎక్కువమంది ద్రౌపదితో వర్ధమాన పురద్వారం నుండి ఉత్తరాభిముఖులై నిష్క్రమించారు. పాండవులు వనానికి వెళ్ళారన్న విషయం తెలిసి పౌరులు దుఃఖంతో భీష్మ, విదుర, ద్రోణ, కృపాచార్యులను పలుమార్లు నిందించారు. వారు ఒకరితో ఒకరు భయం లేకుండా ఇలా మాట్లాడుకోసాగారు.

'శకుని, కర్ణ దుఃశాసనులతో పాపాత్ముడైన దుర్యోధనుడు ఈ రాజ్యాన్ని పరిపాలిద్దామనుకొంటున్నాడు. ఇక వంశమూ లేదు, మనమూ లేము, మన గృహాలూ లేవు. పాపాత్ములతో కలిసి పాపాత్ముడైన ఈ దుర్యోధనుడు రాజ్యం చేస్తుండగా, వంశమూ లేదు, ఆచారమూ లేదు. ధర్మార్థాలూ లేవు, ఇంక సుఖం ఎక్కడిది? దుర్యోధనుడు గురుద్వేషి. సదాచారాన్నీ, మంచి మనసున్నవారినీ వదిలిపెడతాడు. ధనలోభి, దురభిమాని, నీచుడు, క్రూర స్వభావుడు. దుర్యోధనుడు పరిపాలకుడిగా ఉండగా ఇక ఈ(భూమి) రాజ్యం లేనట్లే. అందువల్ల పాండవులు వెళ్లే చోటుకే మనమంతా కూడా వెళ్దాం. అదే మంచిది. పాండవులు దయాళురు, మహాత్ములు, జితేంద్రియులు, శత్రుంజయులు, లజ్జాశీలులు, యశస్వులు, ధర్మాచార పరాయణులు.' పౌరులు ఈ విధంగా మాట్లాడుకొని పాండవులను సమీపించి వారికి చేతులు జోడించి ఇలా అన్నారు.

'పాండవులారా ! మీకు మంగళమగుగాక. దుఃఖభాగులమైన మమ్ము విడిచి మీరు ఎక్కడకు వెళ్తారు? మీరు వెళ్ళే చోటికి మేము కూడా మిమ్మల్ని అనుసరించి వస్తాం. అధర్మంగా, క్రూరంగా, నిర్దయగా శత్రువులైన ధార్తరాష్ట్రులు మిమ్మల్ని జయించారని విని, మేమంతా చాలా బాధపడ్డాం. మీ సేవకులం, మీపట్ల భక్తులం అనురక్తులం, ఎల్లపుడూ మీ ఇష్టాన్ని, హితాన్ని కోరుకొనేవాళ్ళం. స్నేహితుల మయిన మమ్మల్ని ఇక్కడ వదిలివెళ్లడం మీకు తగిందికాదు. దుష్టుడైనరాజు పాలించే రాజ్యంలో ఉండి అన్నివిధాలా మేము చెడిపోలేము. పాండవులారా! శుభాశుభులైన వారి ఆశ్రయం పొందితే ఆ కలయిక కలిగించే గుణదోషాలను చెప్తాం. వినండి. పూలయొక్క సంసర్గంచేత వస్త్రమూ, నీరూ, తిలలూ, భూమీ పూలవాసనను పొందుతాయి. అలాగే ఆశ్రయసంసర్గం వల్ల కలిగిన గుణాలు వాటి ప్రభావాన్ని చూపుతాయి. **మూఢులతో సమాగమం నిరంతరం మోహజాలాన్ని కలిగిస్తుంది. సత్పురుషులతో సమాగమం ప్రతిదినమూ ధర్మాన్ని కలుగజేస్తుంది.** అందువల్ల విద్వాంసులు, వృద్ధులు, ఉత్తమస్వభావంగల, శాంతిపరాయణులైన తపస్వీజనులు, సత్పురుషులతో కలిసిఉండాలి. **విద్యచేత, పుట్టుకచేత, కర్మచేత నిర్మలులయిన వారిని సేవించాలి. వారితో కలిసి ఉండడం శాస్త్రాధ్యయనం**

కంటె గొప్పది.* మనం పుణ్యకర్మలు చేయకపోయినా పుణ్యశీలులైన సత్పురుషులతో కలిసి ఉండడంవల్ల మనం కూడా పుణ్యం పొందుతాము. పాపాత్ములను సేవించడం వల్ల పాపాన్ని పొందుతాం. దుర్మార్గుల దర్శనంవల్ల, స్పర్శవల్ల, వారితో మాట్లాడ్డంవల్ల, వారితోకూడి ఉండటంవల్ల ధార్మికాలైన ఆచారాలు క్షీణిస్తాయి. అందువల్ల అట్టిమానవులు సిద్ధిని పొందలేరు. నీచులతో కలయికవల్ల మానవుల బుద్ధి క్షీణిస్తుంది. మధ్యములతో కలియడం వల్ల బుద్ధి మధ్యమంగా ఉంటుంది. ఉత్తములతో కలయికవల్ల బుద్ధి శ్రేష్ఠత్వాన్ని పొందుతుంది. ఉత్తములు, విషయపరాఙ్ముఖులు, ప్రత్యేకించి ధర్మపరులు. లోకంలో ధర్మకామార్థసంభవాలైన గుణాలను చెప్పారు. వేదోక్తాలైన ఆ గుణాలు శిష్టసమ్మతాలై లోకాచారాల్లో కనబడుతూంటాయి. ఆ సద్గుణాలన్నీ మొత్తంగాను, విడివిడిగానూ మీలో ఉన్నాయి. శ్రేయస్సును కోరుకొంటున్న మేము గుణవంతులైన మీమధ్యలో నివసించాలని కోరుకొంటున్నాం.'

యుధిష్ఠిరుడు ఇలా అన్నాడు – 'మేము ధన్యులం. మా పట్లగల స్నేహకారుణ్యాలచే బ్రాహ్మణప్రముఖులైన జనులందరూ మాలో లేని గుణాలను కూడా ఉన్నట్లు చెపుతున్నారు. అందువల్ల సోదరులతోకూడిన నేను మీ అందరికి విన్నవించుకొంటున్నాను. మాపట్ల గల స్నేహంచేత, దయచేత మీరు మరొకవిధంగా చేయవద్దు. మా పితామహుడు భీష్ముడు, రాజయిన ధృతరాష్ట్రుడు, విదురుడు, మా తల్లి కుంతి, సుమారుగా నా స్నేహితులందరూ హస్తినాపురంలోనే ఉన్నారు. శోకసంతాపాలచే వ్యాకులపడుతున్న వారందరిని మా హితాన్ని కోరి మీరు ప్రయత్నపూర్వకంగా రక్షించాలి. అందువల్ల మీరు వెనుకకు మరలండి. మీరు ఇప్పటికే చాలా దూరం వచ్చారు. నేను నిశ్చయంగా చెపుతున్నాను. మీరు మాతో కలిసి రావద్దు. మావారందరినీ మీవద్ద ఉంచిన న్యాసంగా భావించండి. మాపట్ల స్నేహభావం కలిగి ఉండండి. నా హృదయంలో ఉన్న కార్యాలన్నింటిలో ఇదే ఉత్తమమైంది. మీరీ పని చేస్తే నాకు సంతోషం కలుగుతుంది. అదే నాకు సత్కారం అవుతుంది.'

ఇలా ధర్మరాజు ప్రార్థిస్తే ఆ ప్రజలందరూ కలిసి ఒక్కసారిగా 'హా ! మహారాజా' అని ఘోరమైన ఆర్తనాదం చేశారు. యుధిష్ఠిరుని గుణాలను సంస్మరించుకొని, దుఃఖార్తులూ, మిక్కిలి ఆపన్నులూ అయిన ఆ ప్రజలు తమ కోరిక తీరకుండానే కేవలం పాండవులను కలుసుకొని వెనుదిరిగి వెళ్లారు. పౌరులు వెనుదిరిగివెళ్లాక, పాండవులు రథాలనెక్కి గంగానదీతీరంలో ఉన్న ప్రమాణం అనే వటవృక్షం దగ్గరకు వచ్చారు. వటవృక్షానికి

---

* యేషాం త్రీణ్యవదాతాని విద్యా యోనిశ్చ కర్మ చ।
తే సేవ్యాస్తైః సమాస్యా హి శాస్త్రేభ్యోఽపి గరీయసీ ॥ 27

చేరిన ఆ పాండవులు మిగిలిన పగటిభాగంలో పవిత్రగంగాజలంతో ఆచమనాదికం చేసి, ఆ రాత్రి అక్కడ గడిపారు. దుఃఖపీడితులైన పాండవులు ఆ రాత్రి కేవలం నీరు త్రాగి గడిపారు. వారిపట్ల గల స్నేహంవల్ల కొందరు బ్రాహ్మణులు వారిని అనుసరించి వచ్చారు. శిష్యగణాలతో, బాంధవులతో; సాగ్నులు, నిరగ్నులు, బ్రహ్మవాదులూ అయిన బ్రాహ్మణులతో కూడి ధర్మరాజు మిక్కిలి ప్రకాశించాడు. రాక్షస పిశాచాదులచే రమ్యమూ, భయంకరమూ అయిన ప్రదోషకాలముహూర్తంలో వేదమంత్రఘోషతో అగ్ని కార్యం చేసిన ఆ బ్రాహ్మణులు పరస్పరం సంవాదాలు చేశారు. హంసధ్వనివలె మధురస్వరం గల ఆ విప్రవరులు ఆ రాత్రంతా కురుకులశ్రేష్ఠుడయిన యుధిష్ఠిరునికి ఊరట కలిగిస్తూ వినోదింపజేశారు.

2. ధర్మరాజుతో శౌనకుడు ప్రసంగించుట.

ఆ రాత్రి గడచింది. తెల్లవారగానే అనాయాసంగా సత్కర్మాచరణం చేసే పాండవులు వనంలోకి వెళ్లడానికి సిద్ధమయ్యారు. ఆ సమయంలో భిక్షాన్నంతో జీవించే బ్రాహ్మణులు వారితోపాటు వెళ్ళడానికి వారిదగ్గర నిల్చున్నారు. యుధిష్ఠిరుడు వారితో ఇలా అన్నాడు - 'బ్రాహ్మణులారా ! మేము జూదంలో సమస్తధనమూ, రాజ్యమూ, సంపద పోగొట్టుకొన్నవాళ్ళం. ఫలమూలాలే ఆహారంగా తీసికొంటూ దుఃఖంతో వనానికి వెళుతున్నాం. అరణ్యం చాలా దోషాలకు నిలయం. సర్ప, సరీసృపాది భయంకర జంతువులతో కూడి ఉంటుంది. అక్కడ మీకు చాలాకష్టం కలుగుతుంది. ఇది నిశ్చయం. బ్రాహ్మణులకు కష్టం కలిగిస్తే అది దేవతలను కూడ నాశనం చేస్తుంది. ఇక నామాట చెప్పాలా? అందువల్ల బ్రాహ్మణులారా! ఇక్కడ నుండి మీకిష్టమైన ప్రదేశానికి తిరిగివెళ్ళండి.' బ్రాహ్మణులిలా అన్నారు - 'రాజా! మీరు ఎక్కడకు వెళితే అక్కడకే మేమూ రావడానికి సిద్ధంగా ఉన్నాం. నీయొక్క భక్తులము. సద్ధర్మంపట్ల దృష్టిగల మమ్ములను విడిచిపెట్టడం నీకు తగదు. భక్తులమీద దేవతలుకూడా జాలి చూపుతారు. అందునా ప్రత్యేకించి సదాచారాన్ని అవలంబించే బ్రాహ్మణులమీద తప్పక జాలి చూపుతారు.' యుధిష్ఠిరుడిలా అన్నాడు - 'బ్రాహ్మణులారా! నాకు కూడా బ్రాహ్మణులయందు మిక్కిలి భక్తి ఉంది. ఏ సహాయసాధనమూ లేని నా స్థితి నన్ను బాధిస్తోంది. ఈ నా సోదరులు ఫల, మూల, మధువులను తేగలరు. కాని వారు కూడా శోకం వల్ల కలిగిన దుఃఖంతో సమ్మోహితులై ఉన్నారు. ద్రౌపదికి జరిగిన అవమానంచేతనూ, రాజ్యాపహరణం చేతనూ నాసోదరులు మిక్కిలి దుఃఖపీడితులై ఉన్నారు. అందువల్ల వారినింకా కష్టాలపాలు చేయడం నాకిష్టంలేదు.'

బ్రాహ్మణులిలా అన్నారు - 'రాజా! మా పోషణను గురించిన చింత నీకు

అక్కర లేదు. మేము స్వయంగా మా అన్నాదికాలను సమకూర్చుకొని మీ వెంట వస్తాం. ఇష్టమైన ధ్యానంతోనూ, జపాలతోనూ నీకు శుభాన్ని కలుగజేస్తాం. అందమైన కథలతో నీతోపాటు ఆనందంగా ఉంటాం.' యుధిష్ఠిరుడిలా అన్నాడు - 'మహాత్ములారా ! ఇది ఇంతే. సందేహంలేదు. నేను బ్రాహ్మణులతో ఎల్లపుడూ ఆనందంగా ఉంటాను. కాని ధనహీనతవల్ల నాకిది అపకీర్తికరమని చూస్తున్నాను. మీరు స్వయంగా ఆహారం తెచ్చుకొని తింటూంటే నేను ఎలా చూడగలను? మీరు కష్టా లనుభవించడానికి తగినవారు కారు. కాని నాపట్ల భక్తితో కష్టాలు పడుతుంటే ఎలా చూడగలను? దీనికంతటికి పాపాత్ములైన ధార్తరాష్ట్రులు నిందింపదగినవారు.' ఈ విధంగా చెప్పి ధర్మరాజు దుఃఖిస్తూ నేలపై చతికిలపడ్డాడు. అపుడు అధ్యాత్మరతుడు, విద్వాంసుడు, యోగశాస్త్రంలోనూ, సాంఖ్యశాస్త్రంలోనూ కుశలుడూ అయిన శౌనకు డనే బ్రాహ్మణుడు రాజుతో ఇలా అన్నాడు.

శోకింపదగిన సందర్భాలు వేలకొద్దీ ఉంటాయి. భయపడదగిన సందర్భాలు వందలకొద్దీ ఉంటాయి. అవి నిత్యం మూఢుడైన మానవుని మాత్రమే ఆవేశిస్తాయి. పండితుని అవి ప్రభావితం చేయలేవు.* జ్ఞాన విరుద్ధాలైన కర్మలలోనూ, దోషయుక్తాలై శ్రేయస్సును భంగపరిచే కర్మలలోనూ నీవంటి బుద్ధిమంతులు ఆసక్తి చూపరు. రాజా! అన్ని అమంగళాలను నాశనం చేయగలిగి, యమనియమాదులైన అష్టాంగాలు గలిగి, శ్రుతి స్మృతులచే సమర్థింపబడే ఉత్తమమైన బుద్ధి నీలో ఉన్నది. ధననాశనం వల్ల కలిగిన కష్టాలలోను, దాటశక్యంగాని దుఃఖాలలోను, స్వజనానికి వచ్చిన ఆపదలలోనూ నీ వంటివారు శారీరకమానసిక దుఃఖాలతో కృశించరు. పూర్వకాలంలో ఆత్మస్థైర్యాన్ని కలిగించే గీతాలను మహాత్ముడైన జనకుడు గానం చేశాడు. నేను ఆ శ్లోకాలను చెప్తాను విను. ఈ జగత్తంతా, శారీరక దుఃఖాలతోను, మానసిక దుఃఖాలతోనూ బాధపడుతూ ఉంటుంది. వాటిని శాంతింపజేసే ఉపాయాన్ని సంక్షేపంగాను, విస్తరంగాను చెపుతా విను. 1) వ్యాధి 2) అనిష్టసంఘటనం 3) శ్రమ, 4) ఇష్టమైన దాన్ని విడవటం అనే ఈ నాలుగు కారణాలవల్ల శారీరక దుఃఖం కలుగుతుంది. సకాలంలో ఈనాలుగింటికి 1) ప్రతీకారం (విరుగుడు) చేయడం, 2) వాటిని గురించి ఆలోచించకపోవటం అనే ఈ రెండు నివారణోపాయాలచేత ఆధివ్యాధులను ఉపశమింపజేయవచ్చు. అందువలన బుద్ధిమంతులు, విద్వాంసులు అయిన మానవులు మనసునకు ప్రియమైన మాటలచేత, హితాలైన భోగాలను కూర్చటంచేత ముందుగానే మానసిక దుఃఖాలకు ఉపశమనం కలిగిస్తారు. కాల్చిన ఇనుపగుండును

---

* శోకస్థానసహస్రాణి భయస్థానశతాని చ ।
దివసే దివసే మూఢమ్ ఆవిశంతి న పండితమ్ ॥ 16

కుండలోని నీటిలో వేస్తే, ఆ నీరు కుతకుతలాడుతుంది. మానసికదుఃఖం చేత శరీరం కూడా అలాగే తాపం చెందుతుంది. అందువలన నీటిచేత అగ్నిని ఉపశమించినట్లుగా జ్ఞానం చేత మానసికదుఃఖాన్ని శాంతింపజేయాలి. మనస్సు ప్రశాంతంగా ఉంటే అతని శారీరక తాపంకూడా ఉపశమిస్తుంది.

మానసిక దుఃఖానికి మూలం స్నేహం (సంసారం పట్ల ఆసక్తి). ఈ స్నేహంవల్లనే జీవుడు ఆసక్తుడై దుఃఖాన్ని పొందుతున్నాడు. దుఃఖాలన్నీ స్నేహం కారణంగానే ఏర్పడుతున్నాయి. భయాలూ స్నేహంవల్లే కలుగుతున్నాయి. శోకం, ఆనందం, ఆయాసం (అలసట) అన్నీ స్నేహం వల్లే కలుగుతున్నాయి. స్నేహం వల్లనే విషయసుఖంమీద మనసూ (భావం), అనురాగమూ ఏర్పడుతున్నాయి. ఈ భావానురాగాలు రెండూ అనర్థకారకాలే. అందులో మొదటిదైన భావం మిక్కిలి అనర్థకారకం. చెట్టుతొఱ్ఱలోని నిప్పు చెట్టును సమూలంగా పూర్తిగా దహించినట్లు, స్వల్పమైనదైనా రాగ మనే దోషం ధర్మార్థాలను రెంటినీ నాశనం చేస్తుంది. **విషయసుఖాలు అందుబాటులోలేక వాటిని విడిచి పెట్టేవాడు త్యాగి కాదు. విషయసుఖాలు లభించినప్పటికీ వాటియందు దోషాన్ని గుర్తించి విడిచిపెట్టేవాడే అసలైన త్యాగి. అట్టివాడే వైరాగ్యాన్ని పొందుతాడు.** మనస్సులో దేనిపట్లా వైరంలేకుండా బంధవిముక్తు డౌతాడు. అందువల్ల మిత్రులపట్ల గాని, ధనరాశుల పట్లగాని ఆసక్తి కలిగి ఉండకూడదు. తన శరీరంపట్ల కలిగిన ఆసక్తిని కూడా జ్ఞానంచేత నివారించుకోవాలి. తామరాకుమీద నీరు అంటదు. అలాగే జ్ఞానులు, యోగులు, శాస్త్రజ్ఞులు, జితేంద్రియులు - వీరిమీద ఆసక్తి అనేది తన ప్రభావాన్ని చూపలేదు. రాగానికి వశుడైనవాడు కామంచేత ఆకర్షింపబడతాడు. దానిచేత అతనిలో కోరిక పుడుతుంది. దానివల్ల తృష్ణ వృద్ధి చెందుతుంది. తృష్ణ అన్నింటికంటె పాప ప్రవృత్తిని కలిగిస్తుంది. అది నిత్యం మానసికోద్వేగాన్ని కలిగిస్తుంది. అధర్మంతో కూడిన ఘోరమైన పాపపరంపరలోకి నెట్టుతుంది. ఎంతటిబుద్ధిమంతులకైనా ఈ తృష్ణ విడువశక్యం గాదు. శరీరం నశిస్తున్నా ఈ తృష్ణమాత్రం నశించదు. ఈ తృష్ణ ప్రాణాంతకమైన రోగం. దీన్ని విడిచినవానికే సుఖం లభిస్తుంది. మానవుల శరీరాంతర్గతంగా ఉండే ఈ తృష్ణకు ఆద్యంతాలు లేవు. కాలిన ఇనుపగుండువలె ఇది ప్రాణులను నాశనం చేస్తుంది. **కర్ర తవమండి పుట్టిన విప్పువల్లవే వశిస్తుంది. అదే విధంగా వశం తప్పిన మనుషుల మానవుడు సహజంగా తనలోనుండి పుట్టిన లోభంచేతనే నాశనమవుతాడు.**

ప్రాణులందరికి మృత్యువువల్ల భయమున్నట్లుగా, ధనవంతులందరికి రాజువల్ల, నీటివల్ల, నిప్పువల్ల, దొంగవల్ల, తనవారి వల్లనూ ఎల్లపుడూ భయం కలుగుతూనే ఉంటుంది.

మాంసం ఆకాశంలో పక్షులచేత, భూమిమీద క్రూరమృగాలచేత (శ్వాపదాలచేత), నీటిలో చేపలచేత తినబడినట్లుగా, **ధనవంతుడు అంతటా అందరిచేత తినబడతాడు.** మానవులకు కొందరికి ధనమే అనర్థానికి కారణ మవుతుంది. డబ్బువల్ల కలిగే సుఖాలమీద ఆసక్తి కలవాడు శాశ్వతమైన (శ్రేయస్సును) సుఖాన్ని పొందలేడు. అందువల్ల ధనప్రాప్తికై చేసే ఉపాయాలన్నీ మనస్సులోని మోహాన్ని పెంచేవే. మానవులకు డబ్బువల్ల కార్పణ్యం, గర్వం (అభిమానం), కోపం, భయం, ఉద్వేగం అనే దుఃఖాలు కలుగుతాయని విద్వాంసులు చెప్తారు. డబ్బు సంపాదించడంలో, దాన్ని రక్షించుకోవడంలోనూ, అది క్షీణించినపుడూ మానవులు మిక్కిలి దుఃఖాన్ని అనుభవిస్తారు. డబ్బుకారణంగా ఇతరులను చంపుతారు. డబ్బును త్యాగంచేయటం వల్ల చాలా దుఃఖం కలిగిస్తుంది. ధనాన్ని రక్షించినా, అది శత్రువువంటిదే. ధనాన్ని దుఃఖంతో (కష్టంతో) సంపాదిస్తారు. అందువల్ల దాని నాశాన్ని గురించి చింతించకూడదు. మూఢులు ఎల్లపుడూ అసంతుష్టులుగానే ఉంటారు. పండితులు సంతుష్టులుగా ఉంటారు. **ధనదాహానికి అంతులేదు. సంతుష్టే మిక్కిలి సుఖం. అందువల్ల పండితులు సంతోషమే గొప్పదని భావిస్తారు.*** యౌవనం, అందం, జీవితం, రత్నాలు కూడబెట్టడం, ఐశ్వర్యం, ఇష్టులతో ఉండటం – ఇవన్నీ అనిత్యాలే. వీటిపట్ల పండితుడు లోభం చెందకూడదు. అందువల్ల ధనాన్ని కూడబెట్టడాన్ని విడిచిపెట్టాలి. దానివల్ల కలిగే కష్టాలను ధైర్యంగా సహించాలి. ధనాన్ని కూడబెట్టినవాడు ఎవడూ కూడా (ఉపద్రవం) కష్టపడకుండా లేడు. అందుకే ధార్మికులైన జనులు దైవేచ్ఛగా లభించిన ధనాన్నే ప్రశంసించారు. **ధర్మంకోసం ధనాన్ని కోరేవాడుకూడా ధనాన్ని కోరకుండా ఉండటమే మంచిది. బురదను తొక్కి కాలు కడుగుకొనటం కంటె, దూరంగా తాకకుండా ఉండటమే మానవులకు శ్రేయస్సు కదా!**** యుధిష్ఠిరా ! ఈ విధంగా నీవు దేనిపట్లనూ కోరిక కలిగి ఉండటం యుక్తంకాదు. నీవు ధర్మ ప్రయోజనం కోరుతుంటే అర్ధంపట్ల కోరికను విడిచిపెట్టు.

ధర్మరాజు అన్నాడు – 'బ్రాహ్మణోత్తమా ! ధనంవల్ల కలిగే భోగాలపట్ల కాంక్షతో నేను ధనాన్ని కోరడంలేదు. ఈ బ్రాహ్మణులను పోషించడంకోసం ధనాన్ని కాంక్షిస్తున్నాను కాని ధనం మీది లోభంవల్ల కాదు. బ్రాహ్మణోత్తమా! నావంటివాడు గృహస్థాశ్రమంలో

---

* అంతో నాస్తి పిపాసాయాः సంతోషः పరమం సుఖమ్ ।
తస్మాత్ సంతోషమేవేహ పరం పశ్యంతి పండితాः ॥ 46

**ధర్మార్థం యస్య విత్తేహా వరం తస్య నిరీహతా ।
ప్రక్షాలనాద్ధి పంకస్య శ్రేయో న స్పర్శనం వరమ్ ॥ 49

ఉంటూ తన్ను అనుసరించినవారి రక్షణపోషణలను చేయకుండా ఎలా ఉండగలడు? గృహస్థుని భోజనంలో దేవ పితృ మనుష్యాది సమస్తప్రాణులకు భాగం కల్పింపబడింది. అదేవిధంగా తాముగా వండుకొని తినని సన్యాసి మొదలైన వారికి గృహస్థు తప్పక అన్నం పెట్టాలి. **కూర్చోడానికి స్థానం, ఆసనానికి తృణం(కుశలు), త్రాగటానికి నీరు, తీయని సత్యవాక్కు - ఈ నాలుగు సత్పురుషుల ఇళ్ళలో ఎన్నడూ తరిగిపోవు.*** రోగాదిపీడితునికి శయ్య, మిక్కిలి శ్రమచెందిన వానికి ఆసనం, దప్పిక గలవానికి పానీయం, ఆకలిగొన్న వానికి భోజనం ఇవ్వాలి. **ఇంటికివచ్చిన వానిని ఆదరంగా చూడాలి. మనసిచ్చి మంచి మాటలు పలకాలి. లేచి ఆసనం ఇవ్వాలి. అతిథిరావడం చూడగానే లేచి ఎదురేగాలి. ఉచితంగా అతనిని గౌరవించాలి. ఇది సనాతనమైన ధర్మం.**** అగ్నిహోత్రం, ఆబోతు, జ్ఞాతులు, అతిథులు, బాంధవులు, పుత్రులు, భార్య, సేవకులు - వీరిని గృహస్థు యథోచితంగా గౌరవించాలి. అలా చేయకుంటే వారి కోపాగ్నిచే గృహస్థుడు దహింపబడుతాడు. కేవలం తనకోసమే అన్నం వండుకొనకూడదు. వృథాగా పశువులను హింసింపగూడదు. విధిపూర్వకంగా దేవతాదులకు సమర్పింపని దాన్ని తానుకూడా తినరాదు. కుక్కలకు, శ్వపాకులయిన చండాలురకూ, పక్షులకూ నేలపై అన్నాన్ని విడిచిపెట్టాలి. ఉదయం, సాయంకాలం ఇలా ఇవ్వటాన్ని వైశ్వదేవమని అంటారు. ఇంటిలో అందరికీ పెట్టగా మిగిలిన అన్నాన్ని విఘస మంటారు. (యజ్ఞశేషమైన)వైశ్వదేవం చేశాక ఉన్న అన్నాన్ని అమృతమంటారు. **అందువల్ల గృహస్థుడు నిత్యమూ విఘసాశి, అమృతభోజనుడు కావాలి. అతిథిపై దృష్టిపెట్టాలి. మనస్సు పెట్టాలి. సత్యమైన మధురభాషణం చేయాలి. వెళ్లేటప్పుడు అతనిని అనుసరించాలి. ఇంటిలో ఉన్నంతసేపూ అతనితో గడపాలి(సేవించాలి). ఇదే ఐదు దక్షిణలతో కూడిన అతిథియజ్ఞం.** అపరిచితుడు, శ్రాంతుడూ అయిన బాటసారికి ప్రసన్నతతో అన్నంపెట్టిన గృహస్థునికి ఎంతో పుణ్యఫలం లభిస్తుంది. విప్రోత్తమా ! ఈ విధంగా గృహస్థాశ్రమంలో వ్యవహరించే గృహస్థు ఉత్తమధర్మాన్ని పొందుతాడని చెపుతున్నారు. ఈ విషయంలో మీ అభిప్రాయమేమిటి?'

శౌనకుడిలా అన్నాడు - 'అయ్యో! ఇది చాలా దుఃఖకరమైన మాట. ఈలోకంలో

---

* తృణాని భూమిరుదకం వాక్ చతుర్థీ చ సూనృతా ।
సతామేతాని గేహేషు నోచ్ఛిద్యంతే కదాచన ॥ 54

** చక్షుర్దద్యాన్మనో దద్యాద్ వాచం దద్యాత్ సుభాషితామ్ ।
ఉత్థాయ చాసనం దద్యాద్ ఏష ధర్మః సనాతనః ॥ 56

పరస్పర విరుద్ధాలైన విషయాలు కనబడుతున్నాయి. సత్పురుషుడు దేనికి సిగ్గుపడుతున్నాడో, దుష్టుడు దానిచేతనే సంతోషిస్తున్నాడు. మూర్ఖుడు(అజ్ఞాని) తన అశన, శిశ్నతృప్తికై (ఉదర పోషణకు, జననేంద్రియతృప్తికి) ఇంద్రియార్థాలైన విషయసుఖాలకు వశుడై, మోహరాగాలకు అధీనుడై, విషయసామగ్రినే విభుసంగా భావించి, వాటిని సంపాదిస్తాడు. తెలిసినవాడైనా మానవుడు ఆకర్షించేస్వభావం కల ఇంద్రియాలచేత విషయాలవైపుకు లాగబడతాడు. అట్టివాడు విచారణశక్తిని కోల్పోయి అదుపులోలేని గుర్రాలచేత సారథి పొందే అవస్థ పొందుతాడు. మనస్సుతోపాటు పంచేంద్రియాలు వాటి వాటి విషయాల పట్ల ప్రవర్తించినపుడు, ప్రాణులపూర్వ సంకల్పానికి అనుగుణంగా మనస్సు చలిస్తుంది. మనస్సు ఏ ఇంద్రియసంబంధమయిన విషయాలను సేవింపగోరుతుందో ఆ విషయాలమీద ఆసక్తి కల్గుతుంది. వాటి అనుభవంమీద మనసుకు ప్రవృత్తి కలుగుతుంది. సంకల్పం కామబీజం విషయాలు బాణాలు. మానవుడు వాటి దెబ్బ తింటాడు. అగ్నిపట్ల లోభంతో పురుగు అగ్నిలో పడిపోతుంది. అలాగే మానవుడు లోభాగ్నిలో పడతాడు. అటుపై యథేచ్ఛగా ఆహారవిహారాలచే మోహితుడై మహామోహమయమైన విషయసుఖంలో మునిగిపోతాడు. తన్ను తాను తెలిసికోలేడు. ఈ విధంగా అవిద్య, కర్మ, తృష్ణలచే చక్రంవలె సంసారంలో తిరుగుతూ వివిధ యోనులయందు పడుతున్నాడు(జన్మలెత్తుతున్నాడు). బ్రహ్మ మొదలుకొని గడ్డిపోచవరకు కల అన్నిప్రాణులలోను ఆకాశంలో, జలంలో, భూమిమీద మరల మరల పుట్టుతున్నాడు. అజ్ఞానులైన మానవుల గతి ఈ విధంగా ఉంటుంది. ఇక ధర్మమునందు, శ్రేయస్సునందు తత్పరులై, మోక్షాసక్తిగల వివేకుల గతిని గురించి చెప్తాను విను.

కర్మను చెయ్యి, విడిచిపెట్టు అని వేదవచనం. అందువల్ల ఈ ధర్మాలన్నింటిని అభిమానంతో "నేను చేస్తున్నాను" అనే భావంతో చేయరాదు.* యజ్ఞం, అధ్యయనం, దానం, తపస్సు, సత్యం, క్షమ, ఇంద్రియనిగ్రహం, లోభం లేకుండుట - ఈ ఎనిమిది ధర్మమార్గాలు. ఇందలి మొదటినాలుగు యజ్ఞాధ్యయనదాన తపస్సులు పితృయాన మార్గంలో ఉంటాయి. అనగా వీటిని సకామంగా ఆచరిస్తే పితృయాన మార్గంలో తీసికొని వెళ్తాయి. అగ్నిహోత్రాది కర్మలు అవశ్యకరణీయాలు. అభిమానాన్ని విడిచి కర్తవ్యబుద్ధితో చెయ్యాలి. తరువాత చెప్పిన నాలుగు **సత్యం, క్షమ, ఇంద్రియ నిగ్రహం, అలోభం - అనేవి దేవయానమందున్నవి.** సత్పురుషులు ఈ మార్గాన్ని ఆచరిస్తారు. అష్టాంగమార్గం ద్వారా విశుద్ధాత్ములై వీటిని ఆచరించాలి. సంపూర్ణంగా సంకల్ప సంబంధంవల్ల, బాగుగా

---

* **తదిదం వేదవచనం కురు కర్మ త్యజేతి చ।**
తస్మాద్ ధర్మానిమాన్ సర్వాన్ నాభిమానాత్ సమాచరేత్ ॥ 74

అంతర్బాహ్యేంద్రియాలను నిగ్రహించడంవల్ల, చక్కగా ఆహింసాది వ్రతాలను ఆచరించడంవల్ల, చక్కగా గురువును సేవించడంవల్ల, యోగసాధనోచితమైన ఆహారం తీసికొనవడంవల్ల, బాగుగా వేదాధ్యయనం వల్ల, సంపూర్ణ కర్మసంన్యాసం వల్ల, మనోవృత్తుల సంపూర్ణ నిగ్రహం వల్ల మానవుడు పరమకళ్యాణస్థితిని పొందుతాడు. సంసారాన్ని జయించాలనే కోరిక కల మానవులు రాగద్వేష వినిర్ముక్తులై ఈ విధంగా కర్మలను ఆచరిస్తారు. ఇటువంటి నియమాలు పాటించి దేవతలు ఐశ్వర్యాన్ని పొందారు. రుద్రులు, సాధ్యులు, ఆదిత్యులు, వసువులు, అశ్వినులు యోగైశ్వర్యంతో కూడి ఈ జనులనందరిని రక్షించి పోషిస్తున్నారు. కౌంతేయా ! అదే విధంగా నీవు కూడ పూర్తిగా ఇంద్రియ నిగ్రహం వహించి, తపస్సు చేత సిద్ధిని, యోగసిద్ధిని పొందు. యజ్ఞ యుద్దాది కర్మలచే పితృమాతృమయి అయిన సిద్ధి కలుగుతుంది. దానిని ఇప్పటికే నీవు పొందావు. ఇపుడు తపస్సు ద్వారా యోగసిద్ధిని సాధించు. దానిచేతనే బ్రాహ్మణుల ధారణ పోషణాలు జరుగుతాయి. సిద్ధులు తాము కోరుకొన్న వాటిని తమ తపఃప్రభావం చేతనే పొందుతారు. అందువల్ల తపస్సును ఆచరించి నీ మనోరథాన్ని పూర్తిచేసుకో.'

3. యుధిష్ఠిరుడు సూర్యుని ఉపాసించి అక్షయపాత్రను పొందుట.

శౌనకుడు ఈ విధంగా చెప్పాక యుధిష్ఠిరుడు పురోహితుని సమీపించి సోదరులందరిసమక్షంలో ఈ విధంగా అన్నాడు. 'వేదపారంగతులైన బ్రాహ్మణులు వనంలో నాతో వస్తున్నారు. నేను వీరిని పోషించలేను. అందువల్ల మిక్కిలి దుఃఖపడుతున్నాను. పూజ్యుడా! వీరిని విడిచిపెట్టలేను. వారి కీయ గల శక్తి నాకు లేదు. ఇపుడు నేనేం చెయ్యాలి. నీవు చెప్పు.' ధౌమ్యుడు ముహూర్తకాలం ఏకాగ్రచిత్తంతో ధర్మపూర్వకంగా ఉపాయాన్ని ఆలోచించి యుధిష్ఠిరునితో ఇలా అన్నాడు. 'పూర్వం సృష్టింపబడిన ప్రాణులన్నీ ఆకలితో మిక్కిలి బాధపడుతూండగా, వానిపట్ల దయతో సూర్యభగవానుడు తండ్రివలె ఉత్తరాయణంలో ప్రవేశించి తన కిరణాలతో భూమియందలి జలాలను స్వీకరించి మరల దక్షిణాయనంలో భూమియందు ఆ జలాలను ప్రవేశింపజేశాడు. అనంతరం క్షేత్రభూతమైన భూమిపై ఓషధీపతి అయిన చంద్రుడు అంతరిక్షంలో మేఘరూపంలో ఉన్న సూర్య తేజస్సును స్వీకరించి నీటిచేత ఓషధులను ఉత్పత్తి చేశాడు. చంద్రుని కిరణాలచేత అభిషిక్తుడైన సూర్యుడు బీజస్థితిని పొంది ఆరు రసాలతో కూడితే పవిత్రమైన ఓషధులు ఉత్పన్నమవుతాయి. అవియే భూమిపై ప్రాణులకు ఆహారం అవుతాయి. ఈ విధంగా సమస్తప్రాణులను రక్షించే అన్నం సూర్యరూప మైనదే. ఆ సూర్యుడే సర్వప్రాణులకు

తండ్రి, రక్షకుడు. అందువల్ల అతనిని శరణు వేడు. జన్మకర్మలచే విశుద్ధులై మహాత్ములైన రాజులు పుష్కలమైన తపస్సుచేసి ప్రజలందరిని కష్టాలనుండి ఉద్ధరిస్తారు. భీముడు, కార్తవీర్యుడు, వేనపుత్రుడైన పృథువు, నహుషుడు మున్నగు రాజులు తపో, యోగ, సమాధులచే ప్రజలను ఆపదలనుండి ఉద్ధరించారు. ధర్మాత్ముడా! భరతోత్తమా! అందువల్ల కర్మవిశుద్ధుడవై(న) నీవు కూడా తపస్సుచేసి ధర్మానుసారంగా ఈ బ్రాహ్మణులను పోషించు.' అని ధౌమ్యుడు యుధిష్ఠిరునికి నూటఎనిమిది సూర్యనామాలు చెప్పాడు. ధౌమ్యుడిలా చెప్పాడు – సూర్యుడు, అర్యముడు, భగుడు, త్వష్ట, పూషుడు, అర్కుడు, సవిత, రవి, గభస్తిమంతుడు, అజుడు, కాలుడు, మృత్యువు, ధాత, ప్రభాకరుడు, పృథివి, ఆపస్సు, తేజస్సు, ఖం, వాయువు, పరాయణుడు, సోముడు, బృహస్పతి, శుక్రుడు, బుధుడు, అంగారకుడు, ఇంద్రుడు, వివస్వంతుడు, దీప్తాంశుడు, శుచి, శౌరి, శనైశ్చరుడు, బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, స్కందుడు, వరుణుడు, యముడు, వైద్యుతుడు, జఠరుడు, ఐంధనుడు, తేజసాంపతి, ధర్మధ్వజుడు, వేదకర్త, వేదాంగుడు, వేదవాహనుడు, కృత, త్రేత, ద్వాపరం, సర్వమలాశ్రయమై కలి, కలా కాష్ఠా ముహూర్త స్వరూపమైన కాలం. క్షప, యామం, క్షణం, సంవత్సరకరుడు, అశ్వత్థుడు, కాలచక్ర ప్రవర్తకుడైన విభావసుడు శాశ్వతుడయిన పురుషుడు, యోగి, వ్యక్తావ్యక్తుడు, సనాతనుడు, కాలాధ్యక్షుడు, ప్రజాధ్యక్షుడు, విశ్వకర్మ, తమోనుదుడు, వరుణుడు, సాగరుడు, అంశుడు, జీమూతుడు, జీవనుడు, అరిహుడు, భూతాశ్రయుడు, భూతపతి, సర్వలోకనమస్కృతుడు, స్రష్ట, సంవర్తకుడు, వహ్ని, సర్వాది, అలోలుపుడు, అనంతుడు, కపిలుడు, భానుడు, కామదుడు, సర్వతోముఖుడు, జయుడు, విశాలుడు, వరదుడు, సర్వధాతు నిషేచితుడు, మనఃసుపర్ణుడు, భూతాది, శీఘ్రగుడు, ప్రాణధారకుడు, ధన్వంతరి, ధూమకేతుడు, ఆదిదేవుడు, అదితిసుతుడు (ఆదిత్య), ద్వాదశాత్ముడు, అరవిందాక్షుడు, పిత, మాత, పితామహుడు, స్వర్గద్వార ప్రజాద్వార రూపుడు, మోక్షద్వార రూపమయిన త్రివిష్టపుడు, దేహకర్త, ప్రశాంతాత్మ, విశ్వాత్మ, విశ్వతోముఖుడు, చరాచరాత్ముడు, సూక్ష్మాత్ముడు, మైత్రేయుడు, కరుణాన్వితుడు, ఈ నామాష్టశతం కీర్తనీయుడైన తేజోవంతుడైన సూర్యుని. బ్రహ్మ వీనిని చెప్పాడు. ఈ నామములనుచ్చరించిన తర్వాత, తన హితంకోసం 'దేవతా, పితృ, యక్ష, గణాలచే సేవింపబడే, అసుర, నిశాచర, సిద్ధులచే నమస్కరింపబడే, శ్రేష్ఠమయిన బంగారు, అగ్నికాంతులు గల్గిన సూర్యుని నమస్కరించుచున్నాను' అని నమస్కరించాలి. సూర్యోదయసమయంలో సమాహితచిత్తుడై ఈ నామాలను పఠించినవాడు చక్కని భార్యాపుత్రులను, ధనరత్నరాశులను, పూర్వజన్మస్మృతిని (తనజాతివారి గుర్తింపును), ధైర్యాన్ని, మంచిమేధను పొందుతాడు.

దేవశ్రేష్ఠుడైన సూర్యభగవానుని ఈ స్తవాన్ని నిర్మలమైన మనస్సుతో ఏకాగ్రచిత్తంతో చదివినవాడు శోకదవాగ్ని సాగరం నుండి విముక్తుడౌతాడు. మనోభీష్టాలయిన కోరికలను పొందుతాడు.

ఈ విధంగా ధౌమ్యుడు ఆ సమయానికి తగినమాట చెప్పగా, యుధిష్ఠిరుడు బ్రాహ్మణులకోసం సమాధిస్థితుడై, జితేంద్రియుడై దృఢవ్రతుడై, విశుద్ధాత్ముడై ఉత్తమమైన తపస్సు చేశాడు. అతడు పవిత్రజలంతో స్నానంచేసి, సూర్యునికి అభిముఖుడై పుష్పోపహారపూజలచే అర్చించి, జితేంద్రియుడై, వాయుభక్షకుడై యోగ మనుష్ఠించి సేవించాడు. గంగాజలాన్ని ఆచమించి నిర్మలమయిన వాక్కును నియంత్రించి, ప్రాణాయామం చేసి యుధిష్ఠిరుడిలా స్తుతించాడు - భానూ! నీవు ఈ ప్రపంచానికి నేత్రం. సర్వప్రాణులకు నీవు ఆత్మవు. సర్వప్రాణులకు నీవు పుట్టుకస్థానం. కర్మానుష్ఠానం చేసేవారికి నీవు సదాచారం. సాంఖ్య లందరికీ నీవు ప్రాప్తిస్థానం. కర్మయోగు లందరికీ నీవు పరాయణుడవు. మోక్షానికి నీవు ప్రతిబంధకం లేని ద్వారం. ముముక్షువులందరికి నీవు గతి.(ప్రాప్యస్థానం.) నీవీ ప్రపంచాన్ని ధరిస్తున్నావు. నీచే ఈ లోకం ప్రకాశిస్తోంది. నీచే ఈ లోకం పవిత్రం చేయబడుతోంది. నిర్వ్యాజంగ ఎట్టి స్వార్థమూ లేక నీవు దీనిని పాలిస్తున్నావు. నీవు ఋషిగణాలచే పూజింపబడుతున్నావు. వేదపారగులైన బ్రాహ్మణులు తమతమవేద శాఖలకు సంబంధించిన మంత్రాలతో తగిన సమయంలో నిన్ను స్తుతించి పూజిస్తున్నారు. నీ నుండి వరాన్ని కోరుకొంటున్న సిద్ధ, చారణ, గంధర్వ, యక్ష, గుహ్యక, పన్నగులు వెళుతూన్న నీ దివ్యరథాన్ని అనుసరిస్తున్నారు. ముప్పది ముగ్గురు దేవతలు, వైమానికులైన సిద్ధగణాలు, ఉపేంద్ర మహేంద్రులు నిన్ను ఆరాధించి సిద్ధిని పొందారు. విద్యాధర శ్రేష్ఠులు దివ్య మందారమాలలతో నిన్ను పూజించి సఫలమనోరథులవుతున్నారు. గుహ్యకులు, ఏడు పితృగణాలు, దివ్యులైన మానవులు నిన్ను పూజించి శీఘ్రంగా ప్రధానస్థానాన్ని పొందుతున్నారు. వసు, రుద్ర, మరుద్గణాలు, సాధ్యులు, నీకిరణాలు త్రాగే వాలఖిల్యాది సిద్ధులు నిన్ను పూజించి ప్రాణులలో శ్రేష్ఠ లయ్యారు.

బ్రహ్మలోకంతో పాటు ఏడులోకాలలోనూ సూర్యుని మించిన ప్రాణి వేరొకటిలేదు. తేజోవంతాలైన ఇతరప్రాణులు ఎన్ని ఉన్నా, వానికి నీవంటి ప్రకాశంగాని, ప్రభావంకాని లేదు. జ్యోతిస్సులన్నీ నీయందు ఉన్నాయి. నీవు సర్వజ్యోతిస్సులకు అధిపతివి. సత్త్వమూ, సత్యమూ, అన్ని సాత్త్వికభావాలూ నీయందు ఉన్నాయి. నీ తేజస్సుచే విశ్వకర్మచేసిన సునాభమనే చక్రంచేత శార్ఙ్గధన్వుడైన శ్రీహరి అసురుల గర్వాన్ని నాశనం చేశాడు. నీవు గ్రీష్మర్తువులో నీ కిరణాలచే సమస్తప్రాణుల యొక్క, సర్వౌషధిరసాల యొక్క

తేజస్సు స్వీకరించి మరల వర్షర్తువులో విడుస్తున్నావు. వర్షర్తువునందు నీ కిరణాలు కొన్ని తపింపజేస్తాయి. మరికొన్ని కిరణాలు దహింపజేస్తాయి. మరికొన్ని కిరణాలు మేఘాల నేర్పరచి గర్జిస్తాయి. మరికొన్ని కిరణాలు మేఘాలలో మెరుస్తాయి. మరికొన్ని వర్షిస్తాయి. చలిగాలులచే బాధపడుతున్న లోకాన్ని నీ కిరణాలు సుఖపెట్టినట్లు అగ్ని కాని, వస్త్రాలు కాని, కంబళ్లుకాని సుఖపెట్టలేవు. పదమూడు ద్వీపాలతో ఉన్న ఈ భూమిని నీవు నీ కిరణాలచే ప్రకాశింపజేస్తున్నావు. ముల్లోకాల హితం కొరకు నీవొక్కడవే ప్రవర్తిస్తున్నావు. నీవు ఉదయించకపోతే ఈ జగత్తంతా చీకటవుతుంది. (అంధకారమయ మవుతుంది). మానవులు ధర్మార్థకామాలయందు ప్రవర్తింపలేరు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యగణాలు నీ అనుగ్రహం వల్లనే ఆధానం, పశుబంధనం, ఇష్టి, మంత్రం, యజ్ఞాలు, తపస్సు మున్నగు కర్మలను చేయగలుగుతున్నారు. బ్రహ్మకు వేయి యుగాలు ఒక దినంగా చెప్పబడింది. దానికి ఆద్యంతాలు నీవే అని కాలజ్ఞులు చెప్పారు. మనువులయొక్క మనుపుత్రుల యొక్క, అమానుష పురుషులయొక్క జగత్తునకు, అన్ని మన్వంతరాలకు, ఈశ్వరులకు నీవే ఈశ్వరుడవు.

సృష్టిసంహారకాలం ప్రలయకాలం సమీపించినపుడు నీకోపం నుండి వెలువడిన సంవర్తకాగ్ని ముల్లోకాలను భస్మంచేసి, నీయందు వెలుగొందుతుంది. నీ కిరణాలనుండి ఉత్పన్నమైన అనేక వర్ణాలుగల ఐరావతాదిమహామేఘాలు, పిడుగులు సమస్త ప్రాణికోటిని సంహరిస్తాయి. నిన్ను నీవు పన్నెండు విధాలుగా విభజించుకొని ద్వాదశాదిత్యస్వరూపుడవై ముల్లోకాలను ఒకే సముద్రంగా సంగ్రహించి, నీ కిరణాలతో శుష్కింపజేస్తున్నావు. నీవు ఇంద్రుడవు, రుద్రుడవు, విష్ణుడవు, ప్రజాపతివి, అగ్నివి, నీవు సూక్ష్మ మనస్సువు, నీవు వ్యాపకుడవు, నీవు శాశ్వతమైన బ్రహ్మవు అని చెపుతున్నారు. నీవు శుద్ధబ్రహ్మమగు హంసవు. సవిత, భానుడు, అంశుమాలి, పృషాకపి, వివస్వంతుడు, మిహిరుడు, పూష, మిత్రుడు, ధర్ముడు, సహస్రరశ్మి, ఆదిత్యుడు, తపనుడు, గవాంపతి, మార్తాండుడు, అర్కుడు, రవి, - సూర్యుడు, దినకర్త, దివాకరుడు, సప్తసప్తి, ధామకేశి, విరోచనుడు, ఆశుగామి, తమోఘ్నుడు, హరితాశ్వుడు అని కీర్తింపబడుతున్నావు. నిర్వేదం, అహంకారం లేకుండా సప్తమినాడు కాని, షష్ఠినాడు కాని నిన్ను పూజించినవానికి సంపద(లక్ష్మి) కలుగుతుంది. అనన్యమనస్కులై నిన్ను పూజించి నమస్కరించిన వారికి ఆపదలు కాని, ఆధులు కాని, వ్యాధులు కాని కలుగవు. హృదయపూర్వకంగా నీ భక్తులైనవారు సమస్తరోగాల నుండి విముక్తులై, పాపాలన్నింటిని విడిచి, చిరంజీవులై సుఖంగా ఉంటారు. అన్నపతీ ! శ్రద్ధగా అందరికి ఆతిథ్యమివ్వాలని కోరుకుంటూ ఆపత్కాలంలో వేడుతున్న నాకు నీవు

అన్నం ఇవ్వడానికి తగినవాడవు. నీ పాదాలను ఆశ్రయించి మారర - అరుణ - దండాది అనుచరులు ఉన్నారు. విద్యుత్తును ప్రసరింపజేయగల వారికందరికీ నమస్కరిస్తున్నాను. క్షుభ(విద్యుత్తు) తో పాటుగ ఉన్న మైత్రీదేవి, గౌరి, పద్మ మున్నగు భూతమాతలకందరికి నమస్కరిస్తున్నాను. శరణాగతుడనైన నన్ను రక్షించు'

ఈ విధంగా యుధిష్ఠిరుడు స్తుతిస్తే, లోకభావనుడు, భాస్కరుడు, దివాకరుడు అయిన సూర్యుడు ప్రసన్నుడై మండుతున్న అగ్నివలె ప్రకాశిస్తున్న శరీరంతో ప్రత్యక్షమయ్యాడు. సూర్య(వివస్వంతు)డిలా అన్నాడు - 'ధర్మరాజా! నీవు కోరుకొన్న దంతటిని నీవు పొందగలవు. ఈ పన్నెండు సంవత్సరాలు నీకు అన్నం నే నిస్తాను. నరాధిపా! సువ్రతా ! నేనిస్తున్న ఈ రాగిపాత్రను స్వీకరించు. ఈ పాత్రతో మీ వంటింట్లో సంస్కరించిన ఫలమూలామిషశాకాలు, అన్నం మొదలగు చతుర్విధపదార్థాలు (పాంచాలి భోజనం చేయునంత వరకు) అక్షయాలుగా ఉంటాయి. ఇప్పటి నుండి పదునాల్గవ సంవత్సరంలో నీవు మరల రాజ్యాన్ని పొందుతావు.' ఇలా చెప్పి సూర్య భగవాను డక్కడే అంతర్ధాన మయ్యాడు. ఎవరైనా మనోనిగ్రహంతో, ఏకాగ్రచిత్తంతో ఈ సూర్యస్తవాన్ని పరిస్తే, అతడికి దుర్లభమైన వరాన్ని కూడ సూర్యభగవాను డిస్తాడు. నిత్యమూ ఈ స్తోత్రాన్ని పరించిన, స్త్రీ పురుషులు విన్నవారూ పుత్రుని కోరితే పుత్రునీ, ధనాన్ని కోరితే ధనాన్నీ, విద్యను కోరితే విద్యనూ పొందుతారు. స్త్రీపురుషులెవరైనా సాయంప్రాతః సంధ్యలు రెంటి యందూ దీన్ని నిత్యం పఠిస్తే ఆపదలో ఉన్నవాడు ఆపదనుండి విముక్తుడవుతాడు. బంధనంలో ఉన్నవాడు బంధం నుండి విముక్తి పొందుతాడు. ఈ స్తుతిని పూర్వకాలంలో బ్రహ్మ మహాత్ముడైన ఇంద్రునికిచ్చాడు. ఇంద్రుని నుండి నారదుడు, అతని నుండి ధౌమ్యుడు పొందారు. ధౌమ్యుని నుండి యుధిష్ఠిరుడు పొంది సర్వకామాలను పొందాడు. ఈ సూర్యస్తవాన్ని నిష్ఠగా ఆచరించినవాడు యుద్ధంలో ఎల్లపుడూ జయాన్ని పొందుతాడు. గొప్ప సంపదను పొందుతాడు. అన్ని పాపాలనుండి ముక్తుడౌతాడు. సూర్యలోకాన్ని పొందుతాడు.

సూర్యునినుండి ఈవిధంగా వరాన్ని పొంది, ధర్మవేత్త అయిన యుధిష్ఠిరుడు నీటినుండి లేచి బయటకు వచ్చి ధౌమ్యుని పాదాలు పట్టుకొన్నాడు. సోదరులను కౌగిలించుకొన్నాడు. యుధిష్ఠిరుడు ప్రేమతో ద్రౌపదిని కలుసుకొన్నాడు. ఆమె అతనికి నమస్కరించింది. ఆమెతో పాటు మహానసంలోకి (వంటగదిలోకి) వెళ్ళాడు. ఆ పాత్రలో కొద్దిగా వండినా చతుర్విధాలైన భక్ష్యాలు అక్షయ్యంగా వృద్ధి చెందాయి. వాటితో ధర్మజుడు బ్రాహ్మణులకు భోజనం పెట్టాడు. బ్రాహ్మణులు భుజించినపిమ్మట, సోదరులకు కూడ భోజనంపెట్టి, మిగిలిన విఘస మనే భుక్తశేషాన్ని యుధిష్ఠిరుడు భుజిస్తాడు. యుధిష్ఠిరుడు

తిన్న తర్వాత ద్రౌపది భుజిస్తుంది. ఆమె భుజించిన పిమ్మట ఆ పాత్రలోని అన్నం అయిపోతుంది. ఇక వృద్ధి చెందదు. సూర్యునితో సమానమైన తేజస్సు గల ధర్మరాజు సూర్యుని వల్ల ఈవిధంగా తన మనోవాంఛితాలన్నింటిని పొంది బ్రాహ్మణులకు ఇచ్చాడు. ఆయా తిధి నక్షత్ర పర్వాలలో చేయదగిన యజ్ఞసంబంధ కర్మలు పురోహితులు ముందుండగా విధిమంత్ర ప్రమాణసహితంగా జరుగుతున్నాయి. అనంతరం స్వస్తివాచనం పల్కిన బ్రాహ్మణసము దాయంతో ధౌమ్యునితో పాండవులు అక్కడనుండి కామ్యకవనానికి వెళ్ళారు.

4. హితమును ఉపదేశించిన విదురునిపై ధృతరాష్ట్రుడు కుపితుడగుట.

పాండవులు అరణ్యానికి వెళ్ళారు. ధృతరాష్ట్రుడు మనస్తాపం పొందాడు. లోతైన బుద్ధిగల విదురునితో సుఖాసీనుడై ఇలా అన్నాడు. 'విదురా ! శుక్రాచార్యుని బుద్ధివలె నీ బుద్ధి నిర్మలమైంది. నీవు సూక్ష్మాతి సూక్ష్మమైన ధర్మాన్ని ఎరిగినవాడవు. నీవు అందరిపట్ల సమానదృష్టి కలవాడవు. కౌరవపాండవు లిరువురికీ గౌరవింపదగినవాడవు. అందువల్ల పాండవులకూ నాకూ హితమైన దేదో చెప్పు. విదురా! ఇప్పటి ఈ దశలో మన కర్తవ్యమేమిటి? ఏవిధంగా (ఏ పనిచేస్తే) పౌరులు మనలను సేవిస్తారు? పాండవులు సమూలంగా మమ్మల్ని పెకలించకుండా ఉండాలంటే ఏం చేయాలి? యుక్తాయుక్త కార్యవిధానాలు నీవు బాగా తెలిసినవాడవు. అందువల్ల నా కర్తవ్యమేమిటో సరిగా చెప్పు.'

విదురుడిలా అన్నాడు - 'నరేంద్రా! ధర్మార్థకామాలనే త్రివర్గానికి ప్రధానమైనది ధర్మం. రాజ్యాన్ని ధర్మప్రధానమైందిగా చెపుతూంటారు. అందువల్ల రాజా! నీవు ధర్మమార్గంలో ఉండి యథాశక్తిగా నీ కుమారులను, పాండురాజు పుత్రులనూ అందర్నీ రక్షించు. శకుని మొదలైన పాపాత్ములచేత సభయందు ఆ ధర్మం విడువబడింది. నీకుమారుడు సత్యసంధుడైన కుంతీనందనుని ఆహ్వానించి, జూదంలో ఓడించాడు. కురురాజా! దుష్టులచే రచింపబడిన ఈ నీ కుమారుల దుర్వ్యవహారం యొక్క శాంత్యుపాయం నేనెరుగుదును. దానిచేత నీకుమారుడు ఈ పాపంనుండి విముక్తుడై లోకంలో మంచివాడుగా ప్రతిష్ఠను పొందుతాడు. అందువల్ల రాజా! నీవు పాండవులకు ఇచ్చిన రాజ్యసంపదనంతా తిరిగి వారు పొందాలి. **రాజు తన సంపదచేత సంతుష్టి చెందాలి. ఇతరుల సంపదలపట్ల లోభం కూడదు. ఇది రాజుకు పరమధర్మం.** ఇలా చేస్తే కీర్తి నశించదు. జ్ఞాతులమధ్య భేదం కలుగదు. ధర్మం తప్పక నిలుస్తుంది. పాండవులకు సంతుష్టి కలిగించడం, శకునిని తిరస్కరించడం - అనే ఈ పని నీకు అన్నింటికంటె ప్రధానమైన కర్తవ్యం. రాజా! ఈ విధంగా చేస్తే నీ పుత్రులకు ఈ భాగ్యమైనా మిగులుతుంది. అందువల్ల నీ వీ పని తొందరగా చెయ్యి.

లేని పక్షంలో కురువంశ వినాశం జరుగుతుంది. ఇది నిశ్చయం. కోపించిన భీమసేనుడు కాని, అర్జునుడు కాని శత్రుసేనలో ఎవర్నీ మిగల్చరు. గాండివధారి సవ్యసాచి యోధగా ఉండగా, బాహుబలశాలి భీమసేనుడు యోధగా ఉండగా పాండవులకు ఈ లోకంలో పొందలేని దేముంటుంది? దుర్యోధనుడు పుట్టినపుడే నేను నీకు హితవు చెప్పాను. 'రాజా! కురువంశానికి అహితం చేసే ఈ పుత్రుని విడిచిపెట్టు' అని ఉత్తమమైన హితాన్ని చెప్పాను. కాని నీవు దాన్ని ఆచరించలేదు. రాజా! ఇపుడు చెప్పిన ఈ హితాన్నికూడ నీవు ఆచరించకపోతే అనంతరం పరితాపం పొందుతావు. నీకుమారుడు సంతోషంగా పాండవులతో ఏకరాజ్యం చేయడానికి అంగీకరిస్తే, నీకు మున్ముందు పరితాపం కలుగదు. అందరూ ఆనందంగా ఉంటారు. నీకుమారుడు నీమాటను అంగీకరించకపోతే, కులంయొక్క సుఖంకొరకు నీవు నీ కుమారుని అదుపుచెయ్యి. రాజా! వంశానికి అహితుడైన దుర్యోధనుని నిగ్రహించి, పాండుపుత్రుడైన ధర్మరాజును రాజ్యాధిపత్యంలో నియోగించు. అజాతశత్రువైన ధర్మరాజు రాగద్వేషాలు లేకుండా ధర్మంగా ఈ భూమిని పాలించుగాక. రాజా! నీవిలా చేస్తే, భూమండలంలోని రాజులంతా వైశ్యులవలె మన కౌరవులకు బహుమానాలు తెచ్చి ఇస్తారు. దుర్యోధనుడు, శకుని, సూతపుత్రుడు కర్ణుడు ప్రీతితో పాండుపుత్రులను సేవించుదురుగాక. దుఃశాసనుడు ద్రౌపదిని, భీమసేనుని సభామధ్యంలో క్షమించమని కోరాలి. నీవు యుధిష్ఠిరుని ఊరడించి, గౌరవించి రాజ్యాధిపత్యంలో ప్రతిష్ఠించు. రాజా! హితాన్ని అడిగిన నీకు నేను మరొకటి ఏం చెప్పగలను? ఈ విధంగా చేసి నీవు కృతకృత్యుడవు కమ్ము.'

ధృతరాష్ట్రుడిలా అన్నాడు - 'విదురా ! ఈ సభలో నీవు పాండవులను గురించి, నన్ను గురించి చెప్పిన ఈ మాటలు పాండవులకు హితంగాను, నాకుమారులకు అహితంగాను ఉన్నాయి. అందువల్ల నామనస్సు వీటినన్నింటిని స్వీకరించటం లేదు. ఇప్పుడు ఈ విషయం నిశ్చయ మవుతోంది - నీవు పాండవులహితాన్ని గోరి చెపుతున్నావు అని. నీవు నాకు హితాన్ని కోరేవాడవు కాదు అని నేను భావిస్తున్నాను. పాండవులకోసమై నాపుత్రుని ఎలా వదలగలను? సందేహంలేదు. ఆ పాండవులు కూడా నాపుత్రులే. కాని దుర్యోధనుడు నా దేహంవల్ల జన్మించినవాడు. సమత్వాన్ని దృష్టిలో ఉంచుకొని ఇతరులకొరకు తన దేహాన్ని విడిచిపెట్టుమని ఎవరు చెప్తారు? విదురా ! నీపట్ల నాకు ఎక్కువ గౌరవం ఉంది. కాని నీవు నాకు అంతా కుటిలమైన ఉపదేశం చేస్తున్నావు. నీవు స్వేచ్ఛగా వెళ్ళవచ్చు లేదా ఉండవచ్చు. నీవల్ల నాకు ప్రయోజనం లేదు. కులట అయిన స్త్రీ ఎంత అనునయించినా యజమానిని విడిచి పెడుతుంది కదా!' ఇంతమాత్రమే పలికి ధృతరాష్ట్రుడు హఠాత్తుగా

లేచి, అంతఃపురంలోకి వెళ్ళాడు. పిమ్మట విదురుడు ఇక ఈ కురువంశం నిలవదు అనుకొంటూ పాండవులున్నచోటికి (పరుగెత్తుకు) వెళ్ళాడు.

5. పాండవులు కామ్యకవనమును ప్రవేశించుట, విదురుని ఆగమనము.

పాండవులు వనవాసం చేయటానికి అనుచరులతో సహా గంగానదీతీరంనుండి కురుక్షేత్రానికి వెళ్ళారు. వారు సరస్వతీ, దృషద్వతీ, యమునా నదులను సేవించి ఒకవనం నుండి మరొక వనం ప్రవేశిస్తూ పశ్చిమదిక్కుకు వెళ్ళారు. అనంతరం సరస్వతీ నదీతీరంలో మరుభూములను, వన్యప్రదేశాలను గడచి వెళ్తూ కామ్యకమనే వనాన్ని చూశారు. అది మునిజనులతో మిక్కిలి ప్రీతి కలిగిస్తోంది. భరతశ్రేష్ఠా! మహావీరులైన పాండవులు అనేక మృగపక్షులతో కూడిన ఆ వనంలో నివసించసాగారు. అక్కడున్న మునులతో నివసిస్తూ వారి వల్ల ఊరట పొందారు. పిమ్మట ఎల్లపుడూ పాండవులను చూడాలి అనుకొనే విదురుడు వన్యసంపదలచే సమృద్ధమైన కామ్యకవనానికి నిస్సహాయుడై రథంలో వెళ్లాడు. శీఘ్రంగా పరుగెత్తే గుర్రాలను పూన్చిన రథమెక్కి విదురుడు కామ్యకవనం చేరాడు. అక్కడ ఒక ఏకాంత ప్రదేశంలో ద్రౌపదితో, సోదరులతో, బ్రాహ్మణులతో కూడి కూర్చొని ఉన్న ధర్మరాజును చూశాడు. సత్యసంధుడైన ధర్మరాజు తనదగ్గరకు త్వరగా వస్తున్న విదురుని చూసి, భీమునితో 'ఈ విదురుడు మన దగ్గరకు వచ్చి ఏం చెపుతాడో ! శకుని మాటపై ఇతడు మనల్ని మళ్ళీ జూదంకొరకు ఆహ్వానించడానికి రాలేదు కదా! నీచుడైన శకుని మళ్ళీ జూదానికి మనల్ని ఆహ్వానించి మన ఆయుధాలను జయించడు కదా! 'రా' అని (యుద్ధానికి గాని జూదానికి గాని) ఎవరైనా నన్ను ఆహ్వానిస్తే భీమసేనా! నేను వెళ్ళకుండా ఉండలేను. ఈ స్థితిలో అర్జునుని గాండివం ఏదోవిధంగా ఎవరైనా హరిస్తే, మన రాజ్యప్రాప్తి సంశయాస్పదమవుతుంది' అని అన్నాడు. అనంతరం పాండవులంతా లేచి విదురునికి స్వాగతం పలికారు. వారు చేసిన యథోచిత స్వాగత సత్కారాలు పొంది, అజమీఢవంశీయుడైన విదురుడు పాండవులను సాదరంగా కలిశాడు.

విదురుడు సేదతీరిన తరువాత పాండవులు అతని రాకకు కారణాన్ని అడిగారు. విదురుడు కూడా ధృతరాష్ట్రుడున్న స్థితిని గురించి విస్తరంగా వారికి చెప్పాడు. విదురుడిలా అన్నాడు - 'అజాతశత్రూ! ధృతరాష్ట్రుడు నన్ను తన రక్షకునిగ భావించి, ఆహ్వానించి, సమ్మానించి 'ఈ స్థితిలో పాండవులకు, నాకు పథ్యమైనదేదో సమభావంతో చెప్పు' అని అన్నాడు. నేనుకూడా కురువంశీయులకు, ధృతరాష్ట్రునికీ హితం, పథ్యం, క్షేమం అయిన మాటను చెప్పాను. ఆ మాట అతనికి రుచించలేదు. అంతకంటె క్షేమమైనమాట వేరొకటి

నాకు తోచలేదు. పాండవులారా! నేను ఇరుపక్షాలవారికి మిక్కిలి శ్రేయస్కరమైన మాటను చెప్పాను. ధృతరాష్ట్రుడు నా మాటను వినలేదు. రోగికి పథ్యమయిన అన్నం ఇష్టంకానట్లే నే చెప్పినమాట ధృతరాష్ట్రునికి రుచించలేదు. ధర్మజా! శ్రోత్రియుని ఇంటిలో ఉన్నా దుష్టురాలయిన స్త్రీ సన్మార్గంలోకి తీసుకొని రావడానికి శక్యం కానట్లే ధృతరాష్ట్రుడు కూడ శక్యం కాడు. ఆరవై సంవత్సరాలవాడు కన్యకు భర్తగా ఇష్టం కానట్లే ధృతరాష్ట్రునికి నామాటలు రుచించవు. రాజా! ధృతరాష్ట్రుడు శ్రేయస్కరమైన మాటను గ్రహించటం లేదు. ఇక కౌరవుల వినాశం తప్పదు. ఇది నిశ్చయం. **తామరాకుమీద పడిన నీరు దానికి అంటవట్లే ధృతరాష్ట్రునికి చెప్పిన హితం అతని మనసులో నిలవదు.** అపుడు కోపించిన ధృతరాష్ట్రుడు నాతో "నీకు ఎవరిపట్ల శ్రద్ధ ఉందో అక్కడకే వెళ్ళు. ఈ రాజ్యాన్ని కాని, ఈ నగరాన్ని కాని పాలించడానికి మళ్ళీ నిన్ను తోడుగా (సహాయకునిగా) నేను కోరను." అన్నాడు. నరేంద్రా! అటువంటి నేను ధృతరాష్ట్రునిచే విడువబడ్డాను. నీకు ఉపదేశమివ్వడానికి వచ్చాను. సభలో నేను ధృతరాష్ట్రునికి చెప్పినదంతా మరల నీకు చెప్తాను. గ్రహించు.

శత్రువుల వల్ల తీవ్రమైన కష్టాలు పొందుతూ, ఓర్పువహిస్తూ తగినసమయకోసం నిరీక్షించేవాడు, మనోనిగ్రహంతో ఒక్కడే సమస్తభూమండలాన్నీ అనుభవిస్తాడు. రాజా! తోటివారితో కలిసి(సహాయకులతో) తన సంపదను అనుభవించే వాని దుఃఖంలో కూడా తోటివారు భాగస్వాము లౌతారు. సహాయకులను సంపాదించుకోవటంలో ఇదొక ఉపాయం. సహాయకుని పొందితే పృథివిని పొందినట్లుగా చెపుతారు. పాండునందనా! వ్యర్థమైన మాటలు విడిచి సత్యం పలుకటం శ్రేష్ఠమైనది. సహాయకులతో బాటుగ సమానమైన అన్నం తినదగింది. వారందరిముందు తన్ను తాను గొప్పవానిగా మాట్లాడకూడదు. ఈ విధంగా ఉండే రాజు ఎల్లపుడూ వృద్ధిని పొందుతాడు.' అనగానే యుధిష్ఠిరుడు 'ఉత్తమమైన బుద్ధిని ఆశ్రయించి, అప్రమత్తుడనై నీవు చెప్పినట్లుగా ఆచరిస్తాను. దేశకాలాలకు అనుగుణంగా ఉచితమైన దానిని కూడా చెప్పు. దానిని కూడ పూర్తిగా ఆచరిస్తాను." అన్నాడు.

6. ధృతరాష్ట్రుడు సంజయుని పంపి వనమునుండి విదురుని రప్పించుట, క్షమింపుమని అతనిని ప్రార్థించుట.

విదురుడు పాండవుల దగ్గరకు ఆశ్రమానికి వెళ్లేసరికి, మహాప్రాజ్ఞుడైన ధృతరాష్ట్రుడు మిక్కిలి పశ్చాత్తాపం పొందాడు. విదురుని సంధి విగ్రహాది నీతిజ్ఞతను, ప్రభావాన్ని తలచుకొని అతనివల్ల పాండవులకు మిక్కిలి అభివృద్ధి కలుగుతుందని భావించాడు.

విదురుని స్మరిస్తూ మోహితుడైన ధృతరాష్ట్రుడు సభాద్వారం వద్దకు వచ్చి, అక్కడి రాజులందరూ చూస్తుండగా స్పృహతప్పి నేలపై పడిపోయాడు. మరల అతడు స్పృహలోకివచ్చి లేచి, తనదగ్గరకు వచ్చిన సంజయునితో ఇలా అన్నాడు. 'విదురుడు నా సోదరుడు, మిత్రుడూను. అపరధర్మస్వరూపుడు. అతని స్మరణచేత ఈ రోజు నా హృదయం మిక్కిలి బ్రద్దలయిపోతున్నట్లుగా ఉంది. ఆ ధర్మజుడైన నా సోదరుని శీఘ్రంగా తీసికొనిరా' అని అంటూ ధృతరాష్ట్రుడు దీనంగా రోదించాడు. పశ్చాత్తాపంచేత సంతాప పడి, విదురుని స్మరణంవల్ల మోహితుడైన రాజు సోదరుని పట్లగల ప్రేమతో సంజయునితో ఇలా అన్నాడు – "సంజయా! వెళ్లు. నా సోదరుడైన విదురుని గురించి తెలిసికో. పాపాత్ముడనైన నేను కోపంతో వెళ్లగొట్టాను. అతడు జీవించి ఉన్నాడో? లేదో? ప్రాజ్ఞుడు, అపరిమితబుద్ధికలవాడూ అయిన నా సోదరుడు మిక్కిలి సూక్ష్మమైన చిన్న తప్పుకూడ మునుపెప్పుడూ చేయలేదు. ప్రాజ్ఞా! నావల్ల బుద్ధిమంతుడైన విదురునిపట్ల పెద్ద అపరాధం జరిగిపోయింది. నీవు వెళ్లి అతనిని తీసికొనిరా. లేకుంటే నేను ప్రాణాలు విడుస్తాను.' రాజుయొక్క ఆ మాటలువిని, అతనిని ఆదరించి, సంజయుడు 'అట్లే' అని కామ్యకవనానికి వెళ్లాడు.

అతడు శీఘ్రంగా కామ్యకవనం చేరి అక్కడ పాండవులను చూశాడు. విదురునితో, వేలకొద్దీ బ్రాహ్మణులతో, సోదరులతో దేవతలతో కలిసిఉన్న ఇంద్రునిలా మృగచర్మం ధరించిన యుధిష్ఠిరుని చూశాడు. సంజయుడు యుధిష్ఠిరుని సమీపించి పూజించాడు. భీమార్జున నకులసహదేవులు కూడ సంజయుని యథోచితంగా సత్కరించారు. యుధిష్ఠిరుడు అతనిని కుశలప్రశ్నలడిగాడు. సంజయుడు సుఖాసీనుడై తన రాకకు కారణాన్ని చెప్పి, ఈ విధంగా పలికాడు. 'విదురమహాశయా! ధృతరాష్ట్రమహారాజు నిన్ను స్మరిస్తున్నాడు. నీవు శీఘ్రంగా వెళ్ళి ఆయనను చూడు. రాజును బ్రతికించు. నరశ్రేష్ఠులు, కురునందనులు అయిన పాండవుల అనుమతి తీసికొని రాజసింహుడైన ధృతరాష్ట్రుని శాసనం ప్రకారం వెళ్లవలసి ఉంది.' సంజయుడిలా చెప్పగా, ధీశాలి, స్వజనవల్లభుడు అయిన విదురుడు యుధిష్ఠిరుని అనుమతి గైకొని హస్తినాపురానికి తిరిగి వచ్చాడు. మహాతేజస్వి, అంబికాసుతుడూ అయిన ధృతరాష్ట్రుడు అతనితో 'ధర్మజ్ఞా! నాభాగ్యవశం చేత నిన్ను పొందాను. నా భాగ్యవశంచేత నన్ను గుర్తుంచుకొన్నావు భరతశ్రేష్ఠా! నీకోసం రాత్రిపగలు జాగరణం చేసినకారణంగా నా శరీరంలోని విచిత్రస్థితిని ఈ రోజు నేను చూస్తున్నాను.' అనిపలికి ధృతరాష్ట్రుడు విదురుని తన ఒడిలో కూర్చోపెట్టుకొని, శిరస్సు ఆఘ్రాణించి, 'అనఘా! నేను నీపట్ల పలికిన అప్రియవచనాలకు నన్ను క్షమించు' అని అన్నాడు. అపుడు విదురుడిలా అన్నాడు. 'రాజా! నేను మునుపే క్షమించాను. నీవు నాకు పరమగురుడవు. అందుకే

నిన్ను చూడాలనే తాత్పర్యంతో నేను శీఘ్రంగా వచ్చాను. నరశ్రేష్ఠా! ధర్మాత్ములైనవారు దీనులపట్ల పక్షపాతంతో ఉంటారు. ఈ విషయంలో విచారింపవలసిన పనిలేదు. నాకు పాండుకుమారు లెటువంటివారో, నీ కుమారులు కూడా అటువంటివారే. కాని పాండవులు దీనులుగా ఉన్నారు. కావున నా బుద్ధి వారిపట్ల ప్రసరించింది.' ఈ విధంగా మహాతేజోవంతులైన ఆ సోదరులిరువురూ ఒకరినొకరు అనునయించుకొన్నారు. చివరకు విదురధృతరాష్ట్రులు మిక్కిలి ఆనందాన్ని పొందారు.

7. దుష్టచతుష్టయము పాండవులను చంపబూనుట -వ్యాసాగమనము.

విదురుడు తిరిగిరావడమూ, అతనిని ఊరడించటమూ విని దుర్బుద్ధియైన దుర్యోధనుడు మిక్కిలి పరితపించాడు. అతడు శకుని, దుఃశాసన, కర్ణులను రప్పించి, వారితో అజ్ఞానంతోనూ, మోహంతోను ఇలా పలికాడు. 'బుద్ధిమంతుడైన విదురుడు తిరిగివచ్చాడు. అతడు విద్వాంసుడు, పాండవులకు స్నేహితుడు, హితుడూను. ఈ విదురుడు మా తండ్రి బుద్ధిని పాండవులను తిరిగి తీసికొని వచ్చే విషయంలోకి తీసుకురాకముందే నాకు హితమైన దాన్ని ఆలోచించండి. ఏవిధంగానైనాసరే ఇక్కడకు తిరిగివచ్చిన పాండవులను చూసినట్లయితే, నేను నీటిని కూడ తీసికోకుండా స్వేచ్ఛగా నా శరీరాన్ని శుష్కింపజేసుకొంటాను. విషాన్ని తీసికొంటాను లేదా ఉరివేసికొంటాను, లేదా ఆయుధంతో ప్రాణాలు తీసికొంటాను. లేదా అగ్నిలో ప్రవేశిస్తాను. అంతేకాని మరల ఇక్కడ సంపదలతో ఉండే పాండవులను మాత్రం నేను చూడలేను.'

శకుని ఇలా అన్నాడు - 'రాజా! బాలునిలా ఆలోచిస్తున్నావేమిటి? వారు ప్రతిజ్ఞ చేసి వెళ్ళారు. కనుక ఈ విధంగా ఏమీ జరుగదు. పాండవులంతా సత్యవచనాన్ని పాలించేవారు. కావున నాయనా! నీతండ్రి మాటను వారెప్పుడూ స్వీకరించరు. లేదా ఒకవేళ వారు నీ తండ్రి మాటలు గ్రహించి ప్రతిజ్ఞను విడిచి, తిరిగి హస్తినాపురానికి వస్తే, మన వ్యవహారం ఈ విధంగా ఉండాలి. మనమంతా రాజు ఆజ్ఞను పాలిస్తూ మధ్యస్థులంగా ఉందాం. రహస్యంగా పాండవుల లొసుగులను కనిపెడదాం.'

దుఃశాసనుడిలా అన్నాడు - 'మహాప్రాజ్ఞా! మాతులా! ఇది ఈ విధంగానే చేద్దాం. ఎల్లపుడూ సలహా చెప్పే నీ ఆలోచనే నాకు నచ్చుతుంది.'

కర్ణుడిలా అన్నాడు - 'రాజా! దుర్యోధనా! మేమంతా నీకిష్టమైన కోర్కెను తీర్చటానికే నిరీక్షిస్తున్నాం. ఈ విషయంలో మనందరి ఐకమత్యాన్ని గుర్తిస్తున్నాను. ధీరులైన పాండవులు ప్రతిజ్ఞాకాలాన్ని పూర్తిచేయకుండా తిరిగిరారు. ఒకవేళ అజ్ఞానవశం వల్ల వస్తే మళ్ళీ జూదంతో

వారిని జయించు.' కర్ణుడు ఈ విధంగా చెప్పగానే దుర్యోధనుడు అంతగా సంతోషించలేదు. వేగంగా కర్ణునిపట్ల పరాఙ్ముఖుడయ్యాడు. ముఖం ప్రక్కకు త్రిప్పుకొన్నాడు. అనంతరం అతని అభిప్రాయాన్ని తెలిసికొన్న కర్ణుడు తన కన్నులు పెద్దవి చేసి, రోషంతో మిక్కిలి క్రుద్ధుడై తనకు తానుగా ఉద్యమించి శకుని దుఃశాసనులతోనూ దుర్యోధనునితోనూ 'భూపాలకులారా! ఈ విషయంలో నా అభిప్రాయాన్ని తెలిసికోండి' అని ఇలా అన్నాడు. 'రాజునకు సేవకులమూ, భుజాలమూ అయిన మనమంతా కలిసి రాజునకు ఇష్టాన్ని చేద్దాం. మనం అలసత్వం లేకుండా అతనికిష్టమైన విషయంలో నిలువలేకపోతున్నాం. మనం ఆయుధాలుపట్టి, రథాలెక్కి, వనవాసులైన పాండవులను చంపటానికి అంతా కలిసి వెడదాం. వారంతా మరణించి, శాంతిస్తే ఏదో తెలియని(గతికి) లోకానికి వెళ్తే, ధార్తరాష్ట్రులకు వివాదమే లేదు. మనం కూడా అంతే. వారు కష్టాల్లో ఉన్నంతవరకూ, దుఃఖంతో ఉన్నంతవరకూ, సహాయరహితులయి ఉన్నంతవరకూ యుద్ధంలో మనం వాళ్లను జయింపగలుగుతాం.' కర్ణుని ఆ మాటను విని, మరలమరల అతనిని గౌరవిస్తూ, 'చాలా బాగుంది' అని వారంతా అతనికి బదులిచ్చారు. ఈవిధంగా అనుకొని, మిక్కిలిరోషంతో వారంతా వేరు వేరు రథాలను తీసికొని, పాండవులను చంపడానికి కృతనిశ్చయులై నగరం నుండి బయటకు వెళ్లారు. సర్వసమర్థుడై, విశుద్ధాత్ముడైన వ్యాసుడు తన దివ్యదృష్టితో వారావిధంగా బయలుదేరడం తెలిసికొని హఠాత్తుగా అక్కడకు వచ్చాడు. లోకపూజితుడైన వ్యాసభగవానుడు వారినందరిని కాదని, కూర్చున్న ప్రజ్ఞాచక్షువయిన ధృతరాష్ట్రుని వద్దకు వేగంగా వచ్చి ఇలా చెప్పాడు.

8. ధృతరాష్ట్రునికి వ్యాసుని హితోపదేశము.

'మహాప్రాజ్ఞా! ధృతరాష్ట్రా! నామాట విని అర్థం చేసుకో. కౌరవులందరికి హితమై, ఉత్తమమైన మాటను నీకు చెప్తాను. పాండవులు వనానికి వెళ్ళడం నాకిష్టంలేదు. దుర్యోధనుడు మున్నగువారు మోసంతో వారిని ఓడించారు. భారతా! పదమూడుసంవత్సరాలు పూర్తి కాగానే వారు తామనుభవించిన కష్టాలను తలుచుకొంటూ క్రుద్ధులై కౌరవులపై విషాన్ని కక్కుతారు. ఈ విషయం తెలిసినా పాపాత్ముడు మందబుద్ధి అయిన నీకుమారుడు ఎల్లపుడూ క్రుద్ధుడై రాజ్యం కారణంగా పాండవులను చంపాలని చూస్తున్నా డెందుకు? ఈ మూఢుని నివారించు. నీ కుమారుడు శాంతించుగాక. వనంలో ఉన్న వారిని చంపాలనుకొని ఇతడు తన ప్రాణాలను విడుస్తాడు. నేనెటువంటివాడినో, కృపుడు, ద్రోణుడు ఎటువంటివారో అటువంటివాడవే నీవు కూడా. మహాప్రాజ్ఞా! స్వజనులతో (యుద్ధం)కలహం మిక్కిలిగా

నిందింపబడింది. అది అధర్మం. అప్రతిష్ఠాకరం కూడ. రాజా! నీవు దాన్ని అంగీకరించకు. పాండవులను గురించి ఈ దుర్యోధనుని ఆలోచనను ఉపేక్షిస్తే అది పెద్ద అత్యాచారానికి దారితీస్తుంది. లేదా మందబుద్ధి అయిన నీకుమారుడు దుర్యోధను డొక్కడూ తోడెవరూ లేకుండా వనానికి వెళ్ళి, పాండవులతో పాటుగా (ఉండాలి) ఉండుగాక. మనుజేశ్వరా! వారి సంసర్గంవల్ల నీ కుమారునికి వారిపట్ల స్నేహం కలిగితే, ఈ రోజే నీవు కృతార్థుడవైనట్లు. మహారాజా! **పుట్టుకతో పాటుగా ఒకనికి ఏర్పడిన స్వభావం చనిపోకముందు తొలగదు.** ఈ విషయంలో భీష్ముడు, ద్రోణుడు, విదురుడు నీవూ ఏమనుకొంటున్నారు? ఇపుడు చేయదగిన పనిని ముందు చెయ్యాలి. లేకపోతే మీ ప్రయోజనం నశిస్తుంది.'

9. ఇంద్రసురభి సంవాదమును వ్యాసుడు చెప్పుట.

ధృతరాష్ట్ర డిలా అన్నాడు - 'పూజ్యుడా! జూదం వల్ల జరిగిన దీనిని (పాండవుల వనగమనాన్ని). నేను కూడా ఇష్టపడటంలేదు. మునివరా! విధి బలవత్తర మవడంచేత నేనీ పని చేశానని భావిస్తున్నాను. భీష్ముడు, ద్రోణుడు, విదురుడు, గాంధారి కూడ ఈ జూదాన్ని ఇష్టపడరు. కాని దానిపట్ల మోహంవల్ల జూదం జరిగింది. పూజ్యుడా! దుర్యోధనుడు అవివేకి అని తెలిసినప్పటికీ పుత్రస్నేహంచేత వానిని వదలలేకపోతున్నాను.' వ్యాసుడిలా అన్నాడు - 'రాజా! విచిత్రవీర్యనందనా! నీవు చెప్పింది నిజమే. పుత్రుడు మిక్కిలి ఇష్టుడని, పుత్రునికంటె ఇష్టమైనది వేరొకటి లేదని మాకు బాగా తెలుసు. సమృద్ధంగా ఇతర పదార్థాలచే సంపన్నుడైనా పుత్రులనే (ఇష్టులుగా) గొప్పగా భావిస్తాడు. ఈ విషయాన్ని సురభి తన కన్నీటిచే ఇంద్రుడు తెలిసికొనేటట్లు చేసింది. నరాధిపా! ఈ విషయంలో సురభికి, ఇంద్రునికి జరిగిన సంవాదరూపమైన ఉత్తమమైన గొప్ప ఆఖ్యానాన్ని నీకు చెప్తాను. పూర్వమొకప్పుడు గోమాత సురభి స్వర్గానికి వెళ్ళి ఏడ్చిందట. నాయనా! అపుడు ఇంద్రుడు దానిపట్ల మిక్కిలి దయ చూపాడు. ఇంద్రుడిలా అన్నాడు 'శుభరూపీ! నీవు ఏడుస్తున్నా వేమిటి? స్వర్గంలో ఉన్నవారంతా క్షేమమే కదా! మనుష్యులకు, గోవులకు కుశలమేకదా! చిన్నకారణానికి నీకింతటి విచారం కలుగదు.' సురభి ఇలా అంది 'దేవేంద్రా! మీకెటువంటి ప్రమాదం కనబడటం లేదు. నేను పుత్రుని గురించి దుఃఖిస్తున్నాను. అందుచే ఏడుస్తున్నాను. నీచుడైన ఈ కర్షకుని చూడు. నాగలితో బాధిస్తూ, దుర్బలుడైన నాకుమారుని కర్రతో మాటిమాటికీ కొడుతున్నాడు. సురాధిపా! విశ్రాంతికోరే దాన్ని ఆ కర్షకుడు కొడుతున్నాడు. దాన్ని చూస్తే జాలి కలిగింది. మనస్సు ఉద్విగ్నమైంది. అతనిదగ్గరున్న రెండెడ్లలో ఒకటి బలమైంది. అది ఎక్కువ బరువు మోస్తోంది. వేరొకటి దుర్బలప్రాణం

కలది. చిక్కినది. నరాలుపైకి కనబడుతున్నాయి. అది అతికష్టంమీద భారాన్ని మోస్తోంది. ఇంద్రా! నేను దాన్ని గురించే దుఃఖిస్తున్నాను. కర్రతో మాటిమాటికి అతడు కొడుతుంటే, హింసిస్తూ ఉంటే అది భారం మోయలేకపోతోంది. చూడు. అందువల్ల నేను దాని కష్టం వల్ల మిక్కిలి దుఃఖం పొంది, రెండు కళ్ళనుండి అశ్రువులను కారుస్తూ దీనంగా ఏడుస్తున్నాను.' ఇంద్రుడిలా అన్నాడు – 'కల్యాణీ! వేలకొలది నీ పుత్రులు బాధింపబడుతూండగా నీవు ఈ ఒక్క పుత్రునిపట్లనే ఎందుకు జాలిపడుతున్నావు?' 'ఇంద్రా! నాకు వేలపుత్రులున్నా వారందరి పట్ల నాకు సమానభావమే ఉంది. కాని దీనుడైన పుత్రునిపట్ల ఎక్కువ జాలికలుగుతోంది.'

'కురురాజా! సురభి యొక్క ఈమాటలు విన్న ఇంద్రుడు మిక్కిలి ఆశ్చర్యపడ్డాడు. అప్పటినుండి అతడు పుత్రుని ప్రాణాలకంటె ఎక్కువ ప్రేమగా చూశాడు. అపుడు వెంటనే ఇంద్రుడు కర్షకుని పనికి విఘ్నాన్ని కలిగిస్తూ నీరు పొంగేటట్లు కుంభవృష్టి కురిపించాడు. సురభి చెప్పిన విధంగానే నీకు కూడ ఏర్పడు గాక ! రాజా! **కౌరవపాండవులంతా నీకుమారులే అయినా వారిలో దీనస్థితిలో ఉన్నవారిపై నీకెక్కువ దయ ఉండాలి. కుమారా!** పాండురాజు నాకెటువంటి వాడో నీవు కూడా నాకట్టివాడవే. మహాప్రాజ్ఞుడైన విదురుడు కూడ అట్టివాడే. స్నేహంవల్ల నేనిదంతా చెపుతున్నాను. భారతా! చాలాకాలంగా నీకు నూటొక్క కుమారులు, పాండురాజుకు ఐదుగురే ఉన్నారు. వారు కూడా అమాయకులు. మిక్కిలి దుఃఖంలో ఉన్నావారూను. **కుంతీపుత్రులైన వారు ఎలా జీవిస్తారా? ఎలా వృద్ధి చెందుతారా? అని దీనులైన పాండవుల విషయంలో నామనస్సు మిక్కిలి పరితపిస్తోంది.*** రాజా! కురువంశీయులంతా సుఖంగా జీవించాలని నీవు కోరుతున్నట్లయితే, నీకుమారుడైన దుర్యోధనుడు పాండవులతో కలసి శాంతంగా ఉండాలి.'

10. మైత్రేయుడు దుర్యోధనుని శపించుట.

ధృతరాష్ట్రుడిలా అన్నాడు. 'మహాప్రాజ్ఞా! మునివరా! నీవు మాకు చెప్పినమాట యథార్థం. నేనూ ఎరుగుదును. ఇక్కడున్న ఈ నరాధిపులందరూ ఎరుగుదురు. నీవు కూడా కురువంశీయులందరి అభివృద్ధిని కోరుతున్నావు. బాగుంది. అదే విషయాన్ని విదుర, భీష్మ, ద్రోణులు కూడ నాకు చెప్పారు. నేను నీకు అనుగ్రహింపదగినవాడినయితే, కురువంశీయుల పట్ల దయ ఉంటే, దుర్మార్గుడైన నా కుమారుని దుర్యోధనుని శాసించు.'

---

* కథం జీవేయురత్యంతం కథం వర్ధేయురిత్యపి ।
ఇతి దీనేషు పార్థేషు మనో మే పరితప్యతే ॥ 22

వ్యాసుడిలా అన్నాడు – 'రాజా! పూజ్యుడగు మైత్రేయ మహర్షి వస్తున్నాడు. పాండవసోదరులను కలిసి, మనలను చూడాలని ఇక్కడకు వస్తున్నాడు. ఈ వంశం యొక్క శాంతికొరకై ఈ మహర్షి నీకుమారుని యథాన్యాయంగా శాసిస్తాడు. అతడు చెప్పిన దాన్ని శంకించకుండా చేయాలి. అతడు చెప్పిన పని చేయకపోతే, కోపంతో నీ కుమారుని శపిస్తాడు.'

ఈ విధంగా చెప్పి వ్యాసుడు వెళ్ళాడు. మైత్రేయుడు వస్తూ కనబడ్డాడు. ధృతరాష్ట్రుడు తనకొడుకుతో కలిసి అతనికి సగౌరవంగా స్వాగతం పలికాడు. అర్ఘ్యపాద్యాది – ఉపచారాలయి మునిశ్రేష్ఠుడు విశ్రాంతి పొందినపుడు మైత్రేయునితో ధృతరాష్ట్రమహారాజు సవినయంగా ఇలా అన్నాడు. 'పూజ్యుడా! కురుదేశాలకు నీవు సుఖంగా వచ్చావా? వీరులు, సోదరులైన పంచపాండవులు కుశలంగా ఉన్నారా? ఆ భరతశ్రేష్ఠులు ప్రతిజ్ఞాపాలనలో స్థిరంగా ఉండాలనుకొంటున్నారా? కౌరవులలో భ్రాతృభావం అవిచ్ఛిన్నంగా ఉంటుందా?' మైత్రేయుడిలా అన్నాడు – 'తీర్థయాత్రలు చేస్తూ ఈ కురు దేశాలకు చేరాను. అనుకోకుండగా కామ్యకవనంలో ధర్మరాజును చూశాను. జటాజినాలు ధరించి, తపోవనంలో నివసిస్తూన్న మహాత్ముడైన ఆ ధర్మరాజును చూడ్డానికి మునుల సమూహాలు వచ్చాయి. నీ పుత్రులయొక్క అవినీతికరమైన బుద్ధి చాంచల్యాన్ని గురించి అక్కడ విన్నాను. జూదరూపంలో మహాభయం దాపురించింది. అనంతరం అక్కడనుండి కౌరవులను చూడాలనే ఉద్దేశ్యంతో నీదగ్గరకు వచ్చాను. నీ యందు నాకెల్లప్పుడు మిక్కిలి స్నేహమూ, ప్రీతీ ఉన్నాయి. నీవూ, భీష్ముడూ జీవించి ఉండగా నీపుత్రులు కౌరవపాండవులు పరస్పరం ఏదోవిధంగా విరోధించుకోవటం యుక్తంగా లేదు. నీవు స్వయంగా అందరినీ బంధించి నిగ్రహించడంలో (నియంత్రించడంలో) స్తంభంలాంటివాడవు. జరుగుతున్న మహాఘోరమైన అవినీతిని నీవెందుకు ఉపేక్షిస్తున్నావు? కురునందనా! సభలో దోపిడీదారులవ్యవహారం జరగడంచేత తపస్సుల సమూహంలో నీవు ప్రకాశించడం(గౌరవింపబడడం) లేదు.'

అనంతరం పూజ్యుడైన మైత్రేయ మహర్షి అసహనంతో ఉన్న దుర్యోధనుని వైపుకు తిరిగి మధురంగా ఇలా అన్నాడు. 'దుర్యోధనా! మహాభాగా! నేను నీకు చెప్పే ప్రజల హితవచనాన్ని బాగా అర్థం చేసుకో. పాండవులకు ద్రోహం చేయకు. నీకు, పాండవులకూ, కురువంశీయులకూ, జనులకూ ప్రియమైన దాన్ని చెయ్యి. నరశ్రేష్ఠులైన ఆ పాండవులందరూ శూరులు, పరాక్రమంగల యోధులూను. వారంతా వేలఏనుగుల బలమూ, వజ్రసమానమైన దేహమూ కలవారు. వారు సత్యవ్రతాన్ని పూనినవారు. పౌరుషాన్ని అభిమానించేవారు. దేవశత్రువులై, స్వేచ్ఛారూపం ధరించగల హిడింబాది రాక్షసులను, కిర్మీరుడనే రాక్షసునీ చంపినవారు. ఇక్కడనుండి వెళుతున్న మహాత్ములైన పాండవుల మార్గాన్ని రాత్రి సమయంలో

ఆక్రమించుకొని, భయంకరుడైన కిర్మీరుడనే రాక్షసుడు స్థిరమైన కొండలా అడ్డునిల్చాడు. బలిష్ఠులలో శ్రేష్ఠుడై, యుద్ధంలో ఆరితేరిన భీముడు తన బలంతో చిన్నమృగాన్ని పెద్ద పులి చంపినట్లుగా ఆ రాక్షసుని చంపాడు. దిగ్విజయానికి వెళ్ళినపుడు భీముడు పదివేల ఏనుగుల బలం గల, జరాసంధుని బాహుయుద్ధంలో ఎలా చంపాడో చూడు. వసుదేవనందనుడు శ్రీకృష్ణుడు వారికి సంబంధించినవాడు. ద్రుపదపుత్రులంతా వారికి బావమరదులు. వారిని యుద్ధంలో జరామరణాలు గల మానవుడెవడు ఎదుర్కోగలడు? కావున పాండవులతో నీకు శాంతిపూర్వక స్నేహం ఉండుగాక. విరోధం వద్దు. నా మాటలను ఆచరించు. క్రోధానికి వశుడవై ప్రవర్తించకు.'

మైత్రేయుడు ఈ విధంగా చెపుతూండగా, దుర్యోధనుడు చిరునవ్వు నవ్వి, కాలితో నేలనురాస్తూ, ఏనుగుతొండం వంటి తనతొడను చేతితో చరిచాడు. దుర్బుద్ధి అయిన దుర్యోధనుడు ఏమీ మాట్లాడకుండా ముఖం కొంచెం ప్రక్కకు త్రిప్పుకొన్నాడు. తన మాటను వినడానికి ఇష్టపడక, నేలను కాలితో రాస్తున్న దుర్యోధనుని చూడగానే మైత్రేయునికి కోపం ఆవహించింది. విధిచే ప్రేరేపింపబడి మైత్రేయుడు అతనిని శపించడానికి సంకల్పించాడు. అనంతరం నీటిని స్పృశించి, కోపంతో ఎర్రబడ్డ కన్నులతో మైత్రేయుడు దురాలోచనగల దుర్యోధనుని ఈ విధంగా శపించాడు. 'నన్ను తిరస్కరించి, నామాటను తిరస్కరించే ఈ నీ అభిమానానికి (అహంకారానికి) వెంటనే ఫలితం అనుభవిస్తావు. నీద్రోహం కారణంగా పెద్ద యుద్ధం జరుగుతుంది. అందులో బలవంతుడైన భీముడు గదాఘాతాలతో నీతొడను (భగ్నం చేస్తాడు) విరక్కొడతాడు.' అతడీ విధంగా పలుకగా, ధృతరాష్ట్రమహారాజు 'ఇది ఈ విధంగా జరుగకూడదు' అని మునిని (ప్రసన్నుణ్ణి చేసికొన్నాడు) వేడుకొన్నాడు. మైత్రేయుడిలా అన్నాడు. 'రాజా! నీ పుత్రుడు పాండవులతో విరోధించక శాంతిని పొందినట్లయితే ఈ శాపం జరుగదు. అట్లుకాని పక్షంలో జరుగుతుంది.' అన్నాడు. ధృతరాష్ట్రమహారాజు భీముని బలాన్ని గురించి విశేషంగా తెలిసికోగోరి, 'కిర్మీరుని భీముడు ఎలా సంహరించాడు'? అని మైత్రేయుని అడిగాడు. మైత్రేయుడిలా అన్నాడు - 'రాజా! నీ కుమారుడు నామాటను వినటంలేదు. అందువల్ల మళ్ళీ ఇపుడు నేను నీకేమీ చెప్పను. నేను వెళ్ళిన తరువాత ఈ విదురుడు నీకంతా చెపుతాడు.' ఈ విధంగా చెప్పి మైత్రేయుడు వచ్చిన విధంగానే బయలుదేరాడు. కిర్మీరవధ మాటతో ఉద్విగ్నుడైన దుర్యోధనుడు బయటకు వెళ్లిపోయాడు.

11. భీమసేనుడు కిర్మీరుని చంపుట.

ధృతరాష్ట్రుడిలా అన్నాడు - 'విదురా! కిర్మీరుని వధను గూర్చి వినాలనుకొంటున్నాను. చెప్పు. ఆ రాక్షసునితో భీమసేనుడికి కలయిక ఎలా జరిగింది?' విదురుడిలా అన్నాడు - 'రాజా! మానవశక్తికి అతీతమైన పనులు చేసే భీమసేనుని భయానకమైన ఈ పనిని గురించి విను. బ్రాహ్మణులు వారి గురించి మాట్లాడుకొనే సందర్భాలలో చాలాసార్లు నేను ఈ వృత్తాంతం విన్నాను. రాజేంద్రా! జూదంలో ఓడిపోయిన పాండవులు ఇక్కడి నుండి బయలుదేరి మూడురోజులలో కామ్యకవనానికి చేరుకొన్నారు. రాత్రి సగం గడిచిన తరువాత భయంకరమైన దట్టమైన చీకటిలో ఆ వనంలో నరభక్షకులూ, ఘోరకర్ములూ అయిన రాక్షసులు సంచరిస్తూ ఉంటారు, వారిభయం వల్ల తాపసులు, వనచారులైన గోపగణాలు ఆ వనానికి దూరంగా ఉంటూండేవారు. పాండవులు ఆ వనాన్ని ప్రవేశిస్తూండగా, వారి మార్గాన్ని ఆక్రమించుకొని, మెరిసే కన్నులతో భయంకరమైన రాక్షసుడు అడ్డు నిలిచాడు. అతడు తన బాహువులను పెద్దవిచేసి, భయంకరమైన తన నోటిని పెద్దది చేసి పాండవులు వెళ్తూన్న మార్గాన్ని ఆక్రమించుకొని ఉన్నాడు. ఆ రాక్షసునికి ఎనిమిది కోరలు ఉన్నాయి. కళ్లు ఎర్రగా ఉన్నాయి. శిరోజాలు పైకి నిక్కి, ప్రజ్వలిస్తున్నట్టుగా ఉన్నాయి. సూర్యకాంతివల్ల కలిగిన విద్యున్మండలంతో, బెగ్గురుపక్షులతో కూడిన మేఘంలా ఆ రాక్షసు డున్నాడు. అతడు రాక్షసమాయను సృష్టిస్తున్నాడు. అతడు చేసే మహానాదం అంతటా ప్రతిధ్వనిస్తోంది. బిగ్గరగా గర్జించే నీటితోకూడిన నల్లని మేఘంలా ఉన్నా డతడు. అతని అరుపుతో భయపడిన నీటిపక్షులతోపాటు పక్షులన్నీ అరుచుకొంటూ అన్ని దిక్కులకూ ఎగిరిపోయాయి. పరుగిడుతున్న మృగాలు, ఏనుగులు, అడవిదున్నలు, ఎలుగుబంట్లతో నిండి ఉన్న వనమే ఆ రాక్షసుని అరుపుతో బయటకు పరుగిడుతున్నట్లుగా ఉంది. ఆ రాక్షసుడు కదలుతూంటే వచ్చే గాలి తాకిడికి ఎఱ్ఱని చిగురుటాకు లనే బాహువులు కలిగిన లతలు దూరంగా విసరబడి వృక్షాలను కౌగిలించుకొంటున్నాయి. (పాండవులు వస్తూన్న) ఆ సమయంలో మిక్కిలి దారుణమైన గాలి వీచింది. ఆ గాలికి లేచిన దుమ్ముచేత ఆకాశమంతా కప్పబడి వెలుతురు కనబడకుండా చీకటి క్రమ్మినట్లయింది (నక్షత్రాల వెలుతురు కూడా కనబడకుండా పోయింది). అకస్మాత్తుగా ఐదు ఇంద్రియాలను చెప్పలేనంత దుఃఖం ఆవరించినట్లుగా, పంచపాండవులను ఆ రాక్షసుడు సమీపించాడు.

కాని వారు అతనిని గుర్తించలేదు. ఆ రాక్షసుడు కృష్ణాజినాలు ధరించిన పాండవులను దూరంనుండే చూసి మైనాకపర్వతంలా ఆ వనానికి ప్రవేశించే మార్గాన్ని ఆక్రమించాడు. మునుపెన్నడూ చూడని ఆ రాక్షసుని దగ్గరగా చూసిన పద్మాక్షి ద్రౌపది భయంతో

కన్నులు మూసుకొంది. దుఃశాసనుని చేతులతో లాగబడి చెల్లాచెదరైన కేశాలతో ద్రౌపది ఐదుపర్వతాలమధ్యనున్న నదివలె పాండవుల మధ్య ఏ ప్రక్కకు పోవాలో తెలియక వ్యాకులమయింది. విషయాలపై ఆసక్తి కల పంచేంద్రియాలు అనురక్తిని, తన్మయత్వాన్ని పొందినట్లుగా ద్రౌపది మూర్ఛిల్లుతుండగా పాండవులు పట్టుకొన్నారు. వెంటనే అక్కడ భయంకరమైన రాక్షసీమాయ వ్యక్తమయింది. దానిని వివిధ రక్షోఘ్నమంత్రాలచేత ధౌమ్యుడు పాండవులు చూస్తూండగా నాశనం చేశాడు. మాయ నశించగానే క్రోధం చేత ప్రజ్వలిస్తున్న నేత్రాలతో క్రూరుడైన రాక్షసుడు యమునిలా కనబడ్డాడు. అతనితో మహాప్రాజ్ఞుడైన యుధిష్ఠిరుడు ఇలా అన్నాడు. 'నీవెవరు? ఎవనికి సంబంధించినవాడవు? నీకు ఏం పని కావాలి? చెప్పు' అపుడు ఆ రాక్షసుడు ఇలా అన్నాడు- నేను బకాసురుని సోదరుణ్ని. నాపేరు కిర్మీరుడని ప్రసిద్ధమే. ఈ నిర్జనమైన కామ్యకవనంలో నిశ్చింతగా ఉంటున్నాను. నేను నిత్యం ఇక్కడకు వచ్చే మనుష్యులను జయించి ఆహారంగా తీసికొంటాను. మీరెవరు? నాకు ఆహారంగా మీరే స్వయంగా నా దగ్గరకు వచ్చారు. మిమ్మల్నందర్నీ యుద్ధంలో జయించి నిశ్చింతగా భుజిస్తాను.' దుర్మార్గుడైన ఆ రాక్షసుని మాటలు విని, యుధిష్ఠిరుడు తమ గోత్రనామాదులన్నింటిని అతనికి ఇలా చెప్పాడు.

పాండురాజుకుమారుడైన ధర్మరాజును నేను. ఇది నీ చెవిదాక వచ్చే ఉంటుంది. రాజ్యం కోల్పోయి భీమసేనార్జునాది సోదరులతో వనవాసం చేయడానికి వచ్చాను. అందువల్ల నీనివాసమైన ఘోరమైన ఈ కామ్యకవనాన్ని ప్రవేశించాను. అపుడు కిర్మీరుడు యుధిష్ఠిరునితో ఇలా అన్నాడు - 'ఈ రోజు నా భాగ్యవశం వల్ల నా చిరకాల మనోరథాన్ని దేవతలు పూర్తిచేశారు. నేను నిత్యం భీమసేనుని చంపటంకోసం, ఆయుధం సిద్ధంగా ఉంచుకొని ఈ భూమిపై కలయ తిరుగుతున్నాను. కాని నే నతనిని చూడలేకపోయాను. నాసోదరుని చంపిన ఆ భీమసేనుడు చాలాకాలానికి నా భాగ్యవశాన లభించాడు. ఇతడే నాప్రియసోదరుడైన బకుని చంపాడు. ఏకచక్రపురానికి దగ్గర్లో ఉన్న వైత్రకీయవనంలో బ్రాహ్మణునిలా కపటవేషం ధరించి, విద్యాబలం సంపాదించి, నా సోదరుని చంపాడు. అది ఇతని శరీరబలం కాదు. నాకు ఇష్టుడు, వనంలో సహచరుడు, మిత్రుడూ అయిన హిడింబుని దుర్మార్గుడైన ఈ భీముడే చంపాడు. పైగా అతని సోదరిని కూడ అపహరించాడు. మూఢుడైన ఆ భీముడు నా ఈ అతిగహనమైన వనంలోకి అర్ధరాత్రి సమయంలో మేము సంచరించేటప్పుడు వచ్చాడు. చాలకాలం నుండి పోషించుకొంటున్న ఈ వైరాన్ని ఈ రోజు తీర్చుకొంటాను. ఈతని రక్తంతో నా సోదరుడైన బకునికి పుష్కలంగా తర్పణం చేస్తాను. రాక్షసకంటకుడైన ఈ భీముడిని చంపి, ఈ రోజు నా సోదరునికి, స్నేహితునికి ఋణం తీర్చుకొని ఎంతో

మనశ్శాంతిని పొందుతాను. యుధిష్ఠిరా! మునుపు బకాసురుడు ఈ భీమసేనుని వదిలిపెట్టాడు. ఈ రోజు నీవు చూస్తుండగానే ఇతడిని తినేస్తాను. అగస్త్యుడు వాతాపిని తిని అరగించుకొన్నట్లుగా, మహాకాయుడైన ఈ వృకోదరుని చంపి, తిని, జీర్ణం చేసికొంటాను. వెంటనే యుధిష్ఠిరుడు 'ఇది జరుగదు' అని క్రోధంతో ఆ రాక్షసుని బెదిరించాడు. ఆ తర్వాత మహాబాహువైన భీముడు మిక్కిలి వేగంగా పది బారల పొడవున్న చెట్టును పెకలించి, దాని ఆకులన్నింటిని తొలగించాడు. అదేవిధంగా విజయుడైన అర్జునుడు ఒక్కరెప్పపాటు కాలంలో వజ్రాయుధాన్ని ముక్కలు చేసిన ఘనత గల గాండీవాన్ని నారిని సంధించి సిద్ధం చేశాడు.

అపుడు భీముడు జయశీలుడైన అర్జునుని వారించి, మేఘంలా గర్జిస్తున్న ఆ రాక్షసుని ఎదుర్కొని 'ఆగు ఆగు' అని అన్నాడు. అని పలికి మిక్కిలి కోపంతో పెదవి కొరుకుతూ బలవంతుడైన భీమసేనుడు పంచి బిగించి ఆ రాక్షసుని చేతిని చేతితో పిండిచేసి విడిచాడు. (వాడు పారిపోతే) వృక్షమే ఆయుధంగా గల భీముడు వేగంగా అతనివెంట పరుగెత్తాడు. ఇంద్రుడు వజ్రాయుధాన్ని విసిరినట్లుగా భీముడు యమదండంలా ఉన్న ఆ వృక్షాన్ని వేగంగా ఆ రాక్షసుని నెత్తిమీదవేశాడు. అయినప్పటికీ ఆ రాక్షసుడు యుద్ధంలో ఏమాత్రం చలించనట్లుగా కనబడ్డాడు. ఆ రాక్షసుడు మండుతున్న వజ్రాయుధంలా ఉన్న కట్టెను భీమునిపైకి విసిరాడు. దాన్ని భీముడు తన ఎడమకాలితో తన్నాడు. అది మళ్ళీ ఆ రాక్షసుని మీదికే వెళ్ళింది. అపుడు కిర్మీరుడు సాహసంతో వృక్షాన్ని పెకలించి దండపాణియైన యమునిలా క్రుద్ధుడై భీమని మీదికి పరిగెత్తాడు. పూర్వకాలంలో స్త్రీని కాంక్షించిన వాలిసుగ్రీవులకు వలె వారిరువురికి వృక్షయుద్ధం జరిగింది. మదించిన ఏనుగుల కుంభస్థలాలపై కలువరేకులు పడినట్లుగా వారిరువురి శిరస్సులమీద పడిన వృక్షాలు ముక్కలు ముక్కలుగా విరిగిపోయాయి.

అక్కడున్నటువంటి చాలాచెట్లు 'ముంజ'గడ్డిలా శిథిలమయ్యాయి. అవి చెల్లాచెదరైన నారచీరలువలె ఆ మహావనంలో ప్రకాశిస్తున్నాయి. రాక్షసముఖ్యుడైన కిర్మీరునికి, నరశ్రేష్ఠుడైన భీమునికి కొద్దిసేపు అలా వృక్షయుద్ధం జరిగింది. అనంతరం క్రుద్ధుడైన రాక్షసుడు యుద్ధానికి సిద్ధంగా ఉన్న భీమని మీదికి పెద్దరాయిని (శిలను) ఎత్తి విసిరాడు. దానికి భీముడు చలించలేదు. రాహువు సూర్యకిరణాలను తనబాహువులతో నివారించి, ఆక్రమించినట్లుగా రాతిదెబ్బకు కూడా చలించకుండా ఉన్న ఆ భీమని మీదికి రాక్షసుడు పరుగెత్తాడు. వారిద్దరు ఒకరినొకరు గట్టిగా పట్టుకొని, ఒకరి నొకరు లాక్కొంటూ బలిసిన ఆబోతుల్లా కలియబడ్డారు. గోళ్లు, దంష్ట్రలు (కోరలు) ఆయుధాలుగా గల గర్వించిన

పెద్దపులుల్లా వారిరువురికి భయంకర ప్రహారాలతో యుద్ధం జరిగింది. దుర్యోధనుని తిరస్కారం వల్ల, బాహుబలంవల్ల, ద్రౌపది ఓరకంటి చూపు వల్లను గర్వించి, భీముడు విజృంభించాడు. మదించిన ఏనుగు మదజలం కారుతున్న మరొక మదపుటేనుగును పట్టినట్లుగా అసహనంతో ఉన్న భీముడు ఆ రాక్షసుని తనబాహువులతో పట్టుకొన్నాడు. ఆ రాక్షసుడు కూడా భీమసేనుని పట్టుకొన్నాడు. భీముడు తనబలంతో అతనిని దూరంగా విసిరివేశాడు.

బలవంతులైన ఆ ఇరువురు పరస్పరం భుజాలతో గుద్దుకోవడంవల్ల వెదురుపేలిన శబ్దంలా ఘోరమైన శబ్దం వెలువడింది. ప్రచండవాయువు వేగంతో వృక్షాన్ని ఊపినట్లుగా వృకోదరుడు ఆ రాక్షసుని నడుము పట్టి పైకి లేపి గిరగిర త్రిప్పసాగాడు. భీముడు బలంగా అలా పట్టుకోగా, దుర్బలుడైన రాక్షసుడు ఆ యుద్ధంలో యథాశక్తిగా భీముని పట్టుకోసాగాడు. భీముడతనిని ఇటూ అటూ త్రిప్పసాగాడు. అనంతరం ఆ రాక్షసుడు అలసిపోవడం గమనించిన భీముడు పశువును త్రాడుతో బంధించినట్లుగా ఆ రాక్షసుని తన చేతులతో బంధించాడు. రకరకాల భేరీ నినాదాలవలె బిగ్గరగా అరుస్తున్న ఆ రాక్షసుని బలవంతుడైన భీముడు చాలాసేపు గిరగిరా త్రిప్పాడు. రాక్షసుడు అచేతను డయిపోయాడు. మరణావస్థకు చేరిన ఆ రాక్షసుని చూసి భీముడు తన చేతులతో అతనిని పట్టుకొని పశువును మర్దించినట్లు కొట్టాడు. వృకోదరుడు అతని కటిప్రదేశం మీద కూర్చొని అతనిని మోకాలితో పొడిచి, కంఠాన్ని చేతులతో నొక్కాడు. శరీరావయవాలన్నీ శిథిలమై, కనుగ్రుడ్లు తిరగబడిన ఆ రాక్షసుని నేలపై త్రిప్పుతూ, భీముడు ఇలా అన్నాడు. 'ఓరీ పాపీ! నీవు యమసదనానికి వెళ్ళి కూడా బకహిడింబుల కన్నీటిని తుడవలేవు.' అని పలికి వీరపురుషుడైన భీముడు క్రోధోద్విగ్నమైన మనస్సుతో వస్త్రాభరణాలు జారి మతిభ్రమ చెంది, అసువులు బాసిన ఆ రాక్షసుని విడిచిపెట్టాడు. మేఘంలా నల్లగా ఉన్న ఆ రాక్షసుని భీముడు చంపగానే, రాజకుమారులైన పాండవులు ద్రౌపదిని ముందుంచుకొని, భీముని అనేక గుణాలతో ప్రశంసించి ఆనందించారు. అనంతరం అక్కడనుండి ద్వైతవనానికి వెళ్ళారు. రాజా! ఈ విధంగా ధర్మరాజు యొక్క మాటవల్ల భీమసేనుడు యుద్ధంలో కిర్మీరుని సంహరించాడు. అనంతరం విజయశీలుడైన ధర్మరాజు ఆ వనాన్ని నిష్కంటకంగా చేసికొని ద్రౌపదితో పాటు అక్కడే నివసించాడు. వారంతా ద్రౌపదిని ఊరడించి, ఆనందించి, వృకోదరుని ప్రశంసించారు. భీముని బాహుబలంచేత నుగ్గునుగ్గైన ఆ రాక్షసుడు మరణించినపిదప, నిష్కంటకమైన ఆ వనాన్ని ఆ వీరులు క్షేమంగా ప్రవేశించారు. నేను వెళుతూ దారిలో భీముని బలంవల్ల చచ్చి, భయంకరంగా ఆ వనంలో పడి ఉన్న

దుర్మార్గుడైన ఆ రాక్షసుని చూశాను. భారతా! అక్కడకు వచ్చిన బ్రాహ్మణులు చెప్పగా భీముడు చేసిన ఈ గొప్ప పనిని నేను విన్నాను. ఇది విని ధృతరాష్ట్రుడు అదే ఆలోచనలో ఉండి దుఃఖంతో దీర్ఘంగా నిట్టూర్చాడు.

12. శ్రీకృష్ణాదుల ఆగమనము.

పాండవులు వనవాసానికి వెళ్లారని, భోజ, వృష్ణి అంధక వీరులంతా (ఆ మహావనంలోకి వచ్చి) దుఃఖపీడితులైన పాండవులను కలుసుకొన్నారు. పాంచాలదాయాదుడైన ధృష్టద్యుమ్నుడు, చేది రాజయిన ధృష్టకేతువు, మహాబలవంతులై లోకవిఖ్యాతులైన కేకయరాజకుమారులూ క్రోధంతో, అసహనంతో ధార్తరాష్ట్రులను నిందిస్తూ వనంలో పాండవులను చూడటానికి వచ్చారు. 'మేమేం చెయ్యాలి' అని అడిగారు. ఆ క్షత్రియశ్రేష్ఠులంతా వాసుదేవుని ముందుంచుకొని ధర్మరాజు చుట్టూ చేరారు. శ్రీకృష్ణుడు విషాదగ్రస్తుడై ధర్మరాజుతో ఇలా అన్నాడు. 'దుర్మార్గులైన దుర్యోధన, కర్ణ, శకుని దుఃశాసనులయొక్క రక్తాన్ని ఈ భూమి త్రాగుతుంది. యుద్ధంలో ఈ నలుగురిని చంపి, ఇంకా వీరిని అనుసరించిన రాజులందరిని, ఇతరులనూ జయించి ధర్మరాజును రాజ్యాభిషిక్తుని చేద్దాం. ఇతరులను మోసగించి తాను సుఖపడేవాడు చంపదగినవాడే. ఇది సనాతనమైన ధర్మమే.' పాండవుల అవమానం చేత కోపించి జనులందరిని భస్మం చేసేటట్లున్న జనార్దనుని అర్జునుడు శాంతింపజేశాడు. కోపించి కేశవుని చూసి, అర్జునుడు పూర్వదేహంలో మహాత్ముడైన అతని పనులను ప్రశంసింప నారంభించాడు. పురుషోత్తముడు, అప్రమేయుడు, సత్యస్వరూపుడు, అమిత తేజస్వి, ప్రజాపతులకే పతి, లోకాన్నింటికి రక్షకుడు, మహాబుద్ధిమంతుడు ఐన శ్రీమహావిష్ణువును అర్జునుడు ఇలా స్తుతించాడు.

'శ్రీకృష్ణా! పూర్వకాలం నీవు సాయంగృహముని రూపంలో గంధమాదనపర్వతంమీద పదివేల సంవత్సరాలు నివసించావు. (అతడే నారాయణ ఋషి). కృష్ణా! పూర్వకాలం నీవు ఈ భూమిమీద పదునొకండు వేల సంవత్సరాలు కేవలం నీటిని మాత్రమే స్వీకరిస్తూ పుష్కర తీర్థాల్లో నివసించావు. మధుసూదనా! విశాలా నగరంలోని బదరికాశ్రమంలో ఒక్కపాదం మీద నిలబడి, బాహువులు రెండూ పైకి చాచి, గాలిని భక్షిస్తూ వంద సంవత్సరాలు ఉన్నావు. కృష్ణా! సరస్వతీ నదీతీరంలో పన్నెండు సంవత్సరాల సత్రయాగంలో ఉత్తరీయాన్ని కూడా విడిచిపెట్టి, శరీరంలోని నాడులు కనబడేటంతగా కృశించావు. కృష్ణా! పుణ్యజనులకు నివాసయోగ్యమైన ప్రభాసతీర్థంలో శౌచసంతోషాది నియమాలు పాటిస్తూ వెయ్యి దివ్య సంవత్సరాలు ఒకేపాదంతో నిలచి ఉన్నావు. లోకులను తపస్సులో

ప్రవర్తింపజేయాలని నీవలా చేసినట్లు వ్యాసుడు నాకు చెప్పాడు. కేశవా! కృష్ణా! నీవు క్షేత్రజ్ఞుడవు. సర్వభూతాలకు ఆద్యంతాలు నీవే. తాపసులకు అధిష్ఠానం నీవు. నీవు యజ్ఞస్వరూపుడవు. సనాతనుడవు. కృష్ణా! భూమిపుత్రుడు అహంకారి అయిన నరకుని చంపి, అదితి కుండలాలు తెచ్చి, అశ్వమేధయజ్ఞానికి అశ్వాన్ని విడిచావు. అన్నిలోకాలను జయించిన నీవు లోకేశ్వరుడవు. నీవు చేసే పనులకు అడ్డువచ్చిన దైత్యులను, దానవులను యుద్ధంలో సంహరించావు. కేశవా! అనంతరం శచీపతి ఇంద్రునికి స్వర్గాధిపత్యాన్ని ఇచ్చి, నీవు మనుష్యులలో జన్మించావు. పురుషోత్తమా! నీవు నారాయణుడవు. విష్ణువుగా వ్యక్తమయినావు. బ్రహ్మ, సూర్యుడు, చంద్రుడు, ధర్మం, ధాత, యముడు, అగ్ని, వాయువు, కుబేరుడు, రుద్రుడు, కాలం, ఆకాశం, పృథివి, దిక్కులు, చరాచరగురువగు సృష్టికర్త అజుడవు నీవే. మధుసూదనా! శ్రీకృష్ణా! నీవు చైత్రరథవనంలో అనేక యజ్ఞాలు చేశావు. నీవు దేవతలందరికి శిరోమణివి. గొప్ప తేజస్వివి. అందరూ చేరదగిన ఉత్కృష్టస్థానం నీవే. జనార్దనా! అపుడు నీవు చేసిన ఒక్కొక్క యజ్ఞంలో ఒకకోటి స్వర్ణముద్రికలు దక్షిణలుగా పరిపూర్ణంగా ఇచ్చావు. యదునందనా! నీవు అదితికి పుత్రునిగ జన్మించి, ఇంద్రునికి తమ్ముడవై, సర్వవ్యాపకుడవై విష్ణు వనే పేర ఖ్యాతు డవయ్యావు. కృష్ణా! వామనావతారసమయంలో బాలుడవై స్వర్గలోకాన్ని, అంతరిక్షాన్ని, భూలోకాన్ని నీతేజస్సుచే మూడు అడుగులు వేసి ఆక్రమించావు. భూతాత్మా! స్వర్గాన్ని, అంతరిక్షాన్ని చేరి, సూర్యుని రథంపై ఉండి నీ తేజస్సుచే సూర్యుని ప్రకాశింపజేశావు. అనేకవేల జన్మలలో ఆయా జన్మలయందు పుట్టిన అధర్మాసక్తి గల వందలమంది రాక్షసులను నీవు చంపావు. కృష్ణా! నీవు మురాసురుడు వేసిన లోహమయపాశాలను త్రెంచావు. నిసుంద, నరకులను చంపావు. ప్రాగ్జ్యోతిషపురానికి క్షేమంగా ఉండే మార్గాన్ని మళ్ళీ ఏర్పరిచావు.

కృష్ణా! జారూథినగరంలో ఆహుతి, క్రాధుడు, అనుచర సహితుడైన శిశుపాలుడు, జరాసంధుడు, శైబ్యుడు, శతధన్వుడు అనేవాళ్లను జయించావు. అదేవిధంగా మేఘంవలె గర్జించే, సూర్యునిలా ప్రకాశించే రథంతో యుద్ధంలో రుక్మిని జయించి భోజకన్య రుక్మిణిని పట్టమహిషిగా పొందావు. కృష్ణా! నీ కోపం వల్ల ఇంద్రద్యుమ్నుడు చంపబడ్డాడు. యవన జాతీయుడగు కసేరుమంతుడు, సౌభపతి శాల్వుడు యమలోకానికి వెళ్ళారు. శాల్వుని సౌభవిమానాన్ని నీవు పడగొట్టావు. ఈ విధంగా వీరందర్నీ యుద్ధంలో చంపావు. ఇంకా ఇతరులను గురించి కూడ చెప్తాను విను. ఇరావతీ నదీతీరంలో కార్తవీర్యార్జునునితో సమానమైన భోజుని యుద్ధంలో చంపావు. గోపతి, తాలకేతువులు నీచేతిలో చచ్చారు. జనార్దనా! పవిత్రమై, ఋషులకిష్టమై, భోగధనాలు కల ద్వారకను స్వాధీనంచేసికొని,

చివరకు సముద్రంలో విలీనం చేస్తావు. మధుసూదనా! నీలో క్రోధం లేదు. మాత్సర్యం లేదు. అసత్యం లేదు. దాశార్హా! నీలో క్రూరత్వం లేదు. కుటిలత లేదు. అచ్యుతా! మందిరమధ్యంలో స్వతేజస్సుతో ప్రకాశిస్తూన్న నిన్ను చేరి ఋషు లందరూ అభయాన్ని కోరుతున్నారు. మధుసూదనా! ప్రలయకాలంలో సర్వభూతాలను సంక్షేపించి స్వయంగా జగత్తును ఆత్మస్వరూపంగా చేసికొని ఉంటావు. వార్ష్ణేయా! సృష్ట్యారంభంలో నీ నాభికమలం నుండి బ్రహ్మ ఉద్భవించాడు. చరాచరగురువైన ఆ బ్రహ్మ సృష్టియే ఈ జగత్తంతా. నీ నాభికమలం నుండి పుట్టిన బ్రహ్మను మధుకైటభు లనే భయంకరదానవులు చంపడానికి ప్రయత్నించారు. వారి దారుణాన్ని చూసి కోపించి నీ లలాటం నుండి శూలపాణి, త్రిలోచనుడూ అయిన శివుడు ఆవిర్భవించాడు. ఈ విధంగా బ్రహ్మ, శంకరులిరువురూ నీ శరీరంనుండి ఉద్భవించినవారే. వారిరువురూ నీ ఆజ్ఞను పాలించేవారే అని నారదుడు నాకు చెప్పాడు. కృష్ణా! పూర్వం నీవు చైత్రరథవనంలో భూరిదక్షిణలతో మహాసత్రయాగాన్ని చేశావు. ఇతరులెవరూ ఈవిధంగా మునుపు చెయ్యలేదు. ముమ్మందు చేయలేరు కూడ. దేవా! పుండరీకాక్షా! బాలుడవైనా నీవు మహాబలవంతుడవు. నిత్యం నీకు బలదేవుడు తోడుంటాడు. బాల్యంలో నీవుచేసిన పనులు ఎవరూ చేయలేరు. మునుపెవ్వరూ చెయ్యలేదు. నీవు బ్రాహ్మణులతో పాటుగ కైలాసపర్వతంపై కూడా నివసించావు.

వైశంపాయనుడిలా అన్నాడు. 'శ్రీకృష్ణుని ఆత్మ స్వరూపాన్ని అర్జునుడు ఆ మహాత్మునితో ఈ విధంగా చెప్పి ఊరకున్నాడు. అనంతరం జనార్దనుడు పార్థునితో ఇలా అన్నాడు. పార్థా! **నీవు నావాడవు. నేను నీవాడనే. నావాళ్లంతా నీవాళ్లే. నిన్ను ద్వేషించేవాడు నన్ను ద్వేషించువాడే. నిన్ను అనుసరించేవాడు నన్ననుసరించువాడే.*** దుర్ధర్షా! నీవు వరుడవు. నేను నారాయణుడనగు శ్రీహరిని. ఈ సమయంలో నరనారాయణ ఋషులమైన మన మిరువురమూ ఈ లోకంలోకి వచ్చాము. భరతశ్రేష్ఠా! నాకంటే నీవు అన్యుడవు కావు. నీకంటె నేను ఇతరుడను కాను. మన ఇద్దరికి భేదాన్ని తెలియడం శక్యంకాదు.' మహాత్ముడైన కేశవుడు ఈ విధంగా చెప్పితే, వీరులైన ఆ రాజులంతా ఆశ్చర్యపోయారు. వీరులైన ధృష్టద్యుమ్నాది సోదరులతో కూడి ఉన్న పాంచాలి క్రుద్ధురాలై, తన సోదరులతో కూర్చొని ఉన్న పుండరీకాక్షుని సమీపించి, రక్షణను కోరుతూ రక్షకుడైన శ్రీకృష్ణునితో ఇలా అంది. 'పూర్వకాలం ప్రజాసృష్టికి ప్రారంభంలో సర్వలోకాలను సృష్టించినది నీవే నని, నీవు ప్రజాపతి వని అసిత-దేవలమహర్షి చెప్పాడు. మధుసూదనా! నీవు

---

* **మమైవ త్వం తవైవాహం యే మదీయాస్తవైవ తే।**
యస్త్వాం ద్వేష్టి స మాం ద్వేష్టి యస్త్వామను స మామను ॥ 45

96354

విష్ణుడవు. నీవే యజ్ఞానివి. యజమానుడవు నీవే. యజనయోగ్యుడవూ నీవే అని పరశురాముడు చెప్పాడు. పురుషోత్తమా! ఋషులు నిన్ను సహనస్వరూపుడ వని, సత్య స్వరూపుడ వని చెపుతున్నారు. సత్యంనుండి ఏర్పడిన యజ్ఞస్వరూపుడవు నీవని కశ్యపుడు చెప్పాడు. భూతభావనా! భూతేశా! సాధ్యదేవతలకు, కళ్యాణకారి రుద్రులకు నీవే అధీశ్వరుడవు అని నారదుడు చెప్పాడు. నరవ్యాఘ్రా! బాలుడు ఆటవస్తువులతో ఆడుకొన్నట్లుగా, నీవు బ్రహ్మ, శంకరుడు, ఇంద్రుడు మున్నగు దేవతా సమూహాలతో మళ్ళీ మళ్ళీ ఆడుకొంటూ ఉంటావు. ప్రభూ! స్వర్గలోకం నీ శిరస్సుతో నిండిపోయింది. భూమి నీ పాదాలతో నిండిపోయింది. ఈ లోకాలన్నీ నీ ఉదరస్వరూపమైనవి. నీవు సనాతనపురుషుడవు. విద్య, తపస్సుల చేత మిక్కిలి తపించి తపస్సుచే పవిత్రమైన అంతఃకరణం కల్గి ఆత్మదర్శనం చేత తృప్తినొందిన మహర్షులకు నీవు పరమశ్రేష్ఠుడవు. (లక్ష్యమగు సత్స్వరూపుడవు.) పురుషశ్రేష్ఠా! యుద్ధంలో వెనుకడుగు వేయని పుణ్యాత్ములూ, సర్వధార్మికులూ అయిన రాజర్షులకు నీవే గతి (ప్రాప్యస్థానం). నీవే ప్రభుడవు. నీవు సర్వవ్యాపకుడవు. ప్రాణులన్నింటియందు చైతన్య స్వరూపుడవై సంచరిస్తున్నావు. లోకాలు, లోకపాలురు, నక్షత్రాలు, పదిదిక్కులు, ఆకాశం, సూర్యచంద్రులు అన్నీ నీయందే నిలిచి ఉన్నాయి. మహాబాహూ! భూలోకంలోని ప్రాణులకు మరణ ధర్మం, స్వర్గలోకవాసులకు అమరత్వమూ, సమస్తజగత్కార్యమూ నీయందే నిలిచి ఉన్నాయి.

మధుసూదనా! నీ పట్ల గల ప్రీతితో నేను నా కష్టాన్ని చెప్పుకొంటున్నాను. దివ్యులైన, మనుష్యులైన సర్వప్రాణులకు నీవే ఈశ్వరుడవు. భగవంతుడా! కృష్ణా! పాండవులకు భార్య, నీకు ఇష్టురాలు, ధృష్టద్యుమ్నుని సోదరి అయిన నావంటి స్త్రీ సభకు ఎలా లాగబడింది? స్త్రీ సహజమైన ఋతుకాలంలో ఉన్న రక్తంతో తడిసిన ఏకవస్త్రనై, భయంతో కంపిస్తూ, దుఃఖిస్తూన్న నేను కురుసభలోకి బలాత్కారంగా లాక్కురాబడ్డాను. రాజులందరితో నిండిన సభలో రజస్రావంతో తడిసిన నన్ను చూసి పాపాత్ములైన ధార్తరాష్ట్రులు బిగ్గరగా నవ్వారు. మధుసూదనా! పాండుపుత్రులు, పాంచాలరాజులు, వృష్ణివంశీయులు జీవించి ఉండగానే ఆ ధృతరాష్ట్రపుత్రులు దాసీభావంతో నన్ను అనుభవించాలని కోరుకొన్నారు. శ్రీకృష్ణా! నేను భీష్మ ధృతరాష్ట్రులకు ధర్మసమ్మతమైన కోడలిని. అటువంటి నన్ను బలవంతంగా దాసిని చేశారు. యశస్వినీ అయిన తమ ధర్మపత్నిని శత్రువులు బాధిస్తూండగా చూస్తూ ఊరకున్న మహాబలవంతులు, యుద్ధంలో నిపుణులూ అయిన ఈ పాండవులనే నేను నిందిస్తున్నాను. జనార్దనా! నీచు లైన ధార్తరాష్ట్రులు నన్ను అవమానిస్తున్నా సహిస్తూ కూర్చున్న ఈ భీమసేనుని బలమూ, ఈ అర్జునుని గాండివమూ వ్యర్థమే. తాము

తక్కువ బలం కల వారైనప్పటికీ, భార్యను రక్షించడం అనేది ఎల్లపుడూ సత్పురుషులైన భర్తలు ఆచరించే శాశ్వత మైన ధర్మమార్గం. భార్యను రక్షిస్తే సంతానం సురక్షితంగా ఉంటుంది. సంతానాన్ని రక్షిస్తే, తాను సురక్షితంగా ఉంటాడు. తానే (భర్తే) భార్యయందు జన్మిస్తాడు. అందుకే ఆమెను 'జాయా' అని అంటారు. భార్య కూడా భర్తను రక్షించాలి. కాకుంటే అతడు ఆమెయందు ఎలా పుడతాడు? ఈ పాండవులు తమను శరణుజొచ్చిన వారినెవ్వరినీ ఎప్పుడూ కాదని విడిచిపెట్టటం లేదు. కాని శరణాగతురాలనైన నాపట్ల మాత్రం దయ చూపలేదు. జనార్దనా! నా ఈ ఐదుగురు భర్తలవల్ల మహాతేజస్వులైన ఐదుగురు కుమారులు పుట్టారు. వారిని చూడటం కొరకైనా వీరు నన్ను రక్షించాలి. కృష్ణా! యుధిష్ఠిరుని వల్ల ప్రతివింధ్యుడు, వృకోదరుని వల్ల సుతసోముడు, అర్జునుని వల్ల శ్రుతకీర్తి, నకులుని వల్ల శతానీకుడు, సహదేవుని వల్ల శ్రుతకర్మ జన్మించారు. వీరంతా సత్యపరాక్రములు - నీకు ప్రద్యుమ్నుడు ఎట్టివాడో, మహారథులైన వీరంతా కూడ అట్టివారే. వీరంతా ధనుర్విద్యలో శ్రేష్ఠులు. యుద్ధంలో శత్రువులచే జయింపశక్యంగాని వారూను. దుర్భలులైన ధార్తరాష్ట్రులను ఎందుకు సహిస్తున్నారు?

వారు అధర్మంగా రాజ్యాన్ని అపహరించారు. వీరందర్నీ దాసులుగా చేసికొన్నారు. రజస్వలనై ఏకవస్త్రగా ఉన్న నన్ను సభలోకి ఈడ్చుకొని వచ్చారు. మధుసూదనా! అర్జునుని గాండీవాన్ని నీవు, భీమార్జునులు తప్ప, వేరొకరెవరూ కనీసం ఎక్కుపెట్టలేరుకదా! అయినా మీరు నన్ను రక్షించటం లేదు. కృష్ణా! ఇంకా దుర్యోధనుడు జీవించి ఉన్నాడంటే అది భీమసేనుని బలానికే అవమానం. పార్థుని పౌరుషానికే అవమానం. మధుసూదనా! మునుపు బాల్యంలో బ్రహ్మచర్యవ్రతం పాటిస్తూ అధ్యయనం చేస్తూ ఎవరినీ హింసించని ఈ పాండవులను తల్లితో పాటుగా రాజ్యంనుండి బయటికి పంపించారు. పాపాత్ముడైన దుర్యోధనుడు భీమసేనుని భోజనంలో నూతనమై, తీక్ష్ణమై, రోమాంచకమైన కాలకూటవిషాన్ని ఎక్కువ పరిమాణంలో కలిపి చంపబోయారు. జనార్దనా! పురుషోత్తమా! మహాబాహూ! భీమసేనుడికి ఆయుర్దాయం ఉండటంవల్ల, ఆ విషాన్నం జీర్ణం చేసుకొని ఎటువంటి వికారాన్ని పొందలేదు. కృష్ణా! ప్రమాణకోటి తీర్థంలో ప్రమాదరహిత మనే విశ్వాసంతో నిద్రిస్తున్న భీమసేనుని బంధించి గంగానదిలోకి విసిరి, దుర్యోధనుడు హస్తినపురానికి వెళ్ళిపోయాడు. ఆ ప్రవాహంలో కొట్టుకుపోతూ, మెలకువ వచ్చాక భీముడు తన బంధాలను త్రెంచుకొని బయటపడ్డాడు. (నిద్రిస్తున్న) భీమసేనుని సర్వావయవాలమీద ప్రాణాంతకయిన విషం గలిగిన కృష్ణసర్పాలచేత కరిపించాడు. అయినప్పటికీ భీమసేనుడు మరణించలేదు. నిద్రనుండి మేల్కొన్న భీమసేనుడు ఆ సర్పా లన్నింటిని విసిరికొట్టాడు. దుర్యోధనుడు

భీముని కిష్టుడైన సారథిని కూడ తన పెడచేతితో చంపాడు. ఇంకా, వారణావతంలో తల్లితోపాటుగ ఈ పాండవులు నిద్రిస్తూండగా, ఆ ఇంటికి నిప్పుపెట్టారు. దుర్మార్గుడైన దుర్యోధనుడు కాక, వేరొకడెవడు ఇంతటి దుష్కృత్యాన్ని చేయగలడు? ఆ సమయంలో పూజ్యురాలైన కుంతి ఏడుస్తూ పాండవులతో 'పెద్ద ప్రమాదంలో చిక్కుకున్నాం, అగ్ని ఇంటి చుట్టూ వ్యాపించింది.' అని విలపించింది. 'అయ్యో! చచ్చాను. ఈ అగ్ని ఎలా చల్లారుతుంది? అనాథ అయిన నేను ఈ పిల్లలతో బాటుగా మరణిస్తాను' అని అనుకొంది.

అపుడు వాయువేగం వంటి పరాక్రమం గల మహాబాహువైన వృకోదరుడు తన తల్లిని, సోదరులను ఊరడించాడు. 'పక్షిరాజైన గరుత్మంతునిలా నేను ఎగురుతాను. మీరు భయపడవద్దు' అన్నాడు. ఇలా చెప్పి కుంతిని ఎడమతొడమీద, ధర్మరాజును కుడితొడమీద, నకులసహదేవులను భుజాలమీద, అర్జునుని నడ్డిమీద ఉంచుకొని తేజస్వి, బలవంతుడూ అయిన భీమసేనుడు ఒక్కసారిగా ఎగిరి ఆ అగ్నినుండి తల్లిని, సోదరులను రక్షించాడు. ఆ విధంగా అగ్నిప్రమాదం నుండి బయటపడ్డ పాండవులు తల్లితో పాటు బయలుదేరి ఆ రాత్రి మహారణ్యంలో నడుస్తూ హిడింబ వనం దగ్గరకు వెళ్ళారు. అప్పటికి అలసిపోయి మిక్కిలి కష్టంలో ఉన్న పాండవులు తల్లితోపాటుగా అక్కడ నిద్రించారు. అలా నిద్రిస్తున్నవారి దగ్గరికి హిడింబ అనే రాక్షసి వచ్చింది. నేలపై తల్లితో పాటుగా నిద్రిస్తున్న పాండవులను చూసి, మదనపీడితయై భీమసేనుని కామించింది. అటుపై ఆమె భీమునిపాదాలను తన ఒడిలో ఉంచుకొని ఆనందించి తను మృదువైన చేతితో పాదాలను ఒత్తింది. ఆమె స్పర్శకు బలవంతుడు, సత్యవిక్రముడు, సాటిలేని రూపంగల భీమసేనుడు మేల్కొని 'సుందరీ! నీకిక్కడ ఏం కావాలి?' అని ఆమెను అడిగాడు. భీముడీ విధంగా అడగ్గా, కామరూపిణి అయిన ఆ రాక్షసి మహాత్ముడైన భీమసేనునితో ఇలా అంది. 'తొందరగా ఇక్కడనుండి పారిపొండి. నా సోదరుడు చాల బలవంతుడు. మిమ్మల్ని చంపడానికి అతడు వస్తాడు. అందువల్ల వెళ్ళండి. ఆలస్యం చేయకండి'. ఆ మాటలు విన్న భీముడు అభిమానపూర్వకంగా ఇలా చెప్పాడు – నేను భయపడను. ఆ రాక్షసుడిక్కడకు వస్తే, నేనే అతనిని చంపుతాను'. వారి సంభాషణ విని, ఆ రాక్షసాధముడు భయంకరమైన రూపంతో బిగ్గరగా అరుస్తూ అక్కడకి వచ్చాడు. రాక్షసు డిలా అన్నాడు – 'హిడింబా! నీవెవరితో మాట్లాడుతున్నావు? అతనిని నాదగ్గరికి తీసికొనిరా. మనం తిందాం. ఇక ఆలస్యం చేయవద్దు'. మంచి మనస్సుతో ఆమె దయతో భీమునిపట్ల ప్రేమవల్ల ఆ మాటలను చెప్పాలని భావించలేదు. అపుడు నరభక్షకు డైన ఆ రాక్షసుడు ఘోర మైన గర్జనలు చేస్తూ వేగంగా భీమసేనుడి దగ్గరకు వచ్చాడు. క్రుద్ధు డైన ఆ రాక్షసుడు

వేగంగా వచ్చి తన ఒక చేతితో భీమసేనుడి చేతిని పట్టుకొన్నాడు. ఇంద్రుని వజ్రాయుధంలా దృఢంగా ఉన్న భీముని పిడికిలితో ఆ రాక్షసుడు ఒక్కగుద్దు గుద్దాడు. రాక్షసుడు తన చేతిని గట్టిగా పట్టిలాగడం భీముడు సహింపలేకపోయాడు. వృకోదరుడు క్రోధోద్రిక్తు డయ్యాడు. అపుడు ఆ హిడింబ భీమసేనులకు వృత్రాసురదేవేంద్రులకు వలె భయంకరమైన గొప్ప యుద్ధం జరిగింది. భీముడు చాలాసేపు ఆ రాక్షసునితో రణక్రీడలాడి, చివరకు నిర్బలుడైన అతనిని సంహరించాడు.

ఈ విధంగా హిడింబుని చంపిన తర్వాత భీముడు హిడింబను స్వీకరించి, తన సోదరులతో పాటుగా అక్కడ నుండి బయలుదేరాడు. అనంతరం హిడింబకు ఘటోత్కచుడు జన్మించాడు. శత్రుసంతాపకు లైన పాండవులంతా తల్లితోపాటుగ బ్రాహ్మణసమూహా లుండే ఏకచక్రాపురం వైపుకు వెళ్ళసాగారు. వారు వెళ్ళేటపుడు వారి ప్రియాన్ని, హితాన్నీ కోరుకొనే వ్యాసమహర్షి వారిని పరామర్శించాడు. అనంతరం పాండవులు కఠినమైన నియమాల్ని పాటిస్తూ ఏకచక్రాపురానికి వెళ్లారు. అక్కడకూడా బకుడనే పేరుగల మహాబలవంతుడు, హిడింబునితో సమానమైన భయంకరుడూ, నరభక్షకుడూ అయిన రాక్షసుని గురించి తెలుసుకొన్నారు. భీముడు భయంకరుడైన ఆ రాక్షసుని చంపి సోదరులందరితోపాటు ద్రుపదుని నగరానికి వెళ్లాడు. కృష్ణా! భీష్మకమహారాజు కూతురైన రుక్మిణిని నీవు జయించుకొన్నట్లుగానే అక్కడే ఉంటూన్న సవ్యసాచి అర్జునుడు నన్ను జయించుకొన్నాడు(పొందాడు). మధుసూదనా! ఈ విధంగా అర్జునుడు ఇతరు లెవ్వరికీ సుకరం కాని గొప్పపని చేసి, గొప్పయుద్ధం చేసి స్వయంవరంలో నన్ను గెలుచుకొన్నాడు.

కానీ ఇపుడు కృష్ణా! ఈ విధంగా అనేక కష్టాలను అనుభవిస్తూ, దుఃఖిస్తూ పూజ్యురాలైన కుంతితోడు కూడా లేకుండా ధౌమ్యుని ముందుంచుకొని వనంలో నివసిస్తున్నాను. సింహవిక్రములై, శత్రువులకంటె మిక్కిలి బలం కల వీరు, నీచులైన శత్రువులు నన్ను అవమానిస్తూండగా, ఉపేక్షించి ఎలా ఉన్నారు? పాపకర్ములై, దుర్బలు లైన శత్రువుల వల్ల ఇటువంటి దుఃఖాలను సహిస్తూ, చాలకాలంగా చింతాగ్నితో రగిలిపోతున్నాను. దివ్యమైన యజ్ఞవిధిచే గొప్పవంశంలో జన్మించిన దాన్ని కదా! పాండవులకు ప్రియమైన భార్యను, పాండు మహారాజుకు కోడల్ని గదా ! కృష్ణా! అటువంటి ఉత్తమసాధ్వి నయిన నన్ను పంచ పాండవులు చూస్తూండగా జుట్టుపట్టి లాగారు.' అని చెప్పి, మృదువుగా మాట్లాడే ద్రౌపది తామరపువ్వులా ప్రకాశించే తన చేతితో ముఖాన్ని కప్పుకొని ఏడవసాగింది. పాంచాలరాజకుమారి ద్రౌపది శుభలక్షణాలు గల వక్షోజాలపై దుఃఖంతో కన్నీటి బిందువులను వర్షింపసాగింది. తన కళ్ళను తుడుచుకొంటూ, మాటిమాటికీ నిట్టూరుస్తూ, క్రుద్ధురాలై

దుఃఖంతో పూడుకుపోయిన కంఠంతో ఇలా మాట్లాడింది. 'మధుసూదనా! (నన్ను రక్షించడం కొరకు) నా కొరకు నాభర్తలు లేరు, పుత్రులు లేరు, బంధువులూ లేరు, సోదరులూ లేరు, నాతండ్రి కూడా లేడు, నీవు కూడా లేవు. ఆ నీచులు నన్ను అవమానిస్తూంటే, ఏమాత్రం దుఃఖం లేనివారిలా, వీళ్ళంతా నన్ను ఉపేక్షించారు. అపుడు నన్ను చూసి కర్ణుడు నవ్వాడు. దానివల్ల కలిగిన దుఃఖం నాహృదయంలో ఇంకా శాంతించలేదు. కృష్ణా! కేశవా! **నీకు నాతో ఉన్న బంధుత్వం, నా పుట్టుకపై నీకున్న గౌరవం, సఖ్యము రక్షింపగల సామర్థ్యం** - ఈ నాలుగు కారణాలచేత నీవు నన్నెపుడూ రక్షిస్తూ ఉన్నావు.'

ఆ వీరుల సమూహంలో శ్రీకృష్ణుడు ఆమెతో ఇలా అన్నాడు. 'భామినీ! నీవు ఎవరిపట్ల కోపంగా ఉన్నావో, వారంతా అర్జునుని బాణాల దెబ్బలకు నేలకొరుగుతారు. వారి స్త్రీలు రక్తపు మడుగులో చచ్చిపడి ఉన్న తమ భర్తలను చూసి ఈ విధంగానే ఏడుస్తారు. పాండవులకొరకు చేయవలసినదంతా చేస్తాను. నీవు దుఃఖించకు. ద్రౌపదీ! నేను నీకు నిజంగా మాట ఇస్తున్నాను. నీవు ఈ రాజులకు మహారాజ్ఞివి అవుతావు. ఆకాశం క్రింద పడినా, హిమవత్పర్వతం కరిగిపోయినా, భూమి ముక్కలైనా, సముద్రాలు ఇంకిపోయినా నామాట వృథా కాదు.' మహారాజా! తనమాటలకు సమాధానంగా కృష్ణుడు ఆ విధంగా అంటే విని, ద్రౌపది తన భర్తల మధ్యలో ఉన్న అర్జునుని వైపు ఓరకంట చూసింది. అపుడు అర్జునుడు ద్రౌపదితో ఇలా అన్నాడు. 'వరవర్ణినీ! ఏడవవద్దు. మధుసూదనుడు చెప్పినట్లుగానే తప్పక జరుగుతుంది. మరొకలా జరుగదు.' ధృష్టద్యుమ్నుడు ఇలా అన్నాడు - నేను ద్రోణుని చంపుతాను. శిఖండి భీష్మపితామహుని చంపుతాడు. భీమసేనుడు దుర్యోధనుని చంపుతాడు. అర్జునుడు కర్ణుని చంపుతాడు. సోదరీ! బలరామకృష్ణుల నాశ్రయించి, యుద్ధంలో మనం అజేయులంగా ఉంటాం. యుద్ధంలో ఇంద్రుడే మనల్ని ఓడించలేడు. ఇక దుర్యోధనుడెంత?'

ధృష్టద్యుమ్నుడిలా అనగానే, పాండవీరులంతా శ్రీకృష్ణుని వైపుకి తిరిగారు. వారందరిలో ఉన్న శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు.

13. ద్యూతసమయమున తాను రాకపోవుటకు శ్రీకృష్ణుడు కారణము చెప్పుట.

రాజా! నేను నీకు దగ్గరలో ద్వారకలోనే ఉండి ఉంటే నీవింత కష్టం పొంది ఉండే వాడివికాదు. కౌరవులు, ధృతరాష్ట్రుడు, రాజైన దుర్యోధనుడు నన్ను పిలవకున్నా, నేను వచ్చి ఉండేవాడిని. జూదం వల్ల కలిగే దోషాల్ని చూపించి, ఆ జూదాన్ని ఆపేవాడిని. నేను

మీకోసం భీష్మ, ద్రోణ, కృప, బాహ్లీక, ధృతరాష్ట్రులను రప్పించి 'రాజేంద్రా! నీపుత్రులు జూదం ఆడరాదు' అని చెప్పేవాణ్ణి. జూదంవల్ల కలిగే అనర్థాలను చెప్పేవాణ్ణి. ఆ జూదం కారణంగానే మీరు రాజ్యహీను లయ్యారు. ఆ ద్యూత దోషాలవల్లనే పూర్వకాలంలో వీరసేనపుత్రుడైన నలమహారాజు రాజ్యభ్రష్టు డయ్యాడు. నరేశ్వరా! ఈ జూదం కారణంగా ఊహించని జూదంలోని వినాశం కలుగుతుంది. అందువల్ల ఆ జూదప్రసంగాన్ని గురించి, సాతత్యదోషం గురించి ఉన్నదున్నట్లుగా వర్ణిస్తాను. **స్త్రీలపట్లకాంక్ష, జూదం, వేట, మద్యపానం ఈ నాలుగూ కామం వల్ల కలిగిన దుఃఖాలుగా చెప్పబడ్డాయి. ఈ నాలుగింటి వల్ల మానవుడు ఐశ్వర్యభ్రష్టు డౌతాడు.** శాస్త్రకోవిదులు అన్నిచోట్ల ఈ నాల్గింటిని నిందింపదగినవిగా పేర్కొన్నారు. ద్యూతదోషాన్ని తెలిసినవారు ఆ నాల్గింటిలో జూదాన్ని మిక్కిలి నిందింపదగిందిగా పేర్కొన్నారు. కురునందనా! జూదంవల్ల ఒక్కరోజులో సమస్తధనమూ నశిస్తుంది. అది నిశ్చయంగా దుఃఖానికి దారి తీస్తుంది. భోగాలు అనుభవించకుండానే సంపదలు నశిస్తాయి. వాక్పారుష్యం కలుగుతుంది. జూదప్రసంగమాత్రం చేతనే కారిన్యం పుడుతుంది. నాటి జూదసభలో ధృతరాష్ట్రునితో జూదం వల్ల కలిగే ఈ దోషా లన్నింటినీ చెప్పేవాడిని.

కురువర్ధనా! నా ఈ మాటలను వారు గ్రహించినట్లయితే కురువంశీయు లందరికీ శాంతి, ధర్మం, సంరక్షణ జరిగి ఉండేది. భరతశ్రేష్ఠా! మధురమై, హితమైన నామాటను వారు గౌరవించకపోతే, వానిని బలంతో నిగ్రహించి ఉండేవాడిని. ఒకవేళ అక్కడ స్నేహితులపేరుతో ఉన్న శత్రువులు అన్యాయానికి ఆశ్రయమిచ్చే ఆ ధృతరాష్ట్రునితో పాటే ఉంటే, ఆ సభాసదులైన జూదరులందరినీ వధించి ఉండేవాడిని. కురుశ్రేష్ఠా! నేను అపుడు ఆనర్తదేశంలోనే లేను. అందువల్ల మీకు ఈ జూదంవల్ల ఇటువంటి కష్టం కలిగింది. పాండునందనా! నేను ద్వారకకు తిరిగివచ్చాక సాత్యకివల్ల నీకు కల్గిన కష్టాన్ని గురించి యథాతథంగా విన్నాను. నరేశ్వరా! అది విన్నంతనే మిక్కిలి ఉద్విగ్నమనస్కుడను ఆయ్యాను. నిన్ను చూడాలని త్వరగా వచ్చాను. భరతశ్రేష్ఠా! అయ్యో! మనమంతా ఎంతటికష్టంలో పడ్డాం! సోదరులతో పాటుగా కష్టంలో మునిగి ఉన్న నిన్ను నేను చూస్తూ ఉన్నాను.'

14. శ్రీకృష్ణుడు సాల్వుని చంపుట.

యుధిష్ఠిరు డిలా అన్నాడు - 'వృష్ణినందనా! శ్రీకృష్ణా! జూదంసమయంలో నీవెందుకు రాలేకపోయావు? నీవు ఎక్కడ ప్రవాసంలో ఉన్నావు?' ఆ ప్రవాసంలో ఏం చేశావు?

శ్రీకృష్ణు డిలా అన్నాడు 'కురునందనా! నేనా సమయంలో నగరాకారంలో ఉన్న శాల్వుని సౌభమనే విమానాన్ని నాశనం చేయడానికి వెళ్ళాను. అందుకు కారణం చెపుతాను విను. భరతశ్రేష్ఠా! నీ రాజసూయయాగంలో అగ్రపూజ విషయంలో దుర్మార్గుడైన శిశుపాలుడు క్రోధవశుడై సహనాన్ని కోల్పోయాడు. మహాతేజస్వి, మహాబాహువు, మహాయశస్వి, వీరుడు, దమఘోషుని కుమారుడూ అయిన ఆ శిశుపాలుని అపుడు నేను చంపాను కదా! అతని వధను గురించి విన్న శాల్వుడు తీవ్రమైన కోపంతో నేను లేని సమయంలో ద్వారకకు వచ్చాడు. రాజా! అక్కడ వృష్ణివంశశ్రేష్ఠులైన కుమారులు అతనిని ఎదిరించారు. అతడు స్వేచ్ఛాగమనం గల సౌభమనే విమానాన్ని ఎక్కి వచ్చి, క్రూరునివలె యుద్ధం చేశాడు. వృష్ణివంశీయులైన వీరబాలురను అనేకులను చంపి, దుర్బుద్ధితో నగరంలోని ఉద్యానవనాలను అన్నింటిని ధ్వంసం చేశాడు. మహాబాహూ! ఆపై ఇలా అన్నాడు – "వృష్ణికులాధముడు, వసుదేవుని పుత్రుడూ, తెలివితక్కువవాడూ అయిన ఆ వాసుదేవుడు ఎక్కడకు వెళ్లాడు? అతడి గర్వాన్ని యుద్ధంలోనే నేను నాశనం చేస్తాను. ఆనర్తనివాసులారా! నిజం చెప్పండి. అతడున్న చోటకే వెళ్తాను. నా ఆయుధాన్ని ధరించి నిజం పలుకుతున్నాను. ఈ రోజు కంస, కేశులను చంపిన వాసుదేవుని చంపి తిరిగి వెళ్తాను. అతణ్ణి చంపకుండా తిరిగి వెళ్ళను. నాతో యుద్ధం చేయాలని కోరుకుంటూ ఆ సౌభరాజు 'అతడెక్కడ? అతడెక్కడ' అంటూ మళ్ళీ మళ్ళీ అక్కడక్కడే తిరుగసాగాడు. "ఈ రోజు పాపకర్ముడూ, విశ్వాస ఘాతకుడూ, నీచుడూ అయిన ఆ వాసుదేవుని యమలోకానికి పంపుతాను. నా సోదరుడైన శిశుపాల మహీపాలుని పాపస్వభావంతో చంపిన అతడిని నేను చంపుతాను. నా సోదరుడు బాలుడు. రాజు. యుద్ధరంగంలో లేనివాడు. అసావధానంగా ఉండగా ఆ శిశుపాలుని చంపిన ఆ జనార్దనుని చంపుతాను". కురునందనా! మహారాజా! ఈ విధంగా శిశుపాలుని కొరకు విలపించి, నన్ను నిందించి, కామగతిగల సౌభవిమానంపై అంతరిక్షంలో తిరగసాగాడు.

కురునందనా! నేను మీదగ్గరనుండి ద్వారకకు వెళ్ళినపిదప మార్తికావతకదేశపురాజు, దుర్బుద్ధి అయిన ఆ శాల్వుడు నావిషయంలో ఎలా వ్యవహరించాడో విన్నాను. కురునందనా! రోషంతో నామనసు కలత చెందింది. నేను కూడ ఒక నిశ్చయానికి వచ్చాను. అతనిని చంపాలని సంకల్పించాను. కురువరా! దుష్కార్యాలు చేసిన ఆ సాల్వుడు ఆనర్తదేశంలో చేసిన వినాశాన్ని, నావిషయంలో చేసిన నిందలను, అతడిగర్వాన్ని గుర్తించి అతని సౌభవిమానాన్ని, అతనినీ నాశనం చేయటానికి బయలుదేరాను. అతని కొరకు వెదుకుతున్న నాకు అతడు ఒక సముద్ర ద్వీపంలో కనిపించాడు. రాజా! అపుడు నేను పాంచజన్యమనే శంఖాన్ని పూరించి, శాల్వుని యుద్ధానికి ఆహ్వానించి, సిద్ధంగా నిలిచాను. అక్కడ దానవులకూ,

నాకూ ఒకముహూర్తకాలం యుద్ధం జరిగింది. వారంతా నాకు వశులై నేలపై ఒరిగారు. ఈ పనివల్లనే ఆపుడు నేను రాలేకపోయాను. హస్తినాపురంలో దుర్యోధనుని అవినయం కారణంగా జరిగిన జూదం సంగతి విని, దుఃఖంలో ఉన్న మిమ్మల్ని చూడటం కోసం తొందరగా వచ్చాను.'

15. ద్వారకలోని యుద్ధ రక్షణ సంసిద్ధత.

యుధిష్ఠిరు డిలా అడిగాడు - వాసుదేవా ! సౌభవధను గురించి విస్తరంగా తృప్తి కలిగేటట్లు చెప్పు. వెంటనే వాసుదేవుడిలా చెప్పాడు - 'రాజా! శిశుపాలుని నేను చంపిన విషయం విని శాల్వుడు ద్వారకాపురికి వచ్చాడు. పాండునందనా! దుర్మార్గుడైన శాల్వుడు ద్వారకాపురిని అన్నివైపుల తనసైనికులతో చుట్టుముట్టాడు. తాను స్వయంగా విమానాన్ని ఎక్కి ఆ పురంమీద వ్యూహాత్మకంగా సంచరించాడు. సౌభ విమానంలో ఉండి శాల్వరాజు ద్వారకలోని యోధులతో యుద్ధం చేయసాగాడు. ఆ నగరంలో అన్నివైపుల శస్త్రాస్త్రాలతో యుద్ధం జరిగింది. ద్వారకానగరానికి అన్నివైపులా పతాకాలతో కూడిన ప్రహరీ ఉన్నది. నాలుగువైపులా ఎత్తైన తోరణాలు న్నాయి. అన్ని వైపుల యుద్ధ సైనికసమూహాలు ఉన్నాయి. సైనికుల ఆత్మ రక్షణకు బురుజు లున్నాయి. యుద్ధానికి అవసరమైన యంత్రాలుగల సురంగం ఉంది. ప్రహరీపై విషంపూసిన లోహపు ముళ్ళు కనబడకుండా ఉంటాయి. పై అంతస్తులలో, గోపురాలలో కావలసిన ఆహారపదార్థా లుంటాయి. శత్రువుల దెబ్బలను అడ్డుకోవడానికి చక్రాకారంలో లోహమయమైన డాలులు ఉన్నాయి. శత్రువులు ప్రయోగించే అగ్నిగోళాలను, ప్రజ్వలించే లోహమయ అస్త్రాలను క్రిందకు పడగొట్టే శక్తి అనే అస్త్రా లున్నాయి. భరతశ్రేష్ఠా ! అస్త్రాలతోనిండిన మట్టి పాత్రలు, కంచుపాత్రలు అనేకం ఉన్నాయి. నగరంలో భేరీ, నగారాలు, మృదంగాలు ధ్వనిస్తూంటాయి. తోమర, అంకుశ, శతఘ్ని, లాంగల, భుశుండి, అశ్మగోలకాలు, అనేకాయుధాలు, లోహచర్మంగల కంచుకాలు, ప్రజ్వలించే గోళాలు, మొదలయినవి యధాస్థానాలలో ఉన్నాయి. శాస్త్రంలో చెప్పబడిన విధంగా ద్వారకా పురం రక్షణోపాయాలతో సుసంపన్నం చేయబడింది. శత్రువులను నివారించడానికై అనేకవిధాలైన రథాలతో సమర్థులైన, గద, సాంబ, ఉద్ధవాది వీరపురుషులతో, ప్రఖ్యాత వంశీయులైన యుద్ధవీరులతోను, నగరం మధ్యలోనున్న దుర్గాలతోను ద్వారకాపురి సురక్షితంగా ఉంది. నగరానికి దూరంగా ఉన్న దుర్గాలచేత, పతాకాలతోకూడిన గుర్రాలచేతను ద్వారక రక్షింపబడుతోంది. నగరంలో మద్యపానం చేయరాదని ప్రకటింపబడింది. ప్రమాదం నుండి రక్షించే ఉగ్రసేన, ఉద్ధవాదులచే ద్వారక సురక్షితం చేయబడింది. మద్యపానంచేత

ఉన్మత్తులై ఉంటే శాల్వనరాధిపుడు తమను దెబ్బతీస్తాడని భావించి వృష్ణ్యంధక వీరులంతా అప్రమత్తంగా ఉన్నారు. ధనసంచయాన్ని రక్షించే యాదవులు ఆనర్తదేశీయులైన నట, నర్తక, గాయకు లందర్నీ నగరంనుండి బయటకు శీఘ్రంగా పంపించివేశారు.

ద్వారకాపురంలోకి ప్రవేశించే మార్గా లన్నింటిని మూసివేశాం. సముద్రమార్గంలో వచ్చే నౌక లన్నింటినీ నిషేధించాం. నగరంచుట్టూ ఉండే పరిఖలను (అగడ్తలను) ముళ్ళతో నింపాం. కురుశ్రేష్ఠా! ద్వారకానగరానికి నాలుగువైపులా ఒక క్రోసెడు దూరంవరకు నూతు లన్నింటిని నీరులేనివిగా వేపుడు మూకుళ్లుగా చేశాం. భూమిని ప్రవేశింప శక్యం కాకుండా లోహకంటకాదులతో విషమంగా తయారుచేశాం. రాజా! ద్వారక సహజంగానే ప్రవేశింప శక్యంకానిది. సహజంగానే సురక్షితమైంది. సహజంగానే ఆయుధాలతో సుసంపన్నమైంది. అయినప్పటికీ ఇపుడు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశాం. ఇంద్రభవనంలా ద్వారకానగరం సురక్షితమై, అన్ని విధాలైన ఆయుధాలతో కూడి ఉన్నది కూడా. సౌభనివాసులతో యుద్ధం జరిగే సమయంలో వృష్ణ్యంధక వీరులు నగరంలోని ఎవరూ కూడా రాజముద్రలేనిదే బయటకు వెళ్ళలేరు. రాజముద్రలేనిదే లోపలికి ప్రవేశించలేడు. రాజేంద్రా! ప్రధానమార్గాలలో అన్ని కూడళ్ళలో గజాలు, అశ్వాలుగల్గిన సైన్యం మిక్కిలిగా ఉంది. ఆ సమయంలో సైనికులకు ప్రత్యేక జీతబత్తెములను ఇచ్చాం. క్రొత్తక్రొత్త ఆయుధాలను కవచాలను సమకూర్చాం. విశేష బహుమానాలను ఇచ్చాం. వేతనరూపంలో ధనమూ, బంగారమూ తప్ప మరొకటేదీ ఎవరికీ ఇవ్వలేదు. ఎవరికీ అర్హతకు మించిన వేతనం ఇవ్వలేదు. దయతో ఎవరికీ సైన్యంలో స్థానం కల్పించలేదు. పరాక్రమం చూపనివాడు ఎవడూ లేడు. రాజా! మిక్కిలి సమర్థులైన వీరులుగల ద్వారకానగరం ఈ విధంగా సురక్షితం చేయబడింది. రాజయిన ఉగ్రసేనునిచేత బాగా రక్షింపబడింది.'

16. శాల్వుని సైన్యము యాదవులను చుట్టుముట్టుట - యుద్ధము.

వాసుదేవు డిలా అన్నాడు - రాజేంద్రా! సౌభపతి సాల్వుడు గజపదాతులు గల పెద్ద సైన్యంతో దండెత్తి ద్వారకానగరానికి వచ్చాడు. శాల్వరాజు చతురంగబలం పెద్దజలాశయం దగ్గర సమతలప్రదేశంలో విడిదిచేసింది. శ్మశానభూములను, దేవతామందిరాలను, పుట్టలను, వృక్షాలను విడిచి, తక్కిన ప్రదేశాల నన్నింటిని ఆతని సైన్యం ఆక్రమించింది. రాజా! దారులన్నీ సేనల విభాగాలతో నిండిపోయాయి. శాల్వుని శిబిరంలోకి ప్రవేశించడానికి మార్గమే లేదు. ఆ సాల్వుని శిబిరం అన్నివిధాలైన ఆయుధాలతో నిండి ఉంది. అక్కడ అన్నిరకాల శస్త్రాల్లోను నైపుణ్యం కలవారున్నారు. అశ్వబలం, గజబలం, రథబలం, పతాకాలతో

నున్న పదాతిదళం అందులో ఉన్నాయి. అందులోని సైన్యమంతా సంతోషంతో పుష్టిగా ఉంది. మహావీరు లందులో ఉన్నారు. చిత్రవిచిత్రాలైన జెండాలు కట్టబడ్డాయి. విచిత్రాలైన రథాలు, ధనుస్సులూ ఉన్నాయి. కురుశ్రేష్ఠా! గరుత్మంతునిలా ద్వారకకు సమీపంలో సైన్యాన్నంతటినీ సమావేశపరచి, వేగంగా ద్వారకవైపునకు నడిపించసాగాడు. శాల్వరాజ సైన్యం రావటాన్ని గమనించి వృష్ణివంశీయులైన యువకులంతా నగరంనుండి బయటికి వెళ్ళి, వారితో యుద్ధం చేశారు. కురునందనా! ఆ శాల్వుని దురాక్రమణాన్ని సహింపలేని చారుదేష్ణుడు, సాంబుడు, ప్రద్యుమ్నుడు మున్నగు మహారథులంతా శాల్వరాజు యొక్క బహుయోధశ్రేష్ఠులను తమరథాలతో డీకొన్నారు. సాంబుడు తన ధనుస్సును ధరించి శాల్వుని మంత్రి, సేనాపతి ఐన క్షేమవృద్ధితో యుద్ధరంగంలో ఆనందంగా యుద్ధం చేశాడు. జాంబవతికొడుకు సాంబుడు ఆ క్షేమవృద్ధిపై సహస్రాక్షుడైన ఇంద్రునిలా బాణవర్షాన్ని కురిపించాడు. భయంకరమైన ఆ బాణవర్షాన్ని సేనాపతి క్షేమవృద్ధి సహించి హిమవత్పర్వతంలా నిశ్చలంగా నిలిచాడు. రాజేంద్రా! అటు తర్వాత క్షేమవృద్ధికూడా స్వయంగా మాయాజాలంతో కూడిన మహత్తరమైన శరసమూహాన్ని సాంబునిపై విడిచాడు. అపుడు సాంబుడు ఆ మాయాశరజాలాన్ని మాయచేతనే ఛేదించి, అతని రథాన్ని వేలబాణాలతో ముంచెత్తాడు. అటుపై సాంబునిబాణాల దెబ్బల ధాటికి క్షేమవృద్ధి వేగంగా పరుగెత్తే తన గుర్రాలతో యుద్ధరంగం నుండి వెళ్ళిపోయాడు.

ఆ శాల్వుని సేనాపతి పారిపోగానే, వేగవంతుడనే బలవంతు డయిన రాక్షసుడు నాకుమారుని పైకి దండెత్తాడు. వృష్ణి వంశభారాన్ని మోసే సాంబుడు, వేగవంతుని వేగాన్ని సహించి ధైర్యంగా అతణ్ణి నిలువరించి నిలిచాడు. సాంబుడు వేగవంత మయిన (వేగవతి అనే) గదను అతనిపై విసిరాడు. చివికిపోయిన మొదలుగల వృక్షం గాలివేగానికి నేల కొరిగినట్లుగా ఆ గదాఘాతానికి వేగవంతుడు నేలకొరిగాడు. గదయొక్క దెబ్బకి మహాసురుడూ, వీరుడూ అయిన ఆ వేగవంతుడు మరణించగానే నాకుమారుడు సాంబుడు ఆ మహాసేనలోకి ప్రవేశించి యుద్ధం చేయసాగాడు. శాల్వుని ఆజ్ఞచేత మహారథుడు, మహాధన్వి అయిన వివింధ్యుడనే రాక్షసుడు చారుదేష్ణునితో తలపడ్డాడు. ఆ తరువాత ఆ చారుదేష్ణ-వివింధ్యులకు పూర్వం వృత్రాసురదేవేంద్రులకు జరిగినట్లుగా మిక్కిలి భయంకరమైన యుద్ధం జరిగింది. మహాబలులైన వారిద్దరూ ఒకరిపై ఒకరు క్రుద్ధులై, ఒకరి నొకరు బాణాలతో కొట్టుకుంటూ, బిగ్గరగా(ధ్వని చేస్తూ) అరుస్తూ సింహాలవలె పోరుతున్నారు. తరువాత రుక్మిణీకుమారుడైన చారుదేష్ణుడు అగ్నివలె, సూర్యునివలె ప్రకాశిస్తున్న బాణాన్ని శత్రునాశకంగా అభిమంత్రించి మహాస్త్రంతో సంధించాడు. తరువాత

క్రుద్ధుడై, మహారథుడైన నాకుమారుడు వివింధ్యునిపై ఆ బాణాన్ని ప్రయోగించాడు. అతడు ప్రాణాలు కోల్పోయి క్రిందపడ్డాడు. వివింధ్యుని మరణం చూసి చెల్లాచెదరైన సేనను చూసి శాల్వుడు స్వేచ్ఛాగమనం గల తన సౌభవిమానంతో మళ్ళీ సమీపించాడు. ఆ సమయంలో సౌభవిమానం మీదున్న శాల్వుని చూసి ద్వారకలోనున్న సైన్యమంతా కలవరపడింది.

అపుడు ప్రద్యుమ్నుడు నగరం నుండి బయటకు వెళ్ళి, ఆనర్తదేశీయసైనికులను నిలిపి, ఇలా చెప్పాడు. 'మీరంతా నిలవండి. యుద్ధరంగంలో శాల్వునితో పాటుగ సౌభవిమానాన్ని బలవంతంగా నిలువరిస్తాను నన్ను చూడండి. యాదవులారా! నేను సౌభపతియైన శాల్వునిసేనను లోహమయమైన సర్పాలచేతవలె ధనుర్దండం నుండి వెలువడిన బాణాలచే ఇపుడే నాశనం చేస్తాను. ధైర్యం వహించి ఊరడిల్లండి. భయంవద్దు, సౌభపతి శాల్వుడు ఇపుడే నశిస్తాడు. నాతో తలపడిన దుష్టాత్ముడైన శాల్వుడు సౌభసహితంగా నశిస్తాడు.' పాండునందనా! ఈ విధంగా ఆనందంతో ప్రద్యుమ్నుడు చెపుతుండగా, ఆ సైన్యమంతా యుద్ధంలో స్థిరంగా నిలబడింది. ఉత్సాహంతో యుద్ధం చేసింది.

17. ప్రద్యుమ్న శాల్వుల ఘోరయుద్ధము.

ప్రద్యుమ్నుడు యాదవులతో ఇలా చెప్పి, గుర్రాలు పూన్చిన స్వర్ణమయరథాన్ని ఎక్కి, మకరచిహ్నంగల జెండా ఎగురవేసి, నోరుతెరుచుకున్న మృత్యువులా, ఆకాశంలోకి ఎగురుతున్నట్లుగా ఉన్న ఆ గుర్రాలతో శత్రువులను ఆక్రమించాడు. బాణాలను, ఖడ్గాన్ని ధరించి, ధనుస్సును తీసికొని దానిని ధ్వనింపజేస్తూ అటుఇటూ త్రిప్పుతూ, రక్షణకవచాన్ని ధరించి ముందుకు వెళ్ళాడు. అతడు విద్యుత్తులా మెరిసే తన ధనుస్సును ఒకచేతి నుండి వేరొకచేతికి మారుస్తూ, సౌభవిమానవాసులైన రాక్షసు లందరినీ భ్రాంతిపరిచాడు. అతడు యుద్ధంలో ధనుస్సుకి బాణం సంధించి, విడిచిపెడుతూ శత్రువులను చంపుతూంటే, ఆ పనులమధ్య ఏమాత్రమూ అంతరం కనబడటంలేదు. అతని ముఖంలోని చాయ ఏమాత్రం మారలేదు. అతని శరీరం ఏమాత్రం చలించలేదు. అంతటా గర్జిస్తూన్న అతని అద్భుత పరాక్రమాన్ని సూచించే సింహంవంటి ఉన్నతమైన నాదాన్ని లోకమంతా విన్నది. శాల్వునియొక్క ప్రధానసేన మధ్యలో ప్రధానరథంపై అగ్రభాగాన బంగారు కర్రపైనున్న ధ్వజంపై నోరుతెరచుకొని ఉన్న మకరం శత్రుసేనను భయపెడుతూ ప్రకాశిస్తూన్నది. ప్రద్యుమ్నుడు శీఘ్రంగా శాల్వునితో యుద్ధం చేయాలనే కోరికతో అతనికి ఎదురుగా వెళ్ళాడు. ఆ మహారణంలో వీరుడైన ప్రద్యుమ్నుని ఆక్రమణాన్ని శాల్వుడు క్రుద్ధుడై,

సహించలేక పోయాడు. శత్రుపురాన్ని జయించాలని శాల్వుడు రోషగర్వోన్మత్తుడై కామగమనంగల విమానం నుండి క్రిందికి దిగి, ప్రద్యుమ్నునితో యుద్ధం చేశాడు. శాల్వునికి ప్రద్యుమ్నునికి భయంకరమైన యుద్ధం జరిగింది. బలి– దేవేంద్రులకు వలె జరుగుతున్న ఆ యుద్ధాన్ని జనులంతా ఏకమై చూశారు. అతనియొక్క రథం స్వర్ణమయం, మాయా మయమూ. ఆ రథానికి కూడా పతాకం, ధ్వజం, అనుకర్షం, తూణమూ ఉన్నాయి. అటువంటి శ్రేష్ఠమైన రథాన్ని ఎక్కి, మహాబలుడైన శాల్వుడు ప్రద్యుమ్నునిపై బాణాలను వేశాడు. ప్రద్యుమ్నుడు రణంలో తన భుజవేగంతో శాల్వునిపై సమ్మోహపరిచినట్లుగా బాణవర్షాన్ని కురిపించాడు. ఆ సౌభపతి శాల్వుడు యుద్ధంలో ప్రద్యుమ్ను బాణాలచే దెబ్బతిని, సహించలేక నాకుమారునిపై మండుతున్న అగ్నిలా ప్రకాశించే బాణాలు ప్రయోగించాడు. తనమీద పడుతున్న బాణసమూహాన్ని ప్రద్యుమ్నుడు ఛేదించాడు. శాల్వుడు మళ్ళీ నాకుమారుడిపై జ్వలిస్తున్న బాణాలను ప్రయోగించాడు. శాల్వుని బాణాలచే దెబ్బతిన్న రుక్మిణీనందనుడు త్వరగా యుద్ధంలో మర్మభేదియైన బాణాన్ని శాల్వునిపై వేశాడు. నాకుమారుడు వేసిన బాణం శాల్వుని కవచాన్ని ఛేదించి, శీఘ్రంగా అతని హృదయాన్ని తాకింది (కొట్టింది). అతడు స్పృహ కోల్పోయి నేలపై పడ్డాడు.

వీరుడైన ఆ శాల్వరాజు అచేతనంగా నేలపై పడగా, దానవ వీరులంతా భూమిని చీల్చుకొని, పాతాళానికి పారిపోయారు. సౌభపతి శాల్వుడు అచేతనంగా పడిపోగా, అతని సైన్యమంతా హాహాకారాలు చేసింది. మహాబలుడైన శాల్వుడు చైతన్యాన్ని పొంది, హఠాత్తుగా లేచి, ప్రద్యుమ్నునిపై బాణాలను విడిచాడు. శాల్వుని బాణాలచే ప్రద్యుమ్నుడు యుద్ధంలో స్థిరంగా ఉండి, కంఠమూలభాగంలో దెబ్బతిని, రథంమీద మూర్ఛపోయాడు. శాల్వుడు సింహనాదం చేశాడు. ఆ నాదం భూమండలమంతా వ్యాపించింది. నాకొడుకు మూర్ఛపోగా, అతనిపై మళ్ళీ శాల్వుడు ఎదిరింపశక్యంగాని బాణాలను విడిచిపెట్టాడు. ఆ బాణాలచే కొట్టబడిన ప్రద్యుమ్నుడు మూర్ఛితుడై, నిశ్చేష్టుడై ఆ యుద్ధరంగంలో పడిపోయాడు.

18. మూర్ఛితుడయిన ప్రద్యుమ్నుడు సారథిని నిందించుట.

బలవంతులలో శ్రేష్ఠుడైన ప్రద్యుమ్నుడు శాల్వుని బాణాలచేత పీడింపబడి మూర్ఛనొందాడు. అపుడు వృష్ణిసేనలు తమ సంకల్పం భగ్నంకాగా, ఎంతో బాధపడ్డారు. వృష్ణి అంధకసైన్యమంతా హాహాకారాలు చేసింది. ప్రద్యుమ్నుడు మూర్ఛపోవడం చూసి శత్రుసేనలు మిక్కిలి ఆనందించాయి. మూర్ఛనొందిన ప్రద్యుమ్నుని చూసి శిక్షితుడైన దారుకి అనే సారథి వేగంగా పరుగెత్తే గుర్రాలతో రథాన్ని యుద్ధంనుండి దూరంగా

తీసికొని వెళ్ళాడు. రథం ఎక్కువదూరం వెళ్ళకుండానే రథంలో వెళుతూన్న ప్రద్యుమ్నుడు స్పృహవచ్చి ధనుస్సును చేతబట్టి సారథితో ఇలా అన్నాడు. 'సూతపుత్రా! ఏం పనిచేశావు? యుద్ధం నుండి ఎందుకు వెనుదిరిగావు? వృష్ణివీరులకు యుద్ధంలో ఇది ధర్మంకాదు. ఆ మహారణంలో శాల్వుని చూసేసరికి నీకు మోహం కలుగలేదు కదా! లేదా యుద్ధాన్ని చూసి విషాదం పొందావా! ఉన్నదున్నట్లుగా నాకు చెప్పు.' సారథి ఇలా అన్నాడు - 'కేశవనందనా! నాకు మోహం కలుగలేదు, భయమూ కలుగలేదు. కాని ఈ శాల్వుడు నీకు చాలా భారమయ్యా డనిపించింది. అందువల్ల నేను మెల్లగా యుద్ధభూమినుండి దూరంగా తీసికొనివచ్చాను. పాపాత్ము డయిన శాల్వుడు మిక్కిలి బలవంతుడు, యుద్ధరంగంలో వీరుడైన రథికుడు స్పృహ కోల్పోతే, అతనిని సారథి రక్షించాలి కదా! ఆయుష్మంతుడా! నిత్యం నేను నిన్ను రక్షించాలి. నీవు నన్ను రక్షించాలి. రథికుడు ఎల్లపుడూ రక్షింపదగినవాడని నేను నిన్ను దూరంగా తీసికొనివచ్చాను. యుద్ధరంగంలో నీవు ఒక్కడ వున్నావు. దానవులు చాలామంది ఉన్నారు. యుద్ధంలో ఇరుపక్షాలు సమ ఉజ్జీగా లేవని భావించి నిన్ను దూరం చేశాను.' సారథి ఈ విధంగా చెపుతూండగా, ప్రద్యుమ్నుడు ఇలా అన్నాడు - 'మళ్ళీ రథాన్ని యుద్ధరంగానికి మళ్లించు. ఎట్టెనాకాని, మళ్లీ ఇలా చెయ్యకు. నేను జీవించి ఉండగా, నన్ను యుద్ధం నుండి దూరంగా తీసుకొనిపోకు. జీవించి ఉండగా యుద్ధాన్ని విడిచిపెట్టేవాడు, నేలపైపడిన వాణ్ణి చంపేవాడు, శత్రువుకు లొంగి 'నీవాణ్ణి' అనేవాడూ వృష్ణివంశంలో పుట్టినవాడే కాడు. అదేవిధంగా స్త్రీని చంపేవాడు, బాల, వృద్ధులను చంపేవాడు, రథంలేనివాణ్ణి, శస్త్రాయుధాలు భగ్నమైనవాణ్ణి చంపేవాడూ వృష్ణివంశంలో పుట్టినవాడే కాడు. దారుకకుమారా! నీవు సూతకులంలో పుట్టినవాడవూ, సూతకర్మను బాగా నేర్చినవాడవూను. యుద్ధంలో వృష్ణివంశీయులు పాటించే ధర్మాన్నికూడా నీవు ఎరుగుదువు. సూతనందనా! వృష్ణివీరుల చరిత్ర అంతా తెలిసిన నీవు యుద్ధంలో ఉన్నవాణ్ణి మళ్ళీ ఎపుడూ ఇలా దూరంగా తీసికొని వెళ్ళకు. భ్రాంతిపడితే, యుద్ధంనుండి వెనుదిరిగితే, నావెనుక భాగంలో, దెబ్బతగలడం చూసి నాతండ్రి నన్ను ఏమంటాడు? కేశవునికి అగ్రజుడు, బలదేవుడు నన్ను చూసి ఏమంటాడు? సూతా! శినికి మునిమనవడు, సాత్యకి, సమరవిజయుడయిన సాంబుడు యుద్ధంనుండి వెనుదిరిగివచ్చిన నన్ను చూసి ఏమంటారు? సారథీ! ఇతరులకు అతనిని అదుపుచేయటం శక్యంకాదు. అటువంటి చారుదేష్ణుడు, గదసారణులు, మహాబాహువైన అక్రూరుడు నన్ను చూసి ఏమంటారు? శూరుడనూ, గౌరవింపబడినవాడనూ, శాంతుడనూ, నిత్యమూ వీరపురుషులను గౌరవించేవాడనూ అయిన నన్ను చూసి వృష్ణివీరుల భార్యలు ఏమంటారు? 'ఈ ప్రద్యుమ్నుడు

భయపడి యుద్ధరంగం విడిచి ఇలా వస్తున్నాడు. ఇతడు తిరస్కరింపదగినవాడు' అని అంటారు. 'బాగుంది' అని ఎవరూ అనరు.

నాకు కాని నావంటివారికి కాని ఇట్టి ధిక్కారవచనంతో పరిహసింపబడటం మరణంకంటే ఎక్కువ. సారథీ! అందువల్ల మళ్లీ ఎపుడూ ఇలా చేయకు. మధుసూదనుడైన నాతండ్రి శ్రీహరి ఈ భారాన్ని నాపై ఉంచి, భారతసింహమైన ధర్మరాజు చేసే యజ్ఞానికి వెళ్ళాడు. ఈ రోజు నే చేసిన అపరాధం సహింపశక్యం కానిది. సూతపుత్రా! శాల్వుని ఎదుర్కోవడానికి వెళ్తున్న వీరుడైన కృతవర్మను నేనే నివారించాను. 'శాల్వుని నేను అడ్డుకొంటాను, నువ్వు ఉండు' అని చెప్పాను. హృదికాత్మజుడైన కృతవర్మ నన్ను గౌరవించి వెనుదిరిగాడు. ఇపుడు ఇలా యుద్ధాన్ని విడిచివెళ్ళి, ఆ మహారథుడికి ఏం చెప్పగలను? అజేయుడైన పుండరీకాక్షుడు నన్ను సమీపించినపుడు ఏం చెప్పను? సాత్యకి, బలదేవుడు, అంధకవృష్ణివీరులూ ఎల్లపుడూ నాతో పోటీపడుతూంటారు, వాళ్ళకు నేను ఏం చెప్పగలను? సూతపుత్రా! యుద్ధాన్ని విడిచి, శత్రువుల బాణాలచే వీపుమీద కొట్టబడి, మూర్ఛితుడనై నీచేత దూరంగా తీసికొని రాబడిన తరువాత ఇక ఏ విధంగాను జీవించలేను. దారుకనందనా! అందువల్ల శీఘ్రంగా మళ్ళీ యుద్ధరంగానికి తీసికొనివెళ్ళు. ఇకపై ఆపదసమయంలో కూడ నీవు ఈ విధంగా చేయవద్దు. సూతపుత్రా! భయపడి యుద్ధంనుండి దూరంగా వెళ్ళి, వెనుకవైపు బాణాల దెబ్బలు తిని జీవించి ఉండడం ఏ విధంగానూ గొప్పదిగా భావించడంలేదు. సూతపుత్రా! భయపడి యుద్ధాన్ని విడిచివెళ్ళే అధమునిగా నన్నెప్పుడూ భావించవద్దు. దారుకాత్మజా! నీవు యుద్ధాన్ని విడిచిపెట్టడం యుక్తంకాదు. యుద్ధాన్ని కోరుకొనే నన్ను తొందరగా యుద్ధానికి తీసికొని వెళ్ళు.'

19. ప్రద్యుమ్నుడు శాల్వుని ఓడించుట.

ప్రద్యుమ్నుడు ఇలా చెప్పగా, సూతపుత్రుడు బలవంతులలో శ్రేష్ఠుడైన ప్రద్యుమ్నునితో మధురంగా, సంగ్రహంగా, నేర్పుగా ఇలా అన్నాడు. 'రౌక్మిణేయా! యుద్ధంలో గుర్రాలను అదుపుచేసే నాకు భయం లేదు. వృష్ణివీరుల యుద్ధాన్ని గురించి కూడ తెలుసు. నీవు చెప్పిన దాంట్లో మరొక అభిప్రాయమేమీ లేదు. ఆయుష్మంతుడా! సారథియొక్క ధర్మంలో ఇలా ఉపదేశించడం నాకు గుర్తుంది. అన్ని దశలలోనూ కూడ సారథికి రథికుడు రక్షింపదగినవాడు. ఆ సమయంలో నీవు బాగా హింసింపబడి ఉన్నావు. వీరా! శాల్వుడు వేసిన బాణంచేత నీవు బాగా దెబ్బతిని ఉన్నావు. స్పృహతప్పి పడి ఉన్నావు. అందువల్ల నేను నిన్ను దూరంగా తీసికొని వెళ్లాను. కేశవనందనా! ఇపుడు దైవవశాత్తు నీకు తెలివి

వచ్చింది. ఇక గుర్రాలను నడపడంలో నావిద్య ఎటువంటిదో చూడు. నేను దారుకుని పుత్రుడిని. సారథ్య విద్యను యథావిధిగా నేర్చుకొన్నాను. గణుతికెక్కిన ఈ శాల్వసేనలోనికి నిర్భయంగా ప్రవేశిస్తాను.'

ఇలా చెప్పి సూతపుత్రుడు గుర్రాలను కళ్ళాలతో లాగిపట్టి వేగంగా రణరంగంలోకి పరుగెత్తించాడు. అతడు గుర్రాలను మండలాకారంగా, సమానంగా, వంకరగా, కుడిఎడమలకు చిత్రవిచిత్రాలైన గతులతో నడిపించాడు. రాజా! ఆ గుర్రాలు చెర్నాకోలదెబ్బలు తిని కళ్ళెం బిగపెట్టి, ఆకాశంలోకి ఎగురుతున్నట్లుగా పరుగెత్తాయి. చేతినేర్పు గల దారుకుని గురించి తెలిసిన ఆ గుర్రాలు మండుతున్న అగ్నిలా పాదాలు నేలను తాకకుండా పరుగెత్తుతున్నాయి. దారుకపుత్రుడు ఆ శాల్వుని సైన్యాన్ని పెద్దప్రయత్నం లేకుండగానే, అపసవ్యంగా (కుడివైపుకు) ఉండేటట్లు చేశాడు. అది చాలా అద్భుతంగా జరిగింది. ప్రద్యుమ్నుడు తన సైన్యాన్ని అపసవ్యంగా ఉండేటట్లు చేయడం సహించలేని సౌభపతి శాల్వుడు, ప్రద్యుమ్నుని రథసారథిని మూడు బాణాలతో హింసించాడు. దారుకుని పుత్రుడపుడు బాణవేగాన్ని గురించి ఏమాత్రం చింతించక, మళ్లీ అపసవ్యంగానే వెళ్ళాడు. సౌభపతి శాల్వుడు రుక్మిణీనందనుడైన ప్రద్యుమ్నునిపై అనేకవిధాలైన బాణాలను వేశాడు. ప్రద్యుమ్నుడు చిరునవ్వు నవ్వి, తన హస్తలాఘవాన్ని చూపిస్తూ, ఆ బాణాలు తనపై పడకుండానే వాటిని తన తీక్ష్ణమైన బాణాలతో ఛేదించాడు. అది చూసి శాల్వుడు దారుణమైన ఆసురీమాయను ఆశ్రయించి, బాణాలను విడిచాడు. రాక్షసుడు ప్రయోగించే మహాబలమైన అస్త్రాన్ని తెలిసికొని, మధ్యలోనే బ్రహ్మాస్త్రంతో దాన్ని ఛేదించి, ఇతరబాణాలను శాల్వునిపై విడిచాడు. శత్రువుల రక్తాన్ని త్రాగే ఆ బాణాలు అతని అస్త్రాన్ని నాశనం చేసి, శిరసుపై, వక్షస్థలంపైన, ముఖంమీద దెబ్బతీశాయి. దానితో అతడు స్పృహతప్పి పడిపోయాడు. నీచుడైన శాల్వుడు బాణాల దెబ్బలచే పీడితుడై క్రిందపడగానే, ప్రద్యుమ్నుడు శత్రునాశనమైన ఒక ఉత్తమబాణాన్ని సంధించాడు. సర్పం విషంతోనూ, అగ్నిజ్వాలతోను సమంగా ప్రకాశిస్తూ, నారికి సంధింపబడే ఆ బాణాన్ని చూసి అంతరిక్షమంతా హాహాకారాలు చేసింది. అపుడు ఇంద్రుడు, కుబేరునితో సహా దేవగణాలన్నీ నారదుని పంపించారు. మనోవేగంగల వాయువును కూడా పంపారు. వారిరువురూ ప్రద్యుమ్నుని సమీపించి, దేవతల మాటను చెప్పారు - 'వీరా! ఈ శాల్వరాజును నీవు ఏవిధంగానూ చంపడానికి వీలులేదు. నీవు వెంటనే మళ్ళీ బాణాన్ని ఉపసంహరించు. ఇతడు యుద్ధంలో నీచే చంపదగినవాడు కాదు. ఈ బాణం ప్రయోగిస్తే యుద్ధరంగంలో చావనివాడెవడూ ఉండడు. బ్రహ్మచేత శ్రీకృష్ణుని ద్వారా యుద్ధంలో ఇతనికి మరణం సంకల్పించబడింది. అది అసత్యం కాకూడదు.' ఆ మాటలు

విని మిక్కిలి ఆనందించిన ప్రద్యుమ్నుడు ఉత్తమమైన ఆ బాణాన్ని ధనుస్సు నుండి ఉపసంహరించి, అమ్ములపొదిలో ఉంచాడు. శాల్వుడు లేచి, ప్రద్యుమ్నుని బాణాలచే పీడింపబడి, మిక్కిలి దుఃఖిస్తున్న మనస్సుతో సైన్యంతోపాటు త్వరగా యుద్ధరంగం నుండి నిష్క్రమించాడు. ఆ శాల్వుడు వృష్ణిసైనికులచే హింసింపబడి, ద్వారకను విడిచి, సౌభవిమానాన్ని ఎక్కి, అంతరిక్షంలోకి వెళ్ళాడు.

20. శ్రీకృష్ణశాల్వుల భయంకరయుద్ధము.

వాసుదేవుడిలా అన్నాడు - రాజా! నీ రాజసూయమహాక్రతువు పూర్తయిన తరువాత శాల్వవిముక్తమైన ఆనర్తనగరానికి వెళ్ళిన నేను ఐశ్వర్యహీనమై స్వాధ్యాయవషట్కారాలు లేక, అలంకారాలులేని స్త్రీ వలె ఉన్న ద్వారకను చూశాను. ద్వారకలోని ఉపవనాలు నామరూపాలు తెలియకుండా ఉన్నాయి. వాటిని చూసిన నాకు సందేహం కలిగింది. అపుడు కృతవర్మను అడిగాను. 'నరశ్రేష్ఠా! వృష్ణివంశంలోని స్త్రీపురుషులంతా మిక్కిలి అస్వస్థులుగా ఎందుకున్నారు? యధార్థాన్ని నేను వినాలనుకొంటున్నాను.' నేనిలా అడగ్గానే, అతడు - శాల్వుడు ద్వారకను చుట్టుముట్టడమూ, మరల విడిచిపెట్టడమూ - అంతా వివరించి చెప్పాడు. అతడు చెప్పినది పూర్తిగా విన్న తర్వాత శాల్వరాజవినాశనానికి అపుడే సంకల్పించాను. అనంతరం నగరంలోని జనులందరిని ఊరడించి, రాజు ఉగ్రసేనునీ, తండ్రి వసుదేవునీ వృష్ణివంశవీరు లందరినీ ఉత్సాహపరుస్తూ ఇలా చెప్పాను - 'యాదవశ్రేష్ఠులారా! నగరంలో ఎప్పుడూ రక్షణ విషయంలో అప్రమత్తంగా ఉండాలి. నేను శాల్వరాజును నాశనం చేయడానికి వెళుతున్నాను. మీ రీవిషయం నిశ్చయంగా తెలుసుకోండి. శాల్వుని చంపకుండా ద్వారవతీనగరానికి తిరిగి రాను. శాల్వునితో పాటుగ సౌభనగరాన్ని నాశనంచేసి మళ్ళీ మిమ్మల్ని చూస్తాను. శత్రుభయంకరమైన ఈ దుందుభిని ముమ్మారు మ్రోగించండి.' ఈ విధంగా యదువీరుల నందరినీ నేను ఊరడించాను. వారంతా సంతోషించి, 'వెళ్ళు శత్రువులను సంహరించు' అని నాతో అన్నారు. ప్రసన్నులైన ఆ యదువీరులంతా ఆశీస్సులతో నన్ను అభినందించారు. ద్విజశ్రేష్ఠులు స్వస్తివచనాలు పలికారు. నేను శిరస్సు వంచి శివునికి, నమస్కరించాను. రాజా! శైబ్య సుగ్రీవాలనే గుర్రాలు పూన్చిన రథాన్ని ఎక్కి, దిక్కులన్నీ ప్రతిధ్వనింపజేస్తూ శ్రేష్ఠమయిన శంఖాన్ని -పాంచజన్యాన్ని - పూరించి, చతురంగబలంతో విజయకాంక్షతో ఉన్న మహాసేనతోకూడి శాల్వుని పైకి యుద్ధానికి వెళ్లాను.

అనేకదేశాలను దాటి, ఎన్నో వృక్షాలతో ఉన్న పర్వతాలను దాటి, సరస్సులను,

నదులను దాటి మార్తికావతనగరానికి చేరాను. అక్కడకు వెళ్ళి, శాల్వుడు సౌభవిమానమెక్కి సాగరసమీపంలో వెళ్ళుతున్నాడని విన్నాను. అతణ్ణి వెనుక నుండి అనుసరించాను. శాల్వుడు సముద్రం దగ్గరకు వెళ్ళి మహాతరంగాలతో ఉన్న ఆ సముద్రం మధ్యలో ఉన్న ఒక ద్వీపం చేరి, అక్కడ సౌభవిమాన మెక్కి, తిరుగుతున్నాడు. దూరంనుండి నన్ను చూసి, గర్వంతో ఆ దుర్మార్గుడు మాటిమాటికి నన్ను యుద్ధానికి ఆహ్వానించాడు. నా శార్ఙ్గధనువు నుండి వెలువడ్డ ప్రాణాంతకాలైన బాణాలు అతని సౌభవిమానాన్ని తాకలేదు. అందువల్ల నాకు రోషం కలిగింది. ఆ రాక్షసాధముడు శాల్వుడు కూడ నాపై వేలకొలది బాణాలను వర్షధారలవలె కురిపించాడు. అతడు తన బాణాలతో నా సారథిని, గుర్రాలను, సైనికులను చెల్లాచెదరు చేశాడు. మేము బాణాలను లక్ష్యపెట్టక, యుద్ధం చేస్తున్నాం. శాల్వుని అనుచరులైన వీరులు వంగినకణుపులు గల బాణాలను వేలకొద్దీ నాపై వేశారు. ఆ సమయంలో ఆ అసురవీరులు మర్మఘాతకాలైన బాణాలతో నాగుర్రాన్ని, రథాన్ని, సారథిని కప్పివేశారు. నా గుర్రాలు, రథం, సారథి దారుకుడు ఎవరూ కనబడటం లేదు. ఆ బాణాలు నన్ను, నా సైనికులను కూడా కప్పివేశాయి. అపుడు నేను కూడా నాదివ్యమైన ధనుస్సు నుండి శాస్త్రప్రకారం అభిమంత్రించి, వేలకొలది బాణాలు వేశాను. ఆ సౌభవిమానం ఆకాశంలో క్రోసెడు దూరం వెళ్ళింది. అందువల్ల నాసైనికులకు లక్ష్యం కనబడకుండా పోయింది. రంగశాలలో ఉన్న ప్రేక్షకులవలె మా సైనికులంతా సింహనాదాలతోను, కరతాలధ్వనులతోను నన్ను సంతోషపెట్టారు (ఉత్సాహపరిచారు). నాచేతినుండి వెలువడిన అందమైన అంచులుగల బాణాలు దానవుల శరీరాలలో శలభాలవలె ప్రవేశించాయి. తీక్ష్ణాలైన నాబాణాలచేత చంపబడిన సైనికులు మహాసముద్రంలో పడుతూ చేసిన శబ్దంచేత సౌభవిమానంలో కోలాహలం బయలుదేరింది.

భుజస్కంధాలు తెగిన దానవులు కంబంధుని ఆకృతిలో కనబడుతూ భయంకరమైన శబ్దం చేస్తూ సముద్రంలో పడుతున్నారు. అలా సముద్రంలో పడిన ఆ దానవులను సముద్రంలో నివసించే జంతువులు తింటున్నాయి. అటుపై నేను గోక్షీరంవలె, వెండివలె తెల్లగా ప్రకాశిస్తున్న పాంచజన్యాన్ని పూరించాను. నాబాణాలకు పడిపోయిన సైనికులను చూసి, శాల్వుడు నాతో మాయాయుద్ధం చేయసాగాడు. గదలు, హలాలు, ప్రాసాలు, శూలాలు, శక్తి, పరశువులు, ఖడ్గాలు, శక్తులు, వజ్రాయుధాలు, బుష్టి, కనప, బాణాలు, పట్టిశాలు, భుశుండి మున్నగు ఆయుధాలు నిరంతరం నాపై పడసాగాయి. శాల్వుని ఆ మాయను నేను మాయ ద్వారా గ్రహించి నాశనం చేశాను. ఆ మాయ నాశనంకాగానే, అతడు పర్వతశిఖరాలతో యుద్ధం చేశాడు. అతడి మాయ వల్ల ఒక్కసారిగా చీకటి

వ్యాపించడం, మళ్ళీ వెంటనే వెలుతురు రావడం; ఒక్కసారిగా ఆకాశంలో మేఘాలు కప్పి ఉండడం, మరల ఆకాశం నిర్మలంగా స్వచ్ఛందంగా ప్రకాశించడం; ఒకసారి చలి వ్యాపించడం, మళ్ళీ అంతలోనే వేడిగా ఉండటం; నిప్పులు, ధూళి, శస్త్రాలు వర్షంగా కురవడం.... ఈవిధంగా మాయతో శాల్వుడు యుద్ధం చేయసాగాడు. అదంతా తెలిసిన నేను దాన్ని మాయతోనే నశింపజేశాను. సమయానుకూలంగా యుద్ధంచేస్తూ నేను బాణాలతో శాల్వుని సైనికులను హింసింపసాగాను. అపుడు ఆకాశమంతా నూర్గురు సూర్యులు ప్రకాశిస్తున్నట్టుగా అయింది. ఆకాశంలో నూరుగురు చంద్రులూ, పదివేల తారకలూ ప్రకాశింపసాగాయి. అపుడు రాత్రిపగలు తెలియలేదు. దిక్కులు తెలియలేదు. అందువల్ల భ్రాంతికలిగిన నేను ప్రజ్ఞాస్త్రాన్ని ప్రయోగించాను. వాయువుచే దూది ఎగిరిపోయినట్లుగా, అస్త్రంచేత అతని మాయ దూరం చేయబడింది. అపుడు రోమాలు గగుర్పాటు చెందేటట్లు యుద్ధం జరిగింది. రాజేంద్రా! అంతటా వెలుగు రాగా, అపుడు శత్రువుతో యుద్ధం చేయసాగాను.

21. శాల్వుని మాయచే శ్రీకృష్ణుడు మూర్ఛనొందుట.

శాల్వరాజు రణరంగంలో నాతో యుద్ధం చేస్తూ మళ్ళీ ఆకాశంలోకి వెళ్లాడు. నన్ను జయించాలనే కోరికతో శాల్వుడు నాపై శతఘ్నులను, మహాగదలను, మండుతున్న శూలాలను, ముసలాలను, ఖడ్గాలను విసిరాడు. వేగంగా వస్తూన్న ఆ ఆయుధాలను వెంటనే నివారించి, ఆకాశంలో సంచరించే శత్రువులను అక్కడే చంపడానికి నిశ్చయించుకొని, వేగంగా వెలువడిన బాణాలతో రెండుగా, మూడుగా ఛేదించాను. అనంతరం అంతరిక్షంలో పెద్దధ్వని అయింది. ఆ తరువాత వంగిన పర్వాలు గల లక్షబాణాలతో నా సారథిని, గుర్రాలను, రథాన్ని చెల్లాచెదరు చేశాడు. అపుడు దారుకుడు నాతో ఇలా అన్నాడు - 'ప్రభూ! శాల్వుని బాణాలచే హింసింపబడి, వివశుణ్ణి అవుతున్నాను. ఉండాలని ఉంటున్నాను కానీ ఉండలేకపోతున్నాను. నాశరీరం శిథిలమై పోతోంది.' సారథి జాలిగా పలికిన ఈమాటలను విని శరపీడితుడైన అతడిని చూశాను. అతని వక్షఃస్థలం, శిరస్సు, శరీరం, రెండు భుజాలు అంతటా బాణాలు తగిలాయి. అతని శరీరంలో బాణాలు గ్రుచ్చుకోని ప్రదేశమే లేదు. మేఘం వర్షిస్తే గైరికాది ధాతువులతో ఎర్రగా ఉండే పర్వతంలా బాణాలదెబ్బలవల్ల కలిగిన రక్తప్రవాహంతో అతడు ప్రకాశిస్తున్నాడు. యుద్ధంలో శాల్వుని బాణాలచే దెబ్బతిని కళ్ళాలు చేతబట్టియే మరణించబోతూన్న ఆ సారథిని చూసి అతడు మరణించకుండా ఆపాను.

ఇంతలో ద్వారకా నివాసి ఒకానొకడు స్నేహం వల్ల కాబోలు తొందరతో నారథం దగ్గరకు వచ్చాడు. యుధిష్ఠిరా! ఉగ్రసేనుని సేవకుడైన ఆ పురుషుడు గద్గదకంఠంతో విచారగ్రస్తుడై చెప్పిన సంగతిని నీకు చెపుతాను. తెలుసుకో. 'కేశవా! ద్వారకాధిపతి ఉగ్రసేనుడు నీకు ఈ సందేశాన్ని చెప్పాడు. కేశవా! వారు నీతండ్రికి మిత్రులు 'ఇక్కడకు రా. తెలుసుకో' అని వారు నీకు చెప్పారు. కృష్ణా! నీవు యుద్ధాసక్తుడవై ఉంటే శాల్వుడు ఈ రోజు ద్వారకకు వచ్చి వసుదేవుని బలవంతంగా చంపాడు. అందువల్ల జనార్దనా! ఇక యుద్ధంచాలు. వెనుదిరుగు. ద్వారకనే నీవు రక్షించు. ఇదే నీకు గొప్పపని.' రాజదూత యొక్క ఆ మాటను విని నా మనస్సు చాలా బాధపడింది. కర్తవ్యాకర్తవ్య నిర్ణయం చేయలేకపోయాను. వీరా! నామనసుకు మిక్కిలి అప్రియమైన ఆ మాటను విని సాత్యకి బలదేవులను, ప్రద్యుమ్నుని మనఃపూర్వకంగా నిందించాను. కురునందనా! నేను ద్వారకా రక్షణను, నాతండ్రి రక్షణను వారిచేతిలో పెట్టి సౌభవిమాననాశనం కొరకు వెళ్లాను కదా! బలదేవుడు జీవించి ఉన్నాడా! సాత్యకి, రుక్మిణీకుమారుడు ప్రద్యుమ్నుడు, బలవంతుడైన చారుదేష్ణుడు, సాంబుడు మున్నగు వారు జీవించి ఉన్నారా! అని నామనస్సు కలత చెందింది. వీరంతా జీవించి ఉండగా శూరసేనుని కుమారుడు వసుదేవుడు స్వయంగా ఇంద్రునిచేత కూడా చంపశక్యం కాడు. దీనిని బట్టి శూరసుతుడైన నాతండ్రి వసుదేవుడు మరణించి ఉంటాడు అని స్పష్టమౌతోంది. బలదేవాదిప్రముఖులు కూడా మరణించి ఉండటం స్పష్టమే. అని నేను మనస్సులో ఒకనిశ్చయానికి వచ్చాను. మహారాజా! వారందరి వినాశనాన్ని ఆలోచిస్తూన్న నేను విహ్వలత విడిచి, మరల శాల్వునితో పోరాడాను.

అపుడు నేను సౌభవిమానం నుండి నాతండ్రి వసుదేవుడు క్రిందకు పడుతూండటం చూశాను. అంతలోనే నన్ను మోహం ఆవేశించింది. అలా పడుతూన్న నాతండ్రియొక్క రూపం పుణ్యం క్షీణించి, స్వర్గంనుండి భూమిపైకి పడుతున్న యయాతి రూపంలా ఉంది. చిరిగిన, మలినమైన తలపాగా కల్గి చెదరిన వస్త్రం, జుట్టు కల్గిన ఆ వసుదేవుడు పుణ్యం నశించి, క్రిందికి పడుతున్న గ్రహంవలె ఉన్నాడు. ఆ స్థితిలో ఉన్న నాతండ్రిని చూడగానే, ధనుఃశ్రేష్ఠమైన నాశార్ఙ్గం చేతినుండి క్రిందపడింది. మోహం పొంది రథంలోనే కూర్చుండిపోయాను. తరువాత ప్రాణం పోయినవాడిలా రథంలో అలా నిశ్చేతనంగా పడి ఉన్న నన్ను చూసి సైన్యమంతా హాహాకారాలు చేసింది. రెండు కాళ్ళూ, రెండు చేతులూ చాచి క్రిందపడుతూన్న నాతండ్రిరూపం చనిపోయి నేల మీదపడుతున్న పక్షిరూపంలా ఉంది. వీరవరా! అలా పడుతూన్న అతణ్ణి శూలపట్టిసాలు ధరించిన శత్రువులు కొట్టారు. క్రూరమైన ఆ కృత్యం చూసి నామనస్సు చలించిపోయింది. అటుతరువాత

ఒకముహూర్తసమయానికి నాకు మెలకువ వచ్చింది. ఆ సమయానికి యుద్ధరంగంలో సౌభ విమానం జాడలేదు. శత్రువు శాల్వుడు కూడా లేడు. వృద్ధుడైన నాతండ్రి కూడా కనిపించలేదు. అపుడు నామనస్సులో ఇదంతా మాయ అని నిశ్చయం కలిగింది. తరువాత వెంటనే లేచి మళ్ళీ వందలకొద్దీ బాణాలను కురిపించాను.

23. సౌభ వధ - కృష్ణాదులు తమ నగరములకు వెడలుట.

నేను నా శ్రేష్ఠమైన ధనువును తీసికొని, బాణాలతో రాక్షసుల తలలను సౌభంనుండి పడగొట్టాను. నా శార్ఙ్గధనువునుండి సర్పాలవంటి ఆకారంతో పైకి వెళ్ళే సూర్యకిరణాలవంటి బాణాలను శాల్వునిపై ప్రయోగించాను. అపుడు సౌభవిమానం మాయచేత కప్పబడి, కనబడలేదు. నేను ఆశ్చర్యపోయాను. నేను నిశ్చలంగా ఉండగా, వికృతాలైన ముఖాలు, కేశాలు గల ఆ దానవ సంఘాలు గట్టిగా అరిచాయి. అపుడు వారిని చంపటంకోసం ఆ మహాసంగ్రామంలో వెను వెంటనే శబ్దవేధి అయిన బాణాన్ని సంధించాను. దాన్ని చూసి వారు శబ్దం చేయక శాంతించారు. సూర్యునిలా ప్రకాశిస్తూ, మండుతున్న, శబ్ద వేధులైన ఆ బాణాలచేత ఇంతకు ముందు శబ్దం చేసిన ఆ రాక్షసు లందరూ మరణించారు. ఆ శబ్దం శాంతించగానే, మరల మరొక వైపున శబ్దం వచ్చింది. దానిపై మరల అటువంటి బాణాలనే ప్రయోగించాను. ఈ విధంగా పది దిక్కులయందు క్రింద, మీద అంతటా ఆ అసురులు శబ్దం చేశారు. వారందరినీ నేను చంపాను. ఆ తరువాత స్వేచ్ఛాగమనంగల ఆ సౌభవిమానం ప్రాగ్జ్యోతిషపురానికి సమీపంలో నా కళ్ళకు భ్రమను కలిగిస్తూ కనబడింది. అనంతరం భయంకరమైన ఆకారంతో శాల్వుడు హఠాత్తుగా పెద్ద రాళ్లవర్షంతో నన్ను ఆక్రమించాడు. రాజేంద్ర! శిలావర్షం దెబ్బలకు నేను పర్వతాలచేత కప్పబడిన వల్మీకంవలె ఉన్నాను. రాజా! అపుడు పర్వతాలచేత కప్పబడి గుఱ్రాలతో, సారథితో పాటుగా ఉన్న నేను ఎవరికీ కనబడలేదు. నావెంట ఉన్న వృష్ణివంశీయులైన వీరులు, సైనికులు భయకంపితులై కంగారుతో అన్ని దిక్కులకు పరుగులెత్తారు. భూమ్యాకాశాలలో, స్వర్గంలోను కూడ నేను కనబడక పోవడంవల్ల అంతటా హాహాకారాలు చెలరేగాయి. అపుడు నాస్నేహితులంతా ఖిన్న మనస్కులై దుఃఖంతో, శోకంతో రోదించారు. ఆక్రోశించారు. శత్రువులకు ఆనందం కలిగింది. మిత్రులకు దుఃఖం కలిగింది. ఈ విధంగా శాల్వుడు నాపై విజయం పొందాడు. ఈ విషయం నేను స్పృహ కలిగాక సారథి ద్వారా విన్నాను.

ఆ తరువాత నేను అన్ని పాషాణాలను చీల్చగలిగిన వజ్రాయుధాన్ని గైకొని,నాపై ఉన్న పర్వతాలన్నింటిని ముక్కలు ముక్కలు చేశాను. అపుడు ఆతిముక్కల భారానికి

బాధపడిన నాగుర్రాలు ప్రాణావశిష్టాలై చేష్టలుడిగి కంపించసాగాయి. ఆకాశంలో ఆవరించిన మేఘసముదాయాన్ని చీల్చుకొని బయటపడిన సూర్యునిలా, శిలలపుట్టలో నుండి బయటపడ్డ నన్ను చూసి బంధువులంతా ఆనందించారు. పర్వతాలభారంతో బాధపడి, చేష్టలుడిగి అల్పప్రాణావశిష్టాలైన గుర్రాలను చూసి సూతుడు నాతో సమయోచితమైన మాటను చెప్పాడు. 'శ్రీకృష్ణా! బాగు బాగు. అలా చూడు. సౌభపతి శాల్వుడు అక్కడున్నాడు. ఇక ఉపేక్షించినది చాలు. అతణ్ణి చంపడానికి మంచి ప్రయత్నం చెయ్యి. కేశవా! ఇపుడు శాల్వుని పట్ల మృదుత్వాన్ని, స్నేహభావాన్ని వదలిపెట్టు. ఇక వెంటనే శాల్వుని చంపు. అతడిని జీవించనీయకు. వీరశ్రేష్ఠా! **అన్నివిధాలైన పరాక్రమాలతో శత్రువు చంపదగినవాడు. శత్రువుదుర్బలు డైనప్పటికీ బలవంతుడు అవహేలన చేయకూడదు.** పురుషసింహా! శత్రువు తన ఇంట్లో ఆసనం మీద కూర్చున్నవాడైనా సరే చంపదగినవాడే. ఇక యుద్ధంలో ఉంటే వేరే చెప్పాలా! కాబట్టి నీవు అన్నివిధాలైన ప్రయత్నం చేత ఇతడిని చంపు. కాలం మించిపోకూడదు. ఇతడు సున్నితంగా (సామోపాయంతో) లొంగేవాడు కాదు. నీకు మిత్రుడూ కాదు. పైగా నీ ద్వారకపై దండెత్తి నాశనం చేసినవాడు. అట్టివాడితో నీవిపుడు యుద్ధం చేస్తున్నావు,' కుంతీనందనా! ఈ విధమైన సారథి మాటలను విని, ఇది నిజమే అని అనుకొని సౌభపతి శాల్వరాజును చంపడానికి దృఢసంకల్పం చేసికొన్నాను.

దారుకునితో 'వీరా! ఒక్క ముహూర్తకాలం ఉండు' అని చెప్పాను. వెనువెంటనే ఆగ్నేయాస్త్రాన్ని నా ధనుస్సున సంధించాను. అది రణరంగంలో అడ్డులేనిది. దివ్యమైనది, ఛేదింప శక్యంగానిది, మహాశక్తిగలది. నాకిష్టమైనది, అన్నింటిని సహించగలది, గొప్పకాంతి గలది. దానవుని చంపగలది. ఆ అస్త్రం యుద్ధంలో యక్షులను, రాక్షసులను, దానవులను, శత్రు రాజులను భస్మం చేయగలిగినంత గొప్పది. ఆ ఆగ్నేయాస్త్రంతో మంత్రించిన సుదర్శన చక్రం కత్తి అంచు కలిగి కాలాంతకునిలా, యమునిలా భయంకరమై ఉంది. అనుపమానమై శత్రునాశకమైన ఆ అస్త్రాన్ని అనుమంత్రించి, 'నీ శక్తిచే సౌభ విమానాన్నీ, నాశత్రువులను సంహరించు' అని పలికి కోపంతో దానిని శాల్వునిపై ప్రయోగించాను. ఆకాశంలో వెళుతూన్న ఆ సుదర్శన చక్రం యొక్క రూపం ప్రళయకాలంలో ప్రకాశించే రెండవ సూర్యునిలా ఉంది. ఆ చక్రం సౌభవిమానాన్ని సమీపించి బలమైన కర్రను నరికినట్లుగా తన పదునైన అంచులతో దాన్ని మధ్యగా చీల్చివేసింది. మహేశ్వరుని శరాఘాతానికి త్రిపురాలు పడినట్లుగా సుదర్శన చక్రంయొక్క బలమైన దెబ్బకు సౌభవిమానం రెండు ముక్కలైంది. ఆ విధంగా ఆ సౌభవిమానం నేల కూలగానే, చక్రం నాచేతికి తిరిగివచ్చింది. దానిని గ్రహించి మరల వేగంగా 'శాల్వునికొరకు' అని చెప్పి ప్రయోగించాను.

అప్పుడది గదా ప్రహారాలతో యుద్ధం చేస్తున్న శాల్వుని రెండుగా చీల్చివేసి ఉజ్జ్వలంగా ప్రకాశించింది. దానవవీరుడు శాల్వుడు మరణించాడు, దానవులంతా భీతావహు లయ్యారు. నాబాణాలచే హింసింపబడి, హాహాకారాలు చేస్తూ అన్ని దిక్కులకు పరుగెత్తారు. నేను నా రథాన్ని సౌభసమీపంలో నిలిపి, ఆనందంతో శంఖాన్ని పూరించి, మిత్రులకు ఆనందాన్ని కల్గించాను. మేరు పర్వత శిఖరాకారంలో ఉన్న, ఆ సౌభవిమానంలోని అంతస్తులు గోపురాలు తగలబడుతూంటే అందులోని స్త్రీలు ఇటు అటు పరుగులెత్తారు. సౌభవిమానాన్ని నాశనం చేసి, శాల్వుని చంపి, ఆనర్తదేశానికి (ద్వారకకు) తిరిగి వచ్చి, స్నేహితు లందరికీ ప్రీతిని కల్గించాను. నేను హస్తినాపురానికి రాకపోవడానికి కారణం ఇది. నేను వచ్చి ఉంటే జూదం జరిగి ఉండేదికాదు. లేదా దుర్యోధనుడు జీవించి ఉండేవాడు కాదు. ఆనకట్ట తెగిన తర్వాత నీటిని ఆపశక్యంగానట్లే, ఇపుడు నేనేం చేయగలను?' శ్రీకృష్ణుడు ఈ విధంగా చెప్పి, పాండవుల అనుమతి తీసికొని ద్వారకకు బయలుదేరాడు. శ్రీకృష్ణుడు ధర్మరాజుకు నమస్కరించాడు. యుధిష్ఠిరుడు, భీముడు మహాభుజుడైన శ్రీకృష్ణుని శిరస్సును ప్రేమతో ఆఘ్రాణించారు. అర్జునుడు శ్రీకృష్ణుని కౌగిలించుకొన్నాడు. నకుల సహదేవులు కృష్ణుడికి నమస్కరించారు. ధౌమ్యుడు గౌరవించాడు. ద్రౌపది శ్రీకృష్ణుని కన్నీటితో పూజించింది. ఈ విధంగా పాండవులచే గౌరవింపబడిన శ్రీకృష్ణుడు, సుభద్రను, అభిమన్యునీ తన బంగారు రథం ఎక్కించి, తనూ ఎక్కాడు. యుధిష్ఠిరుని ఊరడించి శైబ్యసుగ్రీవాలనే గుర్రాలు పూన్చబడి, సూర్యునిలా ప్రకాశిస్తూన్న రథంమీద శ్రీకృష్ణుడు ద్వారకకు చేరుకొన్నాడు. శ్రీకృష్ణుడు వెళ్ళిన తర్వాత ధృష్టద్యుమ్నుడు ద్రౌపదీనందనులను తీసికొని తననగరానికి వెళ్లాడు. చేదిరాజు ధృష్టకేతువు పాండవులను చూచి, తనసోదరి, నకులునిభార్య అయిన కరేణుమతిని తీసికొని అందమైన తన శుక్తిమతీ నగరానికి వెళ్ళాడు. కేకయరాజకుమారులు కూడ అమితతేజస్వి అయిన ధర్మరాజును, తక్కిన పాండవులను ఊరడించి, వారి అనుమతి తీసికొని వెళ్ళారు. యుధిష్ఠిరునితో వచ్చిన బ్రాహ్మణులు, వైశ్యులు, పలుమార్లు చెప్పినప్పటికిని పాండవులను విడిచివెళ్ళలేదు. ఆ సమయంలో కామ్యకవనంలో గొప్ప అద్భుతమైన మహాత్ముల సమ్మేళనం జరిగింది. యుధిష్ఠిరుడు అక్కడి బ్రాహ్మణు లందరి అనుమతితీసికొని 'రథాలను సిద్ధం చేయండి' అని సేవకులను ఆజ్ఞాపించాడు.

23. ద్వైతవనమునకు వెళ్ళు పాండవులను చూచి ప్రజలు వ్యాకులపడుట.

శ్రీకృష్ణుడు వెళ్ళిన తర్వాత, ఈశ్వరునిలా ప్రకాశిస్తున్న, యుధిష్ఠిర, భీమ, అర్జున, నకులసహదేవులు, ద్రౌపది, పురోహితుడు ధౌమ్యుడూ కలిసి మంచిగుర్రాలు పూన్చిన

యోగ్యరథాలనెక్కి, బ్రాహ్మణులకు బంగారు నాణాలను, వస్త్రాలను, గోవులను దానం చేసి, వేరొక వనానికి (ద్వైతవనానికి) బయలుదేరారు. శ్రీకృష్ణునితోబాటుగ శస్త్రధారులైన ఇరవైమంది (సైనికులు)సేవకులు, ధనుస్సులను, శస్త్రాలను, ప్రకాశిస్తున్న బాణాలను, నారులను, యంత్రాలను, సాయకాలను తీసికొని ముందుగా పశ్చిమదిక్కునకు (ద్వారకవైపునకు) వెళ్ళారు. అనంతరం సారథి ఇంద్రసేనుడు రాజకుమారి సుభద్ర యొక్క వస్త్రాలను, భూషణాలను, దాదులను, దాసీలను తీసికొని తొందరగా రథంమీద పశ్చిమదిక్కునకు వెళ్లాడు. ఔదార్యం గల పౌరులు యుధిష్ఠిరుని దగ్గరకు వచ్చి, అతనికి ప్రదక్షిణం చేశారు. కురుజాంగల దేశీయులైన ముఖ్య లందరూ, బ్రాహ్మణులూ ప్రసన్నులై అతడితో మాట్లాడారు. సోదరులతోబాటుగ ధర్మరాజుకూడ ప్రసన్నుడై వారితో మాట్లాడాడు. కురుజాంగలదేశంలోని ఆ జనసమూహాన్ని చూసి మహాత్ముడైన యుధిష్ఠిరుడు కొంతకాలం అక్కడున్నాడు. పుత్రులపట్ల తండ్రివలె, ఆ జనులపట్ల ధర్మరాజు తన హృదయాన్ని విప్పి వ్యవహరించాడు. వారు కూడా తండ్రిపట్ల పుత్రులవలె అనురక్తులై ప్రవర్తించారు.

రాజా! అనంతరం అక్కడి జనసమూహమంతా కురుప్రవీరుడైన యుధిష్ఠిరుని చుట్టూ చేరి భీతులై, కన్నీటిముఖాలతో "హా నాథా! హా ధర్మరాజా!' అని ఆక్రోశిస్తూ ఈ విధంగా అడిగారు - 'రాజా! కురుశ్రేష్ఠుడై మమ్ములను తండ్రివలె చూసే, ధర్మరాజు ఇక్కడి పౌరులను, జానపదులను అందరిని విడిచి ఎక్కడకు వెళ్తున్నాడు? నరేంద్రా! క్రూరబుద్ధియైన దుర్యోధనుని ధిక్కరిస్తున్నాం. సౌబలుడైన శకునిని, పాపమతియైన కర్ణుని కూడ తిరస్కరిస్తున్నాం. నిత్యమూ ధర్మతత్పరుడవైన నీకే ఈవిధంగా అనర్థాన్ని కోరుతున్న ఆ పాపాత్ములందరిని తిరస్కరిస్తున్నాం. మహాత్ముడు అయిన ధర్మరాజు స్వయంగా అనుపమానమైన (పోలికయే లేనట్టి) ఈ ఇంద్ర ప్రస్థపురాన్ని నిర్మించి, తానే దానిని వదలి ఎక్కడకు వెళ్తున్నాడు? మహాత్ముడైన మయుడు దేవసభవలె ప్రకాశించే మయసభను నిర్మించాడు. దేవతలచే రక్షింపబడినట్లుగానున్న దేవమాయా రూపమైన ఈ మయసభను వదిలి ధర్మరాజా! ఎక్కడకు బయలుదేరావు? ధర్మార్థకామాల నెరింగిన, పరాక్రమవంతుడైన అర్జునుడు అచటి జనసమూహానికి ఉచ్చైఃస్వరంతో ఇలా చెప్పాడు టయుధిష్ఠిరమహారాజు ఈ వనవాస నియమాన్ని పూర్తిచేసి, శత్రువులైన ధార్తరాష్ట్రుల కీర్తిని తిరిగి లాక్కుంటాడు. బ్రాహ్మణ శ్రేష్ఠులారా! మీరంతా కలిసి, విడివిడిగా కూడా తాపసులను, ధర్మార్థ వేత్తలను కలిసి ప్రసన్నులను చేసికొని చక్కగా కార్యసిద్ధి కలగాలని ప్రార్థించండి.' ఈ విధంగా అర్జునుడు చెప్పగానే, అక్కడి బ్రాహ్మణులు, అన్ని వర్ణాలవారూ ఆనందంతో అభినందించారు. వారంతా కలిసి ధర్మాత్ములలో శ్రేష్ఠుడైన యుధిష్ఠిరునికి

ప్రదక్షిణం చేశారు. అనంతరం వారంతా యుధిష్ఠిర భీమార్జున నకుల సహదేవులను, ద్రౌపదిని సెలవడిగి తమ రాష్ట్రానికి ప్రయాణమయ్యారు.

24. పాండవులు ద్వైతవనమునకు వెళ్ళుట.

కురుజాంగలదేశీయులైన జనులంతా వెళ్ళాక ధర్మాత్ముడు, సత్యప్రతిజ్ఞుడు, అయిన యుధిష్ఠిరుడు తన సోదరు లందరితో ఇలా అన్నాడు. 'ఈ పన్నెండు సంవత్సరాలు నిర్జనమైన వనంలో నివసించాలి. అనేక పశుపక్ష్యాదులుండే ప్రదేశాన్ని ఈ మహారణ్యంలో పరిశీలించండి. పలు పుష్ప ఫలాలు కలిగి అందమై, మంగళకరమై, పుణ్యాత్ములుగల ప్రదేశాన్ని చూడండి. ఈ పన్నెండు సంవత్సరాలు మనం అక్కడ సుఖంగా నివసించగలగాలి', అన్నాడు. అపుడు ధనంజయుడు ఉదారమనస్కుడు, మానవగురువూ అయిన ధర్మరాజును గురుతుల్యునిగా సంభావించి, అతనితో ఇలా అన్నాడు. 'మహర్షులకు వృద్ధులకు నీవే సేవింపదగినవాడవు. ఈ మానవలోకంలో నీకు తెలియనిది ఏమీ లేదు. భరతశ్రేష్ఠా! నీవు నిత్యం బ్రాహ్మణులను, నారదుడు, ద్వైపాయనుడు మున్నగు మహాతపస్వులను సేవిస్తావు. ఇంద్రియాలను వశమందుంచుకొని దేవలోకంనుండి బ్రహ్మలోకంవరకు, సర్వలోకాలను, గంధర్వ, అప్సరల లోకాలను నిత్యం సంచరించే మహాతపస్వి అయిన నారదుని నీవు సేవిస్తావు రాజా! నీవు బ్రాహ్మణులందరి అనుభావాలను ప్రభావాలను ఎరుగుదువు. ఇందులో సందేహం లేదు. రాజా! శ్రేయః కారణమైన జ్ఞానాన్ని తెలిసిన వాడవు నీవే. మహారాజా! నీవెక్కడ ఉండాలని భావిస్తే అక్కడే నివాసం ఉందాం. ఇది ద్వైతవనం. ఇందులో చక్కని సరస్సు లున్నాయి పవిత్రజలం గలిగి ఆస్వాదయోగ్యంగా ఉన్నాయి. ఎన్నో పూలు, పళ్ళు ఇక్కడ ఉన్నాయి. అనేక పక్షులతో కూడి ఇది అందంగా ఉంటుంది. ఇక్కడ ఈ పన్నెండు సంవత్సరాలూ మనం నివసించ గలమని నేను అభిప్రాయపడుతున్నాను. రాజా! నీకిష్టమైతే మనం ఇక్కడ ఉందాం. లేక మరొక ప్రదేశం ఉత్తమమైందిగా నీవు భావిస్తున్నావా! అపుడు యుధిష్ఠిరుడిలా అన్నాడు - 'పార్థా! నీవు చెప్పినది నాకు కూడా ఇష్టమే. పుణ్యాత్ములచే ప్రసిద్ధికెక్కిన సరస్సులున్న ద్వైతవనానికే వెళ్దాం.'

అపుడు ధర్మాచారతత్పరులైన ఆ పాండవులంతా పలువురు బ్రాహ్మణులతో కూడి, పవిత్రమైన ద్వైతవనానికి వెళ్లారు. అప్పుడు పలువురు అగ్నిహోత్రం చేసే బ్రాహ్మణులు అగ్నిహోత్రం లేని బ్రాహ్మణులు స్వాధ్యాయం అధ్యయనం చేసే బ్రహ్మచారులు, భిక్షువులు, వనచరులు, తపస్సిద్ధులు, మహాత్ములు కఠోరనియమాలు పాటించే బ్రాహ్మణులు యుధిష్ఠిరుని

సమీపించారు. పలువురు బ్రాహ్మణులతో బాటు పాండవులు పుణ్యమైన, రమ్యమైన ద్వైతవనానికి చేరుకొన్నారు. రాజ్యాధిపతి అయిన యుధిష్ఠిరుడు తమాల, తాల, ఆమ్ర, మధూక, నీప, కదంబ, సాల, అర్జున, కర్ణికారవృక్షాలతోను, గ్రీష్మఋతువు గడిచాక పూలుపూసే అనేక వృక్షాలతోనూ కూడిన మహావనాన్ని చూశాడు. ఆ వనంలోని పెద్దపెద్ద చెట్ల చిటారుకొమ్మల మీద నెమళ్ళు, చకోరాలు, చాతకాలు, కోకిలలు మొ పక్షుల సమూహాలు కలకలారావాలు చేస్తూ నివసిస్తున్నాయి. ఆ వనంలో యుధిష్ఠిరుడు పర్వతాకారంలో ఉన్న మదించిన ఏనుగుల గుంపులు ఆడఏనుగులతో కలిసి తిరుగుతూండడం చూశాడు.

మనోజ్ఞమైన సరస్వతీనదిలో స్నానంచేసి పవిత్రులై నారవస్త్రాలు, జటలను ధరించి ధర్మాత్ము లయిన వారి నివాసాలలో ఉన్న అనేక సిద్ధగణాలను, ఋషిగణాలను యుధిష్ఠిరుడు చూశాడు. అనంతరం సోదరులతో, జనులతోబాటు ధర్మరాజు రథంనుండి దిగి, ఇంద్రుడు స్వర్గంలో ప్రవేశించినట్లుగ ఆ వనంలోకి ప్రవేశించాడు. సత్యసంధుడు, మనస్వి అయిన యుధిష్ఠిరుని చూడాలని చారణసిద్ధసంఘాలు, వనంలో నివసిస్తున్న వారు త్వరగా అతనిని సమీపించి చుట్టూ నిలిచారు. అపుడు యుధిష్ఠిరుడు సిద్ధులందరికి అభివాదం చేశాడు. వారుకూడ అతడిని రాజులా, దేవునిలా పూజించారు. ధర్మరాజు అంజలిబద్ధుడై బ్రాహ్మణశ్రేష్ఠులతో పాటుగ వనంలో ప్రవేశించాడు. ఆ వనంలో ఉన్న ధర్మపరు లైన తపస్వీజనులు పుణ్యాత్ముడైన ధర్మరాజును సమీపించి అతనిని తండ్రివలె గౌరవించారు. అపుడు యుధిష్ఠిరుడు బాగా పూలు పూసిన ఒక పెద్ద చెట్టుక్రింద కూర్చున్నాడు. అనంతరం పరాధీనదశలో ఉన్న భీమార్జున నకులసహదేవులు, ద్రౌపది, అనుచరులు రథాలు దిగి భరతశ్రేష్ఠ డైన యుధిష్ఠిరుని చెంతకు వచ్చారు. మహాపర్వతం గజరాజులతో శోభిల్లినట్లుగా, ఆశ్రయం కోసం చేరిన ధనుర్ధరులైన ఆ పంచపాండవులతో కూడి లతాసమూహాలచే వంగిన ఆ మహావృక్షం శోభిల్లుతోంది.

25. మార్కండేయమహర్షి పాండవులకు ధర్మము నుపదేశించి, ఉత్తరదిక్కుగా వెళ్ళుట.

భోగా లనుభవించడానికి యోగ్యులైన పాండవులు కష్టమైన వనవాసానికి ఆ ద్వైతవనానికి చేరారు. ఇంద్రునితో సమానమైన తేజస్సంపన్నులైన ఆ పాండవులు సరస్వతీనదీతీరాన సాలవనంలో విహరించారు. కురుశ్రేష్ఠుడైన యుధిష్ఠిరుడు యతులను మునులను బ్రాహ్మణముఖ్యుల నందరిని ఉత్తమ మూలఫలాలతో సంతృప్తి పరిచాడు. తేజస్సంపన్నుడైన పురోహితుడు ధౌమ్యుడు తండ్రివలె ఆ మహావనంలో పాండవులకు

సంబంధించిన యజ్ఞాలను, పితృసంబంధక్రియలను చేశాడు. రాజ్యానికి దూరంగా వనంలో నివసిస్తూన్న పాండవుల ఆశ్రమానికి ప్రాచీన మహర్షి మార్కండేయుడు అతిథిగా వచ్చారు. మార్కండేయుడు మండుతున్న అగ్నిలా ప్రకాశిస్తున్నాడు. దేవతలచే, ఋషులచే, మానవులచే పూజింపబడే మహాముని మార్కండేయ మహర్షి. మహామనస్వి, కురుశ్రేష్ఠుడు అయిన యుధిష్ఠిరుడు మహర్షిని సముచితంగా పూజించాడు. ఆ మార్కండేయ మహర్షి. అక్కడి తపస్వులందరి మధ్యలో ద్రౌపదిని, యుధిష్ఠిరుని, భీమార్జునులను, నకులసహదేవులను చూసి, మనసులో శ్రీరామచంద్రుని స్మరించి చిరునవ్వు నవ్వాడు. అపుడు యుధిష్ఠిరుడు విమనస్కు డైనట్లుగా ఇలా అడిగాడు – 'మునివరా! ఇక్కడి తపస్వులంతా నా అవస్థను చూసి జాలి పడుతున్నారు. కాని వీరందరూ చూస్తుండగా, నన్ను చూసి నీవు ఆనందంతో నవ్వుతున్నావు. ఎందుకు?'

మార్కండేయుడిలా అన్నాడు – 'నాయనా! నేను ఆనందించటమూలేదు. నవ్వటమూ లేదు. ఆనందంవల్ల కలిగే గర్వం నన్నెప్పుడూ తాకదు. ఇపుడు నీకు కలిగిన కష్టాన్ని చూసి సత్యవ్రతుడు, దశరథనందనుడు అయిన రాముని స్మరించాను. అతడు కూడా తండ్రి శాసనంవల్లనే రాజకుమారుడైనా సోదరుడు లక్ష్మణునితో కలిసి వనంలో నివసించాడు. పార్థా! ధనుర్ధరుడై ఋష్యమూక పర్వతసానువులందు తిరుగుతున్న అతనిని పూర్వం నేను చూశాను. దశరథనందనుడైన ఆ శ్రీరాముడు ఇంద్రునితో సమానమైనవాడు, మహాత్ముడు, యముని నియంత్రించినవాడు, నముచి అనే రాక్షసుని చంపినవాడు, పాపరహితుడు. అట్టివాడు తండ్రి ఆజ్ఞచే స్వధర్మాన్ని గుర్తించి వనవాసం చేశాడు. అతడుకూడా ఇంద్రునితో సమానమైన ప్రభావంకలవాడు. మహానుభావుడు, యుద్ధంలో అజేయుడు, అట్టివాడు భోగాలన్నింటిని విడిచి వనంలో సంచరించాడు. అందువల్ల బలం కలిగినంత మాత్రాన అధర్మం చేయకూడదు. నాయనా! నాభాగుడు, భగీరథుడు మున్నగువారు సాగరాంతంవరకు కల ఈ భూమిని జయించి, సత్యంతో ఈలోకాలను కూడా వారు జయించారు. అందువల్ల **బలముందికదా అని అధర్మం చేయకూడదు.** నరశ్రేష్ఠా! కాశీ, కరూషదేశాలకు రాజైన అలర్కుని సత్పురుషునిగ, సత్యవ్రతునిగ చెపుతున్నారు. అతడు రాజ్యాలను సంపదలను త్యాగంచేసి, ధర్మాన్ని ఆశ్రయించాడు. అందువల్ల బలవంతుణ్ణి కదా అని అధర్మం చేయకూడదు. నరశ్రేష్ఠా! పార్థా! పురాతనాలైన వేదాలలో ధాత (బ్రహ్మ) విధించిన దానిని గౌరవించి ఆచరించటం చేతనే సత్పురుషులైన సప్తర్షులు దేవలోకంలో ప్రకాశిస్తున్నారు. అందువలన బలవంతుణ్ణి కదా అని అధర్మం చేయకూడదు. నరేంద్రా! పర్వతశిఖరాలవలె ఉన్న మహాబలిష్ఠాలైన దంతాలున్న ఈ ఏనుగులను చూడు!

ఇవి కూడా బ్రహ్మయొక్క ఆజ్ఞను పాటిస్తున్నాయి. నరేంద్రా! సమస్తప్రాణులూ బ్రహ్మయొక్క విధానం ప్రకారంగా తమతమ పుట్టుకలకు అనుగుణంగా విహితకర్మలను ఆచరిస్తున్నాయి. చూడు! అందువల్ల బలవంతుణ్ణి కదా అని అధర్మం చేయకూడదు. కుంతీనందనా! నీవు నీ సత్యంచేత, ధర్మంచేత, యథాయోగ్యమైన ప్రసంగంచేత, లజ్జమున్నగు సద్గుణాలచేత అన్ని ప్రాణులకంటె ఉన్నతంగా ఉన్నావు, నీ కీర్తి, దీప్తమైన ప్రకాశమూ అగ్ని సూర్యుల ప్రకాశంలా ఉంది. మహానుభావా! పార్థివా! నీవు ప్రతిజ్ఞ చేసినవిధంగా కష్టమైన ఈ వనవాసాన్ని గడిపి, అనంతరం నీ పరాక్రమంతో ప్రకాశిస్తూన్న రాజ్యలక్ష్మిని కౌరవులనుండి పొందుతావు.' మార్కండేయ మహర్షి తపస్సులమధ్య, స్నేహితులతో ఉన్న యుధిష్ఠిరునికి ఈ విధంగా చెప్పి, ధౌమ్య, పాండవుల అనుమతి గోరి, ఉత్తరదిక్కునకు బయలుదేరాడు.

26. బకదాల్భ్యుడు యుధిష్ఠిరునికి బ్రాహ్మణ ప్రభావమును చెప్పుట.

ద్వైతవనంలో మహాత్ములైన పాండవులు నివసిస్తూండగా, ఆ మహారణ్యమంతా బ్రాహ్మణులతో నిండిపోయింది. వేదఘోషతో, సరోవరాలతో కూడి ఉన్న ఆ ద్వైతవనం అన్నివైపులా బ్రహ్మలోకంతో సమానంగా పవిత్రమై విరాజిల్లింది. అక్కడ అంతటా ఋగ్యజుస్సామ వేదాలనూ, గద్య భాగాలను పఠిస్తున్నారు. వాటి ధ్వని హృదయంగమంగా (మనోహరంగా) ఉంది. క్షత్రియుల వింటినారిధ్వని, పండితులైన బ్రాహ్మణుల వేదఘోష కలిసి క్షత్రతేజం, బ్రహ్మతేజంతో (సంసృష్టి) మరల పెనవేసుకొన్నట్లుగా అందంగా ప్రకాశించింది. ఒకరోజున సంధ్యాసమయంలో ఋషులతో పరివృతుడై యుధిష్ఠిరుని సమీపించి, దల్భుని కుమారుడైన బకమహర్షి ఇలా చెప్పాడు. 'కురుశ్రేష్ఠా! ఈ ద్వైతవనంలో తపస్సులైన బ్రాహ్మణుల హోమ సమయంలో ప్రజ్వరిల్లుతున్న అగ్ని ఎంత అందంగా ఉందో చూడు. పవిత్రమైన వనంలో నీచే రక్షింపబడుతూ వ్రతనియమం పాటిస్తూ బ్రాహ్మణులు ధర్మాన్ని ఆచరిస్తున్నారు. భృగువంశీయులు, అంగిరసులు, వసిష్ఠవంశీయులు, కశ్యపవంశీయులు, అగస్త్యవంశీయులు, అత్రివంశీయులు, ఉత్తమవ్రతులై జగత్తంతటికి శ్రేష్ఠులైన బ్రాహ్మణులు వచ్చి నిన్ను కలుస్తున్నారు. సోదరులతో ఉన్న నీవు నేను చెప్పే మాట వినుము. బ్రాహ్మణులు క్షత్రియులతో, క్షత్రియులు బ్రాహ్మణులతో కలిసి ప్రబలులై గాలి, అగ్ని కలిసి వనాలను దహించినట్లుగా శత్రువులను దహిస్తారు.

నాయనా! ఇహలోక పరలోకాలను జయించాలనుకొనే రాజు బ్రాహ్మణుడు లేకుండగా ఎక్కువకాలం ఉండలేడు. ధర్మార్థాలను బాగా తెలిసి, మోహంలేని బ్రాహ్మణుని పొంది రాజు శత్రువులను నాశనం చేస్తాడు. బలిచక్రవర్తి ప్రజాపాలనకై ఏర్పరచిన ధర్మాన్ని

ఆచరిస్తూ, నిఃశ్రేయసధర్మాన్ని లోకంలో బ్రాహ్మణుడి నుండి తప్ప వేరొకనివల్ల పొందలేదు. బ్రాహ్మణునితో కలవడం వల్ల విరోచనుని కుమారుడైన బలి రాజ్యాన్ని పొంది, అక్షయమైన ఐశ్వర్యాన్ని పొంది, అవసరాలైన కామోపభోగా లన్నింటిని పొందాడు. అతడే బ్రాహ్మణులపట్ల దుర్మార్గంగా వ్యవహరించి నశించాడు. బ్రాహ్మణసహయోగంలేని క్షత్రియుడు ఐశ్వర్య పూర్ణమైన ఈ భూమిని ఎక్కువకాలం సేవించలేడు. బ్రాహ్మణుని ఉపదేశాలు పొందిన నీతిజ్ఞుడైన క్షత్రియునకు సముద్రపర్యంత మయిన భూమి శిరస్సు వంచుతుంది. యుద్ధంలో ఏనుగునకు మావటీని దూరంచేస్తే దానిబలం క్షీణించినట్లుగా, బ్రాహ్మణుల తోడ్పాటు లేని క్షత్రియుని బలం క్షీణిస్తుంది. బ్రాహ్మణుని విచారశక్తి (దృష్టి) (జ్ఞానం) పోలికలేనంతటిది. క్షత్రియునిది అప్రతిమమైన బలం, వారిద్దరూ కలిసి నడిస్తే సమస్తలోకం సుఖంగా ఉంటుంది. వాయువుతో కూడిన అగ్ని మహారణ్యాన్ని దహిస్తుంది. అదే విధంగా బ్రాహ్మణునితో కూడిన క్షత్రియుడు శత్రువును దహిస్తాడు. బుద్ధిమంతుడైనవాడు అలబ్ధమైనదాన్ని పొందటానికి, పొందినదాన్ని వృద్ధి చేసికోవడానికి బ్రాహ్మణుల ఆలోచనలోనే సంచరించాలి. రాజా! అప్రాప్తమైనదాన్ని పొందడానికి, పొందిన దాన్ని వృద్ధి చేసికోవడానికి యథాయోగ్యంగా ఉపాయాన్ని చెప్పడానికి నీవు యశస్వి, వేదవేత్త, పండితుడు, బహుశ్రుతుడు అయిన బ్రాహ్మణునే పోషించు. యుధిష్ఠిరా! బ్రాహ్మణులపట్ల నీహృదయభావం ఎల్లపుడూ ఉత్తమమైనది. అందుచేత ప్రశస్తమైన నీకీర్తి అన్నిలోకాలలోనూ ప్రకాశిస్తున్నది.' అపుడు అక్కడి బ్రాహ్మణులంతా దల్భకుమారుడైన బకుని పూజించారు. వ్యాసుడు, నారదుడు, పరశురాముడు, పృథుశ్రవసుడు, ఇంద్రద్యుమ్నుడు, భాలుకి, కృతచేతసుడు, సహస్రపాత్తు, కర్ణశ్రవసుడు, ముంజుడు, లవణాశ్వుడు, కాశ్యపుడు, హారీతుడు, స్థూణకర్ణుడు, అగ్నివేశ్యుడు, శౌనకుడు, కృతవాక్కు, సువాక్కు, బృహదశ్వుడు, విభావసువు, ఊర్ధ్వరేతుడు, వృషామిత్రుడు, సుహోత్రుడు, హోత్రవాహనుడు, మొదలగువారు, ఇంకా కఠోరనియమాలు గల బ్రాహ్మణులూ, మహర్షులూ దేవేంద్రుని అర్చించినట్లుగా అజాతశత్రువయిన ధర్మరాజును అర్చించారు.

27. ద్రౌపది తన క్రోధమును యుధిష్ఠిరునికి తెలుపుట.

అనంతరం ఒక సాయంకాల సమయంలో ద్రౌపదితో పాటుగ శోకపరాయణులైన పాండవులు కూర్చుండి మాట్లాడుకొంటూ ఉన్నారు. పతివ్రత అయిన ద్రౌపది ధర్మరాజుతో ఈ విధంగా మాటలాడింది. 'రాజా! క్రూరుడు, దుర్మార్గుడు, పాపి అయిన దుర్యోధనుడికి మనపట్ల కొంచెం కూడా విచారం లేదు అని భావిస్తున్నాను. దుర్బుద్ధి అయిన ఆ దుర్యోధనుడు నాతోబాటు నిన్ను కేవలం కట్టుకొన్న వస్త్రాలతో వనానికి పంపి, ఏమాత్రం

పశ్చాత్తాప పడటంలేదు. శ్రేష్ఠుడవు, ధర్మపరుడవూ అయిన నిన్ను గురించి అపుడు కఠినమైన మాటలాడిన దుర్యోధనునిది ఇనుమువంటి కఠినహృదయం. సుఖాలనుభవింపదగిన నీకు ఇటువంటి కష్టాన్ని కల్గించి, దుర్మార్గుడు, పాపి అయిన ఆ దుర్యోధనుడు తన స్నేహితులతోపాటు ఆనందిస్తున్నాడు. భరతశ్రేష్ఠా! నారబట్టలు కట్టుకొని నీవు వనవాసానికి బయలుదేరినపుడు కేవలం నలుగురు పాపాత్ముల నేత్రాల నుండి మాత్రమే అశ్రువులు రాలేదు. వారు దుర్యోధనుడు, కర్ణుడు, దుర్మార్గుడైన శకుని, దుఃశాసనుడు తక్కిన కురువంశీయులందరు దుఃఖంతో వ్యాకులపడ్డారు. వారినేత్రాల నుండి అశ్రుబిందువులు రాలాయి. మహారాజా! ఇపుడు నీవు నిదురించే శయ్యను చూస్తే, మునుపు నీ రాజోచితమైన శయ్య గుర్తుకువచ్చి, నీగురించే దుఃఖిస్తున్నాను. నీవు కష్టాలు పడదగిన వాడవు కాదు. సుఖా లనుభవింపదగినవాడవు. సభామధ్యంలో ఏనుగుదంతాలతో నిర్మితమయిన రత్నసింహాసనం చూసిన నేను దర్భలతో చేయబడిన ఈ ఆసనాన్ని చూస్తే, దుఃఖం నాహృదయాన్ని దహించేస్తోంది. మునుపు ఇంద్రప్రస్థంలో సభలో రాజులందరితో కూడి ఉన్న నిన్ను చూశాను. ఆ స్థితిలో ఇక్కడ నిన్ను చూడలేని నాహృదయానికి శాంతి లేదు. సూర్యుని వంటి తేజస్సుతో, మంచిగంధం పూయబడిన నిన్ను చూసే నాకు ఇపుడు బురద, ధూళి అంటిన నిన్ను చూస్తే ఎంతో దుఃఖం కలుగుతోంది. మునుపు స్వచ్ఛంగా ప్రకాశిస్తున్న పట్టువస్త్రాలను ధరించిన నిన్ను చూశాను. ఇపుడిలా నారబట్టలు కట్టుకొన్న నిన్ను చూడవలసివచ్చింది.

అపుడు మన ఇంటినుండి వేలకొలది బ్రాహ్మణులకు రుచికరమైన పలువంటకాలతో, బంగారు పాత్రలతో అన్నం తీసికొని వెళ్ళేవారు. రాజా! యతులకు, బ్రహ్మచారులకు, గృహస్థులకు మిక్కిలి రుచికరమైన భోజనం అపుడు పెట్టబడేది. మునుపు రాజభవనంలో బంగారుపాత్రలు ఇష్టాలైన వంటకాలతో నిండి ఉండేవి. ప్రతిదినమూ బ్రాహ్మణులను వారివారి ఇష్టాలకు అనుగుణంగా సత్కరించేవాడివి. ఆ వైభవమంతా ఇపుడు చూడలేని నాహృదయానికి శాంతి ఎక్కడిది? మహారాజా! అందమైన కుండలాలు చెవులకు ధరించిన, యువకులైన నీ సోదరులు, రుచికరాలైన వంటకాలతో భుజించేవారు. అట్టివారు ఇపుడు వన్యాలైన కందమూలఫలాలతో జీవించడం నేను చూస్తున్నాను. ఇక నాహృదయానికి శాంతి ఎక్కడిది? నీ సోదరులను చూస్తూంటే నా మనస్సు శాంతించడం లేదు. ఈ వనవాసకష్టాన్ని అనుభవిస్తూ దుఃఖిస్తూన్న ఈ భీమసేనుని గురించి తలచుకొంటూన్న సమయంలో నీకు శత్రువుల పట్ల కోపం కలగటం లేదా! యుద్ధంలో వెన్ను చూపనివీరుడు ఈనాడు స్వయంగా పనులన్నీ చేస్తున్నాడు. సుఖభోగాలకు అర్హుడు, దుఃఖం అనుభవిస్తున్నాడు.

భీమసేనుణ్ణి చూస్తే నీకు క్రోధం ఎందుకు రావటంలేదు? వివిధాలైన వాహనాలచేత, ఉన్నతాలైన పలువస్త్రాలచేత సత్కారాలుపొందిన భీమసేనుడు వనంలో కష్టా లనుభవిస్తూంటే నీకు కోపం ఎందుకు రావటంలేదు? శక్తిశాలి అయిన భీమసేనుడు యుద్ధంలో కౌరవు లందరినీ చంపడానికి ఉత్సాహపడుతున్నాడు. కాని నీప్రతిజ్ఞాపూర్తికై నిరీక్షిస్తూ శత్రువుల అపరాధాన్ని సహిస్తున్నాడు.

మహారాజా! నీసోదరుడు అర్జునుడు రెండుబాహువులే ఉన్నా, అనేకబాహువులు కల కార్తవీర్యార్జునునితో సమానుడు. బాణాలతో హింసించడంలో వేగం కలవాడవటం వల్ల కాలాంతక యములతో పోలినవాడు. అతని శస్త్రాల ప్రతాపం చేత రాజు లందరూ శిరసులు వంచారు. వారంతా నీయజ్ఞంలో బ్రాహ్మణులను సేవించడానికి వచ్చారు. అటువంటి పురుషసింహుడు, దేవదానవులచే పూజింపబడిన అర్జునుని తలచుకొంటూంటే నీకు శత్రువులపై కోపం ఎందుకు కలగడం లేదు? దుఃఖించడానికి యోగ్యుడు కాని అర్జునుడు వనంలో కష్టాలు పడుతూంటే చూసి, నీకు కోపం రావటంలేదు. అందుచేత నేను బాధపడుతున్నాను. ఒకే ఒక్క రథంతో దేవతలను, మనుష్యులను, నాగులను జయించిన అర్జునుడు వనవాసం చేస్తూంటే చూసిన నీకు కోపం ఎందుకు రావటంలేదు? పరాజితులైన రాజులనుండి అద్భుతాకారంగల గుర్రాలు, ఏనుగులు, సంపదలు తీసికొని వచ్చినవాడు ఒకేవేగంతో ఐదువందల బాణాలను వేయగలవాడు అయిన అర్జునుడు వనవాసం చేస్తూంటే చూసిన నీకు కోపం ఎందుకు రావటంలేదు? యుద్ధంలో ఖడ్గమూ, డాలు ధరించి యుద్ధంచేసే వీరశ్రేష్ఠుడు నకులుడు వనంలో ఉండడం చూసి నీకు క్రోధం ఎందుకు రావటంలేదు? యుధిష్ఠిరా! చూడచక్కనివాడు, శూరుడు, మాద్రీపుత్రుడూ అయిన సహదేవుని ఈ స్థితిలో చూసిన నీవు శత్రువులను ఇంకా ఎందుకు క్షమిస్తున్నావు? కష్టా లనుభవించడానికి తగనివారై కూడా, దుఃఖిస్తున్న నకులసహదేవులను చూసి నీకు క్రోధం ఎందుకు రావటంలేదు? ద్రుపదుని వంశంలో పుట్టి, మహాత్ముడైన పాండురాజునకు కోడలనై, ధృష్టద్యుమ్నుని సోదరినై, వీరపత్నిని పతివ్రతను అయిన నన్ను వనవాసం చేస్తూండగా చూసి, నీవు శత్రువులను ఎందుకు క్షమిస్తున్నావు? భరతసత్తమా! ఇది నిశ్చయం. నీహృదయంలో శత్రువుల పట్ల కోపంలేదు. నీసోదరులనూ, నన్నూ ఈ స్థితిలో చూసినా నీమనస్సు బాధపడటంలేదు. ఈ లోకంలో కోపంలేని క్షత్రియుడు లేడని నిర్వచనం. కాని క్షత్రియుడవైన నీ విషయంలో ఆ నిర్వచనం విపరీతమైనట్లుగా కనబడుతోంది. పృథానందనా! సమయం వచ్చినపుడు పరాక్రమాన్ని చూపనివానిపట్ల అన్నిప్రాణులూ తిరస్కారాన్ని చూపుతాయి. మహారాజా! అందువల్ల నీవు ఏవిధంగా

కూడా శత్రువులను క్షమించకూడదు. పరాక్రమంతోనే వారు చంపశక్యం అవుతారు. ఇందులో సందేహం లేదు. అదేవిధంగా సహనం వహించవలసిన సమయంలో శాంతిని పొందని క్షత్రియుడు కూడా ప్రాణు లందరికి అప్రియుడే అవుతాడు. అతడు ఇహపరలోకాలలో నశిస్తాడు.

28. ప్రహ్లాద-బలి సంవాదమును ద్రౌపది వర్ణించుట.

ఈ విషయంలో పురాతన ఇతిహాసమైన బలి-ప్రహ్లాదుల సంవాదాన్ని ఉదాహరిస్తారు. దైత్యులకు రాజైన ప్రహ్లాదుడు మిక్కిలి తెలివైనవాడు, ధర్మ రహస్యా లన్నింటిని తెలిసినవాడు. ఒకనాడు బలి తన పితామహుడైన ప్రహ్లాదుని ఇలా అడిగాడు. 'తాతా! పరాక్రమం శ్రేయస్కరమైనదా లేక సహనం శ్రేయస్కరమైనదా? ఈ విషయంలో నాకు సందేహం కలిగింది. ఉన్నదున్నట్లుగా చెప్పు. ఈ రెండింటిలో ఏది శ్రేయమో నాకు తప్పక చెప్పు. నీవు చెప్పినది యథాతథంగా ఆచరిస్తాను. తన సందేహాన్ని అడిగిన బలికి అతని పితామహుడు, ప్రాజ్ఞుడు, అయిన ప్రహ్లాదుడు ఇలా చెప్పాడు. 'నాయనా! ఎల్లపుడూ పరాక్రమమే శ్రేయస్సు కాదు. అదేవిధంగా సహనమూ శ్రేయస్సు కాదు. ఈ రెంటినిగురించి సందేహం లేకుండా తెలిసికో. నాయనా! నిత్యం సహనంతోనే ఉండేవాడు చాలా అనర్థాలను పొందుతాడు. సేవకులు అతణ్ణి అవమానిస్తారు. శత్రువులు ఉపేక్షిస్తారు, లెక్కచేయరు. ప్రాణులన్ని అతనికి ఒకప్పుడు కూడా లొంగి ఉండవు. అందువల్ల **నిత్యసహనం పండితులు కూడా విడిచిపెట్టారు.** అటువంటివానిని సేవకులు తృణీకరించి అనేకదోషాలకు పాల్పడుతారు. సంకుచిత మనస్సుగల మూర్ఖులైన సేవకులు అటువంటివాని సంపదలు అపహరించా లనుకొంటారు. నిత్యం సహనం వహించే యజమానియొక్క సేవకులు మూర్ఖులై అతని రథ, వస్త్ర, అలంకార, శయన, ఆసన, భోజన, పానీయాలను, సమస్త సామగ్రిని ఉపయోగించుకొంటారు. యజమాని ఆజ్ఞాపించినా ఇతరులకు ఇవ్వవలసినవాటిని ఇయ్యరు. నిత్యం క్షమాశీలుడైన యజమానికి సేవకులు ఉచితమైన గౌరవాన్ని కూడ ఇయ్యరు. ఈలోకంలో సేవకులచే అవమానింపబడటం మరణం కంటే కూడ నీచమైంది. నాయనా! ఆ విధంగా క్షమాశీలుడైన వానిని సేవకులు, పుత్రులు, భృత్యులు, తటస్థులు కూడ పరుషంగా మాట్లాడుతారు. నిత్యక్షమాశీలుడైన వాని భార్యను అవమానించి లోబరుచుకోవాలని ఇతరులు భావిస్తారు. అతని భార్య కూడ స్వేచ్ఛగా ప్రవర్తిస్తుంది. సహనశీలుడై యజమాని కొంచెంకూడ దండించకపోతే సేవకులు దుష్టాచారపరు లౌతారు. అలా దుష్టులైనవారు యజమానికి అపకారం చేస్తారు. నిత్యం క్షమాశీలుడైనవానికి ఇవీ, ఇంకా ఇతర అనర్థాలూ

కలుగుతాయి. ఇక సహనం లేనటువంటి వారికి కలిగే దోషాలను చెపుతాను. తెలిసికో.

నిత్యం రజోగుణంతో కోపంగా ఉండేవాడు యోగ్యాయోగ్యాలు విచారించకుండానే తనపరాక్రమంతో అందరినీ అనేకవిధాలుగా దండిస్తూ ఉంటాడు. **క్రోధి స్నేహితులతో విరోధిస్తాడు. స్వజనులచే ద్వేషింపబడతాడు.** క్రోధస్వభావం కలవాడు ఇతరులను అవమానించడం వల్ల ధనాన్ని కోల్పోతాడు. నిందలను, తిరస్కారాన్ని, సంతాపాన్ని, ద్వేషాన్ని, మోహాన్ని, శత్రువులను పొందుతాడు. క్రోధవశుడైనవాడు అన్యాయంగా ఇతరులను అనేకవిధాలుగా దండిస్తాడు. అందువల్ల అతడు తొందరగా ఐశ్వర్యభ్రష్టు డౌతాడు. తనవారి నుండి దూర మౌతాడు. చివరకు ప్రాణాలను కూడా కోల్పోతాడు. ఇంటిలో దూరిన సర్పంలా, ఉపకారం చేసినవారినీ, అపహరించేనారినీ ఒకేవిధంగా కోపంగా మాట్లాడినవాడి వల్ల లోకులు కూడా ఉద్విగ్ను లౌతారు. లోకులందరికి (లోకానికి) ఉద్వేగం కలిగించే వాడికి విభవం ఎలా సమకూరుతుంది? అతనిలోని ఏదో ఒక లోపాన్ని చూసి, లోకులు కూడా అతనికి చెడును చేస్తారు. అందువల్ల కోపాన్ని పూర్తిగా విడిచిపెట్టకూడదు. నిత్యం మృదువుగా క్షమాశీలుడుగా ఉండకూడదు. ఆయా సమయాలు వచ్చినపుడు మృదువుగాను, క్రోధంతోను ఉండాలి. **తగినసమయంలో సహనం కలిగి ఉన్నవాడు, తగిన సమయంలో కఠినంగా, కోపంగా ఉండేవాడు - అతడే ఇహపరలోకాల్లో సుఖాన్ని పొందుతాడు.** మహనీయులు చెప్పినట్లు, ఎప్పుడూ సహనాన్ని కోల్పోకూడని సమయాలనుగురించి వివరంగా చెపుతాను. **మునుపు నీకు ఉపకారం చేసినవాడు, ఏదైనా అపరాధం చేసినా, మును పతడు చేసిన ఉపకారాన్ని స్మరించి అతని అపరాధాన్ని క్షమించాలి. అజ్ఞానంతో అపరాధం చేసి ఆశ్రయించినవారి యొక్క అపరాధాన్ని క్షమించాలి. ఎవరికీ అన్ని విషయాల్లోనూ పాండిత్యం తేలికగా లభించదు. బుద్ధిపూర్వకంగా అపరాధం చేసి, ఆపైన తెలియక చేశానని చెప్పే పాపాత్ములైన, కుటిలులైన వారి చిన్న అపరాధాన్ని కూడా క్షమించకూడదు.** వారిని తప్పక దండించాలి.

ప్రాణు లెవరైనప్పటికి ఒక్క అపరాధం మాత్రం క్షమించదగింది. రెండవ అపరాధం చేస్తే అతడు దండింపదగినవాడే. అది చిన్నదైనా సరే దండించాలి. బాగా పరిశీలనతో పరీక్షించి, అజ్ఞానంతో చేసిన అపరాధమని నిశ్చయమైతే అట్టి అపరాధం క్షమించదగిందే. మృదుస్వభావంతో ఉగ్రస్వభావంకలవాడిని, మృదు స్వభావం కలవాడిని కూడ నాశనం చేయవచ్చు. **మృదుస్వభావంతో అసాధ్యమైంది ఏదీ లేదు.** అందువలన **మృదుత్వంతో కూడిన సామోపాయమే ఉత్తమమైంది.** దేశకాలాలను బాగా పరిశీలించి,

తనయొక్క బలాబలాలను పరిశీలించి మృదుత్వంతో కూడిన సామోపాయాన్ని ప్రయోగించాలి. దేశకాలాలు అనుకూలం కానపుడు ఏమీ సాధించలేం. తగిన దేశకాలాలకోసం నిరీక్షించాలి. ఈ విధంగా ఇటువంటి సమయాలు సహనానికి అనుకూలమైనవి. వీటికంటె ఇతర సందర్భాలు పరాక్రమానికి అనుకూలమైనవి. నరాధిపా! లోభంతో నీకపకారం చేసిన ధృతరాష్ట్రుని కుమారుల విషయంలో నీకిది పరాక్రమించవలసిన కాలమని నేను భావిస్తున్నాను. కౌరవులపట్ల ఓర్పు వహించవలసిన సమయం ఎంత మాత్రమూ లేదు. క్రోధంతో పరాక్రమించవలసిన సమయం వచ్చినపుడు నీవు పరాక్రమించడమే యోగ్యమైనది. **సహనంతో మృదువుగా ఉంటే లోకులు అవమానిస్తారు. కోపంతో ఉండేవాడికి అందరూ భయపడతారు. తగిన సమయాలలో ఈరెండింటిని ప్రయోగించడం తెలిసినవాడే రాజు.***

29. యుధిష్ఠిరుడు క్రోధమును నిందించుట - సహనమును ప్రశంసించుట.

ధర్మరాజు చెపుతున్నాడు - 'మహాబుద్ధిమతీ! క్రోధం మనుష్యులను చంపుతుంది. క్రోధం అభ్యుదయాన్నీ కల్గిస్తుంది. గెలుపు ఓటములకూ, ఔన్నత్య వినాశాలకూ మూలం క్రోధమే. సుందరీ! క్రోధాన్ని విగ్రహించినవాడే ఉన్నతిని పొందుతాడు. క్రోధాన్ని నిగ్రహింపలేకపోతే ఆ క్రోధం అతని వినాశనానికి దారితీస్తుంది. ప్రజలయొక్క నాశనానికి కారణం క్రోధం. అటువంటి లోకనాశనమైన క్రోధాన్ని నావంటివాడు ఎలా ప్రయోగిస్తాడు? కోపంతో ఉన్నవాడు పాపం చేస్తాడు. క్రుద్ధు డైనవాడు గురువులను కూడా చంపుతాడు. క్రుద్ధుడు పరుషాలైన మాటలతో శ్రేష్ఠులను అవమానిస్తాడు (తన శ్రేయస్సులను తిరస్కరిస్తాడు). కుపితుడైనవాడు వాచ్యావాచ్యాలను తెలియజాలడు. క్రుద్ధునికి చేయకూడనిపని లేదు. అనదగని మాటలేదు క్రోధంవల్ల హింసింపదగనివారిని హింసిస్తాడు. హింసింప దగినవారిని పూజిస్తాడు క్రుద్ధుడు ఆత్మహత్య ద్వారా తన్ను తానే యమపురికి పంపుకొంటాడు. ఇటువంటి అనర్థాలను చూసే ఇహపరలోకాలలో శ్రేయస్సును కోరుకున్న మనీషులు క్రోధాన్ని జయించారు. ద్రౌపదీ! ధీరులైన పురుషులచే విడువబడిన క్రోధాన్ని నావంటివాడు ఎలా ప్రయోగిస్తాడు? ఇదంతా ఆలోచిస్తుంటే నాకు కోపం రావటం లేదు. క్రోధంతో ఉన్నవానిపట్ల కోపం వహింపక సహనంతో వ్యవహరించేవాడు తన్ను ఇతరులనూ కూడ మహాభయం నుండి రక్షిస్తున్నాడు. ఇరువురి దోషాలను పోగొట్టే చికిత్సకు డవుతున్నాడు

---

* మృదుర్భవత్యవజ్ఞాతః తీక్ష్ణాదుద్విజతే జనః ।
కాలే ప్రాప్తే ద్వయం చైతద్ యో వేద స మహీపతిః ॥ 36

మూఢుడు, అసమర్థుడూ అయిన మానవుడు బలవంతులతో క్రుద్ధుడై ప్రవర్తించి తన్ను తానే వినాశం చేసికొంటున్నాడు.

ద్రౌపదీ! క్రోధవశుడై నిగ్రహం లేక దేహత్యాగం చేసేవాడు, ఇహలోకపరలోకాలు రెంటికీ చెడిపోతాడు. అందువల్ల అశక్తుడైనవాడు క్రోధాన్ని నియంత్రించడమే మంచిది. విద్వాంసుడు, సమర్థుడు అయినవాడు ఇతరులచే కష్టాలుపడుతున్నా, వారిపై కోపించక, తన్ను కష్టపెట్టిన వారిని నాశనం చేయకుండా ఉంటే పరలోకంలో కూడా ఆనందిస్తాడు. **అందువల్ల బలవంతుడైనా, దుర్బలుడైనా విజ్ఞుడైన మానవుడు ఆపదలయందు కూడ సహనం వహించాలి.** ద్రౌపదీ! కోపాన్ని జయించడాన్ని సత్పురుషులు ప్రశంసిస్తున్నారు. ఈ లోకంలో సహనశీలుడే ఎల్లపుడూ జయం పొందుతాడని సత్పురుషుల అభిప్రాయం. అసత్యం కంటె సత్యం శ్రేష్ఠమైనది. క్రూరత్వం కంటె దయాలుత్వం శ్రేష్ఠమైంది. సత్పురుషులందరూ విడిచిపెట్టిన, ఎన్నోదోషాలుగల క్రోధాన్ని - సుయోధనుడు నన్ను చంపినాసరే-నావంటివాడు ఎలా ప్రయోగిస్తాడు? దూరదృష్టిగల పండితులు 'తేజస్వి' అని ఎవరిని చెపుతున్నారో వారి అంతరంగంలో క్రోధం ఉండదు. ఇది నిశ్చయం. మనస్సులో పుట్టిన క్రోధాన్ని ప్రజ్ఞచేత నిగ్రహించిన వాడిని 'తేజస్వి' అని తత్త్వదర్శులైన విద్వాంసులు భావిస్తున్నారు. సుందరీ! క్రుద్ధుడైనవాడు ఏ పనినీ సరిగా చూడలేడు. క్రుద్ధుడు మర్యాదను కాని, అకార్యాన్ని కాని తెలియజాలడు. క్రుద్ధుడు అవధ్యులను కూడా వధిస్తాడు. గురువులను కూడా హింసిస్తాడు. అందువల్ల తేజోవంతుడు క్రోధాన్ని దూరం చేయాలి. సామర్థ్యం, అమర్షం, శౌర్యం, శీఘ్రత - ఇవి తేజస్సు యొక్క గుణాలు. క్రోధవశుడైనవానికి ఈ గుణాలు సహజంగా పొందశక్యం కావు. మహాప్రాజ్ఞా! క్రోధాన్ని విడిచినవాడు తేజస్సును బాగా పొందగలుగుతాడు. క్రోధంతో ఉన్నవాడు తగిన సమయంలో ఉపయోగించిన తేజస్సు తీవ్రమై సహింపశక్యం కాకుండా ఉంటుంది. మూర్ఖులు క్రోధాన్నే తేజస్సుగా భావిస్తారు. కాని రజోగుణంవల్ల పుట్టిన క్రోధాన్ని మనుష్యులపై ప్రయోగిస్తే వినాశం కలుగుతుంది. అందువల్ల **సదాచారి అయిన పురుషుడు ఎల్లపుడూ క్రోధాన్ని విడిచిపెట్టాలి.** క్రుద్ధునికంటె స్వధర్మాన్ని తప్పినవాడైనా మేలే. సాధ్వీ! మూర్ఖుడు, అవివేకి క్షమాది సద్గుణాలను ఉల్లంఘించి ప్రవర్తింపవచ్చు. కాని నావంటి విజ్ఞుడు ఎలా ఉల్లంఘించగలుగుతాడు?

భూమితో సమానమైన సహనశీలురు మానవులలో లేకుంటే ఇక మానవులలో సంధికి అవకాశమే లేదు. యుద్ధం క్రోధమూలక మైనది. ఎవడైనా తన్ను బాధిస్తే, తాను కూడా ఎదుటివాడిని బాధిస్తాడు. గురువు తన్ను హింసిస్తే, తానూ గురువులను హింసిస్తాడు.

ఈ విధంగా క్రోధంవల్ల ప్రాణుల వినాశం జరుగుతుంది. అధర్మం ప్రబలుతుంది. మానవులంతా క్రోధవశులైతే ఒకడి వల్ల తాను దెబ్బతింటే, తాను మళ్ళీ అతడిని దెబ్బతీస్తాడు. ఎదుటివాడు తన్ను చంపుతూంటే, తానూ ఎదుటివాడిని చంపుతాడు. ఇతరుడు తన్ను హింసిస్తే, తానూ అతడిని హింసిస్తాడు. క్రోధవశులైతే తండ్రులు పుత్రులను, పుత్రులు తండ్రులను చంపుతారు. భర్తలు భార్యలను, భార్యలు భర్తలను చంపుతారు. ద్రౌపదీ! ఈ విధంగా లోకమంతా క్రోధానికి వశమైతే ప్రపంచంలో ఎక్కడా శాంతి ఉండదు. సుందరీ! ప్రజలలో సంధికి మూలం శాంతి అని గ్రహించు. ద్రౌపదీ! రాజు క్రోధవశుడైతే ప్రజలందరూ శీఘ్రంగా వినాశాన్ని పొందుతారు. అందువల్ల **క్రోధం మానవుల వినాశానికి, అవినీతికి కారణమని తెలుసుకో.**

ఈ లోకంలో భూమితో సమానులైన సహనశీలురు కనబడుతున్నారు కాబట్టే ప్రాణుల పుట్టుక, అభివృద్ధి సాగుతోంది. సుశోభనా! **ఆపదలన్నింటియందు మానవుడు సహనం కలిగి ఉండాలి. క్షమాశీలుల వల్లనే ప్రాణుల మనుగడ సాగుతోంది.** బలవంతుడు తన్ను తిట్టినా, కొట్టినా క్రోధాన్ని వహించి, నిగ్రహించినవాడే జితక్రోధుడు, విద్వాంసుడు, ఉత్తమపురుషుడు. అటువంటి మానవుడే ప్రభావవంతుడు. అతడు సనాతనమైన లోకాలను పొందుతాడు. క్రోధం కలవాడు అల్పజ్ఞుడు. అతడు ఇహపరలోకాలు రెంటియందు వినాశాన్ని పొందుతాడు. ఈ విషయంలో లోకులు క్షమాశీలుల గాథలను ఉదాహరిస్తున్నారు. ద్రౌపదీ! క్షమాశీలుడు, మహాత్ముడు అయిన కాశ్యపుడు ఈ గాథలను చెప్పాడు. సహనమే ధర్మం. సహనమే యజ్ఞం, సహనమే వేదాలు, సహనమే శాస్త్రం. దీనినీ విధంగా తెలిసినవాడు అన్నింటినీ క్షమించడానికి యోగ్యుడు. క్షమయే బ్రహ్మం, క్షమయే సత్యం, భూతభవిష్యత్ కాలాలూ క్షమయే, క్షమయే తపస్సు, క్షమయే శౌచం ఈ జగత్తంతా క్షమచేతనే ధరింపబడి ఉంది. యజ్ఞవేత్తలు, బ్రహ్మవేత్తలు, తపస్వులు వీరికంటె క్షమాశీలుడు ఉన్నతాలైన లోకాలను పొందుతాడు. యజ్ఞకర్మలు అనుష్ఠించే వారి లోకాలు వేరు, వాపీ కూప తటాకాది నిర్మాణం, దానాది కర్మలు చేసేవారి లోకాలు వేరు, కాని **క్షమాశీలురైనవారి లోకాలు బ్రహ్మ లోకంలో, మిక్కిలి పూజింపబడుతూ ఉన్నాయి. తేజోవంతుల తేజస్సు సహనం. తపస్వుల యొక్క తపస్సు సహనం, సత్యవ్రతుల సత్యం సహనం. సహనమే యజ్ఞం, సహనమే శాంతి.** ద్రౌపదీ! బ్రహ్మ, సత్యం, యజ్ఞాలు, లోకాలు ప్రతిష్ఠితాలై ఉన్న మహత్త్వపూర్ణమైన సహనాన్ని నాలాంటివాడు ఎలా వదలగలడు? విజ్ఞుడైన మానవుడు ఎల్లపుడూ సహనం కలిగి ఉండాలి. **అన్నింటిని సహింపగలిగినవాడే బ్రహ్మభావాన్ని పొందుతాడు. ఈ లోకం క్షమాశీలులది. క్షమాశీలులదే పరలోకం కూడ. క్షమాశీలురు**

ఇహలోకంలో గౌరవింపబడతారు. పరలోకంలో ఉత్తమగతిని పొందుతారు.* తమలో కలిగిన క్రోధాన్ని సహనంతో నిగ్రహించిన వారు సర్వోత్తమలోకాలను పొందుతారు. అందువల్ల సహనం అన్నింటికంటె గొప్పది. ఈ విధంగా కాశ్యపుడు నిత్యం క్షమాశీలులైన వారి గాథలను గానం చేశాడు. ద్రౌపదీ! క్షమను గురించి ఈ విశిష్టతలు విని సంతప్తి నొందు. కోపించవద్దు.

పితామహుడు భీష్ముడు, దేవకీపుత్రుడు కృష్ణుడు సహనాన్ని గౌరవిస్తారు. ద్రోణాచార్యుడు, విదురుడు, కృపాచార్యుడు, సంజయుడు సహనమే మంచిదని చెపుతారు. సోమదత్తుడు, యుయుత్సుడు, ద్రోణపుత్రుడు అశ్వత్థామ, మా పితామహుడు వ్యాసుడు నిరంతరం శాంతినే ఉపదేశిస్తారు. వీరంతా ధృతరాష్ట్రమహారాజును శాంతికి ప్రేరేపించినట్లయితే ఆయన నాకు తప్పక రాజ్యమిస్తాడు. లేకుంటే లోభంవల్ల నశిస్తాడు. భరతవంశీయుల వినాశనానికే ఈ దారుణమైన కాలం ప్రాప్తించింది. భామినీ ! ఈ విషయం నేను మునుపే నిశ్చయించుకొన్నాను. ఈ విధంగా సహనాన్ని వహించడానికి సుయోధనుడు యోగ్యుడు కాదు. నేను అందుకు తగినవాడిని. అందుకే సహనం నన్ను ఆశ్రయించింది. క్షమ, దయ, జితేంద్రియుల సదాచారాలు. ఇది సనాతన ధర్మం. అందువలన దయా సహనాన్ని నేను యథార్థరూపంగా, సహజంగా అనుసరిస్తున్నాను.'

30. ద్రౌపది యుధిష్ఠిరుని బుద్ధి, ధర్మాదులను ఆక్షేపించుట.

ద్రౌపది ఇలా అంది - 'రాజా! నీబుద్ధికి మోహాన్ని కలిగించిన ఆ విధి, ప్రారబ్ధాలకు ఒక నమస్కారం. పితృపైతామహమైన రాజ్యాన్ని నీవు వహించవలసి ఉండగా, నీ బుద్ధి మరొకవిధంగా ఉంది. లోకంలో జనులకు వేరువేరు కర్మలు నిర్దేశింపబడి ఉన్నాయి. అందువల్ల కర్మలు నిత్యాలు (అనుభవిస్తే గాని అవి నశింపవు.) కాని మానవులు లోభంచేత మోక్షాన్ని పొందా లనుకొంటారు. ఈ లోకంలో ధర్మం చేత కాని, మృదుస్వభావం చేత కాని, సహనం చేత కాని, ఋజువర్తనం చేత కాని, దయచేత కాని మానవుడు ఎప్పుడూ ఐశ్వర్యాన్ని పొందడు. భారతా! ఈ సహనం కారణంగానే నీ వీటువంటి దుఃసహమైన సంకటస్థితిని పొందావు. నీవు కాని, మహాతేజస్వులైన నీ సోదరులైనా కాని ఇట్టి కష్టాన్ని పొందటానికి యోగ్యులు కారు. అప్పుడు కాని ఇప్పుడు కాని నీకు, నీసోదరులకు ధర్మంకంటె ప్రియమైనదేదీ లేదు. ధర్మం జీవితం కంటే కూడా గొప్పదిగా భావింపబడుతుంది.

* క్షమావతామయం లోకః పరశ్చైవ క్షమావతామ్ ।
ఇహ చమ్మావమృచ్ఛంతి పరత్ర చ శుభాం గతిమ్ ॥ 43

ధర్మంకొరకే నీకు రాజ్యం. నీ జీవితం కూడా ధర్మం కొరకే. బ్రాహ్మణులు, గురువులు, దేవతలు కూడా ఈ విషయం ఎరుగుదురు. నీవు నాతోపాటు భీమార్జున నకుల సహదేవులను కూడా విడిచిపెడతావు. ధర్మాన్ని మాత్రం విడువవు. ఇది నా దృఢవిశ్వాసం. రక్షింపబడిన ధర్మం ధర్మరక్షకుడైన రాజును రక్షిస్తుంది అని పెద్దలనుండి విన్నాను. కాని నిన్నుమాత్రం రక్షించటంలేదని భావిస్తున్నాను. నరోత్తమా! తన నీడ తన్ను నిత్యం అనుసరించినట్లుగా నీబుద్ధి ఎల్లపుడూ అనన్యభావంతో ధర్మాన్నే అనుసరిస్తుంది.

నీవు సమానులను కాని, నీకంటె తక్కువ వారినికాని ఎపుడూ అవమానించలేదు. ఇక నీకంటె గొప్పవారినెలా అవమానిస్తావు? ఈ సమస్త భూమండలాన్ని పొంది కూడా నీకు కొమ్ములు మొలవలేదు. నీవు స్వాహాకారాలతో దేవతలను, స్వధాకారాలతో పితృదేవతలను, పూజలతో బ్రాహ్మణులను నిత్యమూ సేవిస్తున్నావు. బ్రాహ్మణులను వారివారి కోర్కెల నన్నింటిని తీర్చి తృప్తిపరిచావు. అదే విధంగా యతులను, ముముక్షువులను, గృహస్థులను నేను వడ్డించగా బంగారు పాత్రలలో భోజనంపెట్టి తృప్తిపరిచావు. అరణ్యంలో ఉన్నవారికి నీవు బంగారుపాత్రల నిచ్చావు. నీ ఇంటిలో బ్రాహ్మణులకు ఇవ్వదగని వస్తువంటూ ఏదీ లేదు. శాంతికోసం నీవు వైశ్వదేవం చేసి అతిథులకు, ప్రాణులకు అన్నంపెట్టి, వారు తినగా మిగిలిన దానిని తిని, నీవు జీవిస్తున్నావు. ఇష్టులు, పశుబంధాలు, కామ్యయజ్ఞాలు, నైమిత్తిక యాగాలు, పాకయజ్ఞాలు, నిత్యయజ్ఞాలు అన్నీ యథావిధిగా నీవు చేస్తున్నావు. రాజ్యానికి దూరంగా, దారిదోపిడీదారు లుండే నిర్జనమైన ఈ మహారణ్యంలో నివసిస్తూ కూడ నీవు ధర్మకార్యాలను లోపంలేకుండా ఆచరిస్తున్నావు. అశ్వమేధం, రాజసూయం, పౌండరీకం, గోసవం అనే మహాయజ్ఞాలు చేసి, భూరి దక్షిణలను ఇచ్చావు.

కపటమైన జూదం సమయంలో మాత్రం నీబుద్ధి వక్రించి రాజ్యాన్ని, సంపదలను, ఆయుధాలను, సోదరులను, చివరకు నన్ను కూడా జూదంలో ఒడ్డి ఓడిపోయావు. ఋజువర్తనుడు, మృదుస్వభావుడు, ఉదారుడు, లజ్జాశీలుడు, సత్యవాది అయిన నీకు జూదమాడాలనే బుద్ధి ఎలా కలిగింది? ఇటువంటి భయంకరమైన విపత్తి నీకు కలగడం ఆలోచిస్తూంటే నాకు మిక్కిలి మోహం కలుగుతోంది. నా మనస్సు మిక్కిలి దుఃఖపడుతోంది. ఈ విషయంలో కూడ లోకులు పురాతనమైన ఈ ఇతిహాసాన్ని ఉదాహరిస్తూంటారు. లోకులంతా ఈశ్వరుని వశంలో (అధీనంలో) ఉంటారు. ఎవరూ స్వాధీనులు కారు. ఈశ్వరుడే ప్రాణులకు వారివారి పూర్వకర్మలను అనుసరించి సుఖదుఃఖాలను, ప్రియాప్రియాలను అన్నింటిని నిర్ణయిస్తాడు. నరవీరా! కొయ్య బొమ్మ సూత్రధారునిచే కదల్చబడుతూ తన అవయవాలను కదిల్చినట్లుగా ఈ జనులంతా ఈశ్వరుని ప్రేరణచేత

తమ చేష్టలద్వారా కర్మలు చేస్తున్నారు. భారతా! ఆకాశంవలె ఈశ్వరుడు కూడ ప్రాణులందరిలోనూ వ్యాపించి, వారికర్మానుసారంగా మంచి చెడులను / పుణ్య పాపాలను చేయిస్తాడు. త్రాళ్ళతో బంధింపబడిన పక్షిలా మానవుడు కర్మబంధంలో ఉండటం చేత పరాధీనుడే కాని స్వతంత్రుడు కాదు. ఈశ్వరుని అధీనంలో ఉంటాడు. ఇతరులకు అధీనుడు కాదు. స్వాధీనుడు కూడా కాదు. సూత్రానికి గ్రుచ్చబడిన మణిలా, ముక్కు త్రాడుతో బంధింపబడిన ఎద్దులా, ఒడ్డునుండి కూలి ప్రవాహంలో పడిన చెట్టులా, మానవుడు ఈశ్వరుని ఆదేశాన్ని అనుసరిస్తాడు. ఈశ్వరరూపుడైన మనుష్యుడు ఈశ్వరుని అధీనంలోనే ఉంటున్నాడు. ఈ మానవుడు ఏ సమయంలోనూ కూడా స్వతంత్రుడుగా లేడు. ఈ జీవుడు (ప్రాణి) అజ్ఞాని. తన సుఖదుఃఖాల విషయంలో కూడ అసమర్థుడు. ఈశ్వరప్రేరితుడై స్వర్గానికి లేదా నరకానికి వెళ్తున్నాడు. భారతా! బలమైన వాయువునకు గడ్డిపోచలు వశమైనట్లుగా, ప్రాణులన్నీ ఈశ్వరుని అధీనంలోకి వెళుతున్నాయి. మానవుడు మంచిపని చేస్తున్నా, చెడ్డపనిచేస్తున్నా ఈశ్వరుడు అతనియందు వ్యాప్తమై ఉంటాడు. కాని అతడు అక్కడున్నట్లుగా గుర్తింపబడడు. **శరీరం క్షేత్రం. ఇది ఈశ్వరునికి పాధవం మాత్రమే. దీనిద్వారా ఈశ్వరుడు ప్రాణులచేత శుభాశుభ ఫలనిమిత్తమైన కర్మను చేయిస్తాడు.**

ఈశ్వరుడు చేసే ఈ మాయను చూడు. తన మాయచేత ప్రాణులను మోహపరిచి, ప్రాణులద్వారా ప్రాణులను చంపుతాడు. తత్త్వదర్శులైన మునులు వస్తువుల స్వరూపాన్ని వేరొక విధంగా చూస్తారు. సూర్యకిరణాలు మరుభూమిలో నీరులా కనబడినట్లుగా వారి దృష్టికి అంతా వేరుగా ఉంటుంది. లోకంలో జనులు ఆయా వస్తువులను వేరువేరుగా చూస్తారు. కాని శక్తిశాలి అయిన ఈశ్వరుడు వాటిని సృష్టింపగలడు, నాశనం చేయగలడు. యుధిష్ఠిరా! అచేతనమైన కర్రను కర్రచేత, రాయిని రాతిచేత, ఇనుమును ఇనుముచేత ఛేదించినట్లుగా భగవంతుడు, స్వయంభువు, ప్రపితామహుడు అయిన ఈశ్వరుడు మాయచేసి ప్రాణులను ప్రాణులచేత హింసిస్తాడు. చిన్న కుర్రవాడు ఆటబొమ్మలతో ఆడుకొన్నట్లుగా తన ఇచ్ఛప్రకారం చేయగల సమర్థుడైన ఈశ్వరుడు కలుపుతూ, విడదీస్తూ ప్రాణులతో ఆడుకొంటాడు. రాజా! ఈశ్వరుడు ప్రాణులపట్ల తల్లిదండ్రులవలె ప్రవర్తించడు. ఇతరులవలె కోపంతో వ్యవహరిస్తాడు. ఎందుకంటే పూజ్యులు, శ్రేష్ఠులు, శీలవంతులు, లజ్జాశీలురు జీవిక కొరకు (బ్రతుకు తెరువుకోసం) కష్టపడుతూంటారు. అనార్యులు సుఖంగా జీవిస్తారు. ఇదంతా చూస్తూంటే నాకు బాధ కలుగుతోంది. నీవు ఇలా విపత్తులో ఉండటం, సుయోధనుడు భోగభాగ్యాలతో ఉండటం చూసి, నేను విధిని నిందిస్తున్నాను. అతడు విషమదృష్టితో

చూస్తున్నాడు. సుయోధనుడు పెద్దలు చెప్పిన శాస్త్రరీతిని అతిక్రమించిన క్రూరుడు, ధర్మంతప్పినవాడు. ఆ సుయోధనునికి సంపదనిచ్చిన ఆ ఈశ్వరుడు ఏం ప్రయోజనం పొందగలడు? కర్మ చేసినవాడిని అనుసరించేదయితే, వేరొకరిని అనుసరించనిదే అయితే, అపుడు ఈశ్వరునికి కూడా అతడు చేసిన పాపకర్మలు అంటుకొంటాయి. ఒకవేళ చేసిన పాపకర్మ కర్తను అనుసరించక పోయినట్లయితే దానికి కారణం బలమే. (ఈశ్వరుడు శక్తిశాలి కాబట్టి అతడిని అతని పాప కర్మలు చేరవు). అందువల్ల దుర్బలులైన జనులను గురించి బాధపడుతున్నాను.'

31. యుధిష్ఠిరుడు ద్రౌపది ఆక్షేపమునకు సమాధానము చెప్పుట.

యుధిష్ఠిరు డిట్లన్నాడు - యాజ్ఞసేనీ! నీవు మనోహరమై చిత్ర పదాలతో కూడిన, నిపుణమైన మాటను చెప్పావు. మేము దాన్ని విన్నాం. కాని నీవు తెలియకుండానే నాస్తికత్వాన్ని ప్రతిపాదించావు. రాజపుత్రీ! నేను కర్మఫలాన్ని ఆపేక్షించి కర్మల నాచరించటం లేదు. **దానం చెయ్యాలి కాబట్టి చేస్తున్నాను. యజ్ఞం చేయాలనే కర్తవ్యబుద్ధితో యజ్ఞం చేస్తున్నాను. కర్మకు ఫలం ఉండుగాక! లేకుండుగాక, గృహస్థాశ్రమంలోని పురుషుడు చేయదగిన కర్మను యథాశక్తిగా నేను చేస్తున్నాను. ధర్మం ఆచరిస్తున్నాను, కాని ధర్మఫలాన్ని అపేక్షించి మాత్రం కాదు.** శాస్త్రాలను పరిశీలించి, సత్పురుషుల నడవడిని చూసి, సహజంగానే నామనస్సు ధర్మాన్ని ధరించింది. **ఫలాన్ని కోరి ధర్మం చేయడం ధర్మంతో వ్యాపారం చేయడమే.** అటువంటివాడు ధర్మపరులలో నిందింపదగినవాడు. పాపాత్ముడైన మానవుడు నాస్తిక్యబుద్ధితో ధర్మానుష్ఠాన విషయాన్ని శంకించినా, ధర్మంపేరుతో స్వార్థాన్ని పొందాలని భావించినా, ధర్మఫలాన్ని పొందజాలడు. శాస్త్ర ప్రమాణాలన్నింటి సారం బాగా గ్రహించి నేను చెపుతున్నాను - ధర్మాన్ని శంకించవద్దు. ధర్మాన్ని శంకించేవాడు పశుజాతిలో, పక్షిజాతిలో జన్మిస్తాడు. ధర్మాన్ని శంకించేవాడు, దుర్బలుడై వేదాది శాస్త్రాలపై అవిశ్వాసం కలవాడు అజరామరమైన లోకాన్ని కోల్పోతాడు. శూద్రుడు వేదాధ్యయనాన్ని కోల్పోయినట్లు వీడు అజరామర మయిన లోకాన్ని కోల్పోతాడు.

మనస్వినీ ! వేదాధ్యయనం చేసిన ధర్మపరుడు, కులీనుడూ అయిన వ్యక్తి రాజ - ఋషి - ధర్మచారులచేత వృద్ధులయందు లెక్కింపదగినవాడు. మందబుద్ధియై, శాస్త్రాన్ని ఉల్లంఘించి, ధర్మాన్ని శంకించేవాడు శూద్రులకంటె, చోరులకంటె పాపాత్ముడు. అప్రమేయుడు, మహాతపస్వి ఐన మార్కండేయ మహర్షిని నీ ఎదురుగా వెళ్ళడం నీవు ప్రత్యక్షంగా చూశావు కదా! అతడు ధర్మపాలన చేతనే చిరంజీవి అయ్యాడు. **వ్యాసుడు, వసిష్ఠుడు,**

మైత్రేయుడు, నారదుడు, లోమశుడు, శుకుడు, ఇంకా ఇతర మహర్షులంతా ధర్మంచేతనే శుద్ధ మనస్సును పొందారు.* దివ్యమైన యోగశక్తితో కూడియున్న వీరిని నీవు ప్రత్యక్షంగా చూస్తున్నావు. వారు శపించటానికీ, అనుగ్రహించటానికీ (అగ్రహానుగ్రహాలయందు) సమర్థులు. దేవతలకంటె గొప్పవారు. పుణ్యశీలా! వీరు దేవతలకంటె ప్రఖ్యాతి కలవారు. వేదగమ్య విషయాలను ప్రత్యక్షం చేసుకోగలవారు, వీరు అన్నింటికంటె ముందుగా ధర్మాన్నే ఆచరింపదగినదిగా చెప్తారు. అందువల్ల మూర్ఖమైన మనస్సుతో ఈశ్వరుని, ధర్మాన్ని ఆక్షేపించడం, శంకించడం చేయరాదు. ధర్మంయొక్క తత్త్వం తెలిసిన జ్ఞానులను బాలుడు ఉన్మత్తులుగా భావిస్తాడు. ధర్మాన్ని శంకించే బాలబుద్ధి ఇతరులనుండి శాస్త్ర ప్రమాణాన్ని గ్రహింపజాలదు. కేవలం స్వబుద్ధినే ప్రమాణంగా తీసికొని శ్రేష్ఠులను, ఉత్తమధర్మాలను అవహేళన చేసేవాడు ఇంద్రియ ప్రీతి సంబద్ధమైన లోకంలో కనబడేవాటినే సత్యాలుగా గ్రహిస్తాడు. అప్రత్యక్షంగా ఉన్నవాటి విషయంలో మోహపడతాడు. ధర్మాన్ని శంకించేవాడికి ప్రాయశ్చిత్తం లేదు. ధర్మానికి విరుద్ధంగా ఆలోచించే దీనుడు, పాపాత్ముడూ అయిన వ్యక్తి ఉత్తమలోకాలను పొందలేడు. ప్రమాణాలను తిరస్కరించేవాడు, వేదశాస్త్రార్థాలను నిందించేవాడు, కామలోభపరాయణుడూ అయిన మూర్ఖుడు నరకం పొందుతాడు.

కల్యాణీ! నిశ్చయబుద్ధితో నిత్యమూ ధర్మాన్ని శంకించకుండా ఆచరించేవాడు పరలోకంలో అనంతసుఖాన్ని పొందుతాడు. అనగా పరమాత్మ ప్రాప్తి నొందుతాడు. ఆర్ష ప్రమాణాన్ని ఉల్లంఘించి, ధర్మాన్ని పాలించక సర్వశాస్త్రాలను అతిక్రమించే మూఢుడు ఎన్ని జన్మలెత్తినా సుఖాన్ని పొందలేడు. ఋషివచనం కాని, శిష్టుల ఆచారం కాని ప్రమాణంగా అంగీకరించని వానికి ఇహపరలోకాలు రెండూ లేవు. ఇది నిశ్చయం. సర్వజ్ఞులు, సర్వదర్శులు అయిన ఋషులు చెప్పిన, శిష్టులు ఆచరించిన పురాతనమైన ధర్మాన్ని శంకించవద్దు. ద్రౌపదీ ! స్వర్గానికి వెళ్ళేవారికి ధర్మమే నావ. సముద్రం యొక్క ఆవలి ఒడ్డుకు చేరాలనుకొనే వర్తకునకు అది నావ వంటిది. సాధ్వీ ! ధర్మాచార పరాయణులు ఆచరించిన ధర్మం నిష్ఫలమే అయితే ఈ సమస్తజగత్తూ అంతులేని అంధకారంలో మునిగిపోతుంది. ధర్మం నిష్ఫలమైతే ధర్మాత్ములు మోక్షాన్ని పొందరు. వారు విద్యలనే అభ్యసించరు. ఎటువంటి ప్రయోజనానికి ప్రయత్నమే చెయ్యరు. కేవలం పశువుల్లా జీవితాన్ని వెళ్ళబుచ్చేవారు. తపస్సు, బ్రహ్మచర్యం, యజ్ఞం, స్వాధ్యాయం, దానం, ఋజువర్తనం ఇవి నిష్ఫలాలైతే

---

* **వ్యాసో వసిష్ఠో మైత్రేయః నారదో లోమశః శుకః ।**
అన్యే చ ఋషయః సర్వే ధర్మేణైవ సుచేతసః ॥ 12

శ్రేష్ఠులైనవారు ధర్మాన్ని ఆచరించేవారే కారు. ధార్మికాలైన క్రియలు నిష్ఫలాలైతే ఋషులు, దేవతలు, గంధర్వులు, అసురులు, రాక్షసులు, ప్రభావశాలులైనా ఆదరపూర్వకంగా ధర్మాన్ని ఎందుకు ఆచరిస్తారు?

కృష్ణా! ధర్మఫలాన్నిచ్చేవాడు ఈశ్వరుడు అని తెలిసే ఋషులు మున్నగువారు ధర్మాన్ని ఆచరించారు. ధర్మమే సనాతన శ్రేయస్సు. ఇది నిశ్చయం. అటువంటి ధర్మమూ నిష్ఫలం కాదు. అధర్మం కూడా నిష్ఫలమైంది కాదు. విద్యలకు, తపస్సులకు ఫలాలు కనబడుతూనే ఉన్నాయి. కృష్ణా! నీవు ప్రసిద్ధమైన నీ జన్మ వృత్తాంతాన్ని ఒకసారి గుర్తు తెచ్చుకో. నీ సోదరుడు, ప్రతాపవంతుడూ అయిన ధృష్టద్యుమ్నుడు ఎలా జన్మించాడో నీకు తెలుసు. ఈచెప్పిన దృష్టాంతం చాలు నీకు. ధీరుడు కర్మఫలాన్ని పొందుతాడు. ఆ ఫలం స్వల్పమైనా సంతోషిస్తాడు. కాని బుద్ధిహీనులు ఎక్కువఫలాన్ని పొందికూడా సంతృప్తినొందరు. అటువంటి వారికి పరలోకంలో ధర్మంవల్ల కలిగే సుఖం కొంచెం కూడా ఉండదు. వేదోక్త పుణ్యఫలాలనిచ్చే సత్కర్మల ఫలాలు కానీ, అనిష్టఫలాన్నిచ్చే పాపకర్మల ఫలాలు కానీ ఆరంభమగుట, పుట్టుట, నశించుట అను విషయాలు కానీ దేవరహస్యాలు. ఈ దేవరహస్యాలను సాధారణ మానవులు తెలియలేక, మోహితులౌతూ ఉంటారు. అటువంటివారు కల్పసహస్రం గడిచినా శ్రేయస్సును (శాశ్వతసుఖాన్ని) పొందలేరు. ఇవి దేవతలకు రక్షింపదగినవి. దేవతల మాయ తెలియరానిది కదా! ఆశను విడిచినవారు, నియమబద్ధమైన ఆహారం తీసికొనేవారు, తపస్సు చేత పాపాలను దహించినవారూ ప్రసన్నమనస్సులు కల ద్విజులు ఈ రహస్యాలను చూడగలుగుతారు. ధర్మఫలం తొందరగా కనబడకపోతే అందుకు ధర్మాన్ని కాని, దేవతలను కాని శంకించకూడదు. దోష దృష్టి లేకుండా ప్రయత్నించి యజ్ఞదానాలను చెయ్యాలి. కర్మలఫలం తప్పక పొందబడుతుంది. ఇది ధర్మశాస్త్ర విధానం. బ్రహ్మ ఈ విషయాన్ని తన పుత్రులకు చెప్పాడు. కశ్యపుడు ఈ విషయం ఎరుగును. కృష్ణా! అందువల్ల నీ సంశయం మంచువలె నశించుగాక! ధర్మం, ఈశ్వరుడు ఇవన్నీ సత్యమని నిశ్చయించుకొని, నాస్తిక్యభావాన్ని విడిచిపెట్టు. ప్రాణులన్నింటి ధారణ, పోషణ చేసే ఈశ్వరుని ఆక్షేపించకు. శాస్త్ర, గురుజనోపదేశాల వల్ల ఈశ్వరుని తెలుసుకోవడానికి ప్రయత్నించు. అతనికి నమస్కరించు. మళ్ళీ ఇటువంటి బుద్ధి నీకు కలుగకుండుగాక! కృష్ణా! ఈశ్వరభక్తుడు మర్త్యుడైనా ఈశ్వరుని అనుగ్రహం వల్ల అమరుడౌతాడు. ఉత్తమమగు దైవాన్ని ఏ విధంగానూ అవహేళన చేయకు.'

32. ద్రౌపది పురుషార్థ సాధనకు ప్రోత్సహించుట.

ద్రౌపది ఇలా అంది – కుంతీనందనా! నేను ధర్మాన్ని ఏ విధంగానూ అవమానించటం లేదు, నిందించటం లేదు. ఇక ప్రజలనందరినీ పాలించే ఈశ్వరునిమాత్రం ఎలా నిందించగలను? భారతా! బాధతో నేనిలా మాట్లాడుతున్నాను. నన్ను అర్థంచేసుకో. నేనింకనూ మాట్లాడవలసి ఉంది. నీవు ప్రసన్నచిత్తంతో నా మాట విను. బుద్ధిమంతుడైన మానవుడు విహితకర్మను ఆచరించవలసిందే కదా! స్థావరాలైన వృక్షాదులకు కర్మలేదు. కాని జనులంతా కర్మహీనులుగా ఉండకూడదు. ధర్మజా! ఆవుదూడలు తల్లిదగ్గర పాలు త్రాగి, చెట్టు నీడను విశ్రమిస్తాయి. అలాగే జీవులన్నీ కర్మ చేస్తూనే జీవితం కొనసాగిస్తున్నాయి. చేతనాలలో, అందునా ప్రత్యేకించి మనుష్యులు కర్మద్వారా ఇహపరలోకాలలో జీవికను కోరుకొంటారు. అన్నిప్రాణులు తమ ఉన్నతిని కోరుకొంటాయి. తాము చేసిన కర్మల ఫలితాలను ప్రత్యక్షంగా అనుభవిస్తున్నాయి. ఇందుకు ఈ లోకమే సాక్షి. నీటిదగ్గర కొంగ తన ఆహారంకోసం నిరీక్షిస్తూన్నట్లుగా ప్రాణులన్నీకూడ తమ తమ ఉన్నతిని, జీవికను ఆశ్రయించికొని జీవిస్తాయి. చివరకు ధాత, విధాత కూడ సృష్టి కార్యంలో నిమగ్నమై ఉంటారు. కర్మ చేయకపోతే ప్రాణులకు మనుగడ లేదు. అందువల్ల ఎప్పుడూ కర్మను ఆశ్రయించుకొనే ఉండాలి. ఎప్పుడూ కర్మను విడువరాదు. నీకు విహితమైన కర్మను నీవు చెయ్యి. అది చెయ్యడానికి బాధపడకు. కర్మ నిన్నెప్పుడూ అంటిపెట్టుకొని ఉండి రక్షిస్తూంటుంది. వేలకొలదీ మనుష్యులలో కర్మను బాగా చెయ్యడం తెలిసినవాడు ఒక్కడైనా ఉంటాడో లేదో చెప్పడం కష్టం. ధనవంతుడైనప్పటికీ, ధనాన్ని వృద్ధి పరుచుకోవటానికి, రక్షించుకోవటానికి కర్మ చేయాలి. సంపాదించకుండా తింటూ ఉంటే హిమత్పర్వతం వంటి సంపద కూడా తరిగిపోతుంది. ఈ భూలోకంలోని ప్రజలందరూ కర్మ చేయకుండా ఉంటే నశించిపోతారు. కర్మ నిష్ఫలమైనదే అయితే ప్రజలు అభివృద్ధి చెందరు.

కొంతమంది నిష్ఫలకర్మలను చేస్తూండటం మనం చూస్తున్నాం. కర్మ చేయకపోతే ప్రజలకు ఏ విధంగాను బ్రతుకు తెరువు లభించదు. ఉన్న భాగ్యంమీది నమ్మకంతో కర్మ చేయనివాడు, మూర్ఖంగా మనకు ప్రాప్తం ఉన్నది లభిస్తుందిలే అని కర్మ చేయనివాడు ఈ ఇద్దరూ మూర్ఖులే. కర్మఫట్ల బుద్ధికలవాడే ప్రశంసింపదగినవాడు. ప్రారబ్ధ కర్మఫలమైన భాగ్యంమీది నమ్మకంతో, ఏపనీ చెయ్యకుండా సుఖంగా నిద్రపోయే బుద్ధిహీనుడు నీటిలోని (కాల్చని) మట్టికుండవలె నశిస్తాడు. అదే విధంగా పెంకితనం వల్లనో, దుర్బుద్ధి వల్లనో సమర్థుడై కూడా కర్మలనాచరించకుండా ఉంటే అనాథుడైన దుర్బలునివలె అతడు చిరకాలం జీవించలేడు. లోకంలో అకస్మాత్తుగా, ఏ ప్రయత్నమూ లేకుండా ఎవడైనా

ధనాన్ని పొందితే వాడిని హఠాత్తుగా ధనవంతుడయ్యాడని లోకులంటారు. అందుకోసం అతడు చేసిన ప్రయత్న మేదీ కనబడదు. కుంతీనందనా! ఒకానొక పురుషుడు ప్రారబ్ధవశాన ప్రాప్తమైన సంపదను అనుభవిస్తూంటే, దాన్ని దైవదత్తమైనదిగా భావిస్తారు. తాను చేసిన కర్మకు తగినఫలితంగా సంపదను పొందితే దాన్ని పౌరుషమని అంటారు. ఇది లోకంలో మనకు కనబడుతూనే ఉంటుంది. సహజసిద్ధంగా కర్మాచరణంవల్ల అతడు సంపదను పొందితే ఆ సంపదను స్వాభావికమైనదిగా భావించాలి. ఈ విధంగా **మానవుడు హఠాత్తుగా, దైవవశాన, స్వభావంవల్ల పొందిన సంపదలను పూర్వకర్మ ఫలంగా భావించాలి.** జగదాధారుడైన పరమేశ్వరుడు కూడా మానవులకు వారివారి పూర్వకర్మల ననుసరించే సంపదలను ఆయా విధాలుగా విభజించి కర్మఫలంగా అందిస్తాడు. (హఠాత్తుగా, దైవవశాన, స్వభావం వల్ల, అనే విధాలుగా సంపదలనిస్తాడు).

మానవుడు చేసే శుభాశుభ కర్మలను ఈశ్వర విహితమైన పూర్వకర్మ ఫలోదయంగా భావించాలి. (మునుపు చేసిన కర్మఫలం యొక్క ప్రారంభంగా). మానవుని శరీరం ఈశ్వరప్రేరితమైన కర్మలో ప్రవర్తించే సాధనం. ఈశ్వరుడు ఎలా నిర్దేశిస్తే అలా అవశుడై, ఈశ్వరాధీనుడై మానవుడు కర్మను ఆచరిస్తాడు. (ప్రారబ్ధకర్మఫలాన్ని ఈ దేహం ద్వారా ఈశ్వరుడు జీవునిచే అనుభవింపజేస్తాడు.) కుంతీనందనా! ఈశ్వరుడు అన్నిప్రాణులను ఆయాకృత్యములందు నియోగిస్తాడు. పరవశులు/పరాధీనులైన ప్రాణులచే ఆయా పనులను చేయిస్తాడు. వీరా! ముందుగా మనస్సుతో పొందవలసిన అర్థాలను నిర్ణయించుకొని, ఆ తర్వాత పని ద్వారా బుద్ధి పూర్వకంగా వాటిని పొందుతాడు. అందువల్ల పురుషుడు అందుకు కారణ మౌతాడు. కర్మలను లెక్కించడం సాధ్యంకాదు. గృహాదులు, నగరాదులు పొందడానికి పురుషుడే కారణం. తిలలలో తైలం, గోవులలో పాలు, కర్రలో అగ్ని ఉన్నదని బుద్ధిద్వారా ముందు నిశ్చయంచుకొని బుద్ధిమంతుడైనవాడు అది పొందడానికి ఉపాయాన్ని తెలుసుకోవాలి. అనంతరం ఆయా కార్యసిద్ధికి తగిన ఉపాయాలతో అతడు ప్రవర్తిస్తాడు. అలా సిద్ధించినదాన్ని కర్మజం, - పురుషప్రయత్నం వల్ల సిద్ధించినదని - అంటారు. లోకంలో అటువంటి దాని సహకారంతో జీవిస్తారు. "ఇతడు (కర్త) ఈ పనిని నైపుణ్యంతో చేశాడు. పద్ధతి ప్రకారం బాగా చేశాడు. ఇతడు ఈ పనిని నైపుణ్యంతో చేయలేదు" అని ఈ విధంగా ప్రత్యేకంగా చెప్పడం సహజమే. కర్మసాధ్యమైన ఫలం విషయంలో పురుషుడు కారణం కాదంటే, ఇక ఎవడూ యజ్ఞాదికర్మల ఫలితాన్ని పొందలేడు. అటువంటి పక్షంలో, ఎవరూ ఎవరికీ గురువూ కాదు, శిష్యుడూ కాదు. కర్మయందు కర్తృత్వం ఉండడం వల్లనే కర్మ సిద్ధించినపుడు (కర్త) పురుషుడు ప్రశంసింపబడుతున్నాడు. ఇదే

విధంగా సిద్ధించకపోతే నిందింపబడుతున్నాడు కూడ. కర్మ నిష్ఫలమై నశించేదైతే, ఇక ఈ లోకంలో కార్యసిద్ధి ఎలా జరుగుతుంది? అన్నిపనులు హఠాత్తుగా (అకస్మాత్తుగా) సిద్ధిస్తాయని కొందరు, దైవవశాన సిద్ధిస్తాయని కొందరు అంటుంటారు. కొందరు పురుషప్రయత్నం వల్లనే కార్యసిద్ధికలుగుతుందని అంటారు. అందువల్ల ఇది మూడు విధాలుగా నిర్వచింపబడుతోంది. కొందరు 'కార్యసిద్ధికి మనుష్యప్రయత్నం అవసరం లేదు. అంతా అదృశ్యమైన దైవం వల్లనే జరుగుతుంది లేదా హఠాత్తుగా, అకస్మాత్తుగా జరుగుతుంది' అని అంటారు. లోకంలో హఠాత్తుగా, దైవాత్తుగా కార్యసిద్ధి, అర్థసంతతి కలగడం కనబడుతూంది. **'కొంతదైవం వల్ల, కొంత హఠాత్తుగాను, కొంత స్వభావం వల్ల మానవుడు ఫలాన్ని పొందుతాడు,** ఈ మూడు తప్ప, నాల్గవ కారణమేదీ(ఫలం పొందడానికి) లేదు.' అని తత్త్వజ్ఞులు, నిపుణులు అంటున్నారు. అదేవిధంగా ఈశ్వరుడే ప్రాణులకు ఇష్టానిష్టఫలాలను ఇచ్చేవాడు. అలా కాకపోతే ప్రాణులలో దీను డనేవాడెవడూ ఉండేవాడు కాదు. పూర్వజన్మకృతమైన కర్మయొక్క ప్రభావం లేకపోతే, మానవుడు ఏ ఫలాన్ని కోరి కర్మ చేస్తున్నాడో, ఆ ఫలాన్ని తప్పక పొందేవాడు కానీ అలా జరగటం లేదు కదా! **అర్థసిద్ధికి కాని, అవర్థానికి కాని దైవ, హఠాత్ స్వభావా లనే మూడు కారణాలను అంగీకరించని మానవులు అజ్ఞులుగానే ఉండిపోతున్నారు. 'మానవుడు కర్మను చేయవలసిందే. కర్మను విడిచి నిశ్చేష్టునిగా ఉన్నవాడు పరాభవాన్ని పొందుతాడు'** ఇది మనువు యొక్క నిశ్చితాభిప్రాయం. సాధారణంగా కర్మచేసేవాడే ఫలసిద్ధిని పొందుతాడు. అలసుడై తన కర్తవ్యాన్ని విడిచినవాడు ఫలసిద్ధిని పొందలేడు. కర్మకు ఫలం కలగకపోవడానికి కారణమేమీ కనబడటంలేదు. అందలి దోషనివారణకు ప్రాయశ్చిత్తం పై దృష్టిపెట్టాలి. సాంగోపాంగంగా కర్మను చేయడంవల్ల కర్త దోషరహితు డవుతాడు.

అలసుడై, కర్మచేయకుండా పడుకొనే మానవుని దారిద్ర్యం ఆవహిస్తుంది. సమర్థుడైనవాడు కర్మను ఆచరించి నిఃసంశయంగా ఫలాన్ని పొంది ఐశ్వర్యవంతు డౌతాడు. కర్మఫలం ఉంటుందా? ఉండదా? అని సందేహించేవారు అనర్థాలు పొందుతారు. సంశయం లేకుండా కర్మను ఆచరించేవారు ఫలాన్ని పొందుతారు. కర్మరతులు, ధీరులు అయిన మానవులు సంశయరహితులుగా ఉంటారు. ఇపుడు మనపై రాజ్యాపహరణరూపమైన అనర్థం వచ్చి పడింది. నీవు కర్మపరుడవై ఉన్నట్లయితే సంశయంగా ఆ ఆపద తొలగిపోతుంది. కార్యసిద్ధి జరిగినట్లయితే అది నీకు, నీసోదరులైన భీమార్జున నకులసహదేవులకు విశేష గౌరవం అవుతుంది. కర్మ చేసినవాడు చివరకు పొందిన ఫలితాన్ని బట్టి ఇతరులకర్మ సఫలమైందా, లేక తన కర్మ సఫలమైందా అనే విషయం తెలుస్తుంది. నాగలితో భూమిని

దున్ని, విత్తనం నాటి, కర్షకుడు మిన్నకుంటాడు. వర్షం పడి అది మొలకెత్తుతోంది. అక్కడ వర్షం కారణం. రైతుకాదు. వర్షం అనుగ్రహించకపోతే రైతుది దోషంకాదు, తనలాగే చేసిన వేరొక కర్షకుడు ఫలం పొందితే అతడు 'అతనివలె నేనూ చేశాను. నేను ఫలం పొందలేదు. అతడు ఫలంపొందాడు, ఇందులో నా దోషం ఏమీ లేదు' అని గ్రహించి ధీరుడై ఆత్మనిందను చేసుకోడు. భారతా! పురుషప్రయత్నం చేసినా ఫలసిద్ధి జరగకపోతే నిర్వేదం పొందకూడదు. కర్మసిద్ధి పొందడంలో పురుష ప్రయత్నంతోపాటు ప్రారబ్ధం, ఈశ్వరకృప అనే మరో రెండు కారణాలు కూడా ఉన్నాయి. మహారాజా! కార్యం సఫలమవుతుందా కాదా అనే సందేహం మనస్సులో ఉంచుకొని, కర్మలో ప్రవర్తించకూడదు. అలా ప్రవర్తించడం ఉచితంకాదు. **అనేక కారణాలు ఒకచోట కలిస్తేనే కర్మ సఫల మవుతుంది.**

కర్మాచరణంలో నైపుణ్యం లేకపోతే ఫలం తక్కువగా లభిస్తుంది. లేదా ఒక్కొక్కప్పుడు ఫలం లేక పోవచ్చు. అలాగని కర్మ చేయకుండా ఉంటే ఫలితమూ ఉండదు, కర్తయొక్క శౌర్యాదిగుణాలూ బయటపడవు. ధీరుడైన మనుష్యుడు మంగళమయమగు శుభాల అభివృద్ధి కొరకు తన బుద్ధి ద్వారా తనశక్తిని, బలాన్ని అనుసరించి, దేశకాలాలను అనుసరించి ఉపాయాలను ప్రయోగిస్తాడు. అప్రమత్తుడై దేశకాలాలకు తగిన కార్యం చేయాలి. ఇందులో పరాక్రమం ప్రధానమైంది. కార్యసాధనకు గల ఉపాయాలన్నింటిలో పరాక్రమమే గొప్పదిగా తెలియబడుతోంది. బుద్ధిమంతుడైనవాడు సామంచేతనే అనేకగుణాలతో కూడి శ్రేయస్కరమగు అర్థాన్ని (కార్యాన్ని, ప్రయోజనాన్ని) చూసినట్లయితే, అందుకు తగిన పనికి (సంధికి) ప్రేరేపించాలి. బుద్ధిమంతుడైనవాడు తన శత్రువు అనేకగుణాలచే శ్రేష్ముడని తెలిసినట్లయితే, సామోపాయం ద్వారానే కార్యాన్ని సాధించాలి. అందుకు అవసరమైన సంధికి ప్రేరేపించాలి. యుధిష్ఠిరా ! శత్రువుకు పెద్ద కష్టం వచ్చేటట్లు కోరుకోవాలి. లేదా అతడు దేశం విడిచివెళ్ళేలా చూడాలి. శత్రువు సముద్రమైనా, పర్వతమైనా సరే దాని మీద కూడ కష్టాన్ని కోరుకోవాలి. ఇక మరణస్వభావం గల మానవుడైతే వేరే చెప్పాలా ! శత్రువులలోని లోపాన్ని / బలహీనతను వెతకటంలో ఎప్పుడూ ప్రయత్నిస్తూండాలి. అలా చేసినట్లయితే తనదృష్టిలోను, ఇతరుల దృష్టిలోను నిర్దోషి అవుతాడు. మానవుడు తన్నుతాను ఎపుడూ అవమానించుకోకూడదు. తన్నుతాను నిందించుకొనేవాడు ఉత్తమమైన ఐశ్వర్యాన్ని ఎన్నటికీ పొందలేడు. లోకంలో కార్యసిద్ధికి ఈ విధమైన వ్యవస్థ ఉంది. కాలం, అవస్థ అనే రెండింటిని అనుసరించి కార్య సిద్ధి ఉంటుంది. (శత్రువు దుర్బలుడుగా ఉన్నపుడు, తగినకాలంలో ప్రయత్నిస్తే కార్యసిద్ధి జరుగుతుంది.) భరతశ్రేష్ఠా! పూర్వం

నాతండ్రి మాగృహంలో ఒక బ్రాహ్మణునకు విడిది నిచ్చారు. అతడు నా తండ్రికి బృహస్పతి చెప్పిన ఈ నీతినంతా చెప్పాడు. నా సోదరులకు కూడా దీన్ని నేర్పాడు. అపుడు ఇంటిలో ఉన్న నేను వారినుండి దీన్ని విన్నాను. రాజా! అపుడు నేను ఒకపని మీద నా తండ్రి దగ్గరకు వెళ్ళి, వారు చెప్పేది వినాలనే ఆసక్తితో నా తండ్రి ఒడిలో కూర్చున్నాను. అపుడా బ్రాహ్మణుడు సాంత్వనవచనాలతో నాకు దీన్ని ఉపదేశించాడు.'

33. భీమసేనుడు పురుషార్థమును ప్రశంసించుట, యుధిష్ఠిరుని యుద్ధము చేయుమని ప్రార్థించుట.

ద్రౌపది మాటలను విని అసహనంతో క్రుద్ధుడై, భీముడు నిట్టూర్పులు విడుస్తూ యుధిష్ఠిరుని సమీపించి ఇలా అన్నాడు. 'మహారాజా! సత్పురుషోచితమై, స్వధర్మానికి అనుకూలమైన రాజ్యం పొందే మార్గాన్ని చూడు. ధర్మార్థకామాలను విడిచిపెట్టిన మనం ఈ తపోవనంలో ఉండడంవల్ల ప్రయోజనం ఏముంటుంది? దుర్యోధనుడు ధర్మంచేత కాని, ఋజువర్తనంచేత గాని, పరాక్రమంచేత గాని రాజ్యాన్ని పొందలేదు. కేవలం కపటంతో కూడిన జూదంతో రాజ్యాన్ని అపహరించాడు. బలవంత మయిన సింహాలయొక్క ఆహారాన్ని దుర్బలమైన గోమాయువు అపహరించినట్లుగా ఇప్పుడు దుర్యోధనుడు మనరాజ్యాన్ని హరించాడు. ధర్మకామాలవల్ల పుట్టిన (అర్థాన్ని) రాజ్యాన్ని విడిచి పెట్టి, స్వల్పమైన ధర్మాన్ని కప్పుకొని దుఃఖాలలో పరితపిస్తున్నా వెందుకు? గాండీవం ధరించిన అర్జునుడు రక్షిస్తున్న మనరాజ్యాన్ని ఇంద్రుడు కూడా హరింపలేడు. కాని నీవు అప్రమత్తంగా లేకపోవడంచేత మనం చూస్తూండగానే మనరాజ్యాన్ని దుర్యోధనుడు అపహరించాడు. ఈచుకుపోయిన చేతులున్న వారినుండి మారేడుపళ్ళను, కుంటివారినుండి ఆవులను అపహరించినట్లుగా మనం జీవిస్తూండగానే, నీకారణంగా మనరాజ్యం అపహరింపబడింది. నీవు ధర్మాన్ని కోరుకొనేవాడవు. నీకు అట్టి ప్రసిద్ధి కూడా ఉంది. నీ ఇష్టం తీరటంకోసం మేమంతా ఇటువంటి మహాకష్టాన్ని అనుభవిస్తున్నాం. నీ శాసనంచేత మమ్మల్ని మేము అదుపులో ఉంచుకొని, మన మిత్రులను బాధపెడుతున్నాం. శత్రువులను సంతోషపెడుతున్నాం. నీ శాసనాన్ని గౌరవించి అపుడే మేము ధృతరాష్ట్రపుత్రులను చంపకుండా ఊరుకొన్నాం. ఆ దోషం ఇప్పటికీ మమ్ములను దహిస్తూనే ఉంది. బలహీనులు చేసే నీ ఈ వనవాసమే చూడు. మృగాల్లా ఈ వనంలో ఉంటున్నాం. బలవంతులెవరూ ఇలా వనవాసం చెయ్యరు.

శ్రీకృష్ణుడు కాని, అర్జునాభిమన్యులు కాని, సృంజయవంశ వీరులు కాని, నేను కాని, నకులసహదేవులు కాని ఈ వనవాసాన్ని అంగీకరించడం లేదు. రాజా! నీవెప్పుడూ

ధర్మం, ధర్మం అంటూ నియమాన్ని పాలిస్తూ ఇలా కృశిస్తున్నావు. నీవు నిర్వేదంతో సాహసం లేకుండా నపుంసకునిలా జీవితాన్ని గడపటం లేదుకదా! తన రాజ్యసంపదను తిరిగి పొందడానికి అశక్తులు, దుర్బలులు అయిన మనుష్యులు స్వార్థవినాశకమైన, నిష్ఫలమైన వైరాగ్యాన్ని తమకిష్టమైందిగా భావిస్తారు. రాజా! నీవు సమర్థుడవు. దూరదృష్టికలవాడవు. మాయందు పౌరుషాన్ని చూసి కూడ, నీవు దయాపరుడవై వచ్చే అనర్థాన్ని తెలిసికోలేకపోతున్నావు. సహనశీలులమై సజ్జనులమైన మనలను ఆ ధృతరాష్ట్రపుత్రులు దుర్యోధనాదులు అసమర్థులుగా భావిస్తున్నారు. ఇది మాకు చాలా దుఃఖంగా ఉంది. యుద్ధంలో మరణం కూడా అంతటి దుఃఖం కలిగించదు. యుద్ధంలో వెన్ను చూపకుండా నిష్కపటంగా యుద్ధం చేసేవారికి మరణించడమే అన్నివిధాలా మేలు. యుద్ధంలో మరణిస్తే ఉత్తమలోకాలు లభిస్తాయి. భరతశ్రేష్ఠా! లేదా మనమే శత్రువులను చంపి సమస్త భూమండలాన్ని పొందితే అదీ మనకు శ్రేయస్సే. అన్నివిధాలా క్షత్రియ ధర్మమైన యుద్ధాన్ని అనుష్ఠించు. తద్ద్వారా విపులమైన కీర్తిని కాంక్షించు. మనం యుద్ధం చెయ్యడమే అన్నివిధాలా ఉచితమైంది. కర్తవ్యాన్ని గుర్తించి శత్రువు లపహరించిన రాజ్యం విషయంలో స్వలాభంకోసం యుద్ధం చేస్తే, లోకం ప్రశంసిస్తుందే కాని నిందించదు. మిత్రులకు, తనకు క్లేశాన్ని కల్గించే ధర్మం – అది వ్యసనమవుతుందే కాని, ధర్మం కాదు. కుధర్మం అవుతుంది. మరణించినవాడికి సుఖదుఃఖాలు లేనట్లే, ఎల్లప్పుడు, అన్ని అవస్థలలోను ధర్మమందే తాత్పర్యంతో ఉండి దుర్బలుడైన వాడిని ధర్మార్థాలు రెండూ విడిచిపెడతాయి. కేవలం ధర్మంకోసమే ధర్మాన్ని అనుసరిస్తూ కష్టాలు పడేవాడు బుద్ధిమంతుడు కాదు. అంధుడు సూర్యకాంతిని తెలిసికోలేనట్లే అతడు నిజంగా ధర్మంయొక్క అర్థాన్ని తెలియజాలడు. **ఎవడి ధనం కేవలం ధనంకోసమే అవుతుందో, దానాదులకొరకు కాదో, అతడు నిజంగా ధనం యొక్క తత్త్వాన్ని తెలిసినవాడు కాదు. సేవకుడు ఇతరులకోసం అరణ్యంలో గోవులను సంరక్షించినట్లుగా, అతడు ఇతరులకోసం ధనాన్ని రక్షించేవా డౌతాడు.** హద్దుమీరి కేవలం ధనాన్నే సంపాదిస్తూ, ధర్మకామాలను అనుష్ఠింపనివాడు బ్రహ్మహత్య చేసినవానివలే గర్హింప దగినవాడు. అతడు ప్రాణు లన్నింటికి వధ్యు డౌతాడు. ఎల్లపుడు కామార్థియై సంచరిస్తూ, ధర్మార్థాలను అనుష్ఠించనివాడు తనమిత్రులను కోల్పోతాడు. ధర్మార్థాలకు దూర మౌతాడు. ధర్మార్థహీనుడు కామోపభోగాల తర్వాత చివరకు నీటిలోని చేప నీరు ఎండిపోతే మరణించినట్లుగా, మృత్యువును పొందుతాడు. ఇది నిశ్చయం.

అందువల్ల, ధర్మార్థవిషయంలో పండితులు పొరపాటుపడరు. అరణి అగ్నికి ఉత్పత్తి స్థానమైనట్లుగా, ధర్మార్థాలు కామానికి ఉత్పత్తి స్థానం. **అన్నివిధాలా అర్థం**

ధర్మమూలం. ధర్మం అర్థమూలం. మేఘం-సముద్రం పరస్పరాశ్రయాలైనట్లే ధర్మార్థాలు పరస్పరాశ్రయాలు అని గ్రహించు. పూలమాల, చందనాది ద్రవ్యాల స్పర్శచేత, సువర్ణాది ధనస్పర్శచేత ప్రీతి కలుగుతుంది. దాని గురించి మనస్సులో ఏర్పడిన సంకల్పాన్నే కామ మంటారు. దానికి రూపం ఉండదు. రాజా! ధనాన్ని కోరుకొనే పురుషుడు గొప్పధర్మాన్ని కోరుకొంటాడు. కామాన్ని కోరుకొనేవాడు ధనాన్ని కోరుకొంటాడు. కామంవల్ల మరొకటేదీ కోరుకోడు. కామంచేత మరొకకామం ఏదీ సాధింపబడదు. ఉపభోగమే దాని ఫలం. కర్ర భస్మమయ్యాక భస్మం నుండి వేరొక పదార్థం తయారుకానట్లే కామోపభోగంవల్ల వేరొక కామం సాధింపబడదు అని పండితులు చెపుతారు. రాజా! వ్యాధుడు పక్షులను చంపుతాడు. ఈ ప్రత్యేకమైన హింస అధర్మంయొక్క స్వరూపం. ప్రాణులపట్ల అహింస కలిగి ఉండడం ధర్మం. కామంవల్ల, లోభంవల్ల ధర్మంయొక్క స్వభావాన్ని తెలియజాలడు. అట్టి బుద్ధిహీనుడు ఇహపరలోకాలలో ప్రాణులన్నింటికి చంపదగినవాడు. ఈ విషయం నీకు బాగా తెలుసు - ధనంచేతనే భోగ్యవస్తువులను సమకూర్చుకోగలం. ధనానికి కారణమైన దాన్ని నీవెరుగుదువు. ధనంవల్ల పొందే కార్యసిద్ధిని గురించి కూడా నీవెరుగుదువు. ధనంలేకపోయినా, ఉన్నధనాన్ని కోల్పోయినా, స్త్రీ మున్నగు ధనం జరామరణాలచే నశించినా, అట్టి మనుష్యుడి దశను అనర్థమని భావిస్తారు. ప్రస్తుతం ఆ స్థితి మనలో ఉన్నది. ఐదు ఇంద్రియాలకు, మనోబుద్ధులు ఆయావిషయాల్లో ప్రవర్తించేటపుడు కలిగే ప్రీతినే కామమంటారని నా అభిప్రాయం. అది కర్మలకు ఉత్తమమైన ఫలం. ఇలా ధర్మార్థకామాలను మూడింటిని వేరువేరుగా తెలిసికొని ఆచరించాలి. కేవలం ధర్మపరుడో, కేవలం అర్థపరుడో, కేవలం కామతత్పరుడో కారాదు. అన్నింటినీ ఎల్లపుడూ సేవించాలి. **రోజులో ఉదయం ధర్మాన్ని, మధ్నాహ్నం అర్థాన్ని, చివరిభాగంలో కామాన్ని సేవించాలి. ఇది శాస్త్రాలు చెప్పిన విధానం.* వయోవస్థలలో పూర్వభాగంలో కామాన్ని, మధ్యభాగంలో ధనాన్ని, అంతిమభాగంలో ధర్మాన్ని సేవించాలి. ఇది శాస్త్రవిధానం.**** సమయోచితజ్ఞానం కల పండితుడు ధర్మార్థకామాలను యథాయోగ్యంగా విభజించుకొని, అన్నింటినీ సేవించాలి.

రాజా! నిరతిశయసుఖాన్ని కోరుకొనే వారికి మోక్షం మిక్కిలి శ్రేయస్కరం. కురునందనా! త్రివర్గప్రాప్తికి అయినచో ధర్మార్థకామాలను ఉపాయంతోకూడిన బుద్ధిని

---

* ధర్మం పూర్వే ధవం మధ్యే జఘన్యే కామమాచరేత్ ।
అహావ్యమచరేదేవమ్ ఏష శాస్త్రకృతో విధిః ॥ 40

**కామం పూర్వే ధవం మధ్యే జఘన్యే ధర్మమాచరేత్ ।
వయస్యమచరేదేవమ్ ఏష శాస్త్రకృతో విధిః ॥ 41

ఆశ్రయించి పొందాలి. అందువలన శీఘ్రంగా కార్యమాచరించి సిద్ధిని పొందు. ఈరెండిటి మధ్యలో ఉన్నవాని జీవితం ఆతురునిజీవితం వలె దుఃఖమయ మవుతుంది. నీవెప్పుడూ ధర్మాన్ని ఆచరిస్తూనే ఉంటావని నాకు తెలుసు. ఈ విషయం తెలిసి కూడ నీస్నేహితులు నిన్ను పురుషార్థం కోసం ప్రేరేపిస్తారు. ఇహపరలోకాలలో దానం, యజ్ఞం, సత్పురుషులను గౌరవించటం, వేదాధ్యయనం, ఋజువర్తనం – ఈ ధర్మం ఉత్తమమైనది, ప్రబలమైనది కూడ. ఈధర్మం ధనంలేనివానికి ఆచరణసాధ్యం కాదు. పురుషవ్యాఘ్రా! ఇతర గుణాలన్నీ ఉన్నప్పటికీ ధనం లేకపోతే ధర్మాచరణం సాధ్యంకాదు. ఈజగత్తంతా ధర్మమూలక మైనదే. ధర్మం కంటె విశిష్టమైంది ఏదీ లేదు. మిక్కిలి ధనంతో ధర్మాచరణం చేయశక్య మవుతుంది. భిక్షాటనచేత, శారీరకశ్రమచేత, కేవలం ధర్మబుద్ధిచేత ధనసంపాదన ఎప్పుడూ సాధ్యంకాదు. బ్రాహ్మణునికి యాచనచేత కార్యసిద్ధి జరుగుతుంది. కాని నీవంటి క్షత్రియునకు యాచన నిషిద్ధం. అందువలన పరాక్రమంతోనే అర్థాన్ని పొందడానికి ప్రయత్నించు. క్షత్రియునకు భిక్షావృత్తి శాస్త్రవిహితం కాదు. వైశ్యునివలె, శూద్రునివలె జీవించడమూ విహితంకాదు. క్షత్రియునకు ప్రత్యేకంగా బలం, ఉత్సాహం ధర్మంగా చెప్పబడింది. స్వధర్మాన్ని ఆశ్రయించు. నీమీదికి వచ్చిన శత్రువులను సంహరించు. నాద్వారా, అర్జునుని ద్వారా ధార్తరాష్ట్రవనాన్ని నాశనంచెయ్యి. విద్వాంసులైన మహామనీషులు దానశీలాన్నే ధర్మంగా చెప్పారు. అందువల్ల అట్టి దానశీలాన్నీ పొందు. నీవు ఇటువంటి దయనీయమైన స్థితిలో ఉండడం తగదు. సనాతన ధర్మాలు నీవెరుగుదువు. నీవు కఠోరకర్మలు చేసే క్షత్రియకులంలో పుట్టావు. క్షత్రియజాతికి జనులంతా భయపడతారు. అందువల్ల నీవు నీ ఆభిజాత్యాన్ని, కర్తవ్యాన్ని గుర్తించు. ప్రజాపాలనధర్మం వల్ల పొందిన ఫలం నీకు గర్హింప తగిందికాదు. ఇది ఈశ్వరునిచే నీకు విహితమైన సనాతన ధర్మం. ఈధర్మంనుండి తప్పుకొనటంవల్ల లోకంలో అపహాస్యం పాలవుతావు. మానవులకు స్వధర్మాన్ని విడువడం ప్రశంసింపదగింది కాదు. హృదయాన్ని క్షత్రియోచితమైన ఉత్సాహంతో కదిపి, ఈ శిథిలమైన మనస్సును విడిచిపెట్టు. పరాక్రమాన్ని ఆశ్రయించి, దురంధరుడైన పురుషునిలా యుద్ధభారాన్ని వహించు.

కేవలం ధర్మాత్ముడైన రాజెవడూ కూడ ఈ పృథ్విని జయించలేదు. ఐశ్వర్యాన్నికాని, రాజ్యలక్ష్మిని కాని పొందలేదు. వేటగాడు ఎరచూపి, ఆశపడే మృగాలను మోసంతో పట్టుకొన్నట్లుగా, రాజు శత్రువులపట్ల కూటనీతి ప్రయోగించి రాజ్యాన్ని పొందుతాడు. సోదరులు, తమకంటె పెద్దవారూ, బలైశ్వర్యాదులచే అన్నివిధాలా సమృద్ధులు అయిన అసురులను దేవతలు మోసగించి, జయించారు. ఈ విధంగా అన్నింటిపై అధికారం

బలవంతునిదే అని గ్రహించి, కూటనీతిని ఆశ్రయించి, శత్రువులను జయించు. అర్జునుడితో సమానమైన ధనుర్ధారి, యోధుడూ లేడు. ఉండబోడు. నాతోసమానమైన గదాధారి లేడు, ఉండబోడు. ఎంతటి బలవంతుడైనాసరే ఆత్మబలంతోనే యుద్ధం చేస్తాడు. అప్రమత్తుడవు, ఉత్సాహవంతుడవు అయి ఆత్మబలాన్ని ఆశ్రయించు. ధనానికి మూలం ఆత్మబలమే. ఇంతకంటే వేరైనది వ్యర్థమైనదే. హేమంత ఋతువులోని చెట్టునీడవలె ఆత్మయొక్క దుర్బలత ఏపనిలోనూ పనికిరాదు. ఎక్కువ ధాన్యరాశిని పొందగోరి రైతు కొంతధాన్యాన్ని బీజరూపంలో త్యాగం చేస్తాడు. అదేవిధంగా ఎక్కువధనాన్ని పొందగోరినవాడు కొంత అర్థత్యాగం కూడా చేయాలి. ఈవిషయంలో నీకు సందేహం అక్కరలేదు. విడిచిన ధనంతో సమంగా కాని, ఎక్కువగా కాని లభిస్తుందంటేనే ధనాన్ని త్యాగంచేయాలి. లేకుంటే త్యాగం చెయ్యకూడదు. అలా చేయడం గాడిదను గోకడం వంటిదే. వ్యర్థం.

మనుష్యేంద్రా! ఇదే విధంగా స్వల్పమైన ధర్మాన్ని, విడిచిపెట్టి అధికమైన ధర్మాన్ని పొందినవాడిని బుద్ధిమంతుడు అని నిశ్చయంగా చెప్పవచ్చు. పండితులు మిత్రసంపదగల శత్రువును మిత్రులనుండి వేరుచేస్తారు. అపుడు భేదించినమిత్రులు విడువగా, దుర్బలుడైన ఆ శత్రువును లొంగదీసుకొంటారు. రాజా! మిక్కిలిబలవంతుడు కూడా ఆత్మబలంతో యుద్ధం చేస్తాడు. వేరొక ప్రయత్నంచే కాని, ప్రశంసలచే కాని జనులందరినీ తనవశం చేసికోలేడు.

తేనెటీగలన్నీ కలిసి తేనెను తీసికొనిపోయేవాడిని చంపినట్లుగా, దుర్బలులంతా అన్నివిధాలా కలిసి బలవంతుడైన శత్రువును చంపగలరు. రాజా! సూర్యుడు భూమిమీదున్న నీటిని తన కిరణాలతో గ్రహించి, మరల ప్రజలను వర్షరూపంగా రక్షిస్తున్నట్లుగా, నీవుకూడా సూర్యునితో సదృశుడవై ప్రజలను రక్షించు. నీపితామహులు చేసినట్లుగా ధర్మపూర్వకంగా భూమిని పాలించడం కూడా పురాతనమైన తపస్సుగా మేము విన్నాం. క్షత్రియుడు తపస్సు ద్వారా పుణ్యలోకాలను పొందలేడు. తనకు విహితమైన యుద్ధంచేస్తూ విజయం పొందినా, అందు మరణించినా కూడా అతడు పుణ్యలోకాలను పొందుతాడు. నీయొక్క ఈ కష్టాన్ని చూసిన లోకం సూర్యుని నుండి కాంతి, చంద్రుని నుండి వెన్నెల కూడా తొలగిపోతాయని భావిస్తున్నది. జనులు వేరు వేరు సమావేశాలకు వచ్చి, నిన్ను ప్రశంసిస్తూ, దుర్యోధనుని నిందిస్తూ మాటలాడుకొంటున్నారు. రాజా! బ్రాహ్మణులు, కురువంశీయులు ఒకచోట కలుసుకొని ఆనందంతో నీసత్యసంధతను గురించి మాట్లాడుకొంటున్నారు అని నా వినికిడికి వచ్చింది. మోహంవల్లకాని, దైన్యంవల్ల కాని, లోభంతో కాని, భయంతో కాని, కామంవల్ల కాని, ధనకారణంగా కాని నీవు అసత్యాన్ని కొంచెం కూడా పలుకలేదని

వారనుకొంటున్నారు. రాజు రాజ్యంకోసం చేసిన యుద్ధంలో హింసచేయడం వల్ల పొందిన పాపాన్ని, రాజ్యం పొందినపిదప యజ్ఞాలలో భూరిదక్షిణలను ఇవ్వడం ద్వారా తొలగించుకొంటాడు. రాజా! చీకటులనుండి చంద్రుడు బైటపడినట్లుగా, బ్రాహ్మణులకు గ్రామాలను, వేలకొలది గోవులను ఇవ్వడం ద్వారా రాజు పాపాలనుండి విముక్తుడౌతాడు. కురునందనా! యుధిష్ఠిరా! నగరాల్లో, పల్లెల్లో నివసిస్తూన్న వృద్ధులు, బాలురతో సహా అందరూ తరచుగ నిన్ను ప్రశంసిస్తున్నారు. కుక్కతోలుసంచిలోని పాలు, శూద్రుని వద్దనున్న వేదం, దొంగ దగ్గర సత్యం, స్త్రీ యొక్క బలం అనుచితమైనట్లే, దుర్యోధనుడి దగ్గర రాజ్యం ఉండటం కూడా తగనిదే.

ఈవిధంగా ముందునుండీ లోకంలో ప్రవాదం ఉంది. స్త్రీలు, బాలురు వేదాధ్యయనంచేస్తే, స్వరం చెడినట్లుగా, దుర్యోధనుడి దగ్గర రాజ్యముంటే చెడిపోతుంది. ఇది చాలా విచారించదగిన విషయం. మా అందరితోపాటుగా నీవు ఇటువంటి దురవస్థలో ఉన్నావు. నీమూలంగా మేమంతా కూడా నష్టపోతున్నాం. మహారాజా! విప్రులకు ధనాన్ని దానంగా ఇవ్వడంకోసం, నీవు అస్త్రశస్త్రాది సామగ్రితో సిద్ధమై రథమెక్కి, శీఘ్రంగా ఇక్కడనుండి యుద్ధానికి బయలుదేరు. సర్పాలతో సమానంగా భయంకరమైన వీరులైన దేవతలతో ఇంద్రుడు శత్రువులైన అసురులపై ఆక్రమణ చేసినట్లుగా, నీవు కూడ అస్త్రవేత్తలు, దృఢమైన విలుకాండ్రు అయిన సోదరులతో కలిసి బ్రాహ్మణులచే స్వస్తి వచనాలు పలికించుకొని, హస్తినాపురంపై ఈ రోజే దండెత్తు. అర్జునుని గాండీవం నుండి వెలువడిన బాణా లనే సర్పాల భయంకరమైన తాకిడిని మానవమాత్రు డెవడూ సహింపజాలడు. భారతా! యుద్ధంలో నా గదయొక్క వేగాన్ని సహింపగల వీరుడు కాని, ఏనుగు కాని, అశ్వం కాని లేదు. సృంజయవీరులతో, కైకయవీరులతో, వృష్ణివంశతిలకు డైన శ్రీకృష్ణునితో కలిసి సంగ్రామంలో మనరాజ్యాన్ని మనం ఎందుకు పొందలేం? రాజా! పెద్దసేనాబలంతో ప్రయత్నపూర్వకంగా యుద్ధంచేస్తే, శత్రుహస్తగతమైన రాజ్యాన్ని మళ్ళీ ఎందుకు పొందలేవు?

34. యుధిష్ఠిరుడు ధర్మమునకు కట్టుబడి ఉందునని ప్రకటించుట.

భీమసేనుడు ఈ విధంగా చెప్పిన తర్వాత, (మహానుభావుడు, సత్యవ్రతుడు), అజాతశత్రువు (అయిన యుధిష్ఠిరుడు) ధైర్యంగా ఇలా అన్నాడు. 'భారతా! నాహృదయాన్ని సూటిమాటలతో బ్రద్దలు చేస్తూ నీవు నిజమే చెప్పావు. ఇందులో సందేహం లేదు. నాకు ప్రతికూలంగా చెప్పినా నేను నిన్ను నిందించను. నా అనైతికమైన పనివల్లే ఈ కష్టం వచ్చింది కదా! అపుడు నేను ధృతరాష్ట్రపుత్రుడైన దుర్యోధనుడి నుండి రాజ్యాన్ని, రాజపదవిని

హరించడానికే జూదమాడాను. కాని ధూర్తుడు,జూదరి అయిన శకుని సుయోధనునికోసం నాకు ప్రతిపక్షంలో ఆడాడు. భీమసేనా! పర్వతప్రాంతనివాసి, మహామాయావి అయిన శకుని జూదసభలో పాచికలు వేస్తూ మాయతో మాయ తెలియని నన్ను జయించాడు. అందువల్ల ఇటువంటి కష్టాన్ని పొందాను. శకుని యొక్క పాచికలు అతని ఇచ్ఛానుసారంగా సరి బేసి సంఖ్యలలో యథాతథంగా పడటం చూసి నామనస్సు జూదాన్ని నిలిపివేయ గలిగేదే. కాని క్రోధం మానవుని ధైర్యాన్ని నాశనంచేస్తుంది. (అందుకే జూదం నిలువరించలేకపోయాను). భీమసేనా! పురుషప్రయత్నంచేత మనస్సును నియంత్రించడం శక్యంకాదు. అభిమానంచేత, పరాక్రమంచేత కూడా మనస్సు బంధింపబడదు. నాయనా! నీమాటలను నేను తప్పుబట్టలేను. అలా జరగవలసి ఉంది, జరిగింది అని భావిస్తున్నాను. భీమసేనా! దుర్యోధనుడు రాజ్యకాంక్షతో ఈకష్టంలోకి నెట్టాడు. మనకు దాస్యాన్ని కూడా కల్పించాడు. కాని ఆ సమయంలో మనకు ద్రౌపది రక్షణ అయినది. నీవూ, ధనంజయుడూ కూడా ఈవిషయాన్ని ఎరుగుదురు. మనం మళ్ళీ జూదానికి ఆహ్వానింపబడి వెళ్ళినపుడు భరతవంశీయు లందరి సమక్షంలో సభలో దుర్యోధనుడు ఒకే పందెంకోసం మనతో ఇలా అన్నాడు – 'రాజపుత్రా! అజాతశత్రూ! పన్నెండు సంవత్సరాలు అరణ్యంలో అందరికి తెలిసేటట్లుగా స్వేచ్ఛగా సంచరించి, ఆపై ఒక సంవత్సరం అజ్ఞాతంగా సోదరులందరితో రహస్యంగా సంచరించాలి. కుంతీనందనా! భరతవంశీయ గూఢచారులు ఆ సమయంలో నిన్ను గుర్తుపడితే, మళ్ళీ పన్నెండుసంవత్సరాలు వనవాసం చేయాలి. నీవీ విషయం నిశ్చయించుకొని ప్రతిజ్ఞ చెయ్యి. ఆ అజ్ఞాతవాసకాలమంతా మాకు తెలియకుండా, మాగూఢచారులను మోహపరచి చరించినట్లయితే, పంచనద ప్రదేశమంతటి మీదా నీదే అధికారం – ఈ కురుసభలో నేనీ సత్యప్రతిజ్ఞను చేస్తున్నాను. భారతా! మేమంతా మీచే జయింపబడినట్లయితే, మేముకూడ ఈ భోగాలన్నింటిని విడిచిపెట్టి ఈనియమానుసారంగా వనవాసం చేస్తాం' అని దుర్యోధనుడు కురువంశీయులందరి సమక్షంలో చెప్పాడు. అపుడు నేను 'అలాగే' అన్నాను. అనంతరం నిందింపదగిన ఆ జూదం ఆడడం, చివరిసారిగా అందులో మనమంతా ఓడిపోవడం, రాజ్యం విడిచిరావడం జరిగాయి. ఈ విధంగా మనం కష్టమైన వేషధారణతో కష్టదాయకమైన వనాలలో, అనేక ప్రదేశాలలో కష్టాలనుభవిస్తూ సంచరిస్తున్నాం.

సుయోధనుడు శాంతిని కోరకుండా మరల క్రోధానికి వశు డయ్యాడు. మనలను కష్టాల్లోకి నెట్టిన అతడు కురువంశీయులను తనవశంలోకి తెచ్చుకొని వారిని ఉన్నతపదవులలో నియోగించాడు. ఆ నాడు కౌరవసభలో సత్పురుషుల సమక్షంలో ఆ విధంగా ప్రతిజ్ఞచేసి,

రాజ్యం కారణంగా ఈనాడు దాన్ని ఎవడు విడిచిపెడతాడు? శ్రేష్ఠునికి ధర్మాన్ని అతిక్రమించి, రాజ్యాన్ని శాసించడం మరణంకంటె ఎక్కువ దుఃఖాన్ని కల్గిస్తుంది. భీమసేనా! ఆ నాడు జూదం సమయంలో నీవు నారెండు చేతులను తగలపెట్టాలనుకొన్నపుడు నిన్ను అర్జునుడు నివారించాడు. అపుడు నీవు శత్రువులను కొట్టడానికి గదమీద చెయ్యి వేశావు. అపుడు నీవలా చేసి ఉంటే ఎంతటి అనర్థం జరిగి ఉండేది? పురుషార్థాన్ని తెలిసిన నీవు నేను ప్రతిజ్ఞ చెయ్యడానికి ముందే ఈమాట లెందుకు చెప్పలేదు? ప్రతిజ్ఞానుసారంగా వనవాసానికి నావెనకే వచ్చి, ఇపుడు నాతో మిక్కిలి కఠినంగా మాట్లాడుతున్నా వేమిటి? భీమసేనా! నాకీవిషయంలో కూడా చాలా దుఃఖం కలుగుతోంది. ఆ నాడు శత్రువులచేతిలో యాజ్ఞసేని ద్రౌపది కష్టపడుతూంటే మనం కళ్ళప్పగించి చూస్తూ మౌనంగా సహించాం కదా! విషరసం త్రాగినట్లుగా దానివల్ల ఇపుడు నేను పరితపిస్తున్నాను. కురువీరులసమక్షంలో ప్రతిజ్ఞచేసి వనవాసం స్వీకరించాక, ఇపుడు రాజ్యాన్ని ఆక్రమించడం నాకు శక్యంకాదు. విత్తనాలు నాటినరైతు ఫలం వచ్చేదాక ఎదురు చూసినట్లుగా, మనకు సుఖసమయం వచ్చేదాకా నిరీక్షించు. ముందు శత్రువులచేత దెబ్బతిన్న వీరుడైన పురుషుడు వైరం కుసుమించి ఫలిస్తుందని గ్రహించి, తన పౌరుషంచేత దానిని సమూలంగా నాశనం చెయ్యాలి. అపుడే అతడు శత్రువుల సంపదలను హరింపగలడు. అటువంటివాడే ఈ లోకంలో సుఖంగా జీవించగలడు. అటువంటి వీరపురుషుడు లోకంలో సంపూర్ణసంపదను పొందుతాడు. అటువంటి వాడికి శత్రువులు వంగి నమస్కరిస్తారు. త్వరలోనే అతనికి మిత్రులు వీర్పడతారు. దేవతలు ఇంద్రుని సేవించినట్లుగా మిత్రగణం అతడిని ఆశ్రయిస్తుంది. భీమసేనా! నాఈసత్యమైన ప్రతిజ్ఞను గ్రహించు. **నేను మోక్షం కంటే, జీవితంకంటే కూడా ధర్మాన్నే కోరుకొంటాను. రాజ్యం, పుత్రులు, యశస్సు, ధనం - అన్నీ కలిసినా సత్యంలో పదహారోవంతుతో కూడా సమానం కావు.**

35. భీమసేనుడు యుధిష్ఠిరుని యుద్ధమునకు ఉత్సాహపరచుట.

భీమసేనుడిలా అన్నాడు - 'మహారాజా! నీటిలోని నురగవలె, చెట్టునున్న పండువలె నీవు కాలం బంధించిన మరణధర్మంగల మనుష్యుడవు. కాలం అన్నింటిని అంతం చేసేది. అందరినీ సంహరించేది. బాణంలా వేగంగా కదిలేది. అనంతమైంది. అప్రమేయమైంది. జలప్రవాహంలా ప్రవాహశీలమైంది. అటువంటి కాలాన్ని దుర్యోధనునితో సంధిచేసికొని, ప్రత్యక్షం చేసుకోవాలనుకొంటున్నావు. కానీ, కుంతీనందనా! సూదిమొనకి కొంచెం కొంచెం కాటుక పొడి అంటి క్షీణించినట్లుగా, ఒక్కొక్క నిమిషం గడుస్తూ ఆయువు క్షీణిస్తూ

ఉంటుంది. అటువంటి క్షణభంగురమైన జీవితంలో మానవుడు సమయంకోసం ఎలా నిరీక్షించగలడు? ఆయువునకు పరిమితిలేనివాడు, లేదా తనకెంత ఆయువు ఉందో నిశ్చయంగా తెలిసినవాడు, అన్నింటిని ప్రత్యక్షంగా చూడగల్గినవాడు కాలంకోసం నిరీక్షించగలడు. రాజా! మనం పదమూడు సంవత్సరాలు తగిన సమయం కోసం నిరీక్షించాలి. ఈ పదమూడు సంవత్సరాలు మన ఆయువు తగ్గుతుంది. మనం మృత్యువుకి మరికొంత చేరువౌతాం. దేహధారు లందరికీ మృత్యువు వారి శరీరంలోనే నిత్యమూ ఉంటుంది. అందువల్ల మరణానికన్న ముందే రాజ్యంకోసం కర్మను ఆచరిద్దాం. ఎవరిప్రభావం కప్పబడిపోయి లోకానికి తెలియరాదో, అట్టివాడు భూమికి భారంగా మాత్రమే మిగులుతాడు. అతడు తనలోని వైరాలను తొలగించుకోకుండా ఎద్దులా దుఃఖం పొంది నశిస్తాడు. బలం, ప్రయత్నం తక్కువగా ఉన్నవాడు తనలోని వైరాన్ని బయటకు పంపకపోతే, అతడిజన్మ నిష్ఫలమే. అతడి జన్మం మిక్కిలి దయనీయమైంది. రాజా! నీరెండు బాహువులు సువర్ణంపై అధికారం కలవి. నీ కీర్తి పృథుచక్రవర్తితో సమానమైంది. యుద్ధంలో శత్రువును చంపి, బాహుబల సముపార్జిత మైన ధనాన్ని అనుభవించు. రాజా! తన్ను మోసగించిన శత్రువును చంపినవాడు నరకంలో పడినాసరే, అది అతనికి స్వర్గతుల్యమైందే అవుతుంది. అసహనంవల్ల కలిగిన సంతాపం అగ్నికంటె కూడా ఎక్కువ మంట పుట్టిస్తుంది. అటువంటి అసహనంతో తపిస్తూ నేను రాత్రింబవళ్లు నిద్రించడం లేదు. ధనుర్విద్యలో శ్రేష్ఠుడైన ఈ అర్జునుడు గుహలోని సింహంలా మిక్కిలి సంతాపంతో ఉన్నాడు.

లోకంలోని ధనుర్ధారు లందరినీ ఎదిరించగల ఒకే ఒక్క వీరుడు అర్జునుడు. ఇతడు గజరాజువలె క్రోధంవల్ల కలిగిన సంతాపాన్ని నిగ్రహింపలేకపోతున్నాడు. నకులసహదేవులు, వీరమాత కుంతి నీ ప్రియాన్ని కోరుతూ జడులవలె, మూగవారివలె మాట్లాడకుండా ఉంటున్నారు. సృంజయవంశీయవీరులతో బాటుగా, బంధువు లందరూ నీప్రియాన్ని కోరుకొంటున్నారు. నేనొకణ్ణి, ప్రతివింధ్యునితల్లి ద్రౌపది - మేమిద్దరం మాత్రం సంతాపాన్ని పొందుతున్నాం. నేను చెప్పేది అందరికీ ఇష్టమే. మనమంతా కష్టంలో ఉన్న వారమే. అందువల్ల అందరూ యుద్ధాన్ని అభినందిస్తారు. రాజా! మనకంటె అల్పబలంకల నీచులు దుర్యోధనాదులు రాజ్యం అపహరించి, అనుభవిస్తున్నారు. ఇంతకంటె పాపాత్మకం ఏం ఉంటుంది? మిక్కిలి దుఃఖాన్ని కలిగించే విపత్తు ఇంకేం ఉంటుంది? నీవు స్వభావదోషం వల్ల, దయాపరుడవవటం వల్ల, మృదుస్వభావంతో ఇంతటి కష్టాలను సహిస్తున్నావు. అందువల్ల నిన్నెవరూ ప్రశంసించటం లేదు. రాజా! నీ బుద్ధి అర్థజ్ఞానం లేకుండా కేవలం వేదాక్షరాలను ఉచ్చరించే మందబుద్ధి అయిన శ్రోత్రియునివలె గురువచనానుసరణంచేత

నష్టమైంది. దయాళుడవైన నీవు బ్రాహ్మణునిలా ఉన్నావు. అసలు క్షత్రియవంశంలో ఎలా పుట్టావో తెలియదు. క్షత్రియజాతిలో సాధారణంగా క్రూరమైన బుద్ధి కలవారు జన్మిస్తారు. మనువు చెప్పిన రాజధర్మాలు నీవు విని ఉన్నావు. క్రూరులు, మోసగాండ్రు, మనహితానికి వ్యతిరేకంగా ఆచరించేవారూ, శాంతిలేని చిత్తంకలవారూ, దురాత్ములూ అయిన ధార్తరాష్ట్రులను ఎందుకు క్షమిస్తున్నావు? బుద్ధి, బలం, శాస్త్రజ్ఞానం, ఆభిజాత్యం కలిగి ఉన్న నీవు కొండచిలువలా ఏమీ చెయ్యకుండా ఎందుకున్నావు? అజ్ఞాతవాససమయంలో మనలను కనబడకుండా ఉంచా లనుకొన్నవాడు దుర్యోధనుడు. వాడిని నీవు కప్పిపుచ్చా లనుకొంటున్నావు. ఇది ఎలా ఉందంటే పిడికెడు గడ్డిపోచలతో హిమవత్పర్వతాన్ని కప్పుదామనుకొంటున్నట్లే ఉంది. ఈ భూమండల మంతా ఆకాశంలో సూర్యునిలా ప్రసిద్ధిపొందిన నీవు అజ్ఞాతంగా సంచరించలేవు. జలసమృద్ధి ఉన్నచోట పత్రపుష్పశాఖలతో శోభిల్లుతున్న సాలవృక్షంలా, తెల్లఏనుగు ఐరావతంలా జయశీలుడైన అర్జునుడు అజ్ఞాతంగా ఎలా ఉండగలడు? సింహవిక్రములైన నీచిన్న తమ్ములు నకులసహదేవులు అజ్ఞాతంగా ఎలా ఉండగలరు? వీరజనని, పవిత్రకీర్తి, రాజకుమారి అయిన ద్రౌపది లోకంలో విఖ్యాతి కలది. ఈమె అజ్ఞాతంగా ఎలా చరింపగలదు? నన్ను కూడా బాలురతో సహా ప్రజలందరూ ఎరుగుదురు. మేరు పర్వతాన్ని దాచడం సాధ్యంకానట్లే, నన్ను అజ్ఞాతంగా ఉంచడం సాధ్యం కాదనుకొంటున్నాను.

మరొకమాట కూడా ఉంది. మనం కూడా చాలమంది రాజులను, రాజకుమారులను వారి రాజ్యాలనుండి వెళ్ళగొట్టాం. వారంతా ధృతరాష్ట్రునితో చేతులు కలిపారు. ఇపుడు వారంతా మనతో శాంతంగా వ్యవహరించరు. వారంతా దుర్యోధనుడి ప్రీతికోసం అజ్ఞాతంగా ఉన్న మనలను గుర్తించా లనుకొంటారు. అందుకోసం మనపై వారివారి గూఢచారులను ప్రయోగిస్తారు. వారు మనలను గుర్తించి దుర్యోధనుడికి చెప్తారు.. అపుడు మనం పెద్దభయంకరమైన సంకటంలో పడతాం. ఇప్పటికి మనం పదమూడు నెలలు వనవాసం బాగానే చేశాం. ఈ పదమూడు మాసాలను పరిమాణంచేత పదమూడు సంవత్సరాలుగా గుర్తించు. మాసం సంవత్సరానికి ప్రతినిధి అని మనీషులు చెపుతారు. యజ్ఞంలో సోమలతకు బదులుగా పూతికను ఇచ్చినట్లుగా నీవు ఈ పదమూడు మాసాలను పదమూడు సంవత్సరాలుగా స్వీకరించు. రాజా! లేదా మంచివారిని మోసే ఒకమంచి ఎద్దునకు బాగా పుష్టిగా ఆహారాన్ని ఇవ్వడం ద్వారా నీవు ఈపాపం నుండి విముక్తుడవు అవుతావు. అందువల్ల, రాజా! శత్రుసంహారానికి నిశ్చయం చెయ్యి. క్షత్రియులకు యుద్ధంకంటె వేరొక ధర్మం లేదు.'

36. వ్యాసుడు యుధిష్ఠిరునికి ప్రతిస్మృతి విద్యనిచ్చుట, పాండవులు కామ్యకవనమునకేగుట.

భీమసేనుని మాటలను విని, యుధిష్ఠిరుడు మనస్సులో విచారించాడు - 'నేను రాజధర్మాలను, వర్ణధర్మాలను, వాటి నిర్ణయాలను విన్నాను. కాని భవిష్యద్వర్తమానాలపై దృష్టి పెట్టినవాడే యథార్థదర్శి అవుతాడు. ధర్మంయొక్క అంతిమలక్ష్యం తెలియడం కష్టం. అది తెలిసిన నేను బలవంతంగా మేరుపర్వతం వంటి ధర్మాన్ని ఎలా అణచివేయగలను? ఈ విధంగా కొద్దిసేపు బాగా ఆలోచించి, కర్తవ్యాన్ని నిశ్చయించుకొని, యుధిష్ఠిరుడు వెనువెంటనే భీమునితో ఇలా అన్నాడు. 'నీవు చెప్పినమాట సరి అయినదే. అయినప్పటికీ నేను మరొక విషయం చెపుతాను. గ్రహించు. కేవలం సాహసంవల్ల మహాపాపకర్మలు ప్రారంభిస్తే, అవి మనలను బాధపెడతాయి. మంచిసలహా తీసికొని, బాగా ఆలోచించి, చక్కగా పూర్ణపరాక్రమం ప్రకటిస్తే దానివల్ల కోరుకొన్న లక్ష్యాలు సిద్ధిస్తాయి. అటువంటి పనిలో దైవం కూడా అనుకూలంగా ఉంటుంది. కేవలం చాపల్యం వల్ల స్వయంగా బలగర్వంచేత ఉద్ధతుడవై ఇపుడు యుద్ధమనే కార్యం ప్రారంభించాలని భావిస్తున్నావు. ఈ విషయంలో నామాట విను. భూరిశ్రవుడు, శలుడు, జలసంధుడు, భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు, ద్రోణపుత్రుడు, ఎదిరింపశక్యంగాని దుర్యోధనాదులు - వీరంతా అస్త్రవిద్యాకోవిదులు. మనచే అణచివేయబడిన, దుష్టులైన రాజులందరు ఇపుడు కౌరవపక్షాన్ని ఆశ్రయించి, వారితో మంచి స్నేహాన్ని కలిగి ఉన్నారు. వారంతా దుర్యోధనుని హితానికి కట్టుబడి ఉన్నారు. మనపట్ల వారికి సద్భావం ఉండదు. వారు ధనాగారాలు నిండి, సైనికబలంతో శక్తిసంపన్నులుగా ఉన్నారు. వారంతా యుద్ధంలో మనకు వ్యతిరేకంగా ప్రయత్నిస్తారు. కౌరవసైన్యంలోని అమాత్యులకు, సైనికులకు, వారి వారి పుత్రులకు సంపూర్ణవేతనాలను, అన్నివిధాలైన భోగసామగ్రిని దుర్యోధనుడు వితరణ చేశాడు. దుర్యోధనుడు సైన్యంలోని వీరులందరిని విశేషంగా గౌరవించాడు. వారు దుర్యోధనుడి కోసం యుద్ధంలో ప్రాణాలు కూడా విడుస్తారు అని నా నిశ్చితాభిప్రాయం. మహాబాహూ! భీష్మద్రోణ, కృపులకు వారిపట్ల, మనపట్ల సమానమైన ప్రీతి ఉంది. కాని దుర్యోధనుడి అన్నం తింటున్నారు. అందువల్ల వారు యుద్ధంలో దుర్యోధనుడికోసం విడువశక్యంగాని ప్రాణాలనైనా వదిలిపెడతారు. వారంతా దివ్యాస్త్రవిద్వాంసులు. ధర్మపరాయణులు. వారిని ఇంద్రాదిదేవతలు కూడ జయించలేరు అని నా అభిప్రాయం. కౌరవపక్షంలో ఉన్న కర్ణుడు మహారథుడు. అసహనశీలి. నిత్యం క్రోధంతో ఉండేవాడు. అన్ని అస్త్రాలు తెలిసినవాడు. ఎదిరింప శక్యంగాని వాడు. అభేద్యమైన కవచంచేత సురక్షితుడు కూడా. యుద్ధంలో పురుషశ్రేష్ఠులైన వీరినందరినీ

జయించకుండా నిస్సహాయుడవైన నీవు దుర్యోధనుని చంపలేవు. వృకోదరా! ధనర్ధారులందరినీ మించిన కర్ణుడు బాణం వేయడంలోని లాఘవాన్ని తలచుకొంటూంటే నాకు నిద్రపట్టడం లేదు. యుధిష్ఠిరుడు చెప్పిన మాటల అభిప్రాయం తెలిసి, అసహనశీలుడైన భీమసేనుడు ఉద్వేగం పొంది, విమనస్కుడై ఏమీ మాట్లాడలేకపోయాడు.

పాండుపుత్రులు ఈవిధంగా మాట్లాడుకొంటూండగా, సత్యవతీసుతుడు, మహాయోగి అయిన వ్యాసుడు అక్కడకు వచ్చాడు. అలా వచ్చిన వ్యాసుని పాండవులు యధోచితంగా పూజించారు. పిదప ఔపదేశికులలో శ్రేష్ఠుడైన వ్యాసుడు యుధిష్ఠిరునితో ఇలా చెప్పాడు. 'యుధిష్ఠిరా! నాబుద్ధితో నీహృదయంలోని భావాన్ని తెలుసుకొన్నాను. అందువల్ల వేగంగా వచ్చాను. శత్రుఘ్నా! భీష్మ, ద్రోణ, కృప, కర్ణ, ద్రోణపుత్ర(అశ్వత్థామ), దుర్యోధన, దుఃశాసనులవల్ల నీహృదయంలో కలిగిన భయాన్ని శాస్త్రీయమైన ఉపాయంతో పోగొట్టుతాను. రాజేంద్రా! ఆ ఉపాయాన్ని విని, ధైర్యం వహించి, ప్రయత్నంతో అనుష్ఠించు. అలా అనుష్ఠించిన తర్వాత శీఘ్రంగా నీ మానసికచింతను విడిచిపెట్టు. ఆ తరువాత (వాక్యవిశారదుడు, పరాశరనందనుడు అయిన) వ్యాసుడు యుధిష్ఠిరుని ఏకాంతానికి తీసుకువెళ్ళి యుక్తియుక్తంగా ఇలా చెప్పాడు. 'భరతశ్రేష్ఠా! నీకు అభివృద్ధికలిగే శ్రేష్ఠమైన సమయం వచ్చింది. ధనుర్ధరుడైన అర్జునుడు రణరంగంలో శత్రువులను పరాజితులను చేస్తాడు. మూర్తీభవించిన సిద్ధివంటి, ప్రతిస్మృతి అనే విద్యను నేను చెపుతున్నాను. తీసుకో. నన్ను ఆశ్రయించిన వాడవుగాన, నీ కీ విద్యను చెపుతున్నాను. ఆ విద్యను పొంది అర్జునుడు నీ కార్యాన్ని సాధిస్తాడు. దానిద్వారా అర్జునుడు దివ్యాస్త్రాలకోసం మహేంద్రుని, రుద్రుని, వరుణుని, కుబేరుని, (యమ)ధర్మరాజును కూడ సమీపించవచ్చు. అతడు తన తపస్సుచేత, పరాక్రమంచేత దేవతలను ప్రత్యక్షంగా చూడగలడు. ఈ అర్జునుడు పురాతనుడు, మహాతేజస్వి అయిన నరు డనే మహర్షి. ఇతనికి శాశ్వతుడు, అజేయుడు, జయశీలుడు అచ్యుతుడు అయిన నారాయణుడు సహాయుడు. మహాబాహువైన అర్జునుడు ఇంద్ర, రుద్ర, లోకపాలురనుండి అస్త్రాలను తీసికొని, మహాకార్యాన్ని నిర్వహిస్తాడు. కుంతీనందనా! ఈ వనం విడిచి నివాసయోగ్యమైన మరొక వనాన్ని గురించి ఆలోచించండి. అది మీకు యోగ్యమైన దవుతుంది. ఒకేచోట ఎక్కువకాలం ఉండడం ప్రీతిజనకంగా ఉండదు. ఇక్కడుండే తాపసు లందరికి ఉద్వేగకారకంగా కూడా ఉంటుంది. ఇక్కడున్న అనేక మృగాలను ఉపయోగించడం జరిగింది. వేదవేదాంగపారంగతులైన బ్రాహ్మణులను చాలామందిని పోషిస్తున్నావు. అందువల్ల ఇక్కడున్న లతలకు, ఓషధులకు కొరత ఏర్పడుతుంది. ఈ విధంగా చెప్పి, లోకతత్త్వజ్ఞుడు, యోగి, అయిన వ్యాసుడు తన్ను ఆశ్రయించిన

యుధిష్ఠిరునకు శ్రేష్ఠమైన ఆ విద్య నుపదేశించి, అక్కడే అంతర్ధానమయ్యాడు. ధర్మాత్ముడు, సంయతచిత్తుడు, మేధావి అయిన యుధిష్ఠిరుడు, ఆ వేదమంత్రాన్ని మనస్సుచే ధారణచేసి, ఆయా సమయాలలో దాన్ని చక్కగా అభ్యాసం చేయసాగాడు. అటు తరువాత వ్యాసుని మాట ననుసరించి ధర్మరాజు తనవారందరితో ద్వైతవనాన్ని విడిచి సరస్వతీ నది ఒడ్డున ఉన్న కామ్యకవనానికి వెళ్ళాడు. మహారాజా! దేవేంద్రుని ఋషు లందరూ అనుసరించినట్లు, ఆ ధర్మరాజును శిక్షాక్షరవిశారదులు, తపస్వులు అయిన బ్రాహ్మణులు అనుసరించారు. వారు ఆ ద్వైతవనం నుండి కామ్యకవనానికి చేరి అమాత్య పరిజనులతోకూడి అక్కడ నివసింపసాగారు. అక్కడవారు కొంచెం కాలం నివసించారు. ధనుర్వేదాభ్యాసాల్లో తత్పరులు, వీరులు, మనస్వులు అయిన పాండవులు ఉత్తమమైన వేదాన్ని వింటూ కొంతకాలం అక్కడున్నారు. నిత్యం వేటకు వెళుతూ, శుద్ధమైన బాణాలతో మృగాలను వేటాడుతూ, పితృ దైవత, విప్రులకు యథావిధిగా శ్రాద్ధకర్మలు ఆచరించారు.

37. అర్జునుడు సోదరులందరితో కలసి ఇంద్రకీలాద్రికేగి ఇంద్రుని దర్శించుట.

కొంతకాలం తర్వాత ధర్మరాజు వ్యాసమహర్షి సందేశాన్ని స్మరించి, ఏకాంత ప్రదేశంలో ప్రజ్ఞాప్రసిద్ధుడైన అర్జునునితో ఒక మాట చెప్పాడు. ముహూర్తకాలం వనవాసాన్ని స్మరించుకొని, శత్రుదమనుడైన ధర్మరాజు సాంత్వపూర్వకంగా చేతితో స్పృశించి, ఏకాంతంలో ధనంజయునితో ఇలా చెప్పాడు. 'భరతనందనా! భీష్మ, ద్రోణ, కృప, కర్ణ, అశ్వత్థామలయందు నాలుగు పాదాల ధనుర్వేదం నేడు సంపూర్ణంగా ప్రతిష్ఠితమై ఉంది. దైవ బ్రాహ్మ మానుషపద్ధతులకు సంబంధించిన సర్వాస్త్ర ప్రయోగం సంపూర్ణంగా ఎరుగుదురు. అస్త్రాల గ్రహణధారణలు ప్రయత్నపూర్వకంగా ఎరుగుదురు. శత్రువులు ప్రయోగించిన ఆయా అస్త్రాల చికిత్స (నివారణోపాయము)ను కూడా వారు ఎరుగుదురు. దుర్యోధనుడు వారందరికి నచ్చచెప్పాడు. వారికి ఉపభోగసామగ్రిని సమకూర్చి సంతుష్టులను చేశాడు. వారిపట్ల గురుభావంతో ప్రవర్తిస్తున్నాడు. యోధులందరిపట్ల దుర్యోధనుడికి మిక్కిలిప్రేమ ఉంది. అతడు ఆచార్యు లందరిని గౌరవించాడు. వారంతా సంతుష్టు లైనారు. అందువల్ల అతనికోసం వారు ఎల్లపుడూ శాంతితో వ్యవహరిస్తారు. సమయోచితంగా పూజింపబడిన వారంతా ఏ పరిస్థితుల్లోనూ కూడ అతని శక్తిని క్షీణింపనీయరు. ఈ రోజున గ్రామ నగరాలతో, సాగర వనాలతో శోభిల్లుతున్న ఈ భూమండలం అంతా దుర్యోధనుడి వశంలో ఉంది. అర్జునా నీవే మాకు మిక్కిలి ఇష్టుడవు. నీపైనే భారమంతా ఉంచాం.

శత్రుదమనా! ఈ సమయంలో చేయదగిన పనిని నేను కనుగొన్నాను. అది

చెపుతాను విను. నాయనా! నేను కృష్ణద్వైపాయనుడైన వ్యాసుని నుండి ఒక రహస్యమైన విద్యను పొందాను. ఆ విద్యను యథావిధిగా ప్రయోగిస్తే సమస్తజగత్తు నీకు ప్రకాశిస్తుంది. నాయనా! ఏకాగ్రచిత్తంతో దాన్ని ధ్యానించడం ద్వారా ఆయా సమయాలలో దేవతల అనుగ్రహాన్ని పొందుతావు. భరతశ్రేష్ఠా! నీవు ఉగ్రమైన తపస్సు చెయ్యి. ధనుస్సు, కవచం, ఖడ్గం ధరించి సాధువ్రతాన్ని అవలంబిస్తున్నావు. మౌనంగా ఉండి, ఆక్రమించడానికి ఎవరికీ అవకాశం ఇవ్వకుండా ఉత్తర దిక్కుగా వెళ్లు. ధనంజయా! ఇంద్రునికి అన్ని దివ్యాస్త్రాల విజ్ఞానమూ ఉంది. వృత్రాసురుని వల్ల భయపడిన దేవతలంతా తమ తమ అస్త్రాలను ఇంద్రుని కిచ్చారు. ఆ దివ్యాస్త్రాలన్నీ ఇంద్రుడొక్కని దగ్గరే ఉన్నాయి. అందువల్ల ఆతనినుండి నీవు పొందగలవు. కనుక నీవు ఇంద్రుడినే ఆశ్రయించు. అతడు నీకు అస్త్రాల నిస్తాడు. ఈరోజే దీక్షితుడవై ఆ దేవేంద్రుని చూడటానికి వెళ్లు. ఈ విధంగా చెప్పి శక్తిశాలి అయిన ధర్మరాజు మనోవాక్కాయాలను నిగ్రహించుకొని దీక్షితుడైన అర్జునునకు విధివిధానంగా ప్రతిస్మృతి విద్యను ఉపదేశించాడు. తన వీరసోదరుడైన అర్జునుని బయలుదేరమని ధర్మరాజు అనుమతి నిచ్చాడు. ధర్మరాజుఆజ్ఞతో ఇంద్రుని చూడగోరిన ధనంజయుడు అగ్నికి ఆహుతు లిచ్చి, బ్రాహ్మణులకు దక్షిణలిచ్చాడు. వారు స్వస్తి వచనం పలికారు. కవచ, తలత్ర, అంగుళిత్రాలను ధరించి గాండీవాన్ని, అక్షయ్యమగు అంబులపొదిని తీసికొని, ధార్తరాష్ట్రుల వధకొరకు నిట్టూర్చి, పైకి చూచి, బయలుదేరాడు. శరాసనం ధరించి బయలుదేరిన అర్జునుని చూసి బ్రాహ్మణులు, సిద్ధులు, అదృశ్యంగా ఉన్న భూతాలు ఇలా అన్నాయి. 'కుంతీనందనా! నీవు మనస్సులో కోరుకొన్న దానిని శీఘ్రంగా పొందుతావు. పార్థా! నీవు నీ అభీష్టాన్ని సాధించు. నీకు విజయం తప్పక కలుగుతుంది.'

సాలవృక్షం వంటి భుజాలు, ఊరువులు కల అర్జునుడు అలా బయలుదేరుతుంటే అందరి మనస్సులలోని అభిప్రాయాన్ని గ్రహించిన ద్రౌపది ఆ వీరునితో ఇలా అంది. 'ధనంజయా! నిన్ను కన్నప్పుడు నీ తల్లికుంతి నీ గురించి ఏమని భావించిందో, నీ మనస్సులో ఏం కోరుకొంటున్నావో, అవన్నీ నీకు లభించుగాక. మన క్షత్రియకులంలో ఎవరూ పుట్టుకుండు గాక! బ్రాహ్మణులకు నమస్కారం. వారు భిక్షాటనచే కూడ జీవించవచ్చును. ఇది నాకు మిక్కిలి దుఃఖాన్ని కలిగిస్తోంది. పాపాత్ముడైన ఆ దుర్యోధనుడు రాజసభలో బిగ్గరగా నవ్వుతూ నన్ను 'గౌ:' అని అన్నాడు. (అనేక పురుషులకు ఉపభోగక్షమమైనదని అభిప్రాయం) ఆ దుఃఖంకంటె కూడా, నన్ను నిండుసభలో మిక్కిలి అనుచితంగా మాట్లాడాడు, అది నాకు ఇంకా దుఃఖాన్ని కలిగిస్తోంది. వీరశ్రేష్ఠా! నీవు

వెళ్ళినతర్వాత నీసోదరులు మెలకువగా ఉన్న సమయంలో నీ వీరగాధలను మాటిమాటికి చెప్పుకొంటూ ఆనందిస్తారు. ఇది నిశ్చయం. కానీ, పార్థా! నీవు చాలాకాలం ప్రవాసంలో ఉంటే మాకు భోగాలపట్ల గాని, ధనంపట్ల గాని, జీవితంపట్ల గాని ప్రీతి కలగదు. మా అందరి సుఖ దుఃఖాలు, జీవన్మరణాలు, రాజ్యం, ఐశ్వర్యం, అన్నీ నీమీదే ఆధారపడి ఉన్నాయి. నీకు వీడ్కోలు పలుకుతున్నాను. భరతనందనా! నీకు శుభమగుగాక! మహాబలా! నీవు బలవంతులతో విరోధించవద్దు, నిర్విఘ్నంగా విజయం కొరకు శీఘ్రంగా వెళ్లు. ధాతకు, విధాతకు నమస్కారం. క్షేమంగా, ఆరోగ్యంగా వెళ్ళిరా. ధనంజయా! హ్రీ, శ్రీ, కీర్తి, ద్యుతి, పుష్టి, ఉమ, లక్ష్మి, సరస్వతి – ఈ దేవతలందరూ ప్రయాణంలో నిన్ను రక్షింతురు గాక! నీవు పెద్దవారిని గౌరవిస్తావు. పెద్దన్నగారి మాటను ఆచరిస్తావు. నీకు శాంతికలగడం కోసం నేను వసు, రుద్ర, ఆదిత్య, మరుద్గణాలను, విశ్వేదేవతలను, సాధ్యులను, ప్రార్థిస్తాను. అంతరిక్షంలో ఉన్న దివ్యులైన భూతాలనుండి, మార్గంలో విఘ్నం కలిగించే ఇతర ప్రాణులనుండి నీకు శుభమగుగాక!' ఈ విధంగా మంగళవచనాలు పలికి, యశస్విని అయిన ద్రౌపది విరమించింది.

ఆ తరువాత అర్జునుడు సోదరులకు, ధౌమ్యునకు ప్రదక్షిణంచేసి, మెరిసే తన గాండీవాన్ని తీసికొని బయలుదేరాడు. అర్జునుడు ఇంద్రునినుండి పొందిన ప్రతిస్మృతి అనే యోగవిద్యతో కూడి ప్రకాశిస్తూ ఉండడంవల్ల, అతడు దారిలో వెళుతూ ఉంటే సర్వభూతాలూ ప్రక్కకు తప్పుకొంటున్నాయి. పరంతపుడైన అర్జునుడు తపస్సులచే సేవింపబడిన పర్వతాల మార్గంలో వెళుతూ దివ్యమూ, పుణ్యమూ, దేవతలకు ప్రీతికరమూ అయిన హిమవత్పర్వతానికి చేరుకొన్నాడు. మహాతనస్వి అయిన అర్జునుడు యోగయుక్తుడవటం వల్ల మనోవేగంతో కూడిన గమనంతో వాయువులా ఒక్కరోజులోనే పవిత్రమైన ఆ హిమవత్పర్వతానికి చేరుకొన్నాడు. అతడు అలసటలేకుండా హిమవత్పర్వతాన్ని దాటి, గంధమాదనాన్ని చేరి, అక్కడనుండి రాత్రింబవళ్ళు దుర్గమ ప్రదేశాలను దాటి వెళ్ళాడు. ఆ తరువాత ఇంద్రకీలాద్రి మీదకు చేరుకొన్నాడు. అక్కడ అంతరిక్షం నుండి 'ఆగు' (నిలు) అనే మాట విన్నాడు. అక్కడే ఆగాడు. ఆ మాటను విని, పాండునందనుడు అర్జునుడు అన్ని వైపులకు దృష్టి సారించాడు. అక్కడొక చెట్టు మొదట్లో కూర్చున్న ఒక తపస్విని చూశాడు. బ్రహ్మతేజస్సుతో ప్రకాశిస్తూ, పింగళవర్ణ జటలు ధరించి, కృశించిఉన్న ఆ తపస్వి అర్జునునితో ఇలా అన్నాడు. "నాయనా! ధనుర్బాణాలు, కవచం ధరించి, ఖడ్గం, తలత్రాణం ధరించి, క్షత్రధర్మాన్ని అనుసరిస్తూ ఇక్కడకు వచ్చిన నీవెవరు? ఇక్కడ శస్త్రంతో చేయదగింది ఏమీలేదు. ఇది ఇంద్రియనిగ్రహంతో, క్రోధహర్షాలు జయించి,

తపస్వులైన బ్రాహ్మణులుండే ప్రదేశం. ఇక్కడ ధనుస్సుతో చేయవలసిన పనేమీలేదు. ఇక్కడేమీ ఎక్కడా యుద్ధం జరగటం లేదు. నాయనా! నీవు నీ ఈ ధనుస్సులు అలా ఉంచు (పడవేయి). నీవు ఉత్తమమైన గతిని పొందుతావు. వీరా! తేజోబలాలలో నీతో సమానమైన వాడు వేరొకడు లేడు" అని పలికి ఆ బ్రహ్మర్షి మరల మరల అర్జునుని ధనుస్సు వదిలిపెట్టమని నవ్వుతూ చెప్పాడు. కాని దృఢనిశ్చయం గల అర్జునుని ధైర్యం నుండి అతడు చలింపజేయలేకపోయాడు.

ఆ తరువాత ఆ బ్రాహ్మణుడు నవ్వుతూ అర్జునుడితో ఇలా అన్నాడు – 'అరిసూదనా! నేను ఇంద్రుడను, నీకు శుభమగుగాక! నీవు వరం కోరుకో.' అలా చెప్పిన ఇంద్రునితో శూరుడు కురుకులశ్రేష్ఠుడు అయిన అర్జునుడు చేతులుజోడించి నమస్కరించి ఇలా బదులు పలికాడు. 'ఇపుడు నేను నీనుండి సంపూర్ణంగా అస్త్రాన్ని గురించి తెలిసికోవాలనుకొంటున్నాను. పూజ్యుడా! ఇది నా అభీష్టం. ఈ వరాన్ని నాకియ్యి.' అపుడా తడు సంతోషించి ఇంద్రుడై నవ్వుతూ అర్జునునితో ఇలా అన్నాడు 'ధనంజయా! ఇక్కడకు వచ్చిన నీకు అస్త్రాలతో పని ఏమిటి? నీకిష్టమైన లోకాలను కోరుకో. నీవు పరమస్థితిని పొందావు' అది విని ధనంజయుడు సహస్రాక్షుడైన ఇంద్రునితో మళ్ళీ ఇలా అన్నాడు – 'త్రిదశాధిపా! లోభంవల్ల కాని, కామం వల్ల కాని ఇక్కడకు రాలేదు. దేవత్వం కాని, సుఖం కాని, సంపూర్ణమైన దేవతల ఐశ్వర్యం కాని నేను కోరుకోవటం లేదు. అలా చేస్తే, సోదరుల నలా అడవిలో వదిలి, విరోధాన్ని పోగొట్టుకోక, సర్వలోకాలలో శాశ్వతంగా అపకీర్తిని నేను పొందుతాను.' అర్జునుడిలా చెప్పగానే, విశ్వవందితు డయిన ఇంద్రుడు మధురమైన మాటలతో అర్జునుని ఊరడిస్తూ ఇలా అన్నాడు. 'నాయనా! త్రినేత్రుడు, శూలధరుడు, భూతేశుడు అయిన శివుని నీవు దర్శించగలిగితే, అపుడు నీకు అన్నివిధాలైన దివ్యాస్త్రాలను ఇస్తాను. కుంతీకుమారా! పరమేశ్వరుడైన ఆ మహాదేవుని దర్శించడానికి ప్రయత్నం చెయ్యి. అతనిని చూడటంవల్ల నీకు సంపూర్ణకార్యసిద్ధి కలుగుతుంది. అటుపై స్వర్గానికి వెళతావు.' అర్జునుడికి ఈ విధంగా చెప్పి ఇంద్రుడు అదృశ్యమయ్యాడు. అటుతర్వాత అర్జునుడు కూడా యోగయుక్తుడై నిలిచాడు.

38. అర్జునుని ఉగ్రతపస్సు, ఆ విషయమును ఋషులు శంకరునితో చర్చించుట.

జనమేజయుడు ఇలా అన్నాడు – 'పూజ్యుడా! అర్జునుడు అస్త్రాలను ఏ విధంగా పొందగలిగాడు ? ఈ వృత్తాంతాన్ని విస్తరంగా వినాలనుకొంటున్నాను.' వైశంపాయనుడిలా

అన్నాడు - 'మహాత్ముడైన అర్జునుని యొక్క వృత్తాంతం దివ్యం, అద్భుతం, మహత్త్వపూర్ణం. దాన్ని నీకు చెపుతాను. అనఘా! దేవదేవుడైన త్ర్యంబకునితో అర్జునునకు శరీర స్పర్శకలిగిన సమాగమవృత్తాంతాన్ని చెపుతాను, జాగ్రత్తగా విను. 'రాజా! అమితవిక్రముడు, మహాబలుడు, మహాబాహువు, కురుకులభూషణుడు, ఇంద్రపుత్రుడు, స్థిరచిత్తుడు, విశ్వ విఖ్యాతమహారథుడు అయిన అర్జునుడు యుధిష్ఠిరుని ఆదేశంవల్ల, సురాధిపుడైన ఇంద్రుని, దేవదేవుడైన శంకరుని చూడటంకోసం దివ్యమైన గాండీవధనువును, (బంగారుపిడి గల) ఖడ్గాన్ని తీసికొని ఉత్తర దిక్కుగా హిమవచ్ఛిఖరం మీదికి వెళ్ళాడు. తపస్సుకోసం దృఢమైన నిర్ణయం తీసికొని, మిక్కిలివేగంగా భయంకరమైన వనంలోకి ఒంటరిగా వెళ్ళాడు. ఆ వనం పలురకాలైన పుష్పఫలాలతో కూడి ఉంది. అనేకవిధాలైన పక్షులకు ఆశ్రయ మైనది. అనేక మృగసమూహాలతో నిండి ఉంది. సిద్ధులచే, చారణులచే సేవింపబడుతోంది. నిర్జనమైన వనానికి అర్జునుడు వెళ్ళిన తర్వాత ఆకాశంలో శంఖపటహాల ధ్వని వినబడింది. భూమిపై గొప్ప పుష్పవృష్టి పడింది. ఆకాశమంతా మేఘాల సముదాయం ఆవరించింది. అర్జునుడు దుర్గమాలైన వనాలను దాటి హిమవత్పర్వతం పృష్ఠభాగంలో ఒక మహాపర్వతం దగ్గర నివసిస్తూ శోభిల్లాడు. వికసించినపూలతో నిండి, పక్షుల మధురనాదాలతో ఉన్న వృక్షాలను, వైడూర్యాలవలె స్వచ్ఛమైన కాంతితో, పెద్ద సుడులుగల నదులను అర్జునుడు చూశాడు. హంస, కారండవ, సారస పక్షుల ధ్వనులతో, పుంస్కోకిలల స్వరాలతో, క్రౌంచ, బర్హిణనాదాలతో ఆ నదులు మనోహరంగా ఉన్నాయి. నదులను ఆనుకొని అందమైన వనా లున్నాయి. అక్కడ ఉన్న అతిరథుడైన అర్జునుడు పవిత్రాలైన, చల్లని నీళ్ళున్న నదులను చూసి సంతుష్టాంతరంగు డయ్యాడు. అందమైన ఆ వనంలో అర్జునుడు సంతోషంతో ఉగ్రమైన తపస్సులో ఉన్నాడు. దర్భవస్త్రం ధరించి, దండం, మృగచర్మాలు స్వీకరించిన అర్జునుడు నేలపైపడిన ఎండుటాకులను భోజనానికి ఉపయోగించేవాడు. ఒకనెల వరకు మూడేసి రాత్రులకొకసారి ఫలాలను తినేవాడు. రెండవనెలలో వెనుకటి దానికి రెట్టింపు సమయంలో, ఆరు రాత్రులకొకసారి ఫలాహారం తీసికొనేవాడు. మూడవమాసంలో పదిహేనురోజులకొకసారి ఆహారం తీసికొనేవాడు. ఆ తరువాత మహాబాహువైన, అర్జునుడు కేవలం వాయుభక్షకుడై, చేతులు పైకెత్తి, ఆసరా లేకుండా కాలిబొటనవ్రేలి కొనమీద నిలిచి తపస్సుచేశాడు. అర్జునుని శిరోజాలు నిత్యమూ స్నానం చేయడంవల్ల విద్యుత్తువలె, పద్మంవలె ప్రకాశిస్తున్నాయి.

అప్పుడు మహర్షులంతా ఉగ్రమైన తపస్సులో ఉన్న అర్జునుని గురించి నివేదించడానికి ఈశ్వరుని వద్దకు వెళ్ళారు. వారు మహాదేవునికి నమస్కరించి పార్థుడు చేస్తున్న తపస్సు గురించి ఇలా చెప్పారు 'దేవేశా ! అర్జునుడు అంతులేని ఉగ్రతపస్సులో ఉండి, దిక్కులన్నింటిని

ధూమావృతం చేస్తున్నాడు. అతని కోరిక ఏమిటో మేము ఎరుగం. మమ్మందర్నీ అతడు తపింపజేస్తున్నాడు. కావున మంచిగా అతనిని తపస్సునుండి నివర్తింపజేయి.' సద్భావంగల ఆ మునీశ్వరుల మాటలు విని భూతనాథుడైన ఉమాపతి ఇలా పలికాడు. 'మహర్షులారా! అర్జునుడి విషయంలో మీరేమీ విచారించ నవసరంలేదు. మీరు శీఘ్రంగా, సంతోషంతో, అలసత్వం లేకుండా మరలి వెళ్ళండి. అతని మనస్సంకల్పాన్ని నేను ఎరుగుదును. అతనికి స్వర్గంపట్ల కోరికలేదు. ఐశ్వర్యంగాని, ఆయువుకాని అతడు కోరుకోవటం లేదు. అతడు కోరిన దంతటినీ నేను ఈ రోజే ఇప్పుడే చేస్తాను.' ఈశ్వరుని ఆ మాటలను విని, సత్యవాదులైన మహర్షుల్ము మనస్సులో ఆనందించి, వారివారి నివాసాలకు తిరిగి వెళ్ళారు.

39. కిరాతార్జునుల యుద్ధము, శంకరుడు ప్రసన్నుడగుట, అర్జునుడు స్తుతించుట.

మహాత్ములైన ఆ తపస్వులందరూ వెళ్ళిన తర్వాత, సర్వపాపహరుడు, మహాశివుడు సువర్ణ వృక్షంలా ప్రకాశించే కిరాతవేషాన్ని ధరించి, వేరొక మేరుపర్వతంలా విపులశరీరంతో ప్రకాశిస్తున్నాడు. శోభయమానమైన ధనుస్సును, సర్పాలవంటి బాణాలను తీసికొని అగ్ని దేహాన్ని ధరించినట్లుగా ఉన్న ఆ శివుడు మహావేగంతో భూమిమీదికి వచ్చాడు. అతనితోపాటు అతనితో సమానమైన వేషం ధరించిన పార్వతికూడ వచ్చింది. అనేక విధాలైన వేషాలు ధరించిన భూతగణాలు, కిరాతవేషాలు ధరించిన వేలకొలది స్త్రీలు కూడా వచ్చారు. వీరందరితో ఆ ప్రదేశమంతా మిక్కిలి ప్రకాశిస్తోంది. క్షణకాలంలో వారు ప్రవేశించిన ఆ వనమంతా నిశ్శబ్దమైపోయింది. సెలయేరులయొక్క, పక్షులయొక్క ధ్వనులుకూడా ఆగిపోయాయి. శంకరుడు నిపుణకర్ముడైన అర్జునుని సమీపానికి వచ్చాడు. అక్కడ మూకుడనే పేరుగల దానవుడు సూకరాకారంలో ఉండి అర్జునుని చంపాలని ఆలోచిస్తూండడం చూశాడు. ఆ సమయంలో అర్జునుడు తన గాండీవాన్ని సర్పాలవంటిబాణాలను తీసికొని, ధనుస్సుకు వారిని సంధించి దానిటంకారంతో దిక్కులను నినదింపచేస్తూ ఉన్నాడు. 'ఇక్కడకువచ్చిన, పాపరహితుడనైన నన్ను నీవు చంపాలని అనుకొంటున్నావు. అందువల్ల నేనే ముందుగా నిన్ను యమపురికి పంపుతాను' అని తలంచి బాణం విడువబోతున్న అర్జునుని కిరాతరూపంలోని శంకరుడు వారించాడు. ఇలా అన్నాడు – 'ఇంద్రకీలపర్వతంతో సమానమైన కాంతిగల ఈ సూకరాన్ని ముందుగా నేను చంపాలనుకొన్నాను'. ఆ మాటలను అర్జునుడు లక్ష్యపెట్టక ఆ పందిని బాణంతో కొట్టాడు. మహాతేజస్వి అయిన కిరాతుడుకూడా

అదే లక్ష్యం (సూకరం)పై అతనితో సమంగా పిడుగువంటి, అగ్నిశిఖవంటి బాణాన్ని విడిచిపెట్టాడు. వారిరువురూ విడిచిన బాణాలు రెండూ ఒకేసారి పర్వతం వంటి ఆ మూకాసురుని శరీరం మీద తగిలాయి. వారిరువురి శరాఘాతాలవల్ల పిడుగుపాటు, వజ్రపాతం వంటి ధ్వని ఆ పర్వతంలో కలిగింది. మండుతున్న ముఖాలుగల సర్పాలవంటి అనేకబాణాల దెబ్బలు తిని, ఆ రాక్షసుడు తన భయంకర రూపాన్ని పొంది, మరణించాడు.

ఆనంతరం జయశీలుడు అయిన అర్జునుడు స్వర్ణకాంతిగల తేజోవంతుడై, స్త్రీసహాయుడై, కిరాతవేషంలో ఉన్న పురుషుని చూశాడు. అతనితో అర్జునుడు నవ్వుతూ ఇలా అన్నాడు - 'శూన్యమైన ఈ వనంలో స్త్రీలతో కలిసి తిరుగుతున్న నీవెవరవు? కనకప్రభా! భయంకరమైన ఈ వనంలో నీవు భయపడటం లేదా! నాకు లక్ష్యమైన ఈ సూకరాన్ని నీవెందుకు కొట్టావు? ఈ రాక్షసుడు ముందే నాదగ్గరికి వచ్చాడు. ఇతనిని నేను లక్ష్యంగా చేసుకొన్నాను. నీవు ఏదైనా కోరికతో దీన్ని చంపావా? లేక నన్నవమానించాలనా? నిన్ను ప్రాణాలతో విడిచిపెట్టను. ఇపుడు నీవు చేసిన పని వేటకు సంబంధించిన ధర్మం కాదు. ఈ దోషం కారణంగా పర్వతనివాసివైన నీ ప్రాణాలు తీస్తాను.' అర్జునుడీవిధంగా అంటే కిరాతుడు నవ్వుతూ సవ్యసాచితో మధురంగా ఇలా పలికాడు. 'వీరా! నీవే వనసమీపానికి వచ్చావు. నా గురించి భయపడకు. వనవాసులమైన మాకు ఈ ప్రదేశం నిత్యం తిరగడానికి యోగ్యమైంది. ఇక్కడ నివసించడం చాల కష్టమైంది. ఇది నీకు ఎందుకు ఇష్టమైంది? తపోధనా! అనేకప్రాణులున్న ఈ వనంలోనే మేము నివసిస్తున్నాం. కాని, నీవు అగ్నిలా ప్రకాశిస్తున్నవాడవు. సుకుమారుడవు. సుఖా లనుభవించడానికి యోగ్యుడవు. శూన్యమైన ఈ వనంలో ఒంటరిగా ఎలా తిరుగుతున్నావు ?' అర్జునుడిలా అన్నాడు - 'ఈ గాండీవాన్ని, అగ్నిలా జ్వలించే బాణాలనూ ఆశ్రయించి ఈ మహావనంలో రెండవ కార్తికేయునిలా నిర్భయంగా నివసిస్తున్నాను. మృగరూపంలో ఉన్న ఈ రాక్షసుడు నన్ను చంపడానికి ఇక్కడకు వచ్చాడు. అందువల్ల నేనీ భయంకరమైన రాక్షసుని చంపాను.'

అపుడు కిరాతు డిలా అన్నాడు - 'నేనే ముందుగా నా ధనువు నుండి విడువబడిన బాణాలతో ఇతనిని కొట్టాను. నా బాణాల దెబ్బలకే ఇతడు క్రిందపడ్డాడు, యమపురికి వెళ్ళాడు. మందబుద్ధీ! బలగర్వంతో నీదోషాలను ఇతరుని పై ఆరోపించడం తగదు. శక్తితో నీవు బాగా గర్విస్తున్నావు. నిన్ను ప్రాణాలతో విడిచిపెట్టను. ధైర్యంగా ఇక్కడే నిలబడి ఉండు, వజ్రాయుధం వంటి బాణాలను నీపై విడుస్తాను. నీవుకూడా నీ శక్తినంతటినీ కూడదీసికో, నాపై బాణాలను విడు.' కిరాతుని మాటలు విని అర్జును డపుడు మిక్కిలి క్రుద్ధుడయ్యాడు. అతనిని బాణాలతో కొట్టడం ప్రారంభించాడు. అపుడు కిరాతుడు

ఆనందించిన మనస్సుతో ఆ బాణాలను పట్టుకొన్నాడు. మళ్ళీ ఇలా అన్నాడు – 'మూర్ఖ! మూర్ఖ! మళ్ళీమళ్ళీ మర్మభేదులైన బాణాలతో కొట్టు.' కిరాతుడలా అనగానే అర్జునుడు సాహసంతో అతనిపై బాణవర్షాన్ని కురిపించాడు. అనంతరం వారిరువురూ పరస్పరం క్రుద్ధులై సర్పాలవంటి బాణాలతో కొట్టుకొన్నారు. ఆ సమయంలో క్రోధ సంరంభంలో ఉన్న వారిద్దరూ ఎంతో శోభిల్లారు. తర్వాత అర్జునుడు కిరాతునిపై శరవర్షాన్ని కురిపించాడు. దాన్ని ప్రసన్నచిత్తంతో శంకరుడు స్వీకరించాడు. శంకరుడు ఆ శరవర్షాన్ని ఒక ముహూర్తకాలం స్వీకరించి ఏమాత్రం దెబ్బతగలని శరీరంతో పర్వతంలా స్థిరంగా నిలిచాడు. తాను వదిలిన బాణవర్షం అలా వ్యర్థంకావడం చూసి ధనంజయుడు మిక్కిలి ఆశ్చర్యాన్ని పొందాడు. 'బాగు బాగు' అని పలికాడు. 'ఆహా! హిమాలయ శిఖరనివాసి అయిన కిరాతుడు నా గాండీవం నుండి వెలువడిన బాణాలను స్వీకరిస్తున్నాడు. ఏమాత్రం వ్యాకులపడటం లేదు. దెబ్బతినటం లేదు. ఇతడు ఏదేవుడైనా అయ్యుంటాడా? సాక్షాత్తు రుద్రుడా! యక్షుడా! అమరుడా! అసురుడా! ఈ శ్రేష్ఠమైన పర్వతంమీద దేవతల రాక కూడా ఉండవచ్చు. నేను వదిలిన వేలకొలది బాణసమూహాల వేగాన్ని పినాకపాణి తప్ప ఇతరుడెవడూ సహింపలేడు. ఇతడు రుద్రుడు కానట్లయితే, తీక్ష్ణమైన బాణాలతో ఇతనిని యమపురికి పంపుతాను.' రాజా! ఇలా ప్రసన్నచిత్తంతో ఆలోచించి, జయశీలుడైన అర్జునుడు సూర్యుడు కిరణాలను ప్రసరించినట్లు మర్మ భేదు లైన బాణాలను వందలకొలదీ వదిలాడు. లోకభావనుడైన త్రిశూలపాణి ప్రసన్నమైన మనస్సుతో పర్వతం శిలావర్షాన్ని స్వీకరించినట్లుగా ఆ బాణాలను స్వీకరించాడు.

క్షణకాలంలో అర్జునుని అంబుల పాదిలోని బాణాలన్నీ క్షీణించాయి. అలా బాణాలు అయిపోవడం చూసిన అతనిని తీవ్రమైన భయం ఆవహించింది. అపుడు జయశీలుడైన అర్జునుడు తనకు ఖాండవవనంలో ప్రత్యక్షమై, అక్షయాలైన రెండు తూణీరాల నిచ్చిన అగ్ని దేవుని ధ్యానించాడు. 'నా బాణాలన్నీ క్షీణించాయి. ఇక ఈ ధనుస్సును వదిలెయ్యనా ? ఈ పురుషుడెవడో నా బాణాలన్నింటినీ మ్రింగి వేస్తున్నాడు. శూలాగ్రంతో ఏనుగును చంపినట్లు ఈ ధనుష్కోటితో ఇతనిని చంపి దండధరుడైన యముని భవనానికి పంపుతాను.' ఈ విధంగా ఆలోచించి, మహాతేజస్వి అయిన అర్జునుడు ఆ కిరాతుని ధనుష్కోటితో పట్టుకొని, వింటినారితో అతని శరీరాన్ని పట్టి లాగి, వజ్రాయుధంతో సమానమైన పిడికిళ్ళతో కొట్టాడు. శత్రువీరులను చంపే అర్జునుడు ధనుష్కోటితో కొట్టగా, గిరిచరుడైన కిరాతుడు ఆ దివ్య ధనువును కూడ తనలోనికి తీసికొన్నాడు. అర్జునుడు తన ధనువు పోగా, చేతిలో ఖడ్గంతో నిలిచాడు. ఇక యుద్ధాన్ని ముగించాలనే ఉద్దేశ్యంతో

వేగంగా కిరాతునికి ఎదురుగా వెళ్ళాడు. పర్వతామోద కూడా కుంఠితం కాని తీక్ష్ణమైన ఖడ్గంతో తన భుజబలంకొద్దీ అర్జునుడు ఆ కిరాతుని శిరస్సుపై కొట్టాడు. ఆతని శిరస్సుపై పడ్డ ఆ ఖడ్గం ముక్కలైపోయింది. ఆపైన ఫాల్గునుడు చెట్లతో, శిలలతోను యుద్ధం చేశాడు. విశాలకాయంతో కిరాతరూపంలో ఉన్న శంకరుడు అర్జునుడు వేసిన వృక్షాలను, శిలలను తనలోకి తీసికొన్నాడు. మహాబలుడైన పార్థుడు క్రోధావేశంతో నోటినుండి పాగలు (ఆవిరులు) చిమ్ముతూ వజ్రసమానమైన పిడికిళ్ళతో కిరాత రూపంలో ఉండి ఎదిరింప శక్యంగాని శంకరుని కొట్ట నారంభించాడు. కిరాతరూపంలో ఉన్న భగవంతుడు శంకరుడు ఇంద్రుని వజ్రాయుధంతో సమానమై దారుణాలైన పిడికిలిపోట్లతో అర్జునుని హింసించాడు. కిరాతార్జునులు ఆ విధంగా ముష్టియుద్ధం చేస్తూండగా భయంకరమైన చటచట శబ్దం రాసాగింది. ఇంద్ర వృత్రాసురులయుద్ధం వలె కిరాతార్జునుల బాహుయుద్ధం రోమాంచం కలిగిస్తూ ముహూర్తకాలం జరిగింది. అటు తరువాత జయశీలుడై, బలవంతుడైన అర్జునుడు కిరాతుని తన వక్షస్థలంతో (డీ) కొట్టాడు. బలవంతుడైన కిరాతుడుకూడా విపరీతచేష్ట చేస్తున్న అర్జునుని కొట్టాడు. ఇరువురి భుజాల రాపిడులచేత, వక్షస్థలాల సంఘర్షణ చేత వారి శరీరాలమోద పాగతోకూడిన నిప్పుకణాలతో అగ్ని పుట్టినట్లుగా ఉంది. మహాదేవుడు బాగా హింసింపబడిన అర్జునుని తన అవయవాలచే ఇంకా పీడించి, అతనిని మోహపరిచే తేజస్సుతో, కోపంతో అతనిపై తన పరాక్రమాన్ని చూపాడు. భారతా! దేవదేవునిచే శరీరం పట్టు సడలిన అర్జునుడు దెబ్బతిన్న అవయవాలతో మట్టిముద్దలా కనబడుతున్నాడు. మహాత్ముడైన శంకరునిచే బాగా నిరోధింపబడిన అర్జునుడు ఉచ్ఛ్వాసక్రియ క్షీణించి, నిశ్చేష్టుడై ప్రాణం పోయిన వానివలె నేలమీద పడ్డాడు.

ముహూర్తకాలం అలా పడి ఉండి, స్పృహకల్గి మళ్ళీ లేచి, రక్తంతో తడిసిన శరీరం చూచుకొని అర్జునుడు మిక్కిలి దుఃఖించాడు. అపుడు శరణాగతవత్సలుడు, పినాకధరుడు, భగవంతుడు అయిన శివుని శరణుజొచ్చి, మట్టితో వేదికచేసి, దానిపై పార్థివశివలింగం స్థాపించి, పుష్పమాలతో పూజించాడు. పార్థివశివునిపై ఉంచిన మాల అర్జునునకు కిరాతుని శిరస్సుపై కనిపించింది. అలా చూసిన వెంటనే పాండవ శ్రేష్ఠుడు ఆనందంతో తన సహజస్థితికి వచ్చాడు. అర్జునుడు, వెనువెంటనే ఆ కిరాతరూపంలోని శివుని పాదాలపై పడ్డాడు. శివుడు ఆనందించాడు, అర్జునుడు ఆశ్చర్యానికి లోనయ్యాడు తపస్సుచే క్షీణించిన, అర్జునుని చూసి, శివుడు మేఘ గంభీరస్వరంతో ఇలా పలికాడు. ఫల్గునా! అసాధారణమైన నీ పరాక్రమం చేత నేను సంతుష్టుడ నయ్యాను, ఇటువంటి శౌర్యంలో, ధృతిలో నీతో సమానుడైన క్షత్రియుడు లేడు. మన ఇద్దరి తేజః పరాక్రమాలు

సమానమైనవి. నీపట్ల నేను ప్రసన్నుడ నయ్యాను. నన్ను చూడు. విశాలాక్షా! నేను నీకు దివ్య దృష్టినిస్తున్నాను. నీవు పూర్వకాలంలో నరు డనే ఋషివి. నీవు యుద్ధంలో శత్రువులను, సర్వదేవతలను కూడా జయింపగలవు. నీపట్ల ప్రీతితో నేను నీకు నివారింపశక్యంకాని అస్త్రాన్ని ఇస్తాను. ఆ నా పాశుపతాస్త్రాన్ని క్షణకాలంలో నీవు ధరించడానికి సమర్థుడవు. ఫాల్గునుడు మహాదేవుని ఉమాదేవితో కలిసి ఉన్నట్లు చూశాడు. పార్థుడు మోకాళ్ళపై, నేలపై కూర్చొని, శిరసా నమస్కరించి, హరుని ప్రసన్నుని చేసుకొన్నాడు.

అర్జునుడిలా స్తుతించాడు – కపర్దీ! సర్వదేవేశా! భగనేత్రనిపాతనా! దేవదేవా! మహాదేవా! నీలగ్రీవా! జటధరా!. దేవా! నీవు కారణా లన్నింటిలో శ్రేష్ఠమైన వాడివి. నీవు త్ర్యంబకుడవు. సర్వవ్యాపివి, దేవత లందరికి ఆశ్రయుడవు, ఈ జగత్తంతా నీ వల్ల ఉద్భవించింది. దేవాసుర మనుష్యులతో కూడిన ఈ ముల్లోకాలలో నీవు అజేయుడవు. **నీవు విష్ణురూపంలోని శివుడవు, శివరూపంలోని విష్ణుడవు. నీకు నమస్కారం. దక్షయజ్ఞం నాశనం చేసిన హరిహరరూపుడ వైన నీకు నమస్కారం.*** లలాటనేత్రుడవు, శర్వుడవు, శూలపాణివి, వర్షణశీలివి (మీడువు) అయిన నీకు నమస్కారం. నీవు పినాకరక్షకుడవు. సూర్యస్వరూపుడవు, కిరాతస్వరూపుడవు, సృష్టికర్తవు, సర్వభూతమహేశ్వరా! నన్ను అనుగ్రహింపు మని నిన్ను కోరుతున్నాను. భూతగణాధిపుడవు, జగత్తునకు కళ్యాణకారకుడవు, లోకకల్యాణ కారణుడవు, ప్రకృతి పురుషులకతీతమైన మిక్కిలి సూక్ష్మతరుడవు, హరుడవు – నీకు నమస్కారం. భగవంతుడా ! శంకరా! నా అపరాధాన్ని క్షమించటానికి నీవే తగుదువు. భగవంతుడా! నిన్ను చూడగోరి ఈ మహాగిరికి వచ్చాను. దేవేశా! ఈ గిరి శిఖరం నీకు చాల ప్రీతిపాత్ర మైనది. శ్రేష్ఠ మైనది. తాపసుల నిలయం. సర్వలోకాలచే నమస్కరింపబడే నిన్ను అనుగ్రహింపుమని కోరుతున్నాను. మహాదేవా! మిక్కిలి సాహసంతో నేను నీతో యుద్ధం చేశాను. ఇందులో నా అపరాధం లేదు. నీతో ఈ యుద్ధం అజ్ఞానం వల్ల చేశాను. శంకరా! ఇపుడు నేను నీ శరణుకోరి వచ్చాను. నా సాహసాన్ని క్షమించు.' మహాతేజస్వి, వృషభధ్వజుడు అయిన శంకరుడు అర్జునుని అందమైన చేతిని స్పృశించి ఫల్గునునితో 'క్షమించాను' అన్నాడు. భగవంతుడూ, వృషభధ్వజుడూ అయిన హరుడు ప్రీతాత్ముడై అర్జునుని బాహువులతో కౌగిలించుకొని మరల సాంత్వన పూర్వకంగా ఇలా పలికాడు.

---

* **శివాయ విష్ణురూపాయ విష్ణవే శివరూపిణే ॥ 76**
దక్షయజ్ఞవినాశాయ హరిరుద్రాయ వై నమః ।

40. శంకరుడు అర్జునునకు వరము నిచ్చి తన ధామమునకు బయలుదేరుట.

అర్జునా! పూర్వదేహంలో నారాయణుడు తోడుగాగల 'నర'మహర్షివి నీవు. బదరికావనంలో ఎన్నో వేల సంవత్సరాలు నీవు ఉగ్రతపస్సు చేశావు. నీలోను, పురుషోత్తముడైన విష్ణువులోను పరమతేజస్సు ఉంది. పురుషశ్రేష్ఠులైన మీ ఇరువురి తేజస్సుచేత ఈ జగత్తు ధరింపబడుతోంది. ప్రభూ! ఇంద్రుని అభిషేకం సమయంలో నీవు, శ్రీకృష్ణుడూ మేఘంవలె గర్జించే మహాధనువును తీసుకొని దానవ లందరిని వధించారు. పార్థా! నీ చేతిలో ఉండుటకు తగినది గాండీవధనుస్సే, దాన్నే నేను నామాయచేత నాలో విలీనం చేసికొన్నాను. పార్థా! అక్షయాలైన తూణీరాలు కూడ నీచేతిలో ఉండదగినవే. నీ శరీరం రోగరహితమైనది కాగలదు. పురుషోత్తమా! నీపట్ల నేను ఆనందించాను. నీది సత్యమైన పరాక్రమం, నీమనోవాంఛితాన్ని నానుండి వరంగా కోరుకో. మానవులలో కాని, స్వర్గంలో కాని నీతో సమానమైన పురుషుడు లేడు, శత్రుదమనా! క్షత్రియజాతిలో అందరికంటె నీవే శ్రేష్ఠుడవు.'

అర్జునుడిలా అన్నాడు – 'భగవంతుడా! వృషధ్వజా! నా వాంఛితాన్ని నీవు ప్రీతితో ఇచ్చేటట్లయితే, ప్రభూ! భయంకరమైన దివ్యమైన ఆ పాశుపతాస్త్రాన్ని కోరుకొంటున్నాను. దాన్ని బ్రహ్మశిరమని అంటారు. రుద్రుడవైన నీవే దానికి దేవతవు. భయానకమైన పరాక్రమం కల దది. దారుణ ప్రలయకాలంలో అది సమస్తజగత్తును సంహరిస్తుంది. మహాదేవా! కర్ణ, భీష్మ, కృప, ద్రోణులతో మహాయుద్ధం జరుగబోతోంది. నీ అనుగ్రహం వల్ల వారిని యుద్ధంలో నేను జయించాలి. ఆ అస్త్రంచేత యుద్ధంలో దానవులను, రాక్షసులను, భూతపిశాచాలను, గంధర్వులను, నాగులను దహిస్తాను. ఆ అస్త్రాన్ని అభిమంత్రణం చేస్తే వేలకొలది శూలాలు, చూడటానికి భయంకరమైన గదలు, సర్పాకారంలో ఉండే బాణాలు దానినుండి వెలువడతాయి. ఆ అస్త్రంతో యుద్ధంలో భీష్మునితో, ద్రోణునితో, కృపునితో, కర్ణునితో పోరాడుతాను. భగవంతుడా! భగనేత్రనాశకా! ఇది నా మొదటి కోరిక, నీ అనుగ్రహం వల్ల నా కోరిక తీరితే, శత్రువులను జయించడానికి నేను సర్వసమర్థుడను అవుతాను.' భవుడిలా అన్నాడు 'పరాక్రమశాలీ! పాండునందనా! నాకు మిక్కిలి ఇష్టమైన పాశుపతాస్త్రాన్ని నేను నీకిస్తాను. దాన్ని ధరించడంలో, ప్రయోగించడంలో, ఉపసంహరించడంలో నీవు సమర్థుడవు. దేవరాజైన ఇంద్రుడు కాని, యమకుబేరులు కాని, వరుణుడు కాని, వాయుదేవుడు కాని, దీన్ని గురించి ఎరుగరు. ఇక సాధారణమానవులు ఎలా తెలిసికోగలరు? కానీ కుంతీకుమారా! తొందరపాటుతో దీన్ని ఎవరిమీదా ప్రయోగించకూడదు. అల్పశక్తి గలవారిపై ప్రయోగిస్తే, ఇది జగత్తునంతా నాశనం చేస్తుంది.

చరాచరమైన ఈ ముల్లోకాలలో దీనిచే చంపదగని వాడంటూ ఎవడూ లేడు. దీన్ని మనస్సు చేత కాని, దృష్టిచే కాని, వాక్కుచే కాని, ధనుస్సుచే కాని ప్రయోగించి శత్రువును నాశనం చేయవచ్చు.'

ఆ మాటలను విని అర్జునుడు త్వరగా పవిత్రుడై, సమాహిత చిత్తుడై, శిష్యభావంతో విశ్వేశ్వరుని సమీపించి, 'విశ్వేశ్వరా! ఉపదేశించు' అని పలికాడు. శివుడు రహస్య, ఉపసంహారాలతోకూడిన పాశుపతాస్త్ర విద్యను ఉపదేశించాడు. మునుపు ఈశ్వరునివద్ద ఉన్నట్లుగా ఇపుడు ఆ పాశుపతాస్త్రం రూపు దాల్చిన యమునిలా ఉన్న పాండవశ్రేష్ఠుడైన అర్జునుని దగ్గరకు వచ్చింది. అపుడు అర్జునుడు దానిని గ్రహించి మిక్కిలి ఆనందించాడు. అపుడు పర్వతవనద్రుమాలతో, సాగర వన ప్రదేశాలతో, గ్రామనగరాలతో కూడిన భూమి కంపించింది. ఆ శుభసమయంలో శంఖదుందుభులు మ్రోగాయి. వేలకొలది భేరులు నినదించాయి. ఆకాశంలో వాయువుల ఒరిపిడి వేగంతో పిడుగులు పడ్డాయి. భయంకరంగా మండుతూన్న ఆ అస్త్రం అమితపరాక్రమం గల అర్జునుని ప్రక్కన రూపుదాల్చి ఉండడం దేవదానవు లంతా చూశారు. అపుడు త్ర్యంబకుడు అర్జునుని దేహాన్ని తాకాడు. అందువల్ల అతని శరీరంలో అంతకుముందున్న అశుభం నశించింది. అటుపై ఈశ్వరుడు 'నీవు స్వర్గలోకానికి వెళ్ళు' అని అర్జునుని ఆజ్ఞాపించాడు. అర్జునుడు శిరస్సుతో నమస్కరించి, చేతులు జోడించి శివునికేసి చూశాడు. ఆ తరువాత ఉమాపతి అయిన శివుడు రాక్షసులను, పిశాచులను సంహరించే గాండీవ మహాధనువును అర్జునునకు ఇచ్చాడు. అనంతరం అర్జునుడు చూస్తూండగా ఉమాసహితుడైన ఈశ్వరుడు తెల్లని నేల, చరియలు, గుహలు గలిగి, శుభకరమైన పక్షులకు, మహర్షులకు ఆశ్రయమైన ఆ పర్వతాన్ని విడిచి ఆకాశానికి వెళ్ళాడు.

41. అర్జునునికి దిక్పాలకులు దివ్యాస్త్రముల నిచ్చుట, స్వర్గమునకు వెళ్ళుమని ఇంద్రుడు ఆదేశించుట.

భువనభాస్కరుడైన సూర్యుడు అస్తమించినట్లుగా, అర్జునుడు చూస్తూండగా, శివుడు - అదృశ్యమయ్యాడు. అర్జునుడు 'నేను సాక్షాత్తుగా మహాదేవుని చూశాను' అని మిక్కిలి ఆశ్చర్యాన్ని పొందాడు. 'త్రినేత్రుడు, పినాకపాణి, వరదుడు అయిన హరుని శరీరాకృతిలో నేను చూశాను. అతనిని చేతితో తాకాను కూడా! నేను ధన్యుడను. నన్నతడు అనుగ్రహించాడు. నేడు నేను మిక్కిలి కృతార్థుడ నైనట్లుగా భావిస్తున్నాను. యుద్ధంలో శత్రువులందరిని జయించినట్లే భావిస్తున్నాను. నా అభీష్టమైన ప్రయోజనం నెరవేరింది.'

ఈ విధంగా ఆలోచిస్తున్న పార్థునిదగ్గరికి వైడూర్యవర్ణంలో ప్రకాశిస్తున్న జలాధిదైవమయిన, వరుణుడు దిక్కులన్నింటిని ప్రకాశింపజేస్తూ జలజంతువులతో సహా వచ్చాడు. తరువాత బంగారుమేనిచాయ గల మహాతేజస్వి కుబేరుడు, విమానంలో అక్కడకు వచ్చాడు. యక్షులందరూ కూడ తమ ప్రభువును అనుసరించి వచ్చారు. అదే విధంగా లోకాలను అంతం చేసే యముడు సాక్షాత్తుగా అర్జునుని చూడటానికి వచ్చాడు. అతనితో పాటు మానవశరీర ధారులై, విశ్వభావనులైన పితృదేవతలు కూడా వచ్చారు. వారంతా (వరుణాది దేవతలంతా) విచిత్రంగా ప్రకాశించే మహాపర్వతంయొక్క శిఖరాలమీదికి వచ్చి, తపస్వి అయిన అర్జునుని చూశారు. ఒక ముహూర్తకాలంలో ఇంద్రాణితో కలిసి ఐరావతాన్ని ఎక్కి, ఇంద్రుడు అక్కడకు వచ్చాడు. దేవగణాలన్నీ ఆయనను అనుసరించాయి. ఆ ఇంద్రుడు శిరస్సుపై తెల్లని ఛత్రాన్ని ధరించి, తెల్లని మేఘాన్ని కప్పుకొన్న చంద్రునిలా శోభిల్లుతున్నాడు. గంధర్వులచేత, తపోధనులైన ఋషులచేత స్తుతింపబడుతూ ఆ పర్వతశిఖరానికి చేరిన ఇంద్రుడు ఉదయించిన సూర్యునిలా ఉన్నాడు. తర్వాత మేఘంవంటి గంభీరస్వనంతో పరమధర్మజ్ఞుడైన యముడు దక్షిణదిక్కున ఉండి శుభంగా ఇలా పలికాడు. 'అర్జునా! ఇక్కడకు వచ్చిన లోకపాలురమైన మమ్మల్ని చూడు. ఇపుడు నీకు దివ్యదృష్టి నిస్తున్నాం. మమ్ములను చూడటానికి నీవు అర్హుడవు. నీవు పూర్వకాలంలో నరు డనే మహాబలు డైన మహర్షివి. నాయనా! బ్రహ్మనియోగంవల్లనే మానవజన్మను పొందావు. అనఘా! వసువుల అంశతో పుట్టిన భీష్మపితామహుని నీవు యుద్ధంలో జయిస్తావు. కురునందనా! ద్రోణునిచే రక్షింపబడుతూ అగ్నివలె భయంకరమైన క్షత్రియసముదాయాన్ని కూడా జయిస్తావు. మనుష్యరూపంలో ఉన్న మహాపరాక్రమవంతులైన దానవులను, నివాతకవచు లనే దైత్యులను నీవు జయిస్తావు. ధనంజయా! సర్వలోకానికి ఉష్ణాన్ని ఇచ్చే సూర్యభగవానుని అంశతో జన్మించిన మహాపరాక్రమవంతుడైన కర్ణుని కూడా నీవు చంపుతావు. కుంతీనందనా! దేవ, దానవ, రాక్షసుల అంశలతో భూమిపై చాలమంది జన్మించారు. వారంతా యుద్ధంలో నీ చేతిలో మరణిస్తారు. అలా వారంతా స్వకర్మ ఫలాన్నిబట్టి యథోచితమైన గతిని పొందుతారు. ఫాల్గునా! ఈ లోకంలో నీకీర్తి శాశ్వతంగా నిలుస్తుంది. నీవు ఈ మహాసంగ్రామంలో సాక్షాత్తూ ఆ మహాదేవుడినే సంతోషపెట్టావు. మహాబాహూ! శ్రీమహావిష్ణువుతో కూడి నీవు ఈ భూభారాన్ని తగ్గించాలి. అందువల్ల అడ్డులేని ఈ నా దండాస్త్రాన్ని స్వీకరించు. ఈ అస్త్రంతో నీవు చాలా గొప్ప కార్యం సాధిస్తావు.' అర్జునుడు విధిపూర్వకంగా మంత్ర, ఉపచార, ప్రయోగ, ఉపసంహారాలతో ఆ అస్త్రాన్ని గ్రహించాడు. తరువాత జలచరాల అధిపతి, నీలమేఘశ్యాముడూ, సమర్థుడూ అయిన

వరుణుడు పశ్చిమదిక్కున నిలచి ఈ విధంగా చెప్పాడు - 'పార్థా! నీవు క్షత్రియులలో ముఖ్యుడవు. క్షత్రధర్మంలో ఉన్నవాడివి. విశాలమైన ఎర్రని కన్నులతో నావైపు చూడు. నేను జలాధిపతిని, వరుణుడను. కుంతీకుమారా! నేనిస్తున్న ఈ వారుణపాశాలను రహస్యోపసంహార సహితంగా తీసికో. వీటినెవరూ ఎదుర్కొనలేరు. వీరా! ఈ పాశాలతో నేను తారకామయ సంగ్రామంలో వేలకొలది మహాకాయులైన దైత్యులను బంధించాను. మహాబలా! నా అనుగ్రహంవల్ల లభించిన ఈ పాశాలను తీసుకో. వీటిచేత బంధింపబడితే, యముడు కూడా నీ చేతిలో నుండి విడిపించుకోలేడు. నీవు ఈ అస్త్రంతో సంగ్రామంలో సంచరిస్తూంటే ఈ భూమిమీద క్షత్రియు డెవడూ మిగలడు. ఇందులో సందేహం లేదు.'

తరువాత కైలాస నివాసి, ధనాధ్యక్షుడు అయిన. కుబేరుడు ఇలా అన్నాడు - 'ప్రాజ్ఞా! యముడు, వరుణుడు దివ్యాస్త్రాలు ఇస్తుంటే నేను చాలా ఆనందించాను. అజేయుడవైన నిన్ను కలవడం వల్ల నేను మిక్కిలి ప్రసన్నుడ నయ్యాను. సవ్యసాచీ! సనాతనపురుషా! పూర్వకల్పాలలో నీవు నిత్యం మాతోపాటు తపస్సు చేసి శ్రాంతుడ వయ్యావు. నరశ్రేష్ఠా! ఇపుడు నిన్నుచూసి నీకొక దివ్యాస్త్రాన్ని ఇస్తున్నాను. దీనితో జయింపశక్యం కాని మానవేతరులను కూడా జయిస్తావు. నీవు శీఘ్రంగా నానుండి శ్రేష్ఠమైన ఈ దివ్యాస్త్రాన్ని తీసికో. దీనితో నీవు ధార్తరాష్ట్రసేనలను భస్మంచేస్తావు. నా ఈ ప్రియమైన అంతర్ధానమనే అస్త్రాన్ని స్వీకరించు. ఇది బలాన్ని, పరాక్రమాన్ని, కాంతిని ఇస్తుంది. శత్రువులను నిద్రావివశులను చేస్తుంది. నాశనం చేస్తుంది. మహాత్ముడైన శంకరుడు త్రిపురాసురుని చంపిన సమయంలో ఈ అస్త్రం ప్రయోగింపబడింది. దీనిచే మహాసురు లెంతో మంది చంపబడ్డారు. సత్యపరాక్రమా! పార్థా! నీకోసం నేనీ అస్త్రాన్ని తీసికొని వచ్చాను. నీవు దీన్ని ధరించడానికి యోగ్యుడవు.' మహాబలుడు అయిన అర్జునుడు కుబేరుని నుండి అంతర్ధానమనే అస్త్రాన్ని యథావిధిగా గ్రహించాడు. ఆపై దేవేంద్రుడు సుకరంగా కార్యనిర్వహణం చేసే అర్జునునితో సాంత్వనపూర్వకంగా, మేఘదుందుభులవంటి గంభీరస్వరంతో, తీయగా ఇలా పలికాడు. 'కుంతీకుమారా! నీవు పురాతన శాసకుడవు. ఉత్తమసిద్ధిని పొందినవాడవు. సాక్షాత్తుగా దేవగతిని పొందినవాడవు. నీవు ఒక గొప్ప దేవకార్యాన్ని చెయ్యాలి. మహాద్యుతీ! సిద్ధంగా ఉండు. నీవు స్వర్గలోకానికి వెళ్ళాలి. నీకోసం మాతలితో కూడిన రథం భూమిమీదికి వస్తోంది. కురునందనా! అక్కడ నీకు నేను దివ్యాస్త్రాలను ఇస్తాను.' ఆ పర్వతశిఖరం మీదకు కలిసివచ్చిన లోకపాలురను చూసి బుద్ధిమంతుడైన ధనంజయుడు మిక్కిలి ఆశ్చర్యాన్ని పొందాడు. అనంతరం అర్జునుడు తన చెంతకు వచ్చిన మహాతేజస్వులైన ఆ లోకపాలురను యథావిధిగా వాక్కులతో,

జలాలతో, ఫలాలతో పూజించాడు. ఆ తరువాత దేవత లందరూ ధనంజయుని తిరిగి గౌరవించి, స్వేచ్ఛగా, వచ్చిన విధంగానే మనోవేగంతో వెళ్ళారు. దేవతలవల్ల దివ్యాస్త్రాలు పొంది నరశ్రేష్ఠుడైన అర్జునుడు ఆనందించాడు. తాను పూర్ణమనోరథుడు, కృతార్థుడు అయినట్లు భావించాడు.

42. అర్జునుడు మాతలితో స్వర్గలోకమునకు ప్రయాణమగుట.

లోకపాలురు వెళ్ళిన తరువాత శత్రుసంహారకుడైన అర్జునుడు ఇంద్రుని రథాన్ని గురించి ఆలోచిస్తూ ఉన్నాడు. ఆలోచిస్తూండగానే, మాతలితోపాటుగ మహాతేజస్సుగల ఆ రథం అక్కడకు వచ్చింది. ఆ రథం ఆకాశంలోని చీకటులను తొలగిస్తూ, మేఘాలను చీల్చుకొంటూ, మహామేఘాల ధ్వని వంటి గంభీరనాదంతో దిక్కులను పూరిస్తూ అక్కడకు వచ్చింది. ఆ రథంలో ఖడ్గాలు, భయంకరాలైన శక్తులు, గదలు, దివ్యప్రభావంగల ప్రాసాలు, మిక్కిలి కాంతిగల విద్యుత్తులు, అశనులు, చక్రాలతో కూడిన ప్రస్తరగోళాలు ఉన్నాయి. అవి మహామేఘాలవలె గర్జిస్తూ, వజ్రాయుధంలా ధ్వనిస్తూ వాయువిస్ఫోటనం కలిగిస్తున్నాయి. అందులో మహాభయంకరాలై, జ్వలించే ముఖాలతో పెద్దపెద్ద సర్పా లున్నాయి. తెల్లని మేఘాల్లా ఉండి యుద్ధంలో విసరడానికి యోగ్యమైన రాళ్ళు ఉన్నాయి. వాయువు వంటి వేగంగల పదివేల గుర్రాలు చూపరుల కళ్ళను ఆకర్షిస్తూ దివ్యమైన, మాయామయమైన ఆ రథాన్ని మోస్తున్నాయి. ఆ రథంమీద మహానీలవర్ణంతో ప్రకాశిస్తున్న వైజయంత మనే ఇంద్రధ్వజాన్ని అర్జునుడు చూశాడు. అది నల్లకలువవలె ఉంది. దాని దండం బంగారంతో అలంకరింపబడి ఉంది. అర్జునుడు ఆ రథంమీద ఉన్న సారథిని చూశాడు. అతడు స్వచ్ఛమైన బంగారు ఆభరణాలతో విభూషితుడై ఉన్నాడు. అతనిని చూసి పార్థుడు ఎవరో దేవుడై ఉంటాడని భావించాడు. ఫాల్గునుడు అలా భావిస్తూండగానే, మాతలి అర్జునుని దగ్గరకు వచ్చి, నిల్చుండి వినమ్రుడై అతనితో ఇలా అన్నాడు. 'ఇంద్రకుమారా! దేవేంద్రుడు నిన్ను చూడా లనుకొంటున్నాడు. ఇందునికిష్టమైన ఈ రథాన్ని అధిరోహించు. నీ తండ్రి, ఇంద్రుడు నాతో, ' కుంతీ కుమారుడైన అర్జునుని ఇక్కడకు తీసికొనిరా' అని చెప్పాడు. దేవతా ఋషిగణాలతో, గంధర్వాప్సరలతో కూడియున్న ఇంద్రుడు నిన్ను చూడగోరి ఎదురుచూస్తున్నాడు. ఇంద్రుని ఆజ్ఞ ప్రకారం ఈ భూలోకం నుండి దేవలోకానికి రా! నాతోపాటు ఈ రథం ఎక్కు. దివ్యాస్త్రాలు పొంది తిరిగి రాగలవు.'

అర్జును డిలా అన్నాడు - 'మాతలీ! నీవు త్వరగా వెళ్ళు. శ్రేష్ఠమైన ఆ రథాన్ని ఎక్కు. రాజసూయ, అశ్వమేధాలు వందలకొద్దీ చేసినా ఇటువంటి రథం లభించదు.

భూరిదక్షిణలతో యజ్ఞాలు చేసి గొప్ప వారైన రాజులు గాని, దేవతలు గాని, దానవులు గాని శ్రేష్ఠమైన ఈ రథాన్ని ఎక్కలేరు. ఇక తపస్సుచే తపించనివాడు దివ్యమైన ఈ రథాన్ని చూడటానికి కాని, తాకడానికి కాని సమర్థుడు కాదు. ఇక ఎక్కడంగురించి చెప్పడ మెందుకు? సత్పురుషా! నీవు ఈ రథాన్ని ఎక్కి, గుర్రాలను స్థిరంగా నిలిపి ఉంచు. పుణ్యాత్ముడు సన్మార్గంలో ప్రవేశించినట్లుగా నీ వెనుక నేను ఈ రథాన్ని ఎక్కుతాను.' అర్జునుని ఈ మాటలు విని ఇంద్రసారథి అయిన మాతలి శీఘ్రంగా రథం ఎక్కాడు. గుర్రాలను కళ్ళెములతో నియంత్రించాడు. ఆ తరువాత అర్జునుడు ప్రసన్నమనస్కుడై గంగా ప్రవాహంలో స్నానం చేసి, పవిత్రుడై, యథావిధిగా జపించదగిన మంత్రాన్ని జపించాడు. ఆటుపై యథోచితంగా, యథావిధిగా పితృదేవతలకు తర్పణాలు చేసి, విశాలమైన హిమాలయాన్ని అనుమతికై ఇలా సెల వడిగాడు. 'గిరిరాజా! నీవు సత్పురుషులకు, పవిత్రమైన నడవడిగల మునులకు, పుణ్యకర్మలు చేసి స్వర్గమార్గాన్ని కోరుకొనే మనుష్యులకు ఎల్లపుడు ఆశ్రయమైనవాడవు. శైలరాజా! నీ(యొక్క) అనుగ్రహంవల్ల బ్రాహ్మణ క్షత్రియవైశ్యులు ఎల్లపుడు స్వర్గాన్ని పొంది, బాధారహితులై దేవతలతో కలిసి సంచరిస్తారు. అద్రిరాజా! హిమాలయా! నీ శిఖరంమీద నేను సుఖంగా ఉన్నాను. ఇక్కడ నుండి వెళుతున్నాను. నీ అనుమతి కోరుతున్నాను. నీ యొక్క సానువులను, పాదలను, నదులను, వాగులను పవిత్రాలైన తీర్థాలను చాలాసార్లు నేను చూశాను. మంచి సువాసన గల పళ్ళను తిన్నాను. నీ శరీరంనుండి వెలువడి పరిమళభరితాలై అమృతం వలె ఆస్వాద యోగ్యాలైన నిర్ఝరజలాలను త్రాగాను. నగరాజా! ప్రభూ! శిశువు తండ్రిఒడిలో సుఖంగా ఉన్నట్లు నేను నీ పర్వత సానువుల ఒడిలో ఆనందంగా ఉన్నాను. శైలరాజా! అప్సరోగణాలతో నిండి, వేదఘోషలతో ప్రతిధ్వనించే నీ సానువులందు నిత్యమూ నేను సుఖంగా నివసించాను.'

ఈ విధంగా పలికి, శైలరాజు వద్ద సెలవు తీసికొని, శత్రునాశకుడైన అర్జునుడు సూర్యునిలా ఆ రథాన్ని ప్రకాశింపజేస్తూ అధిరోహించాడు. పరమబుద్ధిమంతుడైన అర్జునుడు ఆనందించి, అద్భుతంగా పయనిస్తూ, సూర్యునిలా ప్రకాశించే దివ్యమైన ఆ రథంమీద క్రమంగా ధర్మాత్ములైన మానవుల దృష్టిపథంనుండి పైపైకి వెళ్ళసాగాడు. ఆకాశమార్గంలో అతడు వేలకొద్దీ అద్భుత విమానాలను చూశాడు. అక్కడ సూర్యుడు కాని, చంద్రుడు కాని, అగ్ని కాని ప్రకాశించటం లేదు. అక్కడ స్వర్గలోక నివాసులంతా తమ పుణ్యంవల్ల పొందిన కాంతితో ప్రకాశిస్తున్నారు. తారల రూపంలో ప్రకాశిస్తున్న వన్నీ పెద్దవైనప్పటికీ దూరంగా ఉండడంవల్ల దీపంలా చిన్నవిగా ప్రకాశిస్తున్నాయి. వాటన్నింటిని అర్జునుడు చూశాడు. యుద్ధంలో మరణించిన వీరులు, సిద్ధులైన రాజర్షులు స్వర్గాన్ని పొంది, వారి

వారి పుణ్యలబ్ధమైన తేజస్సుతో వారివారి స్థానాల్లో ప్రకాశిస్తున్నారు. తపస్సుచేత స్వర్గాన్ని జయించిన అనేకసమూహాలు అక్కడకు వెళ్ళాయి. సూర్యునిలా ప్రకాశిస్తున్న వేలకొద్దీ గంధర్వుల, యక్షుల, ఋషుల, అప్సరసల సమూహాలు అక్కడున్నాయి. స్వయంప్రకాశాలైన ఆ లోకాలను చూసి అర్జునుడు ఆశ్చర్యాన్ని పొందాడు. అపుడు అర్జునుడు వారిని గురించి మాతలిని అడిగాడు. అతడు కూడ ప్రీతితో ఇలా చెప్పాడు – 'పార్థా! పుణ్యాత్ములైన వీరంతా వారివారి స్థానాలలో ఉండి భూలోకంలో తారల రూపంలో కనబడుతున్నారు.' తరువాత అర్జునుడు స్వర్గద్వారంలో ఉన్న అందమైన జయశీలమైన గజరాజును – ఐరావతాన్ని – చూశాడు. అది నాలుగు దంతాలతో, శిఖరాలతో విరాజిల్లుతున్న కైలాసపర్వతంలా ఉంది. కురుపాండవశ్రేష్ఠు డైన అర్జునుడు, సిద్ధుల మార్గంలోకి వచ్చి పూర్వం పార్థివోత్తము డైన మాంధాతవలె ప్రకాశించాడు. అటుపై అర్జునుడు పుణ్యాత్ములైన రాజులున్న లోకాలలో తిరిగాడు. ఈ విధంగా స్వర్గంలోకంలో అర్జునుడు తిరుగుతూ ఇంద్రుని పట్టణమైన అమరావతిని చూశాడు.

43. అర్జునుడు దేవేంద్రుని దర్శించుట, ఇంద్రుడు అతనిని స్వాగతించుట.

సిద్ధచారణులచే సేవింపబడుతూ, అన్ని ఋతువులలో వికసించే పూలతో, పవిత్రవృక్షాలతో శోభిల్లుతున్న అందమైన ఆ అమరావతీ పట్టణాన్ని అర్జునుడు చూశాడు. అక్కడ పవిత్రమైన పరిమళం కలిగిన సౌగంధిక కుసుమాల సౌరభాన్ని తీసికొనివచ్చే వాయువుయొక్క వీవనలతో అతడు ఆనందించాడు. దివ్య కుసుమాలతో, ఆహ్వానిస్తున్నట్లుగా ఉన్న వృక్షాలతో శోభిస్తూ అప్సరోగణాలచే సేవింపబడుతూన్న దివ్యమైన నందనవనాన్ని అర్జునుడు చూశాడు. తపస్సుచేయనివారు, ఆహితాగ్నులు కాని వారు, యుద్ధంలో వెన్నుచూపినవారు ఆ పుణ్యలోకాన్ని చూడలేరు. యజ్ఞాలు చేయనివారు, వ్రతాలను చేయనివారు, వేదశాస్త్రాల అధ్యయనం చేయనివారు, తీర్థాలలో స్నానం చేయనివారు, యజ్ఞదానాలను చేయనివారు స్వర్గలోకాన్ని చూడలేరు. యజ్ఞాలను పాడుచేసే నీచులు, మద్యపానం చేసేవారు, గురుతల్పగతులూ, మాంసాహారులూ, దురాత్ములు పుణ్యాత్ముల లోకమైన స్వర్గాన్ని చూడలేరు. అన్నివైపులా దివ్యసంగీతనాదంతో ప్రతిధ్వనిస్తున్న నందనవనాన్ని చూస్తూ మహాబాహు వైన అర్జునుడు ఇంద్రునికి ప్రీతిపాత్రమైన అమరావతీపురంలోకి ప్రవేశించాడు. అక్కడ స్వేచ్ఛాగమనంగల దేవతల విమానాలు వేలకొలదీ ఉన్నాయి. కొన్ని వేలవిమానాలు స్థిరంగా నిలిచి ఉన్నాయి. కొన్నివేల విమానాలు అటూ ఇటూ తిరుగుతూ ఉన్నాయి. వాటన్నింటినీ అర్జునుడు చూశాడు. గంధర్వులు, అప్సరలు అతనిని

స్తుతించారు. పూలసుగంధాలతో నిండిన పవిత్రాలైన వాయువులు మెల్లగా వీస్తున్నాయి. తరువాత గంధర్వ సిద్ధ మహర్షులతో కూడి, దేవతలు ఆనందించి పార్థుని పూజించారు. వారి ఆశీర్వాదాలచే ప్రశంసింపబడిన అర్జునుడు సురవీథి అనే పేరుతో ప్రసిద్ధిచెందిన విశాలమైన నక్షత్ర మార్గంలో ప్రవేశించాడు. దివ్య వాద్యధ్వనులను, శంఖదుందుభుల ధ్వనులను వింటూ, ఇంద్రుని ఆజ్ఞచే అంతటా ప్రశంస లందుకొంటూ ఆ మార్గంలో వెళ్ళాడు. అక్కడ సాధ్యులు, విశ్వేదేవతలు, మరుద్గణాలు, అశ్వినీకుమారులు, ఆదిత్యులు, వసువులు, రుద్రులు, పరిశుద్ధులైన బ్రహ్మర్షులు, రాజర్షులు, దిలీపాది రాజులు, తుంబురుడు, నారదుడు హాహా హూహూ గంధర్వులూ ఉన్నారు.

అర్జునుడు విధి పూర్వకంగా వారినందరిని కలుసుకొని, ఆ తరువాత దేవేంద్రుని దర్శించాడు. పార్థుడు శ్రేష్ఠమైన ఆ రథంనుండి దిగి తన తండ్రి, దేవేంద్రుని సాక్షాత్తుగా దర్శించాడు. దేవేంద్రుని శిరస్సుపై అందమైన బంగారుదండంతో తెల్లనిగొడుగు శోభిల్లుతూ ఉంది. అతనికి ఇరువైపులా దివ్యసుగంధాలతో కూడిన విసరుకర్రలు వీస్తూ ఉన్నాయి. గంధర్వులు అతనిని ప్రశంసాపూర్వకంగా అభివాదాలతో స్తుతిస్తున్నారు. శ్రేష్ఠులైన బ్రహ్మర్షులు ఋగ్యజుస్సామవేదాలలోని మంత్రాలతో ఇంద్రుని స్తుతిస్తున్నారు. అర్జునుడు దేవేంద్రుని సమీపించి అతని పాదాలకు అభివాదం చేశాడు. దేవేంద్రుడు బలిసిన గుండ్రని బాహువులతో అతనిని హృదయానికి హత్తుకొన్నాడు.

ఇంద్రుడు అర్జునుడి చేయి పట్టుకొని దేవర్షి గణాలచే సేవింపబడే పవిత్రమైన తన సింహాసనంమీద తనకు దగ్గరగా కూర్చుండ బెట్టుకొన్నాడు. దేవేంద్రుడు వినయంతో తలవంచుకొన్న అర్జునుని శిరస్సును ఆఘ్రాణించి, తన ఒడిలో కూర్చుండబెట్టుకొన్నాడు. సహస్రాక్షుని ఆదేశానుసారం ఇంద్రసింహాసనం మీద కూర్చున్న అర్జునుడు రెండవ ఇంద్రునిలా ప్రకాశిస్తున్నాడు. ఆ తరువాత వృత్రశత్రువు ఇంద్రుడు పుణ్యమగు పరిమళం గల తన చేతితో ప్రేమగా సాంత్వనపరుస్తూ అర్జునుని శుభమైన ముఖాన్ని స్పృశించాడు. వింటినారి బాణాల రాపిడిచే కఠినాలై, బంగారుస్తంభాలవలె, దీర్ఘాలై అందమైన అర్జునుని భుజాలను ఇంద్రుడు మెల్లగా తన చేతితో రాయసాగాడు. వజ్రాయుధాన్ని పట్టుకోవడం చేత మచ్చపడిన కుడి చేతితో ఇంద్రుడు అర్జునుని బాహువులను మెల్లగా మాటిమాటికి సాంత్వనంగా స్పృశించాడు. వేయికన్నులుగల ఇంద్రుడు ఆనందంతో వికసించిన కన్నులతో నిద్రను జయించిన అర్జునుని గర్వంగా చూసుకొన్నాడు. వేయికళ్లతో చూసినా అతనికి తృప్తి కలగలేదు. చతుర్దశిరోజున ఉదయించిన సూర్యచంద్రులు ఆకాశానికి శోభ కలిగించినట్లుగా, ఒకే ఆసనంలో కూర్చున్న అర్జున దేవేంద్రులు ఆ దేవసభకు శోభను

కలిగించారు. ఆ సమయంలో సామగానంలో కుశలులైన తుంబురుడు మున్నగు గంధర్వశ్రేష్ఠులు అత్యంత మధురస్వనంతో సామలతో గాధలు గానం చేశారు. ఘృతాచి, మేనక, రంభ, పూర్వచిత్తి, స్వయంప్రభ, ఊర్వశి, మిశ్రకేశి, దండగౌరి, వరూధిని, గోపాలి, సహజన్య, కుంభయోని, ప్రజాగర, చిత్రసేన, చిత్రలేఖ, సహ, మధురస్వర మున్నగు వేలకొలది అప్సరలు అక్కడ నృత్యం చేశారు. పద్మలోచనలైన అప్సరలు సిద్ధుల మనస్సులను ప్రసన్నంచేసికోవడంలో లగ్నమయ్యారు. వారు విశాలమైన కటినితంబాలతో, కంపించే పయోధరాలతో, కటాక్ష హావ భావాలతో మనోబుద్ధులను ఆకర్షిస్తూ నర్తించారు.

44. అర్జునుడు అస్త్రములను, సంగీతమును నేర్చుకొనుట.

తర్వాత దేవేంద్రుని అభిప్రాయాన్ని తెలిసికొని దేవగంధర్వులు ఉత్తమమైన అర్ఘ్యాన్ని తీసికొనివచ్చి, అర్జునుని యథోచితంగా పూజించారు. అర్జునునికి పాద్యాన్ని, ఆచమనీయాన్ని ఇచ్చి, వారు అతనిని ఇంద్రభవనంలోకి తీసికొనివెళ్లారు. అర్జునుడు జయశీలుడై తండ్రి భవనంలో ప్రయోగోపసంహార సహితంగా మహాస్త్రాలను అభ్యసిస్తూ నివసించాడు. సాక్షాత్తూ ఇంద్రుని చేతిమీదుగా అతనికి ప్రియమైన, సహమైన వజ్రాస్త్రాన్ని గ్రహించాడు. అశనులనే అస్త్రాలను గ్రహించాడు. వాటిని ప్రయోగిస్తే మహానాదం చేసే మేఘాలు ఆకాశంలో ఆవరిస్తాయి. వాటిని చూసి నెమళ్ళుకూడ నృత్యం చేస్తాయి. కుంతీనందనుడు, పాండుకుమారుడు అయిన అర్జునుడు ఈ విధంగా అస్త్రాలను గ్రహించి తన సోదరులను తలచుకొన్నాడు. ఇంద్రుని ఆజ్ఞ వల్ల ఐదు సంవత్సరాలు అక్కడ సుఖంగా ఉన్నాడు. అర్జునుడు అస్త్రాలు పొందిన తరువాత ఇంద్రుడు అదను చూసి 'కుంతీనందనా! నృత్య గీతాలను చిత్రసేనుడి నుండి స్వీకరించు' అని చెప్పాడు. 'కుంతీనందనా! మానవలోకంలో లేనిదై దేవనిర్మితమైన ఆ వాద్య కళను నీవు సంపాదించు, దానివల్ల నీకు శ్రేయస్సు కలుగుతుంది.' ఆ రీతిగా చెప్పి, ఇంద్రుడు చిత్రసేనుని అతనికి స్నేహితునిగా ఇచ్చాడు. పార్థుడు అతనితో కలిసి ఎటువంటి చింత లేకుండా ఆనందంగా ఉన్నాడు. చిత్రసేనుడు మళ్ళీ మళ్ళీ గీతవాద్య నృత్యాలను నేర్పినప్పటికీ తపస్వి అయిన అర్జునుడు జూదంవల్ల జరిగిన అవమానాన్ని స్మరించి, కొంచెం కూడా శాంతిని పొందలేకపోయాడు. శాసన, శకునులను చంపడానికై అసహనంతో ఉన్నా చిత్రసేనుని ప్రీతికి పాత్రుడై గంధర్వసంబంధమైన నృత్యగీతవాద్యాలను నేర్చుకొన్నాడు. అర్జునుడు నృత్య సంబంధమైన అనేకవిశేషాలను నేర్చుకొన్నాడు, వాద్య గీతాలకు సంబంధించిన అన్ని విశేషాలను నేర్చుకొన్నాడు. అయినప్పటికీ, తన సోదరులను, తల్లి కుంతిని స్మరిస్తూ శాంతిని పొందలేకపోయాడు.

45. చిత్రసేనోర్వశీసంవాదము.

ఒకసారి అర్జునుని కళ్ళు ఊర్వశిపై లగ్నం కావడం గమనించి ఇంద్రుడు మొదట్లోనే ఏకాంతంలో చిత్రసేనుడితో ఇలా చెప్పాడు. 'గంధర్వ రాజా! నీవు ఈరోజు అప్సరలలో శ్రేష్ఠురాలైన ఊర్వశి వద్దకు వెళ్ళు. ఆమెను అర్జునుని సేవించుటకు వెళ్ళుమని చెప్పు. అస్త్రవిద్యను నేర్చుకొన్న తర్వాత నా ఆజ్ఞచే నీవు అర్జునుడికి సంగీతవిద్యను నేర్పావు. అదే విధంగా నీవు అతనిని స్త్రీ సాంగత్యంలో నిపుణుడిగా చెయ్యాలి. ఇంద్రుడిలా చెప్పాక, చిత్రసేనుడు అలాగే అని అతడి అనుజ్ఞ తీసికొని అప్సరసలలో శ్రేష్ఠురాలైన ఊర్వశి దగ్గరకు వెళ్ళాడు. ఆమెను చూసి మిక్కిలి ప్రసన్నుడయ్యాడు. ఊర్వశి చిత్రసేనునిరాకను గుర్తించి, స్వాగతపూర్వకంగా అతనిని సత్కరించింది. అతడు సుభాసీనుడై, సుభాసీనురాలైన ఆమెతో చిరునవ్వుతో ఇలా చెప్పాడు. 'సుందరీ! ఈ విషయం నీకు తెలిసే ఉంటుంది. ఈ ఇంద్రుడు నీ అనుగ్రహాన్ని కోరి నన్ను పంపగా, ఆతని ఆజ్ఞపై నేనిక్కడకు వచ్చాను.

సుందరీ! మహావీరుడైన అర్జునుడు ఈ స్వర్గానికి వచ్చాడు. నీకు అతడు తెలిసే ఉంటాడు. అతడు దేవతలలోను, మనుష్యులలోను సహజ సద్గుణాలచేత, శోభచేత, నడవడిచేత, రూపంచేత, నియమాచరణచేత, ఇంద్రియనిగ్రహంచేతను మిక్కిలి ప్రసిద్ధుడు. బలపరాక్రమాల చేత విఖ్యాతుడు, అతడు అందరికీ ఇష్టుడు, ప్రతిభాశాలి. వర్చస్వి, తేజస్వి, క్షమగలవాడు, మాత్సర్యం లేనివాడు, సాంగోపాంగంగా నాలుగువేదాలను ఇతిహాసపురాణాలను చదివినవాడు, గురుశుశ్రూషచేసి అధ్యయనం చేసి ఎనిమిది విధాలైన మేధను పొందినవాడు. బ్రహ్మచర్యం చేత, కార్యదక్షతచేత, సంతానంచేత, వయస్సుచేత ఇంద్రునిలా స్వర్గాన్ని ఒక్కడే రక్షింపగలవాడు. అతడు గొప్పలు చెప్పుకోడు. ఇతరులను గౌరవిస్తాడు. స్థూలంలా సూక్ష్మాన్ని కూడ త్వరగా గ్రహింపగలడు. ప్రియంగా మాట్లాడుతాడు. వివిధాలైన అన్నపానాదులచే స్నేహితులను తృప్తి పరుస్తాడు. సత్యం పలుకుతాడు. అందరిచే పూజింపబడినవాడు. మంచివక్త. అందమైనవాడు, అహంకారం లేనివాడు, తనకు విధేయులైన వారిపట్ల జాలికలవాడు. అందరిచే కోరబడేవాడు. ప్రియుడు. యుద్ధంలో స్థిరంగా ఉండేవీరుడు, కోరదగిన (ప్రశంసింపదగిన) గుణ గణాల చేత మహేంద్రవరుణులతో సమానమైనవాడు. అటువంటి అర్జునుడు స్వర్గానికి వచ్చాడు. నీకు తెలిసే ఉంటుంది. ఇంద్రుని ఆజ్ఞప్రకారం నీవు అతని దగ్గరకు వెళ్ళు. ధనంజయుడు నీపట్ల ప్రసన్నుడై ఉన్నాడు. అందువల్ల నీ వీవిధంగా చెయ్యి.' చిత్రసేను డిలా చెప్పగా, ఊర్వశి మందహాసం చేసింది. ఆ ఆదేశం తనకు సమ్మానంగా భావించింది. ప్రశంసింపదగిన సుందరి ఊర్వశి మిక్కిలి ప్రసన్నురాలై

చిత్రసేనుడితో ఈ విధంగా బదులు పలికింది. 'గంధర్వరాజా! నీవు అర్జునుడి గురించి చెప్పిన గుణవర్ణనమంతా సత్యమైందే, నేను ఇతరుల ద్వారా అతని గుణగణాలు విని, అతనిపట్ల కామమోహితురాల నయ్యాను. అందువల్ల అతనినిగాక ఇంకెవరిని వరిస్తాను? మహేంద్రుని ఆజ్ఞచేత, నీ ప్రీతిపూర్వకమైన మాటలచేత, అర్జునుని సద్గుణసమూహంచేత నాకు అతనిపట్ల కామభావం కలిగింది. అందువల్ల ఇక నీవు వెళ్ళు. నేను స్వేచ్ఛగా సుఖంగా అతని దగ్గరకు వస్తాను.'

46. ఊర్వశిని అర్జునుడు తిరస్కరించుట, ఆమె అతనిని శపించుట.

గంధర్వరాజైన చిత్రసేనుని పంపిన తర్వాత ఊర్వశి అర్జునుని చూడాలనే ఉత్సాహంతో స్నానం చేసింది. మనోహరాలై, కాంతిమంతాలైన అలంకారాలతో గంధమాల్యాలతో అలంకరించుకొంది. ధనంజయుని సౌందర్యానికి మన్మథబాణాలతో ఆమె మనస్సు మిక్కిలి చలించింది. మన్మథాగ్నిచేత ఆమె మనస్సు రగిలిపోయింది. మనస్సులో అర్జునుని ఊహించుకొంటూ, అతనిపట్ల ఏకాగ్రమైన చిత్తంతో ఆమె సుందరవిశాలశయ్యపై తన మనోరథుడైన అర్జునునితో క్రీడిస్తున్నట్లుగా భావించింది. సాయంసంధ్యాకాలం అయ్యాక చంద్రోదయం అయింది. వెన్నెల అంతటా వ్యాపించింది. ఆమె తన భవనం నుండి అర్జునుని భవనానికి బయలుదేరింది. మృదువుగా, పొడవుగా ఉన్న ఉంగరాల జుట్టును సవరించుకొని నల్లకలువలను గుత్తిగా చేసి అలంకరించుకొన్నది. దానితో విరాజిల్లుతూ ఆ లలన వెళ్ళింది. ఆమె భ్రూవిక్షేపాలచేత, తీయని మాటలచేత, ఉజ్జ్వల కాంతిచేత, సౌమ్యస్వభావంచేత తన ముఖచంద్రునితో ఆ చంద్రుని ఆహ్వానిస్తున్నట్లుగా వెళ్ళింది. ఆమె అలా నడిచి వెళుతూంటే, దివ్యమైన అంగరాగం దివ్యచందనం పూయబడి, హారాలచే మనోహరాలైన ఆమె వక్షోజాలు గంతులు వేస్తూ ఉన్నాయి. వక్షోజభారాన్ని మోయడంవల్ల అడుగడుగునా వంగుతున్న ఆమె నడుము త్రివళీరేఖలతో విచిత్రమైన అందంతో శోభిల్లుతోంది. సూక్ష్మమైన వస్త్రంచేత కప్పబడిన ఆమె జఘనమండలం ప్రశంసింపదగిన సౌందర్యంతో ప్రకాశిస్తోంది. అది మన్మథుని ఉజ్జ్వలనివాసంలా ఉంది. అందమైన మొలత్రాటితో అలంకరింపబడింది. మహర్షులనూ, దేవతలనూ మోహపరిచే పలుచని వస్త్రం దాల్చిన ఆ నితంబం లోపరహితంగా ఉంది. ఆమె పాదాలు బలిసిన మడమలతో ఎర్రని పొడవైన వ్రేళ్ళతో, తాబేటి వీపువలె ఎత్తుగా కింకిణులచిహ్నాలతో శోభిస్తున్నాయి. కొంచెంగా మధువు సేవించడంచేత, సంతోషంచేత, మదనభావంచేత, వివిధవిలాసాలచేత, ఆమె చాలా అందంగా చూడముచ్చటగా ఉంది. అనేకాద్భుతాలతో నిండిన స్వర్గంలో అలా వెళుతూన్న ఆ

విలాసవతి సిద్ధచారణగంధర్వులు కూడ ఆశించదగిందిగా ఉంది. మేఘంలా నల్లనైన పలుచని ఉత్తరీయం కప్పిన ఆమె శరీరం ఆకాశంలో మేఘాలతో కప్పబడిన చంద్రలేఖ కదలి వెళుతూన్నట్లు ఉన్నది. ఆమె మనోవేగవాయువేగాలతో క్షణకాలంలో పాండుకుమారుడైన అర్జునుని భవనానికి చిరునవ్వుతో చేరింది.

ఆమె రాకను ద్వారపాలకుడు అర్జునునికి నివేదించాడు. రాత్రిసమయంలో అందమైన ఊర్వశి నిర్మలమైన అందమైన ఆ భవనానికి వెళ్ళింది. రాజా! ఆ రాత్రి సమయంలో శంకించిన మనస్సుతోనే అర్జునుడు ఆమె దగ్గరకు వచ్చాడు. ఊర్వశిని చూసి అర్జునుడు సిగ్గుతో కన్నులు దించుకొన్నాడు. అప్పుడామెకు నమస్కారం చేసి గురుజనోచితంగా గౌరవించాడు. అర్జునుడిలా అన్నాడు - 'అప్సరసలలో శ్రేష్ఠురాలా! నీకు శిరస్సువంచి అభివాదనం చేస్తున్నాను. దేవీ! నన్ను ఏమని ఆజ్ఞాపిస్తున్నావో చెప్పు. నీ సేవకుడిని నేను.' ఫల్గునుని మాటలు విని ఊర్వశి నిశ్చేష్టురాలైంది. అపుడు గంధర్వరాజు చిత్రసేనుడు చెప్పిన మాటలన్నింటిని అర్జునుడి కిలా చెప్పింది. ఊర్వశి ఇలా చెప్పింది - 'మనుజోత్తమా! చిత్రసేనుడు నాకు చెప్పిన మాటలను, నేను ఎలా ఇక్కడకు వచ్చానో, అదంతా నీకు నేను చెపుతాను. దేవేంద్రుని నివాసస్థానమై అందమైన ఈ స్వర్గలోకంలో నీ రాకవల్ల మహోత్సవం జరిగింది. నరోత్తమా! రుద్రులు, ఆదిత్యులు, అశ్వినులు, వసువులు, మహర్షి సంఘాలు, శ్రేష్ఠులైన రాజర్షులు, సిద్ధచారణయక్షులు, మహానాగగణాలు వారివారి ప్రభావానికనుగుణమైన స్థానాల్లో వారు కూర్చొని ఉండగా, సూర్యచంద్రాగ్నులు ప్రకాశిస్తుండగా, గంధర్వులు వీణావాదనం చేస్తూండగా, దివ్యమైన, మనోహరమైన గానం చేయబడింది. అపుడు అప్సరసలలో ముఖ్యులందరూ నృత్యం చేశారు. ఆ సమయంలో అక్కడ నీవు నన్ను రెప్పవేయకుండా చూశావు. దేవసభలో ఆ మహోత్సవం ముగిసిన తరువాత నీ తండ్రి అనుజ్ఞ తీసికొని దేవతలంతా వారి వారి గృహాలకు వెళ్ళారు. విశిష్టులైన అప్సరసలుకూడా వారి నివాసాలకు వెళ్ళారు. ఇంకా మిగిలి ఉన్నవారిని నీ తండ్రి పంపించివేశాడు. కమలపత్రనేత్రా! ఆ తరువాత ఇంద్రుడు చిత్రసేనుని నా దగ్గరకు పంపించాడు. అతడు నా వద్దకు వచ్చి ఇలా చెప్పాడు. 'సుందరీ! దేవేంద్రుడు నీకోసమే ఒక సందేశాన్నిచ్చి నన్ను పంపాడు. నీవు మహేంద్రునికి, నాకు , నీకూ కూడ ప్రియమైన ఆ పనిని చెయ్యి. సుశ్రోణీ! యుద్ధంలో ఇంద్రుడంతటి శూరుడు, ఎల్లపుడూ ఔదార్యగుణాలతో ఉండేవాడు, పృథానందనుడు అయిన అర్జునుని సేవించు' అని అపుడు నాకు చెప్పాడు. ఆ విధంగా నీ తండ్రిచే ఆజ్ఞాపించబడిన నేను నీ దగ్గరకు సేవించడానికి వచ్చాను. నీ సద్గుణాలు నాహృదయాన్ని ఆకర్షించాయి. నేను మన్మథునకు

వశమయ్యాను. మహావీరా! చాలాకాలం నుండి నా హృదయంలో కూడా ఈ కోరిక ఉంది.'

అపుడు స్వర్గలోకంలో ఊర్వశి అలా అంటూంటే విని అర్జునుడు మిక్కిలి సిగ్గుపడి రెండుచెవులూ మూసికొని, ఇలా పలికాడు. 'భామినీ ! నాతో నీవు చెప్పిన మాట వినడానికి చాలా బాధగా ఉంది. నిశ్చయంగా నీవు నాదృష్టిలో గురుపత్నితో సమానురాలివి. కళ్యాణీ! నాకు నా తల్లి కుంతి ఎటువంటిదో, ఇంద్రుని భార్య శచీదేవి ఎటువంటిదో, నీవు కూడా అటువంటిదానివే. ఈ విషయంలో వేరొకలా ఆలోచించరాదు. శుచిస్మితా! నేను సభలో నీవైపు రెప్పవేయకుండా విస్పష్టంగా, విశేషంగా చూడటానికి తగిన కారణం ఉంది. ఇది సత్యం. చెపుతాను విను. 'ఆనంద స్వరూపిణియైన ఈ ఊర్వశియే కదా పూరు వంశానికి తల్లి (వంశప్రవర్తకురాలు)', అని భావించిన నేను విచ్చిన కన్నులతో, గౌరవభావంతో నిన్ను చూశాను. కళ్యాణీ! నన్ను నీవు మరొకలా భావించడం తగదు. నీవు మా వంశవర్ధకురాలవు. అందువల్ల నీవు నాకు గురువుకంటె ఎక్కువ గౌరవింపదగినదానవు.' అపుడు ఊర్వశి ఇలా అంది - 'దేవేంద్రనందనా! స్వర్గవాసులమైన మాకందరికి కట్టుబాట్లు ఉండవు. వీరా! ఇక్కడ నీవు నన్ను గురుస్థానంలో ఉంచడం తగదు. పూరువంశంలో జన్మించిన పుత్రులు, మనుమలు కూడ తపస్సుచే ఇక్కడకు వచ్చి మాతో ఆనందిస్తారు. ఇందులో వారి అపరాధం ఏమీ లేదు. మానదా! అందువల్ల నీవు నా పట్ల ప్రసన్నుడివి కమ్ము. కామపీడితురాలనైన నన్ను ఇలా విడిచిపెట్టటం నీకు తగదు. నీ భక్తురాలిని, పైగా మన్మథాగ్నిచే దహింపబడుతున్న దాన్ని, అందువల్ల నన్ను అంగీకరించు.' అప్పుడు అర్జునుడిలా అన్నాడు - 'ప్రశంసింప దగినదానా! నేను నీకు నిజం చెపుతాను. దిక్కులను, విదిక్కులను అధిష్ఠించిన దేవతలందరూ కూడా ఈమాటను విందురు గాక! కుంతి, మాద్రి, శచీదేవి వలె మా వంశజననివగు నీవుకూడ నాకు గౌరవింపదగినదానవు. నీపాదాలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. నీవు తిరిగి వెళ్ళు. నీవు నాకు తల్లివలె పూజింపదగినదానవు. నన్ను పుత్రునిలా రక్షించు.' అర్జునుడు ఇలా చెప్పగానే, ఊర్వశి క్రోధంతో వివశురాలై, కంపిస్తూ వక్రమైన కనుబొమలతో అర్జునుని శపించింది. 'అర్జునా! నీతండ్రి అనుమతితో స్వయంగా ఇంటికి వచ్చి, మన్మథబాణాలకు వశమైయున్న, నన్ను నీవు ఆదరించటం లేదు. అందువల్ల నీవు స్త్రీలమధ్యలో గౌరవం లేకుండా (సిగ్గులేకుండా) నాట్యం చేస్తావు. నపుంసకుడని ప్రఖ్యాతుడవై నపుంసకునిలా సంచరిస్తావు.' ఈ విధంగా అర్జునుడికి శాపమిచ్చి కంపిస్తున్న పెదవులతో నిట్టూర్పులు విడుస్తూ, వేగంగా ఊర్వశి తిరిగి తన గృహానికి వచ్చింది. అర్జునుడు కంగారుపడుతూ

చిత్రసేనుడి దగ్గరకు వచ్చి ఊర్వశితో రాత్రి జరిగిన వృత్తాంతాన్ని యథాతథంగా చెప్పాడు. అక్కడ జరిగిన సన్నివేశాన్ని, శాపవృత్తాంతాన్ని మళ్ళీమళ్ళీ చెప్పాడు. చిత్రసేనుడు కూడా ఇంద్రునికి ఈ విషయాలన్నింటిని చెప్పాడు. ఇంద్రుడు తనకుమారుని రప్పించి ఏకాంతంలో మంచిమాటలతో అతనిని ఊరడించి, 'కుమారా! నీవంటి పుత్రుని పొంది నీతల్లి కుంతి ఈ రోజు సుపుత్రవతి అయింది. నీమనోధైర్యంచేత ఋషులు కూడా జయింపబడ్డారు. ఊర్వశి నీకిచ్చిన శాపం కూడా నీఅభీష్టార్థానికి సాధకమే అవుతుంది. భూమిమీద మీరు పదమూడవ సంవత్సరంలో అజ్ఞాతవాసం చేయవలసి ఉంది. ఆ సమయంలో ఊర్వశీ శాపం సంవత్సరకాలాన్ని పూర్తిచేస్తుంది. నర్తకవేషంలో నపుంసకభావంతో ఆ ఒకసంవత్సరం సంచరించిన తరువాత మరల పుంస్త్వాన్ని పొందుతావు.' ఇంద్రుడు ఈవిధంగా చెప్పాక, అర్జునుడు మిక్కిలి ఆనందాన్ని పొందాడు. ఇక శాపాన్ని గురించి చింతించలేదు. ధనంజయుడు మహాయశస్వి, గంధర్వరాజు అయిన చిత్రసేనుడితో స్వర్గలోకంలో సుఖంగా ఉండసాగాడు. అర్జునుని ఈవృత్తాంతాన్ని నిత్యం విన్నవాడు పాపపూర్ణమైన విషయభోగాలలో ప్రవర్తింపడు. ఫాల్గునుని పవిత్రమైన నడవడిని గూర్చి వింటే మద, దంభ, విషయాసక్తి దోషాలు తొలగి మానవశ్రేష్ఠులు స్వర్గానికి వెళ్ళి సుఖంగా నివసిస్తారు.

47. లోమశుడు స్వర్గము నుండి కామ్యకవనమున కేగుట.

వైశంపాయను డిలా అన్నాడు. 'జనమేజయా! ఒకానొకప్పుడు లోమశమహర్షి ఇంద్రుని చూడాలనే కోర్కెతో ఇంద్రభవనానికి వెళ్ళాడు. ఆ మహాముని దేవేంద్రుని సమీపించి నమస్కరించి ఇంద్రుని అర్ధాసనంలో కూర్చున్న అర్జునుని చూశాడు. ఇంద్రుని ప్రార్థనచేత దర్భలు పరచబడిన ఉత్తమసింహాసనంమీద ఆ ద్విజశ్రేష్ఠుడైన మహర్షి కూర్చున్నాడు. ఆయనను మహర్షులు పూజించారు. ఇంద్రుని ఆసనంమీద కూర్చున్న పార్థుని చూడగానే అతడికి 'క్షత్రియుడైన ఈ కుంతీకుమారుడు ఇంద్రుని సింహాసనాన్ని ఎలా పొందాడు?' అనే ఆలోచన కలిగింది. 'ఇతడు ఏ పుణ్యకర్మ చేశాడు? ఏ ఏ లోకాలను జయించాడు? దేవతలందరిచే నమస్కరింపబడే ఈ స్థానాన్ని దేని ప్రభావం వల్ల పొందాడు?' అతని ఆలోచనను గ్రహించి వృత్రసంహారకుడైన ఇంద్రుడు నవ్వుతూ లోమశునితో ఇలా అన్నాడు. 'బ్రహ్మర్షీ! నీమనసులో అనుకొంటున్న దానికి సమాధానం చెపుతున్నాను. విను. ఇతడు మానవజన్మ నెత్తిన సాధారణమర్త్యుడు కాదు. మహర్షీ! మహాబాహువైన ఈ అర్జునుడు కుంతికి జన్మించిన నాకుమారుడు. ఒకానొక కారణంవల్ల అస్త్రవిద్య కోసం ఇక్కడకు వచ్చాడు. ఆహా! ఎంత ఆశ్చర్యం. పురాతనుడైన ఈ ఋషిసత్తముని నీవెరుగవా!

బ్రహ్మర్షీ! ఇతడెవడో, ఇలా జన్మించడానికి గల కారణమేమిటో నేను చెపుతున్నాను విను. పురాణపురుషులు, ఋషిసత్తములూ అయిన నరనారాయణులే ఈ శ్రీకృష్ణార్జునులుగా అవతరించారని గ్రహించు. ముల్లోకాలలోనూ, ప్రసిద్ధులైన నరనారాయణమహర్షులు ఒకానొక కార్యసిద్ధికై పుణ్యానికి ఆధారమైన భూతలం మీద మానవులుగా అవతరించారు.

దేవతలచే కాని, మహాత్ములైన ఋషులచే కాని చూడటానికి శక్యం కానిదై బదరి అనే పేరుతో ప్రసిద్ధికెక్కిన పవిత్రమైన ఆశ్రమం ఉండేది. బ్రహ్మర్షీ! సిద్ధులు, చారణులు సేవించే గంగ అక్కడనుండే పుట్టింది. అది శ్రీమహా విష్ణువయిన కృష్ణునకు, జయశీలుడయిన అర్జునునకు నివాసస్థానం. (నారాయణునకు, నరునకు నివాసస్థానం) బ్రహ్మర్షీ! మహాతేజస్సులైన నరనారాయణులు నాప్రార్థనపై భూలోకంలో జన్మించారు. మహాశక్తిశాలులైన వారు భూమిభారాన్ని తగ్గిస్తారు. ఆ రోజుల్లో నివాతకవచు లనే ఉద్ధతులైన రాక్షసులు కొందరు వరదానగర్వితులై మాకు అనిష్టాలను చేస్తూ ఉండేవారు. బలగర్వంతో సురలను చంపాలని ఆలోచించే వారు. వారు దేవతలను లెక్కచేయనంతగా వరాలను పొందారు. వారు పాతాలనివాసి అయిన దనువు యొక్క పుత్రులు. వారు భయంకరులు, మహాబలవంతులు. దేవతలసమూహాలన్నీ కలిసి కూడ దానవులతో యుద్ధం చేయడానికి సమర్థులుకారు. మధునిషూదనుడైన శ్రీమహావిష్ణువు కపిలుడనే పేర భూమిపై అవతరించాడు. ఎవ్వరికీ జయింప శక్యం గాని భగవంతుడు శ్రీహరి. మహర్షీ! పూర్వకాలంలో రసాతలాన్ని త్రవ్వుతూ సగరపుత్రులు ఈ కపిలుని దృష్టిమాత్రంచేత భస్మమయ్యారు. ద్విజశ్రేష్ఠా! ఆ శ్రీహరి మాకోసం మహాకార్యాన్ని చేయగలడు. ఈ శ్రీకృష్ణార్జునులిద్దరూ కలిసి మహాసంగ్రామంలో ఆ కార్యాన్ని సాధిస్తారు. ఇందులో సందేహంలేదు. భగవంతుడైన శ్రీకృష్ణుడు దర్శనమాత్రంచేతనే నివాతకవచులనూ, వారి అనుచరులను కూడా మహాహ్రదంలోని నాగులను వలె చంపగలడు. కాని చిన్నపనికోసం మధుసూదనుని కోరడం ఉచితం కాదు. అతడు తేజస్సులమహారాశి. అతడు లేస్తే సమస్త జగత్తునూ దహిస్తాడు. శూరుడైన అర్జునుడు ఒక్కడూ ఆ సమస్తదానవులను సంహరింపగలడు. యుద్ధంలో ఆ నివాతకవచదానవులందరిని చంపి, తిరిగి మానవలోకానికి వెళ్తాడు. మహామునీ! నీవు మా ప్రార్థనపై భూలోకానికి వెళ్ళు. అక్కడ కామ్యకవనంలో నివసిస్తున్న వీరుడైన యుధిష్ఠిరుని చూస్తావు. ధర్మాత్ముడు, సత్యసంగరుడూ అయిన యుధిష్ఠిరునికి మా సందేశాన్ని చెప్పు. "అర్జునుని విషయంలో ఉత్కంఠ అవసరం లేదు. అస్త్రవిద్యను సాధించి శీఘ్రంగా వస్తాడు".

సంపూర్ణ బాహుబలం లేనివాడు కాని, అస్త్రవిద్య సంపూర్ణంగా లేనివాడు కాని యుద్ధంలో భీష్మద్రోణాదులను జయింపలేడు. అర్జునుడు అస్త్రవిద్యను స్వీకరించి, నృత్య

వాద్య గీత కళలలో కూడా పారంగతు డయ్యాడు. మనుజేశ్వరా! శత్రుదమనా! నీవు కూడా నీసోదరులతో అన్ని తీర్థాలను సేవించు. పవిత్ర తీర్థాలలో స్నానంచేసి, పాపరహితుడవై, సంతాపరహితుడవై, కల్మషం లేనివాడవై సుఖంగా రాజ్యాన్ని అనుభవిస్తావు. ద్విజశ్రేష్ఠా! తపోబలసంపన్నుడవైన నీవు కూడా భూమండలాన్నంతా తిరుగుతున్న యుధిష్ఠిరుని రక్షిస్తూ ఉండు. దుర్గమపర్వతప్రాంతాలలో, ఎగుడుదిగుడు ప్రదేశాలలోనూ, భయంకరులైన రాక్షసులు నివసిస్తూంటారు. వారి నుండి యుధిష్ఠిరుని రక్షించు." మహేంద్రుడు ఈవిధంగా చెప్పాక, అర్జునుడు కూడా ప్రయత్నపూర్వకంగా వినయంతో లోమశునికి 'పాండునందనుడైన యుధిష్ఠిరుని రక్షించండి' అంటూ ఇలా చెప్పాడు. 'సత్పురుషశ్రేష్ఠా! మహామునీ! నీచే రక్షింపబడుతూ యుధిష్ఠిరుడు తీర్థాలను సేవిస్తాడు. అపుడు అతడు దానాలు చేసేటట్లుగా నీవు ఏర్పాటు చెయ్యి.' 'అట్లే' అని మాటిచ్చి మహాతపస్వి అయిన లోమశుడు కామ్యకవనానికి చేరడంకోసం భూతలానికి ప్రయాణమయ్యాడు. అతడు కామ్యకవనం చేరుకొని, అక్కడ తాపసులతో, సోదరులతో పరివేష్టించి ఉన్న ధర్మరాజును చూశాడు.

48. అర్జునుని వృత్తాంతము విన్న ధృతరాష్ట్రుని చింత.

ధృతరాష్ట్రమహారాజు వ్యాసమహర్షి వల్ల అర్జునుడు ఇంద్రలోకంలో ఉన్నాడన్న సంగతి విని, సంజయునితో ఇలా అన్నాడు. 'సూతా! మిక్కిలి బుద్ధిమంతుడు కుంతీకుమారుడైన అర్జునుని సమస్తవృత్తాంతాన్ని నేను విన్నాను. సారథీ! దీన్ని గురించి యథార్థం నువ్వెరుగుదువా! నాకొడుకు దుర్యోధనుడు విషయభోగాల్లో ప్రమత్తుడు. బుద్ధిహీనుడు. పాపకర్మలగురించి ఆలోచిస్తాడు. మిక్కిలి దుర్బుద్ధి. వీడు ఎప్పుడో ఒకరోజు ఈ భూమండలాన్నంతా నాశనం చేస్తాడు. సరదాగా మాట్లాడే సమయాలలో కూడ ఎప్పుడూ నిజమే పలికే మహాత్ముడైన ధనంజయుడు యోధగా ఉండగా, ధర్మరాజు త్రిలోకాధిపత్యాన్ని అయినా పొందుతాడు. ఇక కురురాజ్యాధిపత్యం మాట చెప్పవలసిందేముంది! శిలలవలె కఠినాలై, తీక్ష్ణాలైన అగ్రాలు గల 'కర్ణి' అనే పేరుగల బాణాలను ప్రయోగించే అర్జునుడికి ఎదురుగా సైనికు డెవడు నిలబడగలడు? ముసలితనాన్ని జయించిన మృత్యువు కూడ అతని కెదురుగ నిలబడలేదు. ఎదిరింప శక్యంకాని పాండవులతో యుద్ధం చేయవలసిన స్థితిలో ఉన్న దురాత్ములైన నాపుత్రులంతా మృత్యువుకు వశులై ప్రవర్తిస్తున్నారు.

రాత్రింబవళ్లు ఆలోచించినప్పటికీ, గాండీవధన్వుడైన అర్జునుడి కెదురుగా యుద్ధంలో నిలబడగల రథికు డెవడున్నాడో తెలుసుకోలేకపోతున్నాను. యుద్ధంలో ద్రోణుడుకాని, కర్ణుడు కాని, భీష్ముడు కాని అర్జునుడికి ఎదురు నిలువగలరు. అయినా నాకు సందేహమే.

ఈలోకంలో మాపక్షంలో విజయాన్ని ఊహించలేకపోతున్నాను. కర్ణుడు దయాళువు, తొందరపాటుకల ద్రోణాచార్యుడు ముసలివాడు. పైగా అర్జునుడికి గురువు. ఆపక్షంలో అర్జునుడు అసహనంతో ఉన్నవాడు, బలవంతుడు, ఉద్యమించేవాడు, దృఢపరాక్రమం కలవాడు. సంకులసమరం జరుగుతుంది. కాని పాండవులకు పరాజయం ఉండదు. వారంతా అస్త్రవిద్యలో ఆరితేరిన శూరులు. అందరూ మహాయశస్వులు. యుద్ధంలో పరాజయంలేని ఆ పాండవులు సామ్రాజ్యాధిపత్యాన్ని కోరుకొంటారు. అర్జునుని కాని, కర్ణాదులను కాని వధిస్తేనే ఈవివాదం శాంతిస్తుంది. అర్జునుని చంపేవాడు కాని, జయించేవాడు కాని లేడు. ఇక మూర్ఖులైన నాపుత్రులపట్ల అతనికి కలిగిన కోపం ఎలా చల్లారుతుంది? అర్జునుడు ఇంద్రునితో సమానమైన వీరుడు. అతడు ఖాండవవనంలో అగ్నికి తృప్తి కలిగించినవాడు. రాజసూయ మహాయజ్ఞంలో రాజులందరిని జయించినవాడు. సంజయా! పర్వతశిఖరంపై పడిన వజ్రాయుధం కొంతైనా విడిచిపెడుతుంది. కాని నాయనా! అర్జునుడు వదిలిన బాణాలు ఎవరినీ మిగల్చవు. అందరినీ తుడిచిపెడతాయి. సూర్యునికిరణాలు చరాచరజగత్తునంతా తపింప చేసినట్లుగా అర్జునుని చేతినుండి విడివడిన బాణాలు నాకుమారుల నందరిని దహిస్తాయి. సవ్యసాచి అయిన అర్జునుని రథఘోషచేత భయార్తులైన కౌరవసేనలు చిన్నాభిన్నాలైనట్లుగా నాకు అనిపిస్తోంది. అర్జునుడు యుద్ధంలో అస్త్రశస్త్రాలతో నిలబడితే, బ్రహ్మ సృష్టించిన సర్వసంహారకుడైన మరొక యమధర్మరాజులా ఉంటాడు. అతనిని జయింపగలవాడు లేడు.'

49. సంజయుడు ధృతరాష్ట్రుని మాటలను అంగీకరించుట, ధృతరాష్ట్రుని సంతాపము.

సంజయుడిలా అన్నాడు - 'రాజా! దుర్యోధనుడి గురించి నీవు చెప్పినదంతా యథార్థమే. ఇందులో అసత్య మేమీ లేదు. ధర్మపత్ని, యశస్విని అయిన ద్రౌపదిని సభలోకి ఈడ్చుకురావడం చూసిన మహాతేజస్వులైన పాండవులు కోపంతో ఉన్నారు. దుఃశాసనుడు, కర్ణుడు అపుడు పలికిన కఠోరవచనాలు విని, వారు మిమ్ముల నందరినీ అసహ్యించుకొంటున్నారు అని నా అభిప్రాయం. మహారాజా! అర్జునుడు యుద్ధంలో పదకొండు తనువులు గల (ఏకాదశరుద్రులు) శంకరుని తన ధనుర్విద్యచేత సంతుష్టుని చేశాడని నేను విన్నాను. దేవదేవుడైన కపర్ది అర్జునుని పరాక్రమాన్ని తెలిసికోవాలని కిరాతునివేషంలో ఫాల్గునునితో యుద్ధం చేశాడు. అస్త్రంకోసం తపస్సుతో పరాక్రమించిన అర్జునుడికి అక్కడ లోకపాలు రంతా దర్శన మిచ్చారు. ఈలోకంలో అర్జునుడు తప్ప

వేరొకడెవడూ లోకేశ్వరుల సాక్షాద్దర్శనం పొందినవాడు లేడు. రాజా! అష్టమూర్తి అయిన మహేశ్వరుడే యుద్ధంలో అర్జునుని ఓడించలేకపోయాడు. అటువంటి మహావీరుని యుద్ధంలో జయించడానికి ఎవడు సాహసిస్తాడు? సభలోకి ద్రౌపదిని బలవంతంగా లాక్కువచ్చి, అవమానించి, పాండవులకు కోపం కలిగించిన నీకుమారులు దుర్యోధనాదులు స్వయంగా భయంకరమైన యుద్ధాన్ని ఆహ్వానించారు. దుర్యోధనుడు తన తొడలను చూపినపుడు, దాన్నిచూసి క్రుద్ధుడైన భీముడు అదురుతున్న పెదవులతో అర్థవంతమైన మాట నిలా చెప్పాడు. పాపాత్ముడా! కపటంగా జూదమాడిన నీయొక్క ఊరువులను పదమూడు సంవత్సరాలు ముగిసిన తర్వాత భయంకరమైన వేగం గల నాగదతో ముక్క ముక్కలు చేస్తాను. పాండవులంతా కొట్టడంలో శ్రేష్ఠులు. అందరూ అమితమైన పరాక్రమం కలవారు. అందరూ అన్నిరకాల అస్త్రాలలోను పండితులు. వారు దేవతలకు కూడా జయింపశక్యంకారు. భార్యకు జరిగిన అవమానం వల్ల అసహనంతో ఉన్న పాండవులు కోపంతో ఉద్విగ్నులై, యుద్ధంలో నీ కుమారుల నందరిని చంపుతారని నేను భావిస్తున్నాను.

ధృతరాష్ట్రుడిలా అన్నాడు – సూతా! పరుషంగా మాట్లాడి కర్ణుడు చేసిం దేముంది? వైరం పెరిగింది. ద్రౌపదిని జుట్టుపట్టుకొని సభకు లాక్కురావడమే ఇంతటి వైరానికి దారితీసింది. ఇప్పటికి కూడా మూర్ఖులైన నాపుత్రులు ఊరుకోవటం లేదు. వీరందరికి పెద్దవాడైన దుర్యోధనుడు వినయమార్గంలో నడవటం లేదు. సూతా! మందభాగ్యుడైన దుర్యోధనుడు అంధుడనైన నన్ను అకర్మణ్యునిగ, అవివేకిగా భావించి నామాట కూడా వినటంలేదు. అతనికి మంత్రులుగా ఉన్న కర్ణ శకునులు కూడా మూర్ఖులే. వారు మూర్ఖుడైన దుర్యోధనుడి దుశ్చేష్టలను ఇంకా పెంచుతున్నారు. అమితతేజస్వి అయిన అర్జునుడు స్వేచ్ఛగా అలవోకగా విడిచిన బాణాలే నాపుత్రులను దహిస్తాయి. ఇక కోపంతో విడిచిన బాణాల సంగతి వేరే చెప్పాలా ! అర్జునుడి బాహుబలంతో, అతని మహాధనువు నుండి వెలువడి, అభిమంత్రితాలైన దివ్యాస్త్రాలు దేవతలను కూడా సంహరింపగలవు. **త్రైలోక్యనాథుడు, జనార్దనుడూ ఐన శ్రీహరి మంత్రిగా, రక్షకునిగా, స్నేహితునిగా కలవాడికి(అర్జునుడికి) జయింపశక్యం కాని దేముంటుంది?*** సంజయా! అర్జునుని ఈపరాక్రమం చాలా ఆశ్చర్యకరంగా ఉంది. అతడు మహాదేవునితో బాహుయుద్ధం కూడా చేశాడని విన్నాను. ఇంతకుమునుపు ఖాండవవనంలో అగ్నిదేవునికి సహాయంకోసం

---

* యస్య మంత్రీ చ గోప్తా చ సుహృచ్చైవ జనార్దనః ।
హరిస్త్రైలోక్యనాథః సః కిం మ తస్య న నిర్జితమ్ ॥ 20

శ్రీకృష్ణార్జునులు ఏం చేశారో లోకా లన్నింటికి ప్రత్యక్షంగా తెలుసు. అర్జునుడు, భీముడు, యదుకులతిలకుడైన శ్రీకృష్ణుడు క్రుద్ధులైతే అమాత్యసౌబల సమేతంగా నాపుత్రులెవరూ ఏవిధంగానూ జీవించలేరు.'

50. అరణ్యమున పాండవుల ఆహారము.

జనమేజయుడిలా అన్నాడు. 'మునివరా! వీరులైన పాండవులను అరణ్యానికి పంపించి, ధృతరాష్ట్రు డీవిధంగా దుఃఖించడం వ్యర్థం. మహారథులైన పాండుపుత్రులకు కోపం కలిగించిన, మంద బుద్ధి ఐన తనపుత్రుడు దుర్యోధనుని ధృతరాష్ట్రుడు ఏవిధంగా ఉపేక్షించగలడు? విప్రవరా! అడవిలో పాండవులకు ఆహారంగా ఏం లభించింది? వారు అడవిలోని ఫలమూలాలు తిన్నారా! లేక భూమిని దున్ని ఆహారం పండించుకొని తిన్నారా! నాకు వివరంగా చెప్పు.' వైశంపాయను డిలా అన్నాడు – 'పురుషశ్రేష్ఠులైన పాండవులు వన్యాలైన ఫలమూలాలను, స్వచ్ఛమైన బాణాలతో పడగొట్టిన మృగాలను ముందుగా బ్రాహ్మణులకు నివేదించి తింటున్నారు. రాజా! వనంలో నివసిస్తున్న మహాధన్వులూ, శూరులైన పాండవులను అక్కడి బ్రాహ్మణులంతా అనుసరించారు. అక్కడ యుధిష్ఠిరుడు మహాత్ములు, స్నాతకులు, మోక్షవేత్తలూ అయిన పదివేలమంది బ్రాహ్మణులను రక్షించి, పోషిస్తున్నాడు.

రురుమృగాలను, కృష్ణమృగాలను, పవిత్రాలైన మృగాలను బాణాలతో చంపి' వాటిచర్మాలను పాండవులు బ్రాహ్మణులకు ఆసనాదులకై ఇస్తున్నారు. అక్కడున్న బ్రాహ్మణులలో ఒక్కడికి కూడ శరీరవర్ణం మారలేదు. ఒక్కడు కూడా వ్యాధిగ్రస్తుడు కాలేదు. ఒక్కడూ కృశించలేదు. దుర్బలుడు కాలేదు. ఒక్కడూ దీనుడు లేడు. భయపడినవా డెవడూ లేడు. ధర్మరాజు తనసోదరులను ప్రియపుత్రులుగా, జ్ఞాతులను సోదరులుగా పోషిస్తున్నాడు. యశస్విని అయిన ద్రౌపది ముందుగా భర్తలకు, సమస్తబ్రాహ్మణులకు తల్లివలె భోజనంపెట్టి, తర్వాత మిగిలినది ఆమె తింటుంది. యుధిష్ఠిరుడు తూర్పున, భీమసేనుడు దక్షిణాన, నకులసహదేవులు పశ్చిమోత్తరాలయందు తక్కిన ధనుర్ధారులతో కూడి నిత్యమూ హింసకజంతువులను సంహరిస్తున్నారు. ఈవిధంగా కామ్యకవనంలో అర్జునుడు లేకుండా పాండవులు అతనికొరకు ఉత్కంఠితులై ఐదు సంవత్సరాలు స్వాధ్యాయ, జప, హోమాలతో కాలం గడిపారు.'

51. శ్రీకృష్ణాదులు దుర్యోధనాదులవధకై ప్రతిజ్ఞ చేసిరని సంజయుడు ధృతరాష్ట్రునికి వినిపించుట.

ధృతరాష్ట్రుడు మనుష్యాతీతమైన పాండవుల వృత్తాంతాన్ని విని, విచారంతో, దుఃఖంతో, వ్యాకులమైన మనస్సుతో, కోపంతో రగిలి, వేడి నిట్టూర్పులు విడిచి సంజయుని దగ్గరకు పిలిచి ఇలా అన్నాడు. 'సంజయా! జూదం వల్ల కలిగిన ఘోరమైన అన్యాయాన్ని గురించి ఆలోచిస్తూంటే రాత్రింబవళ్ళు ఒక్కక్షణకాలం కూడా శాంతిని పొందలేకపోతున్నాను. పాండవుల పరాక్రమం సహింపశక్యంకానిది. వారి శౌర్యం, ధైర్యం, ధృతి, ఆ సోదరుల అన్యోన్యానురాగం మానవాతీత మైనవి. అశ్వినీదేవతల కుమారులు, మహాభాగులు, దేవేంద్రునితో సమానమైన తేజస్సు కల నకులసహదేవులు యుద్ధంలో ప్రచండులు. వారు దృఢమైన ఆయుధాలు కలవారు. దూరంలో ఉన్నవారిని కూడా చంపగలరు. యుద్ధంలో కృతనిశ్చయులు. శీఘ్రంగా హస్తాలు కదల్చగలరు. దృఢమైన క్రోధం కలవారు. నిత్యం ప్రయత్నశీలులు. వేగం కలవారు. వారిద్దరూ యుద్ధరంగంలో భీమార్జునులను ముందుంచుకొని సింహాల్లా విక్రమిస్తూంటే వారిని సహింపగలవారెవరూ మాసైన్యంలో ఉండరు. ఇక మాసైన్యంలో ఒక్కవీరుడూ మిగలడు. సంజయా! దేవపుత్రులు, మహారథులూ అయిన నకులసహదేవులకు యుద్ధంలో ఎదురు నిలిచేవారు లేరు. ద్రౌపదికి జరిగిన ఆనాటి అవమానాన్ని వారు క్షమించలేరు. అసహనంతో నిండి ఉన్నారు. మహాధనుర్ధరులైన వృష్ణి వంశీయులూ, మహాతేజస్వులైన పాంచాలవీరులూ, యుద్ధంలో సత్యప్రతిజ్ఞ గల శ్రీకృష్ణునిచే రక్షింపబడుతున్న పాండవులూ నిశ్చయంగా యుద్ధంలో నాకుమారులను, కౌరవసేనను భస్మం చేస్తారు. బలరామకృష్ణులచే నడపబడుతున్న వృష్ణివంశవీరుల వేగాన్ని యుద్ధంలో కౌరవులంతా కలిసినా సహింపలేరు. వారిలో భీముడు వీరులను సంహరించే గదను ఆకాశంలో త్రిప్పుతూ యుద్ధరంగంలో సంచరిస్తాడు. భీముని గదావేగాన్ని, వజ్రాయుధంగా ఘోషించే గాండీవ ధనుష్టంకారాన్ని కౌరవసైన్యంలోని శత్రురాజు లెవరూ సహింపలేరు. ఆ సమయంలో నేను దుర్యోధనుడి అధీనంలో ఉన్నాను. మునుపుస్నేహితులు చెప్పిన మాటలు నేను వినలేదు. ఇపుడు వాటిని గుర్తుచేసికొంటున్నాను.'

సంజయుడిలా అన్నాడు - 'రాజా! నీద్వారా చాలా ఘోరమైన అన్యాయం జరిగిపోయింది. ఆవిషయం నీవు తెలిసికూడా ఉపేక్షించావు. దాన్ని ఆపడానికి సమర్థుడవై కూడా పుత్రవ్యామోహం వల్ల దాన్ని నివారించలేదు. కృష్ణుడు పాండవులు జూదంలో పరాజితు లయ్యారని తెలిసి, కామ్యకవనంలో ఉన్నవారిని తొందరగా కలిసికొని ఊరడించాడు. ద్రుపదుని పుత్రులైన ధృష్టద్యుమ్నాదులు, విరాటరాజు, ధృష్టకేతువు, మహారథులైన

కేకయవీరులూ పాండవులను కలిశారు. రాజా! వారు పరాజితులైన పాండవులతో ఏం చెప్పారో చారులద్వారా నేను తెలిసికొని, అదంతా నీకు చెప్పాను కూడ. శ్రీకృష్ణుడు పాండవులను కలిసి, వారడిగితే యుద్ధంలో అర్జునుడికి సారథ్యం వహిస్తా నని చెప్పాడు. అటువంటి దురవస్థలో ఉండి, కృష్ణాజినాలను ధరించిన పాండవులను చూసి అసహనంతో కృష్ణుడు అర్జునుడితో ఇలా చెప్పాడు. "ఇంద్రప్రస్థంలో ఉన్నపుడు పాండవుల సంపద ఎంతటిదో రాజసూయంలో నేను ప్రత్యక్షంగా చూశాను. అటువంటిది ఇతర క్షత్రియు లెవరికీ లభ్యంకాదు. ఆ సమయంలో పాండవుల శస్త్రాల తేజస్సుకు భూపాలురంతా భయభ్రాంతులయ్యారు. అంగ, వంగ, పుండ్ర, ఓడ్ర, చోల, ద్రావిడ, ఆంధ్ర దేశపురాజులు, సాగరతీరవాసులు, సముద్రద్వీపవాసులు రాజసూయయాగానికి వచ్చారు. సింహల, బర్బర, మ్లేచ్ఛ, లంకానివాసులు, పశ్చిమరాష్ట్రవాసులు, సాగరతీరవాసులు, పహ్లవ, దరద, కిరాత, యవన, శక, హారహూణ, చీన, తుషార, సైంధవ, జాగుడ, రామర, ముండ, స్త్రీరాజ్య, తంగణ, కేకయ, మాలవ, కాశ్మీరదేశరాజులు ఆ యజ్ఞానికి ఆహ్వానింపబడ్డారు. వారందరికి ఇచ్చిన ఆతిథ్యాన్ని చూశాను. చంచలమైన నీసంపదను తీసుకువెళ్ళిన వారి ప్రాణాలు తీసి ఆ సంపదను నేను మళ్ళీ తీసికొని వస్తాను. బలరామ, భీమసేన, అర్జున, నకుల, సహదేవ, అక్రూర, గద, సాంబ, ప్రద్యుమ్న, ఆహుక, వీర, ధృష్టద్యుమ్న, ధృష్టకేతుప్రముఖ వీరులతో దుర్యోధన, కర్ణ, దుఃశాసన శకునులను, ఎదురువచ్చిన తక్కిన యోధులను చంపి శీఘ్రంగా నీ సంపదను నీకు తిరిగి తీసికొనివస్తాను. ఆ తరువాత నీ సోదరులతో కలిసి హస్తినాపురంలో నివసిస్తూ ధృతరాష్ట్రసంబంధమైన రాజ్యలక్ష్మిని పొంది ఈ సమస్త పృథివీమండలాన్ని శాసించు." అపుడు యుధిష్ఠిరుడు ధృష్టద్యుమ్నాది వీరులంతా వింటూండగా, శ్రీకృష్ణునితో ఇలా అన్నాడు-

'జనార్దనా! నీ ఈ సత్యవాక్కును శిరసావహిస్తున్నాను. కేశవా! పదమూడు సంవత్సరాలు గడిచిన తర్వాత, నాశ్రితులను, వారివారి బంధువులతో పాటుగా, సంహరించు. ఆ విధంగా చేసి నా సత్యవ్రతాన్ని రక్షించు. రాజులందరి మధ్యలో నేను వనవాసప్రతిజ్ఞను చేశాను.' ధర్మరాజు చెప్పిన ఆమాటలు విన్న తర్వాత, ధృష్టద్యుమ్నాది సభాసదులు సమయోచిత మధురవచనాలతో అసహనంతో ఉన్న కృష్ణుని శీఘ్రంగా శాంతి పరిచారు. వారంతా శ్రీకృష్ణుడు వింటూండగా క్లేశరహిత అయిన ద్రౌపదితో ఇలా అన్నారు- దేవి! దుర్యోధనుడు నీక్రోధం వల్ల తప్పక ప్రాణత్యాగం చేస్తాడు. వరవర్ణిని ! మేము నిజంగా ప్రతిజ్ఞ చేస్తున్నాం. నీవు దుఃఖించకు. కృష్ణా! ((ద్రౌపదీ!) అపుడు జూదంలో ఓడిన నిన్ను చూసి నవ్వినవారి మాంసాలను తోడేళ్ళు తింటూ లాక్కువెళ్తాయి. సభలో నీ జుట్టు

పట్టుకొని లాక్కువచ్చిన వారి తలలను లాక్కుంటూ గ్రద్దలు, గోమాయువులు వారి రక్తాన్ని త్రాగుతాయి. ద్రౌపదీ! వారి శవాలను మాంసం తినే పశుపక్ష్యాదులు మాటిమాటికీ లాక్కుంటూ, పీక్కుంటూ తినడం నీవు చూస్తావు. నిన్ను క్లేశపెట్టి అవమాన పరచిన వారి తలలు తెగిపడతాయి. వారి రక్తాన్ని భూమి త్రాగుతుంది.' తేజస్సులూ, శూరులూ, శుభలక్షణులూ అయిన వారు ఇలా ఎన్నో విధాల మాట్లాడారు. పదమూడు సంవత్సరాలయిన తరువాత ధర్మరాజు యుద్ధం కోరుకొంటాడు. అపుడు కృష్ణుని ముందుంచుకొని మహారథులంతా యుద్ధానికి వెళతారు. బలరాముడు, కృష్ణుడు, అర్జునుడు, ప్రద్యుమ్నుడు, రాజపుత్రులు, పాంచాలురు, విరాటుడు; వీరంతా అజేయులయిన వీరులు -పైగా వీరు బంధువులతో, సైన్యంతో వస్తే బ్రతుకు మీద ఆశ ఉన్నవాడెవడయినా ఎదుర్కొంటాడా? అలా చేస్తే గర్జించే సింహం జూలు పట్టుకున్నట్లే !' ధృతరాష్ట్రుడిట్లన్నాడు. 'సంజయా! జూదంనాడు విదురుడు నాతో "రాజా! నీవే కనుక జూదంలో నెగ్గితే నిజంగా ఇది కౌరవులకు అంత్యకాలమే. రక్తపుటేరులు ప్రవహిస్తాయి"- అన్నాడు. విదురు డానాడు అన్నమాట జరిగి తీరేటట్లే ఉంది. పాండవులు చెప్పినట్లు యుద్ధం రానే వస్తుంది. నిస్సందేహం.'

52. నలోపాఖ్యాన ప్రారంభము.

జనమేజయు డిలా అడిగాడు - అస్త్రాల కారణంగా, అర్జునుడు ఇంద్రలోకానికి వెళ్ళిన పిమ్మట, పాండుకుమారులైన ధర్మరాజ, భీమ, అర్జున, నకుల సహదేవులు ఏం చేశారు?' వైశంపాయను డిలా అన్నాడు. 'జనమేజయా! అస్త్రాల కోసం అర్జునుడు ఇంద్రలోకానికి వెళ్ళిన తర్వాత, ధర్మజప్రభృతులు, ద్రౌపదీ సహితులై కామ్యక వనంలో ఉన్నారు. ఒకనాడు ధర్మరాజాదులు, అర్జునుని ఎడబాటుకు దుఃఖార్తులై ద్రౌపదితో కలసి ఏకాంతప్రదేశంలో పచ్చికబయళ్ళపై కూర్చున్నారు. అశ్రుకంఠాలతో దుఃఖార్తులైన వారందరిని శోక మావరించింది. అర్జున వియోగం వల్లను, రాజ్యభ్రంశం వల్లను పాండవులు దుఃఖితులయ్యారు. ఆ సమయంలో మహాబలవంతుడైన భీముడు ధర్మరాజుతో ఇలా పలికాడు. 'మహారాజా! అర్జునుడు మీ ఆదేశం వల్లనే కదా మనందరిని విడిచి వెళ్ళినది. వాడిమీదనే మనప్రాణాలన్నీ నిలుపుకొన్నాం. అర్జునుడే కనుక లేకుంటే, మేము, పాంచాలురు, వారిపుత్రులు, సాత్యకి, వాసుదేవుడూ నిస్సంశయంగా లేనట్లే. ధర్మాత్ముడైన అర్జునుడు, రాబోయే బాధలన్నింటిని గురించి బాగా ఆలోచించి, మీ ఆదేశం వల్లనే వెళ్ళాడు. ఇంతకంటే ఎక్కువ దుఃఖ మేముంది? అర్జునుని పరాక్రమంవల్లనే, మనం శత్రువులను జయించి, రాజ్యాన్ని పొందామని అనుకొంటున్నాము. ధనుర్ధారియైన అర్జునుని ప్రభావంవల్లనే, సభలో నేను సౌబలునితో

సహా ధృతరాష్ట్రపుత్రు లందరినీ పరలోకానికి పంపలేదు. అట్టి బాహుబలసంపన్నులమైన మేము, వాసుదేవ రక్షితులమై, నీమూలంగా మాకోపాన్ని అణచుకొన్నాము. కృష్ణునితో కూడి మేము కర్ణుడు మొదలైన శత్రువులను చంపి, స్వశక్తితో జయించి భూమండలాన్ని పరిపాలించేవారం. మీ ద్యూతదోషం చేతనే, మేమందరం, మహాబలసంపన్నులమై యుండి కూడ, బలవంతులచేత బాలురువలె త్రోసివేయబడ్డాం.

మహారాజా! క్షాత్ర ధర్మాన్ని గురించి, ఒకింత ఆలోచించండి! క్షత్రియునకు, అరణ్యవాసం ధర్మం కాదు కదా! రాజ్యాన్ని పరిపాలించడమే క్షత్రియ ధర్మమని పండితు లందరికీ తెలుసును. క్షత్రధర్మాన్ని తెలిసిన రాజు ఎప్పుడూ స్వధర్మమార్గాన్ని వీడరాదు. రాజా! పండ్రెండు సంవత్సరాలకు ముందే, అరణ్యం నుండి అర్జునుని నివారించి, కృష్ణుని కూడా రప్పించి ధార్తరాష్ట్రులను చంపుతాను. మహారాజా! అతిత్వరలో, ధార్తరాష్ట్రులను ససైన్యంగా పరలోకానికి పంపుతాను. సౌబలసహితంగా ధార్తరాష్ట్రుల నందరినీ, దుర్యోధనునీ, కర్ణునీ, యుద్ధంలో ఎదురు నిలచిన వాడెవడైనా సరే చంపుతాను. ఈ విధంగా చేసినట్లైతే, మీకు ఎటువంటి ధర్మగ్లాని(దోషం) కలగదు. నాచేతిలో శత్రుపక్షం అంతరించి ప్రశాంతత ఏర్పడినపుడు, మీరు అరణ్యం నుండి మరలి వచ్చేవారు. మహారాజా! వివిధ యజ్ఞాలచే పూర్వకృత పాపం పోగొట్టుకొని ఉత్తమమైన స్వర్గాన్ని పొందేవాళ్లం. మహారాజా! రాజు మూర్ఖుడు కాకుండా దీర్ఘసూత్రుడయి ఉంటే అది అలాగే జరిగేది. కాని మీరు ధర్మపరాయణులు కనుక అలా జరిగే ఆస్కారం లేదు. మోసగించే నేర్పుకలవారిని మోసంతోనే జయించాలని నా నిశ్చయం. మోసంతో మోసగానిని చంపడం పాపం కాదుకదా! భారతా! ఒకరోజు, ఒకసంవత్సరకాలంతో సమానమని ఈవిషయంలో ధర్మం తెలిసిన వారు భావిస్తున్నారు. వేదవాక్కులు కూడ, అదే విధంగా వినబడుతున్నాయి. మహారాజా! ఒక సంవత్సరకాలం, అతిక్లేశంతో పూర్తి అవుతోంది. మీకు, వేదాలే కనుక ప్రమాణాలైతే, ఒకరోజు ఒకసంవత్సరంతో తుల్యమవుతుంది. దీన్నిబట్టి పదమూడు సంవత్సరాల కాలపరిమితిని గురించి మీరు తెలుసుకోండి.

అనుబంధం గల దుర్యోధనుని చంపటానికి ఇదే సరియైన సమయం. అతడు భూమండల మంతటిని ఒకటిగా కలుపుకొనకముందే ఈ పని జరగాలి. మహారాజా! ద్యూతప్రియుడవైన నీచేతలవలననే, అది అలా జరిగింది. మనమంతా అజ్ఞాతవాసం అనే గోతిలోకి త్రోసివేయబడ్డాం. వనవాసకాలం పండ్రెండ్రు సంవత్సరాలు పూర్తియైన పిమ్మట, అజ్ఞాతంగా ఒకసంవత్సర కాలం గడపాలి. దురాత్ముడైన దుర్యోధనుడు, తన గూఢచారుల ద్వారా మన ఉనికిని పసిగట్టలేని దేశమేదో నాఆలోచనకు అందటం లేదు. అధముడైన

దుర్యోధనుడు ఏ చిన్న అవకాశం దొరికినా, తిరిగి మోసంతో వనవాసానికి పంపుతాడు. ఏదో ఒకవిధంగా, పాపకర్ముడైన దుర్యోధనుడు మన ఉనికిని పసిగట్టక, అజ్ఞాతవాసం పూర్తిఅయితే వాడు, మనలను తిరిగి జూదానికి ఆహ్వానిస్తాడు. జూదానికి కావలసిన ఏర్పాట్లన్నీ చేసి, మరల జూదమాడటానికి మిమ్మాహ్వానించి, ద్యూతక్రియతోనే మిమ్ము ఓడించి రాజ్యం నుండి బయటకు పంపిస్తాడు. వాడు(ఆ దుర్యోధనుడు) పాచికలాడుటలో నేర్పరియని గత అనుభవం వలన తెలిసినదే! మహారాజా! మనం తిరిగి వనాలలో నివాసమేర్పరచుకొని కాలాన్ని గడపవలసి ఉంటుంది. దైన్యస్థితిలోనే మమ్మందరినీ నిలుపదలచుకొంటే సరే! కానీ బ్రతికియున్నంతకాలం వేదధర్మాలను పూర్తిగా పరిశీలించండి. మోసగాడు, మోసంతోనే చంపదగినవాడు. ధర్మజ్ఞుల ఈ నిర్ణయాన్ని గుర్తెరిగి, నాకు ఆజ్ఞ ఇచ్చినట్లైతే.... పైకెగసిన దావాగ్ని ఎండిన అడవిని దహించినట్లు, సుయోధనుని చంపేస్తాను. అలా నాకు మీరు అనుజ్ఞ ఇవ్వండి.' ఈ విధంగా పలుకుతున్న భీముని ధర్మరాజు అనునయిస్తూ, తమ్ముని శిరస్సు నాఘ్రాణించి, ఇలా అన్నాడు. 'మహాబాహూ! పదమూడు సంవత్సరాలు గడచిన తర్వాత అర్జున సహితుడవై నీవు, సుయోధనుని సంహరిస్తావు. సందేహం లేదు. భీమా! దుర్యోధనవధ కిది తగిన సమయమని ఎన్నోవిధాల పలికావు. అసత్యం పలకటం నాకిష్టం లేదు. అది నాకు చేతకాదు. భీమసేనా! పాపాత్ముడయిన సుయోధనుని బంధుసహితంగా నీవు మోసం లేకుండానే చంపగలవు.' ఈ విధంగా ధర్మరాజు భీమునితో మాట్లాడుతూ ఉండగానే మహాత్ముడైన బృహదశ్వుడనే మహర్షి అక్కడకు విచ్చేశాడు.

ధర్మరాజు ధర్మవర్తనుడైన ఆ మహర్షిని చూచి, సగౌరవంగా మధుపర్కమిచ్చి, శాస్త్రోక్తంగా పూజ చేశాడు. సేదదీరి ఉపవిష్టుడైన బృహదశ్వమహర్షితో ధర్మరాజు అతిదీనంగా ఇలా పలికాడు. 'భగవన్! పాచికలాడటానికి పిలిచి, మోసగించే ప్రజ్ఞకలిగి, పాచికలాడటంలో నేర్పరులైన జూదగాండ్రు ఆటలో నన్ను పరాజితుని జేసి, నా రాజ్యాన్ని హరించారు. ఆ పాపకర్ములు - అక్షవిద్య తెలియని నన్ను మోసగించి, ప్రాణాధికురాలైన నాభార్యను కూడ సభలోనికి లాక్కువచ్చారు. తిరిగి జూదంలో నన్నోడించి, నారబట్టలతో అతిదారుణమైన వనవాసానికి పంపించారు. చాలా దుఃఖాన్ని పొందుతున్నాం! అతిదారుణమైన మాటలను మరువలేక అరణ్యవాసంలో అనేక బాధల ననుభవిస్తున్నాం! జూదం నాటి మాటలు, నిందావాక్యాలు వింటూ, ఆశ్రితులను మనసులో తలచుకొంటూనే దీర్ఘాలోచన చేస్తూ రాత్రులన్నీ వెళ్ళబుచ్చాం! మా ప్రాణాలన్నీ ఆ అర్జునుని మీదే నిలుపుకొన్నాం. ఇపుడా అర్జునుడు లేకపోవటంవల్ల శక్తిహీనులమయినట్లు ఉన్నాం. ప్రియవాది, మహనీయుడు,

దయామయుడు, అయిన అర్జునుడు దివ్యాస్త్రాలు సంపాదించి తిరిగి రావటం ఉత్సాహంతో ఎప్పుడు చూస్తానో కదా! నావంటి అదృష్టహీనుని ఇతఃపూర్వం మీరెక్కడైనా చూశారా? కనీసం విన్నారా? ప్రబలమైన దుఃఖాన్ని అనుభవిస్తున్న నావంటి పురుషుడు ఉండడనే నే ననుకొంటున్నాను.'

బృహదశ్వ డిలా అన్నాడు. 'మహారాజా! ధర్మజా! మీకంటె ఎంతో ఎక్కువ దుఃఖాన్ని అనుభవించిన మహారాజు ఒకడున్నాడు. వినాలనుకొంటే చెపుతాను.' 'ఇలాంటి దురవస్థను పొందిన మహారాజును గురించి వినగోరుతున్నాను. చెప్పండి!' అని బృహదశ్వుని ధర్మరాజు అడిగాడు. నిషధదేశంలో వీరసేను డనే ప్రసిద్ధుడైన మహారాజు ఉన్నాడు. అతనికి ధర్మార్థాలు బాగా తెలిసిన 'నలుడు' అనే కుమారు డున్నాడు. ఆ నలమహారాజును పుష్కరుడు మోసంతో జయించాడు. తర్వాత ఆ నలుడు రాజ్యభ్రష్టుడై, దుఃఖార్తుడై భార్యతో సహా అరణ్యవాసం చేశాడు. ధర్మరాజా! అరణ్యవాసం చేస్తున్న నలునకు రథం లేదు. అన్నదమ్ములు, బంధుజనం, భృత్యులు ఎవ్వరూ తోడు లేరు. ధర్మజా! ఇక్కడ నీవెంట పరాక్రమవంతులైన నీతమ్ములు, బ్రహ్మకల్పులైన ద్విజశ్రేష్ఠులూ ఉన్నారు. అందుచేత నీ వే మాత్రం దుఃఖింపవలసిన పనిలేదు.' యుధిష్ఠిరుడిలా అన్నాడు. 'మహాత్ముడైన నలమహారాజు చరిత్రను విపులంగా వినాలనుకొంటున్నాను. నలునికథను చెప్పవలసినదిగా ప్రార్థిస్తున్నాను.'

53. హంస సందేశము.

బృహదశ్వ డిలా అన్నాడు. 'పూర్వం వీరసేనమహారాజ పుత్రుడైన నలమహారాజు ఉండేవాడు. అతడు సర్వసద్గుణసంపన్నుడు. బలవంతుడు. మంచి అందగాడు. అంతే కాదు, అశ్వశాస్త్రకోవిదుడు కూడ. నిషధభూపాలుడైన నలమహారాజు అక్షౌహిణి సేన కలిగి ఆనాటి మహారాజులలో మహేంద్రునివలెను, సూర్యభగవానుని వలె తేజస్వినను, వేదవిదుడైన బ్రహ్మణ్యమూర్తిగను ఉండేవాడు. నలుడు పాచికలాటలో ప్రీతికలవాడు, సత్యవాది. సుందర స్త్రీల మనస్సులను కరగించి మైమరపించే రూపం గలవాడు. నలుడు ఉదారుడు. ఇంద్రియాలను జయించినవాడు. ధనుర్ధారులలో శ్రేష్ఠుడు. సాక్షాత్తు మనువువలె లోకరక్షకుడైన వాడే నలుడు. అదేకాలంలో విదర్భదేశాన్ని భీమమహారాజు పరిపాలించేవాడు. అతడు పరాక్రమశాలి, సర్వసద్గుణసంపన్నుడు. సంతానం కావాలనే కోరిక కలవాడు. అయినా వానికి సంతానం కలుగలేదు. భీమమహారాజు సంతానంకోసం అనేకవిధాల ప్రయత్నం చేస్తున్నాడు. ఈ తరుణంలో బ్రహ్మర్షియైన దమనుడు తానే స్వయంగా

భీమరాజు భవనానికి విచ్చేశాడు. సంతానార్థియైన భీమమహారాజు మహారాణితో కలిసి బ్రహ్మతేజస్సుతో ప్రకాశించే దమనమహర్షిని పూజించి, సత్కారాలతో సంతోషపరచాడు. చక్రవర్తి స్వాగత సత్కారాలకు సంతసించిన దమనమహర్షి, భీమమహారాజు పట్ల ప్రసన్నుడై, వారికి ఒక పుత్రికారత్నంతో పాటు, కీర్తి ప్రతిష్ఠలు సముపార్జించే ఉదారస్వభావులైన ముగ్గురుపుత్రులూ కలిగేటట్లు వరాన్ని ప్రసాదించాడు. భీమమహారాజ దంపతులకు, దమనమహర్షి వరప్రభావంతో ఒక కూతురు, ముగ్గురు కుమారులు కలిగారు. పుత్రికకు దమయంతి అని, కొడుకులకు వరుసగా దముడు, దాంతుడు, దమనుడు అనీ పేర్లు పెట్టాడు. వారు భీమపరాక్రములు. దమయంతి రూపతేజో యశస్సౌభాగ్య సంపదలతో తులతూగుతూ, లోకంలో కీర్తి పొందింది. యుక్తవయస్సు రాగానే దమయంతి సర్వాలంకార శోభితయై వందమంది దాసదాసీజనం చేత, వందమంది సఖీజనంచేత సేవలు చేయించుకొంటూ, శచీదేవి వలె శోభిస్తోంది. సర్వాభరణ భూషితయైన దమయంతి సఖులమధ్య మెరుపుతీగవలె శోభిస్తోంది. దమయంతి మహాలక్ష్మివలె విశాలనేత్రాలతో అసాధారణ రూపసంపద కల్గి ఉంది. అంతటి రూపవతి దేవతలలోను, యక్షులలోను లేదనే చెప్పాలి. మానవకాంతలలో ఇంతటి సౌందర్యవతిని ఇతఃపూర్వం చూడలేదు, కనీసం వినలేదు కూడ! ఈమె సౌందర్యసంపద దేవతల మనసులను కూడ సంతోషపరచేది. మానవశ్రేష్ఠుడైన నలమహారాజు కూడా తన లోకోత్తరసౌందర్యంతో సాక్షాత్తు మదనుడే శరీరాన్ని ధరించి వచ్చినట్లు ఉన్నాడు. దమయంతి చెంత సఖులు, కుతూహలంతో నలుని ప్రశంసించేవారు. అదేవిధంగా నలుని చెంత దమయంతి సౌందర్యాతిశయాన్ని పదేపదే ప్రశంసించేవారు. ఒకరి గుణాలను మరొకరు వినటం వలన, వారివారి మనస్సులలో ఒకరియందు మరొకరికి ప్రేమ అంకురించింది. పరస్పరం పుట్టిన ఆ ప్రేమ క్రమక్రమంగా వృద్ధి పొందింది.

నలమహారాజు తనమనస్సులో పుట్టిన కోరికను భరింపలేక, తన అంతఃపురానికి సమీపంలో ఉన్న ఉద్యానవనంలో కొంతసమయం గడపటానికై ఒక్కడూ వెళ్లాడు. ఆ సమయంలో తన ఉద్యానవనంలో సంచరిస్తున్న బంగారు హంసలను చూశాడు. ముచ్చటపడ్డాడు. వాటిలో ఒక హంసను పట్టుకొన్నాడు. ఆ హంస నలమహారాజుతో "రాజా! నన్ను చంపకు. నేను నీకు ప్రియం చేస్తాను. 'నిషధరాజా! దమయంతికి నీగురించి వివరిస్తాను. దమయంతి నిన్ను తప్ప మరొక పురుషుని ఎవ్వరినీ కోరనట్లు నీగురించి చక్కగా దమయంతికి చెపుతాను.' అని పలికింది. ఇలా చెప్పగానే నలమహారాజు హంసను విడిచివేశాడు. ఆ హంస, మిగిలిన హంసలూ ఆకాశమార్గాన పయనించి విదర్భదేశానికి

వెళ్ళాయి. ఆ హంసలు దమయంతి సమీపంలో వాలాయి. దమయంతి ఆ హంసలను చూసింది. చెలికత్తెలతో కూడియున్న దమయంతి, అద్భుత రూపాలు గల ఆ హంసల్ని చూసి చాలా సంతోషించింది. వెంటనే పట్టుకోవటానికి ప్రయత్నించింది. అపుడు, ఆ హంసలన్నీ ప్రమదావనంలో విడివిడిగా పారిపోవటం ప్రారంభించాయి. దాంతో దమయంతి చెలికత్తెలు ఒక్కొక్కరు ఒక్కొక్క హంసను పట్టుకొనటానికి పరుగులెత్తారు. దమయంతి కూడ ఒకహంసను పట్టుకోవటానికి పరుగెత్తింది. అపుడు దమయంతి నుద్దేశించి ఆ హంస మనుష్యవాక్కులతో ఈ విధంగా పలికింది.

'దమయంతీ! నిషధదేశాధిపతి పేరు నలుడు. ఆ నలచక్రవర్తి అశ్వనీదేవతలవంటి చక్కనిరూపం కలవాడు. అంత రూపసంపద మానవులలో మరెవ్వరికీ లేదు. సుందరీ! మన్మథుడే స్వయంగా నలుని రూపంలో అవతరించాడు. ఆ నలమహారాజునకు నీవు భార్యవైతే నీజన్మ, నీరూపసంపద, సఫలం అయినట్లే. మేము దేవతలను, గంధర్వులను, మానవులను, నాగజాతివారిని, రాక్షసులను కూడా చూశాం. కాని, నలుని అంత అందగాడు ఇంతవరకు మాకు కనిపించలేదు. నీవు, స్త్రీలలో రత్నమైతే, అతడు పురుషులలో శ్రేష్ఠుడు(వరుడు). విశిష్టగుణసంపన్నుల కలయిక మహోన్నతగుణ భూయిష్ఠ మవుతుంది.' నలుని గురించి హంస చెప్పినవన్నీ విన్న దమయంతి, "నలునితో కూడ ఈ విధంగానే చెప్ప"మని కోరింది. అదేవిధంగా చేస్తానని పలికి, హంస, నిషధకు తిరిగివచ్చి, నలునకు దమయంతికి సంబంధించిన సర్వవిషయాలూ నివేదించింది.

54. దిక్పాలురు దమయంతీ స్వయంవరమునకు వచ్చుట.

బృహదశ్వ డిలా అన్నాడు. 'ధర్మజా! నలునిగురించి హంస చెప్పిన మాటలను విన్న నాటినుండి దమయంతి, అతనిగురించే చింతిస్తూ అస్వస్థతపాలైంది. దమయంతి నలమహారాజ గురించే ఆలోచిస్తూ దీనురాలైంది. అంతేకాదు, కృశించి వివర్ణవదనంతో నిట్టూర్పులపాలైంది. ఎపుడూ సైకే చూస్తూ, నలమహారాజునే తలచుకొంటూ, పిచ్చిదానివలె కనిపిస్తూ ఉంది. శరీరమంతా పాలిపోయి వివర్ణమైంది. మన్మథావేశం మనసును ఆవరించింది. సరిగ్గా పడుకోవటం లేదు. ఒకచోట కూర్చోదు. భోగాలను అనుభవించే విషయంలో ఏమాత్రమూ ఆసక్తి చూపటం లేదు. రాత్రి కాని పగలు కాని నిద్రించటం లేదు. హాహాకారాలతో వెక్కివెక్కి ఏడుస్తోంది. దమయంతి ఆకృతిని బట్టి ఆమెను పరిశీలించి, అస్వస్థతకు కారణాన్ని చెలికత్తెలు బాగా గమనించారు. వెనువెంటనే, విదర్భదేశాధిపతియైన భీమమహారాజుకు దమయంతి అస్వస్థతకు గల కారణాన్ని, ఆమె సఖులు విన్నవించారు.

దమయంతి సఖులవలన ఆమె నలుని ప్రేమిస్తున్న విషయాన్ని తెలిసికొన్నాడు భీమమహారాజు. తన కుమార్తె స్వస్థత పొందటానికి చేయవలసిన పనిని గురించి ఆలోచించాడు. యుక్తవయస్కయైన తన కుమార్తె విషయం సమీక్షించి విదర్భరాజు, దమయంతికి స్వయంవరం ప్రకటించటమే కర్తవ్య మని భావించాడు. వీరులైన వారంతా దమయంతికి జరుగబోయే స్వయంవరానికి విచ్చేసి, ఆ స్వయంవరసందర్భనానుభూతిని పొందవచ్చునని సకలరాజలోకాన్ని భీమరాజు ఆహ్వానించాడు. దమయంతీ స్వయంవరవృత్తాంతాన్ని విన్న రాజు లందరూ, విచిత్రాలైన దండలు, చూడముచ్చటైన ఆభరణాలు ధరించి, చక్కగా అలంకరింపబడిన తమతమ రథ, అశ్వగజబలాలతో విదర్భకు బయలుదేరారు. భీమశాసనాన్ని శిరోధార్యంగా భావించి బయలుదేరిన రాజలోకం యొక్క గజాశ్వరధఘోషణలు భూమండలమంతా వ్యాపించాయి.స్వయంవరానికి విచ్చేసిన మహారాజులంతా భీమరాజుచే తగిన సత్కారాలు పొంది, విదర్భనగరంలో విడిది చేశారు. ఈ సమయంలోనే మహాప్రాజ్ఞులు, మహావ్రతులు, దేవర్షులూ అయిన నారదపర్వతులు లోకసంచారం చేస్తూ, స్వర్గలోకానికి వచ్చి, స్వాగతం పొంది, ఇంద్రభవనంలో ప్రవేశించారు. నారదపర్వతులను గౌరవించిన ఇంద్రుడు, వారి ఆరోగ్యం, క్షేమ సమాచారాలను గురించి అడిగి తెలిసికొన్నాడు. నారదుడిలా అన్నాడు. 'దేవేంద్రా! మాఇరువురకు అన్నివిషయాల్లోను కుశలమే! మహేంద్రా! భూలోకంలో రాజులంతా క్షేమంగా ఉన్నారు.'

నారదమహర్షి మాటలు విని, ఇంద్రు డీ విధంగా ప్రశ్నించాడు. 'యుద్ధం చేస్తూ మరణించిన ధర్మజ్ఞులైన రాజులు, శస్త్రంచే మరణం సంభవించినపుడు పరాఙ్ముఖులు కానివారు, నావలె శాశ్వతంగా ఈ లోకంలో నివసిస్తారు. అలాంటి పరాక్రమం కల్గిన క్షత్రియు లెక్కడు న్నారో నాకు కన్పించటం లేదు. ఇష్టులై అతిథులుగా వచ్చే రాజులలో అట్టి శూరులు కనిపించుట లేదు.' ఈ విధంగా పల్కిన ఇంద్రునితో, నారదు డిలా అన్నాడు – 'శూరులైన మహారాజులెవ్వరూ కనిపించకుండా ఉండటానికి కారణం నేను చెప్తాను విను. విదర్భదేశాధీశుడైన భీమరాజునకు దమయంతి అనే కుమార్తె ఉన్నది. భూమండలంలో గల స్త్రీలందరినీ, దమయంతి తన రూపసంపదచే మించిపోయింది. మహేంద్రా! ఆ దమయంతీస్వయంవరం త్వరలో జరగబోతోంది. మహారాజులు, రాజపుత్రులు అందరూ అచటకు వెళ్లుతున్నారు. ప్రపంచానికే రత్నంలాంటి ఆ దమయంతిని మహారాజులంతా తమ్ము వరించాలని కోరుతున్నారు.' ఈ విషయాన్ని నారదమహర్షి చెప్పే సమయంలో అమరశ్రేష్ఠులైన లోకపాలురు అగ్నిదేవునితో కలసి, అచ్చటకు వచ్చారు. వారూ నారదుని మాటలు విన్నారు. ఆ గొప్ప విషయాన్ని విన్నవెంటనే, సంతోషంతో, 'మనం కూడ ఆ

స్వయంవరానికి వెడదా' మన్నారు. ధర్మజా! వెంటనే దిక్పాలురైన ఇంద్రాగ్ని యమవరుణులు దమయంతీ స్వయంవరానికి, విదర్భకు పయనమయ్యారు. మహారాజులెందరో స్వయంవరానికి వచ్చారని విని ఆత్మధైర్యంతో, దమయంతిని పొందాలని నలమహారాజు కూడ, బయలుదేరాడు. భూతలానికి చేరుతున్న ఇంద్రాగ్నియమవరుణులు మార్గమధ్యంలోనే, రూపసంపదచే మన్మథునివలె నున్న నలమహారాజును పైనుండి చూశారు. ఆ నలమహారాజును చూసిన లోకపాలురు, సూర్యునివలె ప్రకాశించే అతని సర్వావయవసౌందర్యానికి ఆశ్చర్యపడి, విగతసంకల్పులై నిలిచారు. అపుడు లోకపాలురు తమ విమానాలను అంతరిక్షంలోనే ఆపి, భూతలానికి దిగివచ్చి, నలునితో ఇలా పలికారు. 'నిషధరాజేంద్రా! నలమహారాజా! నీవు సత్యవ్రతుడవు! మానవశ్రేష్ఠుడవైన నీవు మాకు దూతవై సహాయం చేయాలి.'

55. నలుడు అంతఃపురములోని దమయంతికి దేవతల సందేశము చెప్పుట.

బృహదశ్వ డిలా అన్నాడు. 'అలాగే చేస్తానని నలుడు చెప్పాడు. తర్వాత నలమహారాజు వారికి నమస్కరించి ఇలా ప్రశ్నించాడు. 'మీరెవరు? ఎవరి యొద్దకు నేను దూతగా వెళ్ళాలి? మీకోరిక ఏమి? నేనేమి చేయాలి? ఉన్నదున్నట్లు విషయాన్ని చెప్పండి.' నలుని మాటలు విన్నాక, దేవేంద్రుడిలా అన్నాడు. 'మేము అమరులమని తెలిసికో! దమయంతి కొఱకు వచ్చాం. నేను ఇంద్రుడను. ఇతడు అగ్ని, ఇతడు వరుణుడు, ఇతడు యముడు. లోకపాలకులైన ఇంద్రాగ్నియమవరుణులు నిన్ను చూడాలనే కోరికతో స్వయంవరానికి వచ్చారని, మమ్ముగూర్చి దమయంతికి నీవు చెప్పాలి! ఇంద్రాగ్నియమవరుణులు నిన్ను పొందాలని కోరుతున్నారు. వారిలో ఒకరిని భర్తగా వరింపుమని కూడా చెప్పాలి.' ఇంద్రు డీ విధంగా చెప్పిన పిదప, నలుడు రెండుచేతులు జోడించి - "ఒకే ప్రయోజనాన్ని ఆశించివచ్చిన నన్ను దూతగా పంపటం తగదు" - అని పలికాడు. 'ఒకస్త్రీని పొందాలి అని మనసుపడి పురుషుడు ఆ స్త్రీని విడిచిపెడతాడా? ఇతరులకొఱకు ఈ విధమైన దౌత్యం తగునా? దేవతలు మీరు, ఈవిషయంలో నన్ను క్షమించాలి.' దేవతలు ఇలా అన్నారు. 'నిషధరాజా! ఇతఃపూర్వం మావిషయంలో దూతగా వెళ్లటానికి అంగీకరించావు. ఇపు డే కారణంవల్ల చేయనంటున్నావు? వెంటనే వెళ్లాలి.' వా రీ విధంగా అంటే నలుడు మళ్లీ ఇలా పలికాడు. 'భటులచే గట్టిభద్రత ఏర్పాటు చేసిన భవనాలలోనికి ప్రవేశించటానికి నేనెలా ఉత్సాహం చూపుతాను?' "నీవు ప్రవేశింపగల"వని - ఇంద్రుడు, నలునితో తిరిగి చెప్పాడు. నలుడు అలాగే నని పలికి, దమయంతి అంతఃపురానికి వెళ్ళాడు.

అచ్చట రూపసంపదతో ప్రకాశించే పద్మినీజాతికి చెందిన దమయంతిని చూశాడు.

అపుడా విదర్భరాజతనయ దమయంతి, చెలికత్తెలతో కూడి యున్నది. అతిసుకుమారశరీరమూ, సన్నని నడుమూ, మంచి కన్నులూ కల దమయంతి, తన కాంతితో చంద్రుని కాంతిని పరిహసిస్తున్నట్లు ఉంది. చిరునవ్వులు చిందించే దమయంతిని చూడగానే నలుని కోరిక విజృంభించింది. మనసులోని మన్మథుని ఎట్లో భరించాడు. అంతఃపురస్త్రీలు నలుని చూచి, తొట్రుపడి, అతని తేజస్సుకు ఆశ్చర్యపడి తమ తమ ఆసనాల నుండి లేచారు. అంతఃపుర కాంతలంతా నలుని చూచి ఆశ్చర్యచకితలై సంతోషంతో ప్రశంసించారు. నలునితో సంభాషించలేకపోయారు కాని మనస్సులతో మాత్రం గౌరవించారు. ఏమి, ఈ నలుని అపురూపసౌందర్యం! ఏమి ఈతనితేజస్సు! ఏమి ఈతని ధైర్యం! ఈతడెవడు? దేవతా పురుషుడో? యక్షుడో? లేక గంధర్వుడో? అయి ఉంటాడు. అంతఃపుర కాంతలు నలుని తేజస్సుకు బెదరి, సిగ్గుపడి, ఏమీ మాట్లాడలేకపోయారు. ముందుగా చిరునగవు చిందిస్తూ పలుకరించే స్వభావంగల దమయంతి ఆశ్చర్యాన్ని పొంది, వీరుడైన నలునితో ఇలా అంది.

'సుందరాంగా! నాలోని కోరికలను వృద్ధిపొందిస్తున్న నీవు ఎవరవు? అమరునివలె అంతఃపురం చేరావు. వీరుడా! నీవెవరో తెలిసికోవాలని ఉంది! ఇక్కడకు ఎలా వచ్చావు? ఎవరికీ కనిపించకుండా ఎలా ఉన్నావు? రాజు ఉగ్రశాసనుడు. రాజభటులచే సంరక్షింపబడే ఈ అంతఃపురంలోకి నీ వెలా ప్రవేశింపగలిగావు?' దమయంతి ఈ ప్రశ్నలకు నలు డీ విధంగా సమాధానం చెప్పాడు. 'కళ్యాణీ! నాపేరు నలుడు. దేవతల దూతగా నే నిచటకు వచ్చాను. దేవతలైన ఇంద్రాగ్నియమవరుణులు నిన్ను పొందటానికి ఉబలాటపడుతున్నారు. శుభాంగీ! ఆ దేవతలలో ఒకరిని నీపతిగా వరించు. ఆ దేవతల ప్రభావంచేతనే నీఅంతఃపురంలోకి ఎవరికి కనిపించకుండా ప్రవేశింపగలిగాను. నన్ను ఎవరూ అడ్డుపెట్టలేదు. కళ్యాణీ! ఈపనికై దేవతలు నన్ను ఇక్కడికి పంపారు. నేను చెప్పినది విని, నీ బుద్ధికి తోచినట్లు చెయ్యి.'

56. దమయంతి సందేశము.

బృహదశ్వ డిలా అన్నాడు. ఆమె(దమయంతి) దేవతలకు శ్రద్ధగా నమస్కరించి, నలుని చూచి చిరునగవుతో ఇలా పలికింది. 'మహారాజా! నన్ను వివాహమాడు. నీకై నే నేమి చేయగలను. నేనైతే నీవే నా సర్వస్వమని భావిస్తున్నాను. ఈవిషయం నీకు బాగా తెలుసు. ప్రభూ! నన్ను వివాహం చేసుకో. మహారాజా! హంస చెప్పిన మాటలే నన్ను దహిస్తున్నాయి. నీకొఱకే కదా, ఈ రాజులందరు నాచేత ఇచటకు రావింపబడినారు.

నిన్నే ఆరాధించే, నన్ను గూర్చి మరోవిధంగా నీవు చెప్పితే, నీ కారణంగానే మరణించటానికి విష, అగ్ని జల, రజ్జువుల నేర్పాటు చేసికొంటాను.' దమయంతి ఆ విధంగా చెప్పిన తర్వాత, నలు డిలా పలికాడు. 'లోకాలను పరిపాలించే దేవతలే నిన్ను కోరుతూ ఉంటే నీవు మానవమాత్రుడనైన నన్నెట్లు కోరుతావు? మహాత్ములు, లోకపాలకులైన వారి పాదధూళితో సాటిరానివాడను నేను. నీమనస్సు వారిపైనే ప్రవర్తించుగాక! దేవతలకు ఇష్టంగాని పనిచేసిన మానవుడు, మృత్యువును కోరుకొన్నట్లే! సుందరాంగీ! నన్ను రక్షించు. సురశ్రేష్ఠులైన వారిని వరించు. నీవు దేవతలను పొంది, ధూళి సోకని వస్త్రాలు చిత్రాలైన దివ్యమాలికలు, దివ్యాభరణాలూ ధరించి స్వర్గసౌఖ్యా లనుభవించు. ఈ భూమండలాన్నంతనూ కుంచించి మ్రింగగలడు అగ్నిదేవుడు. దేవతలలో ప్రముఖుడైన అగ్నిదేవుని పతిగా వరింపని వారెవరుంటారు? ఎవని దండ భయం వల్ల సమస్త భూతసమూహాలూ కలసి ధర్మాన్నే ఆచరిస్తున్నాయో, అలాంటి యమధర్మరాజును భర్తగా ఎవ్వతె వరింపదు? ధర్మాత్ముడు, మహాత్ముడు, దైత్యులను దానవులను అణచివేయగలిగిన దేవతా ప్రభువైన మహేంద్రుని పతిగా ఏ స్త్రీ వరింపదు? లోకపాలకులలో వరుణునిపై నీకు మనస్సున్నచో నిస్సందేహంగా ఆతనినే వరించు. ఇది మిత్రవాక్యం. నామాట వినుమా.' నలు డీ విధంగా చెప్పిన పిమ్మట, దమయంతి శోకంతో సజలనయనాలతో ఇలా పలికింది.

'దేవత లందరికీ నమస్కరించి నీ కీ సత్యాన్ని చెపుతున్నాను. నేను నిన్నే భర్తగా, సమస్తభూపాలుర ఎదుట వరిస్తాను.' కృతాంజలియై, వణుకుతూ ఉన్న దమయంతితో నలు డిలా అన్నాడు. 'కళ్యాణీ! దూతగా వచ్చిన నాకు, ఏది క్షేమమో నీవే నిర్దేశించు. దేవతలకు, నీవు చెప్పిన విషయాన్ని నేనెలా వినిపించగలను! వారి కొరకై ప్రయత్న మారంభించిన నేను స్వార్థానికి ఎలా ఉత్సహిస్తాను? నాయొక్క స్వార్థం కూడ ధర్మమే అయితే, ఆ విధంగానే చేయగలను! నాకు ఏది క్షేమమైతే దాన్నే విధించు.' అంత దమయంతి చిరునవ్వుతో, కన్నీటితో ఆకులమైన మాటను, నలమహారాజుతో ఇలా పల్కింది. 'మహారాజా! ఏవిధంగా చూసినా మీపట్ల దోషాలులేని, నిరపాయమైన ఒక మంచి ఉపాయం నాకు కన్పించింది. ఇంద్రాది దేవతలును, నీవును అందరును కలసియే, నా స్వయంవరం జరిగే ప్రదేశానికి రండి! మనుజేశ్వరా! స్వయంవరంలోనే, లోకపాలురసన్నిధిలోనే పురుషశ్రేష్ఠుడ నైన నిన్ను వరిస్తాను. ఈ విధంగా వరిస్తే ఏ దోషమూ ఉండదు.' ఈ విధంగా దమయంతి చెప్పినవెంటనే నలమహారాజు లోకపాలురవద్దకు తిరిగి వచ్చాడు. తిరిగివచ్చిన నలుని చూసి, జరిగిన వృత్తాంతాన్నంతా చెప్పవలసినదిగా లోకపాలురు అడిగారు. 'నలమహారాజా! శుచిస్మితయిన దమయంతిని చూశావా? ఆమె మా సందేశానికి ఏమని సమాధానం

చెప్పింది? పుణ్యాత్మా! అంతా వినిపించు.'

నలు డిలా అన్నాడు. 'మీ ఆదేశం ప్రకారం వృద్ధరక్షక భటులచే పరివృతమైన దమయంతి అంతఃపురమందిరాన్ని ప్రవేశించాను. మీ ప్రభావం వల్ల దమయంతి అంతఃపురంలోకి ప్రవేశించే నేను, నరులెవ్వరికీ కనిపించలేదు. మీ ప్రభావంతో దమయంతికి మాత్రమే కనిపించాను. అంతఃపురంలో ప్రవేశించిన తర్వాత చెలికత్తెలు నాకు కనిపించారు. అచటనున్న దమయంతి, ఆమె చెలికత్తెలు నన్ను చూచి ఆశ్చర్యచకిత లయ్యారు. సురశ్రేష్ఠులారా! నేను మీగురించి సవిస్తరంగా వర్ణించి చెప్పినప్పటికీ, దమయంతి మాత్రం నన్నే వరిస్తోంది. "పురుషశ్రేష్ఠుడవైన నీవూ, దేవతలూ కలసియే స్వయంవరం జరిగే ప్రదేశానికి రమ్మ"ని, దమయంతి నాతో చెప్పింది. ఆ దేవతలసన్నిధిలోనే, నిన్ను నేను వరిస్తానని పల్కింది. పైగా ఈ విధంగా వరిస్తే నీపై దోష మేమాత్రం ఉండదనికూడ నాతో చెప్పింది. దేవతలారా! దమయంతి చెప్పిన విషయాన్ని యథాతథంగా మీకు చెప్పాను. ఇకముందు జరుగబోయే దానికి, త్రిదశులైన మీరే ప్రమాణం.'

57. దమయంతీ స్వయంవరము - వివాహము.

స్వయంవరం జరుగవలసిన శుభతిథినాడు భీమమహారాజు స్వయంవరానికి వచ్చిన భూపతు లందరినీ స్వయంవర ప్రదేశానికి ఆహ్వానించాడు. ఆహ్వానం విన్న రాజు లందరూ మదనపీడితులై దమయంతి మీది కోరికతో అతివేగంగా స్వయంవర ప్రదేశానికి చేరారు. సువర్ణస్తంభాలతో మనోహరంగా ప్రకాశిస్తూ, కాంతిమంతమైన తోరణాలు గల ముఖద్వారంతో విరాజిల్లే స్వయంవర సభారంగాన్ని పర్వతగుహలోకి మహాసింహాలు ప్రవేశించినట్లు రాజులంతా ప్రవేశించారు. స్వయంవరసభలో, రకరకాల ఆసనాలున్నాయి. సురభిళ పుష్పమాలలు, మణి కుండలాలు ధరించి రాజులంతా ఆ ఆసనాలపై కూర్చున్నారు. రాజన్యులతో నిండిన ఆ సభాస్థలి నాగులతో నున్న పాతాళంవలె(భోగవతి వోలె)ను, పెద్దపులులతో నిండిన పర్వతగుహవలెనూ శోభిల్లింది. స్వయంవరసభలోనున్న మహారాజుల దృఢమైన బాహువులు ఇనుపగుదియలవలె ఉన్నాయి. నున్నగా మెరిసే వారి ఆకారాలు ఐదుతలల సర్పాల్లా కనబడుతున్నాయి. ముంగురులు, చక్కని నాసికలు, విశాలమైన కనులు, తీర్చిదిద్దిన కనుబొమలు కలిగిన రాజన్యుల ముఖాలు ఆకాశంలోని నక్షత్రాలవలె ప్రకాశిస్తున్నాయి. శుభానన అయిన దమయంతి, తనశరీర లావణ్యంతో రాజుల కన్నులనూ, మనస్సులనూ ఆకర్షిస్తూ, స్వయంవర మండపంలో అడుగుపెట్టింది. రాజశ్రేష్ఠుల దృష్టి ఆ దమయంతి శరీరసౌందర్యం పైబడి అచటనే నిలిచిపోయింది. రాజులందరు ఆమె సౌందర్యాతిశయాన్ని

చూచి నిశ్చేష్టులయ్యారు.

రాజుల యొక్క పేర్లు చెప్పి వారిని గురించి వివరించే సమయంలో దమయంతి ఒకే ఆకృతి గల ఐదుగురు వ్యక్తులను చూసింది. ఒకే రూపంతోనున్న వారందరినీ చూసి దమయంతి, వారిలో నిజమైన నలమహారాజు ఎవరో తెలిసికొనలేకపోయింది. ఆ అయిదుగురిలో ఎవరిని చూసినా ఆమెకు నలమహారాజుగానే తోచింది. అపుడామె విచారిస్తూ తనబుద్ధితో ఇలా తర్కించుకొన్నది. 'ఎవరు దేవతలో, ఎవరు నలమహారాజో ఎలా తెలిసికోవాలి?' అని మిక్కిలి దుఃఖిస్తూ ఆలోచించింది. 'పెద్దవారు చెప్పగా, దేవతలకుండవలసిన లక్షణాలగురించి విన్నాను. ఆ లక్షణాలలో ఏ ఒక్కటీ కూడ, భూమిపైనున్న వీరిలో కనిపించటం లేదే! ' అలా అనేక పర్యాయాలు, బహువిధాల ఆలోచించిన దమయంతి, దేవతలను శరణువేడటాని కిదే సమయమని భావించింది. అంజలి ఘటించి, వాచా మనసా దేవతలకు నమస్కరించి, వినయవిధేయతలతో దమయంతి ఈవిధంగా పల్కింది. "దేవతలారా! హంసలమాటలు విని నలమహారాజును భర్తగా నేను వరించాను. నామాట దక్కించి, ఆ నలుని నాకు ప్రసాదించండి. దేవతలారా! యథార్థంగా నేను మనస్సుతో గాని, వాక్కుతో గాని మరొకనిని భావింపను అనేది సత్య మయితే ఆ సత్యంతో నలుని నాకు ఇచ్చెదరు గాక! దేవతలచేతనే నలమహారాజు నాకు భర్తగా కూర్చబడినాడు. ఇది సత్యం కాబట్టి నలుని నాకు ప్రసాదించండి! నలుని పతిగా ఆరాధించటం అనే వ్రతం ఆరంభింపబడింది. ఇది సత్యం కావున, దేవతలు నలుని నాకు ప్రసాదింతురు గాక! పుణ్యశ్లోకుడైన నలమహారాజును నేను గుర్తించటానికి తగినట్లు, లోకపాలురైన మీరు, మీ మీ రూపాలను పొందుదురు గాక!'

దమయంతి కరుణంగా చేసిన అభ్యర్థనను విని, నలునియందు దమయంతికి గల అనురాగంలోని యథార్థతను, నలునిపై ఆమెకు గల భక్తిని, ప్రేమను, విశుద్ధమైన మనస్సును, సద్బుద్ధిని గ్రహించిన దేవతలు, ఆమె ప్రార్థన నాలకించి, తమ తమ రూపాలు ధరించారు. చెమటలేనిదేహాలు, చలనంలేనినేత్రాలు, వాడని పూలదండలు కలిగి ధూళిరహితులై భూమిని తాకకుండ నిలచిన దేవతలను దమయంతి చూసింది. నలుని ప్రక్కన ఆయన నీడ కూడా ఉంది. పూలదండలు వాడి ఉన్నాయి. చెమట కనిపిస్తోంది. పాదాలు నేలకు ఆని ఉన్నాయి. రెప్పపాటు తెలుస్తోంది. ఈ సూచనలతో నలుని గుర్తించింది దమయంతి. దేవతలను పరిశీలనగా చూసి, పుణ్యశ్లోకుడైన నలునీ చూసి భీమరాజు పుత్రిక దమయంతి ధర్మబద్ధంగానే నిషధరాజయిన నలుని వరించింది. దమయంతి యొక్క సిగ్గు మొగ్గ తొడిగింది. పైట సవరించుకొని, మంగళప్రదమైన

పూలదండను నలునిమెడలో వేసింది. దమయంతి ఇలా నలుని పతిగా వరించింది. వెనువెంటనే అచటనున్న రాజశ్రేష్ఠులనుండి హాహా! అను శబ్దాలు వినబడ్డాయి. ఆశ్చర్యంతో నలమహారాజును ప్రశంసిస్తున్న దేవతలనుండి, మహర్షులనుండి, సాధు, సాధు అనే శబ్దాలు వినిపించాయి. ధర్మజా! ఉత్తమస్త్రీయైన దమయంతిని వీరసేనసుతు డగు నలమహారాజు సంతుష్టమైన అంతరాత్మతో ఊరడించాడు. 'దేవతల ఎదుట నన్ను నీవు భర్తగా పొందావు. అందుచే నీమాట యందు ఆసక్తికలవానినిగా నన్ను తెలుసుకో! తెలినవ్వుల దమయంతీ! నా ఈ దేహంలో ప్రాణా లున్నంతవరకు, నీవిషయంలో ప్రేమతోనే ఉంటాను. ఈ నిజాన్ని నీకు తెలియజేస్తున్నాను.' కృతాంజలియై దమయంతి కూడా తనవాక్కులతో అభినందించింది. పరస్పరానురక్తులై నూతనవధూవరు లయిన నలదమయంతులు అగ్నిహోత్రునితో పాటు ఆ దేవతలనే ఆ సమయంలో శరణు పొందారు. దమయంతి నలుని వరించినందుకు మహాత్ములైన లోకపాలురు సంతోషస్వాంతులై నలమహారాజుకు ఎనిమిది వరాలు ప్రసాదించారు. శచీపతియైన దేవేంద్రుడు సంతోషించి నలునకు శుభప్రదమైన అత్యుత్తమగతిని, యజ్ఞాలు చేసే సమయాన తమ ప్రత్యక్షదర్శనాన్ని అనుగ్రహించాడు. నలుడు కోరిన చోట తానుండేటట్లుగా అగ్ని వరాన్ని ఇచ్చాడు. అంతే కాదు, నలునకు తనకాంతిగల లోకాలను ప్రసాదించాడు. యముడు అన్నరసాన్ని, ధర్మమందు ఉత్తమస్థితిని ప్రసాదించాడు. వరుణుడు, నలుడు కోరిన చోట జలసమృద్ధిని అలాగే పరిమళం కలదండలను అనుగ్రహించాడు. లోకపాలురందరూ కలసి, ఆ పుణ్యదంపతులకు పరిమళంతో కూడిన పూలదండలను ఇచ్చారు. ఇలా ఒక్కొక్కరు రెండేసి వరాలిచ్చారు. దేవతలు నలునకు ఇలా వరాలను ప్రసాదించి, దేవలోకానికి వెళ్ళారు. రాజులంతా దమయంతి వివాహానికి సంతోషించి తమతమ నగరాలకు తిరిగి వెళ్ళారు. స్వయంవరానికి వచ్చిన రాజులంతా తిరిగివెళ్ళితే భీమరాజు ఎంతో సంతోషించి నలదమయంతుల పెండ్లి వైభవంగా జరిపించాడు. నిషధదేశాధిపతి నలమహారాజు, తాను కోరుకొన్నట్లుగా కొంతకాలం విదర్భలో ఉండి, భీమరాజు అనుమతితో భార్యాసహితుడై తననగరానికి వెళ్ళాడు. పుణ్యశ్లోకుడైన నలమహారాజు నారీరత్నమయిన దమయంతిని పొంది శచీదేవితోనున్న దేవేంద్రునివలె ఆనందించాడు. మిక్కిలి సంతుష్టుడైన నలమహారాజు, సూర్యునివలె ప్రకాశిస్తూ, వీరుడై ధర్మమార్గాన పరిపాలన చేస్తూ, ప్రజలను రంజింపజేశాడు. యయాతిమహారాజువలె ధీమంతుడైన నలుడు భూరిదక్షిణలతో ఇతర క్రతువులతోపాటు అశ్వమేధయాగాన్ని కూడ చేశాడు. రమణీయమైన వనాల్లో, ఉద్యానవనాల్లో, దేవతుల్యుడయిన నలుడు, దమయంతితో సహా విహరించాడు. అనంతరం నలమహారాజుకు దమయంతి యందు ఇంద్రసేనుడనే

కుమారుడు, ఇంద్రసేన అనే పుత్రిక జన్మించారు. ఈ విధంగా నలమహారాజు యజ్ఞాలు చేస్తూ విహరిస్తూ, వసుధాధిపుడుగా సిరిసంపదలతో తులతూగేటట్లు పృథ్విని పరిపాలించాడు.

58. నలుని సద్గుణములను విని కలి కోపించుట.

బృహదశ్వ డిలా అన్నాడు. 'దమయంతి నలుని వరించిన తర్వాత లోకపాలురు తిరిగి వెళ్తూ కలితో కలిసి వస్తున్న ద్వాపరుని చూశారు. ఇంద్రుడు, కలిని చూసి - "కలీ! ద్వాపరునితో కలసి ఎచ్చటకు ఎందుకు వెళ్తున్నావో చెప్పుమ"ని అడిగాడు. 'నామనస్సు దమయంతి యందు లగ్నమైంది. దమయంతీ స్వయంవరానికి వెళ్ళి ఆమెను వరిస్తాను' అని ఇంద్రునితో కలి అన్నాడు. ఇంద్రుడు పెద్దగా నవ్వి, "దమయంతీ స్వయంవరం పూర్తయింది. మా సమక్షంలోనే దమయంతి నలమహారాజును భర్తగా వరించింది" - అని కలితో చెప్పాడు. ఇంద్రు డీ విధంగా చెప్పగానే క్రోధంతో కలి దేవతలను దగ్గరకు పిలచి, ఇలా అన్నాడు. 'దేవతలమధ్య, ఒకమానవుని దమయంతి పతిగా స్వీకరించడమా! అందులకామె, పెద్దశిక్ష పొందటమే న్యాయం.'

కలిపురుషుడీవిధంగా అనగానే దేవత లిలా పలికారు. " మేము అనుమతిస్తేనే దమయంతి నలుని వరించింది. సకలగుణోపేతుడైన నలమహారాజును ఏ స్త్రీ వరించకుండా ఉంటుంది. నలమహారాజు సకల వేద ధర్మాలు తెలిసినవాడు. ధర్మమార్గంలో ప్రవర్తించటమే అతని వ్రతం. నాలుగు వేదాలను అధ్యయనం చేశాడు. కలీ! ఆతని గృహంలో జరిగే యజ్ఞాల్లో దేవతలు నిత్యతృప్తులై ఉంటారు. అహింసానిరతుడు. సత్యాన్నే పలుకుతాడు. దృఢవ్రతుడు, సమర్థత, ధైర్యం, జ్ఞానం, తపస్సు, శౌచం, దండోపాయం, శాంతస్వభావం - లోకపాలురతో సమంగా నలమహారాజులో ఉన్నాయి. ఇట్టి మహారాజును ఎవరైనా శపించాలనుకొంటారా? అట్టివాడు తన్ను తాను శపించుకొని, చంపుకొనే మూర్ఖుడే అవుతాడు. మంచిగుణాలు కల్గిన నలుని శపించటానికి సిద్ధపడినవారిని, అతిక్లిష్టమైన నరకంలో లోతయిన నదిలో ముంచుతారు.' కలికిని, ద్వాపరునకును అలా చెప్పి, దేవతలు స్వర్గానికి వెళ్ళారు. దేవతలు వెళ్ళిన పిదప, ద్వాపరునితో కలి ఇలా అన్నాడు. "ద్వాపరా! నలునిమీది కోపం చంపుకోలేకపోతున్నాను. నేను నలునిలో నివసిస్తాను. ఆవేశిస్తాను. నలుని రాజ్యభ్రష్టునిగా జేసి, దమయంతితో సుఖపడకుండా చేస్తాను. నీవు కూడ పాచికల నావహించి నాకు సహాయపడు"అని కోరాడు.

59. కలి ఆవేశించిన నలుడు పుష్కరునితో జూదమాడుట.

ద్వాపరునితో కలి ఒప్పందం చేసుకొనిన పిమ్మట నిషధమహారాజు దగ్గరకు వెళ్లాడు. కలి నిషధనగరం చేరి అవకాశం కోసం వేచి ఉన్నాడు. పంద్రెండవ సంవత్సరంలో కలికి అవకాశం ఏర్పడింది. నలమహారా జొకనాడు మూత్రవిసర్జన చేసి, కాళ్లుకడుక్కోకుండా సంధ్యోపాసన చేశాడు. ఇదే సమయాన అశుచియైన నలునిలో కలి ప్రవేశించాడు. ఆలా కలి నలుని ఆవేశించి, పుష్కరుని దగ్గరకు వెళ్ళి, నలునితో పాచికలాడుమని చెప్పాడు. 'నీవు నాతోకలసి పాచికలాడి నలుని జయిస్తావు. నలుని జయించి నిషధరాజ్యాన్ని పొందు.' కలి ఈవిధంగా చెప్పగానే పుష్కరుడు నలుని చేరాడు. కలియే పాచికలరూపం దాల్చి పుష్కరుని చేరాడు. శత్రుంజయుడగు పుష్కరుడు నలుని చెంతకు వచ్చి పాచికలాటకు రమ్మని పలుమార్లు పలికాడు. పుష్కరుడు నలుని సోదరుడు. విజ్ఞుడైన నలమహారాజు ఆ ఆహ్వానాన్ని విని ఊరుకోలేకపోయాడు. దమయంతి చూస్తూ ఉండగానే పందెం వేయటానికి సిద్ధపడ్డాడు. కలి ఆవహించి యున్నందున తనకు సంబంధించిన ధనకనక వస్తువాహనగృహ వస్త్రాదులను నలుడు జూదంలో ఓడాడు. పట్టుదలతో ఆటను కొనసాగిస్తున్న నలుని ఏ మిత్రులూ ఆపలేకపోయారు.

అపుడు మంత్రులతో కలిసి పురజనులంతా కష్టాల్లో ఉన్న రాజును జూదం నుండి నివారించటానికి, చూడటానికి వచ్చారు. పిమ్మట సూతుడు వచ్చి "కార్యార్థులైన పురజనులు ద్వారం చెంత వేచియున్నా"రని దమయంతికి తెలియజేశాడు. ధర్మార్థదర్శనుడైన మహారాజు వ్యసనాన్ని సహించలేక ప్రజలంతా వచ్చినట్లు మహారాజుకు తెలియజేయవలసినదిగా దమయంతికి నివేదించాడు. అపుడు దమయంతి దుఃఖంతో, శోకతప్తమైన మనస్సుతో, కన్నీటితో, గద్గద స్వరంతో నైషధునికిలా చెప్పింది. "మహారాజా! పురజనులందరూ మంత్రులతో కలసి, రాజభక్తితో తమ దర్శనార్థమై వచ్చి ద్వారం దగ్గర ఉన్నారు. వారిని మీరు చూడాలి" అని పలుమారు చెప్పింది. కలి ఆవేశించిన నలుడు అలా విలపిస్తున్న దమయంతితో ఏమీ మాటాడలేదు. మంత్రులూ, పురజనులూ అంతా "ఇక ఇతడు మనకు దక్కడు" అనుకొని దుఃఖార్తులై సిగ్గుతో తమ ఇళ్లకు వెళ్లిపోయారు. ధర్మరాజా! అలా పుష్కరునకు, నలునకు ఎన్నో నెలలపాటు పాచికలాట సాగింది. పుణ్యశ్లోకుడైన నలుడు ఓడిపోయాడు.

60. దమయంతి తన సంతానమును కుండినపురమునకు పంపుట.

తర్వాత దమయంతి జూదంలో పిచ్చిపట్టినవానివలె ఉన్న పుణ్యాత్ముడయిన నలుని చూసి భయమూ, శోకమూ కలిగినా కనపడనీయక స్తిమితంగా నలవిషయంలో తన కర్తవ్యాన్ని గురించి ఆలోచించింది. దమయంతి పాపాన్ని శంకిస్తూనే నలునికి ప్రియం చెయ్యాలని కోరి, నలుడు సర్వస్వాన్ని పోగొట్టుకొన్నట్లు తెలిసి.... యశోవతీ, హితురాలూ, సర్వవిషయాలలోనూ నేర్పరియు, తమపట్ల అనురాగంగలదీ, మాటకారీ యైన పరిచారిక బృహత్సేన నుద్దేశించి – ఇలా దమయంతి పల్కింది. 'బృహత్సేనా! మంత్రులను రావించి, జూదంలో పోయినదిగాక మిగిలిన ధనం ఎంతో ? తెలుపుమని రాజాజ్ఞగా చెప్పు.' అపుడు మంత్రులందరు నలుని శాసనాన్ని విని 'మన అదృష్టమెట్లున్నదో' అని మహారాజును చేరారు. వారందరు రెండవపర్యాయం దమయంతి చెంతకు వచ్చారు. దమయంతి కూడ మరోసారి నలునకు నివేదించింది. కాని అతడు ఆమోదించలేదు. తనమాటను ఆమోదించని భర్తను చూచి దమయంతి సిగ్గుతో అంతఃపురానికి వెళ్ళింది. జూదం నలునకు ప్రతికూలంగా ఉన్నట్లు, నలుని సర్వస్వం హరింపబడినట్లు తెలిసింది. బృహత్సేనను పిలిచి వెంటనే నలుని ఆజ్ఞగా తెల్పి, రథసారధియైన వార్ష్ణేయుని తోడ్కొని రమ్మని పంపింది.

ఆ దమయంతి మాటలు విన్న బృహత్సేన వార్ష్ణేయుని తోడ్కొని వచ్చింది. ఆప్తులైన పురుషులతోనున్న వార్ష్ణేయునితో దేశకాలపరిస్థితులను, ప్రాప్తకాలాన్ని గుర్తించిన దమయంతి సాంత్వనవాక్కులతో ఇలా పలికింది. 'వార్ష్ణేయా! మహారాజు మంచిస్థితిలో ఉన్నప్పుడు నీవిషయంలో ఎలా వుండేవారో నీకు తెలుసు కదా! విషమస్థితిలోనున్న మహారాజునకు సహాయం చేయటానికి నీవే తగినవాడవు. పుష్కరుని చేతిలో ఓడిపోయినపుడల్లా మహారాజునకు పాచికలాటపై ఆసక్తి పెరుగుతోంది. పుష్కరుని పాచికలు ఆతనికి అధీనాలై ప్రవర్తిస్తున్నాయి. నలుని పాచికలు అభీష్టానికి వ్యతిరేకంగా పడుతున్నాయి. మహారాజు తనవారి మాటలనూ, మిత్రుల మాటలను, చివరకు నామాటలనూ జూదంపై వ్యామోహంతో పెడచెవిని పెడుతున్నారు. ఈ విధంగా మా మాటలను అభినందించకపోవటం కేవలం మహాత్ముడైన మహారాజు దోషమని నేను భావింపను. ఎందుకో! రాజు మోహంతో నామాటకూడా వినటంలేదు. సారథీ! నామనస్సు నిర్మలంగా లేదు. ఎపుడయినా భావంకూడ మారవచ్చు. కాని నిన్నిపుడు శరణు వేడుతున్నాను. నామాట ప్రకారం చేయి. నలునకు ప్రీతిపాత్రమై మనోవేగంతో వెళ్ళే గుర్రాలను రథానికి పూన్చి మాపిల్లలైన ఇంద్రసేనుని, ఇంద్రసేనను రథంపై కూర్చుండబెట్టి కుండిననగరానికి తీసుకొనివెళ్ళాలి. నాజ్ఞాతులవద్ద(తల్లిదండ్రులచెంత) ఈ పిల్ల లిద్దరిని

ఉంచి రథాశ్వసహితంగా నీవు యథేచ్ఛగా అక్కడే ఉండు. లేదంటే మరెక్కడికైనా వెళ్ళు.' నలసారథియైన వార్ష్ణేయుడు దమయంతి చెప్పిన విషయాన్నంతా నలమహారాజుయొక్క ముఖ్యులైన మంత్రులకు నివేదించాడు. ధర్మరాజా! మంత్రులతో కలసి చర్చించి ఒకనిర్ణయానికి వచ్చి వారి అనుమతిని పొంది, వార్ష్ణేయుడు పిల్లలిద్దరినీ రథంపై ఎక్కించుకొని విదర్భ చేరి భీమమహారాజునకు నలుని విషయాన్ని తెలిపి ఇంద్రసేనను, ఇంద్రసేనుని వారిచెంతనే ఉంచి, గుర్రాలను రథాన్ని కూడ కుండిన నగరంలోనే వదలి తిరిగి, తిరిగి, వార్ష్ణేయుడు అయోధ్యకు వెళ్ళాడు. దుఃఖంతో వార్ష్ణేయుడు ఋతుపర్ణమహారాజు చెంతకు చేరాడు. వారికి రథసారథియై జీవనభృతిని పొందాడు.

61. నలదమయంతులు అడవుల పాలగుట - నలుని వస్త్రాపహరణము.

బృహదశ్వ డిలా అన్నాడు- వార్ష్ణేయుడు విదర్భకు వెళ్ళిన తర్వాత పుష్కరుడు నలుని రాజ్యమూ, ఇతర ధన సంపదలుకూడ ఏ కొంచెమూ మిగల్చకుండా హరించాడు. రాజ్యసంపదలను కోల్పోయిన నలుని చూసి పుష్కరుడు పరిహాసం చేస్తూ పందెం పెట్టటానికి ఏమైనా ఉంటే జూదానికి రావచ్చు నని పల్కాడు. 'నీకు దమయంతి మాత్రమే మిగిలియున్నది. మిగిలినదంతా నాచే జయింపబడింది. దమయంతిని పణంగా పెట్టే తలంపు ఉంటే ఆట సాగించు'. పుష్కరు డీ విధంగా అనగానే నలునిహృదయం కోపంతో కోసేసినట్లయింది. అయినా పుష్కరునితో ఏమీ అనలేదు. తర్వాత యశస్వియైన నలుడు మిక్కిలి కోపంతో తనశరీరంమీద ఉన్న ఆభరణా లన్నింటిని తొలగించాడు. నలమహారాజు సకలసంపదలను వదలి ఒకేబట్ట చుట్టుకొని మిత్రులకు దుఃఖాన్ని పెంచుతూ బయలుదేరాడు. దమయంతి నగరాన్ని విడచివెళ్తున్న నలుని వెంట కట్టుబట్టలతో బయలుదేరింది. పట్టణాన్ని వీడిన నలుడు దమయంతితో కలసి మూడు రాత్రులు మాత్రమే ఉన్నాడు. మహారాజైన పుష్కరుడు "నలునితో స్నేహంగా ఉండేవారు వధింపదగినవారే" అని చాటించాడు. ధర్మజా! విద్వేషపూరితమైన పుష్కరుని మాటలు విన్న పౌరులు నలుని గౌరవించలేదు. సత్కారార్హుడయినా సత్కారం పొందకుండా నగరానికి వెలుపలే నలుడు మూడురాత్రులు నీటిని త్రాగి గడిపాడు. నలుడు ఆకలిబాధతో వృక్షాలనుండి ఫలాలను కోసుకొని తింటూ బయలుదేరాడు. దమయంతి కూడ అతనిని అనుసరించింది.

చాలా రోజులుగా ఆకలిగొన్న నలునకు ఒక రోజున బంగారుకాంతులీనే రెక్కలున్న కొన్నిపక్షులు కనిపించాయి. 'ఈపక్షులు నాకు ఆహారం అవుతాయి. బంగారం కూడ లభిస్తుంది' అనుకొన్నాడు. నలుడు తన ఉత్తరీయాన్ని పక్షులపైకి విసిరాడు. ఆ పక్షులు

వస్త్రాన్ని తీసికొని ఆకాశానికి ఎగిరిపోయాయి. దిగంబరుడై తలవంచుకొని దైన్యంతో నున్న నలునిచూచి ఆకాశాని కెగిరే పక్షులు ఈ విధంగా పలికాయి. "బుద్ధిహీనుడా! మీరు కట్టుబట్టలతో వెళ్లుతూఉంటే మాకు సంతోషంగా లేదు. దిగంబరుడవైన నిన్ను చూచి సంతోషించటానికి నీవస్త్రాలను అపహరించాలని వచ్చిన పాచికలం మేము" అని ఆ పక్షులు పలికాయి. తనసమీపంలోనున్న పాచికలను చూచి దిగంబరుడైన నలుడు దమయంతితో ఇలా అన్నాడు - దమయంతీ! ఈపాచికల కోపంవలననే మన మీ విధంగా సకలసంపదలను కోల్పోయాము. ఆకలిబాధతో దుఃఖితులమై ప్రాణాలను నిల్పుకోలేకున్నాము. వీనిమూలంగానే నిషధప్రజల గౌరవాన్ని పొందలేకపోయాం. పాచికలే పక్షులరూపంలో వచ్చి నావస్త్రాన్ని కూడ అపహరించాయి. అత్యంతవిషమపరిస్థితిని పొంది దుఃఖిస్తూ చంచలమైన మనస్సుతో దమయంతితో ఇలా చెప్పటం ప్రారంభించాడు. "నీభర్తగా నీకు హితాన్ని కల్గించే మాట చెపుతున్నాను. ఈత్రోవలన్నీ ఋక్షవంత పర్వతాన్ని దాటి, అవంతీ నగరాన్ని దాటి దక్షిణాపథానికి వెళ్ళేవి. ఇది వింధ్యపర్వతం. ఇది పయోష్ణినది. అనేక కందమూలఫలాలచే సుసంపన్నమైన ఈ ప్రాంతంలో మహర్షుల ఆశ్రమాలున్నాయి. ఇది విదర్భరాజ్యానికి మార్గం. ఈ మార్గం కోసలరాజ్యానికి పోతుంది. ఆ తర్వాత దక్షిణంలో నున్న దేశమంతా దక్షిణదేశమే! ధర్మజా! బాధాతప్తహృదయుడైనప్పకీ దమయంతిని ఓదారుస్తూనే నలుడు ఆమెతో ఈమాట చాలాసార్లు అన్నాడు.

దుఃఖభారంతో కన్నీరు కారుస్తూ, జాలిగొలిపే మాటలతో దమయంతి నలునితో ఇలా పలికింది. 'మహారాజా! మీసంకల్పం విన్న నాహృదయం దహించుకుపోతోంది. శరీరావయవాలు స్తంభిస్తున్నాయి. రాజ్యాన్ని, సంపదలనూ కోల్పోయి ఆకలితో శ్రమపడుతూ వివస్త్రులైన మిమ్ము విడచి నేనెలా వెళ్ళగలను. ఆకలిబాధతో అలసిపోయి గతసుఖాలను గూర్చి ఆలోచించే మీకు, ఈ ఘోరారణ్యంలో బాధను పొగొట్టగలదానను నేను మాత్రమే. సమస్తదుఃఖసమయాల్లోను ఓదార్పుగల భార్యతో సమానమైన మందు మరేదీ లేదని వైద్యులు చెప్పిన సత్యాన్ని మీకు చెపుతున్నాను.' 'దమయంతీ! బాధాతప్తులైనవారికి భార్యతో సమానమైన మిత్రుడుగాని, ఆమెతో సమానమైన మందుగాని లేదు. దమయంతీ! నిన్ను విడచి వెళ్ళాలనే కోరిక నాకున్నట్లుగా నీవు అనుమానపడుతున్నావు. నన్నైనా నేను విడుస్తాను కాని నిన్ను విడిచిపెట్టను.' అన్నాడు నలుడు. దమయంతి ఇలా అన్నది - 'మహారాజా! నన్ను విడచివెళ్ళాలనే కోరిక మీకు లేనట్లయితే విదర్భరాజ్యానికి వెళ్ళేమార్గం గురించి నాకెందుకు చెప్పారు? మహారాజా! నన్ను విడచి వెళ్ళరని నేనెరుగుదును కాని బుద్ధి పెడదారి పట్టి నన్ను విడిచి వెళ్ళకండి. రాజా! విదర్భ, కోసలరాజ్యాలకు దారులను

నాకు చెప్పటంవల్ల నాకు మరింత దుఃఖం పెంచుతున్నారు. మహారాజా! విదర్భలో మాజ్ఞాతుల దగ్గర ఉండాలనుకొంటే ఇద్దరం కలసివెళదాం! విదర్భరాజు మిమ్మల్ని గౌరవిస్తారు. వారిచే పూజింపబడుతూ సుఖంగా మనయింట్లో ఉండవచ్చు.'

62. నిద్రించుచున్న దమయంతిని విడిచి నలుడు వెళ్లిపోవుట.

నలు డిలా అన్నాడు. 'దమయంతీ! మీతండ్రిగారి రాజ్యం నీకెంతో నాకు కూడ అంతే! సందేహం లేదు. కాని ఈ విషమస్థితిలో వెళ్ళలేను. సమృద్ధస్థితిలో వెళితే నీ సంతోషాన్ని అతిశయింప జేసేవాణ్ణి. రాజ్యభ్రష్టుడనై ఉన్న ఈ స్థితిలో వెళ్తే, నీ దుఃఖాన్ని అతిశయింప జేసినవాడ నవుతాను. బృహదశ్వ డిలా అన్నాడు- పైవిధంగా పల్కుతూ నలుడు సగం చీరతోనున్న దమయంతిని పలుమార్లు ఊరడించాడు. ఒకే వస్త్రం చుట్టబెట్టుకొని ఆకలిదప్పులతో అలసిన వారు ఒకసభలోకి (విశ్రాంతి మందిరం) వెళ్లారు. సభలోనికి వెళ్ళి నిషధాధీశుడు దమయంతితోపాటు నేలపై కూర్చున్నాడు. వివస్త్రుడై, ధూళితో కప్పబడిన నలుడు అలసిపోయి నేలపైనే దమయంతితో పాటు నిద్రించాడు. నలునిమాటలు విన్న సుకుమారి దమయంతి దుఃఖిస్తూనే నిద్రలోకి జారింది. దమయంతి నిద్రిస్తోంది. కాని శోకసంతప్తహృదయుడైన నలునికి మాత్రం పూర్వం వలె నిద్ర పట్టలేదు. రాజ్యం అపహరింపబడటం, మిత్రులను విడవటం, వనంలో జరిగిన అవమానం – అన్నీ గుర్తుకువచ్చి అతడు చింతాక్రాంతు డవుతున్నాడు. 'ఇది చేస్తే ఏమవుతుంది? చేయకపోతే ఏమవుతుంది? అనేది తెలియటం లేదు. స్వజనాన్ని విడిచిపెట్టడమా? లేక మరణించటమా? ఏది శ్రేయస్సో తెలియటంలేదు. నాయందు అనురక్తయైన దమయంతి నామూలంగా దుఃఖాన్ని పొందుతోంది. నేను లేకుంటే, ఈమె ఎప్పుడైనా తనవారిని చేరుతుంది. నాతోనే ఉంటే దమయంతి దుఃఖాన్ని పొందుతుం దనటంలో సంశయంలేదు. విడిచివెళితే ఏకొంచెం సుఖాన్నైనా పొందవచ్చుననే సంశయం కలుగుతోంది.' ఇలా నిశ్చయించి కూడా మరల మరల ఆలోచించి నలుడు, దమయంతిని విడిచివెళ్ళడమే మంచిదని భావించాడు. యశస్విని, సాధ్వి అయిన దమయంతి – సహజతేజస్విని అవటంచేత ఎవ్వరిచేతనూ అవమానింపబడదని తలచాడు.

ఇలా దమయంతిని విడిచివెళ్ళాలనే తలచాడు. కలిచే ప్రేరితుడైన నలునకు దమయంతిని విడిచే విషయంలో పైవిధమైన దుష్టభావమే కలిగింది. వస్త్రహీనుడైన నలుడు దమయంతి ఏకవస్త్ర యైనప్పటికి, ఆమెచీరలో సగం కట్టుకోవటానికి సన్నద్ధు డయ్యాడు. తన భార్య దమయంతి చీరనెలా కత్తిరించాలో తెలియక తికమకపడుతూ

అటూఇటూ కొంతసేపు ఆ సభలో తిరిగాడు నలుడు. ఈ ప్రకారంగా అటూఇటూ తిరిగే నలునకు ఆ సభాప్రాంగణంలో ఒరలేని కత్తి ఒకటి లభించింది. నలుడు ఆ కత్తితో దమయంతి చీరను చింపి, ఆ చీరముక్కను కట్టుకొని, నిద్రించే దమయంతిని విడిచి వెళ్ళాడు. దమయంతి నుండి మనస్సు మరల్చుకొని, తిరిగి ఆ సభకు వచ్చి ఆమెను చూస్తూనే నలుడు ఏడ్చాడు. 'ఇతఃపూర్వం నాప్రియసతిని సూర్యుడుగాని, వాయువుగాని చూడలేదు. అసూర్యంపశ్య వంటి దమయంతి నేడు కటికనేలపై అనాధవలె నిద్రిస్తోంది. చారుహాసినియైన దమయంతి లేచి చింపిన చీరను చూసుకొని పిచ్చిదానివలె అవుతుందేమో? విషయం తెలిసికొని ఏమి కాగలదో? నేను లేకుండా దమయంతి ఒంటరియై క్రూరమృగాల నిలయమైన ఈ ఘోరారణ్యంలో ఎలా సంచరింపగలదు? దమయంతీ! నీవు ధర్మపరాయణవు! అందుకే ఆదిత్యులు, వసువులు, రుద్రులు, అశ్వినీదేవతలు, మరుద్గణాలు నిన్ను రక్షిస్తారు.' తన ప్రియురాలిని గురించి, ఆమె రూపాన్ని గురించి తలచి, కలిప్రభావంతో అజ్ఞానియై ముందుకు నడచాడు. కొంతదూరం వెళ్ళాక నలుడు తిరిగి వచ్చేవాడు. ఒకవైపు కలి ముందుకు లాగుతున్నాడు. మరోవైపు ఆమెమీది ప్రేమ వెనుకకు లాగుతోంది. దుఃఖిస్తున్న నలునిహృదయం ఊయలలా అటుఇటు సభలోంచి అడవిలోకి, అడవిలోంచి సభకూ ఊగిసలాడింది. కలిప్రభావంచే మోహితుడైన నలుడు బహువిధాల రోదించి, నిద్రించే దమయంతిని వదలి వెళ్ళాడు. కలిస్పర్శతో జ్ఞానం కోల్పోయాడు. జరుగబోయేదానిని లెక్కచేయలేదు. దమయంతిని ఒక్కతినే శూన్యవనంలో వదలి నలుడు విచారిస్తూనే వెళ్ళాడు.

63. దమయంతి పాతివ్రత్యప్రభావముతో వ్యాధుడు మరణించుట.

నలుడు వెళ్ళినతర్వాత బడలికతీరిన దమయంతి మేల్కొంది. జనరహితమైన అరణ్యంలో భర్త కనబడలేదు. భయపడింది. ఏడ్చింది. మహారాజా! అని పెద్దగా అరచింది. 'హా! నాథా! హా! మహారాజా! హా స్వామీ! నన్ను విడిచివెళ్ళావా? చచ్చాను. అన్నీ పోయినట్లే. ఈనిర్జనవనంలో ఎంతో భయం వేస్తోంది. నన్ను విడువ నని పలికావు. నిద్రించే నన్ను విడిచి వెళ్ళావు. ధర్మజ్ఞుడవు, సత్యవచనుడవు – ఎలా వెళ్లావు? దక్షురాలై నిన్ను అనుసరించే భార్యను వదలి ఎలా వెళ్లగలిగావు? సైగా ఏ అపకారమూ చేయని నీభార్యకు పరులు అపకారం చేసే సమయంలో వెళ్లిపోయావు. ఇంద్రాగ్ని యమవరుణులనే లోకపాలుర యెదుట నావిషయంలో నీవు పూర్వం చెప్పినమాటలను ఇప్పుడు ఆచరణలో పెట్టగలవా? పురుషశ్రేష్ఠా! మానవులకు అకాలంలో మృత్యువు రాదు. అటువంటప్పుడు నీచే విడిచిపెట్టబడిన

నీభార్య క్షణకాలమైనా జీవిస్తుందా? పురుషశ్రేష్ఠా! ఇంతవరకు చేసిన పరిహాసం చాలు! నేను చాలా భయపడుతున్నా! దర్శనభాగ్యాన్ని కల్గించు. చూస్తున్నావు! చూస్తున్నావు! మహారాజా! ఇదిగో కనిపించావు. పొదలతో బాగా కప్పుకొని నాతో ఎందుకు మాట్లాడటం లేదు. మహారాజా! అరణ్యంలో విలపిస్తూ ఈ స్థితిలోనున్న నన్ను కలసి ఎందుకు ఓదార్చవు! క్రూరుడవా? నాగురించి నేనేమీ దుఃఖించటం లేదు. ఒక్కరూ మీ రేవిధంగా ఉండగలరో అని మీగురించే విచారిస్తున్నాను. మహారాజా! ఆకలిదప్పులతో, శ్రమతో అలసినమీరు సాయంసమయాన చెట్లక్రింద నన్ను కానక ఎలా ఉంటారో కదా!' దమయంతి ఎంతగానో విచారించింది. కోపంతో హృదయాగ్ని రగిలింది. అటూ ఇటూ పరుగులిడుతూ ఏడ్చింది. క్షణకాలం పైకి ఎగురుతోంది. మరుక్షణంలో క్రింద పడుతోంది. ఇంకో క్షణంలో భయపడుతోంది. ముడుచుకుపోతోంది. భయంతో వెక్కివెక్కి ఏడుస్తోంది. దమయంతి శోకసంతాపాలతో మాటిమాటికీ నిట్టూరుస్తూ ఏడ్చింది. కొంతసేపటికి పతివ్రతయైన దమయంతి ఓ నిట్టూర్పు విడిచి ఇలా అన్నది. 'ఎవడు వేసిన నిష్కారణనింద వల్ల నలు డీ విధంగా దుఃఖార్తుడై బాధ ననుభవిస్తున్నాడో ఆతనికి మేం అనుభవించే దుఃఖంకంటే అధిక దుఃఖం కలుగుగాక! ఏపాపం ఎరుగని నలునివిషయంలో ఇట్టి పాపకర్మ నాచరించినవాడు ఇంతకంటె అధికదుఃఖాన్ని పొంది కష్టాలతో జీవించుగాక!'

ఇలా దమయంతి విలపిస్తూ క్రూరమృగాలతో నిండిన అరణ్యంలో తన భర్తను వెదకుతూ పిచ్చిదానివలె ఏడుస్తూ అటు ఇటూ తిరుగుతోంది. హా మహారాజా! అని అంటూనే మాటిమాటికి అటూ ఇటూ పరుగులు తీస్తోంది. దారితప్పిన ఆడమేకవలె దమయంతి ఆక్రందన చేస్తూ మాటిమాటికి విచారిస్తోంది. అదే సమయంలో ఆకలితోనున్న ఒకకొండచిలువ అతిశీఘ్రంగా సమీపానికి చేరి త్వరగా దమయంతిని పట్టుకొంది. కొండచిలువ తన్నుపట్టినా శోకం పొంగిపొరలి వస్తున్నా నలుని గురించి దుఃఖిస్తున్న దమయంతి తన్ను గూర్చి దుఃఖించటం లేదు. 'నాథా! నిర్జనారణ్యంలో అనాథగానున్న నన్ను ఒకపెద్దపాము పట్టుకొని తినబోతోంది. ఈదుఃస్థితిలో కూడ నీవు నా దగ్గరకు పరుగెత్తి రావు ఎందువల్ల? మహారాజా! నన్నీ నిర్జనారణ్యంలో విడచి వెళ్ళిన నీవు మళ్ళీ నన్ను గుర్తు తెచ్చుకొని ఎలా ఇక్కడకు వస్తావు? రాజా! నీవు పాపరహితుడవు. పాపాలనుండి విముక్తుడవై పూర్వపుబుద్ధిని, అంతఃకరణను, ధనాన్ని తిరిగిపొంది, ఆకలిబాధతో అలసిపోయి బడలియున్న నిన్ను ఆదుకొని నీ శ్రమను ఎవరు పోగొట్టగలరో కదా!' దమయంతి ఇలా ఆలోచిస్తూనే ఆ అరణ్యంలో పెద్దగా అరచింది. అదివిన్న బోయవాడొకడు వెంటనే అచ్చటకు చేరాడు. కొండచిలువచే పట్టుబడిన దమయంతిని చూశాడు. వెంటనే ఆ వ్యాధుడు తనదగ్గరున్న

పదునైన కత్తితో ఆ సర్పాన్ని ముఖంనుండి క్రిందవరకు చీల్చి పారేశాడు. సర్పం చేష్టలుడిగి చనిపోయింది. అపుడు ఆ వనచరుడు సర్పముఖం నుండి దమయంతిని వెలికితీసి, నీటితో కడిగి, ఆమెను ఊరడించి, ఆహారం పెట్టాడు. పిమ్మట వనచరు డిలా ప్రశ్నించాడు.

'హరిణనయనా! నీవెవరవు? అడవికెందుకు వచ్చావు? ఇట్టికష్టాలపాలవటానికి కారణం ఏమిటి?' వనచరుడిలా ప్రశ్నించిన వెంటనే ఆ దమయంతి జరిగినది జరిగినట్లు చెప్పింది. దమయంతి సగం చీర చుట్టుకొంది. బలసిన పిరుదులు, స్తనాలు - తీర్చిదిద్దిన కనుబొమలు - వంపులు తిరిగిన కనురెప్పలతో కూడిన నేత్రాలు - పున్నమి చంద్రుని వంటి ముఖం - మధురంగా మాట్లాడుతోంది. ఇవి అన్నీ చూసి వ్యాధుడు కామపరవశు డయ్యాడు. మృదువైన మంచిమాటలతో ఆమెను ఓదారుస్తున్నాడు వ్యాధుడు. వెంటనే దమయంతి అతడు కామపరవశు డైనట్లు గ్రహించింది. సాధ్వియైన దమయంతి కోపంతో మండిపోతున్న అగ్నిజ్వాలవలె వనచరుని సమీపించింది. చెడ్డ ఆలోచనలు గల ఆ వనచరుడు ఆమెను బలాత్కరించాలనే తలంపులో ఉన్నప్పటికిని ఆమెను ప్రజ్వలించే అగ్నిజ్వాలగా భావించాడు. రాజ్యమూ, మగడూ కూడా లేని దమయంతి దుఃఖంతో నిండి మాటలతో వీనిని నివారింపలేమని భావించి, కోపంతో ఆ వ్యాధుని శపించింది. 'నేను నిషధరాజైన నలునితప్ప మరొకరిని మనసులో సైతం భావించనట్లయితే నీచుడైన ఈ వనచరుడు మరణించుగాక!' దమయంతి అలా పల్కిన వెంటనే ఆ వనచరుడు అగ్నిచే బూడిదైన చెట్టులా నేలపై కూలి, మరణించాడు.

64. దమయంతి సార్థవాహులతో కలిసి వెళ్లుట.

వనచరుని మరణానంతరం దమయంతి భయంతో జనశూన్యమై ఈలపురుగుల రొదతో ఉన్న ఆ అరణ్యం నుండి బయలుదేరింది. ఆ అరణ్యం సింహాలు, ఏనుగులు, దుప్పులు, పెద్దపులులు, అడవిదున్నలు, ఆబోతులు మొదలగు వాటితోను, రకరకాల పక్షిసమూహాలతోనూ కూడి మ్లేచ్ఛులకు, దొంగలకు నిలయమై ఉంది. మద్దిచెట్లు, వెదురుపొదలు, చండ్ర, రావి, తుమికి, ఇంగువ, మోదుగ, ఏరుమద్ది, వేప. తినిశ, బూరుగ, నేరేడు, మామిడి, లొద్దుగ, మునుగుదామర, మద్ది, ప్రబ్బలి, పద్మక, ఉసిరిక, జువ్వి, కడిమి, అత్తి, రేగు, మారేడు, మర్రి, అడవిమామిడి, తాడి, ఖర్జూర, కరక్కాయ, తాండ్రచెట్లతో కూడిన ఆ అరణ్యం దట్టంగా ఉంది. గైరికాది బహు ధాతువులతో కూడిన పర్వతాలు, పొదరిండ్లతో కప్పబడిన కొండచరియలు కనువిందు చేస్తున్నాయి. నదులు, సరస్సులు, దిగుడుబావులు, వివిధ మృగాలు, పక్షులు, అతిభయంకరాకృతి కల

పిశాచాలు, పెద్దపెద్ద పాములు, రాక్షసులు, దొరువులు, చెరువులు, వలయాకారంగా ఉన్న పర్వతాలు, నదులు, సెలయేళ్ళు మొదలైన అద్భుత దృశ్యాలను దమయంతి కనులార చూసింది. తేజోవంతురాలు, యశస్విని, సహజశోభతో ప్రకాశించే దమయంతి గుంపులుగా సంచరించే అడవిదున్నలను, అడవిపందులను, ఎలుగుబంట్లు, అడవిపాములు, మొదలైన వాటిని చూచింది. అరణ్యంలో నలుని వెదకుతూ ఒక్కతియే తిరుగుతోంది. భర్తవియోగ దుఃఖంతో ఉన్న దమయంతి ఆ భయంకరారణ్యంలో దేనికీ భయపడటంలేదు. నలునికోసం విదర్భరాజతనయ ఎంతగానో దుఃఖించింది. భర్తశోకంతో దమయంతి ఒకరాతిపై కూర్చొని విలపించింది.

'బలిష్ఠమైన వక్షస్థలమూ, ఆజానుబాహువులూ కల నిషధరాజా! ఈ నిర్జనారణ్యంలో నన్నొక్కతినే వదలి ఎక్కడకు వెళ్ళావు? అధికమైన దక్షిణలతో ఎన్నో అశ్వమేధాది యజ్ఞాలను చేసిన నరశ్రేష్ఠుడా! నీవెందుకు నాపట్ల అసత్యమార్గాన్ని త్రొక్కావు? మహారాజా! లోకపాలుర ఎదుట పల్కిన మాటలను ఒక్కసారి స్మరింపవయ్యా! హంసలు నీకు చెప్పినమాటలు, నాచెంతకు వచ్చినపుడు నీవు నాకు చెప్పినమాటలు ఒక్కసారి గుర్తు తెచ్చుకో. ఒకప్రక్క సాంగోపాంగంగా నాలుగువేదాలూ చదివావు. పురుషశ్రేష్ఠుడా! ఒక్కసత్యం మాత్రం ఏకాకి యైంది కదా! సత్యాన్ని మాత్రం మరోప్రక్కకు పెట్టావు. శత్రుసంహారకా! నీవు సత్యం ఆచరింపదగినవాడవు. పూర్వం నాచెంత చెప్పిన మాటలను చెయ్యి. వీరా! నీదృష్టిలో 'దమయంతి' అనేపేరు తొలగిపోయిందా? ఈ భయంకరారణ్యంలో నాకు బదులు పల్కవేమిటి? భయంకరాకృతికల అజగరం ఆకలితో నన్ను పట్టి మ్రింగబోయే సమయంలోనైనా నన్నెందుకు రక్షింపవు? నీవు తప్ప మరొక ప్రియురాలు లేదని నాతో నీవు చెప్పావే! పూర్వం నాతో చెప్పిన ఆ మాటను నిజం చెయ్యి! నీవే నా సర్వస్వమని పల్కిన నీవు ఈనాడు పిచ్చెక్కి ఏడుస్తున్న నీ ప్రియభార్యతో ఎందుకు మాట్లాడవు? కృశించిన దాన్ని, దీనురాలను. కళతగ్గిన దానిని. సగం చీరనే ధరించి అనాథవలె ఏడుస్తున్న దానిని. గుంపునుండి విడిపోయి ఏకాకిని యైన లేడిని పోలిన నన్నెందుకు ఆదరింపవయ్యా! ఆర్యపుత్రా!! మహారాజా! ఈ మహారణ్యంలో నీభార్యనైన నేను దమయంతిని. ఒంటరిదాననై నీతోనే మాట్లాడుతున్నాను. కాని నీవు మాత్రం మాట్లాడటం లేదు.

నరోత్తమా! ఉత్తమకులశీలాలు కలవాడవు. అందమైన సర్వావయవశోభ కల నిన్నిప్పుడు ఈ కొండపై ఎక్కడని చూడగలను. సింహవ్యాఘ్రాలకు నిలయమైన ఈ ఘోరారణ్యంలో ఎక్కడ పరున్నావో! ఎక్కడ కూర్చున్నావో! ఎక్కడున్నావో! ఎవర్ని అడగను? నీకోసమే బాధపడుతున్నాను. శోకంతో కృశించిపోతున్నాను నన్నీవిధంగా శోకంలో ముంచి నీవెక్కడకి

వెళ్ళావని ఎవర్ని అడుగుతాను? అరణ్యం నుండి బయలుదేరిన నీగురించి "నలు డనే మహారాజును మీరు చూశారా? వారిని కలిశారా?" - అని అడుగ తగిన వారెవరో తెలియటం లేదు. రూపవంతుడు, మహాత్ముడు, శత్రువ్యూహాన్ని ఛేదింపగలవాడు, పద్మాలవంటి కన్నులుగలవాడు అయిన ఏ నలమహారాజును గురించి నీవు వెతుకుతున్నావో - ఆ నలు డితడేనమ్మా!- అనే మధురవాక్కును ఇపుడెవరివలన వినగలనో? నాలుగుకోరలు, పెద్దదవడలు కల్గి ఈ అరణ్యరాజ్యానికే రాజయిన పెద్దపులి నా ఎదురుగా వచ్చినా ఏమాత్రం సందేహింపకుండా నేను దాని చెంతకే వెళ్తాను. "నీవు మృగరాజువు. ఈ అరణ్యానికి నీవు రాజువు. నీవే శరణ్యుడవు. నేను విదర్భరాజకుమార్తెను. నన్ను దమయంతినిగా తెలిసికో! శత్రుంజయుడైన నలునకు భార్యను. నలుడు నిషధదేశప్రభువు! శోకకర్శితనై, దీనురాలనై, నాభర్తను వెదకుతున్నాను. మృగరాజా! నీవు, నాభర్త నలుని చూస్తే నాకు చెప్పి నన్నూరడించు. నాభర్త సమాచారాన్ని తెల్పి నాకు ఊరట కల్గింపలేకపోతే నన్ను తిను. దాంతో నాబాధ తీరుతుంది." అరణ్యంలో నారోదన విని ఈసింహం నన్నూరడించటం లేదు. మధురజలాలతో కూడిన నదివైపు వెళ్లిపోతోంది.

అత్యున్నతమైన అనేకశిఖరాలతో ఉన్న ఈ పర్వతరాజం, ఎంతో పుణ్యప్రదమైంది. ఈపర్వత శిఖరాలు మనోజ్ఞమైన వివిధవర్ణాలతో ప్రకాశిస్తున్నాయి. గైరికాద్యనేక ధాతువులతో, వివిధవర్ణశిలలతో అలంకరింపబడిన ఈ ఎత్తైన పర్వతం ఈ పెద్ద అరణ్యానికే ఒక ధ్వజంలా ఉంది. సింహాలు, పెద్దపులులు, ఏనుగులు, అడవిపందులు మొదలైన వానితోను రకరకాలైన పక్షులధ్వనులతోను ఈ గిరి మార్మ్రోగుతోంది. మోదుగు, అశోక, పొగడ, పున్నాగ, కొండగోగు, చండ్ర, జువ్వి మొదలైన అనేక పుష్పాలతో ఈపర్వతం శోభిస్తోంది. నదులతోను, పక్షులతోను పర్వతశిఖరాలు సమాకులాలై ఉన్నాయి. ఈపర్వతరాజును, నలునిజాడ గురించి అడుగుతా నిప్పుడు. దేవతామూర్తిలా కనిపిస్తున్న పర్వతరాజా! బహుకళ్యాణ నిలయుడవైన నీవు శరణు వేడతగినవాడ వని నమస్కరిస్తున్నాను.

నీదగ్గరకు వచ్చి నమస్కరించిన నేను ఒకరాజపుత్రిని - ఒకరాజుకోడలిని - ఒకరాజు భార్యను. దమయంతి అని ప్రసిద్ధికెక్కిన దానను. నాతండ్రి భీమరాజు. విదర్భ దేశానికి ప్రభువు. మహారథుడైన భీమరాజు నాలుగువర్ణాల ధర్మాలను చక్కగా పరిరక్షిస్తున్నాడు. భూరిదక్షిణలతో ఎన్నో అశ్వమేధయాగాలను చేశాడు. పెద్దపెద్ద అందమైన కనులు కలవాడు. వేదధర్మాలు బాగా తెలిసినవాడు. సత్ప్రవర్తన కలవాడు. సత్యమే పలుకుతాడు. అసూయలేదు. సచ్ఛీలుడు. పరాక్రమం, మహాసంపద కల ధర్మవేత్త - శుచియైనవాడు. విదర్భరాజ్యాన్ని రక్షిస్తున్నాడు. నిశ్శత్రవమొనర్చి పరిపాలించే ఆ

భీమరాజు కూతురని నన్ను తెలిసికో. అలాంటి నేను నీసమీపంలో ఉన్నాను. మా మామగారు నిషధరాజ్యానికి మహారాజైన వీరసేనుడు. వారు సార్థకనామధేయులు. ఆ వీరసేనసుతుడు పరాక్రమసంపన్నుడై, క్రమప్రాప్తమైన నిషధరాజ్యాన్ని చక్కగా పాలిస్తున్నాడు. శత్రుంజయుడైన నలమహారాజు పుణ్యశ్లోకుడుగా ప్రసిద్ధి పొందాడు. వేదవేత్త. వాజ్‌పేయాది పుణ్యం కలవాడు. పుణ్యకర్మలను చేస్తాడు. సోమపానం చేసిన నిత్యాగ్నిహోత్రి. యజ్ఞకర్తగా, దాతగా, యుద్ధవీరుడుగా, నలుడు ప్రసిద్ధిచెందాడు. ఈ అబల – భర్తృహీన, ధనహీన, అనాథ ఇలాంటి నేను నలుని భార్యయగు దమయంతిని. గిరిరాజా! భర్తను వెతుక్కుంటూ నీ సమీపానికి వచ్చాను. పర్వతరాజమా! ఉన్నతాలైన అనేక శిఖరాలతో ఆకాశంలో గీతలు గీసే నీవు ఈభయంకరారణ్యంలో నలుని చూశావా? మదపుటేనుగులాంటి బలం కలవాడు, బుద్ధిమంతుడు, ఆజానుబాహువు, యశస్వి, వీరుడైన నాభర్త నిషధదేశప్రభువు. నలుడనే పేరుగలవాడు. మీరెక్కడైనా నలుని చూశారా? పర్వతశ్రేష్ఠుడా! ఏకాకిని, దుఃఖంతోనున్న నీకుమార్తె వలె ఉన్న నన్ను ఎందుకు ఆదరించటం లేదు! ధర్మాలు తెలిసినవాడవు, సత్యవాక్‌పాలకుడవు, వీరులను ఆక్రమించే రాజా! ఈ అరణ్యంలోనే ఉంటే కన్పించవయ్యా! మేఘగర్జనను పోలి, మృదుగంభీరాలై అమృతోపమానాలైన నలుని మాటలను వినగల్గటం ఎప్పుడో కదా! వైదర్భీరీతివలె సుస్పష్టమైనది, శుభదాయిని, నాఆవేదనను పోగొట్టకల్గినది, వేదప్రసారం చేసే నీమధురవాక్కు ఎప్పుడు నేను వినగలను! ధర్మవాత్సల్యం గల రాజా! భయపడుతున్న నన్ను ఊరడించు.' ఈ విధంగా దమయంతి పర్వతరాజుకు విన్నవించి అక్కడనుండి మళ్లీ బయలుదేరి ఉత్తరదిక్కుగా వెళ్ళింది. దమయంతి మూడు రాత్రింబవళ్ళు పయనించి, దివ్యారణ్యాన్ని పోలి ప్రకాశించే ఒక తాపసారణ్యాన్ని చూసింది. ఆ తాపసారణ్యం వసిష్ఠ, భృగు అత్రి సమానులైన మహర్షుల తపస్సులచే ప్రకాశిస్తోంది. సంయతాహారులు, ఇంద్రియ నిగ్రహం కల్గినవారు, పవిత్రులు..... స్వర్గమార్గం చూడాలనే కోరికతో జల, వాయు భక్షకు లచట ఉన్నారు. కొందరు ఆకులే ఆహారంగా తినేవారు. జితేంద్రియులయిన మహాత్ములు. వీరంతా అచట ఉన్నారు. జితేంద్రియులై నారచీరలు ధరించిన మునులతోను, తపోధనుల ఉనికితోను, రమ్యమై ప్రకాశించే ఆ ఆశ్రమ సమూహాలను చూసింది. అనేక మృగగణాలతో పరివ్యాప్తమై కోతులగుంపులతోకూడి తాపసులకు నివాసమైన ఆ ఆశ్రమాన్ని చూసిన దమయంతి సంతృప్తిగా ఊపిరి పీల్చుకొంది. మంచికనుబొమలు, మంచి కేశాలు, చక్కని పిరుదులు, మంచి ఉరోజాలు, మంచి పలువరుస, నల్లని విశాలమైన నేత్రాలు కల్గి సహజ వర్చస్వినియైన ఆమె... వీరసేనుని కుమారరత్న మగు నలునకు ప్రియతమ, తపస్విని, స్త్రీలలో రత్నం వంటి సాధ్వి దమయంతి ఆశ్రమంలోనికి ప్రవేశించింది.

దమయంతి, తపోవృద్ధులకు నమస్కరించి వినయంతో శిరస్సువంచింది. తాపసోత్తములంతా ఆమెకు స్వాగతం పలికారు. తపోధనులంతా ఆమెకు తగినవిధంగా గౌరవించి ఆసీనురాలవు కమ్మని కోరారు. తర్వాత తాము ఏంచెయ్యాలో చెప్పమని కోరారు. దమయంతి తాపసుల నుద్దేశించి – 'మహాభాగులారా! స్వధర్మాచరణంలో మీరు కుశలులే కదా! మీతపస్సులు అగ్నికార్యాలు, మృగపక్షుల యెడల మీరు నిర్వర్తించే ధర్మాలు సక్రమంగా నెరవేరుతున్నాయా?' అని అడిగిందే తడవుగా వారు 'మాకెల్లరకు కుశలమే' – అని పలికారు. 'నీవు ఎవ్వతెవు? నీవేమి చేయదలచితివి? తేజోవంతమైన నీరూపం మాకెల్లరకు ఆశ్చర్యాన్ని కలుగజేస్తోంది. నీవు దుఃఖింపకు. ఊరడిల్లు. నీవేమైన వనదేవతవా? లేక ఈ పర్వతరాజునకు దేవేరివా? చెప్పు. కళ్యాణీ! నీవు ఈ నదీదేవతవా? – యథార్థాన్ని తెల్పు' మని అడిగారు. అపుడు దమయంతి వారితో 'తపోధనులారా! మీరు భావించినవిధంగా నేను అరణ్యదేవతను గాని, గిరిదేవతనుగాని, నదీదేవతను గాని కాదు. మీరెల్లరూ నన్ను మనుజకాంతగా తెలిసికొనం'డని పల్కింది.

'తపోధనులారా! నావృత్తాంతం అంతా సవిస్తరంగా చెపుతాను. వినండి! విదర్భదేశాన్ని పాలించే మహారాజు భీముడనే పేరుగల మహీపతి. ఆ భీమరాజునకు పుత్రికనుగా నన్ను తెలిసికొనండి. బుద్ధిమంతుడు, యశస్వి, వీరుడు, యుద్ధవిజేత, పండితుడు – అయిన నలు డనే మహారాజు నాభర్త. ఆయన సదా దేవతల నారాధించేవాడు. బ్రాహ్మణులపై వాత్సల్యం కలవాడు. నిషధవంశరక్షకుడైన ఆ నలమహారాజు గొప్పతేజోవంతుడు. మహాబలసంపన్నుడు. సత్యాన్నే పలికేవాడు. ధర్మాలు తెలిసిన ప్రాజ్ఞుడు. శత్రుంజయుడు, బ్రాహ్మణుడు, దైవతపరుడు, శ్రీమంతుడు, శత్రురాజ్యవిజేత, అశ్వమేధాది యజ్ఞాలు చేసినవాడు. వేదవేదాంగ పారగుడు. విశాలాక్షుడు. పూర్ణేందువదనుడు. శత్రుంజయుడు. ఇంద్రునితో తులతూగేవాడు. ఇట్టి నలమహారాజు నా నాథుడు. సూర్యచంద్రసమతేజోవంతుడైన నలుడు, యుద్ధాల్లో శత్రునిహంత. ఇట్టి నలమహారాజును, దుర్మార్గచరులై దుష్కృత్యాలు చేసే కొందరు పనిగట్టుకొని ఆహ్వానించి, జూదంలో కుటిలమైన మార్గాలలో ఓడించి, సమస్త రాజ్యాన్ని, ధనాన్ని హరించారు. ఆ విధంగా రాజ్యాన్ని కోల్పోయిన రాజశ్రేష్ఠుడైన నలుని భార్యను దమయంతిని నేను. నేను భర్తృదర్శనం కోరుతున్నాను. భర్తను వెదక్కుంటూనే ఈ అరణ్యాలను, పర్వతాలను, నదులను, సరస్సులను పరికిస్తూ మహాత్ముడు, అస్త్ర పరిజ్ఞాత అయిన ఆ నలుని కోసం దుఃఖితనై తిరుగుతున్నాను. శార్దూలాదిక్రూరమృగ నివాసమై, అతిదారుణమైన ఈ ఘోరారణ్యమంతా నలునికై వెదకుతూ, ఇపుడీ సుందరమైన తపోవనాన్ని చేరాను. భగవత్ స్వరూపులైన మీసన్నిధికి నిషధాధీశుడైన నలుడు ఎపుడయినా

వచ్చాడా? నాభర్త నలుని కొన్ని రోజులలో చూడలేకపోతే ఈ దేహాన్ని చాలించటం శ్రేయస్కరమని భావిస్తున్నాను. నాజీవిత పరమార్థమైన భర్త లేకుండా ఈజీవితం వ్యర్థం. భర్తశోకాభిపీడితనై నేనెలా ఉండగలను?'

అరణ్యంలో తపోవనం చేరి విలపిస్తున్న భీమపుత్రిని దమయంతిని చూసి, సత్యద్రష్టలైన అచటి తాపసులు దమయంతితో ఇలా అన్నారు. 'కళ్యాణీ! మేం తపోదృష్టితో చూశాం! త్వరలోనే నీవు నలుని చూస్తావు. భవిష్యత్తు నీకు శుభదాయక మవుతుంది. దమయంతీ! శత్రుంజయుడు, ధార్మికులలో శ్రేష్ఠుడు, నిషధాధిపతియైన నలుని త్వరలోనే పాపరహితునిగ దర్శిస్తావు. సర్వపాపాలనుండి విముక్తుడై, శత్రుంజయుడై, సర్వరత్న సమన్వితమైన తన నిషధరాజ్యాన్నే పరిపాలిస్తాడు. నలుడు శత్రుభయంకరుడు, మిత్రులశోకాన్ని నాశనం చేసేవాడు. కళ్యాణకారకమైన పరివారంతో కూడిన ఆ నలుని నీవు చూడగలవు.' నలుని పట్టమహిషియైన దమయంతితో ఈ విధంగా చెప్పిన తాపసులంతా అగ్నిహోత్రసహితమైన ఆశ్రమాలతో అంతర్ధానమయ్యారు. వీరసేనమహారాజునకు కోడలైన దమయంతి ఇదంతా చూచి మహాశ్చర్యాన్ని పొంది విస్మయంతో నవ్వుకొంది. 'ఏమి? నేను కల కన్నానా? నేను చూసినదంతా స్వప్నమేనా? ఆ ఆశ్రమాలెక్కడ? ఆ తాపసులు ఎక్కడ? విధి ఇలా ఉంది! పుణ్యజలాలతో ప్రవహించే ఆ అందమైన నది ఎక్కడ? వివిధ పక్షి గణాలతో సేవింపబడుతూ, ఫలపుష్పాలతో శోభించే ఆ పర్వతాలెక్కడ?' శుచిస్మితయైన దమయంతి చాలాకాలం ఇదంతా తలుస్తూనే ఉంది. భర్తశోకంతో దీనురాలైన ఆమెముఖం పాలిపోయింది.

దమయంతి ఆ ప్రదేశాన్నుండి మరోప్రదేశానికి చేరింది. కన్నీరు మున్నీరు అయి డగ్గుత్తికతో ఒక అశోకవృక్షాన్ని చూసి విలపించింది. ఆ వనమంతా పక్షుల కిలకిలా రావాలతో మార్మ్రోగుతోంది. చివురుటాకులతో మనోజ్ఞంగా పుష్పించిన అశోకవృక్షం చెంత చేరింది దమయంతి. ఈ వనంలో ఈ అశోకవృక్షం చిగురుటాకులతోను, పుష్పసమృద్ధితోను, అనేకశిఖరాలతోను ఉన్న పర్వత రాజువలె ప్రకాశిస్తోంది. ప్రియదర్శనమైన 'అశోకవృక్షమా! దమయంతికి ప్రియుడూ, పతి, నిషధాధీశుడూ, శత్రువులమదాన్ని అణచేవాడూ, శోకభయ బాధారహితుడు అయిన నలుడనే రాజును నీవేమైనా చూశావా? వ్యసనపీడితుడై, చీరముక్కతో సుకుమారదేహాన్ని కప్పుకొన్న ఒక వీరుని ఈ అరణ్యంలో ఉన్నట్లుగా చూశావా? నీవు అశోకవృక్షానివి. అశోకమంటేనే శోకాన్ని పోగొట్టేది. నా శోకాన్ని పోగొట్టి అశోకమనే పేరును సార్థకం చేసుకో!' ఈ విధంగా బాధాపరితప్తమైన దమయంతి ఆ అశోకవృక్షానికి ప్రదక్షిణం చేసి అచటినుండి అంతకన్న దారుణమైన మరొకప్రదేశానికి వెళ్ళింది. అచటనుండి బయలుదేరిన దమయంతి తనభర్తను వెదకుతూ మార్గమధ్యంలో అనేకపర్వతాలను,

నదులను, వివిధ మృగాలను, పక్షులను, కొండచరియలను, అచటినుండి పడి ప్రవహించే సెలయేళ్లను చూస్తూ చూస్తూ కొంచెం సంతోషంతో నడకసాగిస్తూ రమ్యమై, ప్రసన్నమై చల్లనైన జలంతో, ప్రబ్బలి తీగలతో నిండిన నదిని దాటుతూ రథాలు, గుర్రాలు, ఏనుగులు మొదలైన వానితో కూడిన వ్యాపారుల సమూహాన్ని చూచి సంతోషాన్ని పొందింది. క్రౌంచపక్షుల ఆరుపులతోను, చక్రవాకపక్షుల కూజితాలతోను మార్మ్రోగుతూ తాబేళ్ళు, మొసళ్ళతో కూడి విశాలమైన ద్వీపంలా ఉన్న ఆ సార్థవాహసమూహాన్ని చూసి, నలపత్నియైన దమయంతి మెల్లగా వారిని సమీపించి జనసమూహంలో ప్రవేశించింది.

ఉన్మాదినివలె శోకసంతప్తయై, సగం చీరతో శరీరాన్ని కప్పుకొని తేజోహీనయై, ధూళిధూసరితమైన శిరోజాలు కల్గి కృశించియున్నది ఆమె. ఆ దమయంతిని చూచి కొందరు భయపడి పరుగులెత్తారు. మరికొందరు ఆలోచనలో పడ్డారు. మరికొంతమంది పెద్దగా అరచారు. కొందరామెను చూచి పెద్దగా నవ్వారు. కొందరు అసూయపడ్డారు. మరికొందరు జాలిపడ్డారు. కొందరామెను ఈవిధంగా ప్రశ్నించారు. 'కళ్యాణీ! నీవెవ్వరిదానవు? దేనికోసం వెదకుతున్నావు? నిన్ను చూసి మేం చాలా బాధపడుతున్నాం. నీవు మానవకాంతవేనా? నీవు ఈ పర్వతానికి గాని, అరణ్యానికి గాని సంబంధించిన దేవతవా? నిజం చెప్పు! నిన్ను మేం శరణుపొందుతున్నాం. నీవు యక్షజాతికి చెందినదానవా? లేక రాక్షసజాతికి చెందినదానవా? మాకెల్లరకు మంచిని కలుగజేసి రక్షించు. మాకు చెడు జరుగకుండా సుఖంగా గమ్యాన్ని చేరేలా తగినవిధంగా సహకరించు.' ఆ సార్థవాహసమూహం ఈవిధంగా పల్కినంతనే భర్త కన్పించలేదనే బాధతో దమయంతి వారికి ఇలా బదులు పల్కింది. 'వ్యాపారులారా! మీలో యువకులు, వృద్ధులు, బాలురు ఉన్నారు. మీరంతా నన్ను మానవకాంతగానే భావించండి. నేనొక మహారాజు పుత్రికను. మరొకరాజుకి కోడలను. రాజ పట్టమహిషిని. కనిపించని భర్తను చూడాలనే ఆసక్తితో ఉన్నదానను. నాతండ్రి విదర్భను పాలించే రాజు. నిషధరాజ్యపాలకుడైన నలమహారాజే నాభర్త. ఎన్నడూ ఓటమి నెరుగని నాభర్తను వెదకుతున్నాను. శత్రుగణాలను నశింపజేసే పురుషశ్రేష్ఠుడైన నాభర్త నలుని గురించి మీకేమైనా తెలిస్తే నాకు తెలియజేయండి.' ఆ సార్థవాహసమూహానికి నాయకుడైన "శుచి" దమయంతితో ఇలా అన్నాడు. 'కళ్యాణీ! నామాట విను! నేను, ఈ సార్థవాహసమూహానికి నాయకుణ్ణి. యశస్వినీ! నలుడనే పేరుగల వానిని నేను చూడలేదు. మానవసంచారంలేని గహనమైన ఈ అరణ్యంలో ఏనుగులు, అడవిదున్నలు, పెద్దపులులు, భల్లూకాదులను మాత్రం చూశాను. మానవకాంతయగు నిన్ను దప్ప, మరొక మనుష్యుని ఈ అరణ్యంలో చూడలేదు. ఇపుడు మాకు యక్షరాజైన మణిభద్రుడు ప్రసన్నుడగుగాక!'

దమయంతి వారిని 'వ్యాపారులారా! మీరంతా ఎచటకు వెళ్తున్నారో తెలుపండి'. అని అడిగింది. సార్థవాహుడిలా అన్నాడు. 'చేదిదేశపురాజైన సుబాహుమహారాజు గారి లాభంనిమిత్తం ఈవ్యాపారుల సమూహం పల్లెలకు వెళ్తున్నది.'

65. దమయంతి చేదిరాజగృహమును చేరుట.

భర్తమీది ఆసక్తితో ఆ దమయంతి సార్థవాహుని మాటలను విని వారితో కలసి వెళ్ళింది. దారుణారణ్యంలో పయనిస్తున్న ఆ వ్యాపారులు కొన్నిరోజుల తర్వాత పద్మపరిమళాలతో, రకరకాల పుష్పాలతో, నానావిధపక్షులతో కూడిన మంగళకరమైన ఒకపెద్ద చెఱువును చూశారు. స్వచ్ఛమై, మనోహరమైన చల్లని తీయని ఆ తటాకోదకం అలసిపోయిన ఆ వ్యాపారులకు అచట కొంతసేపు ఆగాలనే కోరికను కల్గించింది. సార్థవాహులందరూ తమ మనోభావాలకు అనుకూలంగా ఆ చెరువు పడమటి ఒడ్డునకు చేరి అచటనే విశ్రమించారు. అలసిపోయిన ఆ వ్యాపారులంతా గాఢ నిద్రలోనున్న అర్ధరాత్రివేళ ఏనుగుల గుంపొకటి ఆచెరువు నీరు త్రాగడానికై వచ్చి, ఏనుగులమదస్రావంతో కలుషితమైన ఆజలాన్ని చూచి, ఆసమీపంలోనే ఉన్న సార్థవాహసమూహానికి సంబంధించిన ఏనుగులగుంపును చూసింది. మదించిన ఆ అడవిఏనుగులు, వ్యాపారుల ఏనుగులను చూసి, వాటిని చంపాలనే కోర్కెతో వెనువెంటనే వాటిపైకి ఉరికాయి.

అతివేగంగా విరుచుకుపడ్డ ఆ అడవిఏనుగుల గుంపు కొండశిఖరాలు విరిగి క్రిందపడు తున్నట్లు భరింపరాని దయింది. ఎదురు తిరగటానికి స్పందించిన వ్యాపారుల ఏనుగులకు అడవి ఏనుగులు దారిలేకుండా చేశాయి. సరోవరతీరాన దారికడ్డంగా సార్థవాహసమూహం పరుండి నిద్రిస్తోంది. నిద్రించేవారు మేల్కొనేలోపలే వారినందరినీ త్రొక్కివేస్తుంటే వారంతా హాహాకారాలు చేశారు. నిద్రమత్తులో అడవిపాదలను దాటుతూ, పరుగెడుతున్న ఆ సార్థవాహులలో కొందరు అడవి ఏనుగుల కాళ్ళక్రిందపడి నలిగి మరణించారు. మరికొందరు ఆ ఏనుగులతొండాలకు చిక్కి చనిపోయారు. ఇంకొందరు ఆ ఏనుగుల దంతపు పోట్లకు మరణించారు. ఆ అడవిఏనుగుల విజృంభణవల్ల సార్థవాహులకు సంబంధించిన ఒంటెలు, గుర్రాలు, పదాతిజనాలు భయంతో పరుగులుతీస్తూ ఒకరికొకరు తగిలి మరణించారు. ప్రాణరక్షణకై చెట్లెక్కిన వారిలో కొందరు తొందరలో ఎగుడు దిగుడుగానున్న వృక్షాలమీద నుండి పడిపోయారు.

ఈ ప్రకారంగా ఆ అడవిఏనుగుల ఆక్రమణతో సర్వవస్తుసమృద్ధమైన ఆ వ్యాపారుల సమూహమంతా సర్వనాశనమయింది. ఈ విధ్వంసకాండకు భయపడిన సార్థవాహులు ముల్లోకాలు భయపడేలా పెడబొబ్బలు పెట్టారు. చెల్లాచెదరైన రత్నరాసులకాంతి వైకెగసి

మంటవలె కన్పించి రక్షించండి అని అరుస్తూ పరుగులు తీశారు. రత్నరాసులను వదలి పరుగులెత్తుతున్నా రెందుకని కొందరు కేకలువేశారు. అవన్నీ ధనరాశులు, రత్నరాశులే! నామాటలు అసత్యాలు కావు. అన్నాడొకడు. మరొకడు "మళ్ళీ మాటాడుతూ. మీ గురించి ఆలోచించుకోండి" అని ఆక్రోశించాడు. ఈ విధంగా వారంతా భయపడి అరుచుకొంటూ పారిపోయారు. జరుగుచున్న దారుణమారణకాండకు భయభ్రాంతయైన దమయంతి లేచి విషయాన్నంతా తెలిసికొంది. మున్నెన్నడు చూడని అతిలోకభయంకరమైన ఆ మారణకాండను చూచి భయవిహ్వలురాలై దమయంతి అక్కడి నుండి లేచింది. ఆ ప్రమాదంలోంచి బ్రతికి బయటపడ్డ వారిలో కొందరు ఈ విధంగా అన్నారు.' 'ఈ విధంగా ఎందుకు జరిగింది? ఏ కర్మఫలమిది? యక్షాధిపుడైన మణిభద్రుని మనం పూజింపలేదు. అదేవిధంగా యక్షరాజైన కుబేరునికూడ మనం పూజించలేదు. విఘ్నకారకులైన దేవతలను ముందుగా పూజించలేదు. ఈ విపరీతాలన్నీ శకునాలఫలాలేనేమో! గ్రహాలవిపరీత గమనమే లేకుంటే ఈ విధంగా జరుగదు.'

మరికొంద రీ విధంగా భావిస్తున్నారు. 'ఉన్మాదిని వలె కనిపిస్తూ వికృతరూపమూ అమానుషరూపమూ గల ఈ స్త్రీ మనగుంపు వద్దకు చేరింది. ఈ జరిగిన దారుణమంతా ఆమె మాయయేనేమో!' 'ఆమె నిజంగా రాక్షసియా! భయంకరమైన యక్షిణీపిశాచమా! జరిగిన ఈ పాపకృత్యమంతా ఆమె పనియే! ఇందులో ఆలోచించాల్సిందేమీ లేదు. సార్థవాహసర్వస్వాన్ని నాశనం చేసిన ఆమె కన్పిస్తే కర్రలతో, రాళ్ళతో, పిడికిళ్ళతో కొట్టి చంపుదాం' అని కొందరు అంటున్నారు. దమయంతి సార్థవాహబృందంలోని వారిమాటలను విని ఒకవైపు సిగ్గు, మరోవైపు భయాన్ని పొంది అడవి వైపు పరుగెత్తింది. జరిగిన దారుణ పాపకృత్యం తనపై పడనున్నట్లు భావించి విలపించింది. 'ఆహా! చాలా ఆశ్చర్యంగా ఉంది. నాపై విధి దారుణంగా ఉంది. ఎక్కడా మంచి జరగటం లేదు. ఇది ఏకర్మఫలమో? మనస్సుతో గాని, చేతతో గాని, వాక్కుతో గాని, ఎవరికీ ఏ కొద్దిపాటి చెడునైనా చేయాలని నేను తలచలేదు. ఇదంతా ఏ కర్మఫలమో' అని దమయంతి భావించింది. గతజన్మలో చేసిన మహాపాపం వల్లనే చేయని నేరానికి ఈ విధమైన కూడదీసుకో లేని కష్టాన్ని పొందానని భావించింది. స్వజనుల చేతిలోనే పరాజయంపొంది తనభర్త రాజ్యాన్ని కోల్పోవటం, భర్తవియోగాన్ని అనుభవించటం, కన్నబిడ్డలతో వియోగం -' ఇవన్నీ పాపఫలితాలే! అనేకసర్పాలకు నివాసమైన ఈ అరణ్యంలో దిక్కులేని దాననుగా ఉండటం కూడ పాపఫలితమే. ధర్మరాజా! మరణించగా మిగిలిన సార్థవాహులు, మరునాడు ఆ ప్రదేశాన్నుండి బయలుదేరి ఒకవైపు జరిగిన దారుణ మారణకాండను, మరొకవైపు పోగొట్టుకొన్న తమవారిని,

మిత్రులను గూర్చి విచారించారు.

'తానేమైనా పాపం చేశానా 'అని దమయంతి ఆలోచించింది. 'నిర్జనారణ్యంలో జనసమూహం ప్రాప్తించడం ఏమిటి? వారంతా గజయూథంతో చచ్చిపోవడం ఏమిటి? నా దురదృష్టం వల్ల ఇదంతా జరిగిందా? ఎపుడో పొందవలసిన దుఃఖం ఇపుడు నాకారణంగా వచ్చి ఉంటుంది. ఏ జీవి కూడా, కాలం ప్రాప్తించనిదే మరణించదని పెద్దలు చెప్పగా విన్నాను. అందుకే ఏనుగుల గుంపుచే నేను చనిపోకుండా మిగిలాను. లోకంలో మానవుల విషయంలో దైవకృతం కానిది ఏకొంచెంకూడ లేదు. పసితనంలోకూడ ఏ కొద్దిపాపమూ మనసా, వాచా, కర్మణా నేను చేసి యుండలేదే! నేనెందుకు ఇంతటి దుఃఖాన్ని పొందాను? నాస్వయంవరానికి వచ్చిన లోకపాలురను నేను తిరస్కరించి నలుని చేసుకొన్నాను గదా! బహుశ: దేవతల ప్రభావంచేతనే ఇలా జరిగిందా?' ఈ విధంగా తనమనస్సులో భావించుకొని, తనలో తానే మాట్లాడుకొంటూనే ఏడుస్తూ బాధపడింది దమయంతి. ధర్మరాజా! మరణించగా మిగిలిన కొందరితోను, వేదపారగులైన బ్రాహ్మణులతోను కలసి శరత్కాలపు చంద్రలేఖవలె నడుస్తూనే సాయంసమయానికి సత్యదర్శియైన సుబాహుని యొక్క పురం చేరింది. సగం చీరనే ధరించిన దమయంతి వారితోబాటు ఆ పట్టణంలో ప్రవేశించింది. మనసు చెదరి కృశించి, విడివడిన జుట్టుతో, స్నానం లేకుండా అక్కడకు చేరింది. పిచ్చెక్కిన దానిలా పురంలోకి వెళుతున్న ఆమెను చేదిరాజపురవాసులు చూశారు. పల్లెటూరి పిల్లలు ఉత్సాహంతో ఆమెను చుట్టుముట్టారు. అలాగే ఆమె రాజగృహంవరకు వచ్చింది.

జనం మధ్య నున్న దమయంతిని మేడపైనుండి రాజమాత చూసి పరిచారికతో ఇలా అన్నది – "వెళ్ళు, ఆమెను నా దగ్గరకు తీసికొనిరా ! ఈమె శరణార్థిని. ప్రజలవలన ఇబ్బందిపడుతోంది. ఈమె రూపాన్ని చూస్తుంటే నా ఇల్లంతా వెలుగు నింపుతుం దనిపిస్తోంది. ఉన్మత్తవేషంతో ఉన్న ఆమె లక్ష్మి వలె విశాలమైన కనులు కలది.' దాది మూగి ఉన్న జనులను వారించి దమయంతిని మేడపైకి తీసికొని పోయింది. రాజమాత ఆశ్చర్యంతో దమయంతి నిలా అడింగింది. 'మబ్బుల్లో మెరుపులా ప్రకాశిస్తున్నావు. ఎవ్వరిదానవో తెల్పు. అలంకారాలు లేకున్నా నీరూపం దివ్యంగా ఉంది. దివ్యతేజోవతీ! నిస్సహాయ స్థితిలో కూడా నీవెవ్వరికీ భయపడటం లేదు.' రాజమాత మాటలను విని దమయంతి ఇలా పలికింది. 'భర్తనే అనుసరించుకొనియుండే మనుష్యస్త్రీగా నన్ను గ్రహించు. సైరంధ్రీజాతి సంపన్నను. స్వేచ్ఛగా నివసిస్తాను. అసంఖ్యాక సుగుణాలు కలిగిన నాభర్త ఫలాలు, కందమూలాలు తినే నన్ను ఎల్లప్పుడు అనుసరించే ఉంటాడు. సాయంకాలానికి నేనూ గృహం చేరుతాను. నేనుకూడ నాభర్తయందు భక్తికల్గి, ఆ వీరుని నీడవలె అనుసరిస్తాను.

విధివశాన నాభర్త జూదమాడవలసి వచ్చింది. ఆ జూదంలో నాభర్త ఓడిపోయాడు. కట్టుబట్టలతో వనవాసానికి ఒంటరిగా వెళ్లాడు. ఆ స్థితిలో మనస్సు చెడి ఉన్మాదివలెనున్న నాభర్తను ఊరడిస్తూ నేనుకూడ అరణ్యానికి వచ్చాను. వీరుడైన నాభర్త ఒకనాడు ఏ కారణంవల్లనో వనంలో ఆకలితో వికలమనస్కుడై శరీరంమీది బట్టను కూడా వదిలేశాడు . దిగంబరుడైన ఆ ఉన్మాదిని అనుసరించివెళ్తూ అనేకరాత్రులు నిద్రలేని దాననయ్యాను. ఆ విధంగా కొన్నిరోజులు గడచిన తర్వాత, నాచీరలో సగం చింపుకొని ఏ తప్పుచేయని నన్ను నిద్రిస్తోంటే వదిలేసి వెళ్ళాడు. ఆ విధంగా వెళ్ళిన భర్తను వెదుక్కుంటూ రాత్రింబవళ్ళు దుఃఖంతో దహించుకుపోతున్నాను. బ్రహ్మవంటి నాప్రియుడు కనపడలేదు - అమరవంద్యుడైన నాప్రాణేశ్వరుని పొందలేకపోతున్నాను.'

నీరు నిండిన కనులతో విలపిస్తున్న దమయంతిని చూసి, రాజమాత జాలితో ఈ విధంగా అంది. 'కళ్యాణీ! నీవిక్కడే ఉండు. నీవంటే నాకు ఎంతో ప్రీతి కలిగింది. నామనుష్యులు నీభర్తను వెదుకుతారు. లేదా అతడే అటూ ఇటూ తిరుగుతూ, ఇచ్చటకు రావచ్చు. ఇక్కడనే ఉండి నీభర్తను నీవు పొందవచ్చు.' రాజమాత పల్కులను విన్న దమయంతి ఇలా అన్నది. 'వీరమాతా! ఒక ఒప్పందంతో నేను మీదగ్గర ఉంటాను. ఎంగిలి తినను. ఎవరికీ పాదసేవ చేయను. ఇతరపురుషులతో ఎన్నడూ మాట్లాడను. ఏ పురుషుడైనా నన్ను కోరినట్లయితే వానిని మీరు కఠినంగా శిక్షించాలి. కొన్నిసందర్భాల్లో అతడు వధ్యుడు కూడ కావాలి. ఇది నా వ్రతం. నాభర్తను వెదకడానికై బ్రాహ్మణులను నియమించాలి. ఇవి మీకు ఇష్టమైతే నేను మీ దగ్గర ఉండడానికి సందేహం లేదు. మరొకవిధంగా ఐతే నేనిచట ఉండను.' వెంటనే రాజమాత ఎంతగానో సంతోషించి ఇలా పల్కింది. 'నీ వ్రతనియమాల ననుసరించి నీవు కోరినట్లుగా అన్నీ చేస్తాను.' ఆ తర్వాత రాజమాత తన కుమార్తె సునందతో ఇలా అన్నది - 'సునందా! ఈమె సైరంధ్రి. దేవరూపిణి. ఈమె నీకు సమాన వయస్కురాలగు సఖి అవుతోంది. ఈమెతో కలసి నీవు ప్రశాంతచిత్తవై సంతోషంగా ఉండు.' అప్పుడు సునంద తన సఖీసమేతంగా దమయంతిని తీసికొని పరమానందంతో తనగృహానికి వచ్చింది. దమయంతి సునందగృహంలో గౌరవభావంతో మెలగుతోంది. కోరినవన్నీ లభిస్తుంటే ప్రశాంతంగా కాలం గడుపుతోంది.

66. నలుడు కర్కోటకుని రక్షించుట.

దమయంతిని విడిచివెళ్ళిన తర్వాత నలుడు అరణ్యంలో ఒకచోట పెనుమంటలతో విజృంభించే కారుచిచ్చును చూశాడు. ఆ మంటలోనుండి ఓప్రాణియొక్క అరుపు విన్నాడు.

నలుడు 'భయపడవద్దు'అని పలుకుతూనే మంటల మధ్యలోకి దూకి చుట్టచుట్టుకొనియున్న నాగరాజును చూశాడు. అపుడా నాగరాజు వణకిపోతూ నలునకు చేతులు జోడించి ఇలా అన్నాడు- "మహారాజా! నేను నాగరాజైన కర్కోటకుడిని. మహాతపస్వియైన బ్రహ్మర్షి నారదుని నేను కాటువేశాను. ఆయన నాపై కోపించి కదలకుండా పడియుండుమని శపించాడు. ఈ శాపం నలుడు నీ చెంతకు వచ్చేవరకు ఉంటుందని చెప్పాడు. నీదర్శనం నన్ను శాపంనుండి విముక్తుని గావింపగలదు. నన్నిటనుండి బయటకు తీసుకుపో. నారదమహర్షి శాపంవల్ల ఒక్కఅడుగు కూడా కదలలేకపోతున్నాను. నీవే నన్ను రక్షింపతగినవాడవు. నీకు శ్రేయస్సును ఉపదేశిస్తాను. నాతోసమానమైన నాగరాజు మరొక్కడు లేడు. నేను నీకు మిత్రుడను అవుతాను. నేను చాలా తేలికగా అవుతాను. నన్ను శీఘ్రంగా తీసికొని వెళ్ళు." కర్కోటకుడు ఇలా అని వెంటనే బొటనవ్రేలంత అయ్యాడు. నలుడు కర్కోటకుని తీసికొని కార్చిచ్చులేని ప్రదేశానికి చేరాడు. అగ్నిహోత్రునిచే విముక్తుడైన కర్కోటకుని మరొక తావునకు చేర్చి, విడిచిపెట్టాలని తలచేలోపే కర్కోటకుడు నలునితో ఇలా అన్నాడు.

'నలమహారాజా! మీరు మీ అడుగులను లెక్కిస్తూ కొన్ని అడుగులు వెళ్ళండి. అక్కడ నేను మీకు గొప్పమేలు చేస్తాను.' కర్కోటకుడు చెప్పినట్లుగానే నలుడు లెక్కించుకొంటూ పదవఅడుగు వేస్తుండగానే కర్కోటకుడు నలుని కాటువేశాడు. వెంటనే నలుని రూపం మారిపోయింది. నలుడు తన వికృతరూపాన్ని చూసుకొని ఆశ్చర్యపోతూనే స్వస్వరూపాన్ని ధరించిన కర్కోటకుని చూశాడు. కర్కోటకుడు నలుని ఓదారుస్తూనే 'నిన్ను జనులెవ్వరూ తెలిసికోకుండా ఉండటానికే నేను నీ రూపాన్నిలా మార్చివేశా' నన్నాడు. 'నలమహారాజా! నావిషంచే నీశరీరంలో కల్గినమార్పు ఉన్నంతవరకూ నీవు దుఃఖంతోనే ఉంటావు. నీకు దుఃఖాలు తీరే మంచిరోజులు వచ్చినపుడు నీ వికృతరూపం మారుతుంది. ఏ తప్పు చేయని నిన్ను వంచించిన వాని కోపాసూయలకు నీవు అర్హుడవు కావు. అట్టివాని నుండి రక్షణమే నావల్ల నీకు జరిగింది. నరోత్తమా! నా అనుగ్రహంవల్ల ఇటుపై నీకు పాములవల్ల, శత్రువులవల్ల, బ్రహ్మవేత్తలవల్ల కూడా భయముండదు. విషం నిమిత్తంగా నీకు ఏ బాధా ఉండదు. యుద్ధాలలో ఎల్లప్పుడూ విజయాన్నే పొందగలవు. రాజా! ఇకపై నీవు బాహుకు డనే పేరుతో వ్యవహరించు. రథసారథిగా అక్షవిద్యానిపుణుడైన ఋతుపర్ణమహారాజు సమీపానికి వెళ్ళు' నలమహారాజా! నీవు వెంటనే అయోధ్యానగరానికి వెళ్ళు. ఋతుపర్ణమహారాజు నీవలన అశ్వహృదయాన్ని గ్రహించి, నీకు అక్షహృదయాన్ని అనుగ్రహిస్తాడు. ఇక్ష్వాకువంశజుడైన ఋతుపర్ణుడు నీకు మిత్రుడవుతాడు. అక్షహృదయాన్ని తెలిసికోవటంవలన ముమ్మందు నీకు ఎంతో మేలు కలుగుతుంది. రాజా! నీవేమాత్రం

దుఃఖపడకు. భార్యతో బిడ్డలతో సహా నీవు రాజ్యాన్ని పొందుతావు. ఇది సత్యం. మహారాజా! నీవు నీ సహజరూపాన్ని చూడదలచుకొంటే నీవు నన్ను స్మరించి ఈ వస్త్రాన్ని కప్పుకో! ఈ వస్త్రాన్ని నీవు కప్పుకొన్నవెంటనే నీ రూపాన్ని నీవు పొందుతావు' అని చెప్పి కర్కోటకుడు నలునకు దివ్యవస్త్రద్వయాన్ని ఇచ్చాడు. ధర్మజా! ఈవిధంగా కర్కోటకుడు నలునకు చెప్పి, దివ్యవస్త్రం ఇచ్చి, అక్కడే అంతర్ధానమయ్యాడు.

67. నలుడు ఋతుపర్ణుని కడ అశ్వాధ్యక్షుడగుట.

బృహదశ్వుడిలా అన్నాడు- 'కర్కోటకుడు అంతర్హితుడైన తర్వాత నలుడు బయలుదేరాడు. పదవరోజుకు ఋతుపర్ణమహారాజు యొక్క నగరానికి చేరాడు. ఋతుపర్ణమహారాజును కలసి తనపేరు బాహుకుడనీ, అశ్వశ్రేష్ఠతను నిర్ణయించటంలో తనకుసాటి ఈభూమిమీద మరెవ్వరూ లేరనీ చెప్పుకొన్నాడు. 'కష్టసమయాల్లోను, నిపుణ విషయాల్లోనూ నన్ను అడిగితే సాయం చేయగలను. పాకశాస్త్రవిషయాలు కూడ ఇతరుల కంటే విశేషంగా తెలిసినవాణ్ణి. మహారాజా! నన్ను పోషించు. లోకంలో దుష్కరమైన శిల్పాదికళల్ని సైతం చేయడానికి ప్రయత్నం చేస్తా' నని చెప్పాడు. ఋతుపర్ణు డిలా అన్నాడు. 'బాహుకా! నీవు నాదగ్గరే ఉండి నీవన్నవన్నీ చేయి. ముఖ్యంగా నామనసులో శీఘ్రయానరహస్యాన్ని తెలిసికొనాలనే ఆలోచన ఉంది. నాగుర్రాలను వేగంగా నడిచేటట్లు, బలం కలిగేటట్లు చేయి. ఆ విధంగా నీవు చేయగల్గినట్లయితే నీవు అశ్వాధ్యక్షుడవు అవుతావు. నీకు వేతనం నూరునూర్లు (పదివేలు). బాహుకా! వార్ష్ణేయుడు, జీవలుడు అనే అశ్వరక్షకు లిద్దరూ నిన్ను సేవిస్తుంటారు. వారిరువురితో కలసి సంతోషంగా నాఆశ్రయంలో ఉండు.' ఋతుపర్ణమహారాజు నలుణ్ణి ఈ విధంగా గౌరవించాడు. నలుడు ఋతుపర్ణుని నగరంలోనే వార్ష్ణేయజీవలులతో అశ్వాధ్యక్షుడుగా ఉన్నాడు.

నలుడు దమయంతిని నిత్యం తలచుకొంటూనే ఋతుపర్ణుని నగరంలో ఉన్నాడు. ప్రతిరోజు సాయంసమయంలో ఒక శ్లోకాన్ని చదువుకొనేవాడు. 'ఆకలిదప్పికలతో బాధపడుతూ ఆమె ఎక్కడ ఉన్నదో? ఆ తపస్వినిని అలసిపోయి ఎచటపరున్నదో? ఈ మందభాగ్యుని తలచుకొంటూ ఇప్పుడు ఎవని ఆశ్రయంలో ఉన్నదో!' రాత్రిపూట ఇలా అనుకొంటున్న నలుని చూసి జీవలుడు అడిగాడు. 'బాహుకా! ఏ స్త్రీని గురించి తలచుకొంటున్నావు? నీవు నీబాధను గురించి చెపితే వింటాను. బాహుకా! నీవు ఏ స్త్రీ గురించి దుఃఖిస్తున్నావు? ఆమె ఎవనికి సంబంధించిన స్త్రీ?' అని అడిగాడు. నలుడిలా అన్నాడు. 'ఆమె ఒక బుద్ధిహీనుని భార్య. అందరికి ఇష్టురాలు. ఆమెమాట దృఢతరమైంది. ఏదో ఒక కారణంచే

ఆ మందబుద్ధి ఆమెనుండి విడిచిపోయాడు. ఆమెచే విడువబడిన ఆ మందబుద్ధి దుఃఖంతో శోకసంతప్తుడై రాత్రింబగళ్ళు నిద్రకూడ లేకుండా తిరుగుతున్నాడు. రాత్రివేళలో ఆమెను తలచుకొని ఒకశ్లోకాన్ని పాడుతున్నాడు. భూమండలం అంతా తిరుగుతూ ఎప్పుడో, ఎక్కుడో చేరి, ఆతడామెను తలచుకొని ఈ శ్లోకం చదివాడు- అతడుపాపం! వియోగ దుఃఖాన్ని పొందదగనివాడు. ఆమె కష్టసమయాల్లో ఆతనితో అరణ్యాల్లోకూడా అనుసరించింది. అల్పపుణ్యుడైన ఆతనిచే విడువబడింది. ఒంటరిది. లోకం పోకడ తెలియనిది. అడవిదారులలో తిరగటం ఎరుగనిది. అంతటి కష్టం ఆమెకు తగదు. ఆకలి దప్పులతో క్రూరమృగాలుండే అడవిలో తిరుగుతూ ఆమె జీవించడం కష్టం. మందబుద్ధి, మందభాగ్యుడైన ఆతనిచే విడువబడింది, అని ఏదో సమాధానం చెప్పి, ఋతుపర్ణమహారాజు భవనమందే అజ్ఞాతంగా కాలం వెళ్ళబుచ్చుతున్నాడు.

68. భీమమహారాజు పంపిన బ్రాహ్మణుడు చేదిరాజయొక్క భవనమున దమయంతిని చూచుట.

బృహదశ్వ డిలా అన్నాడు. 'రాజ్యభ్రష్టుడైన నలుడు దమయంతితో అరణ్యానికి వెళ్ళిన తర్వాత నలుని చూడాలనే కోరికతో భీమరాజు కొందరు బ్రాహ్మణులను నలుని జాడ తెలిసికోవటం కోసం నియమించాడు. భీమరాజు ఆ బ్రాహ్మణులకు పుష్కలంగా ధనమిచ్చి' నలదమయంతులను వెదుకమని ఆదేశించాడు. ఈపనిలో మీరు కృతార్థులై వారి జాడతెలిసికొని వారిని తీసికొనివచ్చినట్లయితే వేయి ఆవులను ఇస్తానన్నాడు. అగ్రహారాలను ఇస్తా నన్నాడు. నగరంతో సమానమైన గ్రామాన్ని ఇస్తానన్నాడు. వారినిక్కడకు తీసుకొని రాలేకపోయినా తెలుసుకొన్నా చాలు వేయి గోవులను ఇస్తా నన్నాడు. ఈ విధంగా చెప్పి భీమరాజు బ్రాహ్మణులను అన్నిదిక్కులకు పంపాడు. వారు అన్నిదిక్కులకు వెళ్ళి నలదమయంతుల కోసం పట్టణాలను, రాష్ట్రాలను తిరుగుతూ వెదకుతున్నారు. ఎక్కడా నలుడు గాని దమయంతి గాని కనిపించలేదు. వారిలో సుదేవుడనే బ్రాహ్మణుడు చేదిపురాన్ని చేరి అచట రాజగృహంలో ఉన్న దమయంతిని చూశాడు. చేదిరాజైన సుబాహుని పుణ్యాహవాచనంలో సునందతో కలసియున్న ఆమెను చూశాడు. కొద్దికొద్దిగా ప్రకటితమవుతున్న రూపసంపదతో మేఘాలతో కప్పబడిన సూర్యకాంతిలా ఉంది. కృశించి కాంతితగ్గి మలినంగా ఉన్నది. విశాలమైన కనులు మొ కారణాలను బట్టి దమయంతియే అయి ఉంటుందని ఊహచేశాడు.

సుదేవు డిలా అనుకున్నాడు. 'ఈమెరూపాన్ని చూస్తే పూర్వం నేను చూచిన

రూపంగానే తోస్తోంది. లక్ష్మీదేవివలె ఉన్న ఈమెను చూసి కృతార్థుడ నయ్యాను. పున్నమిచంద్రుని వంటి ముఖం, శ్యామవర్ణం, అందమైన స్తనాలూ కల ఈమె తన కాంతితో దిక్కులను వెలుగజేస్తోంది. అందమైన పద్మాలవంటి విశాలనేత్రాలు కల్గిన ఈమె మన్మధునకు రతీదేవిలా సమస్తలోకానికి పూర్ణచంద్రుని కాంతివలె ఇష్టమై కన్పిస్తోంది. విదర్భ అనే సరోవరంనుండి అదృష్టహీనతవల్ల పైకి తీయబడిన పద్మముఖి ఈమె చూశాడు. బురదతో మలినమై పైకి తీయబడిన తామరకాడవలెనున్నది. ఆమె రాహువు మ్రింగిన చంద్రుడున్న పున్నమిరాత్రివలె ఉంది. ఎండిపోయిన నదివలె ఉంది. భర్తృశోకంతో వ్యాకులమనస్కయైనట్లు ఉంది. ఏనుగు తొండాల తాకిడికి రాలిపోయిన రేకులుగల కమలాలు, భయపడిన పక్షులూ కల్గి వ్యాకులమైన సరోవరంలా ఉన్నది. సుకుమారియై అవయవసౌష్ఠవం కలిగి రత్నస్థగితగృహాలలో నివసింపతగినట్లుంది. సరోవరం నుండి పైకి తీయబడి ఎండకు వాడిన తామరతూడులా ఉంది. మంచిరూపం, ఔదార్యాదిగుణాలు కలిగి ఉంది. అలంకారాలకు యోగ్యురాలయినా అలంకరించుకోలేదు. ఆకాశంలో నీలిమేఘాల నడుమ శుక్లపక్షవిదియనాటి చంద్రలేఖవలె ఉన్నది. ఇష్టమైన కామభోగాలూ బంధువులూ లేక, భర్తను చూడాలనే కోరికతో మాత్రమే దేహాన్ని ధరించి ఉన్నది. **ఆభరణాలు లేకపోయినా స్త్రీకి భర్తయే శ్రేష్ఠమైన భూషణం.** శోభకలదైనా ఇప్పుడు పతిలేక ఈమె శోభించటం లేదు. ఈమె లేని నలుడు జీవించియున్నాడన్నా శోకంతో శిథిలం కావటం లేదన్నా అది నలుడు చేస్తున్న దుష్కరకార్యమే. నల్లని కురులూ, కమలాలవంటి నేత్రాలూ గల ఈమె సుఖాల ననుభవించటానికి తగినదైనా దుఃఖాల ననుభవిస్తోంది. ఈ పరిస్థితి చూచి నాకు కూడా బాధ కలుగుతోంది. ఈమె దుఃఖం ఎపుడు తీరిపోతుందో ! సాధ్వియైన ఈమె భర్తతో కలిసి చంద్రునితో రోహిణివలె ఎపుడు ఉంటుందో! రాజ్యభ్రష్టు డైన నలమహారాజు ఈమెను తిరిగిపొందటం వలన, తనరాజ్యాన్ని కూడ తిరిగి పొంది సంతోషాన్ని పొందగలడు. తనతో సమానమైన శీలం, వయస్సు, వంశం గల దమయంతిని పొందటానికి తగినవాడు నలుడు. నలునకు తగినది ఈ దమయంతి. అప్రమేయుడు, పరాక్రమసంపన్నుడైన నలుని భార్య అయిన దమయంతి పతిని చూడాలనే కోరికతో ఉన్నది. ఈమెను ఊరడించటం ప్రస్తుతం నేను చేయతగినపని. ఇతఃపూర్వం దుఃఖం ఎరుగనిది. ఇపుడు దుఃఖార్తయై భర్తృధ్యానతత్పరయై ఉంది. పూర్ణచంద్రముఖి అయిన దమయంతిని నేనిప్పుడు ఊరడిస్తాను.'

వివిధకారణాలచేత, లక్షణాలచేతను ఈ విధంగా ఆలోచించిన సుదేవుడు దమయంతి దగ్గరకు వచ్చి ఇలా అన్నాడు. 'దమయంతీ! నేను సుదేవుడనే బ్రాహ్మణుడను. మీ

అన్నగారి మిత్రుడను. మీతండ్రిగారైన భీమరాజుయొక్క ఆదేశంపై నిన్ను వెదకటానికి ఇలా వచ్చాను. నీ తల్లిదండ్రులు, అన్నదమ్ములు క్షేమంగా ఉన్నారు. వారియొద్దనున్న ఆయుష్మంతులైన నీ పుత్రుడు, పుత్రిక కూడా క్షేమంగానే ఉన్నారు. నీగురించి బంధువర్గమంతా శక్తిహీనులవలె ఉన్నారు. చాలామంది బ్రాహ్మణులు నీకోసం వెదుకుతూ దేశాలన్నీ తిరుగుతున్నారు.' దమయంతి సుదేవుని గుర్తించింది. క్రమంగా తనవారిగురించి, మిత్రులందరిగురించి సుదేవుని అడిగింది. దమయంతి తన అన్నగారికి ఇష్టుడైన సుదేవుని చూసి ఏడ్చింది. ఏకాంతప్రదేశంలో సుదేవునితో జరిగిన విషయాన్నంతా వివరించి చెపుతూ, ఏడుస్తూన్న సైరంధ్రిని చూచి సునంద శోకసంతప్తురాలైంది. సైరంధ్రి బ్రాహ్మణుని చెంత రోదిస్తున్న విషయాన్నంతా సునంద తనతల్లికి చెప్పింది. విషయాన్ని తెలిసికోవాలని ఉంటే వచ్చి ఆమెను గురించి తెలుసుకోమన్నది. సునంద చెప్పిందంతా విన్న తర్వాత రాజమాత అంతఃపురాన్నుండి బ్రాహ్మణునితోబాటు సైరంధ్రి ఉన్న ప్రదేశానికి వచ్చింది. తరువాత రాజమాత సుదేవుని పిలిపించి ఇలా అడిగింది. 'ఈమె ఎవనిభార్య? ఎవనికుమార్తె? ఏవిధంగా ఈమె జ్ఞాతులవల్ల, భర్తవల్ల నష్టాన్ని పొందింది? ఈ స్థితిని పొందటం ఎలా జరిగింది? మీకు తెలుసా? మీవలన ఈమెను గురించిన విషయాన్నంతా సమగ్రంగా వినాలని కోరుతున్నాను. దివ్యరూపంగల ఈమెగురించి యథార్థాన్ని చెప్పండి.' రాజమాత సుదేవుని ఈ విధంగా అడిగి తర్వాత, బ్రాహ్మణోత్తముడైన సుదేవుడు సుఖంగా కూర్చుని దమయంతిని గురించి జరిగింది జరిగినట్లుగా చెప్పాడు.

69. దమయంతి తండ్రిఇంటికి వెళ్ళుట. నలుని కొఱకు బ్రాహ్మణులను పంపుట.

సుదేవుడిలా అన్నాడు. 'రాజమాతా! విదర్భరాజు ఎంతో ధర్మాత్ముడు. భీముడనే పేరుగల తేజశ్శాలి. ఈ కళ్యాణి ఆతనియొక్క పుత్రిక. పేరు దమయంతి. నిషధదేశాధిపతియైన వీరసేనమహారాజు పుత్రుడు, బుద్ధిమంతుడు, పుణ్యశ్లోకుడు అయిన నలమహారాజుకు ఈ దమయంతి భార్య. ఆ నలమహారాజు జూదంలో తన సోదరునిచేత ఓడింపబడి రాజ్యాన్ని కోల్పోయి, దమయంతితో కలిసి, ఎవరికీ తెలియకుండా నగరాన్ని విడిచివెళ్ళాడు. దమయంతి కోసం, ఈ భూమిఅంతటా తిరుగుతున్నాం. మేం వెదకుతున్న ఆ దమయంతి, మీపుత్రుని మందిరంలో కనబడింది. మనుష్యులలో ఈమెతో సమానమైన రూపలావణ్యం గల స్త్రీ మరొక్కతె లేదు. ఈమెకు కనుబొమలమధ్య ఉత్తమస్త్రీకి ఉండవలసిన సహజసిద్ధమైన పుట్టుమచ్చ ఉంది. యౌవనమధ్యస్థయైన ఈ దమయంతి పుట్టుమచ్చ మాలిన్యంతో

కూడిన పద్మంవలెను, మేఘంతో కప్పబడిన చంద్రునివలెను, నాకు కన్పించింది. సంపదలకు చిహ్నమైన ఈ పుట్టుమచ్చ విధాతచే సృజింపబడింది. శుక్లపక్షపాడ్యమి రోజున రేఖామాత్రంగా నున్న చంద్రునివలె మాలిన్యంతో కూడిన ఈమె దేహం మీద దాని సహజరూపం కన్పించటం లేదు. పుటం పెట్టని ముడిబంగారంలా ఈమె ప్రకాశిస్తోంది. శరీరం మలినంగా ఉన్నప్పటికీ, ఆమె భ్రూమధ్యంలో ఉన్న పుట్టుమచ్చయే ఆమె ఔన్నత్యాన్ని సూచిస్తోంది.' సుదేవుని మాటలు విన్న సునంద, ఆమె భ్రూమధ్యంలో ఉన్న పుట్టుమచ్చపై కప్పబడియున్న మాలిన్యాన్ని తొలగించి శుభ్రపరచింది. మాలిన్యాన్ని తొలగించటంతో, ఆకాశంలో మబ్బులు తొలగినతర్వాత స్పష్టంగా భాసించే చంద్రునివలె, దమయంతి పుట్టుమచ్చ సుస్పష్టంగా ప్రకాశించింది. ధర్మజా! రాజమాత, సునంద, ఆ పుట్టుమచ్చను చూచి ఏడుస్తూ, ఆమెను ఆలింగనం చేసికొని క్షణకాలం అలాగే ఉన్నారు. రాజమాత కన్నీటిని తుడుచుకొని మెల్లిగా ఇలా పల్కింది. "నీవు నా చెల్లిలి కుమార్తెవని ఈ పుట్టుమచ్చవల్లనే గుర్తించగలిగాను. దమయంతీ! నీ తల్లిగారు, నేనును దశార్ణదేశాధిపతియైన సుదాముని కుమార్తెలం. ఆమెను (మీ తల్లిగారిని) నిషధేశ్వరుడైన భీమరాజున కిచ్చి వివాహం చేశారు. నీవు పుట్టినప్పుడు, దశార్ణదేశంలో మా తండ్రిగారింట్లో నిన్ను నేను చూశాను. దమయంతీ! నీకు నీ తండ్రిగారి ఇల్లు ఎలాంటిదో నాగృహం కూడ అలాంటిదే! ఈ ఐశ్వర్యాన్నంతా నీదిగానే భావించు. అపుడు దమయంతి సంతోషంతో తనపినతల్లియైన రాజమాతకు నమస్కరించి ఈ విధంగా పలికింది. 'నేను ఎవరినో తెలియనప్పటికీ, మీరు నాకు సుఖప్రదమైన ఆశ్రయాన్ని కల్పించారు. సర్వవిధాల నాకోరికను మన్నించారు. నాకు రక్షణ కల్పించారు. అమ్మా! ఇక్కడ ఉండటం నాకెంతో సుఖదాయికం. సందేహంలేదు. నేను చాలాకాలం నుండి భర్తృపుత్రవియోగంతో ఉన్నాననే విషయం మీకు తెలిసిందే కదా! నాకుమార్తె, కుమారుడును తాతగారింట విదర్భలో ఉన్నారు. తండ్రి వియోగంతో శోకార్తులైనవారికి, నేను కూడ దూరమవటం ఎందుకు? అమ్మా! నాకు ప్రియాన్ని చేయదలచుకొంటే, నన్ను శీఘ్రంగా విదర్భచేర్చటానికి ఆదేశించండి. నేను విదర్భకు వెళ్లాలనుకొంటున్నాను.' దమయంతి మాటలు విన్న పినతల్లి తన పుత్రుని అనుమతితో, సంతోషంగా పంపదలచింది. ఆమెతో వెళ్ళడానికి అసంఖ్యాకపరిజనాన్ని, రక్షకబలాన్ని సిద్ధంచేసింది. భరతశ్రేష్ఠా! ధర్మజా! ఈ ప్రకారంగా రాజమాత, వలసిన మంచి భోజ్యపదార్థాలను సిద్ధంచేసి మేనామీద దమయంతిని విదర్భకు పంపించింది. దమయంతి కొద్దికాలంలోనే విదర్భనగరాన్ని చేరింది. ఆ దమయంతిని, అచటి బంధుజనులంతా ఎంతో సంతోషంతో గౌరవించారు.

క్షేమంగా ఉన్న తన సంతానాన్ని, తల్లిదండ్రులను, సఖీజనాన్ని చూచిన తర్వాత, దమయంతి విధివిధానంగా దేవతారాధన చేసింది. కీర్తిమంతురాలైన దమయంతి వేదపండితులైన బ్రాహ్మణులను పూజించి, నమస్కరించి దీవెనలు పొందింది. భీమరాజు పుత్రికను చూచి సంతోషించి తనపుత్రిని తీసికొనివచ్చిన సుదేవునకు వేయిగోవులను, ఒకగ్రామాన్ని, కొంతధనాన్ని ఇచ్చి గౌరవించాడు. దమయంతి తన తండ్రిగారి గృహంలో విశ్రాంతితో రాత్రి గడిపి తన తల్లితో ఇలా పలికింది. 'అమ్మా! నేను సత్యాన్నే చెప్తున్నాను. నేను జీవించి ఉండాలనే కోరిక నీకు ఉంటే, నలుని మరల తీసికొని రావటానికి ప్రయత్నం చేయి.' దమయంతి ఆ విధంగా పల్కినప్పుడు, తల్లి చెప్పలేనంతగా దుఃఖించి, కన్నీరు కారుస్తూనే ఏమీ బదులు పలుకలేకపోయింది. అట్టి దుఃస్థితిలోనున్న మహారాణిని చూచిన అంతఃపుర పరివారమంతా దుఃఖంతో హాహాకారాలు చేస్తూ వెక్కివెక్కి ఏడ్చారు. పుత్రికయైన దమయంతి తన భర్తనుగురించి దుఃఖిస్తోంది – అంటూ ఈ విషయాన్నంతా మహారాజుకు మహారాణి నివేదించింది. మన కుమార్తె తనకు తానై నోరు విడిచి అడిగింది.(చెప్పడానికి సిగ్గుపడే మన అమ్మాయి, సిగ్గువిడిచి తనకు తానై చెప్పింది.) ఇపుడైనా పుణ్యశ్లోకుడైన నలుని వెదకటానికి మనవారిని పంపి ప్రయత్నించండి. మహారాణి చెప్పిన మాటల్ని విన్న భీమరాజు "నలమహారాజును వెదకుటకు ప్రయత్నించండి అని తన అధీనంలో ఉన్న బ్రాహ్మణులను అన్ని దిక్కులకు పంపించాడు.

భీమరాజు ఆదేశాన్ని అనుసరించి దమయంతి చెంతకేగి బ్రాహ్మణులు తమప్రస్థానాన్ని గురించి చెప్పారు. "మీరు వెళ్ళిన అన్నిరాష్ట్రాలలోనూ, జనసమూహాలున్న ప్రదేశాల్లో అక్కడక్కడ మాటిమాటికి ఈ వాక్యాలను పలకండి" అని దమయంతి బ్రాహ్మణులకు చెప్పింది. "ప్రియుడా! అనురాగవతియైన ప్రేయసిని నిద్రించే సమయంలో అడవిలో విడిచి, సగంచీర చింపుకొని వెళ్ళిన జూదరివి నీవు. నీవు ఎక్కడున్నావు? ఆ సగంచీరతోనే శరీరాన్ని కప్పుకొని, మిక్కిలి దుఃఖంతో దహింపబడుతూ ఆమె నీ కోసమే నిరీక్షిస్తోంది. మహారాజా! ఎల్లప్పుడు ఆమె నీ కోసమే శోకిస్తోంది. ఏడుస్తున్న ఆమెపై దయచూపు. వీరా! సమాధానం చెప్పవయ్యా ! నాయందు దయ ఉంటే, మరోవిషయం కూడ చెప్పాలని ఉంది. వాయువుచే విసరబడిన అగ్ని, వనాన్ని సహితం దహిస్తుంది కదా! భార్య ఎల్లప్పుడూ భర్తచేత భరింప తగింది, రక్షింపతగినది కూడ. ధర్మజ్ఞుడవైన నీవు ఆ కర్తవ్యాలు రెండింటిని ఎందుకు విడిచిపెట్టావు? నీవు ప్రాజ్ఞుడవని, సత్కులంలో పుట్టావనీ, దయగలవాడవనీ, అందరూ చెప్పుకొంటారు. నా దురదృష్టంవల్లనే నీవిలా దయారహితుడవై ప్రవర్తిస్తున్నావని అనుమానిస్తున్నాను. పురుషోత్తమా!నాయందు దయచూపు. దయాస్వభావం

పరమధర్మమని మీవల్లనే నేను విన్నాను." ఈ విధంగా మీరు అంటే మీమాటలకు సమాధానం చెప్పిన వ్యక్తిని మీరు గుర్తించి, "ఆతడెవడో? ఎక్కడున్నాడో తెలిసికోవాలి" అని దమయంతి బ్రాహ్మణోత్తములకు చెప్పింది. 'బ్రాహ్మణోత్తములారా! మీ మాటల కెవరైనా సమాధానమిస్తే ఆతడన్నమాటలు నాకు తెలియజేయండి. మీ మాటలకు సమాధానమిచ్చే వ్యక్తికి మీ గురించి తెలియకుండా మీరు ప్రవర్తించి, ఏలాంటి తొట్రుపాటు లేకుండా, తిరిగి రండి! అతడు ధనవంతుడు కావచ్చు, పేదవాడు కావచ్చు. అసమర్థుడు కావచ్చు. అతడేమి చేయదలచినాడో తెలిసికోవాలి.' ఈ విధంగా దమయంతి చెప్పినవన్నీ విని, బ్రాహ్మణులు వ్యసనపరుడైన నలమహారాజును వెదకటానికై నాల్గుదిక్కులకూ వెళ్ళారు. వాళ్ళు ఆయా రాష్ట్రాలలోని పట్టణాలను, గ్రామాలను, పల్లెలను, ఆశ్రమాలను నలునికోసం వెదికారు. కాని వారు నలుని జాడ తెలిసికొనలేకపోయారు. రాజా! దమయంతి చెప్పిన ఆ వాక్యాలను యథాతథంగా ఆ బ్రాహ్మణు లందరూ అక్కడక్కడ వినిపించసాగారు.

70. తనకు ద్వితీయ స్వయంవరమని దమయంతి ఋతుపర్ణునకు సందేశము పంపుట.

బృహదశ్వ డిలా అన్నాడు. చాలాకాలం గడచినతర్వాత పర్ణాదుడనే బ్రాహ్మణుడు విదర్భకు వచ్చి, దమయంతితో ఈ విధంగా అన్నాడు. 'దమయంతీ! నలమహారాజు జాడతెలిసికొనుటకు వెళ్ళిన నేను అయోధ్యానగరంలో ఋతుపర్ణుని దగ్గరకు వెళ్లాను. ఋతుపర్ణమహారాజుగారి సభలో మీరు చెప్పిన విషయాన్నంతా యథాతథంగా వినిపించాను. అంతా విని ఋతుపర్ణుడు ఏమీ మాట్లాడలేదు. నేను ఎన్నో సార్లు ప్రస్తావించినా ఆతని సభాసదుల్లో ఒక్కడు కూడ నాతో మాట్లాడనే లేదు. రాజుగారి పరివారంలో ఒకడైన బాహుకుడు మహారాజుగారి అనుమతి పొందిన నాతో రహస్యప్రదేశంలో మాట్లాడాడు. ఆతడు రాజుగారి రథసారథి. కురూపి. పొట్టిచేతులు కల్గి ఉన్నాడు. రథాలను అతివేగంగా నడపటంలో అతడు దిట్ట. రుచికరంగా భోజనపదార్థాలను తయారు చేయటంలో నేర్పరి. ఆ బాహుకుడు అనేకసార్లు నిట్టూర్చాడు. మాటిమాటికి ఏడ్చాడు. చివరికి, చాలా క్షేమ సమాచారాలను అడిగి, నాతో ఇలా పలికాడు.

'కులస్త్రీలు ఎన్నికష్టాలు సంభవించినా, వాటిని రహస్యంగా ఉంచుతారు. తన్ను తాను జయించినవాడు, స్వర్గాన్ని జయించిన వాడనటంలో సందేహం లేదు. ఉత్తమస్త్రీలు భర్తవియోగం పొందినా ఎన్నడూ కోపాన్ని పొందరు. తమప్రాణాలకు కవచంగా తమ సత్ప్రవర్తనను ధరిస్తారు. సర్వసుఖాలను కోల్పోయి సంకటస్థితిలో ఉన్న ఆ భర్త భార్యను

విడిచిపెట్టి ఉండవచ్చు. అతని విషయంలో కోపగించటం తగినది కాదు. ప్రాణాలు నిలుపుకోవటానికి ప్రయత్నిస్తూ, పక్షులచే వస్త్రాలు అపహరింపబడి మనోవ్యధతో ఉన్న ఆ భర్తవిషయంలో భార్య కోపగించటం భావ్యం కాదు. భర్త తనను గౌరవించినా, గౌరవింపక పోయినా, రాజ్యభ్రష్టుడైనా, దరిద్రుడైనా, ఆర్తుడైనా, వ్యసన పరుడైనా సరే భార్య అతనిపై కోపాన్ని చూపరాదు.' బాహుకుని మాటలు విన్న నేను త్వరితగతిని ఇచ్చటకు వచ్చాను. అతని మాటలే అతడు నలు డనటానికి పరమప్రమాణాలు. ఈ విషయాన్ని మహారాజునకు నివేదించమని దమయంతికి పర్ణాదుడు చెప్పాడు.

దమయంతి పర్ణాదుని మాటలు విని, కన్నీరు నింపుకొని తనతల్లితో ఏకాంతంలో ఇలా అంది. 'అమ్మా! నేను చెప్పేవిషయాన్ని నాన్నగారికి ఎన్నడూ చెప్పకు. నీసమక్షంలోనే సుదేవుని మనపనికై నియోగిస్తాను. నీవు, నామేలు కోరేదానవైతే నా అభిప్రాయాన్ని తండ్రిగారికి తెలియనీయవద్దు - అది చేయటమే నీ కర్తవ్యం- శుభకరుడైన సుదేవుడు నన్ను బంధుజనాల చెంతకు త్వరితంగా చేర్చాడు. ఆ సుదేవుడే నలునితీసికొని రావటానికి అయోధ్యానగరానికి వెంటనే వెళ్ళాలి.' ద్విజోత్తముడైన పర్ణాదుడు విశ్రాంతి గొని వచ్చిన తర్వాత, దమయంతి అధికధనాన్నిచ్చి సత్కరించింది. నలమహారాజు ఇక్కడకు వస్తే, మరలా మరింత ధనం ఇస్తానని మాట ఇచ్చింది. 'బ్రాహ్మణోత్తమా! అతిత్వరలో నా భర్తను కలిసేటట్లు ఎవ్వరూ చేయలేనంత మేలు మీరు నాకు చేశారు.' దమయంతి ఈ విధంగా పల్కినతర్వాత పర్ణాదుడు దమయంతిని మంగళకరమైన ఆశీస్సులతో ఊరడించి తన గృహానికి చేరాడు. ఆ తర్వాత దుఃఖశోకాలతో ఉన్న దమయంతి తల్లి దగ్గరకు సుదేవుని పిలిపించి ఈ విధంగా పల్కింది. 'సుదేవా! నీవు స్వేచ్ఛగా ఎగిరే పక్షిలా అతిశీఘ్రంగా అయోధ్యానగరానికి వెళ్ళు. ఋతుపర్ణమహారాజుతో ఈమాటను చెప్పు. దమయంతికి తిరిగి స్వయంవరం జరుగుతోంది - రాజులు, రాజపుత్రులు, అందరూ విదర్భకు వెళ్తున్నారు. సుమూహూర్తకాలం రేపే. మహారాజా! మీరు వెళ్లాలనుకొంటే శీఘ్రంగా బయలుదేరండి. నలుడు జీవించియున్నదీ, లేనిదీ దమయంతికి తెలియదు. ఆమె రేపు సూర్యోదయసమయంలో రెండవ భర్తను వరిస్తుంది.' సుదేవుడు అక్కడికి వెళ్ళి, దమయంతి-ఋతుపర్ణమహారాజునకు చెప్పుమన్న మాటలను యథాతథంగా చెప్పాడు.

71. ఋతుపర్ణుడు విదర్భకు వెళ్ళుట.

సుదేవుని మాటలు విన్న ఋతుపర్ణమహారాజు బాహుకునితో మృదువుగా ఇలా మాట్లాడాడు. 'బాహుకా! దమయంతీ స్వయంవరానికి విదర్భకు వెళ్ళాలనుకొంటున్నాను

– నీవు అశ్వహృదయాన్ని తెలిసినవాడవు. ఒకరోజే సమయమని తెలుసుకదా!' ధర్మరాజా! ఋతుపర్ణుడు నలునితో ఇలా పలికిన పిదప నలుని హృదయం దుఃఖంతో కోతకోసినట్లయింది. నలుడు ఈవిధంగా మనస్సులో భావించాడు. 'దమయంతి ఈ విధంగా చెప్పి ఉంటుందా? దుఃఖంలో అజ్ఞానంతో ఇలా చేసిందేమో? లేదా నన్ను రప్పించటానికి ఇదే ఉపాయమని తలచిందా? భర్తయందు గాఢమైన అనురాగం కలది దమయంతి. భర్తనే తలచుకొంటూ కాలం గడిపే తపస్విని. నేనా క్షుద్రుడను. పాపబుద్ధికలవాడను. నావల్లనే ఈ విధంగా జరిగింది. నేను పెద్ద తప్పు చేశాను. లోకంలో స్త్రీ స్వభావం చంచలమైంది. వియోగంవల్ల నాయందలి గాఢమైన ప్రేమను విడచిందేమో! దమయంతికి నావలన కల్గిన శోకంతో, నిరాశకల్గినా సంతానవతియైన యామె ఇలా ఎన్నడూ చేసియుండదే! ఇందులోని సత్యాసత్యాలను ఆచటికే వెళ్ళి తెలిసికొంటాను. విదర్భకు వెళ్లటం ఋతుపర్ణుని కోరికపై అయినా నాప్రయోజనం కూడ నెరవేర్చుకొంటాను.' బాహుకు డీ విధంగా నిశ్చయించుకొని దైన్యంతో అంజలిబద్ధుడై 'మహారాజా! మీమాట ప్రకారం ఒక్కరోజులోనే విదర్భనగరాన్ని చేరగలం' అని విన్నవించాడు.

తర్వాత బాహుకుడు అశ్వశాలకు వెళ్ళి ఋతుపర్ణమహారాజు ఆజ్ఞానుసారం అశ్వాలను పరీక్షించాడు. ఋతుపర్ణమహారాజుచే త్వరపెట్టబడిన బాహుకుడు ఉత్తమాశ్వాలను గుర్తింపదలచి, పలుమార్లు ఆలోచించి, దుర్బలంగా కనిపిస్తున్నా వేగంగా ప్రయాణించగల అశ్వాలను ఎన్నుకొన్నాడు. తేజస్సు, బలం కలిగి, ఉత్తమజాతిలో పుట్టిన, హీనలక్షణాలు లేని, పెద్దముక్కురంధ్రాలు కల గుర్రాలను ఎంచుకొన్నాడు. సింధు దేశంలో పుట్టి, పదిసుడులతో నిర్దుష్టాలై, వాయువేగం గల ఆ గుర్రాలను చూచి మహారాజు కొంచెం కోపంతో ఇలా పలికాడు. 'బాహుకా! మేము నిన్ను కోరినది ఇదియా? వీటితో మేం గమ్యం చేరలేము. ఈ గుఱ్ఱాలు బక్కచిక్కి బలహీనంగా ఉన్నాయి! ఇలాంటి కృశించిన గుర్రాలతో మనం అంతదూరానికి ఎలా వెళ్ళగలం?' – అని ఋతుపర్ణుడు కోపంతో ప్రశ్నించాడు. బాహుకు డిలా అన్నాడు. 'ఒకటి నుదిటియందు, రెండు తలపై, రెండేసి పార్శ్వ ఉపపార్శ్వాలలో, రెండురెండు వక్షస్థలమందు(సుడులు) గల అశ్వమే బాగా ప్రయాణించేదిగా తెలిసికో తగింది. ఈ గుఱ్ఱాలు ఒక్కరోజులోనే విదర్భదేశానికి వెళ్ళగలవు. సందేహం లేదు. రాజా! మీరు, ఇతర అశ్వా లేమయినా మంచివనుకుంటే ఆ గుర్రాలనే రథానికి కడతాను.' ఋతుపర్ణు డిలా అన్నాడు. 'బాహుకా! గుర్రాల శారీరకమానసిక తత్త్వాలను బాగా తెలిసిన నేర్పరివి నీవు. నీవు సమర్థాలని తలచిన గుర్రాలనే రథానికి పూన్చు.' మహారాజుమాటలు విన్న తర్వాత, బాహుకుడు కులశీలాలు కల్గి వేగంగా

పయనింపగల నాల్గు మంచిగుర్రాలను రథానికి పూన్చాడు.

బుతుపర్ణమహారాజు త్వరగా రథాన్ని అధిరోహించాడు. ఆ ఉత్తమాశ్వాలు మోకాళ్ళతో భూమిని తాకాయి. ధర్మరాజా! తర్వాత నలుడు తేజోబలసమన్వితాలైన ఆ అశ్వాలను ఊరడించాడు. బాహుకుడు పగ్గాలను పట్టి బయలుదేరాలని తలంచాడు. బాహుకునిచే ఆదలింపబడిన ఆ ఉత్తమాశ్వాలు ఆకాశంపై కెగసి పరుగులు తీస్తూ రథంలో ఉన్న బుతుపర్ణమహారాజును ఆశ్చర్యచకితుని చేశాయి. రథం ధ్వనిని విన్న వార్ష్ణేయుడు, బాహుకుని గుర్రాల ఎన్నికను, అశ్వహృదయతత్త్వజ్ఞతను గురించి ఆలోచించాడు. 'ఈ బాహుకుడు ఇంద్రుని రథసారథియైన మాతలికాదుకదా! ఇతనియందు ఆ లక్షణాలు కనిపిస్తున్నాయి. గుర్రాలజాతిని, వాని తత్త్వాన్ని బాగుగా తెలిసిన శాలిహోత్రుడా ఏమి? ఆతడే మనుష్యరూపాన్ని పొందాడేమో? లేదా శత్రుంజయుడైన నలమహారాజేనా? ఆ నలమహారాజే ఈ రూపంలో వచ్చాడా?' అని, వార్ష్ణేయుడు ఇంకా ఇలా భావించాడు. 'భూలోకంలో అశ్వశాస్త్రం తెలిసినవాడు నలమహారాజు. ఆ విద్యయే బాహుకునకు తెలియును. ఈ విషయంలో నలునకు బాహుకునకు సామ్యం కనిపిస్తోంది! అంతేకాక, నలుడూ బాహుకుడూ సమవయస్కులు. మహాపరాక్రమవంతుడైన నలుడు మాత్రం ఇతడు కాడు. కాని విద్య మాత్రం అదే. విధివశంచేత గాని, దైవప్రేరణచే గాని, మహాత్ములు కొందరు ప్రచ్ఛన్నరూపంతో పృథివిపై సంచరిస్తూంటారని శాస్త్రవాక్యాలు నిరూపిస్తున్నాయి. బాహుకుని శరీరం యొక్క విరూపాన్ని గురించి సందిగ్ధస్థితి లేకపోయినట్లయితే ప్రమాణహీనమైనా సరే, నలుడనియే నా మనస్సుకు తోస్తోంది. ఇరువురికి వయస్సు సమానమైనప్పటికీ రూపంలో తేడా ఉంది. నా మనస్సులో మాత్రం సర్వగుణసమన్వితుడైన నలుడే ఈ బాహుకు డనిపిస్తోంది.' పుణ్యశ్లోకుడైన బుతుపర్ణుని రథసారథియగు వార్ష్ణేయుడు బాహుకుని గూర్చి ఇలా పలువిధాల ఆలోచించాడు. బుతుపర్ణమహారాజు బాహుకుని హయతత్త్వజ్ఞతను గూర్చి బాగా యోచించి చాలా సంతోషించాడు. బాహుకుని ఏకాగ్రతను, ఉత్సాహాన్ని, గుర్రాల ఎన్నికల్లో నేర్పరితనాన్ని, ఉత్కృష్టమైన ఆతని ప్రయత్నాన్ని చూసి, బుతుపర్ణమహారాజు ఎంతో సంతోషాన్ని పొందాడు.

72. నలుడు బుతుపర్ణుని నుండి ద్యూతవిద్యారహస్యము గ్రహించుట - వలుని శరీరమునుండి కలి నిష్క్రమించుట.

బాహుకుడు రథాన్ని నడుపుతూంటే, ఆకాశంలో పయనిస్తున్నట్లుగా అది నదులను, పర్వతాలను, అరణ్యాలను, సరస్సులను శీఘ్రంగా అధిగమించింది. రథం మహావేగంగా

ప్రయాణిస్తున్నప్పుడు తన భుజాన్నుండి ఉత్తరీయం జారిక్రిందపడినట్లు మహారాజు చూశాడు. వెనువెంటనే మహారాజు, 'ఉత్తరీయం జారిక్రిందపడింది. దాన్ని తీసికొంటాను! బాహుకా! పరుగులు తీయించే గుర్రాలను ఆపుచేయి. క్రిందపడిన ఉత్తరీయాన్ని ఈ వార్ష్ణేయుడు తీసికొని రావా'లని పలికాడు. రథం అపుడే యోజన దూరం వచ్చేసింది. రథాన్ని ఆపినప్పటికిని, ఉత్తరీయాన్ని తీసికొనిరావటం సాధ్యంకాదని నలుడు సమాధానం చెప్పాడు. నలు డీ విధంగా చెప్పిన తర్వాత ఋతుపర్ణమహారాజు ఆ అరణ్యంలో ఫలసమృద్ధమైన ఓ తాండ్రచెట్టును సమీపించాడు. ఆ తాండ్రచెట్టును చూచిన ఋతుపర్ణమహారాజు బాహుకునితో తొందరగా ఇలా పలికాడు. 'సారథీ! నాకు సంఖ్యాశాస్త్రంలో విశిష్టమైన శక్తి ఉంది. ఇది నీవు చూడాల్సిన విషయం. అందరికీ అన్నీ తెలియవు. ఏ ఒక్కడూ సర్వజ్ఞుడు కాడు. పరాకాష్ఠనందిన జ్ఞానం ఒకనిలోనే ఉండదు. ఈ వృక్షానికి ఆకులు, పండ్లు ఉన్నాయి. బాహుకా! ఈ తాండ్రచెట్టునుండి రాలిపడిన ఆకులు నూటొక్కటి, పండు ఒకటి. ఈ వృక్షానికి ఉన్న రెండు కొమ్మలకు, ఐదుకోట్ల ఆకులున్నాయి. ఆ శాఖలకుకొన్ని ప్రశాఖలున్నాయి. ఆ రెండు శాఖలకు రెండువేల తొంభై ఐదు ఫలాలున్నాయి.'

అప్పుడు బాహుకుడు రథాన్ని ఆపి మహారాజుతో ఇలా పలికాడు. 'మీరు చెప్పింది నాకు పరోక్షంగానే ఉంది. ఈ తాండ్రవృక్షం విషయంలో మీరు చెప్పినదాన్నిబట్టి లెక్కించి దానిని ప్రత్యక్షం చేస్తాను. మహారాజా! తాండ్రచెట్టు విషయంలో మీరు తెల్పిన సంఖ్యలను లెక్కించినిదే సరియైనదో కాదో నాకు తెలియదు కదా! ఫలాలను లెక్కించి చూస్తాను. రాజా! ఒక్కముహూర్తకాలం ఈ కళ్ళాలను వార్ష్ణేయుడు పట్టుకొంటాడు.' ఆలస్యం చేయటానికి తగిన సమయం కాదని, బాహుకునితో ఋతుపర్ణుడన్నాడు. అంత బాహుకుడు మహారాజు ఋతుపర్ణునితో ఇలా అన్నాడు. 'ఉత్కృష్టమైన ప్రయత్నం జరుగుతోంది. ముహూర్తకాలం వేచి చూడండి. కాదని త్వరపడితే మీరు వార్ష్ణేయుని సారథిగా తీసుకొని వెళ్లండి. మీకు శుభమగుగాక.' అన్నాడు. ధర్మరాజా! ఋతుపర్ణుడు బాహుకుని ఊరడిస్తూ 'నీవే సారథ్యం వహించాలి. ఈ భూతలంలో సారథ్యం చేసే విషయంలో నీకు సాటి ఎవ్వరూ లేరు. నీ సారథ్యంతోనే నేను విదర్భదేశాన్ని చేరాలి - ప్రపత్తితో నిన్ను శరణువేడుతున్నాను. విఘ్నాన్ని కలుగచేయవద్దు. బాహుకా! నీవు చెప్పినట్లే చేస్తాను. తెల్లవారేసరికి విదర్భ చేరాలి. సూర్యుని నాకు చూపించాలి.'అన్నాడు. తాని(తాండ్ర) పండ్లను లెక్కించిన వెంటనే విదర్భకు చేరగలం. నామాటను మన్నింపుడని బాహుకుడు ఋతుపర్ణునితో పలికాడు. తనకు ఇష్టంలేనట్లు ఋతుపర్ణమహారాజు బాహుకునితో "కొమ్మలో కొంతభాగం లెక్కించి చెప్పి ప్రీతిచెందు" అన్నాడు. అంతట బాహుకుడు

రథం దిగి ఆ చెట్టును నరికాడు. బాహుకుడు పండ్లను లెక్కించి మహారాజు చెప్పినవిధంగానే పండ్లు ఉండటాన్ని చూచి ఆశ్చర్యచకితుడై, ఋతుపర్ణమహారాజుతో ఇట్లన్నాడు. 'మహారాజా! ఇది అత్యద్భుతమైంది. మీ విద్యాబలాన్ని ప్రత్యక్షంగా చూశాను. మీరు ఏ విద్యతో సంఖ్యను చెప్పగలుగుతున్నారో, ఆవిద్యను గూర్చి వినగోరుతున్నాను.' అని బాహుకుడు అడిగాడు. మహారాజు ప్రయాణాన్ని తొందరచేస్తూనే, ఆవిద్యపేరు, అక్షహృదయమనీ, తనను సంఖ్యా విశారదునిగా అక్షహృదయజ్ఞునిగా గ్రహించమనీ చెప్పాడు. అంతట బాహుకుడు, మహారాజుతో - "పురుషశ్రేష్ఠుడవైన ఋతుపర్ణమహారాజా! అక్షహృదయవిద్యను నాకు అనుగ్రహించు. నావలన అశ్వహృదయవిద్యను నీవు గ్రహించు" - అని పలికాడు. ఋతుపర్ణమహారాజు కార్యభారం వల్లనూ, అశ్వహృదయవిద్యను పొందాలనే ఆశవల్లనూ, బాహుకుని కోర్కెను అంగీకరించాడు. 'బాహుకా! నీవుకోరినట్లే, అక్షహృదయవిద్యను నీవు గ్రహించు. అశ్వహృదయవిద్యను నాకు ప్రసాదించు' అని పలికి ఋతుపర్ణుడు అక్షహృదయవిద్యను బాహుకునకు ఉపదేశించాడు.

కర్కోటక విషాన్ని మాటిమాటికి నోటి నుండి క్రక్కుతూ, కలి అక్షహృదయ విద్యను గ్రహించిన నలుని శరీరం నుండి బయట పడ్డాడు. అప్పుడు విషరూపమయిన కలిశాపాగ్ని కూడా బయటపడింది. ఆ కలి పెట్టిన బాధవల్లనే అంతవరకు నలుడు కర్తవ్యమూఢు డయ్యాడు. విషవిముక్తుడైన కలి స్వస్వరూపాన్ని పొందాడు. దాంతో విషయాన్నంతా అర్థంచేసికొన్న నలమహారాజు కోపంతో కలిపురుషుని శపింపబోయాడు. అపుడు కలి చేతులు జోడించాడు. వణకిపోయాడు. భయపడిపోతూ ఇలా అన్నాడు 'మహారాజా! కోపాన్ని నిగ్రహించుకోండి! మీకు అపారమైన కీర్తిని కలుగజేస్తాను. నీ చే విడిచిపెట్టబడిన ఇంద్రసేనుని తల్లి నీపై కోపం కల్గినా నిన్ను శపించలేదు. కాని ఆమె శాపంచేత నీ శరీరమందుండి నేను మిక్కిలి బాధ పొందాను. నేను నీ శరీరంలో ఉన్నప్పుడు చాలాదుఃఖాన్ని పొందాను. నాగరాజైన తక్షకుని కాటుచే నిన్నుపొందిన విషం నీలోనున్న నన్ను రాత్రింబవళ్ళు దహించింది. నేనిపుడు నిన్ను శరణు పొందాను. నామాట విను. శరణుపొందిన నన్ను నీవు శపించకుండా ఉన్నట్లయితే లోకంలో నిన్ను కీర్తించే మనుజులకు నావలన ఏ భయమూ ఉండదు' అని కలిపురుషుడు పలికిన పిదప నలుడు తన కోపాన్ని మరల్చుకొన్నాడు.

భయపడిన కలి వెంటనే తాండ్రచెట్టులో ప్రవేశించి అదృశ్యమైపోయాడు. ఆ తాండ్రచెట్టుకుగల ఫలాలను లెక్కించి కలిదోషం తొలగి, విగతజ్వరుడైన నలుడు - తేజస్వియై సమధికోత్సాహంతో రథాన్ని అధిరోహించి బయలుదేరాడు. కలిపురుషుడు

తనలో ప్రవేశించటం వలన నాటినుండి తాండ్రచెట్టు అపఖ్యాతిని పొందింది. నలుడు రథాన్ని నడుపుతూంటే గుర్రాలు పక్షుల్లా ఆకాశంలో ఎగురుతున్నాయి. నలమహారాజు సంతుష్టాంతరంగుడై విదర్భదేశంవైపు పయనం సాగించాడు. నలుడు నిష్క్రమించగానే కలికూడా ఇంటికి వెళ్ళాడు. రాజా! కలి విడవగానే నలుని చింత తొలగిపోయింది. రూపం మాత్రం అలాగే ఉండిపోయింది.

73. దమయంతి ఆలోచనము.

బృహదశ్వ డిలా అన్నాడు- సూర్యాస్తమయానికే సత్యవిక్రముడైన నలుడు ఋతుపర్ణునితో విదర్భదేశం చేరాడు. ఋతుపర్ణమహారాజు రాకను విదర్భాధిపతికి ప్రజలు తెలిపారు. భీమరాజు ఆహ్వానంతో దిక్కులన్నిటా రథఘోషలు ప్రతిధ్వనిస్తూ ఋతుపర్ణమహారాజు కుండిన నగరంలోనికి ప్రవేశించాడు. ఆ నగరంలోనే ఉన్న నలుని గుర్రాలు ఆ రథఘోషను విన్నాయి. విని గతంలో నలుని సాన్నిధ్యంలో పొందినంత ఆనందాన్నీ పొందాయి. వర్షాకాలమందలి మేఘధ్వనులవలె గంభీరంగా శబ్దిస్తున్న నలుని రథఘోషను దమయంతి విన్నది. ఆ మహాధ్వనిని విన్న దమయంతి పరమాశ్చర్యాన్ని పొందింది.గతంలో నలుడు తన గుర్రాలను పూన్చి నడుపుతున్నప్పుడు వచ్చిన రథఘోషతో సమానమైన ధ్వనిగా దానిని దమయంతి, అక్కడున్న గుర్రాలు కూడా భావించాయి. నలుని రథఘోషను భవనాలపై నున్న నెమళ్ళు, గజశాలలోనున్న ఏనుగులు, అశ్వశాలలోని గుర్రాలు కూడ విన్నాయి. ఆ రథధ్వనిని విన్న ఏనుగులు, నెమళ్ళు మేఘధ్వనులనుకొని ఉత్సాహంతో తలలు పైకెత్తి ఘీంకారాలు, క్రేంకారాలు చేశాయి. దమయంతి ఇలా అనుకొన్నది. 'భూమండల మంతా నింపుతున్నట్లు ఈ రథధ్వని నామనస్సుకెంతో సంతోషాన్ని కల్గిస్తోంది. ఆతడు నలమహారాజే. ఇప్పుడు నేను అమేయగుణసంపన్నుడై, వీరుడై, చంద్రునివలె ఆహ్లాదాన్ని కల్గించే మోముగల నలుని చూడకపోతే బ్రతుకను. సందేహం లేదు. వీరుడైన ఆ నలమహారాజు బాహుబంధంలో సుఖస్పర్శ ననుభవింపకపోతే నేడు నేను బ్రతుకలేను. మేఘగంభీర రథఘోష కల నలమహారాజు నన్ను చేరకపోతే, ఇప్పుడే బంగారం వలె మండుతున్న అగ్నిలో ప్రవేశిస్తాను. సింహపరాక్రమం, మదపుటేనుగువంటి నడక కల నలుడు నన్ను చేరనిచో నేను నశిస్తాను. సందేహం లేదు. నేనెన్నడును అసత్యాన్ని తలంచను. అపకార భావం నాలోలేదు. చెడ్డమాటలను పరిహాసానికైనా పలుకను. నలమహారాజు, ఓర్పుకలవాడు, వీరుడు, గొప్పదాత. రహస్యంగా కూడా ఎన్నడూ నీచంగా ప్రవర్తించడు. పరస్త్రీల పట్ల నపుంసకునివలె ప్రవర్తిస్తాడు. నలధ్యానతత్పరనై, నలునే స్మరించే నాకు

ప్రియుని వియోగంచే కల్గిన శోకం వలన రాత్రింబవళ్లు నా హృదయం బ్రద్దలవుతోంది.'

భారతా! ఈ విధంగా ఏడుస్తూనే, దాదాపు స్పృహలేనిస్థితిలో నలమహారాజును చూడాలనే కోరికతో మేడపైకి ఎక్కింది. అంతలో వార్ష్ణేయునితో, బాహుకునితో సహా రథంపైనున్న ఋతుపర్ణమహారాజును మేడపైగల మధ్యమకక్షనుండి చూచింది. రథం దిగిన వార్ష్ణేయబాహుకులు,రథానికి పూన్చిన గుర్రాలను విప్పి రథాన్ని అచ్చట నిలిపారు. రథంలో కూర్చునిఉన్న ఋతుపర్ణమహారాజు రథం దిగి, భీమమహారాజు సమీపానికి వచ్చాడు. భీమరాజు సగౌరవంగా ఎదురేగి ఋతుపర్ణమహారాజును సత్కరించాడు. ఋతుపర్ణుడు ఆయన చేసిన సత్కారాలను స్వీకరించాడు. కుండిననగరాన్ని చేరిన ఋతుపర్ణమహారాజుకు అక్కడ స్వయంవర విశేషాలేమీ కన్పించలేదు. ఆపై ఋతుపర్ణుడు భీమమహారాజును కలిసినపుడు కూడ, అకస్మాత్తుగ వచ్చిన స్వయంవరవార్త ఆయనకేమీ తెలియదు. భీమమహారాజు ఋతుపర్ణమహారాజునకు స్వాగతం పల్కి, వారికై తానేమి చేయవలెనో చెప్పమని అడిగినాడు. భీమమహారాజుకు తనకుమార్తె యొక్క స్వయంవర నిమిత్తం ఋతుపర్ణుడు వచ్చినట్లు తెలియదు. ఋతుపర్ణమహారాజు కూడ బుద్ధిమంతుడు, పరాక్రమశాలి, సత్యవంతుడు కనుకనే దమయంతీ స్వయంవరాన్ని గురించి ప్రస్తావించలేదు. రాజులు కానీ రాజకుమారులు కానీ కనిపించటంలేదు. స్వయంవరప్రసక్తి లేదు. విప్రసమాగమం లేదు. దానితో ఋతువర్ణుడు మనస్సులో ఏదో అనుకొని 'మీకు నమస్కరించటానికి వచ్చాను' అని పలికాడు. భీమరాజు కూడా ఆశ్చర్యపడి ఆలోచించినా అన్ని యోజనాలు ప్రయాణించి, అని గ్రామాలను దాటి ఋతుపర్ణుడు రావటంలోని కారణాన్ని గ్రహించ లేకపోయాడు. పైగా ఆయన చాలా చిన్న కారణాన్ని చెపుతున్నాడు. 'అసలు కారణమేదో తరువాత తెలుస్తుందిలే. ఈయన చెప్తున్నది మాత్రం అసలు కారణం కాదు' అనుకొని భీమరాజు ఋతువర్ణుని సత్కరించి పంపాడు. 'మీరెంతగానో అలసిపోయారు. విశ్రాంతి తీసికోండి' అని పదేపదే అత్యంతప్రీతితో భీమరాజు పలుకుతుంటే, ఋతుపర్ణుడు ఎంతో సంతోషపడ్డాడు. ఋతుపర్ణుడు, వార్ష్ణేయునితో కలసి, భీమరాజు నిర్దేశించిన గృహానికి వెళ్ళాడు. బాహుకుడు రథాన్నితీసికొనీ రథశాలకు వెళ్ళాడు. అక్కడ గుర్రాలను విడిచి, వాటికి చక్కగా శాస్త్రసమ్మతంగా చేయతగిన ఉపచర్యలు చేసి రథం మీదనే కూర్చున్నాడు.

శోకార్తయైన దమయంతి ఋతుపర్ణుని, వార్ష్ణేయుని, బాహుకుని చూసి 'ఈ రథధ్వని ఎవనిదా?' అని అనుకొంది. ఈ మహాధ్వని నలునిదే కాని నలుడు కన్పించటం లేదు. లేక నలుని వలన వార్ష్ణేయుడావిద్య నేర్చుకొన్నాడా? అందుచేతనే రథనిర్ఘోషం

నలునిరథఘోషను పోలి ఉంది. ఋతుపర్ణుడు కూడ నలునివంటి మహారాజే! అందుచేతనే అతని రథనిర్ఘోషం నలుని రథఘోషవలె ఉందా - అని దమయంతి అనేకవిధాల తర్కించుకొన్నది. రాజా! దమయంతి పలువిధాల తర్కించుకొన్న తర్వాత నలుని వెదకటానికి ఒక దూతికను పంపింది.

74. బాహుక కేశినీ సంవాదము.

దమయంతి ఇలా అన్నది. 'కేశినీ! నీవు అచటకు వెళ్ళు. ఆ రథం ప్రక్కన పాట్టిచేతులు, వికృతరూపంతో ఒకడు కూర్చొని ఉన్నాడు. ఆ రథసారథి ఎవరో తెలుసుకో! భద్రా! కేశినీ! ఆ పురుషుని చెంతకేగి ఏమాత్రం తొందరపాటు లేకుండా, మృదువుగా క్షేమసమాచారాలడిగి ఆతనిని గురించి తెలుసుకో! ఆతడే నలమహారాజని అనుమానం కలుగుతోంది. మనస్సుకు సంతోషం, హృదయానికి సుఖం కలుగుతోంది. దానితో ఆ భావం గట్టిపడుతోంది. సుశ్రోణీ ! అనిందితా! అతనితో సంభాషణ ముగిసే సమయంలో పర్ణాదుడు చెప్పిన మాటలన్నీ పలుకు. నీపలుకులకు ఆత డేమి సమాధానం చెపుతాడో తెలుసుకో!' కేశిని యనే దూతి నెమ్మదిగావెళ్ళి బాహుకునితో ఇలా మాట్లాడింది. దమయంతి ప్రాసాదంపైనుండి చూస్తోంది.

కేశిని ఇలా పలికింది. 'మానవేంద్రా! మీకు స్వాగతం. మీరుక్షేమంగా ఉన్నారుకదా! పురుషశ్రేష్ఠా! దమయంతి మాటలను వినండి. మీరెప్పుడు బయలుదేరారు? ఇక్కడకు ఎందుకు వచ్చారు? మీరు ఆ విషయం గురించి యథార్థాన్ని చెప్పండి. దమయంతి వినగోరుతున్నది.' బాహుకుడిలా అన్నాడు. 'కోసలదేశాధీశుడైన ఋతుపర్ణ మహారాజు ఒకబ్రాహ్మణోత్తముని వలన దమయంతికి ద్వితీయ స్వయంవరం రేపు జరుగుతోందని విన్నాడు. ఆ బ్రాహ్మణుని వలన ఈ విషయాన్ని విన్నవెంటనే మహారాజు ప్రయాణానికి సిద్ధమయ్యాడు. నూరు యోజనాల దూరం, శీఘ్రంగా పయనింపగల గుర్రాలతో రథాన్ని సిద్ధంచేశాను. నేను ఆ ఋతుపర్ణని సారథిని.' కేశిని ఇలా పలికింది. 'మీలో ఆ మూడవవ్యక్తి ఎవనికి సంబంధించిన వాడు? ఇంతటి మహత్కార్యం నీపై ఎందుకు ఉంచబడింది?' బాహుకు డిలా అన్నాడు. 'భద్రాఆ మూడవ వ్యక్తి నల మహారాజుగారి రథసారథిగా ప్రసిద్ధిపొందిన వార్ష్ణేయుడు. నలమహారాజు రాజ్యాన్ని వదలివెళ్ళిన తర్వాత వార్ష్ణేయుడు ఋతుపర్ణమహారాజు చెంత చేరాడు. నేనుకూడ అశ్వశాస్త్ర రహస్యాలు తెలిసినవాణ్ణి. రథసారథ్యం కూడ బాగా తెలిసినవాడినే! అందుచేతనే నన్ను ఋతుపర్ణమహారాజు సారథిగా నియమించారు. అంతే కాదు. వంటవానిగ కూడ నన్నే నియమించారు.' కేశిని

ఇలా అన్నది. 'బాహుకా! నలు డెక్కడకు వెళ్ళినది వార్ష్ణేయునకు తెలుసా? ఆతడెప్పుడైన నీ కీ విషయాన్ని చెప్పే ఉండాలి!' బాహుకుడిలా అన్నాడు. 'సత్కర్మలాచరించిన నలుని పుత్రుని, పుత్రికను ఇక్కడ ఉంచినతర్వాత వార్ష్ణేయుడు స్వేచ్ఛగా వెళ్ళిపోయాడు. నలుని గురించి అతనికి తెలియదు. నలుని గురించి ఇతరుల్వెరికీ కూడా తెలియదు. మహారాజు తన రూపాన్ని కోల్పోయి ఈలోకంలో నిగూఢంగా తిరుగుతున్నాడు. ఆ పరమాత్మకే తెలియాలి నలుడు - లేదా నలుని అంతరాత్మకు తెలియాలి. తన గుర్తులేమిటో నలుడెవరికీ ఎప్పుడూ చెప్పలేదు.'

కేశిని ఇలా అన్నది. 'బాహుకా! ఓ స్త్రీకి సంబంధించిన వాక్యాలను చెపుతూ, ఇంతకుముందే ఒక బ్రాహ్మణుడు అయోధ్యానగరానికి వచ్చాడు ఆ మాటలు ఇవి. ప్రియా! నీపై అనురాగం గల ప్రేయసిని నేను, నిద్రిస్తున్న సమయాన ఒక వంచకునివలె నాచీరను సగం చింపుకొని నన్ను అరణ్యంలో విడిచి ఎక్కడకు వెళ్ళావు? ఆమె నీవు ఆదేశించిన స్థితిలోనే, అదేవిధంగా నీకై ఎదురుచూస్తోంది. అహోరాత్రాలు వియోగాగ్నిచే దహింప బడుతోంది. ఇప్పటికీ ఆ సగం చీరతోనే ఉంది. పృధ్వీపతీ! ఆ దమయంతి నీకు కల్గిన దుఃఖంచేతనే ఎల్లప్పుడూ వీడుస్తూనే ఉంది. మహావీరా! ఆమెపై దయతో నాకు జవాబు చెప్పు. సద్బుద్ధిగల మహారాజా! ఆమెకు ప్రియమైన నలుని కథను చెప్పండి! అనిందితమైన దమయంతి ఆ మాటలనే వినదలచింది. ఇతఃపూర్వం అయోధ్యకు వచ్చిన బ్రాహ్మణునికి మీరు చెప్పిన సమాధానాన్నే ఇప్పుడు మీముఖతః మరల దమయంతి వినదలచింది.' కేశిని ఈ విధంగా మాట్లాడిన తర్వాత నలుని హృదయం వ్యధచెంది కళ్లు చెమ్మగిల్లాయి. పృధ్వీపతియైన నలుడు, వేదనచే దహింపబడుతున్నా తన దుఃఖాన్ని నిగ్రహించుకొని, బాష్పరుద్ధమైన వాక్కుతో తిరిగి ఇలా పలికాడు. 'కష్టాలు కలిగిన విషమస్థితిలో కూడ కులస్త్రీలు ఇతరులకు తెలియనీక తమలోనే దాచుకొంటారు. అలాంటివారు స్వర్గాన్ని జయించినట్లే! ఈవిషయంలో ఏమాత్రం సందేహం లేదు. సాధ్వులైన ఉత్తమస్త్రీలు భర్తలు విడనాడిన సమయాల్లో కూడ ఎన్నడునూ కోపాన్ని పొందరు. నడివడి అనే కవచంతోనే ప్రాణాలను రక్షించుకొంటారు. సర్వసుఖాలను కోలుపోయి సంకట స్థితిలోనున్న ఆ భర్త భార్యను విడిచిపెట్టి ఉండవచ్చు. అతని విషయంలో కోపగించటం తగినది కాదు. ప్రాణాలు నిలుపుకోవటానికి ప్రయత్నిస్తూ పక్షులచే వస్త్రాలు అపహరింపబడి మనోవ్యధతో ఉన్న ఆ భర్త విషయంలో భార్య కోపగించటం భావ్యం కాదు. భర్త తనను గౌరవించినా, గౌరవించకపోయినా రాజ్యభ్రష్టుడైనా, దరిద్రుడైనా, ఆర్తుడైనా వ్యసనపరుడైనా, సరే భార్య అతనిపై కోపాన్ని చూపరాదు. అంటూ చెప్పలేనంత దుఃఖంతో కూడిన

మనస్సుతో నలుడు ఈ విధంగా మాట్లాడుతూనే కన్నీరు ఆపుకోలేక బావురుమని ఏడ్చాడు.' అదంతా గమనించిన కేశిని అక్కడనుంచి వెళ్ళి అతని చేష్టలతో సహా అక్కడ జరిగినదంతా దమయంతికి తెలియజేసింది.

75.దమయంతి తన పుత్రికను, పుత్రుని బాహుకుని దగ్గరకు పంపుట.

బృహదశ్వ డిలా అన్నాడు. 'ఆ విషయాన్నంతా విన్న దమయంతి అత్యంత దుఃఖాన్ని పొందింది. అతడు నలుడే అని అనుమానించి కేశినితో ఇలా పలికింది. 'కేశినీ! నీవు మళ్లీ బాహుకుని దగ్గరకు వెళ్ళు. అతనిని ఇంకా పరీక్షించు. ఏమీ మాట్లాడకుండ ప్రక్కనే ఉండి అతని పనులను గమనించు. అతడెప్పుడు ఏచిన్న పనిచేసినా దానికి కారణం ఉంటుంది. అతడు చేసేపనుల్లో ఏదో ప్రత్యేకత ఉంటుంది. సరిగా గమనించు. కేశినీ! అతడు పట్టుబట్టినా నిప్పును సమకూర్చవద్దు. అడగుతున్నా సరే తొందరపడి నీటిని కూడా ఇవ్వవద్దు. పైన చెప్పిన విషయాలన్నీ గమనించి, అతని ప్రవర్తనను గురించి నాకు తెలియజేయి. అతనిలో దైవమానుష సంబంధమైన చర్యలేమైనా చూస్తే వెంటనే వాటిని నాకు తెలియజేయి. ఇంకా ఏవి చూసినా ఆ విశేషాలన్నీ చెప్పు. కేశిని దమయంతి చెప్పినవన్నీ విని, బాహుకుని చెంతకు వెళ్ళి ఆతని విలక్షణమైన పనులన్నీ గ్రహించి తిరిగి వచ్చింది. తిరిగివచ్చిన కేశిని, బాహుకునిలో తాను చూచిన దైవమానుషనిమిత్తాలను యథాతథంగా దమయంతికి నివేదించింది.

కేశిని ఇలా అన్నది. 'పారిశుద్ధ్యాన్ని పాటించే విషయంలో అతనికున్నంత పట్టుదల మానవుల్లో ఎక్కడా కనలేదు, వినలేదు. నలుడెప్పుడునూ పాట్టిగానున్న ద్వారం దగ్గర తల వంచడు. నలుడు దానిని చూచినపుడు, అదియే నలునకు సరిపడేటట్లు పైకిలేస్తుంది. సుఖంగా అతడు ద్వారం దాటుతాడు. సంకటస్థితిలో ఉన్నా ఆ మహత్ముని చర్యలు చాలగొప్పవిగా ఉన్నాయి. ఋతుపర్ణునికోసం అనేకవిధాలైన భోజనపదార్థాలను తయారుచేస్తున్నాడు. వంటశాలకు రాజుగారు పంపించిన మాంసం పెద్దరాశివలె ఉంది. ఆ మాంసాన్ని కడగటం కోసం కడవలు అక్కడ సిద్ధం చేయబడ్డాయి. బాహుకుడు కుండలవైపు చూడగానే అవన్నీ నీటితో నిండిపోయాయి. తర్వాత నలుడు ఆ నీటితో మాంసాన్ని శుభ్రంగా కడిగాడు. ఆ తర్వాత ఓ పిడికెడు గడ్డి తీసుకొని దానిని సూర్యునివైపు చూపగానే అది మండింది. దానితో అగ్నిని సిద్ధం చేశాడు. ఆ అద్భుతాన్ని చూచి ఆశ్చర్యాన్ని పొంది ఇచ్చటకు వచ్చాను. ఇలాంటిదే మరో ఆశ్చర్యకరమైన విషయాన్ని నేను చూశాను. దమయంతీ! అతడు అగ్నిని తాకినప్పటికి అది వానిని దహించటం

లేదు. కోరగానే నీరు అతని చెంతకే వస్తోంది. మిక్కిలి ఆశ్చర్యకరమైన మరోవిషయాన్ని కూడ నేను చూశాను. అతడు పువ్వులు తీసుకొని రెండు చేతులతో మెల్లగా నలిపి అక్కడపెట్టాడు. అతనిహస్తస్పర్శతో పుష్పాలు మరింతగ సువాసనలు సంతరించుకొన్నాయి. మరింతగా వికాసం పొందుతున్నాయి. ఈ అద్భుతాలు చూసి, మీకు చెప్పడానికి అతిశీఘ్రంగా ఇక్కడకు వచ్చాను' అని కేశిని దమయంతికి నివేదించింది. కేశిని చెప్పిన విశేషాలను విన్న పిమ్మట అవన్నీకూడ నలుని పనులను, చరితను సూచిస్తున్నాయి అనుకొని దమయంతి, నలుడు వచ్చినట్లే తలచింది.

పనులతీరును, లక్షణాలను గురించి విన్న దమయంతి బాహుకుని తన భర్తయైన నలునిగ అనుమానించి విలపిస్తూ, మృదువాక్కులతో ఇలా పలికింది- 'కేశినీ! నీవు మరోసారి అక్కడకు వెళ్ళి పాకశాలలో బాహుకునిచే వంటచేయబడిన మాంసాన్ని తెమ్ము.' అని దమయంతి చెప్పగానే, కేశిని వెళ్ళి, పాకశాలలో అపుడే ఉడికి వేడిగానున్న మాంసాన్ని బాహుకుని ఎదుటనే తీసికొని వెంటనే దమయంతి దగ్గరకు వెళ్ళింది. ధర్మజా! కేశిని ఆ వేడిమాంసాన్ని దమయంతి చేతి కిచ్చింది. అందుకు దమయంతి తగినదే! ఎందుకంటే, ఆమె ఇదివరలో అనేక పర్యాయాలు నలుడు వండిన మాంసాన్ని రుచిచూచినదే కదా! దమయంతి ఆ మాంసాన్ని తిని, సూతుడుగానున్న బాహుకుని నలునిగా దలచి, అతనిస్థితికి ఎంతగానో బాధపడింది. మిక్కిలి వైక్లబ్యాన్ని పొందింది. అక్కడనుండి వెళ్ళి ముఖాన్ని బాగా కడుక్కొన్నది. తన పుత్రుని, పుత్రికను కేశినితో బాహుకుని దగ్గరకు పంపించింది. బాహుకుడు వారిని చూచి, ఎదురేగి, ఆ బిడ్డలను కౌగిలించుకొని, తన తొడలపై కూర్చోబెట్టుకొన్నాడు. దేవతల బిడ్డలవలెనున్న ఆ పిల్లలను చూసి, చెప్పలేనంత దుఃఖం పొంది, ఆపుకోలేక పెద్దగా ఏడ్చాడు. అంతలోనే ముఖ కవళికలను మార్చి వెంటనే కేశినితో ఇలా పలికాడు. 'కేశినీ! నాబిడ్డలు కూడ వీరివలె ఉండేవారు. ఆ కారణంచేతనే ఈ బిడ్డలను చూడగానే నేను కన్నీరు పెట్టుకొన్నాను. మేం ఈ రాజ్యానికి అతిథులుగా వచ్చాం! నీవు మాటిమాటికి ఇక్కడికి ఇలా రావటం వల్ల జనులు ఏమైనా అనుకొంటారు. అందుకే, నీవు వెంటనే ఇక్కడనుండి వెళ్ళు.'

76.నలుడు ప్రకటమగుట - నలదమయంతుల సమాగమము.

పుణ్యశ్లోకుడు, ధీమంతుడు అయిన బాహుకుని ముఖకవళికలను, మనోవికారాలను చూచిన కేశిని వెంటనే వచ్చి దమయంతికి అంతా నివేదించింది. విషయాన్నంతా విన్న దమయంతి, కేశినిని మరల పంపించింది. తర్వాత దుఃఖార్తయైన దమయంతి నలుని

చూడాలని తనతల్లితో ఇలా అంది. 'బాహుకుడు నలుడై యుంటాడనే అనుమానంతో అనేకవిధాల పరీక్షించాను. రూపాన్ని గురించే సందేహం కలుగుతోంది. నేనే స్వయంగా ఆ సందేహాన్ని తీర్చుకోదలచాను. నలమహారాజును మనమందిరలో ప్రవేశపెట్టండి. లేదా నేనచటకు వెళ్ళటానికి సమ్మతించండి. తండ్రిగారికి ఈ విషయం తెలిసినా, తెలియకపోయినా ఈ పని చెయ్యండి.' ఈ విధంగా దమయంతి తెలియజేసిన అభిప్రాయాన్ని, ఆమె తల్లి వెంటనే భీమమహారాజునకు తెలియజేసింది. ధర్మజా! అపుడు దమయంతి తల్లిదండ్రుల అనుజ్ఞ పొందింది. దమయంతి ఉన్న మందిరంలోనికే నలుని ప్రవేశపెట్టారు. దమయంతిని చూడగానే నలునికి, దుఃఖశోకాలు ఆవరించి కన్నులనుండి నీరు పెల్లుబికింది. కులస్త్రీయైన దమయంతి అప్పుడు ఆస్థితిలో ఉన్న నలుని చూచి తీవ్రమైన శోకాన్ని పొందింది. ధర్మరాజా! దమయంతి మలినమైన శరీరంతో, జటిలమై, కాషాయవస్త్రాలను ధరించి ఉంది. ఆమె బాహుకునితో ఇలా పలికింది.

'బాహుకా! పూర్వం, అరణ్యంలో నిద్రిస్తున్న భార్యను విడిచివెళ్లిన ఒకానొక ధర్మజ్ఞుడైన పురుషుని నీవు చూచావా? ఏ తప్పూ చేయని భార్యను జనరహితప్రదేశంలో, మార్గాయాసంతో ఒడలు తెలియక నిద్రించే సమయంలో పుణ్యశ్లోకుడైన నలుడు దప్ప మరెవ్వడైనా విడిచివెళ్ళగలడా? ఆ మహారాజునకు నేను బాల్యంనుండి ఏమైనా అపరాధం చేశానా? అరణ్యంలో నిద్రిస్తున్న నన్ను విడిచిపెట్టి వెళ్ళాడుగదా! ప్రత్యక్షంగా వచ్చిన దేవతలను వదలి, నలునే వరించానే! అతనినే వివాహమాడి అనువ్రతనైన సంతానవతిని నన్నెట్లు విడిచివెళ్ళినాడో! అగ్నిసాక్షిగా దేవతలందరిముందు పాణిగ్రహణం చేసి సత్యంగా నీతోనే ఉండగలనని పలికిన నలమహారాజు ఎక్కడకు వెళ్ళినాడు?' దమయంతి ఇలా మాట్లాడుతున్నప్పుడు నలుడు అతికష్టంమీద ఆపుకొందామన్నా ఆగక, కన్నులనుండి నీరు స్రవించింది. నలమహారాజు ఎర్రని కనుగొలకులనుండి కన్నీరు విడుస్తూనే శోకార్తయైన దమయంతి నుద్దేశించి ఇలా పలికాడు. 'రాజ్యం పోయింది. నిన్ను విడిచిపెట్టటం జరిగింది. ఈ సంఘటనలన్నీ నా స్వయంకృతాలు కావు. దమయంతీ! ఇవన్నీ కలిపురుషునిచే చేయబడిన పనులు. ధర్మానికి కలిగిన కష్టంలో వనంలోనుండి, దుఃఖించే నన్నుగురించి రాత్రింబవళ్ళు ఆలోచించే నీవు కలిని శపించావు. ఆ కలిపురుషుడు ఆ శాపాగ్నిచే దహింపబడుతూనే నాశరీరంలో చేరి, నా శరీరాన్ని కూడ దహింపజేశాడు. నా ప్రయత్నంచేతను, తపస్సుచేతను కలిపురుషుడు జయింపబడినాడు. మన దుఃఖానికి అంతం కలిగింది! మనకు శుభసమయం ఆసన్నమైంది. కలిపురుషుడు నా శరీరాన్ని విడిచివెళ్ళిన తర్వాతనే నేనిచ్చటకు వచ్చాను. దమయంతీ! నేను నీకొరకే ఇచ్చటకు వచ్చాను. మరొక ప్రయోజనం

ఏమీ లేదు. దమయంతీ! అనురాగం కలిగి తన్ననుసరించే భర్తను వదలి, ఏ స్త్రీ అయినా సరే మరొకనిని నీవలె వరించునా? విదర్భరాజశాసనంతో దూతలు భూమండలమంతా సంచరిస్తున్నారు. "దమయంతి మరొకనిని వరించబోతోంది" అని? ఈవార్తను విని ఆమె స్వేచ్ఛగా తన అభిరుచిని అనుసరించి, తగిన వానిని ఎన్నుకొన బోతోంది అని ఋతుపర్ణ మహారాజు అతిత్వరితగతిని ఇచటకు వచ్చాడు.' మిక్కిలి దుఃఖంతో పలికే నలుని మాటలు విని, దమయంతి భీతిచెంది, అంజలి ఘటించి, వణకిపోతూ ఇలా పలికింది. 'నిషధరాజా! దేవతలను విడిచి నిన్నే వరించినదానను నేను. దోషారోపణ చేసి నన్ను అనుమానించటం తగదు. నీరాకకొరకే అన్నిదిక్కులకు బ్రాహ్మణులను పంపడమూ, నాకధను ఎన్నోచోట్ల చెప్పించటమూ జరిగింది. ఆ బ్రాహ్మణులలో పర్ణాదుడనే బ్రాహ్మణపండితుడు కోసలరాజ్యానికి వచ్చి, ఋతుపర్ణమహారాజును కలిసినాడు. నిషధరాజా! ఆ బ్రాహ్మణుడు మాట్లాడిన మాటలకు సమాధానంగా వచ్చిన మాటలను బట్టియే మిమ్ములను రప్పించుటకై నాకు తోచినదే ఈ ఉపాయం. మహారాజా! నీవు తప్ప మరొకరెవ్వరూ ఒక్కరోజులో నూరుయోజనాల దూరం గుర్రాలతో ప్రయాణం చేయగల సమర్థుడు లేడు. భూపతీ! మిమ్ములను అగౌరవపరచాలనే భావం మనస్సులో కూడా లేదని మీపాదాలసాక్షిగా చెప్తున్నాను. అట్టిపాపచింతన నాలో ఉంటే, సర్వదా సర్వప్రాణులకు సాక్షిగా చరించే వాయుదేవుడు నా ప్రాణాలను తీయునుగాక! నాలో పాపచింతన ఉంటే సకలభువన సంచారియగు సూర్యభగవానుడు నా ప్రాణాలను హరించుగాక! నాలో పాపచింతన ఉంటే సమస్తప్రాణులలో సాక్షివలె అంతశ్చారియగు చంద్రుడు నాప్రాణాలను తీయును గాక!. ఈ ముగ్గురు దేవతలు ముల్లోకాలకు ఆధారభూతులై ఉన్నారు. నా మాటలు సత్యాలని ఆ దేవతలే చెప్తారు లేదా విడిచిపెడ్తారు.'

ఈవిధంగా దమయంతి అనగానే అంతరిక్షంనుండి వాయుదేవుడిలా అన్నాడు. 'నలమహారాజా! ఈ దమయంతి ఏ పాపమూ చేయలేదు. నీకు సత్యమే చెప్తున్నాను. రాజా! లోకవ్యాప్తమైన దమయంతి సౌశీల్యం సురక్షితంగా ఉంది. మంచినడవడిక కల్గిన దమయంతికి గడచిన మూడుసంవత్సరాలకాలంలో రక్షకులుగా, సాక్షిభూతులుగా మేము ముగ్గురమే ఉన్నాం. ఒకరోజులో నూరు యోజనాలు పయనింపగలవాడు నీవు తప్ప మరొకడు లేడని భావించిన దమయంతి నిన్ను రప్పించటానికి తగిన ఉపాయాన్ని ఆలోచించింది. రాజా! నీకు దమయంతి లభించింది. దమయంతికి నీవు లభించావు. ఈ విషయంలో నీవు ఎలాంటి అనుమానాన్ని పెట్టుకోవటం తగదు. భార్యతో కలసి మెలసి సుఖంగా చరించు.' ఈ విధంగా వాయుదేవుడు పలుకుతూంటే పుష్పవర్షం

కురిసింది. దేవదుందుభులు మ్రోగాయి. మంగళకరమైన గాలి వీచింది. ధర్మరాజా! ఈ అద్భుతాన్ని చూచిన నలమహారాజు దమయంతి విషయంలో నున్న అనుమానాన్ని ఉపసంహరించుకొన్నాడు. అపుడు నలమహారాజు నూతన వస్త్రాన్ని కప్పుకొని నాగరాజును స్మరించాడు. దాంతో నలుడు తన యధార్థమైన రూపాన్ని పొందాడు. స్వరూపాన్ని పొందిన పుణ్యశ్లోకుడైన తన భర్తను చూచి పతివ్రతాశిరోమణియైన దమయంతి నలుని గాఢాలింగనం చేసికొని బిగ్గరగా విలపించింది. నలమహారాజు కూడ తేజోవంతుడై పూర్వంవలెనే భీమపుత్రి దమయంతితోను, తన పిల్లలతోను ఆనందంగా ఉన్నాడు.

తర్వాత దమయంతి – నలుని శిరస్సును తన హృదయంమీద పెట్టుకొని పట్టరాని దుఃఖంతో దీర్ఘంగా నిట్టూర్పు విడిచింది. అదే విధంగా మలినదేహంతో ఉన్నప్పటికీ, తెలినవ్వుల దమయంతిని ఆ పురుషశ్రేష్ఠుడైన నలుడు ఆలింగనం చేసికొని, శోకంతో అలాగే నిలిచిపోయాడు. దమయంతితల్లి భీమమహారాజు నకు నలదమయంతులగురించి జరిగిందంతా ప్రీతితో వివరంగా చెప్పింది. మర్నాడు ఉదయం మంగళస్నానం ఆచరించి, తేజస్సుతో ప్రకాశిస్తూ, దమయంతీ సహితుడై సుఖంగా ఉన్న నలమహారాజును చూస్తానని భీమరాజు పలికాడు. రాజా! ఆ రోజు రాత్రి నలదమయంతులు ఇరువురూ కలసి జరిగిపోయిన అరణ్యవాస విశేషాలన్నీ సంతోషంతో చెప్పుకొంటూ గడిపారు. భీమరాజు గృహంలో నలదమయంతులిరువురు ఒకరి సుఖాన్ని మరొకరు కోరుతూ, సంతుష్టసంకల్పులై ఉన్నారు. ఆ నలమహారాజు మూడుసంవత్సరాల తర్వాత భార్యాసహితుడై సర్వసుఖాలను అనుభవిస్తూ పరమానందాన్ని పొందాడు. సీటితో సగం మొలిచిన పంటగల భూమివలె, పులకించి దమయంతి భర్తను పొంది మిక్కిలి ఆప్యాయతానురాగాలతో సంతృప్తి పొందింది. ఈవిధంగా భర్తను కలిసిన దమయంతి తొట్రుపాటు పోయి, తాపం శమించి, ఎంతో సంతోషంతో, కోరికలన్నీ తీరి చంద్రునితో కూడిన రాత్రివలె ప్రకాశించింది.

77. నలుని నుండి అశ్వవిద్యను గ్రహించి ఋతుపర్ణుడు అయోధ్యకు వెడలుట.

రాత్రి గడిచినపిమ్మట మరునాడు నలుడు అలంకరించుకొని దమయంతీసహితుడై తగిన సమయంలో భీమరాజును సందర్శించాడు. పుణ్యశ్లోకుడైన నలుడు, మామగారైన భీమరాజునకు నమస్కరించాడు. శుభలక్షణ అయిన దమయంతి కూడ తన తండ్రిగారికి నమస్కరించింది. భీమరాజు తనపుత్రునివలె అతిసంతోషంతో ఆ నలుని అక్కునజేర్చుకొని తగినవిధంగా గౌరవించి ఊరడించాడు. నలునితోకూడిన, పతివ్రతయైన తనపుత్రి దమయంతిని కూడ ప్రేమతో భీమరాజు అనునయించాడు. నలమహారాజు, ఆ సత్కారాలను

యథావిధిగా స్వీకరించి మామగారికి కృతజ్ఞతను తెలిపాడు. తిరిగివచ్చిన నలునిచూచి నగరమంతా హర్షధ్వానాలతో నిండింది. ప్రజలంతా నలమహారాజును చూచి సంతోషంతో జయజయధ్వానాలు చేశారు. విదర్భరాజు నగరమంతా ధ్వజాలతో పతాకాలతో అలంకరింప జేశాడు. రాజ మార్గాలనన్నింటిని చక్కగా ఊడ్చి, అలికి, వాటిపై పూలనలంకరించారు. ప్రతిముంగిటా పౌరులు పూలు చల్లారు. దేవాలయాలన్నింటనూ అర్చనలు జరిగాయి. ఋతుపర్ణమహారాజు బాహుకుని రూపంలోనున్నవాడు నలమహారాజే అని విన్నాడు. నలదమయంతుల సమాగమానికి ఋతుపర్ణు డెంతగానో సంతోషించాడు. నలమహారాజును రావించి ఋతుపర్ణుడు ఆదరించాడు.

బుద్ధిమంతుడైన నలుడూ, ఋతుపర్ణుని ఆదరించాడు. సత్కృతుడైన ఋతుపర్ణమహారాజు విస్మయంతో 'అదృష్టంతో భార్యతో కలిశావు నీవు' అని నలుని అభినందించాడు. 'నిషధరాజా! అజ్ఞాతంగా నాగృహంలో ఉన్నప్పుడు నేను ఏ కొద్దిపాటి అపరాధాన్ని చేయలేదు కదా! నేను బుద్ధిపూర్వకంగా కాని తెలియక కాని చేయతగని పనులు ఏవైనా చేసి ఉంటే వాటిని క్షమించు' – అని ఋతుపర్ణుడు పలికాడు. నలమహారాజు ఇలా అన్నాడు. 'రాజా మీరు నాకు ఏ కొంచెం అపరాధాన్ని కూడ చేయలేదు. ఒకవేళ చేసి ఉన్నా నాకు కోపం లేదు – నేను క్షమించి తీరాలి. మహారాజా! చిరకాలం నుండి మీరు నాకు మిత్రులు. పైగా మనకు బంధుత్వం కూడ ఉంది. అందువల్ల మీరు ఇకముందు కూడా మాప్రేమను పొంద దగినవారు. మీగృహంలో ఉన్నప్పుడు, నాకోరికలన్నీ తీరే అవకాశం కలిగింది. మీగృహంలో జరిగినట్లుగా, నాగృహంలో కూడ జరుగలేదేమో! అశ్వహృదయమనే విజ్ఞానసంపద నాదగ్గరే ఉంది. మీరు కోరినట్లయితే ఆ అశ్వహృదయవిద్యను మీకు ఉపదేశించాలనుకొంటున్నాను' అని ఋతుపర్ణునకు అశ్వహృదయవిద్యను నలమహారాజు ఉపదేశించాడు. ఋతుపర్ణమహారాజు నలుని వలన అశ్వహృదయవిద్యను యథావిధిగా గ్రహించాడు. తర్వాత నలమహారాజునకు తన చెంతగల అక్షహృదయవిద్యను ఋతుపర్ణు డుపదేశించి, మరొక రథసారథిని తీసికొని అక్కడనుండి బయలుదేరి తననగరానికి వెళ్ళాడు. ఋతుపర్ణుడు వెళ్ళిన తర్వాత నలమహారాజు కూడ కుండిన నగరంలో కొంతకాలం మాత్రమే ఉన్నాడు.

78. పుష్కరుని ఓడించి నలుడు నిజనగరమున ప్రవేశించుట.

నలుడు ఒకనెల గడిపి భీమరాజు సెలవు తీసికొని కుండినపురం నుండి అల్పపరివారంతో నిషధకు వెళ్ళాడు. ఒకరథం, పదునారు ఏనుగులు, ఏబది గుర్రాలు,

ఆరువందలమంది పదాతిదళం మాత్రమే తీసికొని బయలుదేరాడు. గొప్పమనసు గల ఆ మహారాజు భూమిని కంపింప చేస్తున్నంత ఉత్సాహంతో అతిశీఘ్రంగా నగరాన్ని ప్రవేశించాడు. వీరసేనుని కుమారుడైన నలుడు, పుష్కరుని చెంతకు వచ్చి తిరిగి జూదమాడుదామంటూ ఇలా అన్నాడు. 'నేను చాలా ధనం సంపాదించాను. దమయంతి ఉంది. ఇంకా నా దగ్గర ఏమున్నా అదంతా నా పందెం పుష్కరా! రాజ్యం నీ పందెం. మళ్ళీ జూదమాడాలి. ఇది నా నిర్ణయం. లేదా ఇద్దరమూ ప్రాణాలనే ఒకే పందెంగా పెడదాం. నీకు మేలు జరుగుతుంది. జయాన్ని పొంది, ఇతరుల సొత్తును గాని, రాజ్యాన్నిగాని తీసికొన్నప్పుడు, ఎదుటి వానికి పందెం వేయటానికి అవకాశాన్ని ఇవ్వాలి. ఇది పరమధర్మంగా చెప్పబడుతోంది. పుష్కరా! నీవు జూదాన్ని ఆడటానికి ఇష్టపడకపోతే యుద్ధమనే జూదాన్ని ఆడుదాం! అది కూడ మన ఇరువురకు మధ్యనే జరగాలి. అపుడే నీకు గాని, నాకు గాని శాంతి కలుగుతుంది. ఈ రాజ్యం వంశపారంపర్యంగా అనుభవింపతగింది. అట్టి రాజ్యాన్ని ఏదో ఒక ఉపాయంతో పొందాలనేది పెద్దలశాసనం. పుష్కరుడా! పాచికలతో జూదానికిగాని, ధనుస్సును వంచి యుద్ధానికి గాని సిద్ధం కమ్ము!' నలు డీ విధంగా అంటే పుష్కరుడు జయం తనదేనని భావించి పరిహసించి, నలునితో ఇలా పలికాడు. 'ధానైషధా! మళ్ళీ పందెం వేయటానికి తగిన ధనం సంపాదించావు. అది నీ అదృష్టం. అదృష్ట కారణంతోనే దమయంతి కష్టాలు కూడా తీరిపోయాయి. నలమహారాజా! మహాభుజా! నీ అదృష్టం కొద్ది దమయంతితో కలిసి బ్రతికి ఉన్నావు. నీ ధనాన్నంతా నేను గెలిస్తే దమయంతి అలంకరించుకొని, స్వర్గంలో అచ్చరలు ఇంద్రుని సేవించినట్టు సేవిస్తుంది. రోజూ నిన్ను తలచుకొంటూ నీకై చూస్తున్నాను. శత్రువులతో జూదమాడితే నాకు తృప్తి కలగటం లేదు. ఇపుడు నేను నిన్ను జయించి, దమయంతిని స్వీకరిస్తాను. సర్వదా ఆమెయే నాహృదయ మందున్నది. ఆమెయే నాకు దక్కితే నేను కృతకృత్యుణ్ణి కాగలను. పుష్కరుని అసత్యప్రలాపాలు విన్న నలునకు అతని శిరస్సును నరికేయాలన్నంత కోపం వచ్చింది. కోపంతో కనులు ఎర్రబడిన నలుడు పుష్కరునితో ఇలా అన్నాడు.

'ఏమి మాట్లాడుతున్నావు? ఓడిపోయిన తర్వాత నీవు మాట్లాడలేవు! అటుపిమ్మట నలునకు పుష్కరునకు జూదం ప్రారంభమైంది. మొదటి పందెంతోనే వీరుడైన నలునిచే పుష్కరుడు పరాజయంపొందాడు. పుష్కరుడు ఓడిపోవటంతో సమస్తరత్న ధనాగారాలతో సహా ప్రాణం సయితం పందెం పెట్టిన పుష్కరుడు నలునిచేతిలో ఓడిపోయాడు. పుష్కరుని జయించిన నలమహారాజు పరిహాసంతో ఇలా పలికాడు. 'నిష్కంటమైన ఈ రాజ్యమంతా నాది. నీవిక దమయంతిని చూడలేవు. మూఢుడా! సపరివారంగా నీవిపుడు దమయంతికి

దాసుడవయ్యావు. పూర్వం నీవు నన్ను జయించా వన్నది నీపనికాదు. మూర్ఖుడా! అది కలిపురుషకృతమని నీవెరుగవు. పుష్కరా! ఇతరులు చేసిన తప్పును నేను నీపై వేయను. నిన్ను ప్రాణాలతో విడచిపెడుతున్నాను. నీవు సుఖంగా జీవించు! నా సంపదలో నీకు కూడ కొంతభాగం ఇస్తున్నాను. వీరుడా! నీపై నాకు ప్రేమ ఉంది. ఈ విషయంలో ఏమాత్రం సందేహం లేదు. నేను సహృదయత కలవాడను. కనుక నిన్ను ఎప్పుడూ పరిహసించను. పుష్కరా! నీవు నాకు సోదరుడవు. సుఖంగా నూరేళ్ళు జీవించు.' సత్యపరాక్రమశాలియైన నలమహారాజు సోదరుడైన పుష్కరుని ఆ ప్రకారంగా అనునయించి, అనేకపర్యాయాలు ఆలింగనం చేసికొని, తనపురానికి పంపాడు. నలమహారాజుచే ఈ విధంగా అనునయింపబడిన పుష్కరుడు పుణ్యశ్లోకుడైన నలచక్రవర్తికి నమస్కరించి ఇలా పలికాడు. 'మహారాజా! నాకు ప్రాణదానంచేసి, నిలువనీడ చూపిన నీవు తరుగని సత్కీర్తితో నూరేండ్లు సుఖసంతోషాలతో జీవించు.' తర్వాత నలునిచే సత్కరింపబడిన పుష్కరుడు అచట ఒకనెలరోజులుండి సంతుష్టుడై తనవారితో కూడి తన నగరానికి వెళ్ళాడు. ధర్మజా! అపుడు నలమహారాజు గొప్పసైన్యంతోను, విశ్వాసపాత్రులైన పరిచారకులతోను సూర్యునివలె దేహకాంతితో ప్రకాశించాడు. ధనంతో కుశలంగా పుష్కరుని పంపినపిమ్మట శ్రీమంతుడైన నలమహారాజు అత్యంతశోభాయమానమైన తన నగరాన్ని ప్రవేశించాడు. నలమహారాజు నగరప్రవేశం చేసి తనపుర ప్రజలందరిని ఊరడింపజేశాడు. పౌరులు, జానపదులు పట్టరాని సంతోషంతో పులకితశరీరు లయ్యారు. మంత్రిప్రముఖులూ, ప్రజలూ అంజలి ఘటించి ఇలా పలికారు. 'మహారాజా! దేవతలు ఇంద్రుని సేవించినట్లు' మేమంతా మిమ్ము సేవించుకొనటానికి మీరు తిరిగి వచ్చారు. పట్టణవాసులు, జనపదవాసులు కూడ ఇప్పుడు కదా చాలా సంతోషంతో ఉన్నారు.

79. బృహదశ్వుడు ద్యూతాశ్వవిద్యల రహస్యము తెలిపి వెడలుట.

బృహదశ్వ డిలా అన్నాడు. 'నగరంలో ప్రశాంత వాతావరణంలో అంతా సంతోషంతో వేడుకలు జరుపుకొంటూఉండగా గొప్పసేనతో నలమహారాజు దమయంతిని నగరానికి తీసికొనివచ్చాడు. అవక్రపరాక్రమశాలియగు భీమమహారాజు కుమార్తె దమయంతిని సత్కరించి, పంపాడు. పిల్లలతో పట్టణానికి వచ్చిన మహారాణి దమయంతితో నందనవనంలో దేవేంద్రునివలె నలమహారాజు సంతోషంగా ఉన్నాడు. యశశ్శాలియైన నలమహారాజు శత్రువులనుండి రాజ్యాన్ని తిరిగి తీసికొని, జంబూద్వీపమందలి రాజులలో ప్రఖ్యాతినొంది రాజ్యాన్ని పరిపాలించాడు. ధర్మరాజా! నలమహారాజు విధివిధానంగా భూరిదక్షిణలతో వివిధ

యజ్ఞయాగాలను చేశాడు. అదేవిధంగా నీవుకూడ నీమిత్రులతో కలసి అతిత్వరలో యజ్ఞాలను చేయగలవు. నరోత్తమా ధర్మరాజా! జూదంవల్ల శత్రుంజయుడైన నలుడు భార్యాసహితుడై ఈవిధమైన దుఃఖాలను పొందాడు. ఇంతటి ఘోరమైన దుఃఖాన్ని నలుడు ఏకాకిగానే అనుభవించాడు. తిరిగి అభ్యుదయాన్ని కూడ పొందాడు. ధర్మరాజా! నీవు ఈ మహారణ్యంలో నీ తమ్ములతోను భార్యయగు ద్రౌపదితోను కలిసియే ధర్మాన్ని ఆచరిస్తూ సుఖంగా ఉన్నావు. రాజా! మహాత్ములును వేదపారగులైన బ్రాహ్మణోత్తములతో నిత్యం కాలం గడుపుతున్న నీకు దుఃఖం ఎందులకు? **నాగజాతివాడైన కర్కోటకుని, దమయంతిని, నలుని, రాజర్షియైన ఋతుపర్ణుని కీర్తించిన వారికి కలి దోషం నుండి విముక్తి కల్గుతుంది.*** కలిదోషనినాశకమైన నలచరిత్ర మనే ఈ కథను వినుటవలన కూడ కలిదోషాలు పోతాయి. దీని మహత్త్వం చెప్పశక్యమా? పురుషునికి కలిగే విషయాలన్నీ అస్థిరాలు - ఇది గ్రహించి సంపత్ సమృద్ధి కల్గినపుడు, సంపదలు నశించినపుడును కూడ చింతింప తగదుకదా! ధర్మజా! నలమహారాజుకథను విని, ఊరడిల్లు. **కష్టం వచ్చినపుడు క్రుంగిపోవద్దు. దైవం ప్రతికూలంగా ఉన్నప్పుడును, పురుషప్రయత్నాలు ఫలించనపుడుమా దుఃఖించటం సాధారణ విషయం. ఇట్టిసమయంలోనే మానవులు ధైర్యంతో ఉండాలి.** మహత్త్వపరిపూర్ణమైన ఈ నలమహారాజు చరిత్రను చెప్పినవారికిని, శ్రద్ధగా విన్నవారికిని దారిద్ర్యం ఉండదు. సంపదలు సమృద్ధిగా లభిస్తాయి. ధన్యులౌతారు. ప్రాచీనమైన ఈ ఇతిహాసాన్ని విన్నవారికి పుత్రులు, పౌత్రులు, పశుసంపదలు లభిస్తాయి. మానవులలో ఉన్నతమైన స్థితిని పొందుతారు. అందరియందు మంచిప్రీతి కల్గుతుంది. ఆరోగ్యసంపత్తి లభిస్తుంది. ఈ విషయంలో ఏమాత్రం సందేహం లేదు. ధర్మరాజా! నీవు భయభ్రాంతుడవైనపుడు, "అక్షజ్ఞ"-అని నన్నాహ్వానించు. నేను నీభయాన్ని పోగొట్టగలను. సత్యపరాక్రమా! ధర్మజా! నీపట్ల ప్రసన్నుడనయ్యాను. కష్టసాధ్యమైన అక్ష హృదయమనే విద్యను నేనెరుగుదును. నీకా విద్యను ఉపదేశిస్తాను.' వైశంపాయనుడిలా అన్నాడు. ధర్మరాజు సంతోషంతో బృహదశ్వుని ఉద్దేశించి ఇలా అన్నాడు. భగవన్! మీవలన "అక్షహృదయం" అనే విద్యను తెలిసికొనగోరుతున్నాను. అప్పుడు బృహదశ్వమహాముని ధర్మరాజుకు అక్షహృదయాన్ని ప్రసాదించాడు. తర్వాత మహాతపస్వి అయిన బృహదశ్వుడు అచటనుండి వెళ్ళాడు. బృహదశ్వుడు వెళ్ళిన తర్వాత ధర్మరాజు పుణ్యతీర్థాల నుండి పుణ్యారణ్యాలనుండి, కులపర్వతాలనుండి వస్తూన్న తపోధనులైన బ్రాహ్మణోత్తముల వలన - అర్జునుడు

---

* కర్కోటకస్య నాగస్య దమయంత్యా నలస్య చ ।
ఋతుపర్ణస్య రాజర్షేః కీర్తనం కలినాశనమ్ ॥ 10

వాయు భక్షణ చేస్తూ ఉగ్రమైన తపస్సు చేస్తున్నాడని విన్నాడు. ధనుర్ధారియైన పార్థుడు అత్యంత కష్టతరమైన తపస్సు చేస్తున్నాడని అంతటి ఉగ్రతపాన్ని ఆచరించినవాడు ఇతఃపూర్వం మరెవ్వడూ లేడని, చూడలేదని బ్రాహ్మణోత్తములైన తపోధనులవలన ధర్మరాజు విన్నాడు. అర్జునుడు నియతవ్రతుడై తపస్సుచేస్తూ మూర్తీభవించిన ధర్మస్వరూపంవలె మునివృత్తితోనున్నట్లు ధర్మజుడు విన్నాడు. మహారణ్యంలో అర్జునుడు తపమాచరిస్తూ శ్రమ పడుతున్నట్లు విన్న ధర్మజుడు ప్రీతిపాత్రు డైన తమ్మునిగూర్చి చాలా విచారించాడు. ధర్మరాజు దహింపబడుతున్న హృదయంతో - మహారణ్యంలో శరణార్థియై విజ్ఞులైన బ్రాహ్మణోత్తములను, తమ్ముని గూర్చి ప్రశ్నించాడు.

(ధర్మరాజు అక్షహృదయాన్ని స్వీకరించి భీమసేనాదులతో కూడి సంతోషంతో ఉన్నాడు. యుధిష్ఠిరుడు తనవెంటనున్న తమ్ములతోపాటు అచట అర్జునుని చూడక కనులు చెమ్మగిల్లగా ఇలా పలికాడు యుధిష్ఠిరుడిలా అన్నాడు. భీమా! అర్జునుడు నాకొఱకే కఠినమైన తపస్సు చేస్తున్నాడు. మీలా అర్జునుని నేనెప్పుడు చూస్తానో! అక్షహృదయ విద్యను పొందిన నేను అర్జునునకు ఎప్పుడు చెప్పగలనో? నేను సంపాదించిన అక్షహృదయం గురించి విని అర్జునుడు అధికంగా సంతోషిస్తాడు. సందేహం లేదు.)

80. అర్జునుని గురించి పాండవుల చింత.

జనమేజయుడు అడిగాడు. పూజ్యుడా! నాప్రపితామహుడు అర్జునుడు కామ్యకవనాన్ని విడచి తీర్థయాత్రలకు పోయిన తరువాత మిగిలిన పాండవులు ఏమి చేశారు? ఎన్నో సేనలపై గెలిచిన అర్జునుడే వారికి దిక్కు. అదితిపుత్రులలో విష్ణువు వంటివాడు పాండవులలో అర్జునుడు. యుద్ధాలలో వెనుకంజవేయని, ఇంద్రసమ పరాక్రమంగల అర్జునుని సహాయంలేని మిగతా పాండవులు వనాల్లో ఎలా నివసించారు?' వైశంపాయనుడు చెపుతున్నాడు. అర్జునుడు కామ్యకవనం విడచిపోయాక మిగిలిన పాండవులు దుఃఖంలో మునిగిపోయారు. త్రాడు తెగిన మణులవలె, రెక్కలు తెగిన పక్షులవలె మిగిలిన పాండవులు అంతా అసంతుష్టులై ఉన్నారు. అర్జునుడు లేకపోవడంతో ఆ వనం కుబేరుడు లేని చైత్రరథమే అయింది. అర్జునుని విడచి, నరశ్రేష్ఠులైన పాండవులు సంతోషరహితులై కామ్యకవనంలో నివసించారు. మహారథులైన ఆ పాండవులు పరిశుద్ధబాణాలతో, బ్రాహ్మణులకోసం క్రూరమృగాల్ని సంహరించసాగారు. నరశ్రేష్ఠులు, శత్రునాశకులు అయిన వారు నిత్యం బ్రాహ్మణుల కొరకు కందమూలఫలాలను తెచ్చి సమర్పించేవారు. జనమేజయా! ధనంజయుడు వెళ్లిన పిమ్మట, ఆ శ్రేష్ఠులు ఖిన్నమనస్కులై అర్జునుని కోసం ఉత్కంఠతో ఎదురుచూస్తూ ఉన్నారు. ప్రత్యేకించి పాంచాలి అర్జునుని తలచుకొంటూ, దుఃఖిస్తూ ఉన్న యుధిష్ఠిరునితో

ఇలా పలికింది. "రెండు చేతులు గల అర్జునుడు వేయిచేతులు గల కార్తవీర్యార్జునునితో సమానుడు. అతడు లేని ఈ వనం నాకు ఆనందాన్ని ఇవ్వటంలేదు. నాదృష్టి ప్రసరించినంత మేర, ఈవనం పుష్పించిన చెట్లు కలదైనా శూన్యంగా తోస్తోంది. పద్మాలవంటి నేత్రాలు గల అర్జునుడు ఏనుగువలె వలె, నీలమేఘం వలె నడుస్తూ ఉండకపోవడంతో ఈ వనం రమణీయంగా కనపడటం లేదు. రాజా! అర్జునుని ధనుష్టంకారం పిడుగుపాటువలె భయం కలిగించేది. అతడు లేకపోతే నాకు కొంచెమైనా సుఖంలేదు." ఇలా దుఃఖించే ద్రౌపదిని చూచి భీమసేనుడు ఇలా అన్నాడు.

"సుందరీ! నీమాటలు ఎంతో ప్రీతికరంగా ఉన్నాయి. నీ పలుకులు నాకు అమృతపానం చేసినంత తృప్తినిచ్చాయి. అర్జునుని చేతులు దీర్ఘాలు, సమానాలు, బలిసినవి, ఘడియలవంటివి, వింటినారి మచ్చలు, బంగారు భుజకీర్తులు కలిగి, గోళాకారంకలవై, ఐదు తలల సర్పంవలె ఉంటాయి. అతడు మనమధ్యలేకపోవటం చేత సూర్యుడు లేని ఆకాశం వలె మనం కాంతి విహీనులం అయినాము. అర్జునుని పరాక్రమం వల్లనే పాంచాల, కురుసేనలు దేవసేనలను కూడా ఎదుర్కొనటానికి భయపడవు. అతని బాహుబలంచే మనం శత్రువులను జయించి రాజ్యాన్ని సుస్థిరంగా భావించాం. అతడు లేక మనం ఈ వనంలో ధైర్యాన్ని కోల్పోయాం. నాకు దిక్కులన్నీ అంధకారంలో మునిగినట్లు తోస్తోంది." భీమసేనుని మాటలు విన్న నకులుడు గద్గదస్వరంతో ఇలా పలికాడు. "యుద్ధభూమిలో దేవతలంతా అతని దివ్యకర్మలను ప్రశంసిస్తారు. ఆ అర్జునుడు లేకపోతే మనకు ప్రసన్నత ఎలా కలుగుతుంది ? అర్జునుడు ఉత్తరదిక్కుకు దిగ్విజయానికై పోయి బలశాలులైన గంధర్వులను ఓడించి వందలకొద్దీ గుఱ్ఱాలను మనసేనలో చేర్చాడు. రాజసూయయాగంలో ప్రేమతో తన ప్రియసోదరుడైన ధర్మరాజునకు తిత్తిరి పక్షులరంగు గల వేగవంతమైన గుఱ్ఱాలను కానుకగా ఇచ్చాడు. భీముని తమ్ముడూ, భయంకరమైన విలుకాడు, అయిన అర్జునుడు లేకుండా ఈ వనంలో నివసించా లనిపించటం లేదు." సహదేవుడు ఇలా పలికాడు "కన్యాధనాలను యుద్ధంలో గెలిచి రాజసూయయాగంలో ధర్మజునకు కానుకగా ఇచ్చిన మహారథుడు. అర్జునుడు, వాసుదేవుని అంగీకారంతో, యుద్ధవాంఛతో ఎదిరించిన యాదవులను జయించి సుభద్రను వశం చేసికొన్నాడు. మహారాజా! విజయశీలి అయిన అర్జునుని దర్భాసనాన్ని కుటీరంలో చూచి నాహృదయం శాంతిని పొందటంలేదు. నేనీ వనం నుంచి వేరొకవనానికి వెళ్లాలనుకొంటున్నాను. అర్జునుడు లేకపోతే ఈ వనం సుందరంగా లేదు."

81. యుధిష్ఠిరుని వద్దకు నారదుడు వచ్చి తీర్థయాత్రా ఫలము గురించి తెలుపుట.

ధనంజయునికై పరితపించే సోదరులను, ద్రౌపదిని చూచి వారి మాటలు విని, ధర్మరాజు కూడా మిక్కిలి విమనస్కు డయ్యాడు. ఇంతలో నారదుడు అక్కడకు వచ్చాడు. అతడు నేయిపోస్తే వెలిగిపోయే అగ్నివలె బ్రాహ్మతేజంతో ప్రకాశిస్తున్నాడు. ధర్మరాజు అతనికి సోదరులతో గూడి తగిన సత్కారాలు చేశాడు. సోదరులతో కలిసి శ్రీమంతుడైన యుధిష్ఠిరుడు సమస్తదేవతలతో గూడిన ఇంద్రునివలె ప్రకాశించాడు. వేదాలను గాయత్రి వీడనట్లు, మేరుపర్వతాన్ని సూర్యుడు వీడనట్లు యాజ్ఞసేని అయిన ద్రౌపది ధర్మబద్ధమైన తనభర్తలను విడువలేదు. అనఘా! ఆ పూజను గ్రహించి నారదుడు ధర్మజుని తగినవిధంగా ఓదార్చాడు. యుధిష్ఠిరునితో నారదుడు ఇలా పలికాడు. 'ధర్మాత ! ఇప్పుడు నీకేది కావాలి? నన్ను నీకేది ఇమ్మంటావు?' ధర్మసుతుడు సోదరులతో కలిసి నారదునికి నమస్కరించి, అంజలించి' ఇలా అన్నాడు. "మహర్షీ! సమస్తలోకపూజలు అందుకొనే మీరు సంతుష్టులయితే మీదయచే నాకు అన్నీ సంప్రాప్తించినట్లే అని భావిస్తాను. సోదరసహితుడనైన నన్ను మీరు అనుగ్రహించాలి అనుకొంటే నాసందేహాన్ని తీర్చండి. తీర్థయాత్రలయందు ఆసక్తి కల్గి, భూప్రదక్షిణం చేసే వానికి ఎలాంటి ఫలితం వస్తుందో మీరు చెప్పండి.'

నారదుడు పలికాడు. సావధానుడవై విను. బుద్ధిమంతుడైన భీష్ముడు పులస్త్యమహర్షి నుంచి ఏమి విన్నాడో అది అంతా నీకు వినిపిస్తాను. పూర్వం గంగాతీరంలో ధర్మశీలు డయిన భీష్ముడు పితృవ్రతం పూని మునులతో నివసించాడు. చాలాకాలంనాటి మాట. దేవతలు, గంధర్వులు సేవించే గంగాద్వారంలో (హరిద్వారం) భీష్ముడు శ్రాద్ధతర్పణాలు చేయ సంకల్పించి మహర్షులతో కూడి ఉన్నాడు. తేజస్వియైన భీష్ముడు శాస్త్రానుసారం దేవతలకు, ఋషులకు, పితరులకు తర్పణాలు చేశాడు. కొంతకాలానికి భీష్ముడు జపం చేసికొంటూ, తనవద్దకు వచ్చిన తేజశ్శాలి, మునిశ్రేష్ఠుడు అయిన పులస్త్యుని చూశాడు. ఆ తపశ్శాలి పులస్త్యుడు దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నాడు. అది చూచిన భీష్ముడు సాటిలేని ప్రసన్నతను, ఆశ్చర్యాన్ని పొందాడు. వచ్చిన పులస్త్యమహర్షిని శాస్త్రోక్తవిధితో భీష్ముడు పూజించాడు. పవిత్రత, ఏకాగ్రచిత్తం గల పులస్త్యునికి సమర్పించిన అర్ఘ్యోదకాన్ని శిరసున దాల్చి భీష్ముడు తనపేరును ఇలా పరిచయం చేసుకొన్నాడు. 'సువ్రతా! నేను భీష్ముడు అనేవాడను. మీదాసుడను. మీకు భద్రమగుగాక. మీ దర్శనభాగ్యంచే నాపాపాలన్నీ పోయాయి.' భీష్ముడు అలా పులస్త్యమహర్షితో పలికి, మాటలు ఆపి, చేతులు జోడించి,

నిశ్శబ్దంగా కూర్చున్నాడు. భీష్ముడు నియమ, స్వాధ్యాయ, వేదోక్త కర్మలచే చిక్కిఉన్నాడు. అతనిని చూచి పులస్త్యుడు మిక్కిలి ప్రసన్నుడు అయ్యాడు.

82. భీష్మునికి పులస్త్యుడు చెప్పిన తీర్థయాత్రా మాహాత్మ్యము.

పులస్త్యుడు ఇలా పలికాడు. 'ధర్మజ్ఞా! నీ వినయం, ఇంద్రియనిగ్రహం, సత్యపాలనలచే మిక్కిలి సంతోషించాను. నీ పితృభక్తితో గూడిన ధర్మం కారణంగా నా దర్శనం అయింది. నీపై నాకు ప్రేమ పెరిగింది. భీష్మా! నాదర్శనం అమోఘం. చెప్పు. నేను నీకు తీర్చవలసిన కోరిక ఏది? నీవు ఏది కోరినా ఇస్తాను.' భీష్ముడు ఇలా చెప్పాడు. 'మీరు ముల్లోకాల పూజలను పొందేవారు. మీరు ప్రసన్నులైతే చాలు. నాకే కోరికలూ లేవు. ప్రతిభావంతులైన మీదర్శనం చేత నేను ధన్యతను పొందాను. మీముందు నా సందేహాన్ని ఉంచుతాను. అనుగ్రహింప తగినవాడనైతే మీరు దానిని తీర్చండి. నాహృదయంలో తీర్థాలను గూర్చి ధర్మ సందేహం ఒకటి ఉంది. మీరు సమాధానం చెప్పి, నన్ను అనుగ్రహించండి. తీర్థయాత్రలతో భూప్రదక్షిణం చేసిన వానికి ఏ ఫలం దక్కుతుంది ? నిశ్చయించి నాకు తెల్పండి.'

పులస్త్యుడు ఇలా చెప్పాడు. తీర్థయాత్రలు మునులకు ఆశ్రయాలు. ఈ విషయం నీకు వివరిస్తాను. తీర్థయాత్రలచే కలిగే ఫలాన్ని గూర్చి సావధానంగా విను. **ఎవనిచేతులు, కాళ్ళు, మనస్సు స్వాధీనంలో ఉంటాయో, విద్య, తపస్సు, కీర్తి కలిగిఉంటాడో వాడు తీర్థయాత్రల ఫలాన్ని పొందుతాడు. ప్రతిగ్రహానికి(దానం పుచ్చుకొనుట) దూరమై, ఆనందంగా, అహంకార రహితంగా ఉండేవాడు తీర్థయాత్రా ఫలాన్ని అందుకొంటాడు.** దాంభికత్వం, కర్మత్వాహంకారం లేనివాడై; మితాహారం, జితేంద్రియత్వం కలవాడు పాపాలనుంచి విముక్తిపొంది తీర్థయాత్రాఫలాన్ని సాధిస్తాడు. రాజేంద్రా! క్రోధం లేనివాడు, సత్యవంతుడు, నియమశీలి, ప్రాణులందరిని తనవలె చూడ గలవాడు తీర్థఫలాన్ని పొందుతాడు. ఋషులు దేవతల నుద్దేశించి యోగ్యతను బట్టి యాగాలను విధించారు. వాటిఫలాన్నీ వివరించారు. చెప్పినవాటిని చెప్పినట్లుగా మానవుడు ఈ లోకంలోనూ, పరలోకంలోనూ ఫలాలన్నీ యథాతథంగా పొందుతాడు. దరిద్రులు ఆ యజ్ఞాలను చేయలేరు. చాలా సంభారాలు, సాధనాలూ అవసరం కనుక ఆచరించలేరు. రాజులు, సమర్థులైన కొందరూ మాత్రమే యజ్ఞాలను ఆచరించగలరు. ఒంటరివారు, అసహాయులు, సాధనసామగ్రి లేనివారు, నిర్ధనులు యజ్ఞాలను ఆచరించలేరు. రాజా! దరిద్రులు కూడా సత్కర్మరూపంగా యజ్ఞాలు చేయవచ్చు. యజ్ఞాలతో సమానమైన ఫలితాలే వాటివల్ల కలుగుతాయి. దానిని

చెపుతా విను. భరతశ్రేష్ఠా! ఇది ఋషులు చెప్పిన చాలా రహస్యమైన విషయం. తీర్థయాత్రలు యజ్ఞాలకంటె ఎక్కువ ఫలాన్ని ఇస్తాయి. తీర్థాలలో మూడు రాత్రులు ఉపవాసం చేయకపోయినా, తీర్థయాత్రలు చేయకపోయినా, సువర్ణదానం, గోదానం చేయకపోయినా మానవుడు దరిద్రుడై పుడతాడు. సమృద్ధిగా దక్షిణలిచ్చి అగ్నిష్టోమాది యాగాలు చేసినా తీర్థయాత్రలు చేసిన ఫలం దక్కదు.

మానవలోకంలో దేవదేవుని **బ్రహ్మతీర్థం** పరమపవిత్రమైంది. దానిపేరు **పుష్కరతీర్థం.** అందు మహా భాగుడైన నరుడే ప్రవేశించగలడు. పుష్కరతీర్థంలో ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం పదివేల కోట్ల తీర్థాల శక్తి కలిసి ఉంటుంది. ఆ తీర్థంలో ద్వాదశాదిత్యులు, అష్టవసువులు, ఏకాదశ రుద్రులు, సాధ్యులు, మరుత్తులు, గంధర్వులు, అప్సరసలు నిత్యమూ ఉంటారు. అక్కడ తపస్సు చేసి దేవతలు, దైత్యులు, బ్రహ్మర్షులు ఆ పుణ్యంచేత యోగశ్రేష్ఠులు అవుతారు. మనస్సులో అయినా పుష్కరతీర్థానికి వెళ్లాలని సంకల్పిస్తే అతని స్వర్గగమనానికి అడ్డుపడే పాపాలు పోయి స్వర్గానికి చేరి పూజలందుకొంటాడు. పుష్కరంలో కమలాసనుడైన బ్రహ్మ ప్రసన్నతతో నిత్యమూ నివసిస్తాడు. ఈ తీర్థంలో పూర్వం ఎందరో దేవతలు, ఋషులు తపస్సు చేసి గొప్పగొప్ప సిద్ధులను పొందారు. అక్కడ స్నానం చేసి, దేవతలకు, పితరులకు అర్చన చేసిన వాడు అశ్వమేధయాగఫలం కంటె పదిరెట్లు ఫలం సాధిస్తాడు. భీష్మా! పుష్కరారణ్యంలో ఒక్కనికైనా అన్నదానం చేస్తే ఆ పుణ్యంచేత ఇహలోక, పరలోకాలలో ఆనందాన్ని పొందుతాడు. శాక,ఫల,మూలాలతో స్వయంగా జీవిస్తూ అదే శ్రద్ధతో, పరులదోషాలను ఎంచక బ్రాహ్మణులకు దానం చెయ్యాలి. ఆ దానంతో తెలివైనవాడు అశ్వమేధయాగఫలాన్ని సాధిస్తాడు. రాజేంద్రా! బ్రాహ్మణక్షత్రియ వైశ్యశూద్రు లెవరైనా ఈ తీర్థాన మునిగితే వారికి పునర్జన్మ ఉండదు. ప్రత్యేకించి **కార్తికపూర్ణిమనాడు పుష్కరస్నానం చేసిన మనుష్యుడు బ్రహ్మసన్నిధిలో అక్షయలోకాల్లో జీవిస్తాడు.** ఉదయాన, సాయంసమయాన రెండు చేతులు జోడించి, మూడుపుష్కర తీర్థాలను తలచే వాడు సర్వతీర్థాలలో స్నానం చేసినవాడే అవుతాడు. పుట్టినది మొదలు ఇప్పటివరకు చేసిన పాపాలు స్త్రీవైనా, పురుషుడివైనా పుష్కర స్నానంతో అన్నీ నశిస్తాయి. సమస్త దేవతల్లో విష్ణువు ఎట్లు మొదటివాడో అట్లే సర్వతీర్థాల్లో పుష్కరమే మొదటిది. పుష్కరతీర్థంలో పండ్రెండేండ్లు గడిపిన మానవుడు అన్ని యాగాలు చేసిన ఫలాన్ని పొంది, చివరలో బ్రహ్మలోకాన్ని చేరతాడు. **పూర్తిగా వంద ఏండ్లు అగ్నిహోత్రం చేసినవాడూ, కార్తిక పూర్ణిమనాడు పుష్కరతీర్థంలో నివసించినవాడూ సమానం.**

మూడు పర్వతశిఖరాలు, మూడునదులు, మూడు తీర్థాలు ఇవన్నీ లోకంలో సిద్ధాలై

ఉన్నాయి. వీటిని ఎందుకు తీర్థాలంటున్నామో తెలియడం లేదు. పుష్కరతీర్థానికి వెళ్లటం, తపస్సు ఆచరించటం, దానం చేయటం, నివసించటం కష్టసాధ్యాలు. ఇంద్రియ సంయమనంతో, మితాహారంతో పండ్రెండు రాత్రులు అక్కడ గడపి, ప్రదక్షిణం చేసి, **జంబూమార్గానికి** పోవాలి. జంబూమార్గం దేవపితృ ఋషులచే సేవింపబడే తీర్థం. అక్కడకు పోయి మనోరథాలన్నింటిని పొంది, అశ్వమేధఫలం పొందుతాడు. అక్కడ ఐదురాత్రులు నివసించిన నరుడు పవిత్రమైన మనస్సును పొందుతాడు. దుర్గతిని పొందక ఉత్తమసిద్ధిని గ్రహిస్తాడు. జంబూమార్గం నుంచి మరలి, **తండులికాశ్రమం** చేరి, దుర్గతిని వీడి, చివరకు బ్రహ్మలోకం చేరతాడు. అగస్త్య సరోవరంలో మూడురాత్రులు ఉపవాసంతో పితృ దేవతలను అర్చించి అగ్నిష్టోమయాగాన్ని ఆచరించిన ఫలం పొందుతాడు. శాకాలతో, ఫలాలతో అక్కడ గడపి కౌమార లోకాన్ని అందుకొంటాడు. అక్కడనుంచి లక్ష్మిచే సేవింపబడే కణ్వుని ఆశ్రమంలో ప్రవేశించాలి. భరతర్షభా! ఆ ప్రదేశాన్ని ధర్మారణ్యం అంటారు. అది పరమపవిత్రమయిన ఆది తీర్థం. దానిని ప్రవేశించిన వెంటనే మనుష్యునికి పాపాలు పోతాయి. నియమాలతో, నియతాహారంతో దేవతలను, పితరులను అర్చించి అన్నికోరికలు తీర్చగల యజ్ఞఫలాన్ని వశం చేసుకొంటాడు. ఆ తీర్థాన ప్రదక్షిణం చేసి **యయాతిపతనం** అనే పేరుగల తీర్థాన్ని చేరుతాడు. అక్కడకు చేరిన పిదప అశ్వమేధయాగఫలాన్ని పొందుతాడు.

అక్కడనుంచి **మహాకాలతీర్థం** పోయి నియమితాహారంతో, జితేంద్రియుడై ఉండాలి. **కోటితీర్థం**లో మునిగి అశ్వమేధఫలాన్ని పొందుతాడు. ధర్మజ్ఞుడైన నరుడు ముల్లోకాలలో భద్రవట మనే పేర ప్రసిద్ధిపొందిన ఉమావల్లభుని **శివతీర్థాన్ని** అక్కడ నుంచి చేరాలి. శివుని దగ్గరగా చూసిన నరోత్తముడు మహాదేవుని అనుగ్రహంతో వేయిగోవులను దానం చేసిన ఫలాన్ని, గణాధిపత్యాన్ని కూడ పొందుతాడు. అది లక్ష్మీసమృద్ధిగలది. శత్రురహితమైనది. అక్కడ ముల్లోకాల్లో ప్రసిద్ధిపొందిన నర్మదా నదీతీరంలో దేవతలకు, పితరులకు అర్చన చేసి అగ్నిష్టోమయాగ ఫలాన్ని అందుకొంటాడు. బ్రహ్మచర్యం, జితేంద్రియత్వంతో దక్షిణసముద్రయాత్ర చేసిన మనుజుడు అగ్నిష్టోమఫలాన్ని పొంది, విమానాన్ని అధిరోహిస్తాడు. ఇంద్రియ సంయమనంతో, మితాహారంతో, శౌచాదులను పాటించి **చర్మణ్వతీనదిలో** స్నానమాచరించి, రంతిదేవునిచే అనుగ్రహించబడిన అగ్నిష్టోమయాగఫలాన్ని సాధిస్తాడు. అక్కడి నుంచి హిమాలయ పుత్రుడైన అర్బుదానికి యాత్ర సాగించాలి. పూర్వకాలంలో ఆ ప్రదేశంలో భూమికి రంధ్రం ఏర్పడి ఉంది. ఆ స్థలంలో **వసిష్ఠుని ఆశ్రమం** ఉంది. అది ముల్లోకాల్లో ప్రసిద్ధమైనది. అక్కడ ఒకరాత్రి గడపితే గోసహస్రదానఫలాన్ని మానవుడు పొందుతాడు. నరోత్తమా! **పింగతీర్థాన**

జితేంద్రియుడై స్నానాచమనాలు చేసిన మానవుడు వంద కపిలగోవులను దానం చేసిన ఫలం పొందుతాడు.

రాజేంద్రా ! ఆ ప్రదేశం నుంచి **ప్రభాసతీర్థానికి** చేరాలి. అక్కడ దేవతల ముఖస్వరూపుడు, వాయుసారథి, అయిన అగ్నిదేవుడు నివసిస్తాడు. ఆ తీర్థంలో శుచిగా ఆసక్తితో మునిగిన మానవుడు అగ్నిష్టోమ, అతిరాత్ర యాగాల ఫలితాన్ని పొందుతాడు. అక్కడినుంచి పోయి **సరస్వతీ సాగరసంగమం**లో స్నానం చేసి వేయిగోవులను దానం చేసిన ఫలాన్ని పొంది, ఎల్లప్పుడూ అగ్నివలె ప్రకాశిస్తాడు. పరిశుద్ధచిత్తంతో మానవుడు **వరుణతీర్థం**లో స్నానం చేసి, మూడురాత్రులు ఉపవాసంతో పితరులకు, దేవతలకు తర్పణం చెయ్యాలి. ఇలా చేసే యాత్రికుడు చంద్రునితో సమానంగా ప్రకాశిస్తూ అశ్వమేధయాగఫలాన్ని పొందుతాడు. అక్కడినుంచి వరదాన తీర్థానికి పోవాలి. యుధిష్ఠిరా! మునిశ్రేష్ఠుడు దుర్వాసుడు ఇక్కడ శ్రీకృష్ణునికి వరాన్ని ఇచ్చాడు. కావున దీనికి **వరదాన తీర్థమని** పేరు. ఇందు మునిగినవాడు వేయి ఆవులను దానమిచ్చిన ఫలాన్ని అందుకొంటాడు. ఆ ప్రదేశం నుంచి ద్వారవతీతీర్థానికి చేరి మితాహారం, జితేంద్రియత్వంతో ఉండాలి. పిండారకతీర్థంలో స్నానం చేస్తే లెక్కలేనంత సువర్ణాన్ని సొంతం చేసుకొంటాడు. ఈ తీర్థంలో ఇప్పటికీ కమలాలవంటి ముద్రలు కనిపిస్తాయి. ఇది ఒక అద్భుతం. కురునందనా! ఎక్కడ త్రిశూలచిహ్నాలు కల తామరపూలను చూస్తామో అదియే శివుని నివాసభూమి.

సింధునది, సాగరం కలిసినచోట మునిగి శుద్ధచిత్తుడై దేవతలకు, ఋషులకు తర్పణం సాగించాలి. ఇలా చేస్తే దివ్యకాంతులతో వరుణలోకానికి చేరతాడు. యుధిష్ఠిరా! అక్కడ శంకుకర్ణేశ్వరుని పూజిస్తే మనుజుడు అశ్వమేధఫలం కంటె పదిరెట్లు ఫలానికి అర్హుడు అవుతాడు అని చెప్పారు. భరతర్షభా! అక్కడ స్నానమాచరించి ముల్లోకాల్లో ప్రసిద్ధిగాంచిన సర్వపాపాలను తొలగించే **'దమీ'** తీర్థానికి చేరాలి. బ్రహ్మాదిదేవతలు ఆ ప్రదేశంలో మహాశివుని ఆరాధిస్తారు. దేవగణసహితుడైన శివుని అర్చించి, స్నానం, జలపానం చేసినవాడు పుట్టినప్పటి నుండి స్నానం చేసిన సమయం వరకు గల పాపాలను పోగొట్టుకొంటాడు. నరోత్తమా! దమీ తీర్థాన్ని దేవతలందరు స్తుతిస్తారు. అక్కడ స్నానం చేస్తే అశ్వమేధయాగఫలం వస్తుంది. మహాప్రాజ్ఞా! రాజా! సర్వశక్తిసంపన్నుడైన విష్ణువు లోకసంగ్రహణానికై దానవసంహారం ఆచరించి ఈ క్షేత్రంలో స్నానం చేసి పవిత్రుడు అయ్యాడు. అందరిచే కీర్తింపబడే **వసుధారా** తీర్థానికి వెళ్ళాలి. అక్కడికి చేరటంవలననే అశ్వమేధ యాగఫలం దక్కుతుంది. ఆ ప్రదేశంలో సావధానమనస్కుడై స్నానమాచరించి, దేవ పితరులకు తర్పణం చేస్తే విష్ణులోకానికి చేరుకొంటాడు. ఆ తీర్థంలోనే **అష్టవసువుల**

పవిత్ర సరోవరం ఉంది. అక్కడ స్నానం, జలపానం చేస్తే వసువులకు ప్రీతిపాత్రుడు అవుతాడు. దానిపేరు సర్వపాపాల్ని పోగొట్టగల **సింధూత్తమ తీర్థం**. అది సర్వపాపాలనూ పోగొట్ట గలది. అక్కడ మునిగితే అంతులేని సువర్ణాన్ని పొందవచ్చు.

భద్రతుంగ తీర్థానికి వెళ్ళి పవిత్రుడు, శీలసంపన్నుడై స్నానవిధిని ఆచరిస్తే బ్రహ్మలోకానికి చేరి ఉత్తమగతులను పొందుతాడు. **శక్రకుమార్తెల తీర్థం** సిద్ధుల నివాసం. అక్కడ స్నానం చేసిన నరుడు శీఘ్రంగా స్వర్గఫలాన్ని అందుకొంటాడు. సిద్ధులచే సేవింపబడే **రేణుకాతీర్థం** అక్కడే ఉంది. అక్కడ స్నానం చేసిన బ్రాహ్మణుడు చంద్రునితో సమానంగా నిర్మలుడు అవుతాడు. శౌచం, సంతోషం మొదలయిన నియమాలను పాలించి, మితాహారుడై **పంచనదతీర్థానికి** పోయిన మనుజుడు పంచమహాయజ్ఞాలను చేసినట్లు అవుతుంది. వాటిని క్రమంగా ఆచరించిన ఫలం దక్కుతుంది. అక్కడినుంచి **భీమతీర్థానికి** పోయి యోనితీర్థంలో స్నానం చేస్తే మానవుడు దేవీపుత్రుడుగా అవతరిస్తాడు. అతని శరీరకాంతి బంగారంలా ఉంటుంది. ఆ తీర్థాలను సేవిస్తే వేయిగోవులు దానంచేసిన ఫలం సిద్ధిస్తుంది. ముల్లోకాల్లో ప్రసిద్ధం అయిన **శ్రీకుండానికి** పోయి, బ్రహ్మదేవునికి నమస్కరిస్తే గోసహస్రదానఫలం దక్కుతుంది. ధర్మరాజా! అక్కడి నుంచి ముందుకు సాగి **విమలతీర్థయాత్ర** చెయ్యాలి. ఇప్పటికీ అక్కడ బంగారు, వెండి రంగులు గల చేపలు కనిపిస్తాయి. ఆ ప్రదేశంలో స్నానం చేసి, శీఘ్రంగా ఇంద్రలోకానికి చేరతాడు. అన్నిపాపాలకు దూరమై ఉత్తమగతి పొందుతాడు.

వితస్తా తీర్థానికి చేరి దేవతలకు, పితరులకు తర్పణం చేసి మనుష్యుడు వాజపేయయాగఫలం పొందుతాడు. కాశ్మీరదేశంలో నాగరాజు తక్షకుని నివాసమైన వితస్తా తీర్థం ఉంది. అది అన్ని పాపాలను నాశనం చేస్తుంది. అక్కడ స్నానం చేసి నరుడు వాజపేయయాగఫలాన్ని పొందుతాడు. సర్వపాపాలను పోగొట్టుకొని ఉత్తమగతికి అర్హుడు అవుతాడు. ముల్లోకాల్లో ప్రసిద్ధి నొందిన **బడబాతీర్థాన్ని** అటుపైన చేరాలి. సూర్యాస్తమయసమయంలో సంధ్యను యథావిధిగా ఆచరించి, అగ్నికి హవ్యాన్ని నివేదన చెయ్యాలి. అక్కడ పితరులకు దానం చేస్తే అది అక్షయం అవుతుంది అని విద్వాంసులు అంటారు. రాజా! ఋషులు, పితరులు, దేవతలు, గంధర్వులు, అప్సరసలు, గుహ్యకులు, కిన్నరులు, యక్షులు, సిద్ధులు, విద్యాధరులు, నరులు, రాక్షసులు, దైత్యులు, రుద్రుడు, బ్రహ్మ మొదలైనవారు ఇక్కడ నియమాలతో వేలకొలది సంవత్సరాలు దీక్షను గైకొని, శ్రీమన్మహావిష్ణువుకు హవ్యాలను సమర్పించారు. ఏడేసి ఋగేద్వమంత్రాలతో ఆహుతులను ఇచ్చి, భగవంతుడైన కేశవుని అర్చించారు. వారిపట్ల ప్రసన్నుడై శ్రీహరి వారందరికి

అణిమాదృష్టసిద్ధులను, ఎనిమిదిరెట్లు ఐశ్వర్యాన్ని ఇచ్చాడు. వారివారి కోరికల కనుగుణంగా వరాలనిచ్చి అక్కడే మేఘాల రాశిలో విద్యుత్తువలె అంతర్ధానం అయ్యాడు. అదియే **సప్త చరు తీర్థం** అయింది. అక్కడ అగ్నికి సమర్పించిన హవ్యం లక్షగోదానాలు, వంద రాజసూయయాగాలు, ఏడు అశ్వమేధ యాగాలకంటె గొప్పది, కళ్యాణకారి కూడ. అక్కడి నుంచి తిరిగి వచ్చి **రుద్రతీర్థానికి** చేరి, మహాదేవుని పూజించిన యాత్రికుడు అశ్వమేధఫలాన్ని దక్కించుకొంటాడు.

బ్రహ్మచర్యాన్ని పాటిస్తూ ఏకాగ్రచిత్తంతో **మణిమంతమనే** తీర్థంలో ఒకరాత్రి నివసిస్తే అగ్నిష్టోమఫలం పొందుతాడు. లోకవిఖ్యాతమైన **దేవికాతీర్థానికి** ఆపై చేరి బ్రాహ్మణుల ఉత్పత్తిని గురించి వినవచ్చు. అది త్రిశూలపాణి శివుని స్థానమని ముల్లోకాల్లో ప్రసిద్ధి చెందింది. దేవికాతీర్థంలో స్నానం చేసి శివునికి హవ్యాన్ని సమర్పిస్తే అన్ని కోరికలు తీర్చగల యజ్ఞఫలం వస్తుంది. అక్కడ దేవతలు పూజించే శివుని **కామతీర్థం** ఉంది. అక్కడ స్నానం ఆచరించిన నరుడు శీఘ్రంగా సిద్ధిని పొందుతాడు. యాగాలు చేయటం, చేయించటం, వేదాధ్యయనం, అక్కడ చేస్తే మృత్యుశోకం పొందడు. అక్కడి ఇసుక, పుష్పాలు, జలం స్పృశిస్తే మృత్యువు సమీపించినా శోకాన్ని పొందడు. అక్కడ ఐదుయోజనాల పొడుగు, అరయోజనం వెడల్పుగల పవిత్రవేదిక ఉంది. అది దేవతలచే, మునులచే సేవింపబడుతోంది. క్రమంగా **దీర్ఘసత్రతీర్థానికి** చేరాలి. అక్కడ బ్రహ్మ, దేవతలు, సిద్ధులు, ఋషులు ఉంటారు. వారు నియమాలతో దీక్షితులై సత్రయాగాన్ని ఆచరిస్తున్నారు. రాజేంద్రా! ఆ తీర్థయాత్ర చేస్తేనే యాత్రికులకు రాజసూయాశ్వమేధాలు చేసిన ఫలం లభిస్తుంది. ఆపై శౌచాది నియమశీలుడై, మితాహారుడై యాత్రికుడు **వివశన తీర్థానికి** వెళ్ళాలి. అక్కడ సరస్వతీదేవి ప్రచ్ఛన్నంగా సంచరిస్తూ ఉంటుంది. అక్కడి మిగిలిన చమసోద్భేద, శివోద్భేద, నాగోద్భేద తీర్థాల్లో సరస్వతి దర్శనం పొందుతాడు. **చమసోద్భేదంలో** స్నానమాచరించి, అగ్నిష్టోమఫలాన్ని గైకొంటాడు. నరుడు **శివోద్భేదంలో** స్నానం చేసి గోసహస్రదానఫలాన్ని, **నాగోద్భేదంలో** స్నాన మాచరించి, నాగలోకాన్ని పొందుతాడు.

దుర్లభం అయిన **శశయాన తీర్థానికి** చేరి, స్నానం చేస్తే సరస్వతీ నదిలో ప్రతిసంవత్సరం కార్తీకపూర్ణిమనాడు శశరూపంలో దాగిన పుష్కర తీర్థాన్ని చూడవచ్చు. (శశము = కుందేలు) అక్కడ స్నానమాచరించి, చంద్రుని కాంతివంటి కాంతిని పొందుతాడు. దానివలన సహస్రగోదానఫలం లభిస్తుంది. కురునందనా! మితాహారియై కుమార కోటి తీర్థాన్ని చేరి, స్నానం చేసి, పితరులను దేవతలను ఆసక్తితో అర్చించాలి. ఇట్లు చేసిన మానవుడు పదివేల గోవులను దానమిచ్చినట్లే. కులాన్ని ఉద్ధరించినవాడు అవుతాడు.

అక్కడినుంచి ఏకాగ్రచిత్తంతో **రుద్రకోటి తీర్థానికి** పోయి, అక్కడి విశేషాలను చూడాలి. పూర్వకాలాన ఒక కోటిమంది ఋషులు అక్కడకు రుద్రదర్శనానికై వచ్చారు. వారందరూ నేను ముందు, నేను ముందు అంటూ వృషభధ్వజుని దర్శనానికి వచ్చారు. యోగేశ్వరుడు అయిన శివుడు యోగాన్ని ఆశ్రయించి, ఆ ఋషులందరి ముందు వారి శాంతి కొరకు కోటి శివలింగాలను ఆవిర్భవింపచేశాడు. వారు ఎవరికి వారే తామే శివుని ముందుగా చూసినట్లు భావించారు. వారి పరిశుద్ధ మనస్సులకు సంతుష్టిని పొంది శివుడు వారికి వరాలను ఇచ్చాడు. 'ఈ రోజునుంచి మీ ధర్మాచరణం పెరుగుతుంది. ఈ రుద్రకోటితో స్నానమాచరించిన నరుడు అశ్వమేధయాగఫలాన్ని, కులోద్ధరణాన్ని పొందుతాడు.' రాజేంద్రా! అక్కడినుంచి పవిత్రం, లోకవిఖ్యాతం అయిన **సరస్వతీ సంగమతీర్థానికి** వెళ్ళాలి. ఆ ప్రదేశంలో బ్రహ్మాది దేవతలు, తపోధనులు కేశవుని ఉపాసిస్తుంటారు. రాజేంద్రా! చైత్రశుక్లచతుర్దశినాడు జనులు అక్కడ చేరుతారు. అక్కడ స్నానం చేస్తే ఎంతో బంగారం లభిస్తుంది. పాపవిముక్తి, బ్రహ్మలోకం ప్రాప్తిస్తాయి. ఋషుల సత్రయాగాలు పరిసమాప్తం అయ్యే అవసానతీర్థానికి చేరి, నరుడు గోసహస్రదానఫలాన్ని అందుకొంటాడు.'

83. కురుక్షేత్ర తీర్థాల మాహాత్మ్యము.

పులస్త్యుడిలా అన్నాడు. "అచటినుండి ఋషులచే కీర్తింపబడే **కురుక్షేత్రానికి** వెళ్ళాలి. ఆ క్షేత్ర దర్శనమాత్రం చేతనే పాపాలన్నీ పటాపంచలవుతాయి. కురుక్షేత్రానికి వెళ్ళి అక్కడ నివసిస్తాను అని సదా పలికితేనే చాలు పాపాలు తొలగిపోతాయి. గాలికి ఎగిరి, అక్కడి ధూళి శరీరంపై పడితే, దుష్టుడైనా ఉత్తమగతిని పొందుతాడు. దక్షిణాన సరస్వతి, ఉత్తరాన దృషద్వతీనది గల కురుక్షేత్రంలో నివసించేవాడు స్వర్గంలో నివసించినట్లే." నారదుడు పలికాడు. "ధీరుడు ఒక్కనెల అయినా సరస్వతీనదీ తీరాన గల కురుక్షేత్రంలో ఉండాలి. బ్రహ్మ, ఋషులు, గంధర్వులు, సిద్ధులు, చారణులు, మొదలగు వారందరూ ఆ బ్రహ్మక్షేత్రానికి వెళతారు. మనస్సులో అయినా కురుక్షేత్రం పోవాలి అనే కోరిక ఉంటే అతడు పాపాలు నశించి బ్రహ్మలోకానికి పోతాడు. శ్రద్ధతో కురుక్షేత్రయాత్ర చేస్తే రాజసూయాశ్వమేధాల ఫలం లభిస్తుంది. ద్వారపాలకుడుగ అక్కడ ఉన్న మచక్రుడనే యక్షునికి నమస్కరిస్తే వేయిగోవుల దానఫలం దక్కుతుంది. ఆపైన విష్ణు నివాసమైన సతతక్షేత్రానికి పోవాలి. అక్కడ ఎల్లప్పుడూ హరి నివసిస్తాడు. **సతతక్షేత్రం**లో స్నానం చేసి, త్రిలోకభావనుడైన విష్ణునికి నమస్కరిస్తే, అశ్వమేధ ఫలాన్ని, చివరకు విష్ణులోకాన్ని పొందుతాడు. భారతా! అక్కడినుంచి త్రిలోక ప్రసిద్ధి పొందిన పారిప్లవ తీర్థాన్ని దర్శిస్తే

అగ్నిష్టోమాతిరాత్ర ఫలం పొందుతాడు.

పృథివీ **తీర్థానికి** చేరితే వేయిగోవుల దానఫలం లభిస్తుంది. తీర్థసేవనాభిలాష కలవాడు ఆ ప్రదేశం నుంచి **శాలూకినీ తీర్థానికి** పోయి, **దశాశ్వమేధ తీర్థాన** స్నానం, చేస్తే దశాశ్వమేధ ఫలాన్ని గ్రహిస్తాడు. **నాగుల తీర్థం** వెళ్ళి సర్పదేవిని సేవిస్తే అగ్నిష్టోమఫలాన్ని, సర్పలోకాన్ని పొంది సుఖిస్తాడు. అక్కడినుంచి తరంతుకుడనే పేరుగల ద్వారపాలకుని చేరాలి. అక్కడ ఒకరాత్రి ఉంటే సహస్రగోదానఫలాన్ని అందుకొంటాడు. జితేంద్రియుడై నియతాహారంతో **పంచనదతీర్థానికి** పోయి, కోటితీర్థాల్లో మునిగి అశ్వమేధఫలాన్ని పొందుతాడు. **అశ్వినీదేవతల తీర్థానికి** చేరితే రూపవంతుడు అవుతాడు. అటుపైన పూర్వం వరాహరూపంలో విష్ణువు ఉన్న **వారాహ తీర్థానికి** పోయి, స్నానం ఆచరిస్తే అగ్నిష్టోమఫలం పొంది, సుఖిస్తాడు. పిమ్మట జయంతిలోని **సోమతీర్థానికి** చేరుకోవాలి. అక్కడ స్నానం చేస్తే రాజసూయయాగం చేసిన ఫలం అందుకొంటాడు. **ఏకహంసతీర్థం**లో మునిగితే వేయిగోవుల దానఫలం పొందుతాడు. **కృతశౌచతీర్థం**లో మునిగిన యాత్రికుడు పుండరీక యాగఫలం దక్కి పరిశుద్ధుడు అవుతాడు. అక్కడినుంచి స్థాణురూపశివ నివాసమైన **ముంజవటతీర్థాన** ఒకరాత్రి నివాసం ఉంటే గణపతిస్థానాన్ని చేరుకొంటాడు. ఆ స్థానంలో యక్షిణి అనే ప్రసిద్ధక్షేత్రం ఉంది. అక్కడకు చేరి స్నానం చేస్తే కోరికలన్నీ తీరుతాయి. అది **కురుక్షేత్రద్వారం** అని ప్రసిద్ధి చెందింది. అక్కడ ప్రదక్షిణం చేసి, ఏకాగ్రచిత్తంతో, పుష్కరతీర్థంతో తుల్యమైన ఆ తీర్థాన స్నానం చేసి ఋషులను, పితరులను అర్చించాలి. దీనివలన అశ్వమేధఫలాన్ని కృతకృత్యతను సాధించగలడు. జమదగ్నిపుత్రుడు పరశురాముడు ఈ తీర్థాన్ని నిర్మించాడు. రాజా! **యక్షిణీ తీర్థం**లో కృతకృత్యు డయితే అశ్వమేధఫలం లభిస్తుంది.

తరువాత ఏకాగ్రమనస్కుడై పరశురామకుండాలకు పోవాలి. తేజోవంతుడైన పరశురాముడు క్షత్రియ సముదాయాన్ని చంపి, అయిదుకుండాలను కల్పించాడు. ఆ కుండాలను అతడు క్షత్రియ రక్తంతో నింపి, పితృప్రపితామహులకు రక్తతర్పణం చేశాడని వినికిడి. ఆ పనికి పొంగిన పితృదేవతలు పరశురామునితో ఇలా పలికారు. 'పరశురామా! నీపరాక్రమం, పితృభక్తి మమ్ములను ప్రసన్నులను చేశాయి. నీకు కోరిన వరం ఇస్తాం. నీకు మంగళం జరుగుగాక!' వారి పలుకులు విని యోధాగ్రేసరుడు పరశురాముడు అంజలి ఘటించి ఆకాశంలో నిలిచిన పితరులతో ఇలా అన్నాడు – 'మీరు నాపై ప్రసన్నులైతే మీ కృపాప్రసాదాన్ని కోరుతూ ఉన్నాను. నా తపస్సు కొనసాగునట్లు వరం ఇవ్వండి. రోషంతో నాచే క్షత్రియులందరు చంపబడ్డారు. మీ తేజంతో ఆ పాపం నుంచి నన్ను

విముక్తుని చేయండి. ఈ కుండాలను తీర్థాలుగా అనుగ్రహించండి.' పరశురాముని శుభవచనాలు విన్న పితరులు ఆనందపరవశులై ప్రసన్నతతో ఇలా అన్నారు – 'చిరంజీవీ! నీతపస్సు మాపైగల పితృభక్తితో అధికం అవుతుంది. కోపంతో నీవు చేసిన క్షత్రియసంహారం నుంచి విముక్తిని పొందుతావు. ఆ క్షత్రియులు వారి కర్మలచే నశించారు. నీచే నిర్మింపబడిన కుండాలు తీర్థాలు అవుతాయి. ఆ కుండాల్లో స్నానం చేసి, పితృతర్పణం చేస్తే పితరులు ప్రసన్నులై భూమిపై దుర్లభాలైన కోరికలను తీరుస్తారు. మనోరథాన్ని, శాశ్వత స్వర్గలోకాన్ని ప్రదానం చేస్తారు.' ఈ విధంగా వరాలిచ్చి ప్రేమతో అతని అనుమతి పొంది అంతర్ధానం అయ్యారు. ఇలా **రామహ్రదాల్లో** స్నానం చేసి బ్రహ్మచారి, నియతవ్రతుడు ఆయి పరశురాముని అర్చిస్తే సువర్ణరాశిని పొందుతాడు. పిమ్మట **వంశమూలకతీర్థానికి** చేరుకోవాలి. అక్కడ స్నానం చేస్తే వంశం తరిస్తుంది. **కాయశోధన తీర్థంలో** స్నానం చేస్తే శరీరం తప్పక శుద్ధి అవుతుంది. శరీరశుద్ధిని పొందిన మానవుడు శ్రేష్ఠాలు కళ్యాణమయాలు అయిన లోకాలను చేరతాడు.

అలా ప్రయాణం చేస్తూ **లోకోద్ధారతీర్థాన్ని** చేరాలి. అది ముల్లోకాలలో ప్రసిద్ధం అయింది. అక్కడ స్నానం చేసినవాడు తనవారందరినీ ఉద్ధరించగలడు. **శ్రీతీర్థంలో** మునిగి జితేంద్రియుడై పితృదేవతలను, దేవతలను అర్చిస్తే సంపదను పొందగలడు. **కపిలాతీర్థాన** స్నానం చేసి బ్రహ్మచారియై పితరులను, దేవతల్ని పూజిస్తే వేయికపిలగోవులను దానం చేసిన ఫలం వస్తుంది. **సూర్యతీర్థాన్ని** చేరి, ఏకాగ్రతతో పితృదేవతలను ఆరాధించి, ఉపవాసం చేస్తే, అగ్నిష్టోమయాగఫలాన్ని పొంది సూర్యలోకం చేరుతాడు. పిమ్మట **గోభవన తీర్థానికి** పోయి అక్కడ స్నానం చేయాలి. అక్కడ అభిషేకం చేస్తే వేయిగోవులను దానం చేసిన ఫలం దక్కుతుంది. యాత్రికుడు **శంఖినీ తీర్థానికి** చేరి అక్కడి దేవతీర్థంలో మునిగితే ఉత్తమసౌందర్యం వస్తుంది. రాజా! సరస్వతీ నదిలోని **అరంతుకమనే** ద్వారపాల తీర్థానికి పోవాలి. యక్షరాజైన **కుబేరుని రేవు** అక్కడుంది. అక్కడ స్నానంచేస్తే అగ్నిష్టోమయాగఫలం కల్గుతుంది. రాజేంద్రా! ఆ ప్రదేశం నుంచి **బ్రహ్మావర్తం** చేరాలి. అందు స్నానమాచరిస్తే మానవుడు బ్రహ్మలోకాన్ని చేరుతాడు. ఆ స్థానం నుంచి సాటిలేని సుతీర్థాన్ని చూడాలి. ఆ ప్రదేశంలో పితరులు, దేవతలు కలిసి ఉంటారు. పితృదేవపూజలో భాగంగా అక్కడస్నానం చెయ్యాలి. దానివలన అశ్వమేధఫలాన్ని, పిమ్మట పితృలోకాన్ని పొందుతాడు. అనంతరం శ్రేష్ఠమయిన **అంబుమతీతీర్థాన్ని** సేవించాలి. భరతశ్రేష్ఠా! **కాశీశ్వర తీర్థాల్లో** స్నానమాడితే, రోగాలు దూరమై బ్రహ్మలోకానికి పోతాడు. అక్కడే **మాతృతీర్థం** ఉంది. అందుమునిగినవాని సంతానం వృద్ధి పొంది, తరగని సంపదను

పొందుతాడు. తరువాత నియమంతో, మితాహారంతో **సీతవనం** అనే తీర్థానికి వెళ్లాలి. రాజా! అటువంటి మహత్తీర్థం ఇతరత్ర లభించదు. ఆ తీర్థాన్ని ఒక్కసారి చూసినా, మునిగి కేశప్రక్షాళనం చేసుకొన్నా పవిత్రుడు అవుతాడు. అక్కడే **శ్వావిల్లోమాపహ తీర్థం** ఉంది. తీర్థగాములు, విప్రులు, విద్వాంసులు అచట స్నానం చేసి సాటిలేని ఆనందాన్ని పొందుతారు. శ్వావిల్లోమాపహతీర్థాన ప్రాణాయామాది యోగ ప్రక్రియలను పాటించి లో(రో)మాలు తొలగించుకొని పవిత్రులై ఉత్తమగతులను చేరుతారు.

ఆ ప్రదేశంలో **దశాశ్వమేధిక తీర్థం** ఉంది. ఆ తీర్థాన స్నానమాత్రంచే మానవుడు ఉత్తమగతులు పొందుతాడు. అక్కడనుండి లోకప్రసిద్ధమైన **మానుష తీర్థాన్ని** చేరాలి, బోయవాని బాణాల దెబ్బలుతిన్న జింకలు ఆ సరస్సులో స్నానంచేసియే మానుష రూపాన్ని పొందాయి. బ్రహ్మచర్యంతో, ఏకాగ్రచిత్తంతో అక్కడ స్నానం ఆచరిస్తే పాపాలు తొలగి, స్వర్గాన్ని చేరుకొంటాడు. రాజా! **మానుష తీర్థానికి** తూర్పున క్రోసుదూరాన ఆపగానది ఉంది. అది సిద్ధులచే సేవింపబడుతుంది. పితృదేవతలకు అచట శ్యామాక అన్నాన్ని అర్పిస్తే గొప్ప ధర్మఫలం కర్తను చేరుతుంది. అక్కడ ఒక్కబ్రాహ్మణునికి భోజనం పెట్టినా అది కోటిబ్రాహ్మణులకు అన్నదానం చేసినట్లు అవుతుంది. ఆ నదిలో స్నానం చేసి పితరులను, దేవతలను ఆరాధిస్తే, అక్కడ ఒకరాత్రి నివసిస్తే అగ్నిష్టోమయాగాచరణ ఫలం పొందుతాడు. తరువాత **బ్రహ్మనివాసస్థానానికి** చేరాలి. అది **బ్రహ్మోదుంబరమను** పేర ప్రసిద్ధి చెందింది. నరోత్తమా! అక్కడ **సప్తర్షికుండం** ఉంది. ఆ కుండాల్లోను కపిష్ఠల కేదార తీర్థంలోను మునిగితే గొప్ప పుణ్యరాశి వశం అవుతుంది. అచటి బ్రహ్మను దర్శిస్తే పాపాలు పోయి, బ్రహ్మలోకంలో స్థిరనివాసం ఉంటాడు. **కపిష్ఠలుని కేదారంలో** స్నానమాచరిస్తే, పాపం పోయి **అంతర్ధాన విద్య** తెలుస్తుంది. ఆ ప్రదేశం నుంచి ప్రసిద్ధమైన **నరక తీర్థానికి** చేరాలి. అక్కడ కృష్ణపక్షచతుర్దశినాడు శివుని సేవిస్తే అన్ని కోరికలు తీరిన పిదప స్వర్గానికి చేరుతాడు. ఆ సరక తీర్థంలో మూడుకోట్ల తీర్థాలు ఉన్నాయి. రాజా! ఈ తీర్థాలు రుద్రకోటిలో, నూతిలో, కుండాల్లో కనిపిస్తాయి. అక్కడి **ఇలాస్పదతీర్థంలో** స్నానం చేసి దేవపితరులను ఆరాధిస్తే దుర్గతులు పోయి వాజపేయయాగఫలం లభిస్తుంది.

ఆ స్థలంలో **కిందానం, కింజప్యం** అనే తీర్థాలు ఉన్నాయి. అక్కడ స్నానం చేస్తే, దాన తపస్సుల అంతులేని ఫలాన్ని పొందుతాడు. జితేంద్రియుడు అయి **కలశతీర్థంలో** స్నానం ఆచరిస్తే అగ్నిష్టోమఫలం దక్కుతుంది. కురువంశశ్రేష్ఠా! సరక తీర్థానికి తూర్పున **నారద తీర్థం** ఉంది. దానికి **అంబాజన్మ** అనిపేరు. భారతా! ఆ తీర్థాన మునిగి,

మనుజుడు ప్రాణత్యాగంచేస్తే, నారదుని ఆజ్ఞానుసారం ఉత్తమలోకాలను పొందుతాడు. రాజా! శుక్లపక్ష దశమినాడు పుండరీక తీర్థంలో ప్రవేశించాలి. అక్కడ స్నానం చేసిన నరుడు పుండరీక యాగఫలాన్ని అందుకొంటాడు. తరువాత లోకప్రఖ్యాతి గల **త్రివిష్టపతీర్థానికి** చేరాలి. అక్కడ వైతరణి అనే పుణ్యనది ఉంది. అక్కడ స్నానం చేసి శూలపాణి, వృషభధ్వజుడు అయిన శంకరుని ఆరాధిస్తే మానవుడు పాపదూరుడై ఉత్తమగతులను చేరుతాడు. రాజేంద్రా! ఆ ప్రదేశం నుంచి **ఫలకీవనానికి** యాత్ర కొనసాగించాలి. దేవతలందరు ఎల్లప్పుడు ఆ వనాన్ని ఆశ్రయించి ఉంటారు. వేల సంవత్సరాలు వారక్కడ తపస్సు చేశారు. **దృషద్వతీనదిలో** స్నానం చేసి, పితరులను, దేవతలను అర్చిస్తే అగ్నిష్టోమాతిరాత్రయాగాల ఫలం వస్తుంది. **సర్వదేవతీర్థంలో** మునిగి వేయిగోవుల దానఫలాన్ని పొందుతాడు. **పాణిఖాతతీర్థంలో** స్నానం చేసి దేవపితరులకు తర్పణాలు ఇస్తే, ముందు అగ్నిష్టోమాతిరాత్రఫలాన్ని పొంది, చివర ఋషిలోకనివాసి అవుతాడు. అచటినుండి **మిశ్రకతీర్థానికి** చేరాలి. తీర్థాలన్నీ కలియటంచేత మిశ్రకతీర్థం అంటారు. వ్యాసునిచే బ్రాహ్మణులకొరకు ఈపని చేయబడింది. ఈతీర్థస్నానం అన్నితీర్థాల స్నానఫలం ఇస్తుంది. ఆ ప్రదేశం నుంచి వ్యాసవనం చేరి, మితాహారియై, మనోజవతీర్థంలో మునిగితే సహస్రగోదానఫలాన్ని పొందుతాడు.

మధువటికి పోయి, **దేవతీర్థంలో** శుద్ధుడై స్నానమాచరిస్తే పితరులను, దేవతలను సేవిస్తే, దేవి అనుగ్రహంతో వేయిగోవుల దానఫలాన్ని పొందుతాడు. కౌశికి, దృషద్వతీ **నదుల సంగమంలో** మునిగి, మితాహారియైతే పాపాలన్నీ తొలగిపోతాయి. రాజేంద్రా! తరువాత **వ్యాసస్థలికి** పోవాలి. పుత్రశోకంతో శరీరాన్ని విడవాలని వ్యాసుడు భావిస్తే దేవతలు ఆయనను మరలా నిలబెట్టారు. అక్కడకు వెళ్ళడంతోనే వేయిగోవులను దానం చేసిన ఫలం మానవుడికి లభిస్తుంది. **కిందత్తం** అనే నూతివద్దకు పోయి 16 పిడికిళ్ళ తిలలు దానం చేస్తే దేవ, పితృ, ఋషి ఋణాలను తీర్చినవాడు అవుతాడు. **వేదీతీర్థంలో** స్నానమాచరించి వేయిగోవుల దానఫలాన్ని వశపరచుకొంటాడు. నరశ్రేష్ఠా! అక్కడ లోకప్రసిద్ధి గల **అహస్సు, సుదివం** అనే రెండు తీర్థాలు ఉన్నాయి. ఆ రెంటిలో స్నానం చేస్తే సూర్యలోకాన్ని చేరుతాడు. పిమ్మట **మృగధూమతీర్థానికి** వెళ్ళి, అక్కడి గంగానదిలో స్నానం చెయ్యాలి. ఆ తీర్థంలో మహాదేవుని పూజిస్తే అశ్వమేధయాగఫలాన్ని పొందవచ్చు. **దేవీతీర్థంలో** స్నానం చేసిన నరుడు సహస్ర గోదాన ఫలితాన్ని పొందుతాడు. పిమ్మట ప్రసిద్ధిగల **వామనకతీర్థానికి** చేరి, విష్ణుపద తీర్థంలో స్నానం చేసి, వామనుని అర్చిస్తే పాపముక్తుడై విష్ణులోకం చేరుకొంటాడు. **కులంపునతీర్థంలో** స్నానమాడి వంశాన్ని

ఉద్ధరించుతాడు. మరుత్తీర్థాలలో శ్రేష్ఠమైన **పవనప్రాదం** అక్కడుంటుంది. అక్కడ స్నానమాచరిస్తే విష్ణులోకంలో విరా జిల్లవచ్చు. **అమరప్రాదం**లో స్నానం చేసి, ఇంద్రుని పూజించితే అమరుల ప్రభావంచే స్వర్గంలో స్థిరపడతాడు. శాలిహోత్రుని శాలి **సూర్యతీర్థం**లో యథావిధిగా స్నానం ఆచరిస్తే గోసహస్రదానఫలాన్ని అందుకొంటాడు. **శ్రీకుబ్జం** అనే సరస్వతీ తీర్థంలో మునిగి అగ్నిష్టోమాచరణఫలాన్ని దక్కించుకొంటాడు. అనంతరం నైమిషకుంజ యాత్ర సాగించాలి. నైమిశారణ్యాన తీర్థమిషచే ఋషులంతా కురుక్షేత్రానికి వచ్చారు. ఆ సమయాన **సరస్వతీ కుంజ**నిర్మాణం చేశారు. అది ఋషుల స్థానం. అది వారి సంతోషాన్ని పెంచుతుంది. అందు స్నానం చేస్తే అగ్నిష్టోమఫలాన్ని పొందుతాడు. అటుపై **కన్యాతీర్థా**నికి చేరి, స్నానం ఆచరిస్తే వేయిగోవుల దానఫలం దక్కుతుంది. అనంతరం పరమోత్తమమైన **బ్రహ్మతీర్థం** చేరాలి. అక్కడ బ్రాహ్మణేతరుడు స్నానం చేస్తే బ్రాహ్మణత్వం సిద్ధిస్తుంది. బ్రాహ్మణుడైతే నిర్మల మనస్సుతో ఉత్తమగతులను సాధిస్తాడు. నరవరా! పిమ్మట **సోమతీర్థయాత్ర** సాగించాలి. అక్కడ మునిగి నరుడు సోమలోకాన్ని చేరుతాడు.

ఆ ప్రదేశం నుంచి **సారస్వత తీర్థా**నికి బయలుదేరాలి. అది మంకణకు డనే సిద్ధుడు సిద్ధిపొందిన క్షేత్రం. పూర్వం మంకణకుడు ఒకతాపసి. దర్భకొన అతని చేతికి గాయం చేసింది. దాని నుంచి శాకరసం స్రవించసాగింది. అది చూసిన మంకణకునికి హర్షావేశాలు కలిగి నృత్యం చేయసాగాడు. వీరా! ఆ నృత్యసమయాన అతని తేజంతో మోహితమయి చరాచర జగత్తు నృత్యం చేయసాగింది. రాజా! బ్రహ్మాదులు, ఋషులు మంకణకుని వృత్తాంతాన్ని మహాదేవునికి నివేదించారు. 'మీరు ఏదేని ఉపాయం చింతించి అతని నృత్యాన్ని ఆపండి' అని ప్రార్థించారు. వారి హితంకోరి శివుడు మంకణకుని నృత్యప్రదేశాన్ని చేరి, అతనిని ఉద్దేశించి అన్నాడు. 'మహర్షీ! మీరెందులకీ నృత్యం చేస్తున్నారు. మీ సంతోషానికి కారణం ఏమిటి?' ఋషి అన్నాడు. 'ధర్మమార్గాన్ని అనుసరించే తాపసి నయిన నాచేతి నుండి శాకరసం వెలువడుతోంది. మీరు చూడలేదా? అందుచేత నాకు ఆనందం కలిగి నృత్యాన్ని ప్రారంభించాను.' రాగప్రభావితుడైన ఋషిని చూచి శంకరుడు ఇలా పలికాడు. 'నేనీవిషయాన్ని గమనించినా నాకు ఆశ్చర్యం లేదు. నావైపు చూడండి' అని ప్రభావశాలి అయిన శంకరుడు తన వేలికొనతో బొటనవ్రేలిని కొట్టగా అందులో నుండి మంచు రంగుగల భస్మం బయటపడింది. అది చూచి సిగ్గుపడి మంకణకుడు శివుని పాదాలను ఆశ్రయించాడు. శివునికంటె గొప్పదైవం లేదని మనస్సులో నిశ్చయించాడు. 'దేవాసురులతో కూడిన ఈ లోకానికి నీవే దిక్కు. ఈ ముల్లోకాలు నీవే సృష్టించావు. యుగాంతంలో అందరిని నీవే

మ్రింగుతున్నావు. దేవతలకు కూడ నీ స్వరూపం తెలియ వీలుకాదు. నా గురించి వేరుగా చెప్ప నవసరం లేదు. బ్రహ్మాదులు, సురలు నీయందే దర్శనమిస్తున్నారు. ఈ లోకాలను చేసేవాడవు, చేయించేవాడవు నీవే. నీ అనుగ్రహంచే దేవతలు భయంలేక నిశ్చింతగా ఉన్నారు' అని స్తుతించి మహాదేవునితో తిరిగి ఇలా అన్నాడు. 'నీ అనుగ్రహంచేత నాతపస్సు తరిగిపోరాదు'. మహాదేవుడు ప్రసన్నుడై ఆ ఋషితో ఇలా అన్నాడు. 'నా ప్రభావంచే నీ తపస్సు వేయివిధాల వృద్ధి చెందుతుంది. ఈ ఆశ్రమంలో నీతో కలిసి నివసిస్తాను. సప్తసారస్వతతీర్థంలో మునిగి నాపూజ చేస్తే అతనికి ఇహపరలోకాల్లో పొందరానిది ఏదీ ఉండదు. వారు సరస్వతీదేవి లోకాలకు చేరుతారు. సందేహం లేదు' అని పలికి శివుడు మాయం అయినాడు.

త్రిలోకప్రసిద్ధి గల **ఔశనస తీర్థానికి** అక్కడినుంచి వెళ్ళాలి. బ్రహ్మ, ఋషులు, దేవతలు, అక్కడే ఉన్నారు. భారతా! శుక్రుని ప్రియం కొరకు కార్తికేయస్వామి మూడు సంధ్యలలో అక్కడనే సన్నిహితుడై ఉంటాడు. **కపాలమోచన తీర్థం** అన్నిపాపాల్ని పోగొడుతుంది. అక్కడ స్నానం చేస్తే అన్నిపాపాలు పోతాయి. తదనంతరం అగ్ని తీర్థానికి యాత్ర సాగించి, స్నానంచేస్తే అగ్నిలోకం చేరడమే కాక అక్కడ వంశాన్ని కూడా ఉద్ధరిస్తాడు. అక్కడే **విశ్వామిత్ర తీర్థం** ఉంది. ఆ ప్రదేశంలో స్నానం చేస్తే బ్రాహ్మణత్వం పొందుతాడు. నరోత్తమా! **బ్రహ్మయోని తీర్థానికి** పోయి పవిత్రుడై అక్కడ మునిగితే బ్రహ్మలోకాన్ని చేరుతాడు. తన వంశాన్ని ఏడుతరాల దాకా తరింపచేస్తాడు. రాజేంద్రా! పిమ్మట కార్తికేయనివాసమైన **పృథూదక తీర్థం** వెళ్ళాలి. అక్కడ స్నానం చేసి పితరుల, దేవతల అర్చన సాగించాలి. భారతా! పృథూదకతీర్థాన స్నానం చేస్తే పురుషుడు, స్త్రీ అనే భేదం లేకుండా, జ్ఞాని, అజ్ఞాని అనే తేడా లేకుండా పాపాలన్నీ తొలగుతాయి. అశ్వమేధఫలం, స్వర్గలోకం కూడ లభిస్తుంది.

కురుక్షేత్రం తీర్థాలన్నింటిలో పవిత్రం. సరస్వతి కురుక్షేత్ర తీర్థం కంటె పవిత్రం. సరస్వతిని మించి ఆ నదీతీర్థాలు పవిత్రాలు. తీర్థాలన్నింటిలో **పృథూదకం** పవిత్రం. అది అన్ని తీర్థాలలో శ్రేష్ఠం. పృథూదకతీర్థాన జపపరాయణుడై శరీరత్యాగం చేసిన వానికి మృత్యుభయం ఉండదు. ఈ విషయాలన్నింటిని వ్యాసులవారు, సనత్కుమారులు ప్రతిపాదించారు. రాజా! నియమపరుడైనవాడు తప్పక పృథూదక తీర్థం వెళ్లాలి. పృథూదకంతో సమానం అయిన తీర్థం మరేదీ లేదు. అది పవిత్రం, పావనం, మేధ్యం అనటంలో సందేహంలేదు. నరశ్రేష్ఠా! పాపాత్ములైన మానవులు ఆ తీర్థాన స్నానం చేసి స్వర్గానికి పోతారు అని విద్వాంసులంటారు. రాజా! అక్కడనే ఉన్న **మధుస్రవమనే తీర్థాన్ని**

సేవించి, వేయిగోవుల దానఫలాన్ని అందుకొంటాడు. తరువాత **సరస్వతీ అరుణా వదుల సంగమతీర్థానికి** యాత్ర కొనసాగించాలి. అది లోక ప్రసిద్ధతీర్థం. భరతర్షభా! మూడురాత్రులు ఉపవాసం చేసి, ఆ తీర్థంలో స్నానం చేస్తే, బ్రహ్మహత్యాపాతకం పోయి అగ్నిష్టోమాతిరాత్ర యాగాల ఫలం లభిస్తుంది. అది ఏడుతరాలవారిని పవిత్రం చేస్తుంది.

అక్కడే **ఆర్ధకీలతీర్థం** ఉంది. బ్రాహ్మణులపై దయచే పూర్వకాలంలో దర్భి అనే తాపసి దాన్ని సిద్ధంచేశాడు. అక్కడ వ్రతం, ఉపనయనం, ఉపవాసం చేస్తే కర్మకాండ, మంత్రపరిజ్ఞానం కలిగి బ్రాహ్మణుడు అవుతాడు. సందేహం లేదు. నరోత్తమా! క్రియామంత్ర పరిజ్ఞానం లేకపోయినా, ఆ తీర్థంలో మునిగిన వ్రతివ్యక్తి, విద్వాంసు డవుతాడని ప్రాచీనుల అభిప్రాయం. దర్భిముని అక్కడకు నాలుగు సముద్రాల పాయలను తీసుకువచ్చాడు. అక్కడ స్నానం చేసిన నరుడు దుర్గతి పొందడు. నాలుగువేల గోవుల దానఫలం చిక్కుతుంది. ధర్మజ్ఞా! అక్కడి నుంచి **శతసహస్రక, సహస్రక తీర్థాలకు** యాత్ర చేయాలి. ఆ రెంటి యందు స్నానం చేస్తే వేయిగోవుల ఫలం దక్కుతుంది. అక్కడచేసిన దానం, ఉపవాసం వెయ్యిరెట్ల ఫలం ఇవ్వగలదు. రాజేంద్రా! తరువాత **రేణుకా తీర్థానికి** పోవాలి. అక్కడ స్నానం చేసి పితరులను, దేవతలను ఆరాధిస్తే, పాపాలన్నీ తొలగి అగ్నిష్టోమయాగఫలం వశం అవుతుంది. **విమోచనతీర్థస్నానం** చేసి కోపాన్ని జయించి, జితేంద్రియుడైతే ప్రతిగ్రహదోషఫలం పోతుంది. **పంచవటీ తీర్థానికి** వెళ్ళి మితాహారి, జితేంద్రియుడై ఉన్నవాడు గొప్పపుణ్యం సంపాదించి సత్పురుషుల లోకంలో చిరకాలం ఉంటాడు. అక్కడ వృషభధ్వజుడు, స్థాణువు అయిన శివుడు వెలసి ఉన్నాడు. అక్కడకు పోవుటచేతనే మానవుడు సిద్ధిని పొందుతాడు. కురుశ్రేష్ఠా! **తైజసతీర్థం** వరుణునిది. అతని తేజంతో ప్రకాశిస్తుంది. అక్కడే బ్రహ్మాది దేవతలు, తాపసులు, ఋషులు కార్తికేయుని దేవసేనాపతిగా అభిషేకించారు. తైజసతీర్థానికి తూర్పున **కురుతీర్థం** ఉంది. కురుతీర్థంలో స్నానమాచరిస్తే జితేంద్రియుడు అయి, పాపాలు పోయి బ్రహ్మలోకాన్ని చేరతాడు. అక్కడినుంచి స్వర్గద్వారానికి పోయి స్నానం చేసి, స్వర్గానికి చేరి, తరువాత బ్రహ్మలోకం చేరుకొంటాడు. రాజా! తీర్థయాత్రికుడు క్రమంగా **అవరకతీర్థానికి** యాత్ర సాగించాలి. అక్కడ స్నానం చేస్తే దుర్గతి పొందడు. నారాయణాది దేవతలతో బ్రహ్మ ఇక్కడ నివాసం చేస్తాడు. రాజేంద్రా! రుద్రునిభార్య దుర్గ అక్కడనే స్థిరంగా ఉంటుంది. ఆ దేవిని కొలిచితే దుర్గతిని పొందడు. మహారాజా! అది ఉమాదేవి భర్త విశ్వేశ్వరుని స్థానం. అక్కడ శివుని పూజించి సర్వపాపాలనుండి విడివడుతాడు. మహారాజా! శత్రుదమనుడు, నారాయణుడు, అయిన విష్ణువును అక్కడ కొలిచినవాడు విష్ణులోకం చేరతాడు. అన్ని తీర్థాలలో మునిగినవాడు సర్వ దుఃఖాలను

పోగొట్టుకొని చంద్రుని వలె వెలిగిపోతాడు.

రాజా! ఆ ప్రదేశం నుంచి **స్వప్తిపురం** చేరి ప్రదక్షిణం చేస్తే గోసహస్రదానఫలం లభిస్తుంది. **పావనతీర్థాన్ని** చేరి పితృదేవతలకు తర్పణం చేస్తే అగ్నిష్టోమఫలం దక్కుతుంది. అక్కడ **గంగావదం** అనే నుయ్యి ఉంది. మూడుకోట్ల తీర్థాలు ఆ నూతిలో ఉన్నాయి. అందులో మునిగిన నరుడు స్వర్గానికి చేరతాడు. నదిలో స్నానం చేసి, మహేశ్వరుని కొలిచి, గణపతిపదాన్ని పొంది, వంశాన్ని ఉద్ధరిస్తాడు. అటుపైన **స్థాణువట తీర్థానికి** పోయి స్నానం చేసి, ఒకరాత్రి ఉంటే రుద్రలోకాన్ని చేరతాడు అనే ప్రసిద్ధి ఉంది. ఆ ప్రదేశం నుంచి **బదరీపాచనం** అనేప్రసిద్ధి గల వసిష్ఠాశ్రమానికి చేరాలి. అక్కడ మూడు రాత్రులు ఉపవాసం చేసి రేగులను తిని ఉండాలి. నరుడు పన్నెండు సంవత్సరాలు రేగులు తిని, మూడు రాత్రులు ఉపవాసం చేసి వసిష్ఠసమానుడు అవుతాడు. రాజా! **రుద్రమార్గానికి** పోయి ఒకరాత్రి, పగలు ఉపవాసం చెయ్యాలి. అప్పుడు ఇంద్రలోకంలో స్థిరంగా ఉంటాడు. **ఏకరాత్రతీర్థాన్ని** చేరి నియమంతో సత్యవాది అయి ఒకరోజు ఉంటే బ్రహ్మలోకాన్ని చేరతాడు. పిమ్మట త్రిలోకప్రసిద్ధిగల **సూర్యుని ఆశ్రమం** ప్రవేశించి, ఆ తీర్థంలో స్నానంచేసి, సూర్యుని కొలిస్తే, సూర్యలోకం చేరతాడు. వంశాన్ని ఉద్ధరిస్తాడు. రాజా! **సోమతీర్థంలో** మునిగితే సోమలోకాన్ని చేరటంలో సందేహం లేదు.

ధర్మజ్ఞా! అటుపైన పరమపావనం, లోకప్రసిద్ధం అయిన **దధీచ్యాశ్రమయాత్ర** కొనసాగించాలి. ఆ క్షేత్రంలో సరస్వతీపుత్రుడు, తపోనిధి అయిన అంగిరసుడు పుట్టాడు. ఆ తీర్థసేవనం అశ్వమేధఫలం ఇస్తుంది. సరస్వతీ లోకప్రాప్తిని నిస్సందేహంగా కలిగిస్తుంది. నియమంతో, బ్రహ్మచర్యపాలన సాగిస్తూ **కన్యాశ్రమతీర్థం** వెళ్లాలి. అక్కడ మూడురాత్రులు ఉపవసించి, మితాహారియై వందమంది దేవకాంతలను, స్వర్గలోకాన్ని వశం చేసుకొంటాడు. ధర్మజ్ఞా! తరువాత **సంనిహతీ తీర్థయాత్ర** సాగించాలి. ఆ తీర్థానికి బ్రహ్మాదిదేవతలు, ఋషులు, తపోధనులు నెలనెలా వచ్చి పుణ్యాన్ని ప్రోగుచేసుకొంటారు. సూర్యగ్రహణంరోజున **సంనిహతీ తీర్థాన** స్నానమాచరిస్తే వంద అశ్వమేధయాగాల ఫలం వస్తుంది. భూమిపై, ఆకాశంలో ఎన్ని తీర్థాలు, నదులు, హ్రదాలు, చెఱువులు, ప్రవాహాలు, దిగుడుబావులు, మందిరాలు ఉన్నాయో అవి అన్నీ ప్రతీనెలా అమావాస్యనాడు ఈ సంనిహత తీర్థంలో ఉంటాయి. నరోత్తమా! తీర్థసమూహం ఇందులో ఉండటంచేత దీన్ని **సంనిహత తీర్థం** అంటారు. అక్కడ స్నానం చేసి, నీరు త్రాగితే స్వర్గంలో స్థిరంగా ఉంటాడు. సూర్యగ్రహణంనాడు శ్రాద్ధవిధిని అక్కడ ఆచరిస్తే, వేయి అశ్వమేధయాగాల ఫలం అతనికి సంక్రమిస్తుంది. స్నానమాత్రం చేత, శ్రాద్ధాచరణంచేత ఎట్టి పాపమైనా, స్త్రీకైనా, పురుషునికైనా పూర్తిగా

నశిస్తుంది. పద్మపురంగుగల విమానంలో బ్రహ్మలోకం చేరుతారు. పిమ్మట మచక్రుడనే ద్వారపాలకుడైన యక్షునికి నమస్కరించి, కోటితీర్థంలో స్నానమాచరించి, మానవుడు సువర్ణరాశిని గైకొంటాడు. **గంగాహ్రాదమనే తీర్థం** అక్కడే ఉంది. అందులో స్నానం చేసి, జితేంద్రియుడై రాజసూయాశ్వమేధయాగాల ఫలాన్ని పొందుతాడు.

భూమిపై నైమిశం, ఆకాశంలో పుష్కరం ఉన్నాయి. మూడులోకాల తీర్థాల్లోను కురుక్షేత్రం గొప్పది. కురుక్షేత్రం నుంచి వాయువుచే ఎగురగొట్టబడిన ధూళి చెడ్డవానిని కూడ ఉత్తమగతికి చేరుస్తుంది. సరస్వతీనదికి దక్షిణంగా, దృషద్వతీనదికి ఉత్తరంగా ఉన్న కురుక్షేత్రంలో నివసించినవారు స్వర్గంలో నివసించినట్లే. 'కురుక్షేత్రానికి పోతాను, కురుక్షేత్రంలో ఉంటాను' అన్న మాటలచేతనే అన్నిపాపాలు పోతాయి. కురుక్షేత్రం బ్రహ్మ వేదిస్థానం. ఈ క్షేత్రాన్ని బ్రహ్మర్షులు సదా సేవిస్తారు. అందులో నివసించేవారు శోకాన్ని ఎన్నడూ పొందరు. తరంతుక, అరంతుకాల మధ్య భూభాగం; రామహ్రదం, మచక్రుకాల మధ్యభాగం ఏదో అదియే కురుక్షేత్రం, సమంతపంచకం. అది బ్రహ్మ ఉత్తరవేదిస్థానం.

84. వివిధ తీర్థాల మహిమ.

పులస్త్యు డిలా అన్నాడు. పిమ్మట **ధర్మతీర్థానికి** చేరాలి. అక్కడ ధర్ముడనే తపస్వి గొప్ప తపస్సు చేశాడు. రాజా! ఆయన పేరుతో ఆ పుణ్యతీర్థం ప్రసిద్ధికెక్కింది. అక్కడ స్నానం చేసి, ఇంద్రియనిగ్రహం కలిగి, ఉంటే ఏడుతరాల వరకు తనవంశాన్ని పవిత్రం చేస్తాడు. అక్కడినుంచి **జ్ఞానపావన తీర్థానికి** పోవాలి. అక్కడికి చేరడంతో యాత్రికుడు అగ్నిష్టోమఫలాన్ని పొంది, మునిలోకాన్ని చేరతాడు. తరువాత మానవుడు **సౌగంధికవనగమనం** చెయ్యాలి. అక్కడ బ్రహ్మాదిదేవతలు, తపోధనులైన ఋషులు, సిద్ధులు, చారణులు, గంధర్వులు, కిన్నరులు, నాగులు నివసిస్తారు. రాజా! ఆ వనంలో ప్రవేశిస్తే చాలు అన్నిపాపాలు పోతాయి. నదులలో శ్రేష్ఠం అయిన సరస్వతీ నదికి అది పుట్టిన ప్రదేశం. అక్కడ జ్వించెట్టు నుండి ఆ నది ప్రవిస్తుంది. ఆ ప్రదేశంలో పుట్టనుంచి వచ్చే నీటిలో స్నానం చెయ్యాలి. ఆ తీర్థంలో పితరులను, దేవతలను అర్చించి మానవుడు అశ్వమేధఫలాన్ని సాధిస్తాడు. అక్కడి **ఈశానాధ్యుషితం** అనే తీర్థం మానవులకు దుర్లభం. నరశ్రేష్ఠా! అక్కడ కనిపించే పుట్టనుండి **శమ్యానిపాతాలనే** ఆరుతీర్థాలు ఏర్పడ్డాయి. అందులో స్నానమాచరించిన యాత్రికుడు అశ్వమేధఫలాన్ని, వేయి కపిలగోవులను దానం చేసిన ఫలాన్ని అందుకొంటాడు. ఇది ప్రాచీనుల దర్శనం. సుగంధ, శతకుంభ, పంచయజ్ఞ అనే మూడు తీర్థాల్లో మునిగినవాడు స్వర్గాన స్థిరనివాసం పొందుతాడు. అక్కడ ప్రసిద్ధం

త్రిశూలఖాతతీర్థం. అందు మునిగి దేవ, పితరులను ఆరాధిస్తే దేహత్యాగానంతరం గణపతి పదాన్ని పొందటం తథ్యం.

ఆ ప్రదేశం నుంచి దుర్లభమయిన **శాకంభరీతీర్థానికి** పోవాలి. అక్కడ దేవి ప్రతిష్ఠితమై ఉంది. ఇది ముల్లోకాల్లో ప్రసిద్ధం. ఒక్కొక్క దేవతావర్ష ప్రమాణం ప్రకారం ఒక్కొక్క నెలకు శాకాహారాన్ని గ్రహించి, దేవి భక్తితో తపస్సు చేసింది. ఆమె భక్తి ప్రపత్తులను గుర్తించిన ఋషులు అక్కడికి రాగా, వారందరికీ శాకంతో అతిథిసత్కార మాచరించింది. అది మొదలు ఆ తీర్థం శాకంభరీతీర్థం అయింది. శాకంభరీతీర్థానికి చేరి, మనుజుడు బ్రహ్మచర్యం, ఏకాగ్రచిత్తం పాటించి, మూడురాత్రులు శాకభక్షణం చేస్తే, పన్నెండు సంవత్సరాలు శాకాహారవ్రతాన్ని ఆచరించిన ఫలం మూడు రోజులలోనే సొంతం అవుతుంది. దీనికి దేవి అనుగ్రహమే కారణం.

అనంతరం ముల్లోకాల్లో ప్రసిద్ధం అయిన **సువర్ణక్షేత్రానికి** చేరుకోవాలి. పూర్వకాలం భక్తితో విష్ణువు అక్కడ రుద్రుని ఆరాధించి దేవతలకు దుర్లభాలయిన వరాలను పొందాడు. ఆ సమయాన సంతుష్టుడై శివుడు విష్ణువుతో ఇలా అన్నాడు - 'శ్రీకృష్ణా! నీవు లోకంలో అందరికి నాకంటె ప్రియతముడవు అవుతావు. ప్రపంచంలో నీవే ప్రధానుడవు కాగలవు. సందేహం లేదు.' ఈ తీర్థంలో శంకరుని అర్చిస్తే అశ్వమేధఫలం, గణాధిపత్యం దక్కుతుంది. పిమ్మట **ధూమావతీతీర్థానికి** పోయి మూడురాత్రులు ఉపవాసదీక్ష చేస్తే మనస్సులో కోరిన కోరికలన్నీ తీరుతాయి. ఇది సత్యం. రాజా! దేవికి దక్షిణంగా **రథావర్తతీర్థం** ఉంది. తీర్థయాత్ర అక్కడకు కొనసాగించి, జితేంద్రియుడై ఉంటే శివుని అనుగ్రహంతో ఉత్తమగతులను పొందుతాడు. తరువాత మహాప్రాజ్ఞుడు ప్రదక్షిణం చేసి, ధారాతీర్థానికి చేరితే పాపాలన్నీ తొలగిపోతాయి. ఇక్కడ స్నానం చేసిన వానికి దుఃఖమే కలుగదు. ఆ ప్రదేశాన్నుంచి మహాగిరియైన హిమాలయానికి నమస్కరించి హరిద్వారయాత్ర సాగించిన యాత్రికుడు స్వర్గయాత్ర చేసినట్లే. అక్కడ స్నానం చేస్తే కోటితీర్థాలలో స్నానం ఆచరించినట్లే. ఈవిధంగా ఆచరించిన మానవుడు పుండరీకయాగఫలాన్ని పొంది వంశోద్ధరణం చేస్తాడు. ఆ తీర్థాన ఒకరాత్రి వసించి వేయి గోవుల దానఫలాన్ని పొందుతాడు. **నవ్యగంగ, త్రిగంగ, శక్రావర్త** తీర్థాల్లో మునిగి నియమంతో విధిగా పితరులను, దేవతలను అర్చిస్తే పుణ్యలోకాలను చేరతాడు. అనంతరం **ఖనకల తీర్థాన** మునిగి మూడురాత్రులు ఉపవాసం చేసిన నరుడు ముందు అశ్వమేధఫలాన్ని, క్రమంగా స్వర్గాన్ని అందుకొంటాడు. తీర్థయాత్రను సాగిస్తూ **కపిలావట తీర్థానికి** చేరాలి. అక్కడ ఒక్క రాత్రి నివాసంతో గోసహస్ర దానఫలానికి అర్హుడు అవుతాడు.

అక్కడే నాగరాజైన కపిలుని తీర్థం ఉంది. అది ముల్లోకాల్లో సుప్రసిద్ధం. **నాగతీర్థం**లో స్నానం చేసిన యాత్రికుడు వేయి కపిలగోవులను దానం చేసిన ఫలాన్ని అనుభవిస్తాడు. అక్కడ నుంచి శాంతనునామంతో ప్రసిద్ధం అయిన **లలితక తీర్థానికి** సాగాలి. ఆ తీర్థంలో స్నానం చేసినవాడు ఎన్నడూ దుర్గతిని పొందడు. గంగాయమునల **సంగమతీర్థం ప్రయాగ**లో మునిగితే పది అశ్వమేధయాగాల ఫలం వస్తుంది. వంశాన్ని తరింపచేసుకొంటాడు. ఆ ప్రదేశం నుంచి లోకప్రసిద్ధమైన సుగంధ తీర్థం చేరి, పాపాలన్నీ పోగొట్టుకొని బ్రహ్మలోకాన్ని చేరుకొంటాడు. తీర్థయాత్రికుడు **రుద్రావర్తాన్ని** చేరి మునుకలాడితే స్వర్గలోకాన్ని సాధిస్తాడు. గంగాసరస్వతీసంగమతీర్థంలో స్నానమాచరించి అశ్వమేధఫలాన్ని ముందుగా పొంది, పిదప స్వర్గాన్ని చేరతాడు. ఆ తీర్థం నుంచి **భద్రకర్ణేశ్వరుని** వద్దకు పోయి యథావిధిగా పూజ సల్పితే దుర్గతులను పొందక స్వర్గంలో పూజింపబడతాడు. తరువాత **కుంజామ్రకతీర్థం** చేరి, స్నానంచేసి, గోసహస్రం దానంచేసిన ఫలాన్ని, స్వర్గాన్నీ పొందుతాడు. అరుంధతీవటానికి పోయి **సాముద్రక తీర్థస్నానం** ఆచరిస్తే మూడురాత్రులు బ్రహ్మచర్యం, ఏకాగ్రచిత్తం అనుసరిస్తే అశ్వమేధ ఫలాన్ని, వేయిగోవుల దానఫలాన్ని, వంశోద్ధరణాన్ని సాధించుకొంటాడు. ఆ తీర్థం నుంచి **బ్రహ్మావర్తతీర్థానికి** యాత్ర కొనసాగించి బ్రహ్మచర్యం, ఏకాగ్రత పాటిస్తే అశ్వమేధఫలాన్ని పొంది చంద్రలోకాన్ని చేరుతాడు. **యమునాప్రభవ** ప్రదేశానికి చేరి, యమునాతీర్థాన స్నానం చేస్తే అశ్వమేధఫలాన్ని సాధించి స్వర్గంలో స్థిరంగా ఉంటాడు.

త్రిలోకప్రసిద్ధమయిన **దర్వీ సంక్రమణ తీర్థాన్ని** చేరితేనే అశ్వమేధ ఫలాన్ని, స్వర్గనివాసాన్ని సాధిస్తాడు. సిద్ధగంధర్వసేవితమైన సింధునది పుట్టిన ప్రదేశంలో ఐదురోజులు ఉపవాసం చేస్తే బంగారురాశిని ఫలంగా అందుకొంటాడు. తరువాత చొరశక్యంగాని **వేదీతీర్థసేవనం** చెయ్యాలి. దానివలన అశ్వమేధ యాగాచరణఫలాన్ని ముందుపొంది స్వర్గఫలాన్ని కూడ అనుభవిస్తాడు. **ఋషికుల్య తీర్థాన్ని, వాసిష్ఠతీర్థాన్ని** సేవిస్తే, స్నానం ఆచరిస్తే వాసిష్ఠాన్ని దాటిన వారంతా ద్విజులు (బ్రాహ్మణులు) అవుతారు. ఋషికుల్యలో స్నానం చేస్తే పాపదూరుడై పితరులను, దేవతలను అర్చించి ఋషిలోకాన్ని చేరి సుఖిస్తాడు. **భృగుతుంగతీర్థాన** శాకాహారియై ఒకనెలపాటు నివాసం ఉంటే అశ్వమేధఫలం పొందుతాడు. **వీరమోక్షక్షేత్రానికి** పోయినంతనే పాపాలు తొలగిపోతాయి. **కృత్తికా, మఘా తీర్థాలను** చేరిన మానవుడు అగ్నిష్టోమాతిరాత్రయాగాల ఫలాన్ని పొందుతాడు. ప్రాతఃసంధ్యలో **విద్యాతీర్థాన** స్నానం ఆచరిస్తే ఏవిద్యనైనా ఎక్కడైనా పొందగలడు. పాపాలను తొలగించగల **మహాశ్రమ తీర్థంలో** ఒక్కసారి ఉపవాసం చేసి ఒకరాత్రి నివసిస్తే శుభలోకాలను చేరుకోగలడు. ప్రతిరోజూ ఆరవసమయం ప్రదోషం వరకు ఉపవాసంతో నెలరోజులు **మహాలయ తీర్థంలో**

నివసిస్తే అన్ని పాపాలు తొలగి బహుసువర్ణ రాశిని పొందుతాడు. పదితరాలు ముందు, పదితరాలు వెనుక ఉద్ధరిస్తాడు.

పిమ్మట బ్రహ్మచే సేవింపబడిన **వేతసిక తీర్థానికి** పోయినవాడు అశ్వమేధ ఫలాన్ని, శుక్రలోకాన్ని వశపరచుకొంటాడు. సిద్ధసేవితమైన **సుందరికాతీర్థానికి** చేరిన మనుజుడు రూపవంతుడు అవుతాడు అని ప్రాచీన ఋషులు చెప్పారు. బ్రహ్మచారి, జితేంద్రియుడు అయి **బ్రాహ్మణీతీర్థానికి** పోయిన యాత్రికుడు కమలకాంతి గల విమానంలో బ్రహ్మలోకానికి చేరి సుఖిస్తాడు. తరువాత సిద్ధ గంధర్వసేవితమైన **నైమిశానికి** పోవాలి. అక్కడ దేవతలు, బ్రహ్మ కలిసి నిత్యమూ నివాసం ఉంటారు. నైమిశక్షేత్రాన్ని వెదకుతూ నరుడు సగం పాపం పోగొట్టుకొని, అందులో ప్రవేశించి సర్వపాపరాశి నుంచి విముక్తుడు అవుతాడు. ధీరుడైన యాత్రికుడు తీర్థసేవనాసక్తి కలిగి ఒకనెల నైమిశ క్షేత్రాన నివసించాలి. భూమిపై ఎన్నితీర్థాలు ఉన్నాయో అవన్నీ నైమిశాన ఉన్నాయి. నైమిశ తీర్థాన మితాహారి, జితేంద్రియుడు అయి స్నానాన్ని ఆచరిస్తే అశ్వమేధ యాగాచరణ ఫలాన్ని అందుకొంటాడు. తన కులపురుషులను ఏడు తరాలపాటు ఉద్ధరించి, ఉపవాసదీక్షతో నైమిశంలో ప్రాణాలు విడిస్తే, అన్నిలోకాల్లో ఆనందాన్ని అనుభవిస్తాడని విద్వాంసులు చెప్పారు. నైమిశతీర్థం నిత్యం, పవిత్రం, పుణ్యజనకం కూడ. **గంగోద్భేదం**లో తీర్థమాడి మూడురాత్రులు ఉపవాసదీక్ష చేస్తే వాజపేయ యాగఫలాన్ని అనుభవించి బ్రహ్మభూతుడు అవుతాడు. **పరప్వతీ తీర్థాన్ని** ఆశ్రయించి, స్నాన పరిశుద్ధుడై పితరులను, దేవతలను అర్చిస్తే యాత్రికుడు సారస్వత లోకాలకు పోతాడు ఇది యథార్థం.

పిమ్మట **బాహుదా తీర్థాన్ని** చేరి, జితేంద్రియుడై, ఒకరాత్రి ఉంటే స్వర్గలోకాన్ని చేరతాడు. దేవతల సత్ర యాగఫలాన్ని సొంతం చేసుకొంటాడు. పుణ్యాత్ములు ఆశ్రయించిన **క్షీరవతీ తీర్థాన** స్నానమాచరించి దేవతలను, పితరులను పూజించినవాడు వాజపేయఫలితాన్ని పొందుతాడు. **విమలాశోక తీర్థసేవనం** చేసి బ్రహ్మచర్యంతో, ఏకాగ్రచిత్తంతో ఒకరాత్రి గడిపితే స్వర్గలోకంలో స్థిరంగా ఉంటాడు.

ఆ ప్రదేశం సరయూనదీ తీర్థాల్లో ఉత్తమం అయిన **గోప్రతారం** చేరుకోవాలి. అక్కడే శ్రీరామచంద్రుడు తనబలగంతో, సేవకులతో, వాహనాలతో స్వర్గంచేరి తన నిత్యనివాసంలో తీర్థప్రభావంతో ప్రకాశిస్తున్నాడు. సరయూ తీర్థశ్రేష్ఠమైన గోప్రతారం చేరి, స్నానమాచరిస్తే శ్రీరాముని అనుగ్రహం వలన తన ప్రయత్నం వలన సర్వపాపవిముక్తుడై స్వర్గంలో పూజింపబడతాడు. గోమతీ తీరంలోని **శ్రీరామతీర్థం**లో స్నానం చేసిన యాత్రికుడు అశ్వమేధఫలం, వంశోద్ధరణం పొందుతాడు. అక్కడే **శతసాహస్రక తీర్థం** ఉంది.

అందులోస్నానం చేసి మితాహారి, జితేంద్రియుడు అయి ఉంటే సహస్ర గోదానపుణ్యం పొందుతాడు. తరువాత ప్రసిద్ధమైన **భర్తృస్థానతీర్థాన్ని** సేవించాలి. అక్కడకి చేరడంతో అశ్వమేధయాగఫలం వస్తుంది. **కోటితీర్థం**లో జలంలో మునిగి, కార్తికేయుని పూజిస్తే సహస్రగోదాన ఫలం పొంది, తేజోవంతుడు అయితీరుతాడు.

పిమ్మట **కాశితీర్థాన** శంకరుని అర్చించి **కపిలాహ్రదతీర్థం**లో నీటమునిగి రాజసూయ యజ్ఞాచరణఫలాన్ని పొందుతాడు. తీర్థయాత్రికుడు **అవిముక్త తీర్థాన** దేవదేవుడైన శివుని దర్శనంతోనే బ్రహ్మహత్యా పాతకాన్నైనా పోగొట్టుకోగలడు. అక్కడ ప్రాణాలను విడిచిన నరుడు ముక్తిని పొందుతాడు. **గోమతీ గంగా సంగమం**లో ప్రసిద్ధి పొందిన **మార్కండేయతీర్థం** ఉంది. ఆ తీర్థసేవనం చేస్తే, అగ్నిష్టోమ యాగఫలాన్ని కైవసం చేసుకొని వంశోద్ధరణం చేస్తాడు. అక్కడి నుంచి గయకు పోయి, జితేంద్రియుడై ఉంటే, అశ్వమేధయాగఫలాన్ని, వంశోద్ధరణను పొందుతాడు. అక్కడ ప్రసిద్ధమైన **అక్షయవట తీర్థం** ఉంది. అక్కడ పితరులకిచ్చే ద్రవ్యాలు అక్షయాలు అవుతాయి. మహానదిలో మునిగి, పితరులకు తర్పణాలిస్తే, అక్షయలోకాన్ని పొందడమే కాక వంశాన్ని ఉద్ధరిస్తాడు. తరువాత ధర్మారణ్యంచే ప్రకాశించే **బ్రహ్మసరోవరానికి** యాత్ర సాగించి, ఒకరాత్రి అంతా నివసిస్తే బ్రహ్మలోకాన్ని తప్పక చేరతాడు. బ్రహ్మ ఆ సరస్సులో ఒక గొప్ప స్తంభాన్ని పాతించాడు. ఆ స్తంభానికి ప్రదక్షిణ గావించిన నరుడు వాజపేయ యాగఫలాన్ని పొందుతాడు.

అక్కడినుంచి ప్రసిద్ధమైన **ధేనుక తీర్థం** చేరాలి. ఒకరాత్రి ఆ ప్రదేశంలో ఉపవాసం చేసి తిలగోవుని దానంచేస్తే పాపాలన్నీ తొలగి నిశ్చయంగా సోమలోకం ప్రవేశిస్తాడు. అక్కడ దూడతోకూడి పర్వతంమీద చరించే కపిలగోవు పాదచిహ్నాలు ఇప్పటికీ కనిపిస్తూనే ఉన్నాయి. ఆ పాదచిహ్నాలను తాకితే అశుభకర్మఫలాలన్నీ నశిస్తాయి. పిమ్మట మహాదేవుని **గృధ్రవట తీర్థాన్ని** ఆశ్రయించి, శంకరుని సమీపానికి పోయి, అక్కడ విభూతితో స్నానం చేయాలి. బ్రాహ్మణుడు అక్కడకు చేరితే పన్నెండు సంవత్సరాలు వ్రతపాలన చేసినట్లు అవుతుంది. ఇతరవర్ణాల పాపమంతా పోతుంది. అనంతరం సంగీతధ్వని మ్రోగే ఉదయపర్వతానికి పోతే, సావిత్రి చరణాల గుర్తులు గల ప్రదేశాలు కనిపిస్తాయి. ఉత్తమవ్రతపాలన చేసే బ్రాహ్మణుడు అక్కడ సంధ్యోపాసన చేయడంద్వారా పన్నెండు సంవత్సరాల సంధ్యోపాసనాఫలాన్ని గ్రహిస్తాడు. ఆ ప్రదేశంలో **యోనిద్వారతీర్థం** ఉంది. అక్కడకు చేరితే యోని ద్వార సంకటాన్ని తిరిగి పురుషుడు పొందడు. రాజా! **గయాతీర్థం**లో కృష్ణశుక్లపక్షాలు రెంటియందు ఉంటే ఏడుతరాలు పవిత్రం చేసుకొంటాడు అనేమాట

సత్యం. చాలామంది పుత్రులను కనాలి. వారిలో ఒక్కడైనా గయాతీర్థానికి వెడతాడు. అశ్వమేధం చేస్తాడు, లేదా వృషోత్సర్జన మాచరిస్తాడు. రాజా! మానవుడు ఫల్గుతీర్థానికి పోతే అశ్వమేధయాగ ఫలం పొంది, గొప్ప సిద్ధిని పొందుతాడు.

ఏకాగ్రచిత్తుడై మనుజుడు ధర్మప్రస్థ యాత్రను చెయ్యాలి. అక్కడ యమధర్మరాజు నిత్యం నివాసం ఉంటాడు. ఆ తీర్థంలో కూపజలంతో స్నానం చేసి పితరులను, దేవతలను పూజిస్తే, తర్పణం చేస్తే పాపాలు పోయి, స్వర్గలోకం చేరతాడు. అక్కడ ఆత్మజ్ఞానియైన **మతంగమహర్షి ఆశ్రమం** ఉంది. శ్రమను, శోకాన్ని నాశనం చేసే ఆ ఆశ్రమంలో ప్రవేశమాత్రంతో గవాయన యజ్ఞఫలం వస్తుంది. అక్కడ ధర్మరాజదర్శనం చేసిన నరుడు అశ్వమేధఫలాన్ని పొందుతాడు. అనంతరం సాటిలేని బ్రహ్మస్థానాన్ని చేరాలి. అక్కడ నెలకొన్న బ్రహ్మను చేరడంతో రాజసూయాశ్వమేధయాగఫలాలు పొందుతాడు. రాజా! తీర్థయాత్రికుడు అక్కడ నుండి **రాజగృహానికి** పోవాలి. అక్కడ స్నానం చేసి కక్షీవంతునితో సమానం అవుతాడు. ఆ తీర్థాన పవిత్రుడై యక్షిణీదేవి నైవేద్యం తినాలి. ఆ యక్షిణి అనుగ్రహ కారణంగా బ్రహ్మహత్యాపాతకానికి దూరం కాగలడు. **మణినాగ తీర్థానికి** పోయి గోసహస్ర దానఫలం అందుకొంటాడు. **మణినాగ తీర్థప్రసాదం** (నైవేద్యం, చరణామృతం) సేవిస్తే పాము కరిచినా విషం ఎక్కని స్థితి కలుగుతుంది. అక్కడ ఒక్కరాత్రి నివసిస్తే వేయిగోవుల దానఫలం వస్తుంది. ఆ ప్రదేశం నుంచి బ్రహ్మర్షియైన గౌతమునికి ప్రియమైన వనానికి వెళ్ళాలి. **అహల్యాహ్రదం**లో స్నానంచేస్తే పరమగతులు లభిస్తాయి. గౌతమాశ్రమానికి పోయిన మనుజుడు ఆత్మసంపదను పొందుతాడు. ముల్లోకాల్లో ప్రసిద్ధం అయిన ఉదపానం అనే ఒకనూయి ఉంది. దానిలో స్నానం చేస్తే అశ్వమేధయాగఫలాన్ని దక్కించుకొంటాడు. అక్కడే రాజర్షి అయిన జనకుని నూయి కూడ ఉంది. దాన్ని దేవతలు సేవిస్తారు. అక్కడ స్నానం చేస్తే యాత్రికుడు విష్ణులోకానికి పోతాడు.

ఆటుపైన అన్నిపాపాలు పోగొట్టే వినశనతీర్థాన్ని సేవించితే వాజపేయయాగాచరణఫలాన్నీ, సోమలోకాన్నీ పొందుతాడు. **గండకీనది** అన్ని తీర్థాల సంయోగంగా ఏర్పడింది. అక్కడ స్నానం చేసిన తీర్థసేవకుడు వాజపేయఫలాన్ని, సూర్యలోకాన్ని పొందుతాడు. త్రిలోకప్రసిద్ధిని పొందిన విశల్యానదీ తటాన్ని చేరి స్నానం చేస్తే, అగ్నిష్టోమఫలాన్ని, స్వర్గాన్ని పొంది సుఖిస్తాడు. ఆ ప్రదేశం నుంచి వంగదేశంలోని తపోవనంలో ప్రవేశిస్తే, మరణానంతరం గుహ్యకుల లోకాన్ని చేరి శాశ్వతానందాన్ని అనుభవిస్తాడు. సిద్ధనిషేవితమైన **కంపనావదీతీరం** ఆశ్రయిస్తే పుండరీకయాగఫలం, స్వర్గఫలం పొందుతాడు. రాజా! తరువాత **మహేశ్వరధారకు** యాత్ర కొనసాగించి అశ్వమేధ యాగఫలాన్ని, కులోద్ధరణాన్ని

సాధిస్తాడు. **దేవపుష్కరిణీ తీర్థానికి** పోయిన మనుజుడు ఎన్నడూ దుర్గతులను పొందక అశ్వమేధయాగఫలాన్ని పొందుతాడు. బ్రహ్మచర్యం, జితేంద్రియత్వం పాటిస్తూ **సోమపదతీర్థానికి** పోయి అక్కడ ఉన్న **మహేశ్వరపదతీర్థం**లో స్నానమాచరిస్తే అశ్వమేధఫలాన్ని అందుకొంటాడు. ఆ ప్రదేశంలో ప్రఖ్యాతం అయిన తీర్థాల కోటి ఉంది. కూర్మరూపుడైన ఒక రాక్షసుడు దానిని అపహరించేయత్నం చేశాడు. శ్రీమహావిష్ణువు ఆ ప్రయత్నాన్ని నిరోధించి ఆ తీర్థాల్ని తిరిగి పైకి తీశాడు. తీర్థకోటిలో మునిగిన యాత్రికుడు పుండరీకయాగ ఫలాన్ని, పిమ్మట విష్ణులోకాన్ని చేరుకొంటాడు.

పిమ్మట నారాయణ స్థానాన్ని చేరాలి. అది విష్ణువు నివాసస్థానం. బ్రహ్మాదిదేవతలు, తపోధనులైన ఋషులు, ఆదిత్యులు, వసువులు, రుద్రులు అక్కడ జనార్దనుని ఉపాసిస్తారు. ఆ క్షేత్రంలో విష్ణువు సాలగ్రామనామంతో ప్రసిద్ధుడు. మూడులోకాలకు ప్రభువు, వరదాయకుడు, వినాశరహితుడు అయిన విష్ణువు సమీపానికి చేరి అశ్వమేధయాగఫలాన్ని, విష్ణులోకాన్ని పొందుతాడు. సర్వపాపాల్ని పోగొట్టగల **ఉదపానం** అనే నయ్యి అక్కడ ఉంది. నాలుగు సముద్రాలు ఆ కూపంలో సన్నిహితాలై ఉన్నాయి. ఆ **ఉదపానం**లో స్నానమాచరించినవాడు దుర్గతిని పొందడు. వరప్రదాయకుడు, అవినాశి అయిన మహాదేవుని అర్చించి, తీర్థయాత్రికుడు మేఘావరణం తొలగిన చంద్రునివలె ప్రకాశిస్తాడు. ఆ ప్రదేశంలో **జాతిస్మరతీర్థం** ఉంది. అందులో స్నానం చేసిన మానవునికి శరీరశుద్ధి, మనశ్శుద్ధి ప్రాప్తిస్తుంది. ఆ తీర్థసేవనంచేత మనుజునికి పూర్వజన్మస్మృతి కలుగుతుంది. ఇది నిస్సందేహం. **మాహేశ్వరపురం** చేరి వృషధ్వజుని పూజిస్తే, ఉపవాసం చేస్తే మనోరథాలన్నీ తీరుతాయి. అటుపైన పాపాలను తొలగించగల **వామనతీర్థానికి** చేరి శ్రీహరిని దర్శిస్తే మనుజునికి దుర్గతులు కలుగవు. క్రమంగా పాపాల నన్నింటిని ఛేదించే కుశికుని ఆశ్రమం చేరాలి. పెద్దపెద్ద పాపాలను నశింపచేసే **కౌశికీనదీ తీర్థాన్ని** ఆపై సేవించి, స్నానం ఆచరిస్తే రాజసూయయాగాన్ని చేసిన ఫలాన్ని సాధిస్తాడు. అనంతరం ఉత్తమమైన చంపకారణ్యానికి యాత్ర సాగించాలి. ఆ ప్రదేశాన ఒకరాత్రి ఉపవాసం చేస్తే గోసహస్రదానఫలం అందుకొంటాడు. పరమదుర్లభం **జ్యేష్ఠిలతీర్థం**. దాన్ని ఆశ్రయించి, ఒకరాత్రి ఉపవాసం ఉండి, వేయిగోవుల దానఫలం దక్కించుకొంటాడు. ఆ తీర్థంలో పార్వతీదేవితో కూడిన విశ్వేశ్వరుని దర్శించి మిత్రావరుణ లోకాలను చేరతాడు. మూడురాత్రులు నిరాహారంతో ఉండి అగ్నిహోత్రఫలం పొందుతాడు.

నరోత్తమా! పిమ్మట ఉపవాసదీక్షతో, జితేంద్రియుడై **కన్యాసంవేద్య తీర్థయాత్ర**చేసి ప్రజాపతి మనువుల లోకాన్ని చేరతాడు. కన్యాతీర్థంలో చేసిన చిన్నదానం అయినా శ్రేష్ఠం, అక్షయం అని తపశ్శాలుల ఆశయం. **విశ్చీరానదీ** తీర్థాన్ని చేరి, స్నానం చేస్తే, అశ్వమేధఫలాన్ని

పొంది, పిమ్మట విష్ణులోకాన్ని చేరుకొంటాడు. నరులు నిశ్చీరాసంగమంలో దానం చేస్తే రోగశోకాలు లేని ఇంద్రలోకాన్ని చేరుతారు. అక్కడ త్రిలోకప్రసిద్ధమైన వసిష్ఠాశ్రమం ఉంది. **వసిష్ఠతీర్థం**లో స్నానం చేస్తే వాజపేయ యాగఫలాన్ని పొందుతాడు. బ్రహ్మర్షి గణసేవితమైన దేవకూటం చేరి అశ్వమేధయాగఫలాన్ని పొంది, వంశోద్ధరణం చేసుకొంటాడు. తరువాత **కౌశికుని కుండం**లో స్నానం చేసి కుశికనందనుని వలె ఉత్తమగతులను సాధిస్తాడు. ఆ కౌశికీ తీర్థంలో నెలరోజులు నివసించాలి. అశ్వమేధయాగఫలాన్ని నెలరోజుల్లోనే పొందుతాడు. **కౌశికీతీర్థం**లో స్నానం చేస్తే దుర్గతులు పొందడు. చాల బంగారాన్ని గ్రహిస్తాడు. యాత్రికుడు వీరాశ్రమనివాసి యైన కుమారస్వామిని పూజించి, అశ్వమేధఫలాన్ని పొందటంలో సందేహం లేదు. అటుపైన ప్రసిద్ధమైన అగ్నిధారను ఆశ్రయించి, స్నానం చేస్తే యాత్రికునికి అగ్నిష్టోమ యాగాచరణఫలం వస్తుంది. వరప్రదానశీలి, దేవదేవుడు, అవ్యయుడు అయిన విష్ణువు సమీపానికి చేరి పూజించాలి. హిమాలయసమీపాన ఉన్న **పితామహ సరోవరా**న్ని చేరి స్నానం చేస్తే అగ్నిష్టోమయాగాచరణ ఫలం దక్కుతుంది. పితామహసరోవరం నుంచి స్రవిస్తూ లోకాలను పవిత్రం చేయగల **కుమారధార** అనే తీర్థం మూడులోకాల్లో ప్రసిద్ధం. అక్కడ స్నానం చేసిన మానవుడు తనను తాను కృతార్థునిగా తలుస్తాడు. అక్కడే ఉండి, రోజులో ఆరవవేళ వరకూ ఉపవాసం చేస్తే, బ్రహ్మహత్యాపాతకం చేసినా పోతుంది. తీర్థసేవనాసక్తి కలవాడై మహాదేవి గౌరీశిఖరాన్ని చేరుకోవాలి. అది చాలా ప్రసిద్ధం. ఆ శిఖరంపైకి ఎక్కి, స్తనకుండాల్లో స్నానం చేయాలి. స్తనకుండాన స్నానం చేస్తే వాజపేయయాగఫలాన్ని గ్రహిస్తాడు. ఆ తీర్థంలో స్నానం చేసి, పితరులను, దేవతలను పూజిస్తే మానవుడు అశ్వమేధయాగఫలాన్ని పొంది ఇంద్రలోక పూజితుడు అవుతాడు.

బ్రహ్మచర్యం, ఏకాగ్రచిత్తం కలిగి తామ్రారుణ తీర్థయాత్ర చేస్తే అశ్వమేధఫలాన్ని పొంది, క్రమంగా బ్రహ్మలోకాన్ని చేరతాడు. రాజా! **నందినీతీర్థం**లో దేవసేవితమైన నుయ్యి ఉంది. అక్కడకు పోయి స్నానం చేస్తే నరమేధఫలాన్ని సాధిస్తాడు. రాజా! కౌశికీ, అరుణానదుల సంగమంలో **కాలికాసంగమం**లో స్నానం చేసి, మూడురాత్రులు ఉపవాసం చేస్తే, అన్నిపాపాల నుంచి విముక్తుడు అవుతాడు. తరువాత **ఉర్వశీతీర్థం, సోమాశ్రమం, కుంభకర్ణాశ్రమం** యాత్ర సాగించి, మానవుడు భూతలంపై గౌరవాన్ని పొందుతాడు. **కోకాముఖతీర్థాన** స్నాతుడై బ్రహ్మచర్యం, ఇంద్రియనిగ్రహం వహించితే పూర్వజన్మస్మృతి పొందుతానని పురాతనుల అనుభవం. **ప్రాజ్ఞదీతీర్థా**న్ని చేరడంతో ద్విజుడు కృతార్థతను పొందుతాడు. వాడు అన్నిపాపాల నుంచి శుద్ధుడై, ఇంద్రలోకాన్ని చేరతాడు. తీర్థయాత్రికుడు

పవిత్రం అయిన **ఋషభద్వీపం, క్రౌంచనిషూదన తీర్థాలకు** పోయి సరస్వతీ తీర్థాన స్నానం చేస్తే విమానంపై ప్రకాశిస్తూ ఉంటాడు. మునిసేవితమైన **ఔద్దాలకతీర్థం** సేవించి, స్నానం చేస్తే పాపాలన్నీ పోతాయి. బ్రహ్మర్షిసేవితం, పుణ్యప్రదం అయిన **ధర్మతీర్థానికి** పోయి వాజపేయ యాగాచరణ ఫలాన్ని పొంది, విమానంపై ఉండి పూజను పొందుతాడు.

85. గంగాసాగర, చిత్రకూట, ప్రయాగ, గంగాది తీర్థప్రభావ వర్ణనము.

పులస్త్యుడు చెపుతున్నాడు. ప్రాతఃసంధ్యాకాలంలో **సంవేద్యతీర్థం**లో స్నానమాచరిస్తే విద్యాలాభం నిస్సందేహంగా కల్గుతుంది. పూర్వకాలంలో రాముని ప్రభావంతో ఏర్పడింది **లౌహిత్యతీర్థం**. అందులో స్నానం చేస్తే చాలా సువర్ణాన్ని పొందుతాడు. **కరతోయ తీర్థం**లో మునిగిన మానవుడు మూడు రాత్రులు ఉపవాసంచేస్తే అశ్వమేధ యాగఫలాన్ని గ్రహిస్తాడు. ఇది బ్రహ్మ చేసిన నియమం. అక్కడే ఉన్న **గంగాసాగర సంగమం**లో స్నానం చేసినవాడు పది అశ్వమేధయాగాల ఫలాన్ని పొందుతాడు అని విద్వాంసుల అభిప్రాయం. రాజా! మానవుడు గంగాసాగరసంగమాన గంగ ఆవలి ఒడ్డును చేరి స్నానం చెయ్యాలి. ఆ ప్రదేశాన మూడు రాత్రులు ఉపవాసం చేస్తే అన్నిపాపాలు తొలగిపోతాయి. అక్కడినుంచి పాపాలన్నింటినీ పోగొట్టగల **వైతరిణీ తీర్థయాత్ర** కొనసాగించాలి. **విరజతీర్థానికి** పోయి స్నానం చేసి చంద్రునివలె ప్రకాశిస్తాడు. అతని కులం పవిత్రం అయి, సంసార సాగరాన్ని దాటుతాడు. అతని పాపాలన్నీ నశిస్తాయి. వేయిగోవుల దానఫలాన్ని గ్రహించి, కులాన్ని పవిత్రం చేస్తాడు. **శోణ జ్యోతిరథ్యల సంగమాన** స్నానం ఆచరించి జితేంద్రియుడై, పవిత్రుడై పితరులను, దేవతలను పూజిస్తే అగ్నిష్టోమయాగఫలాన్ని పొందుతాడు. శోణ, నర్మదల ఉత్పత్తి స్థానం వంశగుల్మంలో మునిగిన యాత్రికుడు అశ్వమేధ ఫలాన్ని అందుకొంటాడు.

రాజా! అయోధ్యలోని **కోసలతీర్థానికి** వెళ్ళి స్నానం చేసి, మూడురాత్రులు ఉపవాసం చేస్తే వాజపేయయాగఫలాన్ని, సహస్రగోదానఫలాన్ని, వంశోద్ధరణాన్ని క్రమంగా పొందుతాడు. రాజా! కోసలనగరంలోని **కాలతీర్థాన్ని** సేవిస్తే పదకొండు వృషభాలను దానం చేసిన ఫలాన్ని పొందగలడు. **పుణ్యవతీతీర్థం**లో స్నానం చేసి, మూడురాత్రులు నిరాహారియై ఉంటే, వేయిగోవుల దానఫలాన్ని,వంశోద్ధరణాన్ని దక్కించుకొంటాడు. పిమ్మట **బదరీతీర్థం**లో స్నానమాచరించి, దీర్ఘాయుర్దాయాన్ని పొంది స్వర్గాన్ని చేరుతాడు. చంపాప్రదేశంలో భాగీరథిలో తర్పణాలు చేసి, **దండతీర్థాన్ని** సేవిస్తే వేయిగోవులను దానం చేసినఫలం వస్తుంది. ఆపై పుణ్యమయమై పుణ్యంతో ప్రకాశించే **లపేటికా తీర్థానికి** యాత్ర సాగించాలి. ఇలా

చేస్తే తీర్థయాత్రికుడు ముందుగా వాజపేయయాగఫలాన్ని, తరువాత దేవతల పూజలను గైకొంటాడు. అనంతరం పరశురాముడు నివసించిన మహేంద్రపర్వతానికి పోయి, **రామతీర్థం**లో స్నానం ఆచరిస్తే అశ్వమేధయాగఫలం వస్తుంది. అక్కడే మతంగమహర్షి **కేదార తీర్థం** ఉంది. అందు మునిగితే గోసహస్రదాన ఫలం పొందుతాడు.

శ్రీపర్వతాన్ని చేరి, నదీతీరంలో స్నానం చేసి, శంకరుణ్ణి అర్చిస్తే, అశ్వమేధయాగం చేసిన ఫలాన్ని పొందుతాడు. శ్రీపర్వతంపై పార్వతితో కలిసి మహాదేవుడు ప్రసన్నుడై నివసిస్తాడు. దేవతలతో కలిసి బ్రహ్మ అక్కడే ఉంటాడు. అక్కడి **దేవకుండతీర్థం**లో స్నానం చేసి పవిత్రుడు, జితేంద్రియుడు అయి అశ్వమేధ యాగఫలాన్ని, ఆపైన సిద్ధులను గ్రహిస్తాడు. పాండ్యదేశంలో దేవతలచే అర్చింపబడే **ఋషభపర్వతానికి** యాత్ర సాగించి, వాజపేయయాగఫలాన్ని పొంది, స్వర్గంలో చిరకాలం ఆనందిస్తూ ఉంటాడు. రాజా! తరువాత అప్సరసలతో నిండిన **కావేరినదికి యాత్ర** చెయ్యాలి. అక్కడ మునిగిన మానవుడు వేయిగోవులు దానంచేసిన ఫలాన్ని పొందినవాడు అవుతాడు. అక్కడ ఉన్న సముద్రతీరమందలి కన్యాతీర్థానికి పోయిస్నానం ఆచరిస్తే అన్ని పాపాలను పోగొట్టుకొంటాడు. త్రిభువన ప్రఖ్యాతమూ, ప్రశస్యమానమూ అయి సముద్ర మధ్యంలో ప్రకాశించే **గోకర్ణ తీర్థం**లో స్నానం చెయ్యాలి. అక్కడ బ్రహ్మాది దేవతలు, తాపసులు, ఋషులు, భూతాలు, యక్షులు, పిశాచాలు, మహానాగులు, సిద్ధులు, చారణులు, గంధర్వులు, సర్పాలు, మనుజులు, సముద్రం, నదులు శంకరుణ్ణి సేవిస్తాయి. అక్కడ శివుని పూజించి మూడురాత్రులు ఉపవాసం చేసిన మానవుడు అశ్వమేధయాగఫలాన్ని, గణపతి పదాన్ని పొందుతాడు. అక్కడే పన్నెండు రాత్రులు నివసిస్తే మనుజుని అంతఃకరణం పవిత్రం అవుతుంది. అక్కడే ఉన్న గాయత్రీదేవి స్థానాన్ని స్థిరంగా పొందుతాడు. మూడురాత్రులు అక్కడ ఉపవాసం చేస్తే గోసహస్రదాన ఫలాన్ని గ్రహిస్తాడు. బ్రాహ్మణులను గుర్తించటానికి అదే ప్రమాణం. వర్ణసంకరకారణంగా పుట్టినవాడు గాయత్రిని పఠిస్తే అతని ముఖంనుంచి గాయత్రి స్వర, వర్ణరహితం అయి వెలువడుతుంది. అనగా వాడు గాయత్రిని స్పష్టంగా ఉచ్చరించలేడు. అబ్రాహ్మణుడు అక్కడ గాయత్రిని చదివితే అది నశించిపోతుంది. అనగా దానిని మరచిపోతాడు.

అక్కడే బ్రహ్మర్షియైన **పంవర్తుని బావి** ఉంది. అందులో స్నానం చేసినవాడు రూపసి, సంపన్నుడూ అవుతాడు. **వేణావదీ తీరా**న్ని చేరి మూడురాత్రులు నిరాహారంగా ఉంటే (చనిపోయిన పిదప) నెమళ్ళు, హంసలతో కూడిన విమానాన్ని పొందుతాడు. పిమ్మట సిద్ధులు సేవించే **గోదావరి**ని చేరి, స్నానం చేసి, గోమేధయాగఫలాన్ని, వాసుకిలోకాన్ని చేరుతాడు. **వేణాసంగమం**లో మునిగి అశ్వమేధయాగఫలాన్ని గ్రహిస్తాడు.

వరదాసంగమతీర్థంలో స్నానం చేస్తే వేయిగోవుల దానఫలం లభిస్తుంది. అటుపైన బ్రహ్మస్థానానికి పోయి మూడు రాత్రులు ఉపవాసం చేస్తే, వేయిగోవుల దానఫలాన్ని ముందుగా పొంది, తరువాత స్వర్గలోకాన్ని చేరుకొంటాడు. కుశప్లవన తీర్థాన్ని సేవిస్తే, బ్రహ్మచర్యం, ఏకాగ్రచిత్తంతో మూడురాత్రులు నిరాహారియై ఉంటే అశ్వమేధయాగఫలం వస్తుంది. **కృష్ణవేణాజలం** వల్ల ఏర్పడిన అందమైన దేవకుండంలోని **జాతిస్మరహ్రదం**లో మునిగితే పూర్వజన్మస్మృతి పొందుతాడు. అక్కడ వందయాగాలు ఆచరించిన ఇంద్రుడు స్వర్గసింహాసనంపై ఆసీనుడు అయి ఉన్నాడు. ఆ ప్రదేశానికి చేరడంతోనే అగ్నిష్టోమయాగఫలం లభిస్తుంది. అటుపైన సర్వదేవహ్రదంలో మునిగితే వేయిగోవుల దానఫలం వస్తుంది. అనంతరం మహాపుణ్యప్రదాలయిన దిగుడు బావులలో, నదులలో ఉత్తమం అయిన **పయోష్ణి**ని చేరి స్నానం చేస్తే, దేవపితరులను అర్చిస్తే యాత్రికునికి వేయిగోవుల దానఫలం చిక్కుతుంది. దండకారణ్యతీర్థానికి చేరి స్నానం చేయడంతోనే వేయిగోవుల దానఫలం సిద్ధిస్తుంది. **శరభంగ, శుకుల ఆశ్రమాలకు** పోవడంతోనే దుర్గతులు నశించి, వంశం పవిత్ర మవుతుంది.

పిమ్మట పరశురామసేవితం అయిన **శూర్పారకతీర్థా**నికి యాత్ర సాగించాలి. అక్కడ రామతీర్థంలో మునిగితే సువర్ణరాశిని పొందుతాడు. **సప్తగోదావరీ తీర్థం**లో స్నానం చేసి నియమబద్ధుడై, మితాహారియై ఉంటే గొప్పపుణ్యాన్ని పొంది, తరువాత దేవలోకం చేరుతాడు. పిమ్మట నియమపాలనం చేస్తూ, మితాహారం పాటిస్తే దేవపథానికి పోయి దేవసత్రఫలాన్ని సిద్ధింపచేసుకొంటాడు. **తుంగకారణ్యతీర్థా**న్ని చేరి బ్రహ్మచర్యాన్ని పాటిస్తూ ఇంద్రియాలను అధీనంలో ఉంచుకోవాలి. పూర్వం ఆ ప్రదేశంలో సారస్వతుడనే ఋషి తన శిష్యులకు వేదం నేర్పాడు. ఒకానొకసమయంలో ఋషులందరు వేదాలను మరచిపోయారు. ఈ ప్రకారంగా వేదాలు నశిస్తే అంగిరసుని పుత్రుడు మునుల ఉత్తరీయాల్లో దాగి, సుఖంగా కూర్చుండి, ఓంకారం చేయ నారంభించాడు. నియమపాలనం చేస్తూ ఓంకారాన్ని సక్రమంగా ఉచ్చరించడం వల్ల ఎవరు పూర్వం ఏ వేదం నేర్చారో అది అంతా తిరిగి వారికి వచ్చింది. ఆ సమయాన అక్కడ చాలమంది ఋషులు, దేవతలు, వరుణుడు, అగ్ని, ప్రజాపతి, నారాయణుడు, మహాదేవుడు మొదలైనవారు సన్నిహితులై ఉన్నారు. మహాతేజస్వి అయిన బ్రహ్మదేవుడు దేవతలతో కలిసి వెళ్ళి కాంతిమంతుడైన భృగువును యజ్ఞం చేయించటానికి నియమించాడు. పిమ్మట భృగుమహర్షి ఆ ఋషులందరితో యథావిధిగా, అగ్నిస్థాపనం చేయించాడు. ఆజ్యభాగంతో అగ్నిని తృప్తిపరచాడు. దేవతలు, ఋషులు క్రమంగా వారివారి స్థానాలకు వెళ్లారు. తుంగకారణ్యాన్ని ప్రవేశించిన స్త్రీపురుషుల

పాపాలన్నీ నశిస్తాయి. నియమశీలి అయి ధీరుడు, మితాహారి, జితేంద్రియుడు అయి నెలరోజులపాటు అక్కడ ఉండాలి. ఇలా చేసే యాత్రికుడు బ్రహ్మలోకాన్ని చేరడమే కాక వంశాన్ని ఉద్ధరిస్తాడు.

మేధావిక తీర్థానికి చేరి దేవతలకు పితరులకు తర్పణాలు చేస్తే అగ్నిష్టోమయాగ ఫలం, జ్ఞాపకశక్తి, పూర్వజన్మ స్మృతిని పొందుతాడు. ఆ తీర్థంలో కాలంజరం అనే ప్రసిద్ధ పర్వతం ఉంది. అక్కడ దేవహ్రదంలో స్నానం చేస్తే వేయిగోవుల దానఫలం సిద్ధిస్తుంది. శుచియై, స్నాతుడై కాలంజరపర్వతంమీద సాధన కొనసాగించిజి వాడికి స్వర్గంలో స్థిరనివాసం కలుగుతుంది. ఇది సత్యం. పరమశ్రేష్ఠమైన చిత్రకూట పర్వతానికి పోయి పాపనాశిని అయిన మందాకినీ తీర్థంలో మునిగి దేవపితరులను అర్చిస్తే, అశ్వమేధ ఫలాన్ని పొంది పిమ్మట ఉత్తమగతులను సాధిస్తాడు. రాజా! తీర్థయాత్రికుడు పరమోత్తమమయిన **భర్తృస్థానానికి** యాత్ర సాగించాలి. మహాసేనుడు కార్తికేయుడు అక్కడే కొలువుతీరాడు. అక్కడకు చేరడంతోనే సిద్ధులను పొందుతాడు. **కోటితీర్థంలో** నరుడు స్నానం చేస్తే సహస్ర గోదానఫలం దక్కుతుంది. అక్కడ ప్రదక్షిణం చేస్తూ **జ్యేష్ఠస్థానానికి** చేరాలి. అక్కడ కొలువున్న మహాదేవుని దర్శనం, పూజనం చేస్తే చంద్రుని వలె ప్రకాశిస్తాడు. అక్కడ ఒక గొప్ప నుయ్యి ఉంది. అందులో నాల్గు సముద్రాలు నివసిస్తాయి. ఆ ప్రదేశాన స్నానం చేసి దేవతలను, పితరులను పూజిస్తే, జితేంద్రియుడు అయి ఉంటే పవిత్రుడు అవుతాడు. సిద్ధులను పొందుతాడు.

అక్కడనుంచి **శృంగబేరపురానికి** తీర్థయాత్ర చెయ్యాలి. పూర్వకాలంలో దశరథనందనుడు శ్రీరాముడు ఆ చోటనే గంగానదిని దాటాడు. ఆ తీర్థంలో మునిగిన మానవుని పాపాలు తొలగిపోతాయి. బ్రహ్మచర్యాన్ని, ఏకాగ్రతను పాటిస్తూ గంగలో స్నానమాచరిస్తే, పాపరహితుడై వాజపేయయాగఫలాన్ని గ్రహిస్తాడు. ఆ ప్రదేశం నుంచి **ముంజవటానికి** చేరాలి. అక్కడ శంకరుడు సుప్రతిష్ఠితుడై ఉన్నాడు. ఆ తీర్థానికి పోయి, మహాదేవునికి నమస్కరించి, ప్రదక్షిణం చేస్తే గణపతి పదాన్ని పొందుతాడు. ఆ తీర్థాన ఉన్న గంగలో మునిగితే పాపాలన్నీ పోయి పవిత్రుడు అవుతాడు.

అటుపైన మహర్షులచే కీర్తింపబడే **ప్రయాగతీర్థానికి** చేరుకోవాలి. అక్కడే బ్రహ్మాదిదేవతలు, దిగ్దేవతలు, దిక్పాలకులు, లోకపాలురు, సాధ్యులు, పితరులు, సనత్కుమారాదులు, ఋషులు, అంగిరసుడు మొదలైన బ్రహ్మర్షులు, నాగులు, గరుడుడు, సిద్ధులు, సూర్యుడు, నదులు, సముద్రాలు, గంధర్వులు, అప్సరసలు, నారాయణుడు కొలువుతీరారు. అక్కడ మూడు అగ్నికుండాలు ఉన్నాయి. వాటి మధ్యనుంచి గంగ

వేగంగా ప్రవహిస్తుంది. సూర్యపుత్రి, త్రిలోకప్రసిద్ధ అయిన యమునానది ఆక్కడే గంగతో కలిసి ఉంది. గంగాయమునల మధ్యభాగం భూమికి జఘనభాగం అని కీర్తింపబడింది. ఋషు లందరు ప్రయాగను జఘనస్థానమైన ఉపస్థ(యోనిభాగం) అన్నారు. ప్రతిష్ఠానపురంతో కూడిన ప్రయాగ, కంబలాశ్వతరు లనే నాగులు, భోగవతీతీర్థం బ్రహ్మ వేదిస్థానాలు. ఆ తీర్థాన వేదాలు, యజ్ఞాలు మూర్తిమంతాలై ప్రజాపతిని ఉపాసిస్తాయి. తపోధనులైన ఋషులు, దేవతలు, చక్రధరులైన రాజులు, యజ్ఞాలతో చక్రధరుని ఆరాధిస్తారు. ముల్లోకాలలో ప్రయాగయే ఉత్తమం, పుణ్యతమం కూడ. ఆ తీర్థానికి పోవడంతోనే, నామోచ్చరణం చేతనే మృత్యుభయం తొలగి పాపదూరుడు అవుతాడు. ప్రపంచప్రఖ్యాతం అయిన ప్రయాగలో స్నానం ఆచరిస్తే రాజసూయ, అశ్వమేధయాగాల ఫలాన్ని దక్కించుకొంటాడు. ఇదియే సంస్కారం చేయబడిన దేవతల యజ్ఞభూమి. ఇక్కడ చేయబడిన చిన్నదానం కూడ గొప్ప ఫలాన్ని ఇస్తుంది. వేదవచనానుసారం, లోకవచనానుసారం ప్రయాగయే మరణించుటకు శ్రేయోదాయకం అయినది. ప్రయాగలో ఆరుకోట్ల పదివేల తీర్థాల సాన్నిధ్యం ఉంది. నాల్గువిద్యలవలన ఏ ఫల వస్తుందో, నిరంతర సత్యవాక్యంచే ఏ ఫలం వస్తుందో అది కేవలం ప్రయాగ తీర్థాల స్నానం వలన లభిస్తుంది. ఇక్కడే భోగవతి అనే పేరుగల **వాసుకి తీర్థం** ఉంది. ఇందు మునిగితే అశ్వమేధయాగఫలం అందుకొని సుఖిస్తాడు. ఆ ప్రదేశంలో విఖ్యాతం అయిన **హంసప్రపతన తీర్థం**, గంగా తీరాన దశాశ్వమేధిక తీర్థాలు ఉన్నాయి.

గంగలో ఎక్కడ స్నానం చేసినా అది కురుక్షేత్ర తీర్థ సమానం అయి పుణ్యఫలం ఇస్తుంది. **కనఖలాన** గంగా స్నానం విశేషమాహాత్మ్యం కలిగి ఉంది. ప్రయాగ తీర్థంలో గంగాస్నానం అన్నిటికంటె విశేషఫలాన్ని ఇస్తుంది. నిషిద్ధకర్మలను, వందలకొలది ఆచరించినా గంగాస్నానం చేస్తే ఆ స్నానం అగ్ని ఇంధనాన్ని దహించినట్లు వాటిని దహిస్తుంది. **కృతయుగాన అన్ని తీర్థాలు పుణ్యదాయకాలు. త్రేతాయుగాన పుష్కరం గొప్పది. ద్వాపరయుగాన కురుక్షేత్రం శ్రేష్ఠం. కలియుగాన గంగా తీర్థం ఉత్తమం.** పుష్కర తీర్థంలో తపస్సు చెయ్యాలి. మహాలయంలో దానం చెయ్యాలి. మలయపర్వతాన అగ్న్యాధానం చెయ్యాలి. భృగుతుంగ తీర్థంలో ఉపవాసం చెయ్యాలి. పుష్కరతీర్థాన, కురుక్షేత్ర తీర్థాన, గంగాతీర్థాన, మధ్యనున్న ప్రయాగాది తీర్థాలలో మునిగి తీర్థయాత్రికుడు ముందు, వెనుక ఏడు తరాలను ఉద్ధరిస్తాడు. గంగానామస్మరణంతోనే పాపాలన్నీ పటాపంచలవుతాయి. దర్శనంతో శుభాలు చేకూరుతాయి. స్నాన జలపానాలతో ఏడుతరాలను పవిత్రం చేస్తుంది. మానవుని ఎముకలు ఎంతవరకు గంగా స్పర్శనం కలిగి ఉంటాయో అంతవరకు అతడు

స్వర్గంలో పూజలు అందుకొంటాడు. పుణ్యతీర్థాలు, పవిత్రమందిరాలు ఎన్ని ఉన్నాయో అన్నిటిని సేవించినవాడు పుణ్యాలను పొంది స్వర్గం చేరుకొంటాడు. **గంగతోసమం అయిన తీర్థం లేదు. కేశవుని కంటే దేవుడు లేడు. బ్రాహ్మణుల కంటే వేరు వర్ణం లేదు. ఇది బ్రహ్మదేవుని మాటలు.* ఎక్కడ గంగ ప్రవహిస్తుందో అదే ఉత్తమప్రదేశం. ఎక్కడ గంగ ప్రవహిస్తుందో అదే ఉత్తమతపోవనం. గంగాతీరాన ఉన్న ప్రదేశమే సిద్ధిక్షేత్రం.**** ఈ సత్యవాక్యాలను బ్రాహ్మణాది ద్విజులకు, సాధుపురుషులకు, పుత్ర, స్నేహిత, శిష్య, అనుయాయివర్గానికి తెలియజేయాలి. ఈ గంగామాహత్మ్యం ధన్యం, పవిత్రం, స్వర్గప్రాపకం, పరమోత్తమం. ఇది పుణ్యజనకం, ధర్మసహితం, పావనం, శ్రేష్ఠం. ఇది మహర్షులకు కూడ తెలియని రహస్యం. అన్ని పాపాలను తొలగిస్తుంది. ద్విజమండలిలో ఈ గంగా మాహాత్మ్యాన్ని వినిపిస్తే స్వర్గాన్ని పొందుతాడు. ఈ తీర్థసమూహవర్ణనం, దాని మాహాత్మ్యం సంపత్ప్రదం, స్వర్గప్రదం, పుణ్యజనకం, శత్రునివారకం, శుభప్రదాయకం, మేధాశక్తి జనకం. దీనిని చదివితే పుత్రులు లేనివాడు పుత్రులను పొందుతాడు. అధనుడు ధనాన్ని పొందుతాడు. రాజు భూమిని జయిస్తాడు. వైశ్యుడు ధనరాశులను వశం చేసుకొంటాడు. శూద్రుడు కోరికలను తీర్చుకొంటాడు. బ్రాహ్మణుడు పరిస్తే సమస్త శాస్త్రాలు తెలుస్తాయి. ఎవడు శుచియై, స్నాతుడై ఈమాహాత్మ్యాన్ని ప్రతిదినం వింటాడో అతడు అనేకజన్మలను గుర్తించి, స్వర్గంలో సుఖిస్తాడు. నేనీ విధంగా గమ్యాలు, అగమ్యాలు అయిన తీర్థాలను వర్ణించాను.

సంపూర్ణ తీర్థ దర్శనాభిలాష కల మానవుడు ఏ తీర్థాలను చేరలేడో వాటిని మనస్సులో సంభావించి యాత్ర చెయ్యాలి. వసుగణం, ఆదిత్యులు, సాధ్యగణం, మరుద్గణం, అశ్వినీదేవతలు, మహర్షులు అందరూ పుణ్యలాభప్రాప్తికై కోరి ఈ తీర్థాల్లో స్నానం చేశారు. ధర్మనందనా! నీవు కూడ ఉత్తమవ్రత నియమాలను పాటిస్తూ విధిప్రకారంగా పుణ్యంతో, పుణ్యాన్ని పెంచుకొంటూ ఈ తీర్థయాత్ర సాగించాలి. ఆస్తికతతో, వేదానుశీలనంతో ముందుగా జితేంద్రియుడవు అయి ఉండాలి. సాధుపురుషులే ఈ తీర్థసేవనం చేయగలరు. బ్రహ్మచర్యాన్ని ఆచరించనివారు, చిత్తాన్ని అదుపులో పెట్టుకోలేనివారు, అపవిత్రతకలవారు, ఆచారాలు లేనివారు, కపటులు, చోరులు, వక్రబుద్ధికలవారు శ్రద్ధలేని కారణంగా ఈ

---

* **న గంగాసదృశం తీర్థం న దేవః కేశవాత్ పరః।**
బ్రాహ్మణేభ్యః పరం నాస్తి ఏవమాహ పితామహః॥ 96

** **యత్ర గంగా మహారాజ న దేశస్తత్ తపోవనమ్।**
సిద్ధిక్షేత్రం చ తజ్ఞేయం గంగాతీరసమాశ్రితమ్॥ 97

తీర్థాల్లో స్నానాన్ని చేయలేరు. నీవు ధర్మాచారాలను తెలిసి మసలుతున్నావు. నీవు తండ్రి, తాత, ముత్తాత, బ్రహ్మాదిదేవతలు, మహర్షులను సంతుష్టిపరచావు. ఇంద్రసమాన తేజం కలవాడివి అయ్యావు. నీవు వసువుల లోకాలను చేరుకొంటావు. నీవు ఈ భూమిపై సాటిలేని కీర్తిని గడిస్తావు." నారదుడు అన్నాడు. 'ఈవిధంగా పలికి భీష్ముని అనుమతిపై సంతుష్టుడై, పులస్త్యుడు ప్రసన్నచిత్తంతో అంతర్ధానం అయ్యాడు. కురుశ్రేష్ఠా! శాస్త్రాల యధార్థాన్ని గ్రహించిన భీష్ముడు పులస్త్యుని వచనానుసారం తీర్థయాత్ర నెపంతో భూమినంతా చుట్టివచ్చాడు. ఈ ప్రకారంగా పాపా లన్నింటినీ దూరం చేసే మహాపుణ్యప్రదం అయిన ప్రతిష్ఠానపురం(ప్రయాగ) భూమిపై సుప్రతిష్ఠితం అయ్యింది. విధ్యనుసారం ఎవడు తీర్థయాత్రను సాగిస్తాడో, భూమి చుట్టూ తిరుగుతాడో వాడు నూరు అశ్వమేధయాగాల ఫలాన్ని పొంది, దేహత్యాగానంతరం ఆ ఫలాన్ని అనుభవిస్తాడు. కురుశ్రేష్ఠుడైన భీష్ముడు తీర్థయాత్ర చేసి సంపాదించిన ఫలం కంటె ఎనిమిది రెట్లు ఫలం ఉత్తమధర్మాచరణ ఫలం. అది నీది అవుతుంది. నీవు ఈ ఋషు లందరినీ, నీతో తీసుకువచ్చి, తీర్థయాత్ర చేయించడం ద్వారా నీకు ఎనిమిదిరెట్లు పుణ్యఫలం సంక్రమిస్తుంది. ఈ తీర్థాలన్నింటా రాక్షసగణం వ్యాపించి ఉంది. కురునందనా! నీవు తప్ప వేరొకరు ఈ తీర్థాల్లో యాత్రను చెయ్యలేరు. ప్రాతఃకాలాన మేల్కొని ఎవడు పులస్త్యప్రబోధిత మయిన ఈ చరిత్రను సంపూర్ణంగా శ్రద్ధతో పరిస్తాడో వాని పాపాలన్నీ తొలగిపోతాయి.

మహారాజా! ఋషిప్రవరులైన వాల్మీకి, కశ్యపుడు, ఆత్రేయుడు, కుండజఠరుడు, భరద్వాజుడు, వసిష్ఠుడు, ఉద్దాలకముని, శౌనకుడు, పుత్రునితో కూడిన వ్యాసుడు, దుర్వాసుడు, జాబాలి మొదలగు వారందరు నీరాకకై ఎదురుచూస్తూ ఉన్నారు. వీరందరితో తీర్థయాత్రను కొనసాగించు. మహారాజ! అమితతేజస్సంపన్నుడైన లోమశుడు నీతో వస్తాడు. వానివెంట నీవు యాత్రను ఆచరించు. ఈ యాత్రలన్నింటిలో నేను కూడ నీవెంట ఉంటాను. ప్రాచీనకాలం నాటి మహాభిమునివలె నీవు గొప్పకీర్తిని పొందుతావు. ధర్మాత్ముడైన యయాతి వలె, పురూరవునివలె ధర్మాచరణంచే నీవు కూడ ప్రకాశిస్తావు. భగీరథుడు, రామచంద్రుడు మొదలగు వారివలె నీవు సూర్యకాంతితో అందరినీ మించి ప్రకాశిస్తావు. మహాకీర్తిమంతులైన, మనువు, ఇక్ష్వాకువు, పూరుడు, వైన్యుడు ఆదిగాగల రాజులవలె నీవు ప్రసిద్ధిని పొందుతావు. వృత్రాసురుని సంహరించి, శత్రువులను జయించి ఇంద్రుడు పూర్వం ముల్లోకాలను పొంది సుఖించాడు. ఆ విధంగా నీవు శత్రువులను సంహరించి ప్రజలను పరిపాలిస్తావు. స్వధర్మంచే భూమిని జయించి కార్తవీర్యార్జునునివలె ధర్మంగా ఖ్యాతిని సంపాదిస్తావు. 'మహారాజా! దేవర్షి అయిన నారదుడు పైన వివరించిన ప్రకారంగా ధర్మరాజును ఊరడించి'

అతని ఆజ్ఞ గైకొని అక్కడే అంతర్ధానం అయ్యాడు. ధర్మాత్ముడైన యుధిష్ఠిరుడు ఆ విషయాలను ఆలోచిస్తూ తనవద్ద ఉన్న ఋషులందరికీ పుణ్యప్రద మయిన ఆ తీర్థయాత్రల వృత్తాంతాన్ని తెలిపాడు.

86. యుధిష్ఠిరుడు పుణ్యతపోవనాశ్రమాల గురించి ధౌమ్యుని ప్రశ్నించుట.

సోదరుల అభిప్రాయాన్ని, బుద్ధిశాలి అయిన నారదుని అభిప్రాయాలను గమనించి యుధిష్ఠిరుడు బ్రహ్మతో సమానం అయిన తెలివితేటలు గల ధౌమ్యుని అడిగాడు. "నేను అస్త్రప్రాప్తికై జయశీలి, సత్యపరాక్రమవంతుడు, మనస్వి, పురుషశ్రేష్ఠుడు, బాహుసంపన్నుడు అయిన అర్జునుని తీర్థయాత్ర నెపంతో దూరం చేశాను. ఆ వీరుడు నాపై ప్రేమకలవాడు, సమర్థుడు, తపోధనుడు, ధన్యుడు, అస్త్రవేది, శ్రీకృష్ణునివలె ప్రతిభావంతుడును. కృష్ణనామ ధారులైన, వీరిరువురినీ శత్రునాశకులు అని భావిస్తున్నాను. ప్రతిభాశాలి అయిన వేదవ్యాసునిదీ ఇదే అభిప్రాయం. పుండరీకదళనేత్రు లైన వీరిరువురు మూడుయుగాల నుంచి కలిసిపుడుతున్నారు. నారదమహర్షి ఈవిషయాలను తెలిసి ఎల్లప్పుడు నాతో చర్చిస్తూనే ఉన్నారు. సుప్రసిద్ధులైన నరనారాయణులే అర్జున శ్రీకృష్ణులని నాకు తెలుసు. అర్జునుని బలాన్ని గుర్తించియే అస్త్రసాధనకై అతడిని పంపాను. దేవతాపుత్రుడైన అర్జునుడు ఇంద్రునితో సమానుడు. ఇది తెలిసి నేను ఇంద్రుని చూడటానికి, అస్త్రాలను సంపాదించటానికి అర్జునుని పంపాను. భీష్మద్రోణులు అతిరథులు. కృపాచార్య, అశ్వత్థామలను గెలవటం కష్టం. ధృతరాష్ట్రుని ప్రియపుత్రుడైన దుర్యోధనుడు వీరినందరినీ యుద్ధం కోసం, జయం కోసం ప్రార్థించాడు. వారు అందరు వేదజ్ఞులు, శూరులు, వీరులు, అస్త్రకోవిదులు. మహాబలవంతుడైన అర్జునునితో యుద్ధాన్ని కోరుతున్నారు. వారిలో సూతపుత్రుడైన కర్ణుడు కూడ వివిధాలైన శస్త్రాస్త్రాలను తెలిసినవాడు. కాలంచే అతడు ప్రళయకాలం నాటి సమావర్తం అనే పేరుగల అగ్నితో సమానుడుగా సృష్టింపబడ్డాడు. అతనిది గాలితో సమానమైన బలం. బాణాలు జ్వాలలు. వింటి నారి నుంచి వచ్చే శబ్దమే దాహకుడైన అగ్నిధ్వని. యుద్ధంలో పైకి ఎగసిన ధూళియే పొగ, అస్త్రవర్షమే ఆవరించే ధారలు. ధార్తరాష్ట్ర లనే వాయువు సహకారం పొంది ఉద్ధతుడై ప్రజ్వలిస్తున్నాడు. గడ్డిరాశులవలె నా సేనాసమూహాన్ని భస్మం చేయటంలో సందేహం లేదు.

ఆ కర్ణాగ్నిని అర్జునమేఘం మాత్రమే ఆర్పివేయగలదు. కృష్ణవాయుసహాయం స్వీకరించి ఆ మేఘం సంచరిస్తుంది. దివ్యాస్త్రాల కాంతులే ఆ మేఘపు మెరుపుతీగలు. రథానికి పూన్చిన తెల్లటి గుఱ్ఱాలే ఆ మేఘసమీపాన సంచరించే కొంగలబారులు.

గాండీవం ఇంద్రధనుస్సుతో సమానంగా ప్రకాశిస్తోంది. క్రోధపూరితా లయిన అర్జునబాణాలు జలధారలై కర్ణాగ్నిని శమింపచేస్తాయి. శత్రువుల రాజధానిపై విజయాన్ని సాధించగల శస్త్రాస్త్రాలను అర్జునుడు ఇంద్రుని నుంచి తప్పక పొంది తీరుతాడు. ధృతరాష్ట్రుని పక్షాన్ని జయించటానికి అతడొక్కడే చాలు. ఇది నా ప్రగాఢ విశ్వాసం. అతికృతార్థులు అయిన శత్రువులను ఎదుర్కొనటానికి వేరొక ఉపాయం లేదు. శత్రుపీడకు డైన అర్జునుడు అస్త్రాలను సాధించటం మనమంతా తప్పక చూస్తాం. ఆ వీరుడు కార్యభారాన్ని వహించాక పూర్తిచేస్తే గాని ఎన్నడు శాంతింపడు. ఈ కామ్యకవనాన ద్రౌపదీసహితంగా మేము అర్జునుడు లేక పోవటంతో సావధానంగా ఉండలేకపోతున్నాం. కావున పుణ్యపురుషులు సేవించే వేరొక వనాన్ని గూర్చి తెలపండి. అది సుందరమూ, అన్నపాన సమృద్ధమూ, ఫలసహితమూ, పవిత్రమూ అయి ఉండాలి. వర్షాన్ని కోరేవాడు, మేఘం కొరకు ఎదురుచూసినట్లు, మేము వీరుడైన ఆ అర్జునుని రాకవరకు ఎదురుచూస్తూ కొంతకాలం గడుపుతాం. మీరు ఇతర బ్రాహ్మణులద్వారా విన్న ఆశ్రమాలు, సరస్సులు, నదులు, సుందరపర్వతాలు కల ప్రదేశాన్ని గూర్చి తెల్పండి. అర్జునుడు లేక ఈ కామ్యకవనాన నివసింపలేము. వేరొక ప్రదేశానికి వెళ్ళి దుఃఖాన్ని తగ్గించుకొంటాము."

87. ధౌమ్యుడు తూర్పుదిక్కున ఉన్న తీర్థాలను వర్ణించుట.

వైశంపాయమనుడు ఇలా చెప్పాడు. పాండవుల మనస్సులు అర్జునుని విషయంలో దీన మయ్యాయి. వారందరు అర్జునుని కలుసుకొనాలనే కుతూహలంతో ఉన్నారు. వీరి అవస్థ గమనించి బృహస్పతిసము డైన ధౌమ్యుడు ఊరడిస్తూ వారితో ఇలా పలికాడు "బ్రాహ్మణులు ఇష్టపడే తీర్థ, ఆశ్రమ, పర్వత, దిక్కుల వర్ణనను వినిపిస్తాను. విను. నా ద్వారా వాటిని గురించి విను - నీవు, ద్రౌపది, సోదరులు శోకానికి దూరమవుతారు. వాటిని గురించి వింటేనే సేవించిన పుణ్యం లభిస్తుంది. అక్కడికి చేరితే ఆయా ప్రదేశాల నుంచి వందరెట్లు ఫలాన్ని పొందుతావు. రాజా! నాకు గుర్తున్నంతవరకు పూర్వం రాజర్షులచే సేవింపబడిన తూర్పు దిక్కునందలి సుందరప్రదేశాలను వర్ణిస్తాను. తూర్పుదిక్కున దేవర్షులచే పూజింపబడే **నైమిశతీర్థం** ఉంది. అక్కడే ప్రతీ దేవతకు వేర్వేరు తీర్థాలు ఉన్నాయి. ఆ ప్రదేశంలో దేవర్షిసేవితమై అందమూ, పవిత్రత గల **గోమతీవది** ఉంది. అది దేవతల యజ్ఞభూమి. యముని పశుమారణ ప్రదేశం ఇది. తూర్పున పుణ్యం, పవిత్రం అయిన **గయ పర్వతం** ప్రకాశిస్తోంది. అది గయనిర్మితం. అక్కడే మంగళకరమైన **బ్రహ్మసరోవరం** ఉంది. అది దేవర్షులకు పూజనీయస్థానం. గయాతీర్థవిషయంలో పెద్దలు ఇలా చెప్పారు.

'చాలామంది పుత్రులను కనాలి. అందులో ఒక్కడైనా గయకు పోయి తల్లిదండ్రులకు శ్రాద్ధాలను ఆచరిస్తాడు. అశ్వమేధయాగా న్నైనా చేస్తాడు. నీలవృషభాన్ని వనంలో విడుస్తాడు. వీటివలన పది తరాలను ఇటు అటు ఉద్ధరిస్తాడు'. దానికి సమీపాన **మహానది, గయా శిరమను** తీర్థం కనిపిస్తాయి. అది అక్షయ్య వటమని బ్రాహ్మణులచే కీర్తింపబడింది. దానికాండం, కొమ్మలు, ఎన్నటికీ నశించవు. ఆ చెట్టుకింద పితరులకు ఇచ్చిన అన్నం అక్షయం అవుతుంది. అక్కడే పవిత్రజలాలు కల **ఫల్గువవే** పేరు గల మహానది ఉంది. అదేచోట ఫలమూలాలను అధికంగా ప్రసాదించే **కౌశికీనది** కూడ ఉంది. అది విశ్వామిత్రునికి బ్రాహ్మణత్వం సిద్ధింపచేసింది. తూర్పుదిక్కునే పవిత్ర **గంగానది** ప్రవహిస్తోంది. దాని ఒడ్డున భగీరథుడు గొప్పగొప్ప దక్షిణలు ఇచ్చి, అనేక యాగాలు ఆచరించాడు. పాంచాలదేశంలో **ఉత్పలావనం** ఉందని ఋషులు చెప్పారు. అక్కడ కుశికుని కుమారుడైన విశ్వామిత్రుడు తన పుత్రునితో కలిసి యజ్ఞం విధివిధానంగా చేశాడు. ఆ యజ్ఞంలో విశ్వామిత్రుని అలౌకికవైభవం చూచి, జమదగ్ని కుమారుడు పరశురాముడు అతని వంశానికి తగిన యజ్ఞాన్ని గురించి వర్ణించాడు. విశ్వామిత్రుడు కాన్యకుబ్జదేశాన ఇంద్రునితో సమానంగా సోమపానం చేసి, అక్కడే క్షత్రియత్వాన్ని విడచిపెట్టి బ్రాహ్మణుడను అయ్యాను అని ఉద్ఘోషించాడు. గంగాయమునల ఉత్తమసంగమం ప్రపంచంలో ప్రసిద్ధి పొందినది. విఖ్యాతిని పొందిన మహర్షులు ఇక్కడే స్నానాదులను ఆచరించారు. సమస్త భూతకోటికి ఆత్మస్వరూపుడైన బ్రహ్మ ముందుగా ఇక్కడే యజ్ఞం చేశాడు. ఆ ప్రకృష్టయాగాచరణంచేత ఇది **ప్రయాగతీర్థం**గా వెలసింది. అగస్త్యమహర్షికి గొప్ప ఆశ్రమం ఇక్కడే ఉంది. ఈ తాపసారణ్యం తాపసులచే ఇప్పటికీ ప్రకాశిస్తోంది. **హిరణ్యబిందు**వని చెప్పబడే ఈ ఆశ్రమం కాలంజరమను పర్వతంమీద ఉంది. ఈ అగస్త్యపర్వతం రమణీయం, పవిత్రం, కళ్యాణకరం. కొంతేయా! పూజ్యుడైన భార్గవుని నివాసస్థానం మహేంద్రపర్వతం. పూర్వం బ్రహ్మ ఇక్కడ యజ్ఞాన్ని విధివిధానంగా చేశాడు. పవిత్రజలం కల భాగీరథికి మణికర్ణికాసరోవరం కలిసినచోట **బ్రహ్మశాల** అనే పవిత్రమయిన ప్రదేశం ఉంది. అది పాపరహితులు ఆశ్రయించవలసిన చోటు. ఆ ప్రదేశం చూడతగింది. మహాత్ముడైన మతంగుని ఉత్తమ ఆశ్రమప్రదేశం **కేదారం**. అది పవిత్రం, శ్రేష్ఠం కూడ. చాలవేర్లు, ఫలాలు, ఉదకాలు గల **కుండోదకపర్వతం** సుందరమైంది అక్కడే ప్రకాశిస్తోంది. నిషధేశుడు నలుడు దప్పిక కల్గి, ఈ తీర్థంలో జలం సేవించి, శాంతిని పొందాడు. తాపసులు ఆశ్రయించిన **దేవవనం** అనే పవిత్రక్షేత్రం అక్కడే విరాజిల్లుతోంది. ఆ పర్వతశిఖరాన బాహుద, నంద అను రెండు నదులు ప్రవహిస్తాయి. తూర్పుదిక్కున ఉన్న అనేక తీర్థాలు, నదులు, పర్వతాలు, ఆశ్రమాలు,

మందిరాలు వర్ణింపబడ్డాయి. వాటిని సంక్షిప్తంగా వర్ణించాను. ఇప్పుడు మిగిలిన దిక్కులను ఆనుకొని ఉన్న తీర్థాలను, నదులను, పర్వతాలను వర్ణిస్తాను. వినుము."

88. ధౌమ్యుడు వర్ణించిన దక్షిణ తీర్థాలు.

ధౌమ్యుడు ఇలా అన్నాడు. "నేను ఇప్పుడు దక్షిణదిక్కున ఉన్న తీర్థాలను నా బుద్ధికి అనుగుణంగా విస్తారంగా వర్ణిస్తాను. వినుము. దక్షిణదిక్కున ఉన్న నదుల్లో గోదావరి ప్రసిద్ధం అయింది. ఆ నదిఒడ్డున ఎన్నోపూలతోటలు ఉన్నాయి. వాటికి బయట లోతు తెలియని జలరాశి ఉంది. చాలామంది ఋషులు గోదావరిని మంగళమైనదని సేవిస్తారు. **వేణ, భీమరథి**నదులు దక్షిణ దిక్కున ఉండి సమస్తపాపాల భయాన్ని పోగొడుతూ ఉన్నాయి. ఆ నదుల ఒడ్డున పశుపక్ష్యాదులు వ్యాపించిన ఋషుల ఆశ్రమాలు ప్రకాశిస్తూ ఉన్నాయి. నృగమహారాజు ఏర్పరచిన సుందరం, పవిత్రం అయిన **పయోష్ణీనది** అక్కడే ఉంది. దానిని బ్రాహ్మణు లందరూ ప్రతిదినం సేవిస్తారు, మహాయోగి, యశస్వి అయిన మార్కండేయ మహర్షిచే రాజైన నృగుని ఎదుట వారి వంశగాథ వివరింపబడినది ఇక్కడే అని పెద్దల ఆశయం. పయోష్ణినదీ తీరాన, వరాహతీర్థాన, నృగుని యజ్ఞంలో ఆహుతులను గ్రహించి, సోమపానం స్వయంగా చేసి ఇంద్రుడు మదించిపోయాడు. బ్రాహ్మణులకు భూరిదక్షిణలు సమర్పించాడు. పయోష్ణినదిలోని నీటిని చేతితో గ్రహించినా, ఆ నీరు గాలివలన ఎగిరి మన తలమీద పడినా మృత్యువు వచ్చేదాకా చేసిన పాపాలు నశిస్తాయి. అక్కడ పూజ్యుడైన శంకరునిచే స్వయంగా చేయబడిన **శృంగం** అనే వాద్యం స్వర్గంకంటె ఉన్నతమైంది. నిర్మలం అయింది. దానిని దర్శించిన మానవుడు శివపురాన్ని చేరుతాడు.

అగాధ జలరాశి గల గంగాది నదులు ఒకవైపు, పయోష్ణినది రెండవవైపు ఉంచి పరిశీలిస్తే పయోష్ణినదియే ఉత్తమమయింది అని నా అభిప్రాయం. ఆ దిక్కునే పవిత్రమైన **మాతరవనం** ఉంది. అది పుష్పఫలశోభలతో, కళ్యాణస్వరూపం కలిగి ఉంది. వరుణస్తోతం అనేపేరు గల పర్వతాన సూర్యుని పరివారదేవత అయిన మాతరుని విజయస్తంభం ప్రకాశిస్తోంది. **ప్రవేణీనది**కి ఉత్తరదిక్కున ఉన్నమార్గంలో కణ్వుని పవిత్ర ఆశ్రమం ఉంది. ఈ విధంగా నేను విన్న ఆశ్రమాలను, నదులనూ, మహాత్ములున్న ప్రదేశాలనూ వివరించాను. భారతా! శూర్పారక క్షేత్రాన మహాత్ముడైన **జమదగ్ని వేది** ఉంది. అది సుందరమై పాషాణతీర్థం, పునశ్చంద్రతీర్థం అను పేర్లతో విరాజిల్లుతోంది. అదే క్షేత్రాన అశోకతీర్థంలో మహర్షులు చాలామంది నివసిస్తారు. పాండ్యదేశంలో **అగస్త్యతీర్థం, వారుణ తీర్థమూ** ఉన్నాయి. పాండ్యదేశంలోనే (కన్యా)కుమారీ తీర్థం ఉంది. పాండ్యదేశంలో స్త్రీలు బాల్యానంతరం

భర్తలకోసం దేవతలను పూజిస్తారు. తామ్రపర్ణినదిని గూర్చి వివరిస్తాను. విను. మోక్షం కోరి తామ్రపర్ణినదీతీర్థాన దేవతలు ఆశ్రమం నిర్మించుకుని తపస్సు చేశారు. అక్కడ ఉన్న గోకర్ణతీర్థం ముల్లోకాల్లో సుప్రసిద్ధం. **గోకర్ణతీర్థం** శీతజలాలతో నిండి పవిత్రం, కళ్యాణకరం, శుభప్రదం అయి ఉంది. అంతఃకరణం పరిశుద్ధం కాని వారికి గోకర్ణతీర్థప్రవేశం దుర్లభం. అక్కడ అగస్త్యుని శిష్యుని ఆశ్రమం ఫలపుష్పాలతో, వృక్షాలతో, గడ్డితో ప్రకాశిస్తోంది. దేవసమం అనే పర్వతమే అతని ఆశ్రమప్రదేశం. ఆ ప్రదేశాన ఉన్న మణిమయవైడూర్యపర్వతం శివస్వరూపం అని చెప్పబడుతోంది. అక్కడే అగస్త్యుని ఆశ్రమం ఉంది. అది ఫలమూలాలతో జీవనానికి యోగ్యం అయింది.

సౌరాష్ట్రదేశంలోని పుణ్యస్థలాలను, ఆశ్రమాలను, నదులను సరోవరాల్ని ఇకపై వర్ణిస్తాను. వినవలసింది. అక్కడ **చమసోద్భేదతీర్థాన్ని** గురించి విని ప్రజలు చర్చించుకొంటారు. సురాష్ట్రసముద్రం ఒడ్డుపై **ప్రభాసక్షేత్రం** దేవతలకు నివాసమై వెలుగుతోంది. **పిండారకతీర్థం** కూడ ఋషిగణసేవితం, కళ్యాణకరం అయి అక్కడే ఉంది. ఆ వైపున ఉన్న **ఉజ్జయంతం అనే పర్వతాన్ని** శీఘ్రసిద్ధిప్రదాయకం అని చెబుతారు. యుధిష్ఠిరా! ఈ విషయాన నారదునిచే గానం చేయబడిన ప్రాచీన శ్లోకాన్ని నానుంచి విను. 'సౌరాష్ట్రాన మృగపక్షి వ్యాప్తం అయిన ఉజ్జయంత పర్వతంపై ఎవరు తపస్సు ఆచరిస్తారో వారికి స్వర్గపూజ లభిస్తుంది.' ఉజ్జయంతపర్వతానికి సమీపాన ద్వారకానగరం ఉంది. అదియే సాక్షాత్తుగా మధుసూదనుని ప్రియతమనివాసం. వారే ప్రాచీన ధర్మస్వరూపులు. వేదవేత్తలు, అధ్యాత్మకోవిదులు శ్రీకృష్ణుని పరమాత్మ అని, అత్యంత సనాతనుడు అని కీర్తిస్తారు. **గోవిందుడు పవిత్రం చేసేవారిలో పరమపవిత్రుడు, పుణ్యాత్ములలో పుణ్యుడు, మంగళకరం అయిన వారిలో మంగళకారకుడు, పుండరీకాక్షుడు,*** దేవాదిదేవుడు, పరమేశ్వరుడు, సనాతనుడు, అవినాశి, వినాశి(క్షరపురుషుడు) అయి ముల్లోకాల్లో విరాజిల్లుతున్నాడు. అచింత్యుడు, మధుసూదనుడు ద్వారకానగర వాసి అయి ప్రకాశిస్తున్నాడు."

89. ధౌమ్యుడు పశ్చిమదిక్కున ఉన్న తీర్థాలను వర్ణించుట.

ధౌమ్యుడు పలికాడు. "పశ్చిమదిక్కున ఆనర్తదేశాలలో పవిత్రతీర్థాలను, పుణ్యస్వరూపాలయిన దేవమందిరాలన్నింటిని గూర్చి ఇకపైన వివరిస్తాను. ఈ దిక్కున పవిత్రతమ

* పవిత్రాణాం హి గోవిందః పవిత్రం పరముచ్యతే ।
పుణ్యానామపి పుణ్యోఽసౌ మంగలానాం చ మంగలమ్ ।
త్రైలోక్యే పుండరీకాక్షః దేవదేవః సనాతనః ॥ 26

అయిన **నర్మదానది** ప్రవహిస్తూ ఉంది. ఆ నదిధార పశ్చిమంగా సాగుతూ ఉంది. దాని ఒడ్డున ప్రియంగులతలు, మామిడితోపులు, వానీర ఫలవృక్షాల వరుసలు అధికంగా ఉండి శోభిస్తూ ఉన్నాయి. ముల్లోకాల్లో ఏ పుణ్యతీర్థాలు, మందిరాలు, నదులు, అరణ్యాలు, పర్వతాలు, బ్రహ్మాదిదేవతలు, సిద్ధులు, ఋషులు, పుణ్యాత్ముల సమూహాలు ఉన్నాయో, వారందరు నర్మదానదిలో స్నానం చేయటానికి వస్తారు. అక్కడ మునిశ్రేష్ఠుడైన విశ్రవసువు పవిత్రాశ్రమం ఉంది. నరవాహనుడు కుబేరుడు ఈ ఆశ్రమాన పుట్టాడు. వైడూర్య శిఖరం అనే మంగళపర్వతం ఈ నర్మదానది ఒడ్డున ఉంది. పచ్చని ఆకులతో, ఎల్లప్పుడు ఫలాలతో ఇక్కడి చెట్లు ప్రకాశిస్తాయి. ఆ పర్వతశిఖరాన ఒక పుణ్యప్రదం అయిన సరోవరం ఉంది. దానిలో కమలాలు ఎప్పుడూ వికసించి ఉంటాయి. ఆ సరోవరాన్ని దేవతలు, గంధర్వులు సేవిస్తారు. దేవర్షిగణసేవితం ఆ పుణ్యపర్వతం. స్వర్గంతో సమానంగా ప్రకాశిస్తూ ఉంటుంది. అక్కడ ఎన్నో ఆశ్చర్యకరవిషయాలు చూస్తాం. ఆ ప్రదేశాన రాజర్షియైన విశ్వామిత్రుని తపఃఫలంగా ఏర్పడిన పుణ్యనది ఉంది. అది ఒక గొప్ప తీర్థంగా విరాజిల్లుతోంది. ఆ నది ఒడ్డున నహుషుడి కుమారుడు యయాతి సత్పురుషుల మధ్యలో పడి, తిరిగి సనాతన ధర్మలోకాలకు వెళ్ళిపోయాడు.

అక్కడ ఒక పుణ్యసరోవరం, మైనాకపర్వతం, ఫలపుష్పవంతం అయిన అసితపర్వతం ఉన్నాయి. ఆ పర్వతంపై కక్షసేనుని పవిత్రాశ్రమం ఉంది. చ్యవన మహర్షి ప్రసిద్ధాశ్రమం కూడ అక్కడే స్థాపించబడింది. తక్కువ తపస్సు చేసినా అక్కడ సిద్ధి లభిస్తుంది. పశ్చిమదిక్కున జంబూమార్గం ఉంది. శుద్ధమనస్కులైన ఋషి లక్కడ నివసిస్తారు. అది పశుపక్ష్యాదులతో నిండి ఉంది. రాజా! ఆ ప్రదేశంలోనే తాపసులతో నిండిన పవిత్రక్షేత్రాలు కేతుమాల, మేధ్య, హరిద్వారం ఉన్నాయి. బ్రాహ్మణులచే సేవింపబడే సైంధవారణ్యం కూడ అక్కడే ఉంది. పుణ్యప్రదం అయిన బ్రహ్మదేవుని పుష్కరతీర్థం ఆ దిక్కునే ఉంది. అది వానప్రస్థులు, సిద్ధులు, ఋషులకు ప్రియం అని చెప్పబడుతోంది. పుష్కరనివాసానికై బ్రహ్మ ఈ వృత్తాంతాన్ని చెప్తాడు. మనస్వి అయిన జనుడు మనస్సులోనైనా ఇక్కడ ఉండాలని అనుకొంటేవాని పాపాలన్నీ నశించి స్వర్గలోకాన ఆనందాలను అనుభవిస్తాడు."

90. ధౌమ్యుడు ఉత్తరదిక్కున గల తీర్థాలను వర్ణించుట.

ధౌమ్యుడు చెప్పాడు. "రాజా! ఉత్తరదిక్కున ఉన్న తీర్థాలు, ఆశ్రమాలు, పవిత్రదేవాలయాలు, వీటిని గూర్చి వివరిస్తాను. నీవు సావధానచిత్తుడవు అయి వినుము. తీర్థయాత్రా ప్రసంగం వాటిపట్ల మంగళప్రదం అయిన శ్రద్ధను పెంచుతుంది. పాండవా!

తీర్థసముదాయంతో ప్రకాశించే **సరస్వతీనది** చాలా పుణ్యాన్ని ఇస్తుంది. **యమునానది** ఉత్తరదిక్కున ఉంది. అక్కడే పుణ్యప్రదం అయిన **ప్లక్షావతరణతీర్థం** ఉంది. అక్కడ సారస్వతయజ్ఞం చేసి, బ్రాహ్మణులు అవభృథస్నానం కోసం ఈ తీర్థానికి వెడుతూఉంటారు. భారతా! దివ్యం, కళ్యాణమయం అయిన అగ్నిశిరస్సు అనే పుణ్యతీర్థం అక్కడే ఉంది. ఆ తీర్థంలో సహదేవుడు శమ్య అనే యజ్ఞపాత్రను విసరిన అది ఎంత దూరంలో పడిందో అక్కడ మండపం నిర్మించి యజ్ఞం చేశాడు. ఈ విషయంలో ఇంద్రుడు గానం చేసిన గాథను బ్రాహ్మణులు గానం చేస్తారు. సహదేవుడు యమునానదీతీరాన లక్షగోవులను దానం ఇచ్చి అగ్నిని ఉపాసించాడు. ఇక్కడే గొప్పకీర్తిగల భరత చక్రవర్తి ముప్పది ఐదు అశ్వమేధయాగాలను చేశాడు.

నాయనా! ప్రాచీన కాలాన బ్రాహ్మణుల మనోవాంఛలు తీర్చిన భరతుడు అనే రాజును గూర్చి మనం విన్నాం. ఉత్తరాఖండంలోనే శరభంగుని పవిత్రమైన ఆశ్రమప్రదేశం ఉంది. మహారాజా! సత్పురుషులు ఎల్లప్పుడు సరస్వతీ నదిని ఉపాసిస్తారు. పూర్వకాలాన ఇక్కడ వాలిఖిల్యులు యజ్ఞం చేశారు. యుధిష్ఠిరా! పరమపవిత్రం అయిన **దృషద్వతీనది** ఇక్కడ ప్రవహిస్తోంది. ఇక్కడ న్యగ్రోధం, పుణ్యం, పాంచాల్యం, దాల్భ్యఘోషం, దాల్భ్యం అనే అయిదు ఆశ్రమాలు ఉన్నాయి. అనంతకీర్తి, తేజోవంతుడు అయిన సువ్రతుని పవిత్ర ఆశ్రమం ఇక్కడే ఉంది. ఇది ముల్లోకాల్లో మిక్కిలి ప్రసిద్ధం. రాజా! ఉత్తరాఖండంలో ప్రఖ్యాతులు అయిన నరనారాయణులు ఉన్నారు. వీరు లేడివర్ణం కలవారయినా వర్ణ (గుణ) రోహితులు. వీరిరువురు వేదజ్ఞులు, వేదమర్మం తెలిసినవారు, వేదవిద్యను చదివినవారు. పవిత్రం అయిన యజ్ఞాలు వీరు చేశారు. ప్రాచీనకాలాన ఇంద్రుడు, వరుణుడు మొదలైన దేవతలు కలిసి **విశాఖయూపం** అనే ప్రదేశంలో తపస్సుచేసి ఆ ప్రదేశాన్ని పవిత్రం చేశారు. మహాబాహుడు, గొప్పకీర్తికలవాడు, ప్రభావశాలి అయిన జమదగ్ని సుందరమూ, పుణ్యప్రదమూ అయిన పలాశవనంలో యాగాలు చేశాడు. శ్రేష్ఠనదులన్నీ ఆకారాలను ధరించి తమతమజలాలు తీసుకొని ఆ జమదగ్ని వద్దకు వచ్చి, అతనికి అన్నివైపులా నిలబడి ఎదురుచూశాయి. మహాత్ముడై జమదగ్ని యాగాన్ని కన్నులారా చూచిన గంధర్వరాజు విశ్వావసువు స్వయంగా ఈశ్లోకాన్ని పఠించాడు. 'మహాత్ముడైన జమదగ్ని ఏ యజ్ఞంలో దేవతలను ఆరాధించాడో ఆ యజ్ఞంలో నదులన్నీ వచ్చి మధువును సేకరించి బ్రాహ్మణులను తృప్తిపరచాయి.'

పర్వతరాజైన హిమాలయం కిరాతులకు, కిన్నరులకు నివాసస్థానం. గంధర్వులు, యక్షులు, రాక్షసులు, అప్సరసలు ఆ పర్వతాన్ని సదా సేవిస్తారు. గంగానది మిక్కిలివేగంగా

ఆ పర్వతాన్ని చీల్చుకొని బయటకు వచ్చింది. దానికి **హరిద్వారం** అని పేరు. ఆ తీర్థంలో ఎల్లప్పుడు బ్రాహ్మణులు కొలువు తీరి ఉంటారు. పుణ్యమయం అయిన **కనఖలం**లో సనత్కుమారులు పూర్వం సంచరించారు. పురు వనే పేరుగల ప్రసిద్ధపర్వతం అక్కడే ఉంది. పురూరవుడు ప్రాచీన కాలంలో అక్కడకు యాత్రను సాగించాడు. మహర్షులు సేవించే ఆ ఆశ్రమంలోనే భృగుమహర్షి తపస్సు చేశాడు. అదే **భృగు తుంగ** మనే మహాగిరి. భూతభవిష్యత్ వర్తమానకాలరూపుడు, శక్తిమంతుడు, సర్వత్ర వ్యాపించినవాడు సనాతనుడు, పురుషోత్తముడు, నారాయణుడైన శ్రీహరి **విశాలాపురప్రదేశం** బదరీ వనసమీపంలో ఉంది. అది నరనారాయణుల ఆశ్రమం అని, **బదరికాశ్రమం** అని కొనియాడబడుతోంది. రాజా! పూర్వకాలం నుంచి విశాలాపురిలో బదరికాశ్రమసమీపాన గల గంగానది వేడినీరు, చల్లనినీరు కలిగి ప్రవహిస్తోంది. అక్కడ ఇసుక బంగారంలా మెరుస్తూ ఉంటుంది. అక్కడకు మహాభాగులు, తేజోవంతులు, అయిన మహర్షులు ప్రతిదినం పోయి నరనారాయణులకు నమస్కరిస్తారు. సనాతన దేవుడైన నారాయణుడు అక్కడ కొలువుతీరాడు.

ఆ బదరికాశ్రమం పుణ్యక్షేత్రం, పరబ్రహ్మస్వరూపం. అక్కడే తీర్థాలు, తపోవనాలు, పరమేశ్వరుడు కూడ ఉన్నారు. అక్కడ ప్రాచీనుడు అయిన పరబ్రహ్మ, పరమపదం ఉన్నాయి. దేన్ని తెలిస్తే శాస్త్రచక్షువులైన విద్వాంసులు దుఃఖింపరో ఆ ప్రదేశం ఇదియే. దేవర్షులు, సిద్ధులు, తపోధనులు ఇక్కడే నివసిస్తారు. మహాయోగి, ఆదిదేవుడు అయిన నారాయణుడు ఇక్కడ వెలిసియున్నాడు. అది పవిత్రప్రదేశాలలో కెల్ల పవిత్రం. ఈ విషయంలో సందేహం లేదు. రాజా! భూమండలాన పుణ్యతీర్థాలు, ఆశ్రమాలు, అని ప్రసిద్ధమైన వాటిని వసువులు, సాధ్యులు, ఆదిత్యులు మరుద్గణాలు, అశ్వినీదేవతలు, మునులు, ఋషులు అందరూ సేవిస్తారు. నీవు శ్రేష్ఠులైన బ్రాహ్మణులతో, సోదరులతో ఈ ప్రదేశాల్లో సంచరిస్తే అర్జునుని కలవాలి అనే నీ తపన శాంతిస్తుంది."

91. లోమశుడు వచ్చి ధర్మరాజుకు ఇంద్రసందేశము, అర్జునుని అస్త్రప్రాప్తి చెప్పుట.

ధౌమ్యుడు ఇలా అంటూ ఉండగా తేజోవంతుడైన లోమశుడు అక్కడికి చేరాడు. ధర్మరాజు బ్రాహ్మణులతో, సోదరులతో కలిసి ఇంద్రునికి దేవతలు ఎదురువెళ్ళినట్లు ఎదురేగి, స్వాగతం పలికాడు. ధర్మనందనుడైన యుధిష్ఠిరుడు యథార్హంగా పూజించి ఆసనంపై కూర్చుండబెట్టి ఆ తపోవనాలు తిరగటంలోని ప్రయోజనం అడిగాడు.

పాండుపుత్రునిచే ప్రశ్నింపబడిన లోమశ మహర్షి ప్రసన్నుడై సుమధురంగా పాండవుల హర్షాన్ని పెంచుతూ ఇలా అన్నాడు. "కౌంతేయా! నా కోరికను అనుసరించి సంపూర్ణ విశ్వయాత్ర చేస్తున్నాను. ఒకరోజున ఇంద్రుని భవనానికి పోయి దేవరాజును కలిశాను. అక్కడ నీ సోదరుడు, సవ్యసాచి అయిన అర్జునుని చూశాను. అతడు ఆ సమయాన ఇంద్రసింహాసనంపై కూర్చున్నాడు. ఆ దశలో నీ సోదరుడు ఇంద్రసింహాసనంపై కూర్చుండగా చూచి మిక్కిలి విస్మయం పొందాను. ఆ సమయాన "నీవు పాండవుల వద్దకు పొమ్ము" అని ఇంద్రుడు నాతో అన్నాడు. ఇంద్రార్జునుల ఆదేశానుసారం నిన్ను చూడటానికి శీఘ్రంగా ఇక్కడకు వచ్చాను. ఈ విషయంలో ఇంద్రార్జునులిద్దరూ నన్ను ప్రోత్సహించారు.

పాండుపుత్రా! నీకు ప్రియమైన విషయాన్ని చెప్తాను. మహర్షులు, ద్రౌపది, సోదరులతో కలిసి ఈమాటలు విను. నీవు మహాబాహువైన అర్జునుని ఏ దివ్యాస్త్రాలసంపాదనకు పంపావో ఆ దివ్యాస్త్రాలను, రుద్రుని నుంచి పాశుపతాన్ని కూడ అర్జునుడు గ్రహించాడు. బ్రహ్మశిరోనామకాస్త్రం అమృతంతో కలిసి తపశ్శక్తి ప్రభావంతో శంకరుని చేరింది. ఆ పాశుపతాన్ని సవ్యసాచి అయిన అర్జునుడు శంకరుని నుంచి సాధించాడు. వజ్రసమాన మయిన రుద్రుని పాశుపతం మంత్ర, ప్రయోగ, ఉపసంహార, మంగళాలతో రుద్రుని నుంచి వశం అయింది. దానితో బాటు దండాది ఆయుధాలు కూడ హస్తగతం అయ్యాయి. మిక్కిలి పరాక్రమవంతుడైన అర్జునుడు యమ, కుబేర, వరుణ, ఇంద్రాదుల నుండి ఎన్నో దివ్యాస్త్రాలను పొందాడు. ఇంతేకాక విశ్వావసు వను గంధర్వుని పుత్రుని వద్ద సామగానం, నృత్యం, గీతం, వాద్యకళ కూడ నియమపూర్వకంగా అభ్యసించి, కృతకృత్యుడు అయినాడు. ఈ విధంగా అస్త్రవిద్యలో నిపుణుడై, గాంధర్వవేదాన్ని నేర్చుకొన్నాడు. అర్జునుడు అక్కడ సుఖంగా ఉన్నాడు. దేవరాజైన ఇంద్రుడు నాతో నీకొరకు పంపిన సందేశాన్ని ఇప్పుడు నీకు వివరంగా చెబుతాను. విను. మహాత్మా! మీరు తిరుగుతూ, తిరుగుతూ భూలోకానికి చేరుతారుకదా! నావిజ్ఞప్తి మేరకు ధర్మజుని వద్దకు పోయి ఇట్లు విన్నవించండి. 'నీసోదరుడైన అర్జునుడు అస్త్రవిద్యలో మేటి అయ్యాడు. దేవతల కార్యభారం అతనిపై ఉంచబడింది. దేవతలు కూడ దాన్ని సాధించలేరు. సిద్ధులను పొంది, అర్జునుడు వచ్చేవరకూ నీవుకూడ మిగిలిన సోదరులతో తపస్సును ఆచరించు. తపస్సును మించిన వేరొకసాధనం లేదు. తపస్సే ఎన్నో గొప్పదనాలను సమకూరుస్తుంది.

నేను కర్ణుని బాగా తెలిసినవాడను. అతడు సత్యప్రతిజ్ఞ కలవాడు, ఉత్సాహవంతుడు, పరాక్రమవంతుడు, మహాబలుడు. చాలా సంగ్రామాలలో అతనికి సమానుడు ఎవరూ కనిపించలేదు. అతడు గొప్ప ధనుర్ధరుడు, యుద్ధవిశారదుడు, అస్త్రశస్త్రాలను తెలిసినవాడు,

శ్రేష్ఠుడు, సుందరుడు, మహేశ్వరుని పుత్రుడు అయిన కార్తికేయునితో పరాక్రమంలో సమానుడు. సూర్యునిపుత్రుడు. శక్తిశాలి అయిన వీరుడు. ఆ విధంగా అర్జునుని గురించి నేను తెలిసినవాడను. అతడు విక్రమంలో కార్తికేయుని మించినవాడు. యుద్ధాన కర్ణుడు అర్జునునిలో పదహారవవంతు కూడా కాడు. ఏ విషయాన్ని అనుసరించి కర్ణుని విషయంలో నీకు భయం ఉందో అది అంతా అర్జునుని తిరిగి రాకతో సమసిపోతుంది. తీర్థయాత్రవిషయంలో నీకు ఏ మనస్సంకల్పం ఉందో దానిని గూర్చి కూడ ఈ మహాత్ముడు వివరిస్తాడు. తీర్థాల్లో ఏవి తపస్సుకు అనుగుణంగా ఉంటాయో వాటిని అన్నింటినీ లోమశమహర్షి నీకు వివరిస్తాడు. వారిపై విశ్వాసం ఉంచు. సంశయబుద్ధిని నీవు విడిచిపెట్టు.'

92. లోమశుని ద్వారా ఇంద్రసందేశము విని ధర్మరాజు తనవారితో తీర్థయాత్రకు పోవుట.

లోమశుడు చెప్పాడు. నేను వచ్చేటప్పుడు అర్జునుడు పలికిన మాటలు విను. 'ధర్మబద్ధమయిన రాజ్యలక్ష్మిని గూర్చి ఆలోచించ మని ధర్మరాజుతో చెప్పండి. మీరు గొప్ప తపస్సులు, ధర్మాలను గూర్చి తెలిసినవారు. శ్రీసంపన్నులు రాజుల ధర్మాలను పరిపూర్ణంగా తెలుసుకొన్నవారు. పురుషులను పవిత్రం చేయగల సాధనాలు మీరు తెలిసి ఆచరించినారు. పాండవులకు తీర్థయాత్రద్వారా కలిగే పుణ్యఫలాన్ని అందించటానికి ప్రయత్నం చేయండి. యుధిష్ఠిరుడు తీర్థాలకు వెళ్లేటట్లు, గోవులను దానం చేసేటట్లు అన్నివిధాలా మీరు ప్రయత్నించండి' అని అర్జునుడు నాతో పలికాడు. మీరు సురక్షితులై తీర్థయాత్రలు చేయండి. దుర్గమస్థానాల్లో, కఠిన సమయాల్లో మీరు రాక్షసులనుంచి ధర్మజుని రక్షించండి. దధీచి మహర్షి ఇంద్రుని కాపాడినవిధంగా, అంగిరసుడు సూర్యునిరక్షించిన ప్రకారం మీరు రాక్షసులబారి నుంచి మాసోదరులను కాపాడండి. పర్వతాకారులైన రాక్షసపిశాచాలు అయినా మీరక్షణలో ఉండగా ధర్మజుని సమీపించలేరు. ఇంద్రార్జునుల అభ్యర్థన కారణంగా నేను అన్నివిధాల భయాలనుంచి నిన్ను కాపాడుతూ నీతో తిరుగుతాను. కురునందనా! నేను పూర్వం రెండుసార్లు తీర్థాలు అన్నింటిని చూచాను. నీతో కలిసి మూడవపర్యాయం వాటిని దర్శిస్తాను. మహారాజా! ఈ తీర్థయాత్ర అన్నిభయాలను పోగొట్టేది. రాజర్షులైన మన్వాదులు దీన్ని సంపూర్ణంగా ఆచరించి ధర్మపాలనం చేశారు ఋజుప్రవర్తలేనివాడు, మనస్సు ఇంద్రియాలు అదుపులో ఉండనివాడు, విద్యాహీనుడు, పాపాత్ముడు, కుటిలుడు తీర్థయాత్రలు చేయలేరు. నీ మనస్సు సదా ధర్మంపై లగ్నమై, ధర్మజ్ఞుడవై, ప్రతిజ్ఞా పాలనచేస్తూ ఐహికసుఖాలపట్ల ఆసక్తిలేనివాడవై ఉన్నావు కనుక

ముందుముందు నీలో ఈ గుణాలు పూర్తిగా వికసిస్తాయి. భగీరథమహారాజు, గయుడులు, యయాతి ఎంత మహనీయులో నీవూ అలాంటివాడవే.''

అపుడు ధర్మజుడు ఇలా అన్నాడు. 'మీ దర్శనం, మీమాటలు విని నేనెంతో ఆనందాన్ని పొందాను. మీకు ఈ వచనాలకి బదులు ఇవ్వలేను. దేవరాజు ఇంద్రుడు ఎవరిని తలుస్తాడో వానికన్న ఈ లోకంలో ధన్యుడు లేడు. మీ అనుగ్రహాన్ని, అర్జునుని వంటి సోదరుని పొంది, ఇంద్రునిజ్ఞాపకాలలో ఉన్నవానికంటె సౌభాగ్యవంతుడు లోకాన లేడుకదా! మీరు తీర్థయాత్రని సాగించమని పలికారు. మా పురోహితులు ధౌమ్యుల కారణంగా ఇంతకు పూర్వమే నేను దానిని ఆలోచించాను. మీరు ఏ సమయాన ఆదేశిస్తారో ఆ సమయంలో తీర్థయాత్రను సాగిస్తాను. ఇదే నా నిశ్చయం.' తీర్థయాత్రలకు సంకల్పించిన పాండుపుత్రునితో లోమశుడు అన్నాడు - 'మీరు శీఘ్రంగా పరివారాన్ని తగ్గించండి. అప్పుడు తీర్థయాత్రలు సులభం.' యుధిష్ఠిరుడు పలికాడు. 'భిక్షాటన ద్వారా జీవించే బ్రాహ్మణులు, యతులు, ఆకలిదప్పులు, అలసట, మార్గాయాసంగలవారు, చలిబాధను తట్టుకోలేని వారు వెనుకకు మరలండి. ఎవరు మృష్టాన్నాన్ని తింటారో, పక్వాన్నాలు ఆశిస్తారో, మాంసభోజనులో వారందరు వెనుకకు తిరగండి. ఎవరు వంటింటి అవసరం కలవారో, ఎవరెవరికి భోజనవ్యవస్థ ప్రత్యేకంగా నాచే చేయబడిందో వారు కూడ మరలండి. రాజభక్తితో ఎవరు నన్ను ఇప్పుడు అనుసరిస్తున్నారో, వారు ధృతరాష్ట్రమహారాజు సమీపానికి చేరండి. ఆ రాజే కాలోచితాలయిన వృత్తులను ఏర్పరుస్తాడు. ధృతరాష్ట్రుడు అలా చేయకపోతే పాంచాలరాజు ద్రుపదుడు మీకందరకు తగిన జీతభత్యాలు ఏర్పాటు చేస్తాడు.' అప్పటికి అప్పుడు నాగరికులు, బ్రాహ్మణులు, యతులు మానసిక దుఃఖపీడితులై హస్తినాపురానికి బయలుదేరారు. అంబికానందనుడైన ధృతరాష్ట్రుడు ప్రేమతో వారందరిని తనవారిగా చేసికొని, ధనాన్ని కూడ ఇచ్చి తృప్తిపరచాడు. ధర్మరాజు కొంతమంది బ్రాహ్మణులు, లోమశమహర్షి సోదరులు, భార్యతో కలిసి మూడురాత్రులు ఆనందంతో కామ్యకవనంలోనే నివసించాడు.

93. ఋషులకు నమస్కరించి పాండవులు తీర్థయాత్రకు వెడలుట.

తీర్థయాత్రలకు బయలుదేరిన ధర్మజుని కామ్యకవనవాసులైన బ్రాహ్మణులు అందరు సమీపించి ఈ విధంగా పలికారు. 'రాజా! సోదరులతో లోమశమహర్షితో కలిసి తీర్థయాత్రలకు వెళ్ళ నిశ్చయించావు. మహారాజా! మమ్ములను కూడ నీతో తీసికొని పొమ్ము. నీవు లేకుండా ఆ తీర్థాలకు మేము వెళ్ళలేము. రాజా! ఆ తీర్థాలన్నీ క్రూరమృగాలతో నిండి

ఉన్నాయి. దుర్గమాలు, కరినాలు అయిన ఆ తీర్థాలు సామాన్యులు ప్రవేశింప వీలులేనివి. నీసోదరులు పరాక్రమవంతులు, ధనుర్ధారులు. వారిచే రక్షింపబడే మేము మీతో యాత్ర చేయదలచాం. రాజా! నీ అనుగ్రహంతో మేము తీర్థయాత్రల, వనవాసాల ఫలితాన్ని సులభంగా పొందుతాము. మీబలపరాక్రమాలచే రక్షింపబడే ఆ తీర్థాల్లో స్నానం చేసి, పరిశుద్ధులమై ఆ తీర్థ సందర్శనాదులచే పాపం పోగొట్టుకొంటాం. నీవు ఆ తీర్థాల్లో స్నానం ఆచరించి కార్తవీర్యార్జునుడు, భరతచక్రవర్తి, అష్టకుడు, లోమపాదుడు చేరిన లోకాలకు వెళ్ళగలవు. ప్రభాసాది తీర్థాలు, మహేంద్రాది పర్వతాలు, గంగాదినదులు, జువ్వి మొదలయిన చెట్లు ఉన్న ప్రదేశాలను నీతో తిరిగి మేము కూడ చూస్తాం. బ్రాహ్మణులపై మీకు ప్రేమ ఉంటే మామాటలను తిరస్కరించవద్దు. దీనివలన మాకు శుభం కలుగుతుంది. తపస్సులకు విఘ్నం కల్గించే రాక్షసులు అనేకులు తీర్థాలు ఆశ్రయించి ఉన్నారు. వారి నుంచి నీవు మమ్ములను రక్షింపగలవు. నీవు పాపరహితుడవై ధౌమ్యముని, బుద్ధిశాలి నారదుడు, లోమశుడు చెప్పినతీర్థాలను సేవించి లోమశుని కారణంగా ఆ తీర్థాల్లో పవిత్రుడవై మాతో కలిసి ఆ తీర్థాల్లో సంచరించు.'

యుధిష్ఠిరుడు సోదరులతో పరివేష్టితుడై వారి మాటలు విన్నవెంటనే ఆనందాశ్రువులను చిందించాడు. లోమశ, ధౌమ్యుల ఆజ్ఞను గైకొని 'బాగుంది' అని వారి మాటలను ప్రశంసించి వారిని తనతో కొనిపోవుటకు అంగీకరించాడు. తరువాత సోదరులతో, భార్యతో కలిసి వెళ్ళుటకు పాండవశ్రేష్ఠ డైన ధర్మరాజు నిశ్చయించాడు. ఇంతలో వేదవ్యాసుడు, పర్వతనారదులు కామ్యకంలో ఉన్న ధర్మజుని చూడాలని వచ్చారు. వారికి యథావిధిగా ధర్మరాజు పూజ చేశాడు. సత్కారాన్ని పొంది వారు ధర్మజునితో ఇలా పలికారు. 'ధర్మజభీమనకులసహదేవులారా! మీరు తీర్థయాత్ర విషయాన మనస్సును పరిశుద్ధంగా ఉంచుకోండి. మనస్సు పరిశుద్ధం అయినప్పుడే తీర్థయాత్రలు చేయాలి. బ్రాహ్మణులు శరీరం పరిశుద్ధం అయితే మానుషవ్రతం అని, మనస్సు పరిశుద్ధం అయితే దైవవ్రతం అని చెప్తారు. రాజా! మనస్సు రాగద్వేషాలకు దూరమైనప్పుడు అది శుద్ధమవుతుంది. ప్రాణు లన్నింటిపట్ల మైత్రీభావంతో శుద్ధంగా ఉండి, తీర్థయాత్రలు చేయాలి. మీరు ఇంతవరకు శరీరంతో శుద్ధులు అయి మానుషవ్రతం చేశారు. ఇకపై దైవవ్రతాన్ని ఆశ్రయించి మనస్సును పరిశుద్ధం చేసుకొని తీర్థయాత్రలు ఆచరించి తగిన ఫలాన్ని పొందండి.' వారందరు అట్లే అని సమ్మతించి ఆ నియమాలను పాలించటానికి అంగీకరించారు. పిమ్మట దివ్యులు, మానవులు అయిన ఋషులందరు స్వస్తివాక్యాలతో వారిని ఆశీర్వదించారు. వ్యాస, లోమశ, పర్వత, నారదులపాదాలకు నమస్కరించి బ్రాహ్మణులు, లోమశుడు,

పురోహితుడు ధౌమ్యుడు వెంటరాగా తీర్థయాత్రలకు బయలుదేరారు. మార్గశీర్షశుద్ధపూర్ణిమ గడచి పుష్యనక్షత్రోదయం అయిన పిదప వారు యాత్రను ప్రారంభించారు. పాండవులు నారచీరలనూ, మృగ, చర్మాలను ధరించారు. వారి తలలపై జటలున్నాయి. అభేద్య కవచాలను ధరించి, సూర్యుడిచ్చిన వంటపాత్రను తీసికొని తీర్థయాత్రకు బయలు దేరారు. ఇంద్రసేనాది భృత్యులు, పదిహేను రథాలూ వెంట రాసాగాయి. వంట ఇంటి బాధ్యతగల సేవకులు కూడ అనుసరించారు. జనమేజయా! సాయుధులు, ఖడ్గధారులు, అమ్ములపొదులతో బాణసంపత్తి కలవారు, వీరులు అయిన పాండవులు తూర్పుదిక్కుగా యాత్రను ఆరంభించారు.

94. రాజులదృష్టాంతాలతో లోమశుడు యుధిష్ఠిరునికి తీర్థయాత్ర, అధర్మహానులను వివరించుట.

యుధిష్ఠిరుడు పలికాడు. "లోమశమహర్షీ! నాకు తెలిసినంతవరకు నేను సాత్త్వికగుణహీనుణ్ణి కాను. అయినా దుఃఖపరంపరను పొందాను. నావలె ఇలాంటి దుఃఖాలు పొందినవారు ఇతరులు రాజులెవరూ ఉండరేమో? లోమశా! శత్రువులైన దుర్యోధనాదులు సాత్త్వికగుణహీను లని ఎఱుగుదును. ధర్మపరాయణులు కూడ కారు. అలాంటప్పుడు ఉత్తరోత్తరాభివృద్ధిని వారెలా పొందారు." లోమశు డిలా అన్నాడు. "అధర్మమందు ఆసక్తి కల్గి, ఆ అధర్మకారణంగా నీ శత్రువులు వృద్ధిని పొందితే, వారిని గురించి దుఃఖించవలసిన అవసరం నీకు లేదు. నరుడు ముందుగా అధర్మంచేత వృద్ధిని పొంది, శుభాలను పొంది, శత్రువిజయం సాధించిన తరువాత సమూలంగా నశిస్తాడు. రాజా! "దైత్యదానవులు అధర్మంగా నడచుకొని వృద్ధిని పొంది చివరకు నశించారు." నేను ప్రత్యక్షంగా చూశాను. పూర్వం దేవయుగంలో నాకళ్ళతో చూసిన విషయాలను వివరిస్తాను . దేవతలు ధర్మంపట్ల ఆసక్తి కలిగి, దానవులు అధర్మంపట్ల ఆసక్తి కలిగి మెలిగారు. దేవతలు స్నానార్థం తీర్థాల నాశ్రయించారు. రాక్షసులు తీర్థాలవైపు చూడనుకూడ చూడలేదు. అధర్మం కారణంగా రాక్షసులలో గర్వం వృద్ధి చెందింది. గర్వం వలన అహంకారం, అహంకారం వలన క్రోధం ఏర్పడి, క్రోధం వలన నిర్లజ్జ, నిర్లజ్జవలన సదాచారహీనత వారిలో కలిగాయి.

కౌంతేయా! సిగ్గు, సంకోచం, సదాచారం, మంచి నడవడిక లేని రాక్షసులను ఓర్పు, లక్ష్మి స్వధర్మం విడచిపోయాయి. లక్ష్మి దేవతలను చేరింది. అలక్ష్మి(జ్యేష్ఠాదేవి) రాక్షసులను చేరింది. అలక్ష్మి ప్రవేశిస్తే వారిలో గర్వం, దురహంకారం పెరిగిపోయాయి. అదే సమయాన దైత్యదానవుల్లో కలి ప్రవేశించాడు. దానవులు అలక్ష్మి చేరటంతో, కలి ప్రభావంచే, దురహంకారంతో సత్కర్మలను చేయలేక వివేకరహితులై ఉన్మత్తులు అయ్యారు.

అప్పుడే వారి వినాశం జరిగింది. యశోహీనులై దైత్యులు నశించారు. ధర్మశీలురై దేవతలు సముద్ర, ఆశ్రమ, నదీ, సరోవరతీర్థయాత్రలను సేవించారు. ఆ ప్రదేశాల్లో వారు తపస్సు, యజ్ఞాలు, దానాలు చేయటంచేత మహాత్ముల ఆశీర్వాదంతో పాపాలనుంచి విముక్తులయి శుభాల్లో భాగస్వాములు అయ్యారు. ఉత్తమనియమాలతో దేవతలు తీర్థయాత్రలు సాగించి ప్రతిగ్రహణ లేకుండా తీర్థసంచారం చేశారు. ఉత్తమైశ్వర్యాదులను పొందారు. ధర్మాన్ని అనుసరించి రాజులు పరిపాలన సాగిస్తే, వారి రాజ్యం అభివృద్ధి చెంది శత్రువులు నశిస్తారు. కావున ఈవిధంగా సోదరులతో తీర్థయాత్రల్లో స్నానాలు ఆచరించి నీవు పోయిన రాజ్యలక్ష్మిని తిరిగి పొందుతావు. రాజేంద్రా! ఇదియే అత్యుత్తమమయిన సనాతన మార్గం. నృగమహారాజు, ఉశీనరపుత్రుడు శిబి, భగీరథుడు, గయుడు, పూరుడు, పురూరవుడు, వసుమనుడు తపస్సును ఆచరిస్తూ తీర్థయాత్రలను సాగించి మహాత్ముల దర్శనం చేసి, పవిత్రులయి కీర్తి, గొప్పధనం సంపాదించారు. రాజేంద్రా! అలాగే నీవు కూడ తీర్థయాత్రలచే పొందిన పుణ్యం కారణంగా అధికసంపదలు పొందుతావు. పుత్రబంధుసేవకసహితు డైన ఇక్ష్వాకుమహారాజు, ముచుకుందుడు, మాంధాత, మరుత్తుడు పుణ్యకీర్తులను ఆర్జించి దేవతల, దేవర్షుల అనుగ్రహంతో కీర్తి, ఐశ్వర్యం సంపాదించారు. అదేవిధంగా నీవు కూడ కీర్తిప్రతిష్ఠలను, ధనాన్ని సాధిస్తావు. ధృతరాష్ట్రుని పుత్రులు దుర్యోధనాదులు పాపమోహవశులై దైత్యులవలె నశిస్తారు. ఇందులో ఏవిధమైన సందేహం లేదు."

95. పాండవులు నైమిశారణ్యాది తీర్థాలు తిరుగుచు గయుని యజ్ఞాల మహిమ వినుట.

ఈ విధంగా ఆ పాండవవీరులు వేర్వేరుస్థానాల్లో నివసిస్తూ క్రమంగా నైమిశారణ్య తీర్థం చేరారు. తరువాత గోమతీనదీ తీర్థంలో స్నానం చేసి పాండవులు గోదానాలు, ధనదానాలు ఆచరించారు. అక్కడ దేవతలను, పితరులను, చాలాసార్లు తృప్తిపరచి **కన్యాతీర్థం, అశ్వతీర్థం, కాలకోటి, గోతీర్థం, వృషప్రస్థగిరి తీర్థాల్లో** నివసించి వారందరు బాహుదానదిలో స్నానం చేశారు. తరువాత దేవతల యజ్ఞభూమి అయిన ప్రయాగను చేరి గంగా యమునల సంగమాన మునిగారు. ధర్మజుడు అక్కడ స్నానం చేసి కొన్నిరోజులు గొప్పతపస్సు చేశాడు. పాపవిముక్తులై వారు బ్రాహ్మణులకు త్రివేణీ సంగమాన ధనాన్ని ఇచ్చారు. పాండవులు బ్రాహ్మణులతో కలిసి తాపససేవితమయిన బ్రహ్మవేదిని చేరాడు. గొప్ప తపస్సులను ఆచరిస్తూ ఆ వీరు లక్కడ కొంతకాలం ఉన్నారు. వారు కందమూలఫలాలు తింటూ, వనంలో లభించే హవిస్సుల ద్వారా బ్రాహ్మణులకు తృప్తిని కల్పించారు.

ప్రయాగనుంచి ధర్మరాజు రాజర్షి అయిన గయుని యజ్ఞాలచే పరిశుద్ధ మయిన ఉత్తమపర్వత ప్రాంతం **గయా తీర్థం** చేరారు. అక్కడ గయశిరమనే పర్వతం, నీటి ప్రబ్బలిచెట్లుతో శోభిస్తూ పవిత్రం, రమణీయం అయిన మహానది ఉన్నది. దాని తటాలు ఇసుక తిన్నెలతో అందగించి ఉంటాయి. దివ్యం, పవిత్రశిఖరసహితం, మహర్షిసేవితం అయిన వేరొకపర్వతం అక్కడనే ఉంది. అది పుణ్యదాయకమయిన తీర్థం. అక్కడే **బ్రహ్మసరోవరం** ఒకటి ఉంది. అగస్త్యమహర్షి యముని కలియటానికి అక్కడికే వెళ్లాడు. రాజా! ప్రాచీనుడైన యమధర్మరాజు ఆ ప్రదేశాన నివసించాడు. నదులన్నింటి ఆవిర్భావం అక్కడే. పినాకపాణి శంకరుడు నిత్యం ఆ తీర్థాన సన్నిహితుడై ఉంటాడు. చాతుర్మాస్యవ్రతాలు గ్రహించిన పాండవులు ఋషియజ్ఞ, వేదశాస్త్ర, స్వాధ్యాయాలతో ఆయన్ని పూజించారు. అది **అక్షయవటమనే** గొప్పతీర్థం. దేవతల యజ్ఞభూమి అక్షయవటంలో ఆచరించిన సత్కర్మలు అక్షయఫలాల్ని ఇస్తాయి. చలనం లేని చిత్తంతో వారందరు అక్కడ ఉపవాసాది దీక్షలను చేపట్టారు. అదే సమయాన వందల కొద్దీ బ్రాహ్మణులు ఆ తీర్థానికి ఏతెంచారు. శాస్త్రోక్త విధివిధానంతో వారు చాతుర్మాస్యాన్ని ఆచరించారు. అక్కడకు వచ్చిన వారందరు విద్య, తపస్సుల్లో ఆరితేరినవారు. వేదాల్లో పారంగతులు. వారందరు సభలో కూర్చుండి మహాత్ముల కథలను వినిపింపసాగారు. వారిలో శమరుడు అనే విద్వాంసుడు ఉన్నాడు. అప్పుడే విద్యను పూర్తిచేసి స్నాతకుడు అయ్యాడు. అతడు జీవితకాల పర్యంతం బ్రహ్మచర్యాన్ని నియమంగా స్వీకరించాడు. శమరుడు గయుని కథను ఇలా వినిపించాడు.

'రాజశ్రేష్ఠుడు, అమూర్తరయసుని పుత్రుడు గయుడు. అతడు చేసిన పుణ్యకర్మలను వివరిస్తాను. ఓపికతో విను. రాజా! గయుడు గొప్ప ప్రసిద్ధిగల యజ్ఞాన్ని ఆచరించాడు. ఆ యజ్ఞంలో వచ్చినవారికి చాల అన్నం, ధనం సమకూర్చాడు. అసంఖ్యాక దక్షిణలు ఇచ్చాడు. అన్న పర్వతాలు వందలకొద్దీ, వేలకొద్దీ ఉపయోగించారు. నెయ్యి, పెరుగుల కుండాలు, నదులు ప్రవహించాయి. వేలకొద్దీ శాకపాకాల ప్రవాహాలు కూడ కనిపించాయి. రాజా! ప్రతిదినం యాచకులకు ఈ ప్రకారంగా అన్నదానం, ధనదానం చేయబడింది. చాలమంది బ్రాహ్మణులు రుచిగా తయారైన అక్కడి అన్నాన్ని తృప్తిగా తిన్నారు. భారతా! ఆ యజ్ఞంలో దక్షిణాప్రదాన సమయంలో బ్రహ్మఘోష(వేదధ్వని) స్వర్గందాకా వినపడింది. ఆ వేదధ్వనులలో వేరొకధ్వని వినపడలేదు. అక్కడ అన్నివైపుల వ్యాపించిన పవిత్రశబ్దాలతో భూమి, దిక్కులు, ఆకాశం, స్వర్గం కూడ మారుమ్రోగాయి. ఇది చాల ఆశ్చర్యకరమైన విషయం. ఆ యజ్ఞాన్ని గురించి అందరు ఇలా చెప్పుకొన్నారు. ఈ యజ్ఞంలో దేశదేశాలలోని తేజోవంతులు అన్నపానాదులతో తృప్తిని చెందారు. గయుని యజ్ఞంలో ఎవరైనా సరే

భోజనం చేయాలి అని భావించారు. తినగా మిగిలిన అన్న పర్వతాలు ఆ యజ్ఞంలో ఇరువది అయిదు. తేజస్సంపన్నుడైన గయుడు ఆ యజ్ఞంలో ఉపయోగించిన ద్రవ్యరాశి ఇంతవరకు ఎవ్వరూ వాడలేదు. భవిష్యత్తులో ఉపయోగించలేరు. ఇది అసంభవం. గయుడు దేవతలను అందరినీ హవిస్సులతో గొప్పగా తృప్తిపరచాడు. దాని కారణంగా వారు ఇతరులు ఇచ్చిన హవిస్సులను గ్రహించలేకపోయారు. లోకంలో ఇసుకరేణువులను లెక్కించలేనట్లు, తారకలను గణించలేనట్లు, వర్షధారలను గమనించలేని రీతిగా గయుని యజ్ఞంలో ఇవ్వబడిన దక్షిణలు లెక్కించటం అసాధ్యం. కురునందనా! బ్రహ్మసరోవరతీరంలో గయుని ఎన్నో యజ్ఞాలు ఈ విధంగా సుసంపన్నం అయ్యాయి.'

96. వాతాపి, ఇల్వలుల చరిత్ర, అగస్త్యుని వివాహవృత్తాంతము.

యుధిష్ఠిరుడు గయాక్షేత్రం నుంచి బయలుదేరి అగస్త్యాశ్రమాన్ని చేరి దుర్జయమణీమతీ నగరాన నివసించసాగాడు. యుధిష్ఠిరుడు లోమశుని ప్రశ్నించాడు – 'అగస్త్యమహర్షి ఈ ప్రదేశాన వాతాపిని ఎట్లు నశింపచేశాడు? మనుజుల్ని నాశనంచేయగల ఆ రాక్షసుని ప్రభావం ఎలాంటిది? మహాత్ముడైన అగస్త్యుని హృదయంలో అతనిపై ఎందుకు కోపం కలిగింది ?' లోమశుడు చెప్పాడు. 'మణిమతీనగరాన పూర్వకాలంలో ఇల్వలు డనే దైత్యరాజు ఉండేవాడు. అతని చిన్నసోదరుడే వాతాపి. ఒకరోజున ఇల్వలుడు ఒక తాపసబ్రాహ్మణుని అడిగాడు – 'మీరు నాకు ఇంద్రసమానుడైన పుత్రుని అనుగ్రహించండి.' వెంటనే ఆ విప్రుడు అతనికి ఇంద్రసమానుడు అయిన పుత్రుని ఇవ్వలేదు. ఈ కారణంగా ఆ రాక్షసునికి ఆ బ్రాహ్మణునిపై కోపం కలిగింది. అప్పటినుంచి క్రోధపూర్ణుడై ఇల్వలుడు బ్రాహ్మణుల్ని నాశనం చేయసాగాడు. అతడు మాయతో తనసోదరుని మేకలా చేసేవాడు. వాతాపికి స్వేచ్ఛానుసారం రూపాల్ని ధరించగల సామర్థ్యం ఉండేది. క్షణకాలంలో అతనికి మేక, గొట్టె మొదలగు రూపాలు వచ్చేవి. ఆ జంతువుగా మారిన వాతాపిని చంపి, వండి, ఆ బ్రాహ్మణునికి ఇల్వలుడు తినిపించేవాడు. ఆ పై బ్రాహ్మణుల్ని చంపడానికి ప్రయత్నం చేస్తూ ఉండేవాడు. ఇల్వలుడు యమలోకానికి పోతున్న వానిని ఆ పేరుతో పిలిస్తే వాడు తిరిగి బ్రతికి వచ్చేవాడు. ఆ రోజున వాతాపిని మేకగా చేసి, ఇల్వలుడు ఆ మాంసాన్ని వండి ఆ బ్రాహ్మణునికి తినిపించి తిరిగి వాతాపీ! అని పిలిచేవాడు. మాయావి ఇల్వలునిచే ఉచ్చైఃస్వరంతో పిలిచిన పిలుపుకు వాతాపి తిరిగి ఆ తిన్న బ్రాహ్మణుని పొట్ట చీల్చుకుని నవ్వుతూ బయటకు వచ్చేవాడు. ఈ విధంగా బ్రాహ్మణుల్ని చంపి తిరిగి వండుకుని ఇద్దరూ ఆరగించేవారు.

ఈ రోజుల్లో పూజ్యుడు అగస్త్యుడు ఉత్తరగతులు లేక గోతిలో అధోముఖంగా వ్రేలాడే తన పితరుల్ని చూశాడు. అలాంటి పితరులను అగస్త్యుడు ఇలా ప్రశ్నించాడు. 'మీరు ఇక్కడ అధోముఖంగా వ్రేలాడటానికి కారణం ఏమిటి?' ఈ ప్రశ్నకు పితరులు ఇలా బదులు పలికారు. "సంతానం కొనసాగకపోవడంవలన మాకీ దుర్గతి పట్టింది మేము మీ పితృదేవతలం. నీకు సంతానం లేని కారణంగా ఇలా వ్రేలాడుతున్నాం. నీవు మాకొరకు వివాహమాడి సత్సంతానాన్ని పొందితే మాకీ దుర్గతి నశిస్తుంది. నీవూ దీనివలన సద్గతి పొందగలవు." తేజస్వి అగస్త్యుడు వారితో ఇలా పలికాడు - 'మీకోరికను నేను తీర్చగలను. మీ మానసిక వ్యథ తొలగు గాక!' పిమ్మట అగస్త్యుడు సంతానాభిలాషియై తనకు తగిన పుత్రుల్ని గర్భధారణ చేయగల పత్నికోసం వెదకసాగాడు. కాని అతనికి అలాంటి యోగ్యురాలు కనపడలేదు. అప్పుడు అగస్త్యమహర్షి ఒక్కొక్క ప్రాణియొక్క ఉత్తమ అవయవాలన్నింటిని ఒకచోటికి చేర్చి వాటితో ఒక సుందరమైన స్త్రీని తయారుచేశాడు. అదేసమయాన విదర్భరాజు పుత్రులకోసం తపస్సు చేస్తూ ఉంటే అగస్త్యుడు తను నిర్మించిన స్త్రీని అతనికి సమర్పించాడు. ఆ సుందరకన్య విదర్భరాజగృహంలో మెరుపులా ఆవిర్భవించింది. ఆమె దివ్యశరీరంతో ప్రకాశిస్తోంది. ఆమెముఖం చాల అందంగా ఉంది. ఆ కన్య ఆ అంతఃపురంలో దినదిన ప్రవర్ధమానం అవుతోంది. విదర్భరాజు ఆమె జనన విషయాన్ని బ్రాహ్మణు లందరికీ శుభవార్తగా వినిపించి, ఆనందించాడు. ఆ సమయాన రాజును వారు అందరు అభినందించి, ఆ కన్యకు లోపాముద్ర అని నామకరణం చేశారు. ఉత్తమ సౌందర్యరాశి ఆ లోపాముద్ర నీటిలోని తామరతీగలా యజ్ఞవేదిలో వెలిగే అగ్నిశిఖలా శీఘ్రంగా పెరగసాగింది. యౌవనంలో ప్రవేశించిన ఆమెను వస్త్రభూషణాలంకారాలు గల వందమంది స్త్రీలు దాసీలు స్వయంగా ఆమె చుట్టూ తిరుగుతూ, అలంకరిస్తూ సేవలు చేయసాగారు. దాసీల, కన్యల నడుమ ప్రకాశించే ఆ కన్య ఆకాశంలోని సూర్యకాంతివలె, నక్షత్రాల్లో రోహిణివలె వెలిగిపోతోంది. అగస్త్యునిమీద భయంతో యౌవనదశలో ఉండి సదాచారశీలాలు గల ఆ స్త్రీని ఎవరూ వరించ సాహసించలేదు. ఆ రాజకుమారి సౌందర్యంలో అప్సరసల్ని మించి ఉంది. శీల, స్వభావాదులచే తల్లిదండ్రుల్ని, బంధువుల్ని సంతృప్తిపరుస్తోంది. అలా ఉంటున్న వైదర్భి (లోపాముద్రను)ని చూసి తండ్రి "ఈమెను ఎవరికి ఇయ్యాలి?" అని మనసులో ఆలోచించాడు.

97. అగస్త్యుడు లోపాముద్రను వివాహమాడి ధనసంగ్రహణము చేయగోరుట.

లోమశుడు చెప్పాడు. "అగస్త్యుడు లోపాముద్రను తన సంసారాన్ని నడిపించగల

గృహిణిగా భావించి రాజసమీపానికి పోయి ఇలా పలికాడు. "పుత్రోత్పత్తి కారణంగా నాకు వివాహంపై కోరిక కలిగింది. మీపెంపకంలో ఉన్న కన్యకను వివాహమాడతాను. మీరు లోపాముద్రను నాకు సమర్పించండి". అగస్త్యుని మాటలు విన్న విదర్భరాజు చైతన్యం కోల్పోయి ఆ మాటల్ని అంగీకరించలేకపోయాడు, తిరస్కరించ లేకపోయాడు కూడ. అప్పుడు విదర్భరాజు తనభార్య వద్దకు పోయి పలికాడు – 'ప్రియా! మహర్షి అగస్త్యుడు తపశ్శక్తి సంపన్నుడు. కోపిస్తే శాపాగ్నిలో మనలను అందరినీ భస్మం చేస్తాడు.' భార్యతో కలిసి విలపిస్తున్న తండ్రి సమీపానికి లోపాముద్ర చేరి సమయానికి తగినట్లు ఇలా పలికింది. 'మీరు నాకొరకు దుఃఖం అనుభవింపవలదు. తండ్రీ! మీరు నన్ను అగస్త్యమహర్షికి అప్పగించండి. నాద్వారా మీకు రక్షణ దొరకుతుంది.' పుత్రికవచనాలు విన్న విదర్భరాజు మహాత్ముడు అగస్త్యునికి శాస్త్రవిధిని అనుసరించి లోపాముద్రను కన్యాదానం చేశాడు. లోపాముద్రను భార్యగా పొందిన అగస్త్యుడు విదర్భరాజకుమార్తెతో ఇలా పలికాడు – 'నీ విలువైన వస్త్రాల్ని, ఆభరణాల్ని శరీరం నుంచి తొలగించుకో.' పిమ్మట ఆమె అరటిబోదెలవంటి తొడలు, విశాలనేత్రాలు గల తనశరీరం నుంచి విలువైన వస్త్రాల్ని, ఆభరణాల్ని తొలగించి వాటికి మారుగా నారబట్టలు, మృగచర్మాలు ధరించి భర్తతో సమానంగా వ్రతాచారాలు పాటించసాగింది. ఋషిశ్రేష్ఠుడు అగస్త్యుడు తనకు అన్నివిధాలా అనుకూలవతియైన భార్యను గ్రహించి, గంగాతీరానికి వచ్చి ఘోరతపస్సులో మునిగిపోయాడు. లోపాముద్ర మిక్కిలి ప్రసన్నతతో, ఆదరంతో భర్తను సేవించసాగింది. శక్తిసంపన్నుడైన అగస్త్యమహర్షి తనభార్యపై ప్రేమను పెంచుకోసాగాడు.

ఈ రీతిగా చాలారోజులు గడచాయి. ఒకనాడు ఋతుస్నాత అయిన లోపాముద్రను అగస్త్యమహర్షి చూశాడు. ఆమె తపస్సుతో ప్రకాశిస్తోంది. ఆ మహర్షి తనభార్య సేవ, పవిత్రత, ఇంద్రియసంయమనం, కాంతి, రూప, సౌందర్యాలతో ప్రసన్నుడై మైథునానికై ఆమెను ఆహ్వానించాడు. లోపాముద్ర సిగ్గుపడుతూ చేతులు జోడించి ప్రేమభావంతో మహర్షిని ఇలా పలికింది. 'నిస్సంశయంగా భర్త సంతానార్థం తనభార్యను చేరుట లోకాచారం. కాని మీపట్ల నామనస్సులో ఎలాంటి స్నేహభావం ఉందో దానికి తగినట్లు మీరు సఫలం చెయ్యాలి. నేను నాతండ్రి ఇంట రాజమందిర శయ్యలలో నిద్రించాను. అట్టి శయ్యపై మీరు నాతో సంగమించండి. స్వామీ! మీరు సుందరహారాలు, అలంకారాలు, భూషణాలు ధరించండి. నేను వాటిని అన్నిటిని ధరిస్తాను. అప్పుడు స్వేచ్ఛానుసారం సమాగమసుఖాన్ని పొందండి. ఇది నా అభీష్టం. అలా కాక నేను చిరిగిన కాషాయవస్త్రాలతో మీసంగమసుఖాన్ని ఆశించను. తాపసుల ఈ ఆభరణాలు సంభోగాదులవలన మలినమగుట

నాకిష్టంలేదు.' అగస్త్యుడు పలికాడు. 'నీతండ్రి రాజమందిరంలో ఎట్టి ధనవైభవం ఉందో అట్టి వైభవం నాఇంట అనగానే లేదు. నీవద్దలేదు.' లోపాముద్ర అన్నది. 'ఈ ప్రాణిలోకాన ఎంతధనరాశి, ఆభరణాలు ఉన్నాయో వాటిని మీరు క్షణకాలంలో మీతపస్సుచే ఆ ధనరాశుల్ని ప్రోగుచేస్తారు.' అగస్త్యుడు అన్నాడు. 'నీవు పలికింది అక్షరాలా నిజం. కాని అలా ఆచరిస్తే తపస్సు వ్యర్థం అవుతుంది. నీకు తెలిసిన నాతపస్సు నశించకుండ ధనాన్ని ప్రోగుచేసే ఉపాయాన్ని వివరించు.' 'నా ఋతుసమయం కొంచెమే మిగిలి ఉంది. నేను చెప్పినవిధంగానే నేను మీతో ఆభరణాలు, వస్త్రాలు మొదలైనవి కలిగిన దశలోనే సంగమానికి ఇష్టపడతాను. ఏవిధంగాను మీ ధర్మలోపానికి నేను ఇష్టపడను. ఈ ప్రకారంగా మీరు మీధర్మాన్ని, తపస్సును రక్షించుకుంటూనే ఏ రకంగా సాధ్యమవుతుందో అలా నా కోరికను తీర్చండి.' అగస్త్యుడు వెంటనే "నీ బుద్ధికి అనుగుణంగా ఈ కోర్కె తీర్చుకొనుటకు నిశ్చయించావు. నేను ధనాన్ని తీసికొని రావడానికి వెడతాను. నీవు ఇక్కడే ఉండి స్వేచ్ఛానుసారం ధర్మాచరణం చెయ్యి." అన్నాడు.

98. ధనప్రాప్తికై అగస్త్యుడు వివిధరాజుల వద్దకు వెళ్ళుట.

పిమ్మట ధనాన్ని అడగటానికి అగస్త్యుడు శ్రుతర్వుని సమీపానికి వెళ్ళాడు. ఆ రాజు అందరికంటె సంపన్నుడు. శ్రుతర్వుడు 'నావద్దకు అగస్త్యమహర్షి వస్తాడు' అని తెలిసి మంత్రులతో రాజ్యపు పొలిమేరకువచ్చి గొప్పగా గౌరవించి తనతో రాజ్యానికి తీసుకువచ్చాడు. శ్రుతర్వుడు అగస్త్యమహర్షికి అర్ఘ్యపాద్యాదులు సమర్పించి, వినయంతో చేతులు జోడించి, అతనికి రాకకు కారణం అడిగాడు. అగస్త్యుడు "నేను ధనార్థిని అయి మీవద్దకు వచ్చాను. ప్రాణిహింస చేయకుండా యథాశక్తిగా ఈయగల ధనాన్ని నాకు సమర్పించండి." శ్రుతర్వుడు అప్పుడు అగస్త్యమహర్షి ఎదుట తన ఆదాయవ్యయ పట్టికను ఉంచి పలికాడు - 'ఈ ధనంలో మీకు ఎంత తోస్తుందో అంత తీసుకోండి అని.' అగస్త్యుడు బుద్ధితో గ్రహించగలవాడు. ఆదాయవ్యయవిషయాన సమత్వాన్ని గుర్తించి ఇందు కొంతగ్రహించినా ఇతరులకు కష్టం కలుగుతుంది అని తెలిసికొన్నాడు.

అతడు శ్రుతర్వుని తీసుకొని రాజు బ్రధ్నశ్వుని వద్దకు చేరాడు. వారిద్దర్నీ రాజ్యసీమల్లోనే బ్రధ్నశ్వుడు యథావిధిగా సత్కరించి గౌరవించాడు. వారికి అర్ఘ్యపాద్యాదుల్ని నివేదించిన పిదప బ్రధ్నశ్వుడు వారి అనుజ్ఞ గైకొని రాకకు కారణం అడిగాడు. అగస్త్యుడు పలికాడు. 'ధనార్థులం అయి మేమిద్దరం మీవద్దకు వచ్చాం. ఇతరులకు నష్టంలేకుండా మీదగ్గర ఉన్న ధనాన్ని యథాశక్తి మాకు ఇవ్వండి.' పిమ్మట ఆదాయవ్యయాల్ని పూర్తిగా వారిద్దరికీ

నివేదించాడు బ్రధ్నశ్వుడు. "మీరు ఇరువురు దీనిలో ఎక్కువ అయిన ధనాన్ని గ్రహించండి" అన్నాడు. సమబుద్ధిగల అగస్త్యుడు ఆదాయవ్యయాలను చూచి ఎక్కువధనం లేదు అని అందులో కొంతగ్రహించినా ఇతరులకు కష్టం కలుగుతుంది అని గ్రహించాడు.

అప్పుడు అగస్త్యుడు, బ్రధ్నశ్వుడు, శ్రుతర్వుడు ముగ్గురూ కలిసి పురుకుత్సుని కుమారుడు త్రసదస్యుని చేరారు. భూపాలశ్రేష్ఠుడు అయిన త్రసదస్యువు వారి ముగ్గుర్ని యధావిధిగా సత్కరించి, రాజ్యసీమల్లో గౌరవించాడు. వారందరికీ స్వాగతసత్కారాలు పలికి వారి రాకలోని ఆంతర్యాన్ని అడిగాడు. అగస్త్యుడు చెప్పాడు- 'మేము ధనాన్నికోరి మీవద్దకు వచ్చాం. మీరు ఇతరులకు కష్టం కలుగకుండ మీధనంలో కొంతభాగాన్ని మాకు ఇవ్వండి.' త్రసదస్యువు తన ఆదాయవ్యయ వివరాల్ని పూర్తిగా వారికి సమర్పించాడు. 'దీన్ని తెలిసి మీరు మిగిలిన ధనాన్ని తీసుకోండి' అని పలికాడు. సమబుద్ధిగల అగస్త్యుడు ఆదాయవ్యయాల్ని పరిశీలించి సమానంగా ఉన్నాయి అని గ్రహించాడు. ఇందులోనుంచి ఏ కొంతగ్రహించినా దానిభారం ఇతరులపై పడుతుంది అని తెలుసుకొన్నాడు. వారందరు కలిసి ఒకరువేరొకరి వైపు చూస్తూ అగస్త్యమహర్షిని ఉద్దేశించి ఇలా పలికారు. 'మహర్షీ! ఇల్వలుడు అనే దానవుడు భూమిపై అందరికంటె ధనవంతుడు. మనము అందరం నేడు అతనివద్దకు పోయి కావలసిన ధనాన్ని అడుగుదాం.' ఆ సమయాన వారికి అందరికి ఇల్వలుని యాచించటమే ఉత్తమమని తోచింది. వారు అందరు శీఘ్రంగా ఇల్వలుని సమీపానికి వెళ్ళారు.

99. అగస్త్యుడు ఇల్వలుని, వాతాపిని శిక్షించుట, పరశురాముడు తిరిగి శక్తిమంతుడగుట.

ఇల్వలుడు రాజులతోడి అగస్త్యునిరాకను తెలిసి రాజ్యసరిహద్దుల్లో మంత్రులతో కలిసి, వారిని సమీపించి, పూజించాడు. ఆ సమయాన రాక్షసశ్రేష్ఠుడైన ఇల్వలుడు తనసోదరుడు వాతాపి మాంసాన్ని వండి సంస్కరించి వారికి ఆతిథ్యం చేశాడు. మేకగా మారిన రాక్షసుడు వాతాపి సంస్కరింపబడినట్లు చూచి ఆ రాజర్షులందరు దీనులు, అచేతనులు అయ్యారు. ఋషిశ్రేష్ఠుడు అగస్త్యుడు రాజర్షులతో అన్నాడు - 'మీరు చింతింపవలదు. నేనే ఈ రాక్షసుణ్ణి ఆరగిస్తాను.' అని పలికి ప్రధాన ఆసనంపై కూర్చుండి అగస్త్యుడు నవ్వుతూ వడ్డించే ఇల్వలుని చూస్తున్నాడు. అగస్త్యుడే వాతాపి శరీరమాంసాన్ని పూర్తిగా తిన్నాడు. భోజనమైన వెంటనే ఇల్వలుడు వాతాపిని నోరారా పిలువసాగాడు. అదే సమయాన అగస్త్యుని అధోరంధ్రం గుండా మేఘధ్వని వంటి అపానవాయువు

వెలువడింది. 'వాతాపీ!' 'బయటకురా!' అని చాలాసార్లు ఇల్వలుడు పిలిచాడు. మునిశ్రేష్ఠుడు అగస్త్యుడు నవ్వుతూ ఇల్వలునితో అన్నాడు. 'ఇకపై వాడు ఎక్కడినుంచి రాగలడు. ఆ రాక్షసుడు జీర్ణం అయిపోయాడు.' నశించిన వాతాపిని తెలిసికొని ఇల్వలుడు దీనుడయ్యాడు. మంత్రులతో సహా అంజలి ఘటించి అతడు ఇలా పలికాడు. 'మీరు వచ్చిన పని తెల్పండి. మీకు నేను ఏం చేయగలను.' అగస్త్యుడు నవ్వుతూ ఇల్వలునితో అన్నాడు. 'మేము నిన్ను శక్తిసంపన్నుడ వయిన శాసకుడవు అని తెలుసుకొన్నాం. ఈ రాజులు అంతా ధనికులు కారు. నాకు చాలాధనం కావలసిఉంది. ఇతరులకు కష్టం కలిగించనంతవరకు నీధనంలో కొంతభాగం మాకు ఇయ్యి.' ఇల్వలుడు అగస్త్యునికి నమస్కరించి పలికాడు. 'నేను మీకెంత ధనం ఇవ్వాలో అది తెలియపరిస్తే అంతా ఇస్తాను' అన్నాడు. అగస్త్యుడు పలికాడు. 'నీవు ఒక్కొక్కనికి పదివేల గోవులు, అంతే విలువగల బంగారం ఇవ్వనిశ్చయించావు. నాకు వీరికిచ్చు దానికంటె రెండురెట్లు గోవులు, బంగారు నాణాలు ఇవ్వాలని అనుకొన్నావు. దీనికి బదులుగా ఒక బంగారు రథం, రెండు మనోజవం కల గుఱ్ఱాలు ఇవ్వగోరుతున్నాను.'

(నీవు పలికింది సత్యం కాని నీవు ఏ రథాన్ని ప్రస్తావించావో ఆ రథాన్ని మేము బంగారుమయం అనుకోవడం లేదు. అని అగస్త్యునితో ఇల్వలుడు చెప్పాడు. అగస్త్యుడు అన్నాడు. 'నానోటినుంచి వెలువడిన వచనం ఇంతవరకు అసత్యం కాలేదు.)

ఆ రథాన్ని గురించి శీఘ్రంగా తెలుసుకో. అది నిశ్చయంగా బంగారురథమే. ఇల్వలునికి జాడ తెలిసిన తరువాత బంగారు రథం బయటకు వచ్చింది. అతని మనస్సులో సోదరుని మృత్యుకారణంగా ఏర్పడిన దుఃఖంతోనే చాలధనం మహర్షికి సమర్పించాడు. ఆ రథానికి విరావం, సురావం అను రెండు గుఱ్ఱాలు పూన్చబడ్డాయి. అవి ధనసహితంగా రాజుల్ని, అగస్త్యుని తీసికొని రెప్పపాటు కాలంలో అగస్త్యుని ఆశ్రమంవైపు దౌడు తీశాయి.

(అదేసమయంలో ఇల్వలుడు అగస్త్యుని వెనుకగా పరుగెత్తి చంప నిశ్చయించాడు. అగస్త్యమహర్షి ఇల్వలుని హుంకారమాత్రం చేతనే భస్మం కావించాడు. తరువాత వాయువేగం కల ఆ గుఱ్ఱాలు వారినందర్నీ అగస్త్యాశ్రమానికి చేర్చాయి.)

అగస్త్యుని ఆజ్ఞగైకొని వారందరు వారివారి రాజధానీనగరాలకు వెళ్ళారు. అగస్త్యమహర్షి లోపాముద్రాదేవి కోరికలన్నింటినీ ఆ ధనంతో తీర్చాడు.

అపుడు లోపాముద్ర అంది. 'నాకోరికలను అన్నింటినీ మీరు మీసామర్థ్యంతో తీర్చారు. నానుంచి శక్తిమంతుడు, తేజస్సంపన్నుడు అయిన కుమారుని పొందండి.' అగస్త్యుడు పలికాడు. 'నీ సదాచారవ్యవహారశీలాదులతో సంతుష్టుడను అయ్యాను. పుత్రుని గూర్చి నీ ఎదుట ఒకవిషయాన్ని ప్రస్తావిస్తాను. విను. నీగర్భం నుంచి వేయిమందిగాని, వందమందిగాని పుత్రులు పుడితే, వారు సమర్థులైన పదిమందితో సమానం. పదిమందిపుడితే

వందమందితో సమానం. ఒక్కపుత్రుడే అయితే అతడు వేయిమందిని జయించగలవాడు అవుతాడు. ఏదియో ఒకటి కోరుకో.' లోపాముద్ర పలికింది. 'వేయిమందితో సమానుడైన ఒక్కకుమారుడే నాకు చాలును. చాలమంది దుష్టులకంటె సద్గుణసంపన్నుడు ఒక్కడే ఉత్తముడు కదా!' అప్పుడు అగస్త్యుడు 'అలాగే' అని సరియైన సమయంలో భార్య అయిన లోపాముద్రతో కలిశాడు. గర్భాధానం తరువాత అగస్త్యుడు వనానికి తిరిగివెళ్ళాడు. ఆయన వనానికి వెళ్ళిన పిదప ఏడుసంవత్సరాలపాటు గర్భం పెరగసాగింది. ఏడుసంవత్సరాలు గడిచిపోయాక తేజస్సు, ప్రభావం అధికంగా కల గర్భస్థశిశువు బయటపడ్డాడు. అతడే దృఢస్యువు అనే పేరుతో ప్రసిద్ధిపొందాడు. అగస్త్యుని కుమారుడు తేజస్వియై పుట్టినప్పటినుంచి వేదాల్ని, వేదాంగాల్ని, ఉపనిషత్తుల్ని అన్నింటినీ అభ్యసించాడు. దృఢస్యువు బ్రాహ్మణులలో మిక్కిలి గౌరవింపతగినవాడు. ఆ దృఢస్యువు తండ్రి ఇంట్లో ఉంటూ బాల్యం నుంచి రోజూ సమిధలభారాన్ని తనపై ఉంచుకొని తీసుకువచ్చేవాడు. దాంతో అతనికి 'ఇధ్మవాహుడు' అనేపేరు స్థిరపడింది. సమిధానయనంలో, స్వాధ్యాయంలో లగ్నమైన కుమారుని చూచి అగస్త్యుడు ఎంతో సంతోషించాడు. ఈ ప్రకారంగా అగస్త్యుడు లోపాముద్రయందు సత్సంతానానికి కారణభూతుడు అయ్యాడు. అతని పితృదేవతలు సంతానం కలిగినకారణంగా మనోవాంఛితలోకాలకు చేరారు. అప్పటినుంచి ఈ ప్రదేశం అగస్త్యాశ్రమం అని పిలువబడుతూ ప్రసిద్ధిలోకి వచ్చింది. ప్రహ్లాదగోత్రజుడు వాతాపిని ఈవిధంగా అగస్త్యుడు తనతపోబలంతో శాంతపరచాడు. ఇది చాల అందమైన గుణాలతో ప్రకాశించే ఆశ్రమం.

దీనిని ఆనుకొని దేవతలచే పూజింపబడే భాగీరథీనది ఉంది. ఆకాశంలో వాయుప్రేరణచే రెపరెపలాడే తెల్లటి జెండావలె ఈ నది ప్రకాశిస్తోంది. ఈ నది క్రమంగా పర్వతాల చిన్నశిఖరాలపైనుంచి జారుతూ ఎల్లప్పుడు తీవ్రవేగంతో ప్రవహిస్తూ ఉంది. భయపడిన సర్పం బిలంలోకి ప్రవేశించినట్లు ఈ నది రాళ్ళపొరల్లోని సందుల్లోకి ప్రవేశిస్తూ ఉంది. ముందుగా శంకరుని జటాజూటంలో దిగిన సముద్రుని ప్రియురాలు, రాణి గంగాదేవి దక్షిణదిక్కును అంతటినీ తనజలాలతో తడిపివేస్తోంది. తనసంతానాన్ని తల్లి ఎలా స్నానం చేయిస్తుందో అలా ఆచరిస్తోంది. ఈ భాగీరథీనదిలో స్వేచ్ఛగా స్నానం చెయ్యి. యుధిష్ఠిరా! దీన్ని శ్రద్ధగా వినుము. ఇది మహర్షులచే ఆరాధింపబడే భృగుతీర్థం. ముల్లోకాల్లోను ప్రసిద్ధం. పరశురాముడు ఇక్కడ స్నానం చేసి తనపోయిన తేజస్సును తిరిగిపొందాడు. నీవు ఇక్కడ సోదరులతో, భార్యతో స్నానం చేసి, దుర్యోధనునిచే అపహరింపబడిన సంపదను తిరిగి పొందుతావు. రామునితో వైరం కారణంగా పోగొట్టుకొన్న తేజస్సును స్నానప్రభావంతో పరశురాముడు తిరిగిపొందాడు.' వైశంపాయనుడు చెప్పాడు.

యుధిష్ఠిరుడు భార్యతో, సోదరులతో కలిసి భృగుతీర్థంలో స్నానంచేసి దేవతలకు, పితరులకు తర్పణాలు వదిలాడు. ఆ తీర్థంలో స్నానం చేసిన వెంటనే యుధిష్ఠిరుడు మిక్కిలి తేజోవంతుడై ప్రకాశించసాగాడు. ఇప్పుడు అతడు శత్రువులకు లొంగనివాడు అయ్యాడు. అదే సమయంలో ధర్మరాజు లోమశుని అడిగాడు – 'పరశురాముని తేజస్సు ఏ కారణంగా నశించింది ? తిరిగి ఆ తేజాన్ని అతడు ఎలా పొందాడు? నాకు తెలియజెయ్యండి. మీరు దయతో ఈవృత్తాంతాన్ని వర్ణించండి.'

లోమశుడు చెప్పాడు. 'దశరధనందనుడు శ్రీరాముడు, భృగునందనుడు పరశురాముడు. వీరి చరిత్ర విను. ప్రాచీనకాలంలో దశరధమహారాజుకు సచ్చిదానందవిగ్రహుడు శ్రీమహావిష్ణువు పుత్రునిగా జన్మించాడు. అతని అవతారలక్ష్యం పాపాత్ముడైన రావణుని నాశనం చేయటం. అయోధ్యలో అవతరించిన శ్రీరాముని మేమందరం ప్రత్యక్షంగా దర్శించాం. దశరధనందనుని పరాక్రమం గురించి విని భృగు, ఋచీకవంశజుడు, రేణుకాదేవి కుమారుడు పరశురాముడు అతనిని చూడటానికి ఉత్సుకతతో వచ్చి క్షత్రియుల్ని సంహరింపగల దివ్యధనువును తీసుకొనివచ్చాడు. పరశురాముని శుభాగమనలక్ష్యం **శ్రీరాముని పరీక్షించటం. దశరథుడు** పరశురాముడు రాజ్యసరిహద్దుల్ని చేరాడు అని' విని శ్రీరాముని ఆహ్వానింప పంపాడు. శ్రీరాముడు ధనుర్బాణాలు చేతిలో ధరించి వచ్చి ఎదురుగా నిలిచాడు. ఇది చూచిన పరశురాముడు నవ్వుతూ 'నీకే శక్తిఉంటే యత్నపూర్వకంగా ఈ ధనుస్సును ఎక్కుపెట్టు. ఇది ఎందరో క్షత్రియుల్ని సంహరించిన విల్లు' అన్నాడు. ఇలా పలికిన పరశురామునితో రాముడు "మీరు నన్ను ఈ విధంగా అవమానించకండి నేనుకూడ ద్విజాతులు అన్నింటిలో క్షత్రియధర్మాన్ని పాలించే వారిలో అధమున్నికాను. ప్రత్యేకించి ఇక్ష్వాకువంశజులు బాహుబలాన్ని ప్రశంసించుకోరు." శ్రీరాముడు పలికిన మాటల్ని విని పరశురాముడు బదులు చెప్పాడు. 'మాటలకు ఇక్కడ అవకాశం లేదు. ఈ ధనుస్సు తీసుకొని వింటినారిని బిగించు.'

దశరథకుమారుడు శ్రీరాముడు రోషంతో క్షత్రియుల్ని సంహరించిన ఆ పరశురాముని వింటిని చేతితో గ్రహించాడు. అతడు విలాసంగా ఆ ధనుస్సుకు నారి బిగించి శబ్దం చేశాడు. శ్రీరాముడు నవ్వుతూ ఉండగనే ఆ ధనుష్టంకారం అన్ని దిశలా వ్యాపించింది. పిడుగుపాటులా ఉన్న ఆ ధ్వనికి ప్రాణులందరు భయవిహ్వలులు అయ్యారు. శ్రీరాముడు పరశురామునితో అన్నాడు – 'మీరు చెప్పిన ఈ ధనుస్సును వశపరచుకొన్నాను. ఇప్పుడు ఏం చెయ్యాలి.' పరశురాముడు రామునికి బదులు ఇచ్చాడు. 'నేను ఇచ్చే ఈ బాణాన్ని తీసుకొని ఆ ధనుస్సులో ఉంచి చెవివరకు లాగు.' ఈమాట వింటూనే రామునికి చాలకోపం వచ్చి పరశురామునితో అన్నాడు – 'నీవు గర్వపూర్ణుడివి. నీ పదునైన మాటలు విన్నా

నిన్ను క్షమిస్తున్నాను. నీ పితామహుడు ఋచీకుని కారణంగా నీకు ఈ క్షత్రియుల్ని జయించే సామర్థ్యం వచ్చింది. అందుచే నిశ్చయంగా మమ్ములను అధిక్షేపిస్తున్నావు. నీకు దివ్యదృష్టిని ప్రసాదిస్తాను. దాని ద్వారా నా నిజస్వరూపాన్ని దర్శించుకో.' అప్పుడు పరశురామునికి శ్రీరాముని శరీరంలో ఆదిత్యులు, అష్టవసువులు, ఏకాదశరుద్రులు, సాధ్యులు, దేవతలు, నలభైతొమ్మిది మంది మరుత్తులు, పితృగణాలు, అగ్నిదేవుడు, నక్షత్రాలు, గ్రహాలు, గంధర్వులు, రాక్షసులు, యక్షులు, నదులు, తీర్థాలు, సనాతనులు బ్రహ్మస్వరూపులు అంగుష్ఠపరిమాణం గల వాలఖిల్యులు, దేవర్షులు, సప్తసముద్రాలు, పర్వతాలు, ఉపనిషత్తులసహితంగా వేదాలు, వషట్కారం, యజ్ఞం, సోమ, ధనుర్వేదం, అన్నీ చేతనరూపాల్ని ధరించి ప్రత్యక్షంగా కన్పించాయి. మేఘమండలం, వర్షం, మెరుపుతీగలు అన్నీ అతనిశరీరంలో దర్శనం ఇచ్చాయి. పిమ్మట దశరథనందనుడు శ్రీరాముడు ఎక్కుపెట్టిన బాణాన్ని వదిలాడు. ఆ సమయంలో భూమి అంతా మేఘాలులేని మెరుపులోని పెద్దపెద్ద ఉల్కలతో వ్యాపించి కనిపించింది. అంధకారం అంతటా వ్యాపించి ధూళివర్షం కురియసాగింది. మేఘాలు ఒక్కసారిగా క్రమ్ముకుని ధారలుగా వర్షం పడసాగింది. మాటిమాటికి భూకంపం వచ్చింది. మేఘగర్జనలు, ఉత్పాతధ్వనులు ఒక్కసారిగా దద్దరిల్లేటట్లు చేశాయి. శ్రీరాముని భుజాలతో విడువడిన ఆ బాణం ప్రకాశిస్తూ పరశురాముని వ్యాకులపరిచి అతని తేజస్సును మాత్రం గ్రహించి రాముని వచ్చి చేరింది. పరశురాముడు హఠాత్తుగా మూర్ఛితుడు అయి, తిరిగి కొంతసేపటికి తెలివి పొందాడు. చనిపోయి తిరిగి బ్రతికిన మనుజునివలె తననుండి విష్ణుతేజాన్ని గ్రహించిన శ్రీరామునికి నమస్కారం చేశాడు. ఆటుతరువాత శ్రీమన్మహావిష్ణువు అవతారం అయిన శ్రీరాముని అనుమతి గైకొని మహేంద్రపర్వతానికి తిరిగి వెళ్ళిపోయాడు. అతడు భయపడి, సిగ్గుపడి గొప్పతపస్సులో మునిగిపోయాడు. పిమ్మట ఒకసంవత్సరం గడవగా తేజోహీనుడు, అభిమానశూన్యుడు అయిన పరశురాముని చూచి అతని పితృదేవతలు అతనితో ఇలా అన్నారు. 'నీవు పూజ్యుడు శ్రీమన్మహావిష్ణువుతో చేసిన వైరం ఎంతమాత్రం ఉచితం కాదు. అతడు ముల్లోకాల్లో ప్రసిద్ధుడు, పూజనీయుడు, గౌరవింపతగినవాడు. నీవు ఇక్కడినుండి **వధూసరం** అనేపేరుగల పుణ్యనదీతీరాన్ని చేరు. అక్కడ తీర్థాల్లో స్నానం చేసి తిరిగి పోయిన పూర్వతేజాన్ని గ్రహిస్తావు. అది **దీప్తోదకం** అనే పేరుగల తీర్థం. దేవయుగంలో మామత్తాత భృగుమహర్షి ఇక్కడే గొప్పతపస్సు చేశాడు. పితరులమాటపై పరశురాముడు అలాగే చేశాడు.' ఆ తీర్థంలో స్నానంచేసి తిరిగి తను కోల్పోయిన తేజస్సును పొందాడు. ఈ ప్రకారంగా పూర్వకాలంలో అనాయాసంగా పనుల్ని సాధించగల పరశురాముడు విష్ణువు అవతారమైన శ్రీరామునితో విభేదించి ఈ అవస్థను పొందాడు.

100. దేవతలకు దధీచమహర్షి వెన్నెముక ఇచ్చుట. వజ్రాయుధము నిర్మించుట.

ధర్మజుడు అడిగాడు. 'నేను అగస్త్యమహర్షి చరిత్రను వివరంగా మరల వినాలని కుతూహలంతో ఉన్నాను.' లోమశుడు చెపుతున్నాడు -'తేజస్సంపన్నుడైన అగస్త్యుని కథ దివ్యం, అలౌకికం, అద్భుతం. ఆయన ప్రభావం చాలాగొప్పది. వినిపిస్తాను. విను. సత్యయుగంలో కాలకేయులు అనే పేరుగల దైత్యగణం ఉంది. వారు దయలేనివారు. క్రూరులు. యుద్ధంలో ఆసక్తి కలవారు. వారందరూ అన్ని ఆయుధాలూ గ్రహించి, సంసిద్ధులై వృత్రాసురుడు నాయకుడుగా ఇంద్రాదిదేవతల్ని నాలుగువైపుల నుంచి ఆక్రమించి దాడి చేశారు. అప్పుడు దేవతలందరు వృత్రుని వధించాలని ప్రయత్నం చేశారు. వారు ఇంద్రుని ముందుంచుకొని బ్రహ్మలోకానికి చేరారు. ఆయన్ని సమీపించి దేవతలు నమస్కరించారు. వారితో బ్రహ్మ ఇలా పలికాడు - మీరు ఏ పని నిమిత్తం ఇక్కడకు వచ్చారో అది నాకు పరిపూర్ణంగా తెలుసు. వృత్రుని వధించగల ఉపాయం చెప్తాను. వినండి. దధీచి ప్రసిద్ధిపొందిన ఋషి ఉన్నాడు. ఆయన హృదయం గొప్పది. అతని వద్దకు చేరి, మీరందరు వరాన్ని కోరండి. ధర్మాత్ముడైన అతడు ప్రసన్నమనస్కుడై మీరు కోరిన వరాన్ని ఇస్తాడు. ఆయన వరాన్ని ఇవ్వటానికి అంగీకరించిన వెంటనే విజయాభిలాషులై మీరు ముల్లోకాల మేలు కోసం "మీ శరీరం లోని ఎముకల్ని దానం చెయ్యండి" అని అడగండి. మీ కోరికను అనుసరించి ఆ మహర్షి శరీరాన్ని విడచి ఎముకల్ని దానం చేస్తాడు. ఆ ఎముకలతో మీరు భయంకరమయిన వజ్రాయుధాన్ని నిర్మించండి. దాని ఆకృతి ఆరు అంచులతో ఉంటుంది. అది శత్రునాశకమూ, భయంకరమూ అయిన ధ్వనిని చేస్తుంది. ఆ వజ్రాయుధంతో ఇంద్రుడు నిశ్చయంగా వృత్రాసురుని సంహరిస్తాడు.

ఈ వృత్తాంతం అంతా మీకు తెలియజేశాను. మీరు శీఘ్రంగా ఆచరించండి." బ్రహ్మదేవుని మాటల్ని అనుసరించి, ఆయన అనుజ్ఞను తీసుకొన్నారు. నారాయణుని నాయకత్వంలో దధీచి మహర్షి ఆశ్రమం చేరారు. అది సరస్వతీనదీతీరంలో చాలా చెట్లతో, లతలతో వ్యాపించి ఉంది. బ్రాహ్మణుల సామవేదగానాన్ని పోలిన భ్రమరనాదాలతో ఆ ప్రదేశం మార్మ్రోగుతోంది. పుంస్కోకిలలు, పశుపక్ష్యాదుల కోలాహలధ్వనులతో నిండి ఉంది. దున్నలు, వరాహాలు, వాలమృగాలు, చమరీమృగాలు వ్యాఘ్ర సింహాదుల భయం వీడి ఆ ఆశ్రమప్రదేశంలో సంచరిస్తున్నాయి. మదధారలు స్రవిస్తూ జలక్రీడలాడే మగ, ఆడ ఏనుగుల ఘీంకారాలతో నాలుగువైపుల ఆ ఆశ్రమం వ్యాపించి ఉంది. పర్వతగుహల్లో,

కందరాల్లో నిద్రించే సింహవ్యాఘ్రాదుల గర్జనలతో ఆశ్రమం ధ్వనిస్తోంది. ఆయా ప్రదేశాల్లో చక్కగా ప్రకాశిస్తూ ఇంద్రుని స్వర్గంతో సమానం అయిన దధీచిమహర్షి ఆశ్రమాన్ని దేవతలందరూ చేరారు. సూర్యసమకాంతితో ప్రకాశిస్తూ తన దివ్య శరీరకాంతిచే బ్రహ్మను పోలిన దధీచి మహర్షిని వారక్కడ చూశారు. అదే సమయంలో దేవతలందరు దధీచి మహర్షి పాదాలకు అభివాదం, నమస్కారం చేసి బ్రహ్మకోరమన్న రీతిలో వరాన్ని ఇమ్మని ఆయన్ని అడిగారు. దధీచి ప్రసన్నుడై దేవతాశ్రేష్ఠులతో ఇలా అన్నాడు. 'మీకు హితాన్ని నేను ఆచరిస్తాను. ఈ శరీరాన్ని మీకోసం తప్పక విడచిపెడతాను.' జితేంద్రియుడు, మనుజశ్రేష్ఠుడు అయిన దధీచి వారితో అలా పలుకుతూనే తన ప్రాణాలు విడచాడు. ఆ దేవతలు బ్రహ్మ ఆదేశానుసారం ప్రాణాలు పోయిన అతని శరీరం నుండి ఎముకలను గ్రహించారు. పిమ్మట సంతోషించిన దేవతలు త్వష్టప్రజాపతి వద్దకు చేరి తమ ప్రయోజనాన్ని వివరించారు. దేవతల మాటలతో త్వష్ట ప్రజాపతి మిక్కిలి ప్రసన్న డయ్యాడు. అతడు ఏకాగ్రచిత్తంతో భయంకర వజ్రాయుధ నిర్మాణం చేశాడు. ఆపై ఇంద్రునితో ఇలా అన్నాడు. "ఈ వజ్రాయుధంతో దేవద్రోహియైన వృత్రాసురుని భస్మం చెయ్యి. ఈ విధంగా శత్రువును చంపి దేవతలకు సుఖాన్ని కలిగిస్తూ స్వర్గాన్ని పాలించు." త్వష్టప్రజాపతి పలుకులు విని, ఆనందంతో ప్రసన్నుడై ఇంద్రుడు వజ్రాయుధాన్ని అందుకొన్నాడు.

101. వృత్రునివధ, జగన్నాశము కొరకు అసురుల దుర్మంత్రణము.

పిమ్మట వజ్రధారి దేవతాగణరక్షితుడై వృత్రుని వద్దకు చేరాడు. ఆ వృత్రుడు భూమ్యాకాశాల్ని ఆవరించి ఉన్నాడు. కాలకేయులు అనే విశాల శరీరధారులైన దైత్యులు చేతులతో ఆయుధాలు దాల్చి, శిఖరాలు గల పర్వతపంక్తివలె ఉండి అతనిని అన్నివైపుల నుంచి రక్షిస్తున్నారు. ఇంద్రుడు వస్తుండగానే దేవదానవులకు లోకభయంకర మయిన యుద్ధం జరిగింది. దానివలన ముల్లోకాలు భయపడ్డాయి. వీరుల భుజాలతోపాటు లేచిన ఆయుధాలు శత్రుయోధుల శరీరప్రహారాలతో కలిసి, చూర్ణాలై అత్యంత భయంకర శబ్దం చేశాయి. తొడిమనుంచి వీడిన తాటిపండ్లవలె ఆకాశాన్నుంచి జారిపడే యోధుల తలలు భూమినంతటినీ కప్పివేశాయి. కాలకేయులు బంగారుకవచాలు ధరించి, పరిఘలను గైకొని, దేవతలపై పడ్డారు. అప్పుడు వారు దావాగ్ని క్రమ్ముకొన్న పర్వతాలవలె శోభించారు. దర్పంతో వేగంగా ముందుదాడి చేసే ఆ దైత్యుల వేగాన్ని దేవతలు సహించలేక భయంతో పరుగులు పెట్టారు. సహస్రాక్షుడైన ఇంద్రుడు భీతితో పరుగులెత్తే వారిని చూసి, వృత్రుని పెరుగుదలను ఊహించి, మిక్కిలి మోహాన్ని పొందాడు. కాలకేయులకు భయపడిన

ఇంద్రుడు వేగంగా శ్రీమన్నారాయణుని శరణు కోరాడు. ఆ ఇంద్రుని మోహాన్ని గమనించి, ప్రాచీనుడైన శ్రీమహావిష్ణువు అతని బలాన్ని పెంచడంకోసం తన తేజస్సును అతనిలో నింపాడు. శ్రీమహావిష్ణువుచే రక్షింపబడ్డ ఇంద్రుని చూచి దేవతలు, పరిశుద్ధమనస్సులుగల బ్రహ్మర్షులు వారి తేజస్సును కూడ ఇంద్రునిలో ప్రవేశపెట్టారు.

విష్ణువుచే, ఋషులచే, దేవతలచే నింపబడిన తేజస్సుతో ఇంద్రుడు మిక్కిలి బలశాలి అయినాడు. ఇంద్రుని బలసంపన్నునిగా తెలిసికొని వృత్రాసురుడు వికటంగా గర్జనలు చేశాడు. అతని గర్జనలతో అన్ని దిక్కులు, ఆకాశం, భూమి పర్వతాలు అన్నీ కంపించాయి. మహేంద్రుడు ఆ గర్జనలను విని సంతాపంతో భీతుడై, వృత్రాసురవధకై తన వజ్రాయుధాన్ని ప్రయోగించాడు. ఇంద్రుని వజ్రాయుధం దెబ్బ తగిలి బంగారు మాల ధరించిన వృత్రుడు పూర్వం విష్ణువు చేతినుంచి జారిపడ్డ మందరపర్వతం వలె నేల కూలాడు. ఆ వృత్రుడు చనిపోగా, భీతినొందిన ఇంద్రుడు సరస్సులో ప్రవేశించటానికి పరుగుపెట్టాడు. భయం వలన ఇంద్రుడు వజ్రాయుధాన్ని చేతినుంచి జారినట్లు భావించలేదు. వృత్రుడు చనిపోయాడనీ అనుకోలేదు. దేవతలు, మహర్షులు ప్రసన్నులై ఇంద్రుని స్తోత్రం చేయసాగారు. దేవతలు అందరు కలిసి వృత్రుని వధతో కుమిలిపోతున్న అసురులను చంపివేశారు. దేవతలకు భయపడిన కాలకేయులు అందరూ భయంతో సముద్రంలో ప్రవేశించారు. పెద్దపెద్ద చేపలు, మొసళ్ళు గల సముద్రంలో ప్రవేశించి... ముల్లోకాలనూ నశింపజేయటానికి వారు మంత్రాంగం చేయసాగారు. వారిలో కొందరు బుద్ధిమంతులు వారికి తోచిన ఉపాయాలు చెప్పారు. చిరకాలం ఉపాయాల గురించి ఆలోచించి ఆ దైత్యులు ఇలా నిశ్చయించారు – "విద్యాతపస్సులతో కూడిన వారినందరినీ ముందుగా చంపివేయాలి. లోకాలన్నీ తపస్సు కారణంగా నిలబడుతున్నాయి. వారి తపస్సు నాశనం చేయటానికి ప్రయత్నించండి. తాపసులను ధర్మకోవిదులను, ముందుగా మట్టుపెట్టండి. వారివధ ఆయితే లోకాలన్నీ నశించినట్లే." ఇలా వారందరు తమ బుద్ధితో ఆలోచించి లోకవినాశానికై సంతోషంతో అంగీకరించారు. పెద్దకెరటాలతో, రత్నాలకు నిలయమయిన సముద్రాన్ని ఆశ్రయించి వారందరూ నిర్భయంగా ఉండసాగారు.

102. సముద్రములోని ఋషులను దైత్యులు నాశనము చేయుట. దేవతలు నారాయణుని శరణుకోరుట.

'వరుణుని నివాసమైన సముద్రాన్ని ఆశ్రయించి, కాలేయులు త్రైలోక్యవినాశనానికి పాల్పడ్డారు. వారు కోపించి రాత్రివేళలలో ఆశ్రమాల్లోని, పవిత్ర ప్రదేశాల్లోని మునులను

తినివేయసాగారు. దురాత్ములైన రాక్షసులు వసిష్ఠుని ఆశ్రమంలోని నూట ఎనభై ఎనిమిది మందిని, ఇతరత్ర తొమ్మిదిమంది ఋషులను భక్షించారు. చ్యవనముని పవిత్రాశ్రమాన్ని చేరి, అక్కడ కందమూలఫలాలు తింటూ నివసించే వందమంది మునులను తినివేశారు. ఈ విధంగా రాత్రులలో తాపసులను సంహరించి, పగలు జలంలో ప్రవేశించే వారు. వాయు, జలభక్షణం చేసే ఇరవైమంది బ్రహ్మచారులను భరద్వాజాశ్రమంలో ఆ రాక్షసులు క్రమంగా చంపారు. ఇదే తీరుగా రాత్రులందు బాహుబల గర్వితులై కాలునిచే సృజింపబడిన కాలేయులు చాలమంది బ్రాహ్మణులను నాశనం చేశారు. దీనులను, తాపసులను పీడించే ఆ రాక్షసులను మనుజులెవ్వరూ గుర్తింపలేకపోయారు. ప్రభాతవేళ నియతాహారపీడితులై వారు ప్రాణాలుపోయి శరీరమాత్రం భూమిపై పడి ఉండేవారు. రాక్షసులచే భక్షింపబడి రక్తం, మాంసం, మజ్జ, సంధిబంధాలు తొలగి శంఖరాశులవలె మునులు భూమిపై పడి ఉండేవారు. అటు ఇటు చెదరగొట్టబడిన కలశాలతో, విరిగిన స్రువాలతో, విసిరివేయబడిన అగ్నిహోత్రాలతో భూమి వ్యాప్తమై ఉంది. స్వాధ్యాయవషట్కారాలు లేక యజ్ఞోత్సవాలు లేక కాలేయభయంతో, నిరుత్సాహంతో, లోకమంతా వ్యాకులమై ఉంది.

ఈవిధంగా ఆత్మరక్షణ పరాయణులై, మిగిలిన మానవులు భయంతో నలువైపులకు పరుగులు తీశారు. కొంతమంది గుహల్లో, కొంతమంది ప్రవాహాల్లో కొంతమంది మరణభయంతో ప్రాణాలు విడచారు. కొందరు అక్కడ ధనుర్విద్యాధికులు, శూరులు, మిక్కిలి హర్షాన్ని పొందినవారు. వారు దానవుల స్థానాన్ని వెదకుతూ యత్నాలు చేశారు. మానవులు సముద్రమందు దాగినవారిని గుర్తించలేక శ్రమతో నశించారు. యజ్ఞోత్సవక్రియలు లేక జగత్తుకు వినాశం ప్రాప్తించి, దేవతలకు ఎక్కువపీడ కలిగింది. ఇంద్రాది దేవతలు కూడా భయంతో ఆలోచించారు. వారు దేవతలందరకు దిక్కై, జన్మరహితుడైన నారాయణుని ప్రార్థించారు. వారు పరాజయంలేని, వైకుంఠవాసుని, మధుసూదనుని చేరి, నమస్కరించి ఆయనతో ఇట్లా విన్నవించారు." నీవే మమ్ములను సృష్టించావు. నీవే మాకు భర్తవు. నీవే లోకానికంతకు నాశకుడవు. స్థావరజంగమాత్మకం అయిన ఈ సృష్టి అంతా నీవే చేశావు. పూర్వకాలాన నీవే సముద్రంలో మునిగిన భూమిని, వరాహరూపం స్వీకరించి వెలికితీసి రక్షించావు. నీవే నారసింహుని రూపాన్ని దాల్చి ఆదిరాక్షసుడు, మహావీరుడు అయిన హిరణ్యకశిపుని నశింపచేశావు. సర్వప్రాణులకు చంపవీలుకాని రాక్షసుడైన బలిచక్రవర్తిని, వామనావతారం ఎత్తి త్రిలోక రాజ్యం నుంచి తొలగించావు. క్రూరుడై, ధానుష్కుడై యజ్ఞనాశంచేసే జంభాసురుని నీవే పడగొట్టావు. అసంఖ్యాకమయినవి ఈ నీ కృత్యాలు. భయపడే మాబోటివారికి నీవే దిక్కు. కావున నీకు లోకహితం కోసం నివేదిస్తున్నాం.

లోకాలను, దేవతలను, ఇంద్రునీ ఈ మహాభయం నుండి రక్షించు."

103. విష్ణువు ఆజ్ఞపై దేవతలు అగస్త్యాశ్రమమునకు చేరుట. సముద్రమును ఇంకింపజేయుమని ప్రార్థించుట.

దేవతలు పలికారు. "నీ అనుగ్రహంవలన జరాయుజాలు, స్వేదజాలు, అండజాలు, ఉద్భిజాలు వృద్ధిపొందుతున్నాయి. అభ్యుదయశీలం కల మానవులు, హవ్య కవ్యాలతో దేవతలను ఆనందపెట్టుతున్నారు. పరస్పరం ఆధారపడి లోకాలు ఈ విధంగా వృద్ధిని పొందుతున్నాయి. నీ కరుణచే ఉద్వేగంలేనివై రక్షింపబడుతున్నాయి. ఇపుడు మనుష్యులకు గొప్ప భయం సంప్రాప్తించింది. రాత్రివేళలో ఎవరు ఈ బ్రాహ్మణులను వధిస్తున్నారో తెలియటంలేదు. బ్రాహ్మణులు నశిస్తే భూమి నశిస్తుంది. భూమి క్షీణిస్తే స్వర్గవైభవం కూడ క్షీణిస్తుంది. మీ అనుగ్రహం ఉంటే లోకాలు అన్నీ నాశనాన్ని పొందవు. పైగా నీచే రక్షింపబడతాయి."

విష్ణువు పలికాడు – "ప్రజల వినాశానికి ఏర్పడిన కారణాన్ని నేను తెలుసుకొన్నాను. మీకు ఒకమాట చెబుతున్నాను. అందరూ చింతలేక వినండి. దైత్యులలో కాలేయు లనే రాక్షసులదండు భయంకరమై ఉన్నది. వారు వృత్రాసురుని ఆశ్రయించి లోకాలను భయపెట్టి నాశనం చేస్తున్నారు. ఇంద్రుని చేత వృత్రుడు చనిపోయినట్లు వారు తెలిసికొని, సముద్రంలో ప్రవేశించి ప్రాణాలు రక్షించుకొన్నారు. మొసళ్ళతో, పెద్దచేపలతో వ్యాప్త మైన సముద్రంలో వారు ప్రవేశించి, లోకసంహారం కోసం రాత్రులందు ఋషులను చంపుతున్నారు. సముద్రాన్ని ఆశ్రయించటంచేత వారిని శిక్షింప వీలుకాలేదు. కావున మీరు సముద్ర శోషణానికై ప్రయత్నించండి. అగస్త్యుడు కాక వేరెవరు సముద్రాన్ని ఇంకింపచేయగలరు? సముద్రాన్ని ఎండింపకుండా వారిని నాశనం చేయలేం." విష్ణువు పలికిన పలుకులు విని పరమేష్ఠిని అనుమతింపచేసి దేవతలు అగస్త్యాశ్రమాన్ని చేరారు. అక్కడ మిత్రావరుణుల పుత్రుడు అయిన అగస్త్యమునిని చూశారు. దేవతలు బ్రహ్మను సేవించినట్లు ఋషులందరు అగస్త్యుని సేవింపసాగారు. వారు ఆశ్రమంలో అగస్త్యుని చూచి, అతని అద్భుతకృత్యాలను కొనియాడసాగారు.

దేవతలు పలికారు – "పూర్వకాలంలో నహుషుడు జనులను పీడించినప్పుడు నీవు వారిని రక్షించి, లోకకంటకుడు అయిన నహుషుని స్వర్లోకాధిపత్యానికి దూరం చేశావు. పర్వతశ్రేష్ఠుడైన వింధ్యుడు సూర్యునిమీది కోపంతో పెరిగి సూర్యగమనానికి అవరోధం అయిన సమయంలో మీ ఆజ్ఞానుసారం ప్రవర్తించే వింధ్యపర్వతం వృద్ధిపొందక

అట్లే ఉన్నది. వింధ్యపర్వతం పెరిగి లోకాలు అంధకారం అయినప్పుడు జనులు మృత్యుభీతిని పొందారు. మిమ్ములనే శరణుకోరి అందరు ఆనందాన్ని పొందారు. అప్పుడు భీతులైన దేవతలను మీరే రక్షించారు. అందువలన ఈ ఆపద నుంచి కూడ మీరే రక్షించండి అని వరం కోరుతున్నాం."

104. అగస్త్యుడు వింధ్యవృద్ధిని నివారించుట, దేవతలతో సముద్రతీరము చేరుట.

యుధిష్ఠిరుడు అడిగాడు – 'ఏ కారణంచే వింధ్యపర్వతం కోపాన్ని పొందిందో విస్తరంగా తెలియచెయ్యండి.' లోమశుడు పలికాడు – "సూర్యభగవానుడు ఉదయాస్తమయవేళల్లో బంగారు రంగు గలిగిన మేరుపర్వతానికి ప్రదక్షిణం చేస్తున్నాడు. అదిచూచి వింధ్యపర్వతం సూర్యునితో ఇలా అంది. 'మీరు ప్రతిదినం మేరువుకు ప్రదక్షిణం చేస్తున్నట్లే నాకు ప్రదక్షిణం చెయ్యండి.' వింధ్యపర్వతం మాటలు విన్న సూర్యుడు ఇలా బదులు పలికాడు. 'నేను నా ఇష్టానుసారం ఈ పర్వతానికి ప్రదక్షిణం చేయటం లేదు. లోకాన్ని సృష్టించిన బ్రహ్మ నాకీ మార్గాన్ని ఉపదేశించాడు.' సూర్యభగవానుని మాటలు విని, మిక్కిలి కోపించి వింధ్యపర్వతం సూర్యచంద్రుల మార్గానికి అవరోధంగా, పెరుగసాగింది. దేవతలందరు కలసి శ్రేష్ఠుడైన వింధ్యుని సమీపించి ఉపాయాలద్వారా అతని కోపాన్ని తగ్గించేందుకు ప్రయత్నం చేశారు. వారి మాటలు వింధ్యపర్వతం వినలేదు. అప్పుడు అందరూ ధర్మవేత్తలలో శ్రేష్ఠుడు, తాపసి, ఆశ్రమవాసి అయిన అగస్త్యుని వద్దకు వేగంగా చేరి తమకు కావలసిన ప్రయోజనాన్ని వివరించారు. 'ఈవింధ్యపర్వతం క్రోధవశుడై సూర్యచంద్రుల మార్గాన్ని, నక్షత్రాల గతిని అడ్డుకొన్నాడు. మీకంటె వేరొకరు అతనిని నివారించలేరు. మీరు వెళ్ళి అతని కోపాన్ని అణచి అదుపులో పెట్టండి.' దేవతల వచనాలు విని అగస్త్యుడు వింధ్యపర్వతసమీపానికి భార్యతో సహా వెళ్ళి, ఇలా అన్నాడు. 'పర్వతశ్రేష్ఠా! నేను ఒక పనిమీద దక్షిణదిక్కుకు వెళ్ళాలి. నా కోరికప్రకారం నీవు మార్గాన్ని ఇవ్వాలి. నేను తిరిగివచ్చేవరకు నా ఆజ్ఞను పాలించు. నేను తిరిగి వెళ్ళిన పిదప స్వేచ్ఛానుసారం వృద్ధిని పొందు.' ఇట్లు వింధ్యపర్వతం నుంచి మాట తీసుకొని, మిత్రావరుణనందనుడైన అగస్త్యుడు దక్షిణదేశం నుంచి ఇక వెనుకకు రాలేదు. వింధ్యుని పెంపుదల ఆగిపోవుటకు తగిన వృత్తాంతాన్ని నీకు వివరించాను. అగస్త్యుని ప్రభావంచే వింధ్యుని పెంపుదల ఆగిపోయింది.

దేవతలు అగస్త్యుని అనుగ్రహం పొంది కాలేయులను సంహరించిన విధానం

వివరిస్తాను. వినండి. దేవతలమాటలు విని అగస్త్యుడు వారిని ఇలా అడిగాడు - 'మీరు నా నుంచి ఏ పని ఆశించి ఇక్కడకు వచ్చారు?' అగస్త్యుని మాటలను విన్న దేవతలు అగస్త్యునితో పలికారు. ఇంద్రునిముందు ఉంచుకొని అంజలిఘటించి అన్నారు. 'మేము మిద్వారా ఈ పనిని సాధింప దలచాం. సముద్రంలో నీటిని మీరు పూర్తిగా త్రాగివేయండి. అటుపైన దేవద్రోహులైన కాలేయులను మేము పూర్తిగా సంహరిస్తాం.' సురలమాటలను విని అగస్త్యుడు 'అలాగే' అని అంగీకరించి, 'మీ కోరికను తీర్చి లోకాలకు మేలు కలిగిస్తాను' అన్నాడు. ఇలా బదులు పలికి అగస్త్యుడు దేవతలు, ఋషులతో కలిసి సముద్రతీరానికి చేరాడు. ఆ సమయాన మనుష్యులు, నాగులు, గంధర్వులు, యక్షులు, కింపురుషులు అందరు ఆ అద్భుతాన్ని చూసేందుకు అగస్త్యుని వెనుక బయలుదేరారు. వారందరు భయంకరంగా గర్జిస్తూ పైకి ఎగిరే తరంగాలతో నృత్యం చేస్తున్నట్లున్న సముద్రసమీపానికి చేరారు. తరంగాలనురుగుచే నవ్వుతున్నట్లుంది సముద్రం. గుహల్లోకి ధ్వనులతో ప్రవేశిస్తున్నట్లు ఉంది. మొసళ్ళు మొదలైన జలజంతువులతో, పక్షిగణాలతో వ్యాప్తమై ఉంది. అగస్త్యునితో కూడి గంధర్వులు, నాగులు, ఋషులు అందరూ సముద్రతీరానికి చేరుకున్నారు.

105. అగస్త్యుడు సముద్రజలము త్రాగుట - దేవతలు దైత్యసంహారము చేయుట.

సముద్రతటాన్ని చేరి మిత్రావరుణుని కుమారుడైన అగస్త్యుడు గుమిగూడిన చేరిన ఋషులు, దేవతలు అందర్నీ ఉద్దేశించి పలికాడు. 'నేను లోక కళ్యాణానికై సముద్రజలాన్ని అంతటినీ త్రాగుతాను. ఇంతలో మీరు చేయాల్సిన పనిని పూర్తిచేయండి.' ఎన్నడూ మర్యాదలు అతిక్రమించని అగస్త్యుడు కోపించి, అందరూ చూస్తుండగనే సముద్రజలాన్ని అంతటినీ త్రాగివేశాడు. ఇంద్రాదిదేవతలు సముద్రజలపానం చేసిన అగస్త్యుని చూసి ఆశ్చర్యం పొందారు. స్తోత్రాలతో ఆయనను పూజించారు. 'నీవే మా రక్షకుడవు. లోకాన్ని రక్షించే శక్తి కలవాడవు. నీ అనుగ్రహంచే అమరులతో కూడిన లోకం నాశనాన్ని పొందదు.' గంధర్వుల వాద్యాలు మ్రోగుతున్నాయి. దివ్యపుష్పవృష్టి పడుతోంది. అగస్త్యుడు దేవతలచే పూజింపబడి మహాసముద్రజలాన్ని శూన్యం చేశాడు. సముద్రజలం అంతా ఇంకిపోగా దేవతలు ఆనందభరితులు అయ్యారు. భయంలేకుండా దివ్యాయుధాలు గ్రహించి దానవులందర్నీ చంపివేశారు. సింహగర్జనలు చేస్తూ బుద్ధిమంతులు, మహాబలులు అయిన దేవతలు దైత్యులను చంపుతుండగా దైత్యులు దేవతల వేగానికి తట్టుకోలేకపోయారు. త్రిదశులచే వధింపబడుతున్న దానవులు భయంకర ధ్వనిచేస్తూ రెండు ఘడియలు

పాటు ఘోరయుద్ధాన్ని చేశారు. మనసుతోనే ఋషులు వారిని పూర్వమే సంహరించారు. తమశక్తిని అంతటిని ఉపయోగించిన దేవతలు తరువాత వారిని చంపారు.

బంగారు మాలలు కలిగి, కుండలాలు, అంగదాలు కలదైత్యులు దేవతలు చంపగా ఎఱ్ఱటి కింశుకవృక్షాలవలె ప్రకాశించారు. చావగా మిగిలిన కొందరు కాలేయులు భూమిని చీల్చుకొని పాతాళంలోకి ప్రవేశించారు. దానవులందరూ నశించిన పిమ్మట దేవతలు అగస్త్యుని స్తోత్రాలతో కీర్తించి, ఇలా పలికారు. 'మీ దయచే లోకాలకు చాలా సుఖం కలిగింది. మీ తేజస్సుచే భయంకరులైన కాలకేయులు నశించారు. సముద్రాన్ని తిరిగి జలంతో పూరించండి. మీరు త్రాగిన జలాన్ని తిరిగి విడిచిపెట్టండి.' మునిశ్రేష్ఠుడై అగస్త్యుడు వారిమాటలు విని, ఇంద్రాదిదేవతలతో ఇలా అన్నాడు - 'సముద్రజలమంతా నేను జీర్ణం చేసుకొన్నాను. తిరిగి నింపటానికి వేరొక ఉపాయాన్ని ఆలోచించండి' అగస్త్యుని మాటల్ని విని, దేవతలు మిక్కిలి ఆశ్చర్యాన్ని, విషాదాన్ని పొందారు. పరస్పరం మాట్లాడుకొని వారంతా అగస్త్యునికి నమస్కరించారు. ప్రజలందరూ ఎక్కడినుంచి వచ్చారో అక్కడికే వెడలిపోయారు. దేవతలు విష్ణువుతో కలిసి బ్రహ్మదేవుని సమీపానికి చేరారు. సముద్రాన్ని జలంతో నింపటానికి మరల ఆలోచించి, దేవతలు విష్ణువుతో కలిసి బ్రహ్మ సమీపానికి చేరి 'అంజలి ఘటించి' సాగరపూరణాన్ని గురించి ప్రార్థించారు."

106. సగరుడు సంతానము కొరకు శివునికై తపస్సు చేసి వరములను పొందుట.

తన వద్దకు వచ్చిన దేవతలతో బ్రహ్మ 'ఇప్పుడు మీరు మీ స్వేచ్ఛానుసారం ఇష్టమైన ప్రదేశాలకు వెళ్ళండి' అన్నాడు. చాలాకాలం తరువాత సముద్రం తన రూపాన్ని తిరిగి పొందుతుంది. భగీరథుడు జ్ఞాతుల నుద్ధరించాలని సముద్రాన్ని అపారజలరాశులతో నింపుతాడు. దేవతలు అందరూ బ్రహ్మమాటలు విని సమయంకోసం ఎదురుచూస్తూ తిరిగి తమ ప్రదేశాలకు చేరారు." యుధిష్ఠిరుడు అడిగాడు - 'భగీరథుని జ్ఞాతులు సముద్రపూరణం ఎలా చేశారు? భగీరథుని ఆశ్రయంచేత సముద్రం ఎలా నిండింది? రాజుల ఉత్తమ చరిత్ర నీవు వివరిస్తే విస్తరంగా వినాలని ఉంది.' ధర్మరాజు ప్రశ్నించగా లోమశుడు మహాత్ముడైన సగరుని మాహాత్మ్యం ఇలా వినిపించాడు. "ఇక్ష్వాకువంశంలో పుట్టిన సగరుడు అనే రాజు రూపసత్త్వబలసంపన్నుడు, ప్రతాపవంతుడు. అతనికి పుత్రసంతానం లేదు. అతడు హైహయవంశజులను, తాలజంఘులనే క్షత్రియులను జయించి తన రాజ్యాన్ని పరిపాలించసాగాడు. ఆయనకు ఇద్దరు భార్యలు. మొదటి భార్య వైదర్భి,

రెండవ భార్య శైబ్య. పుత్రకాంక్షతో సగరుడు భార్యలతో కలిసి కైలాసపర్వతాన్ని ఆశ్రయించి, తపస్సు చేశాడు. యోగశాస్త్రానుసారం తపస్సు గొప్పగా చేసి ముక్కంటిని చూశాడు.

ఆ సగరుడు శివుని చూసి భార్యలతో సహా నమస్కరించాడు. పుత్రుల నిమ్మని వరం అడిగాడు. భార్యలతో కూడిన సగరుని పట్ల ప్రసన్నుడై శివుడు పలికాడు 'నీవు ఏ ముహూర్తంలో అడిగావో దాని ఫలం ఇలా ఉంటుంది. అభిమానం గల అరవైవేల మంది శూరులైన కుమారులు ఒకభార్యకే పుడతారు. కాని వారందరు కలిసి ఒకేసారి నాశనం చెందుతారు. నీ రెండవభార్య గర్భం నుంచి ఒకే ఒక వంశోద్ధారకుడు పుడతాడు.' ఇలాచెప్పి రుద్రుడు అక్కడే అంతర్ధానమయ్యాడు. ఆ సగరుడు ప్రసన్నుడై తన రాజ్యానికి భార్యలతో కలిసి చేరాడు. ఆ భార్యలతో మిక్కిలి సంతుష్టుడై ఉన్నాడు. వైదర్భి, శైబ్య గర్భవతులు అయ్యారు. కొంతకాలానికి వైదర్భి ఒక సొరకాయవంటి దాన్ని ప్రసవించింది. శైబ్య దేవసమానుడైన కుమారుని ప్రసవించింది. సగరుడు ఆ ఫలాన్ని విసిరివేయటానికి ప్రయత్నించాడు. అంతలో ఆకాశం నుండి గంభీరధ్వని వినబడింది. 'రాజా! సాహసం చేయవద్దు. పుత్రులను విడచుట సరైనది కాదు. ఈ సొరకాయ నుంచి గింజలను తీసి, వేడి నేతిపాత్రలలో వేరువేరుగా ఉంచి జాగ్రత్తగా సంరక్షించు. అటుపైన అరవైవేలమంది పుత్రులను పొందుతావు. శివుని కారణంగా ఈ పుత్రులు నీకు ఏర్పడ్డారు. కావున మరొక రీతిగా ఆలోచించవద్దు.'

107. సగరపుత్రులు కపిలక్రోధాగ్నిలో నశించుట. అంశుమంతుడు సగరయజ్ఞమును పూర్తిచేయుట.

ఆకాశం నుంచి అశరీరవాణి మాటలు విని సగరుడు దాన్ని విశ్వాసంతో అనుసరించాడు. సగరుడు ఒక్కొక్క బీజాన్ని వేరుచేసి, నేతితో నింపిన కుండలలో వాటిని ఉంచాడు. పుత్రుల సంరక్షణకు వేరువేరుగా దాదులను నియమించాడు. చాలాకాలానికి బలవంతులయిన కుమారులు పుట్టారు. తేజోవంతుడైన సగరునికి రుద్రుని అనుగ్రహంవల్ల అరవైవేలమంది కుమారులు కలిగారు. వారు కరినులు, ఆకాశంలో సంచరించగల వారు, క్రూరకర్మలు చేసేవారు. ఎక్కువమంది అవడం చేత దేవతలతో సహా, లోకాలన్నింటిని అవహేళన చేయసాగారు. యుద్ధభూమిలో శోభించే ఆ రాజకుమారులు దేవతలను, గంధర్వులను, రాక్షసులను ప్రాణులందరినీ మిక్కిలి బాధించారు. అల్పబుద్ధులైన సగరపుత్రులచే బాధింపబడిన జనులు దేవతలతో కలిసి బ్రహ్మను శరణుకోరారు. సర్వలోకసృష్టికర్త అయిన బ్రహ్మ "మీరందరు ఎలా, ఎవరితో వచ్చారో అలా, వారితో మీ మీస్థానాలకు

తిరిగివెళ్ళండి. కొద్దిరోజులలో వారు ఆచరించిన అపరాధాలచే సగరపుత్రులు నాశనం కాగలరు." బ్రహ్మమాట విన్న జనులు, దేవతలు ఆయన అనుమతి గైకొని తమ తమ ప్రదేశాలకు తిరిగి వెళ్ళారు. చాలాకాలం గడచిన పిదప పరాక్రమవంతుడైన సగరుడు అశ్వమేధయజ్ఞదీక్ష స్వీకరించాడు. అతని యజ్ఞాశ్వం అతని పుత్రులచే సంరక్షింపబడుతూ స్వేచ్ఛగా భూమిపై తిరిగి జలశూన్య మయిన సముద్రతీరానికి వచ్చి అంతర్ధానం అయ్యింది. శ్రేష్ఠాశ్వం అపహరింపబడినట్లు భావించి సగరపుత్రులు తండ్రివద్దకు చేరి వృత్తాంతాన్ని నివేదించారు. అతని ఆజ్ఞపై అన్నిదిక్కులా గుర్రంకోసం వెతకటం ప్రారంభించారు. సప్తసముద్ర వన ద్వీప సహితంగా భూమినంతటిని వెదికారు. సగరపుత్రు లందరు పరస్పరం కలిశారు గాని గుఱ్ఱం జాడ గాని, గుఱ్ఱాన్ని అపహరించినవాని జాడ గాని తెలుసుకోలేకపోయారు.

తిరిగివచ్చి, తండ్రికి నమస్కరించి, ఎదుట నిలబడి "సముద్రవనసహితం, నదీనదగుహలతో సహా పర్వతవన ప్రాంతాలతో కూడిన భూమి అంతా నీ ఆజ్ఞతో మేము వెదికాం. అశ్వాన్నిగాని, అశ్వచోరునిగాని పట్టుకోలేకపోయాం" అన్నారు. ఈ మాటలు విన్న రాజు కోపంతో వివేకం కోల్పోయాడు. దైవవశంగా వారందరితో సగరుడు ఇలా అన్నాడు 'గుఱ్ఱాన్ని వెదకండి, దొరకేవరకు తిరిగిరావద్దు. యజ్ఞాశ్వం లేకుండా ఇంటికి రావద్దు'. తండ్రి ఆజ్ఞానుసారం సాగరులు తిరిగి భూమిని అంతటిని వెదకటం ప్రారంభించారు. ఒకచోట భూమిపై ఏర్పడిన బిలాన్ని చూశారు. ఆ బిలప్రదేశానికి వచ్చి సగరపుత్రులందరు గునపాలు, పారలతో సముద్రాన్ని త్రవ్వడానికి ప్రయత్నం చేశారు. వారందరు త్రవ్విన సముద్రం అన్నివైపులనుంచి ఎంతో బాధను అనుభవించింది. సగరపుత్రులచే చంపబడిన రాక్షసులు, సర్పాలు, అసురులు, మిగిలిన ప్రాణులు ఆర్తనాదాలు చేశాయి. తలలు తెగి, శరీరం ఛిన్నాభిన్నమై, ఎముకలు, సంధులు ఊడిన ప్రాణులు ఎన్నో వందలకొద్దీ కనిపించాయి. వరుణనివాస మయిన సముద్రం త్రవ్వుతుండగనే చాలా సమయం గడచింది. అశ్వం మాత్రం కనిపించలేదు. సాగరులు మిక్కిలి కోపించి, సముద్రపు ఈశాన్యదేశాన చీల్చి, పాతాళం చేరి, అక్కడ తిరుగుతున్న గుర్రాన్ని చూశారు. తేజోవంతుడై, కాంతితో అగ్నిజ్వాలలవలె ప్రకాశించే కపిలుని చూశారు. రాజా ! వారు ఆ గుర్రాన్ని చూసి, సంతోషంతో గగుర్పాటును పొంది, కపిల మహర్షిని లెక్కచేయక, కోపించి, గుర్రాన్ని పట్టుకోవాలని పరుగులు తీశారు. దానితో మునివర్యుడైన కపిలుడు కోపించాడు. వాసుదేవుడు అని అందరూ కీర్తించేవాడు అతడు కపిలుడు. అతడు కోపించి వారందరిపై తన కంటి తేజస్సును విడచాడు. మందబుద్ధిగల వారిని అందరిని కపిలుడు భస్మం చేశాడు. అంతలో

మహాతపస్వి నారదుడు సగరుని సమీపానికి వచ్చి జరిగిన వృత్తాంతాన్ని నివేదించాడు. నారదముని నోటినుంచి వెలువడిన ఆ ఘోరవార్తను విని సగరుడు కొద్దిసేపు మనసు అదుపు తప్పి శంకరుని మాటలను గుర్తుచేసుకోసాగాడు. రాజా ! సగరుడు అసమంజసుని కొడుకూ, తన మనుమడూ అయిన అంశుమంతుని పిలిచి ఇలా అన్నాడు. 'నా కొరకు నా పుత్రులందరు కపిలుని తేజస్సులో బూడిద అయ్యారు. పౌరుల రక్షణకోసం ధర్మాన్ని రక్షించే నేను నీ తండ్రిని కూడ విడచిపెట్టాను.'

అపుడు యుధిష్ఠిరుడు 'ఏ కారణంగా సగరుడు విడువవీలుకాని పుత్రుని విడచిపెట్టాడో నాకు చెప్పు.' అని అడిగాడు. లోమశుడు చెప్పాడు. 'శైబ్యవలన సగరునికి అసమంజసుడు అనే కుమారుడు కలిగాడు. అతడు పౌరులబిడ్డలను ఆటలలో శీఘ్రంగా అందుకొని, మెడలుపట్టి, నదిలోనికి విసరివేసేవాడు. పౌరులందరు భయంలో, శోకంలో మునిగిపోయి ఒకసారి సగరుని వద్దకు వచ్చారు. పౌరులందరు దోసిలి ఘటించి సగరునితో విన్నవించుకున్నారు. 'మీరు పరసేనలనుండి మమ్ము రక్షించేవారు. అసమంజసుని వలన కలిగిన ఘోరభయంనుండి మీరే రక్షించాలి.' పౌరులమాటలు విన్న నృపశ్రేష్ఠుడు సగరుడు రెండు ఘడియలపాటు కలవరపడి మంత్రులతో ఇలా అన్నాడు. 'ఈ నగరం నుండి నా పుత్రుడు అసమంజసుని వెడలగొట్టండి. మీరు నా హితాన్ని కోరితే ఈ పనిని వెంటనే ఆచరించండి.' రాజు మాటలు విన్న మంత్రు లందరు రాజాజ్ఞానుసారం దానిని ఆచరించారు. పౌరుల హితంకోరిన సగరుడు పుత్రుని వెడలగొట్టాడు. ఆ సమయాన సగరుడు అంశుమంతునితో అన్న పలుకులు వినిపిస్తాను విను.

సగరుడు అన్నాడు. 'నీ జనకుని త్యాగంచేతనూ ఇతర కుమారుల మరణంచేతనూ అశ్వం లభింపకపోవటంచేతనూ బాధపడుతున్నాను. యజ్ఞ విఘ్నంచే వివేకం కోల్పోయి దుఃఖం అనుభవిస్తున్న నాకు అశ్వాన్ని తీసుకొని వచ్చి ఇచ్చి, నాకు నరకగతి లేకుండా చూడు. అంశుమంతుడు సగరుని పలుకులు విని దుఃఖంతో తనతండ్రులు భూమి చీల్చినచోటుకు చేరాడు. అతడు ఆ మార్గంలోనే సముద్రంలోకి ప్రవేశించాడు. అక్కడ తాపసి కపిలుని, ఆ యజ్ఞాశ్వాన్నీ చూశాడు. తేజోరాశి, మునిశ్రేష్ఠుడు, ప్రాచీన ఋషి అయిన కపిలుని చూచి, శిరసు భూమిపై ఆన్చి, నమస్కరించి, వచ్చినపనిని తెలియజేశాడు. సంతోషంలో మునిగిన కపిలుడు ప్రసన్నుడై "నేను నీకు వరం ఇవ్వాలి అని అనుకొంటున్నాను" అన్నాడు. అంశుమంతుడు "యజ్ఞసమాప్తికై ముందుగా అశ్వాన్ని ఇమ్మని ప్రార్థించాడు. పితరులను తరింపజేయతలచి రెండవవరాన్ని కూడా కోరాడు. మునిశ్రేష్ఠుడైన కపిలుడు "నీకు శుభాన్ని, నీవు కోరిన వరాలను ఇస్తాను" నీలో ఓర్పు, ధర్మం, సత్యపాలనం

ఉన్నాయి. నీచే సగరుడు కృతార్థుడు అయ్యాడు. నీ తండ్రి నీ కారణంగా పుత్రవంతుడు అయినాడు అని భావిస్తున్నాను. నీ మహిమచేతనే సగరపుత్రులు అందరు స్వర్గానికి చేరుతారు. నా క్రోధాగ్నిలో మిడుతలవలె నీ తండ్రులు మాడిపోయారు. నీ మనుమడు స్వర్గం నుంచి గంగను తీసుకొని రాగలడు. తపస్సుచే శంకరుని సంతోషపెట్టి వారిని తరింపచేస్తాడు. యజ్ఞాశ్వాన్ని తీసుకొని వెళ్ళు. నీకు మేలు కలుగుతుంది" అన్నాడు.

అంశుమంతుడు గుఱ్ఱాన్ని తీసుకొని యజ్ఞశాలకు వచ్చి సగరుని పాదాలకు నమస్కరించాడు. శిరస్సుపై తాకి, చుంబించిన అతడు పూర్తివృత్తాంతాన్ని సగరపుత్రుల నాశాన్ని విన్నది విన్నట్లు, చూసింది చూసినట్లు వివరించాడు. 'అశ్వం యజ్ఞశాల చేరింది' అని చెప్పాడు. అది విన్న సగరుడు పుత్రులను కోల్పోయిన దుఃఖాన్ని మరచిపోయాడు. అంశుమంతుని ప్రశంసించి సగరుడు యజ్ఞాన్ని పూర్తిచేశాడు. యజ్ఞాన్ని ఆచరించి, దేవతలందరి సత్కారాల నందాడు. కమలనేత్రు డయిన సగరుడు సముద్రాన్నే తన పుత్రునిగా భావించాడు. చిరకాలం రాజ్యాన్ని పరిపాలించాడు. అంశుమంతునిపై రాజ్యభారం ఉంచి స్వర్గం చేరాడు. ధర్మాత్ముడైన అంశుమంతుడు సాగరంచే చుట్టబడిన భూమిని అంతటినీ సగరుని వలెనే శాసించాడు. అతనికి ధర్మవేత్త అయిన దిలీపుడు అనే కుమారుడు పుట్టాడు. దిలీపునికి రాజ్యం అప్పగించి, అంశుమంతుడు కూడ స్వర్గానికి చేరాడు. దిలీపుడు పితరుల మరణవార్తను విని, మిక్కిలి దుఃఖంతో తపించి, వారికి ఉత్తమగతులు కలగడం కోసం ఆలోచించాడు. గంగను భూమిపై దింపుటకు గొప్పప్రయత్నం చేశాడు. తాను యధాశక్తిగా ప్రయత్నించినా అది సాధ్యం కాలేదు. అతనికి ధర్మపరాయణుడు, తేజోమూర్తి, శ్రీమంతుడు అయిన భగీరథుడు అనే కుమారుడు కలిగాడు. అతనికి పట్టాభిషేకం చేసి దిలీపుడు వానప్రస్థానికి చేరాడు. తపస్సువలన కలిగిన సిద్ధులచే ఆ దిలీపుడు కొంతకాలానికి వానప్రస్థం నుంచి స్వర్గానికి చేరుకొన్నాడు.

108. భగీరథుడు తపస్సు చేయుట, గంగను భరించుటకు శంకరుని కోరుట.

భగీరథుడు చక్రవర్తిగా, మహాధన్విగా, మహారథుడుగా ప్రశంసలు పొందాడు. కపిలుని కారణంగా తన పితృదేవతలకు కలిగిన నాశాన్ని, స్వర్గప్రాప్తి లేకపోవటమూ సంపూర్ణంగా విన్నాడు. మంత్రులపై రాజ్యభారం ఉంచి బాధపడుతూ హిమాలయం చరియలకు తపస్సు చేయటానికి వెళ్ళాడు. తపస్సుచే పాపాలు పోగొట్టుకొని, గంగను ఆరాధించటానికి భగీరథుడు ముందు హిమవంతుని దర్శించాడు. గైరికాది ధాతువులచే ప్రకాశిస్తూ, అనేక శిఖరాలతో, గాలి ఆధారంగా పర్వతం నలువైపులా కదలుతున్న

మేఘాలతో నిండిన హిమాలయాన్ని చూశాడు. ఆ పర్వతం నదులు, పాదలు, తీరాలు, మందిరాలతో నిండి ఉంది. గుహలు, కందరాలలో సింహాలు, వ్యాఘ్రాలు దాగి ఉన్నాయి. ఆ పర్వతం మీద విచిత్ర వర్ణాలతో కూడిన శరీరాలతో, ఎన్నో కూతలు కూస్తూ చాలా పక్షులు ఉన్నాయి. వాటిలో తుమ్మెదలు, హంసలు, చాతకాలు, నీటికోళ్లు, నెమళ్లు, బెగ్గురులు, కొంగలు, కోకిలలు, నల్లని క్రీగన్నులు కల చకోరాలు, పుత్రప్రియలు కూడా ఉన్నాయి. సుందరజలాశయాలు తామరతీగలతో నిండి ఉన్నాయి. బెగ్గురుపక్షుల మధురధ్వనులతో అది మారుమ్రోగుతోంది. కిన్నరులు, అప్సరసలు రాళ్లపై కూర్చుని ఉన్నారు. ఎక్కడ చూసినా ఏనుగులు చెట్లను ఒరుసుకొంటున్నాయి. ఒకవైపు రత్నాలు, మరొకవైపు విద్యాధరులు, విషాన్ని గ్రక్కుతూ భుజంగాలు ఆ ప్రదేశంలో తిరుగుతున్నాయి. ఒకచోట బంగారపు రంగు, మరొకచోట వెండిరంగు, మరొకచోట కాటుకరంగుతో సమానమైన హిమాలయాన్ని భగీరథుడు చేరాడు. ఆ రాజు చాలా వేల సంవత్సరాలు ఫలాలు, దుంపలు, నీరు భక్షించి తపస్సు చేశాడు. దేవతల వేయిసంవత్సరాలు గడవగా మహానది గంగ ఆకారం దాల్చి అతని ముందు ప్రత్యక్షం అయింది.

గంగ పలికింది – "నానుంచి ఏమి ఆశిస్తున్నావు? నీకేమి ఈయగలను? అడుగు. నీమాటల్ని ఆచరిస్తా." ఈ మాటలు విన్న భగీరథుడు హైమవతీనదికి అంజలి ఘటించి నమస్కరించి అన్నాడు – "నా పితామహులు యజ్ఞాశ్వాన్ని వెదకుతూ కపిలుని క్రోధాగ్నితో యమలోకం చేరారు. వారు అరవైవేలమంది. సగరుని పుత్రులు. కపిలుని ఆశ్రమం చేరి క్షణకాలంలో నశించారు. ముని కోపాగ్నిలో భస్మమైన వారికి స్వర్గనివాసం లేదు. ఆ సగరపుత్రుల శరీరాలకు నీ జలస్పర్శ లేకపోతే ఉత్తమగతులు లేవు. సగరపుత్రు లందరినీ స్వర్గాన్ని చేర్చు. వారిని ఉద్ధరించమని నిన్ను నేను ప్రార్థిస్తున్నాను." లోమశుడు పలికాడు – "రాజు మాటలు విని, విశ్వవంద్య అయిన గంగ ప్రసన్నురాలై భగీరథునితో ఇలా పలికింది. 'నీ మాటలను ఆచరించటానికి నేను అంగీకరించాను. కాని ఆకాశం నుండి భూమికి పేరేటప్పుడు నా వేగం సహింపశక్యం కానిది. దేవతాగ్రగణ్యుడు శంకరుని విడచి, మూడు లోకాల్లోనూ వేరొకరు నా వేగాన్ని ధరింపలేరు. వరాలనిచ్చే శంకరుని తపస్సుతో సంతోషపరచు. స్వర్గం నుంచి జారే నన్ను శంకరుడు తన శిరస్సుతో ధరిస్తాడు. నీ పితరుల హితాన్ని కోరి, నీ తపస్సు వలన శివుడు నీ కోరికను తీర్చగలడు.' వెంటనే భగీరథుడు శంకరుని గూర్చి తపస్సు చేసి కొంతకాలానికి శంకరుని ప్రసన్నం చేసుకొన్నాడు. రాజా ! గంగను ధరించటానికి ఆయననుంచి పితృదేవతల స్వర్గప్రాప్తికై వరం తీసుకొన్నాడు ఆ నరోత్తముడు.

109. గంగావతరణము - సగరపుత్రుల ఉద్ధరణము.

భగీరథుని ప్రార్థన విన్న శివుడు దేవతల ప్రీతికై "అలాగే" అన్నాడు. 'రాజశ్రేష్ఠా ! ఆకాశం నుంచి జారే దేవనది గంగను నీకోసం తప్పక ధరిస్తాను.' అని పలికాడు. ఇలా పలికి శివుడు నానావిధాయుధాలతో సిద్ధమైన, భయంకరులైన శివగణాలతో హిమాలయాన్ని చేరాడు. అక్కడే ఉండి నరశ్రేష్ఠుడైన భగీరథునితో పలికాడు - 'పర్వతరాజు పుత్రి అయిన గంగను భూతలంపై దిగమని ప్రార్థించు. నీ పితరులను పావనం చేయటానికి స్వర్గం నుండి జారిపడే గంగను నేను శిరసావహిస్తాను. శంకరుడు చెప్పిన మాట విని రాజు ఇంద్రియనిగ్రహంతో ఏకాగ్రచిత్తంతో గంగకు నమస్కరించి, ప్రార్థించాడు. రాజుచే ప్రార్థింపబడిన పవిత్రగంగ శంకరుని సంసిద్ధతను చూసి, ఆకాశం నుంచి జారిపడింది. ఆమె జారుతుండగా చూచిన మహర్షులతో కూడి దేవతలు, గంధర్వులు, యక్షులు, నాగులు చూడాలని అక్కడకు వచ్చారు. ఆకాశం నుంచి హిమవంతుని పుత్రిక గంగ ఒక్కసారిగా క్రిందకు పడింది. పెద్దపెద్ద సుడులు, చేపలు, మొసళ్ళతో గంగ వ్యాపించి ఉంది. ఆకాశపు మొలనూలు వంటి గంగ శివుని నుదుటిపై ముత్యాలమాల వలె ప్రకాశించింది.

సముద్రం వైపు ప్రవహించే ఆమె మూడు ధారలు కలిగి ఉంది. నురుగు పంజాలు కలిగి, హంసలబారులవలె వంకరలు తిరుగుతూ శరీరపుష్టిగల స్త్రీవలె పై నుంచి క్రిందకు జారుతూ ఉంది. తెల్లని వస్త్రాలు దాల్చిన మదించిన స్త్రీవలె నురుగు ఆమెను కప్పింది. జలాల సవ్వడులతో అందమైన ధ్వనిని ఒకవైపు చేస్తూ ఉంది. ఈ ప్రకారంగా చాలారూపాలను దాల్చి ఆకాశం నుంచి క్రిందికి జారింది. భూమిని చేరి భగీరథునితో అంది. 'భగీరథా! వెళ్ళుటకు తగిన మార్గాన్ని చూపించు. నీ కొరకే భూమికి దిగాను.' ఇది విని అతడు ఏ ప్రదేశంలో సగరపుత్రుల శరీరాలు ఉన్నాయో ఆ శరీరాలపై ప్రవహింపజేయటానికి బయలుదేరాడు. విశ్వవంద్యుడైన శివుడు గంగను శిరస్సుపై ధరించి కైలాసానికి దేవతలతో సహా వెళ్ళాడు. భగీరథుడు గంగతో సముద్రతీరాన్ని చేరి వరుణనిలయమైన సముద్రాన్ని వేగంగా నింపాడు. ఆ రాజు ఆమెను కుమార్తెగా భావించాడు. పితృదేవతల కోరిక తీర్చి జలాంజలులు విడిచాడు. గంగ ఈకారణంగా త్రిపథసంచారిణి అయింది (స్వర్గ, పాతాళ, మర్త్య లోకాల్లో ప్రవహించి) సముద్రాన్ని నింపటానికే ఆకాశం నుంచి క్రిందకి దిగింది. దేవతలు కాలకేయులను చంపిన విధానం, లోకోద్ధరణంకోసం సముద్రజలాన్ని త్రాగిన అగస్త్యుని వృత్తాంతం, అగస్త్యునిచే బ్రహ్మహత్యలు చేసే వాతాపి నాశం ఎలా జరిగిందో అది అంతా నీవు ప్రశ్నించిన ప్రకారం సమాధానం చెప్పాను.

110. నంద, కౌశికల గొప్పతనము, ఋష్యశృంగుని కథ - లోమపాదుడు ఋష్యశృంగుని తీసుకొనివచ్చుట.

తరువాత ధర్మజుడు క్రమంగా ముందుకు సాగాడు. పాపాలు పోగొట్టగల నంద, అపరనంద అనే నదులవైపు యాత్ర ప్రారంభించాడు. రోగశోకాలు లేని హేమకూటపర్వతాన్ని చేరి అతడు అద్భుతాలయిన విషయాల నెన్నింటినో చూశాడు. వాయువు సహాయం లేకుండా మేఘాలు ఏర్పడుతున్నాయి. రాళ్ళు వాటంతట అవే పర్వతం నుంచి జారుతున్నాయి. దీనులైన జనులు ఆ పర్వతాన్ని అధిరోహించలేరు. ప్రతిదినం అక్కడ గాలి సక్రమంగా వీస్తుంది. ప్రతిదినం మేఘాలు వర్షిస్తాయి. వేదస్వాధ్యాయధ్వని వినిపిస్తుంది. కాని చేసేవారు మాత్రం కనిపించరు. సాయంకాలం, ఉదయం సూర్యుడు వెలుగుతూ కనిపిస్తాడు. తపస్సుకు విఘ్నం కలిగించే దోమలు మాటిమాటికి కుడతాయి. జనుడు విరాగియై పదే పదే ఇంటిని గుర్తుచేసుకొంటాడు. ఇలాంటి అద్భుతాలను చాలా వాటిని చూచి ధర్మరాజు లోమశుని ప్రశ్నించాడు. 'మహాత్మా ! ఈ పర్వతమందున్న చిత్రవిచిత్రాలు అన్నీ వివరంగా చెప్పండి" అపుడు లోమశుడు చెపుతున్నాడు "మేం ఇదివరకు ఏది విన్నామో దాన్ని పూర్తిగా వివరిస్తాను. ఏకాగ్రచిత్తంతో విను. ప్రాచీనకాలంలో ఈ ఋషభకూటంలో దీర్ఘాయువు, తాపసి, మిక్కిలి క్రోధశీలిఅయిన ఋషభుడు అనే ఋషి ఉండేవాడు. అతడు ఇతరులచే పదేపదే పిలువబడి కోపించి పర్వతంతో అన్నాడు - 'నన్ను ఇక్కడ పిలిచిన వాడిపై రాళ్ళవర్షాన్ని కురిపించు.' గాలిని పిలిచి అతనితో అన్నాడు 'ఇక్కడ ఏ శబ్దం వినపడకూడదు. అప్పటినుంచి ఇక్కడ ఎవరైనా మాట్లాడితే మేఘగర్జన వారిని నివారిస్తుంది.' ఇలా ఋషభుడు అద్భుతకార్యాలనాచరించాడు. ఇందులో కొన్ని క్రోధంచేత విధింపబడ్డాయి. కొన్ని నిషేధింపబడ్డాయి.

రాజా ! పూర్వకాలంలో దేవతలు నందాతీరానికి చేరారు. అదే సమయంలో దేవదర్శనం కోరి కొందరు మనుష్యులు అక్కడికి వచ్చారు. మనుష్యుల దర్శనాన్ని ఇష్టపడని ఇంద్రాదిదేవతలు విఘ్నరూపం అయిన ఈ పర్వతాన్ని ప్రవేశింప వీలుకాని దుర్గంగా చేశారు. కౌంతేయా! అప్పటి నుంచి మనుష్యులు ఈ పర్వతాన్ని చూడనే లేరు. ఇంక అధిరోహించటం ఎక్కడిది? కౌంతేయా ! తపస్సు చేయనివాడు ఈ పర్వతాన్ని చూడలేడు, అధిరోహించలేడు. కావున మౌనవ్రతాన్ని పాటించు. భారతా ! ఇక్కడే ఆ రోజుల్లో దేవతలు గొప్ప యజ్ఞాల ననుష్ఠించారు. వాటి చిహ్నాలు ఇప్పటికీ ప్రత్యక్షంగా కనపడతాయి. రాజా ! ఈ గడ్డి దర్భలఆకారంలోను, భూమిపై పరిచినట్లూ కనిపిస్తుంది. ఈ వృక్షాలు యజ్ఞంలోని యూపస్తంభాలవలె కనిపిస్తాయి. భారతా ! దేవతలు, ఋషులు

ఇప్పటికీ ఇక్కడ నివసిస్తున్నారు. వారికి ఉదయం, సాయంత్రం అగ్ని ప్రజ్వలిస్తూ కనిపిస్తాడు. కౌంతేయా ! ఇక్కడ మునిగిన వారి పాపాలు వెంటనే నశిస్తాయి. నీవు నీ సోదరులతో కలిసి ఇక్కడ స్నానం చెయ్యి. నందానదిలో స్నానం చేసి కౌశికీనదికి చేరగలవు. విశ్వామిత్రమహర్షి ఇక్కడే కఠోరం, ఉత్తమం అయిన తపస్సు ఆచరించాడు. ఆ మాట విని అపుడు "సోదరులతో కలిసి, నందానదిలో స్నానం చేసిన ధర్మరాజు అక్కడి నుంచి పవిత్రం, శైత్యం, శుభకరమయిన నీళ్లున్న కౌశికిని చేరాడు.

లోమశుడు అన్నాడు – "భరతర్షభా ! ఈ కౌశికి దేవనది. పవిత్రమైంది. అందమైన విశ్వామిత్రుని ఆశ్రమం ఇక్కడే ప్రకాశిస్తూ ఉంది. ఇది కశ్యపగోత్రజుడు, మహాత్ముడు అయిన విభాండకుని 'పుణ్య' అనే పేరుగల ఆశ్రమం. అతని కుమారుడు ఇంద్రియనిగ్రహం కలిగి, తాపసి అయిన ఋష్యశృంగుడు. దేశంలో అనావృష్టి ఆవరించినప్పుడు మునిభయంతో ఇంద్రుడు వర్షాన్ని కురిపించాడు. కశ్యపవంశజుడు, విభాండకుని కుమారుడు అయిన ఋష్యశృంగుడు లేడికి పుట్టాడు. లోమపాదరాజు రాజ్యానికి అతడు ఎంతో మేలు చేశాడు. సస్యాలు వర్షధారలతో సమృద్ధిగా పెరిగాయి. సూర్యుడు బ్రహ్మకు తన కుమార్తె సావిత్రిని అప్పగించినట్లు లోమపాదుడు తన కుమార్తె శాంతను ఋష్యశృంగునికి ఇచ్చి వివాహం చేశాడు.' యుధిష్ఠిరుడు అడిగాడు 'ఋష్యశృంగుడు లేడినుంచి ఎట్లా పుట్టాడు? మనుష్యులు పశువుల నుంచి సంతానాన్ని ఎలా పొందుతారు? పొందినా అతడు తపస్సును ఎలా ఆశ్రయించాడు? అనావృష్టి ఏర్పడితే బల,వృత్రులను చంపిన ఇంద్రుడు ఋష్యశృంగుని భయంవల్ల ఎట్లా వర్షాన్ని కురిపించాడు? నియమవతియై వ్రతపాలన సాగించే శాంత మృగ స్వరూపుడైన మునికి ఏ విధంగా మోహాన్ని కలిగించింది? లోమపాదుడు రాజర్షి, ధార్మికుడు అని అందరికీ తెలుసు. అయినా అతని రాజ్యంలో ఇంద్రుడు వర్షాన్ని ఏ కారణంగా కురిపించలేదు? ఇది అంతా నాకు వివరంగా యథాతథంగా వివరించు. నేను ఋష్యశృంగ మహర్షి చరిత్ర వినాలని కుతూహలపడుతున్నాను.'

లోమశుడు చెప్పాడు – "బ్రహ్మర్షి అయిన విభాండకుని మనస్సు తపస్సుచే పరిశుద్ధం అయింది. అతడు ప్రజాపతి సమానుడు. అమోఘవీర్యవంతుడు. ప్రతాపవంతుడైన ఋష్యశృంగుడు అతనికి ఎలా జన్మించాడో విను. విభాండకునివలె అతనికుమారుడు కూడా తేజస్వి. బాల్యంలోనే వృద్ధులచే గౌరవింపబడినాడు. కశ్యపగోత్రీయుడైన విభాండకుడు దేవతలవలె అందగాడు. అతడు ఒకప్పుడు గొప్పకుండంలోకి దిగి చాలకాలం తపస్సుచేసి అలసిపోయాడు. ఒకనాడు విభాండకుడు స్నానం చేస్తుండగా అప్సరస ఊర్వశిని చూచిన అతని రేతస్సు(వీర్యం) స్రవించింది. అదే సమయాన నీటికోసం అక్కడికి వచ్చిన లేడి

కడుపులో అది ప్రవేశించింది. నీటితో సహా వీర్యాన్ని త్రాగిన ఆ లేడి గర్భం దాల్చింది. ఆమె పూర్వకాలంలో ఒక దేవకన్య. సృష్టికర్త బ్రహ్మ ఒక మాటను ఆమెకు ఇచ్చాడు. 'దేవకన్యవైన నీవు ఆడులేడిగా మారి ఒక ముని కారణంగా కుమారుని కన్నప్పుడు నీ రూపం నీకు వస్తుంది' అన్నాడు. అమోఘవాణి కల బ్రహ్మమాటలు జరిగితీరవలసిందేకదా! ఆ లేడి నుంచి ఆ విభాండకుని కుమారుడుగా ఋష్యశృంగుడు పుట్టాడు. ఆయన ఎల్లప్పుడూ తపస్సు ఆచరిస్తూ వనంలోనే ఉండిపోయాడు. రాజా ! ఆ ఋషి శిరస్సుపై ఒకకొమ్ము ఏర్పడటం చేత ఆయన లోకంలో ఋష్యశృంగుడు అనే పేరుతో ప్రసిద్ధి పొందాడు. రాజా ! తండ్రిని తప్ప మరొక మనిషిని ఆయన ఎన్నడూ చూడలేదు. కావున ఆయన మనస్సు నిత్యం బ్రహ్మచర్యం పాటిస్తూ ఉంది. ఇదే కాలంలో దశరథుని మిత్రుడు లోమపాదుడు అనే ప్రసిద్ధరాజు అంగరాజ్యాన్ని పరిపాలిస్తూ ఉండేవాడు. అతడు స్వేచ్ఛగా ఒకబ్రాహ్మణునితో అసత్య వ్యవహారం చేశా డని వినికిడి. ఈ అపరాధంతో బ్రాహ్మణు లందరు ఆయన రాజ్యాన్ని విడచివెళ్ళారు. పురోహితునికి కీడు చేయటంచేత ఆ రాజు రాజ్యంలో ఇంద్రుడు వర్షాన్ని కురిపించలేదు. ప్రజలందరు కరువుతో బాధపడ్డారు. రాజా! ఇంద్రునిచే వర్షం కురిపించటంలో సమర్థులు, తాపసులు, విద్వాంసులు అయిన బ్రాహ్మణులను అతడు సంప్రదించాడు. 'మేఘాలు వర్షించే ఉపాయం చెప్పండి' అని వారిని అడిగాడు. వారు తమ తమ అభిప్రాయాలను అతనికి వివరించారు.

వారిలో ఒక మునిశ్రేష్ఠుడు రాజుతో ఇలా అన్నాడు. 'రాజా ! నీపై బ్రాహ్మణులకు కోపం కలిగింది. దీనికి ప్రాయశ్చిత్తం చెయ్యి. రాజా ! ఋష్యశృంగుడనే పేరుగల మునికుమారుని పిలిపించు. అతడు వనవాసి, సరళస్వభావం కలవాడు. స్త్రీలంటే తెలియనివాడు. రాజా ! ఆ మహాతపస్వి నీ రాజ్యంలో అడుగుపెట్టగానే మేఘాలు వాటంతట అవే కురుస్తాయి. ఈ విషయంలో నాకు సందేహం లేదు.' ఈ మాటలు విని, తన అపరాధానికి తగిన ప్రాయశ్చిత్తం కోసం బ్రాహ్మణుల వద్దకు పోయి వారిని ప్రసన్నం చేసుకొని తిరిగి తన రాజధానికి వచ్చాడు.

'రాజు తిరిగి వచ్చాడు' అన్న వార్త విని ప్రజలందరూ మిక్కిలి సంతోషించారు. పిమ్మట అంగరాజైన లోమపాదుడు మంత్రకుశలులు అయిన మంత్రులతో మాట్లాడి ఋష్యశృంగుని రప్పించటానికి ప్రయత్నం చేశాడు. మర్యాద నతిక్రమింపని అతడు శాస్త్రజ్ఞులు, నయకోవిదులు, అర్థశాస్త్రజ్ఞులు అయిన వారితో విచారించి ఒక ఉపాయాన్ని తెలుసుకొన్నాడు. తరువాత లోమపాదుడు ఇతరులను మోసగింపగల కళాకోవిదలయిన వేశ్యలను రప్పించి వారితో పలికాడు. 'మీరందరు ఋష్యశృంగుని ఏదో ఒక ఉపాయంతో

ఇక్కడకు తీసుకురండి. ప్రలోభపెట్టి, నమ్మించి నా రాజ్యానికి తీసికొనిరండి.' మహారాజు మాటలు విని, వారు ఒకవైపు మునిశాపానికి, వేరొకవైపు రాజభయానికి లొంగి ఆ పని అసాధ్యం అని రాజుకు తెలియజేశారు. ఆ సమయంలో వారి ముఖాలు వివర్ణమై, చైతన్యం కోల్పోయి ఉన్నాయి. వారిలో ఒక ముసలి స్త్రీ ఉంది. ఆమె రాజుతో ఇలా పలికింది. 'నేను ఆ తపోధనుని తీసుకొని వచ్చే ప్రయత్నం చేస్తాను. నా మనస్సులోని కోరికలు అన్నింటికీ మీరు అంగీకరించాలి.' ఆమె కోరికలను తీర్చడానికి రాజు అంగీకరించాడు. వెంటనే ఆమెకు ధనరాశులను, వివిధ రత్నాలను సమర్పించాడు. ఆ ముసలివేశ్య సౌందర్యవతులు, యౌవనవతులు అయిన ఇతర వేశ్యలను కొందరిని తీసుకొని వనానికి బయలుదేరింది.

111. వేశ్యలు ఋష్యశృంగుని ప్రలోభపరచుట - విభాండకుడు పుత్రుని చింతకు కారణమడుగుట.

ఆమె రాజకార్యసాధనకై రాజాజ్ఞను అనుసరించి, తన బుద్ధితోఆలోచించి, ఒక నావపై సుందర ఆశ్రమం నిర్మించింది. ఆ ఆశ్రమం వారు కల్పించిన వివిధ పుష్పఫల వృక్షాలతో శోభిస్తోంది. రకరకాల తీగెలతో పుష్పవక్షాలు, రసవంత మయిన ఫలాలతో ఫలవృక్షాలు కనిపిస్తున్నాయి. అది అత్యంతం సుందరమై, మనోహరమై ఉంది. వేశ్య నావపై సుందరాశ్రమాన్ని నిర్మించింది. అది చూడముచ్చటగా ఉంది. ఆ నావను కాశ్యపాశ్రమానికి దూరంలో కట్టి గూఢచారులను పంపి విషయం గ్రహించి రమ్మంది. ఆ సమయంలో విభాండకముని ఆశ్రమంలో లేడు. విభాండకుడు ఆశ్రమంలో లేడని గ్రహించి ఆ వేశ్య బుద్ధిమంతురాలు అయిన తన కుమార్తెను పిలిచి చేయవలసిన పనిని ఆదేశించింది. ఆమె కార్యసాధనలో నిపుణురాలు. ఆమె ఆశ్రమానికి వెళ్ళి, నిరంతరం తపస్సులో లీనమయిన ఋష్యశృంగుని చూచి ఇలా అంది.

'తాపసా! తాపసు లందరు క్షేమమేనా? దుంపలు, పళ్ళు అధికంగా ఈ ప్రదేశంలో లభిస్తున్నాయా? నీకు ఈ ఆశ్రమం ప్రసన్నంగా ఉందా? నేను ఇప్పుడు ప్రత్యేకంగా మిమ్ములను చూడడానికి వచ్చాను. ఋష్యశృంగా ! తాపసుల తపస్సు వృద్ధిని పొందుతున్నదా? నీ తండ్రి తేజస్సంపన్నుడు అవుతున్నాడా? మీరు ఆనందం అనుభవిస్తున్నారా? మీ స్వాధ్యాయం సక్రమంగా సాగుతోందా?' ఋష్యశృంగుడు పలికాడు. 'మీరు మీ సమృద్ధిచే జ్యోతివలె వెలుగుతున్నారు. నేను మిమ్ములను వందనీయులని భావిస్తున్నాను. ధర్మాన్ని అనుసరించి స్వేచ్ఛగా మీకు అర్ఘ్యపాద్యాదులు, ఫలమూలాలు అర్పిస్తున్నాను. మీరు

దర్భాసనంపై కూర్చోండి. దీనిపై నల్లలేడి చర్మం పరచబడింది. కావున దీనిపై ఆసీనులై విశ్రాంతిని పొందుతారు. బ్రహ్మా! దేవతాసమానులైన మీరు ఏ వ్రతాన్ని పాలిస్తున్నారు.' వేశ్య పలికింది. 'కశ్యపగోత్రజుడా! నా ఆశ్రమం అందమైంది. ఈ పర్వతానికి ఆవలివైపున మూడు యోజనాల దూరంలో ఉంది. నా ధర్మాన్ని అనుసరించి మీరు నాకు నమస్కరించాల్సిన పనిలేదు. నేను మీరిచ్చిన అర్ఘ్యపాద్యాదులను స్పృశింపను. నేను మీచే నమస్కరింపతగను. మీరే నాకు నమస్కరింపతగినవారు. ఇది మా వ్రతస్వరూపం. మీరు మాకు కొగిలింపదగినవారు.' ఋష్యశృంగుడు పలికాడు - 'నేను నీకు పండిన పండ్లను ఇస్తాను. జీడిమామిడులు, ఉసరికలు, పిప్పలాలు, గారఫలాలు, మొదలైన అనేకఫలాలు ఉన్నాయి. మీకు ఇష్టమైనవాటిని గ్రహించండి.' లోమశుడు పలికాడు - ఆ వేశ్యవాటిని విడచి ఋష్యశృంగునికి రుచికరాలు, అమూల్యాలు అయిన భక్ష్యవిశేషాల నిచ్చింది. అవి అతనికి వాటిపై రుచిని పెంచాయి. సుగంధభరితాలైన మాలలు, చాలా రంగులతో ప్రకాశించే బట్టలు, త్రాగడానికి వీలైన రసాలు ఇస్తే అతడు ఆనందించి, వాటిని అనుభవించి, వెంటవెంటనే నవ్వసాగాడు. వేశ్య ఆయన సమీపంలో బంతితో ఆడింది. తన అవయవాలు అతనికి తాకిస్తూ చెట్టు నుంచి విడి, క్రింద పడిన లతవలె మాటిమాటికి ఋష్యశృంగుని కొగిలించుకొంది. మిక్కిలి పుష్పించిన శాల, అశోక, తిలకవృక్షాలను వంచి, పుష్పాలను కురిపించి, మదవతి వలె సిగ్గుపడి ఆ విభాండకపుత్రుని ప్రలోభపెట్టింది. ఋష్యశృంగునిలో కలిగిన వికారాన్ని గమనించి, మాటిమాటికీ ఆలింగనం చేసికొని, మెల్లమెల్లగా వెనక్కి తిరిగి చూస్తూ, అగ్నిహోత్రమిషచే మెల్లిగా అక్కడి నుంచి బయలుదేరింది.

ఆమె వెళ్ళిక మదనపీడితుడై ఋష్యశృంగుడు అచేతను డయ్యాడు. ఆ నిర్జన ప్రదేశంలో అతని మనస్సు ఆమెవైపు లగ్నమైంది. నిట్టూరుస్తూ, దీనంగా అలాగే ఉండిపోయాడు. కొంతసేపటికి ఆకుపచ్చ, పింగళపురంగు నేత్రాలు గల కశ్యపగోత్రీయుడు, స్వాధ్యాయశీలి, నియమసమాధి కలవాడు అగు విభాండకుడు ఆశ్రమంలో ప్రవేశించాడు. అతడు తలనుంచి పాదాలవరకు రోమాలతో నిండి ఉన్నాడు. పుత్రుని సమీపానికి వచ్చి, ఒంటరియై, ఉదాసీనుడై ఆమెనే ధ్యానిస్తున్న దీనుడైన కుమారుణ్ణి చూశాడు. అతడి మనస్సు విపరీతమైన దశలో ఉంది. మాటిమాటికి నిట్టూరుస్తూ పైకి చూస్తూ కనిపించాడు. 'నాయనా! సమిధలు సిద్ధం చేసి అగ్నిహోత్రం వెలిగించలేదేమి? స్రుక్స్రువాలు శుభ్రం చేయలేదు! దూడతో కూడిన హోమధేనువును తీసుకురాలేదు ! కారణం ఏమిటి? నేడు నీవు ఇదివరకటి ఋష్యశృంగునిలా లేవు. ఏదో ఆలోచిస్తూ చైతన్యం కోల్పోయి దీనుడివై ఉన్నావు. నేను లేనప్పుడు ఆశ్రమంలో ఎవరైనా ప్రవేశించారా ? చెప్పు !' అన్నాడు.

112. వేశ్యను మునికుమారుడు అని భావించిన ఋష్యశృంగుడు తండ్రితో తన ఆసక్తి తెలియజేయుట.

ఋష్యశృంగుడు చెప్పాడు. 'ఇక్కడకు ఒక జడధారి, బ్రహ్మచారి, ఉదారుడు, పొట్టిపొడుగు కానివాడు, బంగారు రంగు, కమలదళాలవంటి కళ్ళు కల్గి దేవతల వలె ప్రకాశించేవాడు వచ్చాడు. అతనిరూపం సుందరం, సూర్యునివలె వెలుగుతున్నాడు. స్వచ్ఛత, నల్లదనం కల నేత్రాలు, తెల్లనిరంగు, నల్లనిజడలు, సుగంధం, బంగారు సూత్రాలచే బంధింపబడిన పొడవైన జుట్టు కలవాడు. అతని మెడలో కంఠాభరణం, ఆకాశంలో మెరుపువలె మెరుస్తోంది. అతని వక్షఃస్థలంపై రెండుమాంసపు ముద్దలు ఉన్నాయి. వాటిపై రోమాలు లేవు. అతడు చాల అందంగా కనిపించాడు. ఆ బ్రహ్మచారి నడుము సన్నగా ఉంది. నితంబం మిక్కిలి పెద్దగా ఉంది. నా కోపీనం క్రిందుగా ముంజమేఖల ఉన్నట్లుగా ఉన్న వస్త్రాలకు పైన బంగారు మొలనూలు కనిపించింది. పాదాలపై ధ్వనించే ఆభరణం ఎంతో చూడముచ్చటగా ఉంది. చేతులకు నేను రుద్రాక్షలు ధరించినట్లు అతడు కడియాలు ధరించాడు. వాటి నుంచి శ్రవణపేయమైన ధ్వని వస్తోంది. అతడు అటు ఇటు కదలేటప్పుడు అతని ఆభరణాలు సరస్సులో మత్తహంసల ధ్వనులు వలె ఉన్నాయి. అతని వస్త్రాలు అద్భుతంగా కనిపించాయి. నా బట్టలు అంత అందంగా లేవు. అతని ముఖం చూడముచ్చటగా ఉంది. ఆ బ్రహ్మచారి ఒక్కొక్కమాట మనస్సును ఆనందసాగరంలో ముంచుతోంది. అతనిమాట కోకిల కూతలను మించి ఉంది. ఒకసారి వింటే నా మనస్సు మళ్ళీమళ్ళీ ఆ మాటలు వినాలి అంటోంది. తండ్రీ ! వసంతఋతువులో గాలిచే కదలాడే ఉద్యానంలా ఆ అందం ప్రకాశిస్తోంది. వాయువుచే సేవింపబడే ఆ బ్రహ్మచారి పవిత్రగంధంతో ప్రకాశిస్తూ ఉన్నాడు.

అతని జటలు బిగింపబడి రెండుగా వేరై నుదుటి మీద విషమంగా ఉన్నాయి. కుండలాల చెవులు చిత్రవిచిత్ర రూపం కల చక్రవాక పక్షుల్లా కనబడ్డాయి. అతనివద్ద విచిత్రం అయిన గోళాకారపు ఫలం(బంతి) ఉంది. కుడిచేతితో ఆ బంతిని కొట్టుతున్నాడు. ఆ ఫలం భూమిపై పడి, మాటిమాటికి పైకి లేచి, అతని చేతిలో పడుతోంది. ఆ సమయంలో అతనిముఖం చాల అందంగా కనిపించింది. గాలికి కదలాడే చెట్టువలె అతడు బంతిని కొడుతూ నాలుగువైపులా తిరగసాగాడు. దేవపుత్రునివలె ఉన్న ఆ బ్రహ్మచారిని చూస్తే నామనస్సు ప్రేమతో నిండుతోంది. నాకు ఆ బ్రహ్మచారిపట్ల ఆసక్తి కలిగింది. అతడు మాటిమాటికి నన్ను కౌగిలించుకొని నా జటలను పట్టి తన ముఖానికి నా ముఖాన్ని ఆనించాడు. ఇలా ముఖానికి ముఖం కలిపి ఒక

శబ్దంచేస్తే(ముద్దు) నాహృదయంలో మిక్కిలి ఆనందం కలిగింది.* నేను సమర్పించిన పాద్యానికి అతడు విలువ చూపలేదు. నేనిచ్చిన పండ్లను స్వీకరించలేదు. నాకిది వ్రతసమయమని నాతో అంటూ చాలారకాల పండ్లను నాకు ఇచ్చాడు. ఆ బ్రహ్మచారి ఇచ్చిన పండ్లల్లోని రసం నేను ఇచ్చిన పండ్లలో లేదు. ఆ పండ్లతోలు అడవిపండ్లవలె లేదు. నేను అర్పించిన పండ్లలోని సారం కంటె ఆ పండ్లసారం విలక్షణంగా, ఉత్తమంగా అనిపించింది. ఉదారస్వభావుడయిన ఆ బ్రహ్మచారి త్రాగటానికి ఆస్వాదయోగ్యమయిన జలం ఇచ్చాడు. ఆ జలం త్రాగుతూనే ఆనందం అవధులు దాటింది. నాకు ఈ భూమి కంపించిందా అన్నట్లు అనిపించింది. చిత్రాలు, సుగంధయుతాలు అయిన మాలలు పట్టుదారాలతో నేసినట్లు ఉన్నాయి. వాటిని ఇక్కడే విడచి ఆ బ్రహ్మచారి తన ఆశ్రమానికి వెళ్ళాడు. అతను వెళ్ళాక నేను చైతన్యం కోల్పోయాను. నా శరీరం మండుతున్నట్లు అయ్యింది. ఆ బ్రహ్మచారి వద్దకు వెళ్ళాలి అని లేదా, ఎల్లప్పుడు అతడు నా దగ్గరే ఉండాలి అని భావిస్తున్నాను. నేను అతని సమీపానికి వెళ్ళుతున్నాను. అతని బ్రహ్మచర్య సాధన ఎట్టిది? ఆర్యధర్మాన్ని పాలించే ఆ బ్రహ్మచారి ఏ తపస్సు ఆచరిస్తున్నాడు? అతనితో ఉండి నేనూ అలాంటి తపస్సు చేస్తాను. అలాంటి తపస్సు చెయ్యాలనే కోరిక నాహృదయంలో బలంగా ఉంది. అతనిని చూడకపోతే నా మనస్సు ఎక్కువగా తపించిపోతుంది."

113. ఋష్యశృంగుడు లోమపాదకన్యను గ్రహించుట.

విభాండకుడు అన్నాడు. 'ఇలాంటి అద్భుతరూపంగల రాక్షసులు వనంలో సంచరిస్తున్నారు. సాటిలేని పరాక్రమమూ, అందమూ కలిగి ఋషుల తపస్సులకు విఘ్నం కలిగించడానికి ఉపాయాన్ని ఆలోచిస్తున్నారు. అందమైన ఆ రాక్షసులు అనేక ఉపాయాలతో మునులను ప్రలోభ పరుస్తున్నారు. తిరిగి వాళ్లే భయానకరూపంలో వనవాసులు అయిన మునులను ఆనందలోకాలనుంచి క్రింద పడవేస్తున్నారు. సత్పురుషులలోకాలను కోరే ముని జితేంద్రియుడై రాక్షసులను ఏవిధంగానూ సేవింపకూడదు. ఆ పాపాచారులు రాక్షసులు తాపసుల తపస్సుకు విఘ్నం కలిగించి ఆనందిస్తారు. తాపసి వారి వైపు ముఖాన్ని త్రిప్పి చూడకూడదు. నీవు జలం అనుకొన్నది మద్యం. అది తాగరానిది. పాపాన్ని ఇచ్చేది. అది ఎల్లప్పుడూ సేవించరానిది. దుష్టుడు వాటిని సేవిస్తాడు. విచిత్ర సుగంధ భరితమాలలు మునులు సేవింపకూడనివి. ఈ వస్తువులు తెచ్చేవారు రాక్షసులు'

* ఇక్కడ నన్నయ వమ్మము కొగిలించుకొని నావదవంబువకున్ విజాన్యమా నన్నము చేసి యొక్క మృదుశబ్దముచేసె మనోహరంబుగా అంటూ చక్కని పద్యం వ్రాశాడు.

అని పలికి విభాండకుడు ఋష్యశృంగుని ఆ బ్రహ్మచారితో కలవకుండా అడ్డుకొన్నాడు. ఋష్యశృంగుడు మూడురోజులు ఆమెను వెదకి ఆమె జాడ తెలియక ఆశ్రమానికి తిరిగివచ్చాడు. కశ్యపగోత్రజుడైన విభాండకుడు దైనందిన విధికై ఆశ్రమం నుంచి ఫలాలు తేవటానికి వెళ్ళాడు. అప్పుడు ఆవేశ్య ఋష్యశృంగుని ప్రలోభపెట్టడానికి ఆశ్రమానికి చేరింది. ఆమెను చూచి ఋష్యశృంగుడు ఆనందించి తొందరగా ఆమె సమీపానికి పరుగెత్తి ఇలా అన్నాడు – 'బ్రహ్మచారీ! నాతండ్రి తిరిగి వచ్చేలోపల మనం ఆశ్రమం వైపు వెడదాం.' అప్పుడు ఆ వేశ్య విభాండకుని ఏకైక కుమారుని యుక్తితో నావలో కూర్చోబెట్టి నావను వదిలింది. మిగిలిన వేశ్యలు అందరు అనేకఉపాయాలతో అతని మనస్సును రంజింపచేస్తూ అంగరాజ్యానికి చేర్చారు. నావికులు నడిపిన ఆ నావను నీటి నుంచి బయటకు తీసి, రాజు ఒకప్రదేశంలో దాన్ని ఉంచి, కనుచూపు మేరలో విస్తృతమైన మైదానంలో ఋష్యశృంగుని ఆశ్రమంవంటి ఆశ్రమాన్ని నిర్మింపజేశాడు. దానిపేరే **"నావ్యాశ్రమం"**

లోమపాదరాజు విభాండకముని ఏకైక కుమారుని ఋష్యశృంగుని అంతఃపురంలో ఉంచినాడో లేదో ఇంద్రుడు వర్షం కురిపించడం ప్రారంభించాడు. లోకమంతా నీటితో నిండిపోయింది. లోమపాదుడి కోరిక తీరింది. ప్రసన్నుడైన లోమపాదుడు తనకుమార్తె శాంతను ఋష్యశృంగునకిచ్చి వివాహం చేశాడు. ఆయన వచ్చే మార్గంలో ఆవులు, ఎద్దులను ఉంచాడు. రైతుల ద్వారా వ్యవసాయం ప్రారంభింపచేశాడు. మునిమార్గంలో లోమపాదుడు అధికంగా పశువులను, పశురక్షకులను నియమించి పుత్రునిపై ప్రేమగల విభాండకుడు మిమ్ము ప్రశ్నిస్తే ఇలా సమాధానం చెప్పండి. 'ఇవి అన్నీ మీ పుత్రుని పశువులే. ఇవి అన్నీ వ్యవసాయానికి పోతున్నవి. మీకు ఏ పని చేసిపెట్టాలో ఆజ్ఞాపించండి. మేము మీ దాసులం. మేము మీ ఆజ్ఞకు లోబడి ఉన్నాం.' కొంతసేపటికి కోపిష్ఠి అయిన విభాండకుడు ఫలాలు, దుంపలు తీసుకొని ఆశ్రమానికి వచ్చాడు. ఎంతవెదికినా తన పుత్రుని కనుగొనలేక చాలాక్రోధంతో నిండిపోయాడు. కోపంతో అతని హృదయం బ్రద్దలైంది. అతని మనస్సులో లోమపాదునిపై సందేహం కలిగింది. చంపానగరానికి బయలుదేరి రాష్ట్రాలతో, నగరాలతో సహా అంగరాజ్యాన్ని దహింపదలచాడు. ఆలసి, ఆకలితో విభాండకుడు ఆ గోపాలకుల కొట్టంలో ప్రవేశించాడు. గోపాలకులు యథాశాస్త్రంగా ఆయనను పూజించారు. రాజువలె సుఖభోగాలను ఆ రాత్రి అక్కడ అనుభవించాడు. వారినుండి ఆతిథ్యాన్ని, సత్కారాన్ని పొంది 'మీరు ఎవరి పశుసంరక్షకులు ?' అని అడిగాడు. వారు అందరు ఆయనను సమీపించి 'ఈ ధనమంతా మీ పుత్రునిదే అన్నారు.' మార్గంలో ప్రతిప్రాంతంలో

పూజలను అందుకొని, మధురవచనాలు విని (రజోగుణం వల్ల ఉద్భవించిన) ఆయన కోపం శాంతించింది. ఆయన ప్రసన్నతతో రాజమందిరంలో అంగరాజును కలుసుకొన్నాడు. లోమపాదునిచే పూజింపబడిన విభాండకుడు స్వర్గంలోని ఇంద్రునితో సమానం అయిన ఐశ్వర్యం గల తన కుమారుని, మెరుపువలె భాసించే తన కోడలిని చూశాడు. అతని పుత్రుని అధీనంలోని గ్రామాలు, పల్లెలు, కోడలు శాంతను చూస్తూనే ఆయన కోపం పూర్తిగా పోయింది. ఆ సమయంలో రోమపాదునిపై ఆయనకు చాలా దయ కలిగింది. సూర్యాగ్నుల తేజం కల ఆ ముని తన పుత్రుని అక్కడే వదలి కొడుకుతో అన్నాడు - పుత్రుడు కలిగిన తరువాత రాజుకి మేలు చేసి, తిరిగి వనానికి రమ్ము.' ఋష్యశృంగుడు తండ్రి మాటలు పాటించాడు. తిరిగి మళ్ళీ ఆశ్రమానికి చేరాడు. రోహిణి చంద్రుని కొలిచినట్లు శాంత ఋష్యశృంగుని సేవ చేసింది. అరుంధతి వసిష్ఠుని, లోపాముద్ర అగస్త్యుని, దమయంతి నలుని, శచీదేవి ఇంద్రుని సేవించినట్లు శాంత ఆయనను సేవించింది. నారాయణి ఇంద్రసేన ముద్గలుని అధీనమైనట్లు, సీత రాముని అధీనమైనట్లు, ద్రౌపదీదేవి నీవశమైనట్లు, శాంత ప్రీతితో ఋష్యశృంగుని సేవించింది. రాజా ! ఇది పుణ్యం, పవిత్రం అయిన ఆశ్రమం. ఈ నదీకుండం దీనివలన ప్రసిద్ధిపొందింది. ఇక్కడ స్నానం చేసినవాడు కృతకృత్యుడై, పరిశుద్ధుడై తిరిగి యాత్రను కొనసాగిస్తాడు."

114. కౌశికి, గంగా సాగరాది నదులలో స్నానమాచరించి ధర్మరాజు మహేంద్రపర్వతమును చేరుట.

ధర్మరాజు కౌశికీనదీతీరంలోని నదులలో స్నానం చేసి, క్రమంగా మందిరాలన్నింటికి యాత్ర సాగించాడు. గంగాసాగరసంగమ తీర్థానికి ఆనుకొని ఉన్న సముద్రతీరాన్ని చేరి, ఐదువందల నదుల నీటిలో స్నానం ఆచరించాడు. తరువాత సముద్రతీరమార్గం ద్వారా సోదరులతో కలిసి ధర్మజుడు కలింగదేశాన్ని చేరాడు. వైతరణీనది కల ఈ దేశమే కలింగదేశం. ధర్మదేవత కూడ దేవతల శరణుకోరి ఇక్కడ యజ్ఞం చేశాడు. పర్వతపంక్తులచే శోభించే వైతరణీ నది ఉత్తరతీరం యజ్ఞశాలగా పేరుపొందింది. చాలమంది ఋషులు, బ్రాహ్మణులు ఈ తీరాన్ని సేవిస్తూ ఉంటారు. స్వర్గంపొందే పుణ్యాత్ములకు ఇది దేవయానం. ప్రాచీనకాలంలో ఋషులు, ఇతరులు కూడ ఇక్కడ యజ్ఞాల నాచరించారు. రాజేంద్రా ! ఈప్రదేశంలో రుద్రుడు యజ్ఞంలో పశువును గ్రహించి 'ఇది నాభాగం' అని అందరితో అన్నాడు. పశువు అపహరింపబడగానే దేవతలు రుద్రునితో ఇలా అన్నారు. మీరు ఇతరుల విభాగాన్ని గ్రహింపవలదు. ధర్మసాధనాలైన యజ్ఞభాగాల నపహరింపరాదు.

తరువాత మంగళకరమయిన వచనాలతో దేవతలు రుద్రుని స్తుతించారు. యాగంతో అతనిని తృప్తిపరచి విశేషంగా ఆయన్ని సన్మానించారు. ఆ శంకరుడు అదే సమయంలో పశువును వీడి దేవయానంలో వెళ్ళాడు. యజ్ఞంలో రుద్రుని భాగాన్ని తెలియజేసే పరంపరాశ్లోకం ఒకటి ఉంది. విను చెబుతాను. **దేవతలు రుద్రునిభయంతో శీఘ్రంగా, శాశ్వతంగా అందరిభాగాలకంటె ఉత్తమమయిన భాగాన్ని ఆయనకు ఇవ్వ సంకల్పించారు. ఈ వృత్తాంతాన్ని స్మరిస్తూ ఎవడు ఈ ప్రదేశంలో వైతరణీ నదిలో స్నానం చేస్తాడో అతని దృష్టిలో దేవయానమార్గం కనిపిస్తుంది.***

పిమ్మట పాండవులు, ద్రౌపది వైతరణిలో దిగి పితృదేవతలకు తర్పణాలు ఇచ్చారు. అపుడు యుధిష్ఠిరుడు అన్నాడు – 'మహర్షీ! చూడండి. ఈ వైతరణీ నదిలో యథావిధిగా స్నానం ఆచరించి, తపోబలాన్ని పొంది, మానుషభావాలను వదిలాను. నీ అనుగ్రహంతో అన్నిలోకాలనూ చూస్తున్నాను. ఇది జపం, స్వాధ్యాయం చేసే మహాత్ములైన వైఖానసుల శబ్దం.' లోమశుడు అన్నాడు – 'రాజా ! ఎక్కడి నుంచో వచ్చే ఈ ధ్వని మనకు మూడువందల యోజనాల దూరంలో ఉంది. నీవు నిశ్శబ్దంగా విను.

ఇది పరమేష్ఠి అయిన బ్రహ్మ దివ్యవనం, ఎల్లప్పుడూ ప్రకాశిస్తూ ఉంటుందని ప్రత్యేకత. ఇక్కడ ప్రతాపవంతుడైన విశ్వకర్మ యజ్ఞాన్ని చేశాడు. ఈ యజ్ఞంలోనే బ్రహ్మ పర్వత, వన సహితమయిన భూమిని కశ్యపునికి దానం చేశాడు. బ్రహ్మచే ఇవ్వబడిన తనదానాన్ని గుర్తించి, భూమి కోపించి లోకకర్త, ప్రభువు అయిన బ్రహ్మతో ఇలా పలికింది. 'నన్ను మానవునికి ఎవనికీ దానం ఈయవద్దు. ఈ దానం నిష్ఫలం. నేనిప్పుడే పాతాళానికి పోతున్నాను.' దుఃఖితురాలైన భూమిని చూచి కశ్యపముని ఆమెను ప్రార్థనతో ప్రసన్నం చేసుకొన్నాడు. అతని తపస్సు కారణంగా ప్రసన్నురాలు అయిన భూమి వేది రూపంగా నీటి నుంచి పైకి వచ్చి కనపడింది. ఆ భూదేవియే వేది రూపంగా ప్రకాశిస్తోంది. దీనిపై అధిరోహిస్తే బలపరాక్రమాలను పొందుతావు. ఈ వేదిరూప అయిన భూమి సముద్రాన్ని ఆశ్రయించి, నిలబడి ఉంది. నీకు శుభమగుగాక. నీవు ఒంటరిగా దీన్ని అధిరోహించి, సముద్రాన్ని దాటు. నేను నీకోసం మంగళవచనాలు పలుకుతున్నాను. నీవు నేడే ఈ వేదికను ఎక్కు. లేనిచో మనుజునిచే తాకబడిన ఈ భూమి సముద్రంలో కూరుకుపోగలదు. సముద్రంలో స్నానం చేసే సమయంలో ఇలా ప్రార్థన చెయ్యి. 'ప్రపంచాన్ని రక్షిస్తూ ప్రపంచం కంటె ఉత్తముడవు అయిన నీకు నమస్కారం. నీవు ఈ లవణసముద్రంలో

* అయాతయామం సర్వేభ్యః భాగేభ్యో భాగముత్తమమ్ ।
దేవాః సంకల్పయామాసుః భయాద్ రుద్రస్య శాశ్వతమ్ ॥ 11

నివసించు.' 'అగ్ని, సూర్యుడు, దివ్యజలం నీ ఉత్పత్తికి కారణం. నీవు సర్వవ్యాపకుడైన విష్ణువు వీర్యానివి. నీవే అమృతాన్ని పుట్టించావు.' ఇలా అంటూ సత్యవచనం పలుకుతూ నదులభర్త అయిన సముద్రంలో మునుగు. 'అగ్ని నీకు కారణం. నీశరీరమే యజ్ఞం. విష్ణువు పరాక్రమానికి నీవే ఆధారం, మోక్షసాధనం నీవే' అని జపిస్తూ సత్యవచనం పలుకుతూ నదీపతి అయిన సముద్రంలో మునుగు. కొంతేయా ! జలస్వామి సముద్రుడు దేవతలకు స్థానం. పైన చెప్పిన క్రమం లేకుండా దర్భకొనతో అయినా సముద్రాన్ని తాకరాదు.' తరువాత లోమశునికి శుభం పలుకుతూ రాజు యుధిష్ఠిరుడు ఆయన చెప్పిన నియమాలు పాటిస్తూ సముద్రంలో స్నానం చేశాడు. ఆ రాత్రి మహేంద్రపర్వతంపై కాలం గడిపాడు.

115. అకృతవ్రణుడు ధర్మరాజుకు పరశురామవృత్తాంతము చెప్పుట.

ధర్మజుడు ఒకరోజు రాత్రి మహేంద్రపర్వతంపై గడిపి సోదరులతో కలిసి తాపసులకు, మునులకు సత్కారం చేశాడు. లోమశుడు ధర్మజునికి ఆ తాపసు లందర్నీ పరిచయం చేశాడు. వారిలో భృగువు, అంగిరసుడు, వసిష్ఠుడు, కశ్యపుడు మొదలైన ఋషి గోత్రజులు ఉన్నారు. ఆ రాజర్షి వారిని అందరినీ కలిసి, దోసిలి ఘటించి నమస్కరించి, పరశురాముని అనుచరుడు, వీరుడు అయిన అకృతవ్రణుని ఇలా అడిగాడు. 'భగవానుడు పరశురాముడు ఈ తాపసులకు ఎప్పుడు దర్శనం ఇస్తాడు? ఈ కారణంగా నేనుకూడ భార్గవుని చూడాలని అనుకొంటున్నాను.' అకృతవ్రణుడు అన్నాడు - 'ఆత్మజ్ఞాని అయిన పరశురాముడు మీ రాకను ముందే తెలుసుకొన్నాడు. మీపై పరశురామునికి చాలప్రేమ. శీఘ్రంగా వారు మీకు దర్శనం ఇస్తారు. ఈ తాపసులు చతుర్దశి, అష్టమిదినాల్లో పరశురాముని దర్శిస్తారు. ఈ రాత్రి గడిస్తే రేపే చతుర్దశి.' యుధిష్ఠిరుడు అన్నాడు. 'మీరు బలవంతుడయిన పరశురామునిపై గాఢభక్తి కలవారు. ఆయన పూర్వం చేసిన ఘనకార్యాలు అన్నీ మీరు ప్రత్యక్షంగా చూసినవారు. పరశురామునిచే యుద్ధంలో క్షత్రియులు అందరు ఏకారణంగా జయింపబడ్డారో ఆ విషయాన్ని ఈనాడు మీరు నాకు చెప్పండి.' అకృతవ్రణుడు పలికాడు. 'రాజశ్రేష్ఠా ! భృగువంశజుడైన పరశురాముని కథను చెబుతాను. విను. ఆ కథ చాలపెద్దది. ఉత్తమమయినది. జమదగ్ని కుమారుడైన పరశురాముని చరిత్ర, హైహయరాజు కార్తవీర్యుని చరిత్ర దేవతలచరిత్రతో సమానమైనవి. పాండవా ! పరశురామునిచే కార్తవీర్యార్జునుడనే పేరుగల హైహయదేశపురాజు చంపబడ్డాడు. అతనికి వేయిభుజాలు ఉన్నాయి. రాజా ! దత్తాత్రేయుని అనుగ్రహించే బంగారు విమానాన్ని, భూమి మీద అన్నిప్రాణులపై అధికారాన్ని

సంపాదించాడు. కార్యవీర్యార్జునుని రథం ఎవరికిని ఆపశక్యం కానిది. ఆ రథంచేతనూ, వరదానంచేతనూ అతడు బలవంతుడు అయ్యాడు. అన్నివైపుల తిరుగుతూ దేవతలను, యక్షులను, ఋషులను, భూతాలను అన్నింటిని అతడు పీడించసాగాడు. భారతా ! అతని అత్యాచారాలు సహింపలేని దేవతలు ఋషులతో కలసి దైత్యులను నాశనం చేసే, సత్యపరాక్రముడైన విష్ణువును సమీపించి ఇలా ప్రార్థించారు. 'దేవదేవా! ప్రాణులరక్షణకై అర్జునుని చంపు. దివ్యవిమానంపై సంచరించే అతడు శచీదేవితో క్రీడించే ఇంద్రుని బాధించాడు.' వెంటనే విష్ణువు కార్తవీర్యార్జునుని చంపటానికి దేవతలతో కలిసి ఆలోచించాడు. దేవేంద్రుడు భూతహితం కోసం ఏం చెయ్యాలో విష్ణువుకు నివేదించాడు. అది విన్న శ్రీమహావిష్ణువు దానికి తగిన ప్రతిజ్ఞ చేశాడు. తరువాత తన నివాసాశ్రమమూ, సుందరమూ అయిన బదరికావనాన్ని చేరాడు. అదే సమయంలో భూమిపై కాన్యకుబ్జదేశాన్ని పాలించే బలవంతుడు అయిన గాధి అనే రాజు తన రాజధానిని విడచి వనవాసానికి వెళ్ళాడు. ఆ వనంలో అతనికి అప్సరసలవలె అందమైన ఒక కన్య పుట్టింది. భారతా ! యుక్తవయస్సు రాగానే భృగువంశజుడైన ఋచీకుడు ఆమెను వరించాడు.

ఋచీకునితో గాధి ఇలా అన్నాడు. 'మా వంశంలో పూర్వీకులు ఏఋల్యాన్ని వరుని నుంచి గ్రహిస్తున్నారో దాన్ని పాటించటం మాకర్తవ్యం. ఒక వేయి గుఱ్ఱాలు శుల్కంగా ఇవ్వాలి. అవి తెలుపు, ఎఱుపు రంగు కలిగి, వేగం కలిగి, ఒకవైపు పూర్తిగా నలుపురంగు చెవులు కలిగి ఉండాలి. భార్గవా ! మీరు నిందింపతగినవారు కారు. శుల్కంమాత్రం తప్పక ఇవ్వాలి. అలాంటి మహాత్మునికే నాకన్యను దానం చేస్తాను.' ఋచీకుడు అన్నాడు 'నేను మీకొరకు ఒకవైపు నల్లని రంగు చెవులు గల వేయి తెలుపు, ఎఱుపు రంగుగల గుఱ్ఱాలు సమర్పిస్తాను. మీ పుత్రిక నాధర్మపత్ని కావాలి.' ఆకృతవ్రణుడు అన్నాడు - 'రాజా ! అట్లే, అని ప్రతిజ్ఞ చేసిన ఋచీకుడు వరుణుని పాండురవర్ణం, వేగం కలిగిన వేయి గుఱ్ఱాలను శుల్కరూపంగా ఇవ్వటానికి నాకు ఇయ్యి.' అని అడిగాడు. వెంటనే వరుణుడు వేయి గుఱ్ఱాలను ఋచీకునికి కానుక ఇచ్చాడు. ఎక్కడనుంచి ఆ వేయిగుఱ్ఱాలు బయటికి వచ్చాయో అదియే అశ్వతీర్థం. పిమ్మట గాధి ఆ వేయి గుఱ్ఱాలను తీసుకొని, గంగా తీరంలోని కాన్యకుబ్జదేశంలో తనకుమార్తె నిచ్చి వివాహం చేశాడు. ఆ సమయంలో దేవతలు వరుని పక్షంలో నిలిచారు. దేవతలు ఈ ఘట్టాన్ని చూచి తమ ప్రదేశాలకు తిరిగి వెళ్ళారు. బ్రాహ్మణోత్తముడైన ఋచీకుడు ధర్మబద్ధంగా ఆమెను భార్యగా పొంది సుఖంగా కోరికలతో, ఆమెతో సంసారం చేశాడు. రాజా ! వివాహం అయిన తరువాత భార్యతో సహా ఋచీకుని చూడాలని వచ్చిన భృగుమహర్షి తన

పుత్రుని చూసి మిక్కిలి ఆనందించాడు. ఆ దంపతులు సురగణసేవితుడు అయిన ఆయనను పూజించి, సేవలో లీనమై చేతులు జోడించి, నిలబడ్డారు. భృగుమహర్షి ఆనందభరితుడై కోడలితో అన్నాడు - 'వరం కోరుకో. నీ కోరిక ఏదైనా తీర్చగలను.' ఆ సత్యవతి తనకు, తన తల్లికి సంతానాన్ని ఇమ్మని ఆయన్ని ప్రార్థించింది. ఆయన అనుగ్రహించాడు. 'ఋతుస్నాత లైనప్పుడు నీవు, నీ తల్లి పుత్రసంతానానికై నీవు రావిచెట్టును, నీతల్లి మేడిచెట్టును వేరువేరుగా కౌగిలించుకోవాలి. నేను పరమపురుషుడైన పరమాత్మను ప్రార్థించి నీకోసం, నీ తల్లికోసం ప్రయత్నంతో రెండు చరుద్రవ్యాల్ని సాధించాను. మీరిరువురు శ్రద్ధతో ఆ చరు ద్వయాన్ని తినండి' అని ఆయన అంతర్ధానం అయ్యాడు. ఆలింగనం విషయంలో, చరువును తినటంలోవారు తారుమారు చేశారు.

చాలకాలం గడవగా భృగుమహర్షి తన దివ్యదృష్టిచే ఈ విషయాన్ని గమనించి, తిరిగి వచ్చాడు. కోడలైన సత్యవతితో తేజోవంతుడైన భృగువు 'చరువు ఉపయోగింపబడింది, ఆలింగనం చేయబడింది. కాని ఈ పని విపరీతంగా మీరు చేయటం వలన బ్రాహ్మణుడై క్షత్రియ కర్మ చేసే పుత్రుడు నీకు కలుగుతాడు. క్షత్రియుడై బ్రాహ్మణునివలె ఆచరించే కుమారుడు నీ తల్లికి కలుగుతాడు. ఈ బాలుడు పరాక్రమవంతుడై సత్పురుషుల మార్గాన్ని ఆశ్రయిస్తాడు.' తన మామను సత్యవతి పదేపదే బ్రతిమాలింది. 'నా పుత్రుడు ఇట్టివాడు కాకూడదు. మనుమడు క్షత్రియస్వభావం కలవాడు అగుగాక' అన్నది. పాండవా ! అలాగే అని భృగువు తన కోడలిని అనుగ్రహించాడు. ప్రసవసమయంలో ఆమె జమదగ్ని అనే కుమారుని కన్నది. పాండవా ! భృగునందనుడు తేజస్సుతో, వర్చస్సుతో పెరగసాగాడు. తేజస్వియైన జమదగ్ని ఇతర ఋషికుమారుల కంటె వేదాధ్యయనంలో ముందు నిలిచాడు. భరతర్షభా ! సూర్యసమతేజస్సుగల అతనిబుద్ధిలో ధనుర్వేదం, నాలుగువిధాలు అయిన అస్త్రాలు పూర్తిగా స్వయంగానే ప్రవేశించాయి.

116. పరశురాముడు తల్లిని చంపుట, కార్తవీర్యుని చంపుట, రాజపుత్రులు జమదగ్నిని చంపుట.

అకృతవ్రణుడు పలికాడు - 'మహాతపస్వి అయిన జమదగ్ని వేదాధ్యయన శీలంతో తపస్సు ప్రారంభించి, నియమాలతో దేవతలను వశపరచుకొన్నాడు. అతడు ప్రసేనజిత్తు అనే రాజును కోరి అతనికుమార్తె రేణుకను వరించాడు. ఆ రాజు తనకుమార్తెను జమదగ్ని కిచ్చి వివాహం చేశాడు. జమదగ్ని రేణుకను భార్యగా పొంది, ఆశ్రమంలో అనుకూలవతి అయిన ఆ భార్యతో సహా ఉంటూ గొప్ప తపస్సు ఆచరించాడు. ఆమె గర్భం నుంచి

నలుగురు పుత్రులు పుట్టారు. అయిదవవాడు పరశురాముడు, జన్మచే చివరివాడైనా గుణగణాల్లో అందరికంటె పెద్దవాడు. ఒకరోజు పండ్లకోసం కుమారులు అందరు వెళ్ళగా నియమశీల అయిన రేణుక నదికి స్నానానికి వెళ్లింది. ఆమె స్నానం చేసి తిరిగివస్తూ, మార్తికావతపు రాజు అయిన చిత్రరథుని అనుకోకుండా చూచింది. కమలాల మాల ధరించి, ఐశ్వర్యవంతుడు అయిన చిత్రరథుడు భార్యలతో జలక్రీడలు ఆడుతున్న సమయంలో ఆ రాజును మనస్సులో కోరింది. మానసికంగా వ్యభిచరించి, ఆ వికారంలో కరిగినదై ఆశ్రమానికి రేణుక తిరిగివచ్చింది. ఆశ్రమంలో ప్రవేశిస్తుండగనే భయపడిన ఆమెను జమదగ్ని గుర్తించాడు. ధైర్యాన్ని కోల్పోయి, బ్రహ్మతేజాన్ని విడచిన ఆమెను శక్తిశాలి జమదగ్ని ధిక్కారపూర్వకంగా నిందించాడు. అదే సమయాన జమదగ్ని జ్యేష్ఠపుత్రుడు రుమణ్వంతుడు వచ్చాడు. క్రమంగా సుషేణుడు, వసువు, విశ్వావసువు ఆశ్రమానికి వచ్చారు. వారిని అదే వరుసలో ఆ మహర్షి తల్లిని వధించుటకు ప్రేరేపించాడు. కాని తల్లిమీద ప్రేమతో వారు ఏమీ పలుకక నిలబడ్డారు. జమదగ్ని కోపించి అందరు కుమారులను శపించగా వారు ఆలోచించే శక్తి కోల్పోయి మృగాలవలె, పక్షులవలె జడులయ్యారు.

పిమ్మట శత్రువులను చంపగల పరశురాముడు ఆశ్రమంలోకి ప్రవేశించాడు. జమదగ్ని అతన్నీ తల్లిని చంపమని కోరాడు. 'నీ తల్లిని ఇప్పుడే చంపు. మనస్సులో దుఃఖాన్ని విడచిపెట్టు' అన్నాడు. వెంటనే పరశురాముడు గండ్రగొడ్డలి తీసుకొని తల్లి తలను నరికివేశాడు. దీనివలన ఆయన క్రోధంపోయి ప్రసన్నుడై, శాంతత పొంది అతనితో ఇలా పలికాడు. 'నామాటగా నీవు అసాధ్యమైన పనిని చేశావు. దీన్ని ఇతరులు చేయలేరు. నీవు ధర్మజ్ఞుడవు. మనస్సులో నున్న వరాలన్నీ కోరుకో.' అన్నాడు జమదగ్ని. అప్పుడు పరశురాముడు తండ్రితో 'తల్లిని బ్రతికించండి, నాచేతిలో చనిపోయిన విషయం ఆమెకు తెలియకుండా వరం ఇయ్యండి. మానసిక పాపం ఆమెను చేరకుండునట్లు నా సోదరులు బ్రతుకునట్లు అనుగ్రహించండి. యుద్ధంలో నన్ను జయించువాడు లేకుండాను, దీర్ఘాయువును ఇవ్వండి' అని ప్రార్థించాడు. మహాతపస్వి జమదగ్ని ఆ కోరిక లన్నింటినీ ఇచ్చాడు. ఒకనాడు వారందరు పూర్వంలాగే బయటికి పండ్లకోసం వెళ్ళారు. అనూపదేశపురాజు కార్తవీర్యార్జునుడు అక్కడికి వచ్చాడు. ఆశ్రమంలో ఋషిపత్ని రేణుక అతనికి ఆ సమయానికి తగిన ఆతిథ్యం ఇచ్చింది. యుద్ధాన్ని కోరిన కార్తవీర్యార్జునుడు ఆ సత్కారాన్ని స్వీకరించలేదు. హోమధేనువు అరుస్తుండగా దూడను బలవంతంగా ఆశ్రమం నుంచి అపహరించాడు. అక్కడి చెట్లను కూల్చి నాశనం చేశాడు. ఆశ్రమానికి తిరిగివచ్చిన పరశురామునికి తండ్రి స్వయంగా ఈ విషయాన్ని తెల్పాడు. పదేపదే రోదిస్తున్న హోమధేనువుపై అతని దృష్టి

పడింది. వెంటనే రామునికి కోపం వచ్చింది. మృత్యువశుడైన కార్తవీర్యుని పరశురాముడు ఎదుర్కొన్నాడు. పరశురాముడు యుద్ధంలో అందమైన ధనుస్సు తీసికొని తీక్ష్ణ బాణాలతో అతని వేయి చేతులను నరికాడు. ఓడిన కార్తవీర్యుడు పరశురాముని చేతిలో చనిపోయాడు. అర్జునుని దాయాదులు పరశురామునిపై కోపించి, పరశురాముడు లేనప్పుడు జమదగ్నిపై దాడిచేశారు. మహావీరుడు, యుద్ధకాంక్ష లేనివాడు, తాపసి అయిన జమదగ్ని మహర్షిని వారు చంపివేశారు. యుధిష్ఠిరా ! పదేపదే రామునిపేరు తలుస్తూ అనాథవలె విలపిస్తుండగా కార్తవీర్యార్జునుని పుత్రులు జమదగ్నిని చంపారు. శత్రునాశకులై కార్తవీర్యునిపుత్రులు జమదగ్నిని చంపి, వచ్చిన చోటుకే వెళ్ళారు. వారు వెడలిన పిదప జమదగ్ని మరణించగా దర్భలు గైకొని పరశురాముడు ఆశ్రమంలోకి వచ్చాడు. వీరుడైన పరశురాముడు తండ్రి చంపబడినట్లు తెలిసికొని అట్టి మృత్యువుకు అర్హుడు కాని, తండ్రిని చూచి చాలాసేపు విలపించాడు.

117. పరశురాముడు తండ్రికై విలపించుట. క్షత్రియ సంహారము, ధర్మజుడు పరశురాముని పూజించుట.

'నా తప్పిదంచేత ఆ నీచులు, మూర్ఖులు కార్తవీర్యుని పుత్రులు అడవిలో బాణాలతో మృగాన్ని చంపినట్లు నిన్ను చంపారు. మీరు ధర్మజ్ఞులై సన్మార్గంలో నడచేవారు, మీరు ఇతరప్రాణులను హింసింపరు. మీకు ఇలాంటి దుర్మరణం ఉచితమైంది కాదు. మీరు తపస్సులో ఉండి, యుద్ధవిముఖులై, వృద్ధులై ఉన్నా వందలకొద్దీ తీక్ష్ణబాణాలతో మిమ్ము చంపారంటే ఇక వారు చెయ్యని పాపం ఏమి ఉంటుంది? ఆ సిగ్గులేని రాకుమారులు యుద్ధం ఇష్టంలేక ధర్మజ్ఞులై, అసహాయులైన మిమ్ము చంపి స్నేహితులు, వృద్ధుల ఎదుట దీన్ని ఎలా సమర్థించుకొంటారు?' రాజా ! ఇలా పరిపరివిధాలుగా దుఃఖంతో విలపించి ఆ పరశురాముడు తండ్రికి దహనసంస్కారాలు యథావిధిగా జరిపాడు. తండ్రికి ప్రేతకర్మలు చేసినపిమ్మట బలవంతుడు, పరాక్రమవంతుడు అయిన అతడు సంపూర్ణ క్షత్రియవధకై ప్రతిన పూనాడు. బలవంతుడు, వీర్యవంతుడు అయిన పరశురాముడు కోపించి యమునితో సమానుడై కార్తవీర్యుని కుమారులు అందరినీ సంహరించాడు. వారిని అనుసరించిన క్షత్రియుల నందర్నీ కూడ యోధాగ్రేసరుడైన పరశురాముడు మట్టిలో కలిపివేశాడు. ఇరవై ఒక్క పర్యాయాలు భూమిని క్షత్రియ రహితం చేసి, ఆ రక్తంతో సమంతపంచక క్షేత్రాన అయిదు మడుగులు నింపాడు. భృగువంశదీపకు డైన ఆ పరశురాముడు భృగువంశాన్ని రక్తంతో తర్పణం చేసి పవిత్రం చేశాడు. ఆ సమయాన

ఋచీకుడు ప్రత్యక్షంగా చూసి అతని నివారించాడు.

పిమ్మట పరాక్రమవంతుడు అయిన పరశురాముడు యజ్ఞం చేసి, ఇంద్రుని తృప్తిపరచి, భూమిని ఋత్విక్కులకు దక్షిణగా ఇచ్చాడు. మహాత్ముడైన కశ్యపునికి భార్గవరాముడు నలభైహస్తాల పొడుగు, నలభై హస్తాల వెడల్పు, ముప్పై ఆరు హస్తాల ఎత్తుగల బంగారు వేదికను దానం చేశాడు. ఆ సమయంలో కశ్యపుని ఆజ్ఞచే బ్రాహ్మణులు ఆ భూమిని ఖండఖండాలుగా చేసికొని తీసుకొన్నారు. వారే తరువాత ఖాండవాయనులు అని ప్రసిద్ధిని పొందారు. ఆవిధంగా భూమిని కశ్యపునికి దానం చేసి, సాటిలేని పరాక్రమంగల పరశురాముడు ఈ మహేంద్రపర్వతంపై నివసిస్తున్నాడు. ఇలా లోకంలోని క్షత్రియులతో అతనికి వైరం ఏర్పడింది. అమితతేజోవంతు డైన పరశురామునిచే భూమి అంతా జయింపబడింది. వైశంపాయనుడు పలికాడు. 'మరునాడు చతుర్దశిరోజున సోదరులతో కూడిన ధర్మజునికి ఆయన దర్శనమిచ్చాడు. రాజశ్రేష్ఠుడు, ప్రతిభావంతుడు అయిన ధర్మరాజు సోదరులతో కూడి పరశురాముని బ్రాహ్మణులను, విశేషంగా పూజించాడు. పరశురాముని అర్చించి స్వయంగా ఆయనచే సమ్మానింపబడి ఆయన ఆజ్ఞ గైకొని ధర్మరాజు ఆ రాత్రి మహేంద్రపర్వతంపై గడిపి, ఉదయాన లేచి, దక్షిణదిక్కుగా బయలుదేరాడు.

118. యుధిష్ఠిరుడు ప్రభాపక్షేత్రమున తపస్సు చేయుట- యాదవ పాండవుల కలయిక.

వైశంపాయనుడు చెపుతున్నాడు. భారతా ! ముందుకు సాగుతూ ధర్మరాజు సముద్రతీరంలోని సుందరతీర్థాలన్నింటినీ చూశాడు. వాటిల్లో చాలామంది బ్రాహ్మణులు నివసిస్తున్నారు. దానివల్ల సాగరశోభ పెరగసాగింది. సదాచారాన్ని పాటించే ఆ ధర్మరాజు ఆ తీర్థాల్లో స్నానమాడి, సోదరులతో కలిసి, సముద్రంలో కలిసే పవిత్ర ప్రశస్తానదీతీరానికి చేరాడు. అతడు ఆ నదిలోనూ స్నానం చేసి పితరులకు, దేవతలకు తర్పణాలు విడచాడు. బ్రాహ్మణశ్రేష్ఠులకు ధన దానం చేసి, సాగరగామిని ఆయిన గోదావరిని చేరుకొన్నాడు. గోదావరిలో స్నానం చేసి, పవిత్రుడై, ద్రవిడదేశంలో తిరుగుతూ, భూలోకంలో పవిత్రమైన సముద్రతటాన్ని చేరుకొని స్నానాదులను ఆచరించి, ముందుకు సాగి, అగస్త్యతీర్థ, నారీతీర్థాలు దర్శించాడు. అక్కడ మానవులకు దుర్లభమయిన పరాక్రమంకల అర్జునుని గొప్పతనాన్ని విని, ప్రసన్నుడై, ఋషి సంఘాలచే పూజింపబడి, ధర్మరాజు వారి సత్కారాన్ని అందుకొని ఆనందించాడు. ద్రౌపదితో, సోదరులతో కలిసిన ధర్మజుడు ఆ ఐదుతీర్థాల్లో మునిగి, అర్జునుని పరాక్రమాన్ని ప్రశంసిస్తూ ఆనందాన్ని అనుభవించాడు. సముద్రతీరతీర్థాల్లో

అర్జునుడు వేయిగోవులను దానమిచ్చాడని తెలిసి, సంతోషం పట్టలేక ధర్మజుడు అతని గోదానాన్ని పదేపదే కీర్తించాడు.

సముద్రతీర్థాలను, ఇతరతీర్థాలను సేవించిన ధర్మరాజు సంచరిస్తూ కోరికలు తీరి, పుణ్యమయం అయిన శూర్పారక తీర్థాన్ని దర్శించాడు. సముద్రంలోని కొంతభాగాన్ని దాటి, భూమండలంలో ప్రఖ్యాతి చెందిన వనాన్ని చేరుకొన్నాడు. పూర్వకాలంలో అక్కడ దేవతలు తపస్సు చేశారు. పుణ్యాత్ములు రాజులు యజ్ఞయాగాలు చేశారు. అక్కడ ధర్మరాజు ధనుర్ధారి, ఋచీకవంశజుడు అయిన పరశురాముని వేదిని చూశాడు. అది పుణ్యపురుషులకు పూజింపతగినది. తాపసులు అక్కడ ఎప్పుడూ నివసిస్తూ ఉంటారు. అనంతరం ధర్మరాజు వసువులు, మరుద్గణాలు, అశ్వినీదేవతలు, సూర్య, యమ, కుబేర, విష్ణు, ఇంద్రాదులు శివ, చంద్ర, సూర్య, వరుణ, సాధ్యగణాలు, బ్రహ్మ, పితృగణ, ప్రమధ గణ రుద్ర, సరస్వతీ, సిద్ధగణాల యొక్క పుణ్యమయ మందిరాలను చూసి, అంతులేని ఆనందం పొందాడు. ఆ తీర్థాల్లో నివసించే బ్రాహ్మణులను వస్త్రరత్నాదులతో సత్కరించి, అక్కడ ఉన్న అన్ని తీర్థాల్లో స్నానం చేసి, తిరిగి మళ్ళీ శూర్పారకక్షేత్రానికి వచ్చాడు. అక్కడినుంచి బయలుదేరి సోదరులతో, భార్యతో సాగరతీర్థాలమార్గంలో ప్రభాసక్షేత్రానికి చేరుకొన్నాడు. అది బ్రాహ్మణుల కారణంగా భూమండలంలో ప్రసిద్ధక్షేత్రం. ఆ తీర్థంలో సోదరులతో కలిసి స్నానం చేసి, ధర్మరాజు దేవతలను, పితరులను ఆరాధించాడు. అదేవిధంగా అతనితో కలిసి యాత్ర చేస్తున్న ద్రౌపది, బ్రాహ్మణులు, లోమశుడు స్నానాంతరం తర్పణాలు విడిచారు.

ధర్మరాజు పన్నెండురోజులు జలవాయుభక్షణం మాత్రం చేసి, రాత్రి, పగటివేళల్లో స్నానం ఆచరిస్తూ అన్నివైపులా అగ్నిని వెలిగించు కొని తపస్సు చేశాడు. అదే సమయంలో ప్రభాసతీర్థంలో ధర్మరాజు కఠిన తపస్సు ఆచరిస్తున్నాడని తెలిసిన యాదవప్రముఖులు శ్రీకృష్ణబలరాములు తమ సైన్యాలతో సహా యుధిష్ఠిరుని కలవడానికి వచ్చారు. భూమిపై శయనిస్తూ, దుమ్ము ధూళి గల శరీరాలు గల పాండవులను, కష్టాలు అనుభవింపదగని ద్రౌపదినీ ఆ యాదవులు చూచి మిక్కిలిగా దుఃఖించి ఆర్తనాదాలు చేశారు. అంతకష్టంలోను ధర్మరాజు శ్రీకృష్ణుని, బలరాముని, ప్రద్యుమ్నుని, సాంబుని, సాత్యకిని ఇతర యాదవ వీరులను పూజించి, ఆదరసత్కారాలు కావించాడు. పాండుపుత్రుల సత్కారాలు పొందిన యాదవులు కూడ ప్రతిగా సత్కారాలు చేశారు. దేవతలు ఇంద్రుని చుట్టు మూగినట్లు ధర్మరాజును వారందరు చుట్టి కూర్చున్నారు. యుధిష్ఠిరుడు వారికి శత్రువుల అపకారాలను, వనవాసాన్ని, అస్త్రసంపాదనకై అర్జునుని ఇంద్రలోకప్రవేశాన్ని ఆనందంతో వివరించాడు.

ధర్మరాజు మాటలు విని, అతనిని ఊరడించి, పాండవుల దుర్బలతను గమనించి మహానుభావులైన యాదవులు దుఃఖాన్ని, వేదనను అనుభవిస్తూ కన్నీరు పెట్టారు.

119. ప్రభాసతీర్థమున బలరాముడు పాండవులకు సానుభూతి తెల్పుట.

జనమేజయుడు అన్నాడు. 'ప్రభాసతీర్థాన్ని చేరిన యాదవులు, పాండవులు ఏమి చేశారు? వారి మధ్య సంభాషణ ఎలా సాగింది? మహాత్ములు సర్వశాస్త్రపారంగతులు అయిన యాదవపాండవులు ఒకరికొకరు హితాన్ని ఆచరించే వారుకదా!' వైశంపాయను డిలా చెప్తున్నాడు. సముద్రతీరతీర్థాల్లో పవిత్రం అయింది ప్రభాసతీర్థం. అక్కడకు చేరిన యాదవవీరులు పాండవులచుట్టూ చేరి కూర్చున్నారు. పిమ్మట ఆవుపాలు, మొల్లపూలు, చంద్రుడు, తామర తూళ్ళు, వెండి వంటి తెల్లదనం కల్గి, హలాయుధుడైన బలరాముడు శ్రీకృష్ణునితో అన్నాడు. ఆచరించిన ధర్మం అభ్యుదయ కారణం కాదు. ఆచరించిన అధర్మం పరాజయకారణమూ కాదు. మహాత్ముడైన యుధిష్ఠిరుడు నారబట్టలు కట్టి, జడలు ధరించి, వనంలో బాధలు పడుతున్నాడు. అధర్మపరాయణుడైన దుర్యోధనుడు భూమిని పరిపాలిస్తున్నాడు. అతనిని భూదేవి తనలో కలుపుకోవడం లేదు. మందబుద్ధులు ఇది చూచి ధర్మం చేయటంకంటె అధర్మం ఆచరించటం మేలు అని భావిస్తారు. దుర్యోధనుడు ప్రతిదినం వృద్ధిని పొందుతుంటే, ధర్మజుడు రాజ్యాన్ని కోల్పోయి దుఃఖిస్తుంటే మనుష్యులు ఏమి ఆచరించాలి ? అనే సందేహం వారిలో వారికి కలుగుతోంది. ధర్మరాజు సాక్షాత్తుగా యమధర్మరాజు కుమారుడు. ధర్మాన్ని, సత్యాన్ని ఆశ్రయించి దానశీలి అయి ఉన్నాడు. ధర్మజుడు రాజ్యాన్ని, సుఖాన్ని విడుస్తాడు. కాని ధర్మాన్ని విడువడు. ధర్మాన్ని విడచి ఎవడు అభ్యుదయాన్ని పొందగలడు? భీష్ముడు, కృపుడు, ద్రోణుడు, ధృతరాష్ట్రుడు, కుంతీపుత్రులను రాజ్యంనుంచి వెడలగొట్టి సుఖాన్ని అనుభవిస్తున్నారు. భరతకుల వృద్ధులకు నింద అగుగాక! వారి బుద్ధి ఎల్లప్పుడు పాపంవైపే సాగుతోంది.

పాపాత్ముడైన ధృతరాష్ట్రుడు పరలోకంలో పితరులను కలిసి తన చర్యలను ఏ విధంగా సమర్థించుకొంటాడు? "పాండుపుత్రులపట్ల నేను సక్రమంగా వ్యవహరించాను." అని చెప్పగలడా? రాజ్యం నుంచి వెడలగొట్టి, మోసగించిన దానికి సమాధానం అతని వద్ద ఏది? నేత్రాలతో ఏ పాపం చేయడంవల్ల నాకీ అంధత్వం వచ్చిందో?' అని అతని బుద్ధి ఆలోచించటం లేదు. 'కుంతీపుత్రుని రాజ్యానికి దూరం చేసి' భూతలంపై మళ్ళీ రాజులలో పుట్టితే నా దశ ఎట్లుంటుంది? అని ఆలోచించటం లేదు. విచిత్రవీర్యుని

పుత్రుడైన ధృతరాష్ట్రుడు, అతని పుత్రుడైన దుర్యోధనుడు, ఈ క్రూరమైన పనులు చేసి పితృలోకంలో బంగారంవలె మెరిసే వికసించిన పూలు కల వృక్షాలను నిశ్చయంగా కలలో చూస్తున్నారు. (మృత్యువు సమీపించింది అని దీని అర్థం.) దృఢస్కంధాలు, విశాలనేత్రాలు గల పెద్దలు భీష్మాదులు ధృతరాష్ట్రుడు ఏ విషయం ప్రశ్నిస్తాడో అది ఆచరించటం లేదు. సోదరసహితుడై ఆయుధధారి అయిన యుధిష్ఠిరుని పట్ల భయంతో మోసంతో వనానికి పంపాడు. శత్రువులను శస్త్రాస్త్రాలు లేకుండ చంపగల బాహువులు గల, భీమసేనుని సింహనాదం విని, శత్రుగణాలు ఒక్కసారిగా మలమూత్రాలు విడుస్తారు.

వేగవంతుడైన ఆ భీముడు ఆకలి దప్పికలచేత, మార్గసంచారంచేతనూ బలహీనుడైనాడు. ఈ భయంకర వనవాసఘోరాన్ని స్మరిస్తూ యుద్ధసమయంలో ఎవరినీ ప్రాణాలతో విడువడు అని నా అభిప్రాయం. ఇతని బలంతో, పరాక్రమంతో సమానమైనవాడు వేరొకడు భూమిపై లేడు. చలిగాలి, ఎండ వీటిచే ఇతని శరీరం ఇప్పుడు కృశించింది. కాని యుద్ధంలో శత్రువుల్లో ఒక్కణ్ణి కూడ విడువడు. పూర్వదిగ్విజయయాత్రలో ఒక్కడే భీముడు రాజు లందర్నీ సేనతో సహా జయించి తిరిగి వచ్చాడు. ఈనాడు నారబట్టలు కట్టి, ఆ వేగం తగ్గి, అడవిలో కష్టాలు అనుభవిస్తున్నాడు. సముద్రతీరంలో దక్షిణదిక్కున ఎదిరించిన రాజు లందరినీ జయించిన సహదేవుడు తాపసవేషధారియై దిగులుతో నున్నాడు. నకులుడు ఒక్కడే పడమరదిక్కున ఉన్న రాజు లందరినీ యుద్ధనిపుణతతో జయించాడు. ఇప్పుడు కందమూలఫలాలతో జీవయాత్ర సాగిస్తున్నాడు. జడలు కట్టి మాసిన శరీరంతో ఉన్నాడు. ద్రుపదుని యాగంలో యజ్ఞవేది నుంచి పుట్టిన ద్రౌపది సుఖాలకు యోగ్యురాలు, పతివ్రత. అయినా ఇదేవనంలో దుఃఖాన్నే ఎలా సహిస్తోంది? ధర్మ,వాయు, ఇంద్ర, అశ్వినీదేవతలపుత్రులు అయిన వీరు సుఖాన్ని అనుభవించడానికి యోగ్యులై ఉండికూడా వనవాసం చేస్తూ, మోసగింపబడి సుఖానికి దూరం అయ్యారు. భార్యతో, సోదరులతో సహా ధర్మరాజు ద్యూతంలో ఓడిపోయాడు. అనుచరులను కోల్పోయాడు. అవినీతిపరాయణుడైన దుర్యోధనుడు వృద్ధిని పొందుతుంటే పర్వతసహితంగా భూమి ఎందుకు క్రుంగిపోవటం లేదో నాకు తెలియటం లేదు.'

120. సాత్యకి పౌరుషవచనాలు, శ్రీకృష్ణుని ఆజ్ఞపై పాండవులు పయోష్ణినదీతీరమున వసించుట.

సాత్యకి పలికాడు – 'బలరామా! ఇది కూర్చుని విలపించే సమయం కాదు. మనం ముందుగా ఏదో ఒకటి చెయ్యాలి. అది అందరం కలిసి మాత్రం చెయ్యాలి.

ధర్మజుడు మనకేమీ చెప్పకపోయినా కాలయాపన చెయ్యక మనం శత్రువులకు సమాధానం చెప్పాలి. ఈ లోకంలో ఎవరికి ప్రభువులు ఉన్నారో, సహాయకులు ఉన్నారో వారు స్వయంగా ఏ పనినీ ప్రారంభింప నవసరం లేదు. వారికి అన్నిపనుల్లోను సహాయకులు, స్నేహితులు ఉంటారు. యయాతిని ఉద్ధరించటంలో శిబి మొదలయినవారు సహాయపడ్డారు గదా! ప్రపంచంలో ఎవని పనులు అతని సహాయకులు ఆలోచించి ప్రారంభిస్తారో ఆ పురుషశ్రేష్ఠులే సహాయకులు కలవారు. వారు అనాధలవలె ఎప్పుడూ కష్టాన్ని పొందరు. బలరామకృష్ణులు, ప్రద్యుమ్నసాంబులు, నాతో కలిసి త్రైలోక్యనాథులు వారిని సేవిస్తున్నా పార్థులు అరణ్యంలో ఏ కారణం చేతో నివసిస్తూనే ఉన్నారు. చిత్రవిచిత్రాయుధాలు, కవచాలు ధరించి యాదవసేన ఈ రోజునే యుద్ధానికి బయలుదేరటం ఉత్తమం. దుర్యోధనుడు యాదవసేనచే జయింపబడి బంధు, సోదర, బలాలతో యమున వద్దకు వెళ్ళుగాక. భగవానుడు శ్రీకృష్ణుడు ప్రత్యేకంగా పాల్గొనకపోయినా మీరే క్రోధాగ్నిలో ఈ భూమండలాన్ని అగ్నిజ్వాలల్లో మండించగలరు. అది దేవరాజు అయిన మహేంద్రుడు పరివారంతో కూడిన వృత్రుని చంపటంతో సమానం. సోదరుడు, స్నేహితుడు, గురువు, శ్రీకృష్ణుని ఆత్మబంధువు అయిన అర్జునుడు ఇప్పుడు ఇక్కడ లేడు. దేనికొరకు మానవులు మంచి కుమారునీ, గురువుకు ప్రతికూలం కాని శిష్యునీ కోరుతారో ఆ సమయం ఇప్పుడు ఆసన్నం అయింది. యోగ్యుడైన శిష్యుడు, ఉత్తమపుత్రుడు శస్త్రాస్త్రాలు ధరించి, అపారపరాక్రమాన్ని చూపే సమయం ఇదే. నేను ఒక్కడినే యుద్ధభూమిలో గొప్ప గొప్ప ఆయుధాలతో శత్రువుల నందర్నీ అస్త్రవర్షంతో నాశనం చేసి సైనికులను జయిస్తాను. అట్టివారు మాకూ ఉన్నారు.

సర్పం, అగ్ని, విషం వీటితో సమానమైన బాణాలతో శత్రువుల శిరస్సులను మొండెం నుంచి వేరు చేస్తాను. యుద్ధభూమిలో తీక్ష్ణధార కల ఖడ్గంతో వారి శిరస్సును బలంగా తెగనరకుతాను. ఆ దుర్యోధనుని సైనికు లందర్నీ, కౌరవుల నందర్నీ చంపివేస్తాను. యుద్ధంలో భయంకరంగా పోరాడే యోధులు హర్షోత్సాహాలతో నా శస్త్రాస్త్రాల వేగాన్ని చూస్తారు. ప్రళయకాలమందలి అగ్ని గడ్డివామును అవలీలగా నాశనం చేసినట్లు నేను ఒక్కడినే కౌరవసేనను నాశనం చేస్తాను. ప్రద్యుమ్నుడు విడిచిన బాణాలను కృప,ద్రోణ,వికర్ణ, కర్ణులు సహింపలేరు. నేను అభిమన్యుని పరాక్రమం తెలిసినవాడను. సమరభూమిలో నిలచిన ప్రద్యుమ్నుని శక్తిని ఎఱుగుదును. వీరశ్రేష్ఠుడైన సాంబుడు దుశ్శాసనుని అణచిపెట్టి తన రెండుచేతులతో సారథి, రథాలతో కూడిన దుశ్శాసనుని శాసింపగలడు. జాంబవతి కుమారుడు సాంబుడు యుద్ధంలో ప్రచండ పరాక్రమవంతుడిగా మారిపోతాడు. ఇతనిచే బాల్యంలోనే శంబరాసురుని సేన అంతా నాశనం చేయబడింది కదా! ఇతని పిక్కలు

గుండ్రంగా ఉంటాయి. చేతులు పొడవుగా, బలంగా ఉంటాయి. యుద్ధంలో వీటితో అశ్వారోహకులను ఎందరినో చంపగలడు. సంగ్రామ భూమిలో మహారథుడైన సాంబుని ఎదుట ఎవడు నిలువగలడు? అంత్యకాలంలో యముని చేతులనుండి బయటపడలేని మనుజుని వలె యుద్ధభూమిలో సాంబుని ఆధీనమైనవాడు జీవితాన్ని తిరిగి పొందలేడు. వసుదేవనందనుడైన శ్రీకృష్ణుడు మహారథులైన ద్రోణభీష్ములను, పుత్రసహితంగా సోమదత్తుని, కౌరవసేననంతటినీ బాణాగ్నిజ్వాలల్లో భస్మం చేస్తాడు. చేతిలో ఆయుధం, బాణాలు, చక్రాయుధం కల కృష్ణుని పరాక్రమాన్ని యుద్ధంలో సహింపగలవాడు దేవతలతో కూడిన సమస్తలోకాల్లో ఎవడూ లేడు.

కత్తిడాలు స్వీకరించిన అనిరుద్ధుడు కూడ యజ్ఞంలో వేది దర్భలతో కప్పబడినట్లు యుద్ధభూమిని శత్రువుల తలలతో, మొండెములతో కప్పుతాడు. గదుడు, ఉల్ముకుడు, బాహుకుడు, భానుడు, నీథుడు, ప్రత్యేకించి యుద్ధవీరుడు నిశరుడు, సారణ, చారుదేష్ణులు వీరందరు కులానికి తగిన పరాక్రమాన్ని ప్రదర్శిస్తారు. యాదవవంశీయుల వృష్ణి, భోజ, అంధక సాత్వత, శూరసేన జాతీయుల సేన యుద్ధంలో ధృతరాష్ట్రపుత్రులను సమూలంగా చంపి, లోకంలో కీర్తిని విస్తరింపచేస్తుంది. ధర్మవేత్తలలో అగ్రగణ్యుడైన ధర్మరాజు ద్యూతంలోని నియమంప్రకారం వనవాసం చేస్తూంటే అంతవరకు అభిమన్యుడు ఈ భూమిని పరిపాలిస్తాడు. మనబాణాలచే శత్రువులను జయించి పదమూడు సంవత్సరాలు గడచిన పిమ్మట ధర్మరాజు రాజ్యాన్ని అనుభవిస్తాడు. ధార్తరాష్ట్రులు లేకుండా చేయటమూ, కర్ణుని చంపటమూ మనం చేయవలసినపని. దీనివలన మనకీర్తి పెరుగుతుంది.' వెంటనే వాసుదేవుడు ఇలా అన్నాడు - 'మధువంశాగ్రణీ! నీ మాటలు ముమ్మాటికీ నిజం. దీనిలో కొంచెం కూడ సందేహం లేదు. నీ మాటలను నేను సమర్థిస్తున్నాను. కాని కురుకుల భూషణుడైన ధర్మరాజు తన భుజాలతో జయింపని భూమిని ఎన్నడూ అనుభవింపడు. కోరికతో గాని, భయంతో గాని, లోభంతో కాని ధర్మరాజు స్వధర్మాన్ని ఎన్నడూ విడువడు. అలాగే అతిరథులు భీమార్జునులు, కవలలు నకులసహదేవులు, ద్రుపదపుత్రి ద్రౌపది తమతమ ధర్మాలను ఎన్నడూ విడువరు. భీమార్జునులు ఇద్దరే యుద్ధంలో ఈ భూమిపై సాటిలేనివారు. నకులసహదేవులతో, భీమార్జునులతో కలిసిన ధర్మజుడు భూమిని శాసించకుండా ఎలా ఉంటాడు? పాంచాలరాజు, కేకయుడు, చేదిరాజు, మనమందరం కలిసి యుద్ధంలో పరాక్రమం చూపితే అపుడే శత్రువు లనే వారు ఇక ఉండరు.' యుధిష్ఠిరుడు ఇలా అన్నాడు. - 'సాత్యకీ నీ పలుకులు సత్యాలు. నీవంటి వీరునికి ఆశ్చర్యం అనేది లేదు. **కాని వాకు సత్యాన్ని రక్షించటమే ప్రధానం. రాజ్య ప్రాప్తి కాదు. నా స్వరూపం**

పూర్తిగా శ్రీకృష్ణునికి తెలుసు. అలాగే శ్రీకృష్ణుని స్వరూపం నాకు బాగా తెలుసు. సాత్యకీ! శ్రీకృష్ణుడు పరాక్రమం చూపడానికి సమయాన్ని నిర్ణయిస్తే అప్పుడు నీవూ, శ్రీకృష్ణుడూ అందరూ కలిసి సుయోధనుని జయిస్తారు. యాదవవీరు లందరూ ఇప్పుడే ద్వారకకు బయలుదేరండి. మీరు మాకు ప్రభువులు, సహాయకులు, అంతేకాక లోకానికి అంతటికీ రక్షకులు. మీతో కలియటమే నాకు ఆనందాన్ని ఇచ్చే విషయం. ధర్మపాలనలో మీరు ఎల్లప్పుడు సావధానులై ఉండాలి. మళ్ళీ నేను మిమ్ములను ఒకచోట చేరగా చూస్తాను.' యాదవపాండవులు ఒకరితో ఒకరు సంప్రదించుకొని, వృద్ధులకు నమస్కరించి, బాలురను తనవితీరా కౌగిలించుకొని, తమతమ గృహాలకు వెళ్ళారు. పాండవులు ఇదివరకటిలాగే తీర్థయాత్ర ప్రారంభించారు. శ్రీకృష్ణునికి వీడ్కోలు పలికి ధర్మరాజు లోమశమహర్షితో, సోదరులతో, సేవకులతో, భార్యతో కలిసి విదర్భరాజుచే పూజలను పొంది, ఉత్తమతీర్థాలు గల పయోష్ణినదీ తీరాన్ని చేరాడు. ఆ నదీజలంలో యజ్ఞంలోని సోమరసం కలిసింది. పయోష్ణినదీతీరంలో ఆ జలాన్ని త్రాగి అక్కడే నివసించారు. ప్రసన్నులయిన బ్రాహ్మణులు ధర్మరాజును అనేకవిధాల కొనియాడారు.

121. గయుని ప్రశంస, నర్మదామాహాత్మ్యము, సుకన్యాచ్యవనుల కథ.

లోమశుడు ఇలా అన్నాడు. "పయోష్ణినదీతీరాన నృగుడు యజ్ఞం చేసి సోమరసంతో ఇంద్రుని తృప్తిపరచాడు. ఆ సమయంలో ఇంద్రుడు సంపూర్ణంగా తృప్తిని పొంది, ఆనందంలో మునిగిపోయాడు అని లోకంలో కథ ప్రచారంలో ఉంది. ఇచట ఇంద్రసహితులైన దేవతలు, ప్రజాపతులు కూడ అధికదక్షిణలు కల అనేకయజ్ఞాలతో భగవానుని సేవించారు. అమూర్తరయుని పుత్రుడైన గయుడు ఇక్కడే ఏడు అశ్వమేధయాగాలు చేసి సోమరసంతో వజ్రాయుధాన్ని ధరించిన ఇంద్రునికి సంతుష్టిని కలిగించాడు. ఆయన ఏడు యజ్ఞాల్లో మట్టితోను, కర్రలతోను చేసే ద్రవ్య(పాత్ర)లన్నింటిని బంగారంతో చేయించాడు. యజ్ఞంలో ప్రధానంగా చషాలం (గోళాకారకాష్ఠం) యూపస్తంభం, పాత్రలు, గిన్నెలు, వండినసామగ్రిని ఉంచేపాత్రలు, స్రుక్కులు, స్రువాలు అనే ఏడు సాధనాలు వాడతారు. ధర్మజా ! ఒక్కొక్క యూపస్తంభంపై ఏడేసి చషాలాలు ఉంచారు. ఆ యజ్ఞంలో సువర్ణమయయూపస్తంభాలు ఉన్నాయి. ఇంద్రాదులు స్వయంగా వచ్చి నిలబడ్డారు. రాజైన గయుని యజ్ఞంలో, ఇంద్రుడు సోమరసంతో, బ్రాహ్మణులు భూరిదక్షిణలతో హర్షోన్మత్తులై కనిపించారు. బ్రాహ్మణులు దక్షిణరూపంగా లెక్కలేనన్ని ధనరాశులను గ్రహించారు. అది ఇంత అని చెప్పటం కష్టం. గయుడు ఆ ఏడుయజ్ఞాల్లో సదస్యులకు ఇచ్చిన ధనం

అసంఖ్యాకం. వాటిని లెక్కించటం ఇసుకరేణువులవలె, నక్షత్రాలవలె, వర్షధారలవలె అసాధ్యం. పైన చెప్పిన ఇసుకరేణువులయినా ఒకప్పుడు లెక్కింపశక్యం కావచ్చు. కాని ఆ భూరిదక్షిణల ధనం లెక్కింపవీలుకాదు. అనేకవైపుల నుంచి వచ్చిన బ్రాహ్మణులకు విశ్వకర్మచే తయారుచేయబడిన బంగారు గోవులనిచ్చి సంతుష్టిని కలిగించారు. గయుడు యజమానియై ఆ ఏడుయజ్ఞాలు చేసినప్పుడు నిర్మించిన మందిరాలు లేని భూమి చాల తక్కువగా మిగిలి ఉంది. ఆ యజ్ఞకర్మల ప్రభావంచే అతడు ఇంద్రలోకాలు పొందాడు. ఎవడీ నదిలో స్నానం చేస్తాడో వాడి కీ ఇంద్రలోక భోగం కలుగుతుంది. కావున ధర్మరాజా! నీవు సోదరులతో కలిసి ఇక్కడ స్నానమాచరిస్తే పాపాలనుంచి విముక్తిని పొందుతావు."

ధర్మరాజు సోదరులతో, భార్యతో ఆ పయోష్ణినదిలో మునిగి, వైడూర్యపర్వతాన్ని, నర్మదానదిని చేరాలని తలంచి, అక్కడి నుంచి బయలుదేరాడు. సోదరులతో కలిసి కొంతకాలానికి ఆ ప్రదేశానికి చేరాడు. లోమశుడు ధర్మజునికి సుందరమైన తీర్థాలను, పవిత్రమైన మందిరాలను పరిచయం చేశాడు. ప్రతిచోట ధర్మరాజు బ్రాహ్మణులకు ధనం దానం చేస్తూనే ఉన్నాడు. లోమశుడు పలికాడు – 'కౌంతేయా ! వైడూర్యపర్వతం చూసి, నర్మదానదిలో దిగి, స్నానం చేసి, మానవుడు దేవతల, పుణ్యాత్ములైన రాజుల లోకాన్ని చేరుతాడు. కౌంతేయా ! ఈ పర్వతం త్రేతాయుగ, ద్వాపరయుగాల మధ్యలో బయటపడింది. దీన్ని చేరిన మానవుడు పాపాల నుండి బయటపడతాడు. నాయనా ! ఇది శర్యాతి యజ్ఞం చేసిన ప్రదేశం. దివ్యంగా వెలుగుతోంది. అశ్వినీదేవతలతో కలిసి కౌశికుడు ఇక్కడ ప్రత్యక్షంగా సోమరసం త్రాగాడు. భృగునందనుడైన చ్యవనుడు ఇంద్రునిపై కోపించి అతనిని ఇక్కడ స్తంభింపచేశాడు. రాజపుత్రి సుకన్యను భార్యగా పొందాడు. మునిశ్రేష్ఠుడైన చ్యవనుడు ఇక్కడే అశ్వినీదేవతలను సోమరసంతో సంతృప్తులను గావించాడు.' యుధిష్ఠిరుడు అడిగాడు – 'ఏ కారణంగా భార్గవుడైన చ్యవనుడు కోపించి, పాకశాసనుని స్తంభింపచేశాడు? అశ్వినీదేవతలు ఎలా ఈ యజ్ఞంలో సోమరసాన్ని త్రాగారు? ఇది అంతా నాకు సవివరంగా చెప్పు.'

122. చ్యవనమహర్షి సుకన్యను పొందుట.

లోమశుడు చెపుతున్నాడు. 'పాండవా ! భృగుమహర్షి కుమారుడు చ్యవనుడు ఈ సరోవర తీరంలో తపస్సు చేశాడు. ఆయన శరీరం చాలాకాంతితో నిండి ఉంది. తేజస్వియయిన చ్యవనుడు వీరాసనంలో కూర్చుండి, కొయ్యలా ఉండిపోయాడు. అతడు ఒకేచోట చాలకాలం కూర్చున్నాడు. రాజా ! మెల్లమెల్లగా కొంతకాలానికి అతనిశరీరాన్ని

చీమలు చుట్టుముట్టాయి. ఒళ్ళంతా లతలు అల్లుకొన్నాయి. పైన పుట్ట ఏర్పడింది. బుద్ధిమంతుడైన చ్యవనుడు మట్టిముద్ద వలె కనిపించాడు. పుట్టచే ఆవరింపబడి ఘోరమైన తపస్సు చేయసాగాడు. చాలాకాలానికి శర్యాతి అనే రాజు ఈ ఉత్తమ, సుందరసరోవరానికి విహారానికి వచ్చాడు. అతని అంతఃపుర రాణులు నాలుగువేల మంది ఉన్నారు. కాని సంతానం మాత్రం ఒక్క కూతురే. ఆమె పేరు సుకన్య. ఆమె సఖురాండ్రతో కలిసి, దివ్యాభరణాలు ధరించి, తిరుగుతూ భార్గవుడైన చ్యవనుడు తపస్సు చేసే పుట్టను చేరింది. ఆమె ఆ ప్రదేశం సుందర మవటం వలన తదేకంగా చూస్తూ సఖురాండ్రతో కలిసి చెట్లనుంచి పువ్వులను, ఫలాలను కోస్తూ విహరించింది. రూపం, వయస్సు, యౌవనమదం, కామభావాలతో కూడిన ఆమె పుష్పించిన వనవృక్షాలశాఖలను విరిచివేసింది. సఖులకు దూరంగా శరీరంపై ఒకే వస్త్రంతో మెరుపుతీగలా కదలుతున్న ఆమెను చ్యవనుడు చూశాడు. ఏకాంతంలో ఆమెను చూసిన వెంటనే తేజస్సు, తపోబలం, సన్ననికంఠం గల అతనికి ప్రసన్నత కలిగింది.

ఆ చ్యవనమహర్షి ఆమెను పుట్టలోంచే పిలిచాడు. ఆమె అతని కంఠం సన్నగా ఉన్నందున ఆ ధ్వని వినలేదు. ఆ పుట్టలో మెరుస్తున్న భార్గవుని కళ్లను చూచి ఆమెకు కుతూహలం ఏర్పడింది. ఆ కుతూహలంతో ఆమె బుద్ధిని మోహం ఆవరించగా 'ఇది ఏమిటి' అనుకొంటూ దగ్గరలో ఉన్న ముల్లుతో అతని కళ్ళను పొడిచింది. వెంటనే అతడు కోపంతో పైకి లేచాడు. శర్యాతి సైన్యానికి చ్యవనుడు మలమూత్రబంధనం చేశాడు. మలమూత్రాలు బంధింపబడగా ఆ సేనకంతకూ దుఃఖం కలిగింది. సేనను అంతటినీ ఆ రాజు పిలిచి అడిగాడు. 'తపశ్శాలి, వృద్ధుడు, కోపపరాయణుడు, మహాత్ముడు అయిన చ్యవనునియెడ ఎవరు అపరాధం చేశారు? తెలిసి గాని తెలియకగాని ఎవరు ఆయన పట్ల అపచారం చేశారో శీఘ్రంగా చెప్పండి.' సైనికులందరూ ఒక్కసారిగా "ఆయనకు ఎవరు అపకారం చేశారో మాకు తెలియదు. మీరు అన్ని ఉపాయాలు ప్రయోగించి మీ అభీష్టం మేరకు దోషిని కనిపెట్టండి.' అన్నారు. అటుపైన రాజు శర్యాతి సామ, దండోపాయాలతో ప్రయత్నించినా స్నేహితుల నుంచి కూడ అపరాధి జాడ తెలియలేదు. సైనికుల మలమూత్రావరోధకారణం తెలియక దుఃఖిస్తున్న తండ్రిని, దుఃఖిస్తున్న సైన్యాన్ని చూచి సుకన్య తండ్రితో 'వనంలో సంచరిస్తున్న నేను మెరిసిపోయే ప్రాణికండ్లను చూసి, మిణుగురుపురుగులనుకొని, సమీపానికి పోయి, ముల్లుతో పొడిచాను.' అంది. ఇది విన్న శర్యాతి వేగంగా పుట్టవద్దకు చేరుకొన్నాడు. అక్కడ వయోవృద్ధుడు, తపోవృద్ధుడు అయిన చ్యవనుని చూసి సైన్యప్రాణరక్షణం కోసం అంజలిఘటించి, రాజు

ఆయనను ప్రార్థించాడు. 'అజ్ఞానకారణంగా తమపట్ల తప్పుచేసిన బాలికయైన నాకుమార్తెను మీరు క్షమించండి.' అపుడు రాజుతో చ్యవనుడు ఇలా పలికాడు. 'అహంకారంతో అవమానించాలని ఈమె నా కన్నులను పొడిచింది. రూపం, ఔదార్యంకల్గి, లోభమోహాలకు లొంగిన ఆమెనే వివాహమాడి క్షమించగలను. నీతో సత్యాన్ని పలుకుతున్నాను.' లోమశుడు అన్నాడు - ఋషి మాటలు విన్న శర్యాతి మరో ఆలోచన లేకుండా మహాత్ముడైన చ్యవనునికి తన కుమార్తెను ఇచ్చి వివాహం చేశాడు. ఆ కన్యను గ్రహించి చ్యవనుడు రాజును అనుగ్రహించాడు. ఆయన కృపను పొంది రాజు సైన్యంతో సహా తన పట్టణానికి తిరిగి చేరుకొన్నాడు. సుకన్య నిందకు దూరమై, తాపసి అయిన భర్తను పొంది, తపస్సుతో, నియమాలతో భర్తను సేవించింది. అగ్నులను, అతిథులను, అసూయలేకుండా భర్తనూ సేవిస్తూ ఆ శుభానన చ్యవనుని ఆరాధించింది."

123. అశ్వినీదేవతల అనుగ్రహముచే చ్యవనునికి యౌవనము, అందము కల్గుట.

లోమశుడు పలికాడు. 'ఎప్పుడూ మూడుపదుల వయస్సు ఉండే అశ్వినీదేవతలు ఒకనాడు అపుడే స్నానమాచరించి, నగ్నంగా ఉన్న సుకన్యను చూశారు. ఆమెను చూసి, 'ఇంద్రపుత్రి వలె ప్రకాశిస్తోంది' అని అనుకొని, సమీపించి వారు ఇలా పలికారు. 'నీవె ఎవతెవు? ఈ వనంలో ఏం చేస్తున్నావు? నీ గురించి తెలుసుకోవాలి అనుకొంటున్నాం. సరిగ్గా వివరంగా చెప్పు.' సుకన్య సిగ్గుపడి అశ్వినీదేవతలతో పలికింది. నేను శర్యాతిమహారాజు పుత్రికను. చ్యవనుని భార్యను. సుకన్య అనే పేరుతో ఈ లోకంలో ఉన్నాను. నేను ఎల్లప్పుడు పతినే దైవంగా భావిస్తున్నాను' అంది. వారు నవ్వి తిరిగి ఆమెతో ఇలా అన్నారు. "ఈ ముసలివానితో నీ తండ్రి ఎలా నీకు వివాహం చేశాడు? ఈ వనంలో మెరుపుతీగలా ప్రకాశిస్తున్నావు. దేవతల్లో కూడ నీవంటి సుందరి లేదు. నీ అవయవాలకు అలంకారాలు లేవు. మంచి బట్టలు లేవు. శృంగార సంబంధమైన వస్తువులు ధరించలేదు. అలంకారాలు లేకపోయినా నీవు ఈ వనాన్ని ఎక్కువగా ప్రకాశింపచేస్తున్నావు. నీకు దోషంలేని అవయవాలు ఉన్నాయి. నీవు సర్వాభరణాలు ధరిస్తే, విలువైన బట్టలు కడితే, ఎంతో ప్రకాశిస్తావు. మలినమైన శరీరంతో శోభను కోల్పోతున్నావు. ఇంతటి సౌందర్యవతివై కామభోగాలు అనుభవించలేని ముదుసలిభర్తను ఎందులకు సేవిస్తున్నావు? చక్కటి చిరునవ్వు కలిగిన నీవు రక్షణంలో, పోషణంలో అసమర్థుడు అయిన భర్తను భరిస్తున్నావు. ఆ చ్యవనమహర్షిని వీడి మాలో ఒకరిని వరించు. భర్తకోసం అందంలో దేవవనితలతో సమానం అయిన నీవు యౌవనాన్ని వ్యర్థం చేసుకోకు." అన్నారు. అది విన్న సుకన్య

వారిరువురితో ఇలా అంది. 'నేను నాభర్త చ్యవనునే మనస్సులో ఆరాధిస్తూ అనురాగం కలిగి ఉన్నాను. మీరు నా విషయంలో అనుచితం అయిన సందేహాన్ని లేవదీయకండి" అంది. మళ్లీ వారిలా అన్నారు. 'మేము దేవ వైద్యులం. నీ భర్తను యౌవనం, రూపం కలిగిన నరునిగా చేస్తాం. మా ముగ్గురిలో ఒకరిని భర్తగా అంగీకరించు. ఇదే నియమంతో నీభర్తను ఇక్కడకు పిలిపించు.' ఆమె వారి మాటగా చ్యవనుని చేరి వారు చెప్పినట్లుగా ఆయనతో చెప్పింది. అది విన్న చ్యవనుడు భార్యతో 'అలాగే చేద్దాం' అన్నాడు.

ఆమె భర్త అనుమతితో 'అలాగే చేయండి' అంది. అది విన్న అశ్వినీదేవతలు ఆ రాజపుత్రితో 'నీ భర్తను నీటిలో ప్రవేశించమను' అన్నారు. చ్యవనమహర్షి శీఘ్రంగా సౌందర్యం కోసం నీటిలో ప్రవేశించాడు. అశ్వినీదేవతలు కూడ ఆ సరస్సులో ఆయనతో ప్రవేశించి మునిగారు. క్షణకాలంలో ఆ సరస్సు నుంచి అందరూ బయటకు వచ్చారు. వారు దివ్యరూపాలు దాల్చి ఉన్నారు. మెరిసే కుండలాలు చెవులకు ఉన్నాయి. యువకులై సమాన ఆకార, వేష, భాషలు కలిగి మనస్సుకు ప్రీతికలిగిస్తూ ఉన్నారు. అందరూ ఒక్కసారిగా ఆమెతో అన్నారు. 'మాలో ఒకరిని నీ ఇష్టమైన వానిని భర్తగా స్వీకరించు. ఎవరిపట్ల కోరిక ఉందో వానినే వరించు.' ఆమె సమానరూపధారులైన వారినందరిని పరికించి చూసి మనస్సులో నిశ్చయించి, తన భర్త చ్యవనునే పతిగా కోరింది. చ్యవనుడు యౌవనాన్ని, సౌందర్యాన్ని, అనుకూల భార్యను పొంది సంతసించి అశ్వినీదేవతలతో ఆనందంతో ఇలా అన్నాడు. 'నేను మీచే ముసలివాడనైనా అందగాడుగా, యువకునిగా చేయబడ్డాను. మీ అనుగ్రహంచే యౌవనవతిని భార్యగా పొందాను. కావున మీకు ఆనందంతో ప్రత్యుపకారంగా ఇంద్రుడు చూస్తూండగా మీరు సోమరసం త్రాగేలా చేస్తాను. ఇది సత్యం నమ్మండి.' అది విని అశ్వినీదేవతలు సంతసించి స్వర్గానికి వెళ్ళారు. చ్యవనుడు, సుకన్య దేవదంపతులవలె విహరించసాగారు.

124. శర్యాతి ఇంద్రుని చంపుటకు రాక్షసుని సృష్టించుట.

లోమశుడు అన్నాడు. 'పిమ్మట శర్యాతి మహారాజు 'చ్యవనుడు యౌవనవంతుడు అయ్యాడు' అని విన్నాడు. ఆనందంగా సేనతో కలిసి చ్యవనుని ఆశ్రమాన్ని సమీపించాడు. దేవతలవలె ఉన్న చ్యవనుని, సుకన్యను చూసి శర్యాతి సంపూర్ణభూమండలానికి రాజైనట్లుగా తలచి భార్యతో సహా ఆనందంలో మునిగితేలాడు. చ్యవనునిచే సత్కరింపబడి' భార్యతో కూడిన శర్యాతి ఆశ్రమంలో విశ్రాంతిగా కూర్చుని మనస్సుకు సంతోషాన్ని కలిగించే కథలు వినిపించాడు. శర్యాతిని చ్యవనుడు సాంత్వనపరుస్తూ ఇలా అన్నాడు "రాజా! నీ

కొరకు యజ్ఞాన్ని నిర్వహిస్తాను, ద్రవ్యాలను సమకూర్చుకో.'' మిక్కిలి ఆనందించిన శర్యాతి చ్యవనుని మాటలు విని, ప్రసన్నతతో అతనిని గౌరవించాడు. యజ్ఞానికి అనువైన పవిత్రమైన రోజున ఒక యజ్ఞమండపాన్ని తయారు చేయించాడు. అది మనస్సులోని కోరిక లన్నింటిని తీర్చేది. రాజా ! ఆ యజ్ఞమండపంలో భృగువంశజుడైన చ్యవనుడు రాజుచే యజ్ఞం చేయించాడు. "ఆ యజ్ఞంలో జరిగిన అద్భుతాలను నాద్వారా విను'' అన్నాడు లోమశుడు. చ్యవన మహర్షి అశ్వినీదేవతలకు ఇవ్వదలచిన సోమరసాన్ని చేతిలోకి తీసుకొన్నాడు. వారు ఇరువురికోసం సోమాన్ని గ్రహించే సమయంలో ఇంద్రుడు అడ్డుకొన్నాడు.

ఇంద్రుడు అన్నాడు - 'ఈ అశ్వినీ దేవతలు యజ్ఞంలో సోమరసం త్రాగటానికి అర్హులు కారు అని నా అభిప్రాయం. దేవలోకంలో ఉండే దేవతల వైద్యులు వీరు. వీరికి యజ్ఞంలో సోమం త్రాగే అధికారం లేదు.' చ్యవనుడు ఇలా అన్నాడు. 'వీరిరువురూ ఉత్సాహవంతులు. బుద్ధిమంతులు. రూప సంపద కలవారు. వీరే నన్ను దేవతలతో సమానంగా రూపవంతుని, యువకుని చేశారు - నీకు, ఇతర దేవతలకు తప్ప సోమరసాన్ని గ్రహించే అధికారం వీరికి లేదా? అశ్వినీదేవతలు కూడా దేవతలే అని తెలుసుకో.' ఇంద్రుడు అన్నాడు - 'వీరు రోగనివృత్తి చేసేవారు. కామరూపాన్ని పొందగలవారు. లోకంలో సంచరిస్తూ మర్త్యలోకానికి వెడతారు. వీరికి సోమం త్రాగే అధికారం ఎలా ఉంటుంది ?' లోమశుడు పలికాడు. - ఇంద్రుడు మాటిమాటికి ఇదే మాట పలుకుతున్నాడు. భార్గవుడైన చ్యవనుడు ఇంద్రుని లెక్కచేయక అశ్వినీదేవతలకు ఇవ్వటానికి సోమ భాగాన్ని మళ్ళీ చేతితో గ్రహించాడు. ఆ సమయంలో అశ్వినీదేవతలకు సోమాన్ని ఇవ్వడానికి భాగం గ్రహించిన చ్యవనుని చూసి ఇంద్రుడు ఇలా పలికాడు. 'నీవు వీరికి సోమాన్ని ఇవ్వాలని సంకల్పిస్తే నీపై నేను ఘోరమై, ఎదురులేని వజ్రాయుధాన్ని విడచిపెడతాను.' నవ్వుతూ ఇంద్రుని వైపు చూసి, చ్యవనుడు అశ్వినీదేవతలకోసం యథావిధిగా సోమరసభాగాన్ని గ్రహించాడు.

అటుపైన శచీపతి ఇంద్రుడు ఘోరరూపంగల వజ్రాయుధాన్ని భార్గవునిపై విడవబోయాడు. ఆ విడచేసమయంలోనే చ్యవనుడు అతని చేతిని స్తంభింపచేశాడు. అతని స్తంభింపచేసిన చ్యవనుడు మంత్రోచ్చారణతో ఆహుతులను అగ్నిలో వేశాడు. దేవరాజైన ఇంద్రుని హింసించటానికి కృత్యను పుట్టించబూని, ఆయన అలా చేశాడు. చ్యవనుని తపోబలంచే కృత్య ఆవిర్భవించింది. ఆ కృత్యరూపంలో పరాక్రమవంతుడై, పెద్దశరీరం కల, రాక్షసుడు మదుడనేవాడు పుట్టాడు. అతని శరీరాన్ని వర్ణించటం దేవాసురులకు కూడ సాధ్యం కాదు. ఆ రాక్షసుని ముఖం భయంకరమయినది. ముందు తీక్ష్ణదంతాలు

కనిపిస్తాయి. ఆ రాక్షసుని పై దవడ (పెదవి)స్వర్గలోకాన్ని, క్రింది దవడ (పెదవి) భూలోకాన్ని చేరి ఉంది. నాలుగు పాడవైన దంతాలు ఒక్కొక్కటి నూరు యోజనాల వరకు వ్యాపించి ఉన్నాయి. అతని ఇతర దంతాలు పదియోజనాల పాడవు ఉన్నాయి. వాటి ఆకృతి భవన శిఖరాలలాగ, శూలపు కొనల్లాగ కనిపించింది. చేతులు పర్వతాల్లా ఉన్నాయి. రెండు చేతుల పాడుగు పదివేల యోజనాలు. కన్నులు సూర్యచంద్రుల్లా వెలుగుతున్నాయి. ముఖం ప్రళయకాలాగ్నిలా ఉంది. మెరుపుతీగవలె చంచలమైన నాలుకతో ముఖాన్ని నాకుతూ, నోరు బాగా చాచి భయంకరంగా చూస్తూ, లోకాన్ని మింగేలా ఉన్నాడు. అతడు తన ఘోరరూపంతో భయంకర గర్జన చేస్తూ లోకాన్ని భయపెడుతూ ఇంద్రుని తినదలచినట్లు అతని వైపు పరుగుతీశాడు.

125. ఇంద్రుడు ఆపదనుండి బయటపడుట - లోమశుడు చెప్పిన తీర్థాల మాహాత్మ్యము.

నోరు తెరుచుకొన్న యమరాజువలె భయంకరముఖం గల మదాసురుని చూచి నూరుయజ్ఞాలు చేసిన ఇంద్రుడు భయంతో వ్యాకులపడ్డాడు. భుజాలు కొయ్యబారిపోయి, ఆ ఇంద్రుడు మృత్యువుకు భయపడి మాటిమాటికి పెదవుల మూలలను నాకసాగాడు. ఆ అవస్థలో అతడు చ్యవనునితో అన్నాడు - 'ఈ అశ్వినీ దేవతలు నేటినుండి సోమపానం చేయడానికి అధికారులు కాగలరు. నామాట సత్యం. మీరు నాపై ప్రసన్నత చూపండి. మీరు సంకల్పించిన ఈ యజ్ఞం అసత్యం కాదు. మీరు దేన్ని ఆచరించారో అదే ఉత్తమ విధానం. బ్రహ్మర్షీ! నేను ఎఱుగుదును. మీరు మీ సంకల్పాన్ని అసత్యం కానివ్వరు. నేడు అశ్వనీదేవతలను ఎలా సోమపానానికి అధికారులను చేశారో నాకు కూడ అలాగే మేలు చెయ్యండి. తిరిగి మీ పరాక్రమం వెల్లడి కాగలదు. సుకన్య కీర్తి, ఆమె తండ్రి కీర్తి విస్తరిస్తుంది. ఈ ఉద్దేశంతో నేను మీ బలవీర్యాలు ప్రకాశించే కార్యాన్ని చేశాను. మీరు ప్రసన్నులై నాపై దయచూపండి. మీరు ఎలా కోరితే అలా జరుగుతుంది.' రాజా ! ఇంద్రుడు ఇలా పలికిన మీదట మహా మనస్వి చ్యవనుని క్రోధం తగ్గింది. అతడు ఇంద్రుని వెంటనే దుఃఖాలనుంచి విముక్తుని చేశాడు. శక్తిశాలి అయిన ఆ చ్యవనుడు మదాసురుని క్రమంగా స్త్రీలు, మద్యపానం, ద్యూతం, వేట ఈ నాలుగింటిలో భాగాలుగా చేసి ప్రవేశపెట్టాడు. అపుడే మదుని దూరంగా తరిమి, ఇంద్ర, అశ్వినీదేవతలతో కలిసి సోమరసం త్రాగి, రాజు శర్యాతికోరిక తీర్చి, లోకాని కంతటికీ తన శక్తి ప్రకటించి, చ్యవనుడు తన భార్య సుకన్యతో హాయిగా వనవిహారం చేయసాగాడు. పక్షులు సవ్వడిచేసే

ఈ సరోవరం చ్యవనునిదే.

నీవు ఇక్కడ నీ తమ్ములతో కలిసి పితృదేవతలను ఆరాధించు. ఈ సరోవరమూ, **సికతాక్షతీర్థమూ** దర్శించి సైంధవారణ్యంలో చిన్న చిన్న నదుల్లో స్నానం చెయ్యాలి. అక్కడి అన్ని సరస్సుల్లో జలాన్ని స్పృశించాలి. పరమశివుని మంత్రాలు జపిస్తూ ఆ తీర్థాల్లో మునిగి సిద్ధిని పొందుతావు. రాజా! ఇది త్రేతా, ద్వాపరయుగాల సంధి సమయంలో ఏర్పడిన తీర్థం. ఇది అన్ని పాపాలను నాశనం చేయగల తీర్థం. ఇక్కడ **సర్వపాప ప్రణాశన తీర్థం**లో స్నానం చేసి శుద్ధిని పొందు. ఎదురుగా ఉన్నది అర్బీకపర్వతం. ఇక్కడ విద్వాంసులు నివాసం ఉంటారు. ఈ పర్వతంపై పళ్లూ, నీరూ ఎప్పుడూ సమృద్ధిగా ఉంటాయి. ఇది దేవతల ఉత్తమ వసతి స్థానం. ధర్మజా ! ఈ పర్వతంపై దేవతలకు చాలా మందిరాలు ఉన్నాయి. ఇది **చంద్రతీర్థం**. దీన్ని ఋషులు తప్పక సేవిస్తారు. ఈ ప్రదేశంలో వాలఖిల్యులు, వైఖానసులు, వాయుభక్షణం చేసేవారు నివసిస్తారు. ఈ పర్వతంపైన మూడు శిఖరాలు, మూడు సెలయేళ్ళు ఉన్నాయి. వీటన్నింటిలో నీకోరికను అనుసరించి స్నానాదులు ఆచరించు. రాజేంద్రా ! ఇక్కడే రాజు శాంతనుడు, శునకుడు, నరనారాయణులు తపస్సుచేసి, శాశ్వతలోకాలకు వెళ్ళారు. ఈ అర్బీక పర్వతంపై నిత్యం నివాసం చేస్తూ ఋషులతో కలిసి దేవతలు, పితరులు తపస్సు చేశారు. నీవు వీరిని అందరినీ పూజించు. ఇక్కడ దేవతలు, ఋషులు చరుభోజనం చేశారు. దీనికి దగ్గరలో నాశం లేని ప్రవాహం కల యమునానది ఉంది. ఇక్కడే కృష్ణుడు తపస్సు చేశాడు. నకులుడు, సహదేవుడు, భీమసేనుడు, ద్రౌపది మీరు, మేము ఈ స్థానానికి చేరుదాం. ఇది ఇంద్రుని సెలయేరు. ధాత, విధాత, వరుణుడు, ఊర్ధ్వలోకాలకు చేరిన స్థానం ఇదే. ఓర్పుకల్గి, ధర్మాత్ము లైన పురుషు లందరూ ఇక్కడే నివసించారు. ఋజుబుద్ధికలిగి, మైత్రీభావం కలవారందరికీ ఈ పర్వతం ఆశ్రయింపతగింది. కౌంతేయా ! మహర్షిగణంచే సేవ లందుకునే యమున ఇదే. వారు దీని ఒడ్డున అనేక యజ్ఞాలు చేశారు. అవి పాపాలభయాన్ని పోగొట్టేవి. గొప్పవిలుకాడైన మాంధాత మహారాజు స్వయంగా ఈ ప్రదేశంలో యజ్ఞం ఆచరించాడు. దానశిరోమణి, సహదేవకుమారుడూ అయిన సోమకుడు ఈ ఒడ్డుపై యజ్ఞయాగాలు ఆచరించి మంచిఫలాన్ని పొందాడు.

126. మాంధాతపుట్టుక, సంక్షిప్త చరిత్ర.

ధర్మరాజు ప్రశ్నించాడు. "యువనాశ్వుని కుమారుడు మాంధాత మూడులోకాల్లో ప్రసిద్ధిచెందిన రాజు కదా! అతడు ఎలా పుట్టాడు ? మాంధాత అందరికంటె ఉన్నతస్థితిని

ఎలా సంపాదించాడు? విష్ణువుతో సమానంగా మూడు లోకాలు అతనికి ఎలా వశమయ్యాయి? నేను మీముఖంనుంచి ధీమంతుడు, సత్యకీర్తి అయిన మాంధాత చరిత్ర వినాలనుకొంటున్నాను. ఇంద్రసమాన తేజస్వి, సాటిలేని పరాక్రమవంతుడు అయిన ఆయనకు మాంధాత అని పేరు ఎలా వచ్చింది? అన్ని విషయాలు వివరించటానికి మీరే సమర్థులు."

లోమశుడు చెప్పాడు. "రాజా! సావధానంగా ఆ మహాత్ముని గూర్చి విను. మాంధాత అన్నపేరు లోకంలో ఎలా ప్రసిద్ధి చెందిందో తెలుపుతాను. ఇక్ష్వాకువంశంలో యువనాశ్వుడు అనే గొప్ప రాజు పుట్టాడు. ఆతడు గొప్పదక్షిణలిచ్చి చాలా యజ్ఞాలు చేశాడు. ధర్మాత్ములలో శ్రేష్ఠుడైన మాంధాత వేయి అశ్వమేధ యాగాలు ఇతర ప్రధాన యాగాలు చేసి భగవంతుని ఆరాధించాడు. రాజేంద్రా ! గొప్పవ్రతాలను, నియమాలను పాలించేవాడైనా అతనికి సంతానం కలుగలేదు. రాజ్యాన్ని మంత్రులపై ఉంచి, వనంలో నివసించసాగాడు. యోగశాస్త్రవిధానంగా తన ఆత్మను పరమాత్మలో లీనంచేసి, ఒకనాడు ఉపవాసం చేసి, దుఃఖితుడై ఉన్నాడు. దప్పిక అతని హృదయాన్ని బాధిస్తూండగా నీటిని త్రాగడం కోసం భృగుమహర్షి ఆశ్రమాన్ని చేరాడు. ఆ రాత్రే చ్యవనుడు సుద్యుమ్నకుమారుడైన, యువనాశ్వునికి పుత్రసంతానం కోసం ఇష్టిని చేశాడు. ఆ ఇష్టి సమయంలో చ్యవనమహర్షి మంత్రపూతమైన నీటితో ఒక పెద్ద కలశాన్ని నింపి, అక్కడ ఉంచాడు. రాజేంద్రా ! ఆ కలశం ఆశ్రమం లోపల ఒక అభిప్రాయంతో ఉంచబడింది. దాన్ని త్రాగిన యువనాశ్వుని భార్య ఇంద్ర సమానుడు అయిన పుత్రుని కంటుంది అని. ఆ కలశం వేదికపై ఉంచి మహర్షులు అందరు నిద్రించారు. రాత్రి అంతా మేల్కొనటం వలన వారు అంతా అలసిపోయారు. దప్పికతో అతని కంఠం నీరసించింది. నీటిని కోరిన రాజు ఆ ఆశ్రమంలోకి ప్రవేశించి వారిని నీటికోసం ప్రార్థించాడు. అలసి నీరసపడటంచేత అతడు అరుస్తున్నా ఆ సమయంలో ఎవరికీ అతని పిలుపు వినపడలేదు. పైగా ఆ సమయంలో పక్షికూతలా అనిపించింది. నీటితో నిండిన ఆ కలశంపై అతని దృష్టి పడింది. వేగంగా ఆ వైపు పరుగు తీసి స్వేచ్ఛగా అందులోని నీరు త్రాగి, మిగిలిన నీటిని వదిలివేశాడు. రాజైన యువనాశ్వుడు ఆ చల్లని నీరు త్రాగిన వెంటనే అతనికి శాంతి లభించింది. ధీమంతుడైన రాజు సుఖాన్ని కూడ పొందాడు. తపోధనులు అందరు మేల్కొని నీరులేని కలశాన్ని చూశారు. ఆ మునులు ఒకచోటికి చేరి ఒకరు రెండవవారిని గూర్చి 'ఇది ఎవరి పని' అని అడిగారు యువనాశ్వుడు ఎదురుగా వచ్చి "ఇది నా పనే' అని వాస్తవాన్ని చెప్పాడు. చ్యవనుడు "బలపరాక్రమాలు కల నీకు ఇది తగినది కాదు. ఈ కలశంలో నీకు పుత్రసంతానం కోసమే నా తపస్సుచే సంస్కరింపబడ్డ నీరు ఉంచాను. కఠోరమైన తపస్సు చేసి బ్రహ్మతేజం

అందులో నింపాను. పైన చెప్పిన క్రమంలో ఈ నీటిని నేను శక్తిసంపన్నం చేశాను. దీన్ని త్రాగిన వారికి మహావీర్యం, తపస్సు, బలం కల కుమారుడు పుడతాడు. అతడు ఇంద్రుణ్ణి అయినా జయించి యమపురికి పంపుతాడు. యథావిధిగా నాచే ఇది సమర్థతతో చేయబడింది. జలభక్షణం మాత్రం నీచే చేయబడింది. ఇది సరైంది కాదు. ఇప్పుడు మేము ఈ ప్రభావాన్ని సంపాదించడానికిగాని, మార్చడానికి గాని సమర్థులం కాము. నీవు చేసిన పని నిశ్చయంగా దైవ కారణంగానే జరిగింది. దప్పికవలన నీవు విధి, మంత్రబలాలతో పాటు నాతపస్సు, వీర్యం చేర్చిన నీళ్ళు త్రాగావు. వాటినుంచి నీవు అట్లాంటి కుమారుణ్ణే కంటావు. ఈ ఆశయసాధనకై మేం నీ కోరికకు అనుగుణంగా అద్భుతమైన ఇష్టిని చేయిస్తాము. దీనితో ఇంద్రునితో సమానుడు అయిన పుత్రుని కంటావు. గర్భధారణవల్ల ఏర్పడిన బాధ నీకు కలుగదు.

పిమ్మట వందసంవత్సరాలు గడిచాక ఆ మహారాజు ఎడమభాగాన్ని చీల్చుకొని సూర్యునివలె ప్రకాశించే తేజోవంతుడు అయిన కుమారుడు పుట్టాడు. రాజుకు మృత్యువు కూడా రాలేదు. ఇది చాలా అద్భుతం. మహాతేజస్వి అయిన ఇంద్రుడు విడ్డూరంగా పుట్టిన ఈ బాలుని చూడడానికి వచ్చాడు. ఆ సమయాన దేవతలు 'ఈ పిల్లవాడు ఏం త్రాగుతాడు?" అని ఇంద్రుని అడిగారు. ఇంద్రుడు తనచేతి చూపుడు వ్రేలును అతని నోటిలో ఉంచి ఇలా అన్నాడు. 'నన్ను ఇతడు గ్రోలగలడు.' ఇంద్రుడు పలికిన మాటలు విని దేవతలు మాంధాత అనేపేరును అతనికి స్థిరం చేశారు. ఇంద్రుని చూపుడు వ్రేలిని గ్రహించి, పాలను త్రాగిన ఆ శిశువు పదమూడు సంవత్సరాలు పెరిగాడు. ఆ సమయాన శక్తిశాలి అయిన మాంధాత ధ్యానించగానే వేదాలు, ధనుర్వేదం, దివ్యాస్త్రాలు ఈశ్వరుని కృపచే అతనిలో ప్రవేశించాయి. ఆజగవం అనే విల్లు, కొమ్ములతో చేసిన బాణాలు, చీల్చశక్యం కాని కవచం అతని నాశ్రయించాయి. అతడు స్వయంగా ఇంద్రునిచే పట్టాభిషిక్తుడై విష్ణువు మూడు పాదాలతో లోకాలను జయించినట్లు ధర్మంతో ముల్లోకాలను జయించాడు. అతని శాసననియమాలు ఎదురు లేనివి అయ్యాయి. రత్నాలన్నీ రాజర్షి మాంధాతను స్వయంగా చేరాయి. రాజా ! ఈ ప్రకారంగా అతనికోసం భూమి ధనరత్నరాసులను నింపింది. ఘనమైన దక్షిణలతో ఎన్నో యాగాలను సమర్థవంతంగా పూర్తి చేసి ఫలాన్ని అందుకొన్నాడు.

రాజా ! తేజస్సంపన్నుడైన మాంధాత ఎన్నో చయనమండపాలను నిర్మించి, దానివలన పుష్కలమైన ధర్మాన్ని పొందాడు. ఇంద్రుని అర్ధసింహాసనం సంపాదించాడు. ధర్మపరాయణుడు అయిన ఆయన ఆజ్ఞచే ఒక్కరోజులోనే పట్టణాలు, సముద్రంతో కూడిన భూమి అతనికి

వశమయ్యాయి. మహారాజా ! అతని యజ్ఞమండపాలు, దక్షిణ కలిగిన యజ్ఞాలు సముద్రాలవరకు వ్యాపించాయి. మండపాలు లేని భూమి కొంచెం కూడ లేదు. మహారాజు మాంధాత పదివేల పద్మాల గోవులను బ్రాహ్మణులకు దానం చేశాడని కీర్తింపబడుతున్నాడు. పన్నెండు సంవత్సరాలు అనావృష్టి ఏర్పడినప్పుడు వజ్రపాణి అయిన ఇంద్రుడు చూస్తుండగా పంటల అభివృద్ధికై స్వయంగా వర్షాన్ని కురిపించాడు. చంద్రవంశంలో పుట్టి, మేఘం వలె గర్జింపగల గాంధారాధిపతిని మాంధాత తీక్ష్ణబాణాలతో గాయపరిచి చంపివేశాడు. రాజా! అతడు తన మనస్సును అదుపులో ఉంచుకుని తపోబలంతో దేవ, మనుష్య, తిర్యఙ్, స్థావరాలనే నాలుగురకాల ప్రకృతిని రక్షించాడు. తన పరాక్రమంతో లోకాలను తపింపచేశాడు. రాజేంద్రా ! సూర్యతేజంతో సమానమైన తేజస్సు గల మాంధాత దేవయజ్ఞస్థానం ఇది. కురుక్షేత్రం మధ్యలో పవిత్రప్రదేశంలో ఉంది. దీనిని దర్శించు. మాంధాత వలె నీవు కూడ ధర్మంగా భూమిని పాలించి స్వర్గాన్ని చేరుతావు. రాజా ! మాంధాత చరిత్ర అంతా నీవు అడిగినవిధంగా పూర్తిగా చెప్పాను." లోమశుని వాక్యాలు విన్న ధర్మరాజు తరువాత సోమకుని చరిత్ర వినిపింపమని ఆయన్ని కోరాడు.

127. సోమక-జంతువుల కథ.

యుధిష్ఠిరుడు అడిగాడు - "రాజు సోమకుడు ఎలాంటి పరాక్రమం కలవాడు ? అతని పనులు, వాటి ప్రభావం వినాలనుకొంటున్నాను." లోమశుడు చెప్పాడు. "యుధిష్ఠిరా ! సోమకు డనే రాజు ఉండేవాడు. అతడు ధార్మికుడు. అతనికి వందమంది భార్యలు. అందరూ ఒకే స్థాయి వారు. చాలకాలం గొప్పగొప్ప ప్రయత్నాలు చేసినా అతని రాణులకు గర్భం కలుగలేదు. సోమకుడు వృద్ధుడు అయిన పిదప ఒకానొక సమయంలో ప్రయత్నాలు ఫలించి నూరుగురు భార్యలకు ఒకడే కుమారుడు" జంతువు అనేవాడు కలిగాడు. అతడు పుట్టిన పిదప రాణులందరు అతని చుట్టూ చేరి కామభోగాలను కల్పించాలని ఎల్లప్పుడు ప్రయత్నం చేసేవారు.

ఒకానొకనాడు ఒక చీమ అతని కటిభాగంలో కుట్టింది. ఆ దుఃఖంతో బాలకుడు గుక్కపట్టి ఏడ్చాడు. తల్లులందరు అతని దుఃఖంచేత దుఃఖిస్తూ, అతని చుట్టూ మూగి ఆక్రోశించసాగారు. ఆరోదనతో గొప్ప కలకలం బయలుదేరింది. ఆ సమయంలో రాజు ఆస్థానంలో మంత్రి, పురోహితులమధ్య సభలో ఉండి ఈ ఆర్తనాదం విన్నాడు. వింటూనే రాజు 'ఏమైంది' అని ద్వారపాలకుని తెలుసుకోమని పంపాడు. అతడు తిరిగివచ్చి రాజకుమారుని వృత్తాంతాన్ని రాజుకు వినిపించాడు. శత్రుతాపనుడైన సోమకుడు త్వరగా సభనుంచి

బయటపడి, మంత్రులతో కలిసి, అంతఃపురానికి వచ్చి, కుమారుని సముదాయించాడు. రాజా ! కుమారుని ఊరడించి అంతఃపురం నుంచి బయటకు వచ్చి పురోహిత, మంత్రులతో కలిసి సభలో తిరిగి కూర్చున్నాడు.

సోమకుడు పలికాడు – 'ఈ ప్రపంచంలో ఒక్కకుమారుడు ఉండటం తగినదికాదు. ఇంతకన్నా పుత్రులు లేకపోవటమే మంచిది. ప్రాణులకు ఒకే కుమారుడు ఉండడం నిత్యమూ, భయాన్ని, దుఃఖాన్నీ కలిగిస్తుంది. నేను బాగా ఆలోచించి, పుత్రార్థినై నూరుగురు భార్యలను వివాహమాడాను. కాని వారికి సంతానం కలుగలేదు. నా రాణులు సంతానం కోసం యత్నశీలలై ఉన్నారు. అయినా ఎలాగో వారికి ఈ ఒక్క కుమారుడు పుట్టాడు. ఇంతకన్న లోకంలో ప్రాణులకు దుఃఖం లేదు. నాకు, నా రాణులకు యౌవనం గడచిపోయింది. మా ప్రాణాలు ఈ ఒకే ఒక్క కుమారునిపై లగ్నమయి ఉన్నాయి. నూరుగురు కుమారులు కలుగునట్లు ఆదేశించండి. అది గొప్పదైనా, చిన్నదైనా, అసాధ్యమయినా ఆచరిస్తాను.'

పురోహితుడు పలికాడు – "నూరుగురు పుత్రులను పొందగల ఒక యజ్ఞకర్మ ఉన్నది. అది నీకిష్టం అయితే దాన్ని వివరించి చెబుతాను." సోమకుడు అన్నాడు – "అది చేయ తగినది అయినా, తగనిది అయినా నూరుగురు పుత్రులు మాత్రం కలిగేదైతే ఆచరిస్తాను. నాకు చెప్పు." పురోహితుడు పలికాడు. 'రాజా ! జంతునితో యాగం చెయ్యి. నేను క్రతువు ప్రారంభిస్తాను. అందు పశువు జంతుడే. దీనివల్ల నీకు నూరుమంది కుమారులు పుడతారు. యజ్ఞసమయంలో జంతుడిని చంపి అతని శరీరంలోని వపను హోమం చేస్తే ఆ పొగను ఆఘ్రాణించిన రాణి లందరు గర్భవతులై, పరాక్రమవంతు లయిన కుమారులను కంటారు. మళ్ళీ జంతువు ఆమెకే కుమారుడుగా పుడతాడు. అతని ఎడమప్రక్కన బంగారు రంగు మచ్చ ఉంటుంది.'

128. సోమకునికి నూరుగురు కుమారులు కలుగుట - సోమకపురోహితులు నరకస్వర్గములను అనుభవించుట.

సోమకుడు పలికాడు – 'పురోహితా ! ఏ పని ఎలా ఎలా చెయ్యాలో అలాగే ఆచరించు. పుత్రప్రాప్తికై నీవు చెప్పిన దాన్ని చెప్పినట్టే ఆచరిస్తాను.' లోమశుడు అన్నాడు – 'అప్పుడు పురోహితుడు సోమకునిచే జంతుని యజ్ఞకుండంలో బలి ఇప్పించి యజ్ఞాన్ని ఆరంభించాడు. ఆ సమయంలో తల్లులందరు ఏడుస్తూ దయకలవారై, 'మేము చనిపోయాం' అని అరుస్తూ జంతుని తీవ్రశోకంతో లాగసాగారు. తల్లులు ఒకవైపు నుంచి పిల్లవాణ్ణి కుడిచేయి పట్టుకుని లాగుతున్నారు. పురోహితుడు ఎడమ చేయి పట్టుకుని లాగుతున్నాడు.

ఆడ లకుముకి పిట్టలవలె అరుస్తూ తల్లులు తమ కుమారుని పట్టి లాగుతుండగా పురోహితుడు బలవంతంగా ఆ బాలకుని పట్టిలాగి శాస్త్రప్రకారంగా అతని వపను హోమం చేశాడు. ఆ గంధాన్ని వాసన చూచిన తల్లులందరు భూమిపై దీనురాండ్రై పడిపోయారు. ఆ వాసన పీల్చటంతో వారు అందరు గర్భవతులు అయ్యారు. పిమ్మట పదినెలల్లో వారంతా పుత్రులను నూరుమందిని కన్నారు. జంతుడు పూర్వపు తల్లియందే జ్యేష్ఠుడై పుట్టాడు. అందరు రాణులకూ, తమ పుత్రులకంటె అతడే ప్రీతిపాత్రుడు అయ్యాడు. అతని కుడివైపు బంగారపురంగు మచ్చ ఉంది. ఆ వందమందిలో అతడే గుణవంతుడు అయ్యాడు.

పిమ్మట కొంతకాలానికి సోమకుని పురోహితుడు పరలోకాన్ని చేరాడు. కొన్ని దినాల తరువాత సోమకుడు పరలోకాన్ని పొందాడు. ఘోరనరకంలో అగ్నిలో వేగుతున్న పురోహితుని చూచి అడిగాడు రాజు. 'ఏ కారణంగా నరకంలో అగ్నిపీడను అనుభవిస్తున్నావు?' అని. నరకాగ్నిలో వేగిపోయే పురోహితుడు రాజుతో 'నేను నీచే యజ్ఞం చేయించాను. దాని ఫలితమే ఇది' అన్నాడు. ఇది విని రాజర్షి సోమకుడు యమధర్మరాజుతో అన్నాడు. 'నేను నరకాగ్నిలో ప్రవేశిస్తాను. నా పురోహితుని విడచిపెట్టండి.' అని. (నా' కారణంగా ఈ మహాభాగుడు నరకాగ్నిలో వేగుతున్నాడు. నన్ను నేను నరకంలో ప్రవేశపెట్టుకొంటాను. అతన్ని విడువండి) ధర్ముడు అన్నాడు. 'వాగ్మీ ! కర్తయే అతడు చేసిన కర్మలకు ఫలాన్ని అనుభవించాలి. అతని బదులుగా ఇతరులు అనుభవింప వీలులేదు. నీవు నీ పుణ్యకర్మల ఫలంగా పుణ్యాన్ని పొంది, ప్రత్యక్షంగా చూడగలుగుతున్నావు.' సోమకుడు అన్నాడు - నేను నా పురోహితుణ్ణి విడచి పుణ్యలోకాలు కోరను. నేను ఇతనితో కలిసియే స్వర్గంలోగాని, నరకంలోగాని ఉండాలి అనుకొంటున్నాను. ఈ నా పుణ్యకర్మలలో మా ఇద్దరికీ సమానంగా ఫలముంది. కావున పాపపుణ్యాలఫలం సమానంగా అనుభవించాలి అని నా అభిప్రాయం.' ధర్మరాజు పలికాడు - 'రాజా ! నీకు అలాంటి కోరిక ఉంటే ఇతనితో సహా ఫలాన్ని అనుభవించు. ఇతని శిక్ష పూర్తి అయిన పిదప స్వర్గాన్ని చేరతావు.' అన్నాడు - "పద్మాలవంటి కన్నులు గల ఆ రాజు యమధర్మరాజు చెప్పినట్లుగా అన్నిపనులు అలాగే చేశాడు. భోగం ద్వారా పాపం నశించాక పురోహితునితో కలిసి నరకం నుంచి బయటపడ్డాడు. రాజా! గురుప్రేమ కల రాజు తన కర్మలచే గురువుతో బాటు పుణ్యలోకాలు అనుభవించాడు. ఎదురుగా కనిపిస్తున్న ఇదే ఆయన ఆశ్రమం. పవిత్రమైన ఈ ఆశ్రమంలో క్షమాశీలుడై ఆరురాత్రులు ఇక్కడ ఉపవాసం చేస్తే మనుష్యునికి సద్గతులు కలుగుతాయి. రాజేంద్రా ! మనము అందరం ఇంద్రియసంయమనంతో

నిశ్చింతగా ఇక్కడ ఆరురోజులు ఉపవాసం చేద్దాం. సిద్ధం కండి."

129. కురుక్షేత్రద్వారము - యమునాతీర్థము - సరస్వతీ తీర్థమాహాత్మ్యము.

లోమశుడు అన్నాడు - 'రాజా ! ఈ తీర్థంలో పూర్వకాలం ప్రజాపతి ఇష్టికృతం అనే యాగాన్ని వేయి ఏండ్లపాటు అనుష్ఠించాడు. నాభాగుని కుమారుడైన అంబరీషుడు ఇక్కడే యమునా తీరంలో తపస్సు చేశాడు. పిమ్మట సదస్యులకు పది పద్మాల నాణాలను దానం చేశాడు. తపస్సు ద్వారా సిద్ధిని పొందాడు. కొంతేయా ! ఇది నహుషకుమారుడు యయాతి ప్రదేశం. అతడు పవిత్రకర్మలను చేసేవాడు. యాజ్ఞికుడు, మహాతేజస్వి, సార్వభౌముడు. అతడు ఎప్పుడూ ఇంద్రునితో పోటీపడేవాడు. ఇది అతని యజ్ఞభూమి. చూడు. ఇక్కడ అనేకాకారములయిన అగ్నులతో(చితులు) కూడిన భూమి, యయాతి యజ్ఞకర్మలచే వ్యాప్తమై అతని పుణ్యధారలలో మునిగి ఉంది. ఈ జమ్మికొమ్మకు ఒకే ఆకు ఉంది. ఈ సరస్సు కూడ ఉత్తమ మయింది. చూడు, ఇవి పరశురాముని కుండాలు, ఇదే నారాయణాశ్రమం. చూడు.*

రాజా ! ఇది యోగశక్తిచే భూమి అంతా సంచరించే ఋచీకుని పుత్రుడైన జమదగ్ని తీర్థం. ఇది రౌప్యానదీ సమీపంలో ఉంది. ఈ తీర్థానికి పరంపరగా ప్రాప్తమైన కథ ఉంది, చెబుతాను. విను. ప్రాచీన కాలంలో ఒక స్త్రీ తన పుత్రునితో కలిసి ఇక్కడ నివసించడానికి వచ్చింది. ఒక పిశాచి రోళ్ళపరిమాణం గల ఆభరణాలు దాల్చి ఆమెతో అంది. 'యుగంధరదేశంలో **పెరుగు త్రాగి**, అచ్యుతస్థలంలో రాత్రి నివసించి, భూతలయంలో స్నానమాడితే కాని పుత్రునితో ఇక్కడ నీకు నివసించటానికి అధికారం లేదు. ఒకరాత్రి ఇక్కడ పరుండి రెండవరోజున ఉంటే పగలు పొందిన కష్టం కంటె ఎక్కువ కష్టాన్ని రాత్రి పొందుతావు.' ఈ జనశ్రుతిని బట్టి ఇక్కడ ఒకే రాత్రి ఉండాలి. ఇక్కడ మనం ఈ రోజు రాత్రి నివసిద్దాం. ఇది కురుక్షేత్రానికి ద్వారం. రాజా ! ఇక్కడే నహుషపుత్రుడు యయాతి ధనరాశులను దక్షిణరూపంగా ఇచ్చి భగవంతుని అర్చించాడు. ఆ యజ్ఞాల్లో ఇంద్రుడు ఇతనిపట్ల చాలాప్రసన్నుడు అయ్యాడు.

ఇది యమునా నదీ తీరాన ఉన్న **ప్లక్షావతరణ** తీర్థం. సాటిలేనిది. విద్వాంసులు దీన్ని స్వర్గలోకమార్గం అని కీర్తించారు. ఇక్కడే **యూపాలు, రోళ్ళు** మొదలైన యజ్ఞసాధనాలను ప్రోగుచేసి, సారస్వతయజ్ఞాలను అనుష్ఠించిన గొప్ప ఋషులు అవభృధ స్నానం

* వి సం యాగంలో పెరుగు(ఆమిక్ష)ను తయారు చేయడానికి ఉపయోగించేది. ఆకులన్నీ తీసి ఒక్క ఆకు మాత్రం మిగిల్చిన జమ్మికొమ్మ. (నీల)

చేశారు.*

ఇదే ప్రదేశంలో భరతుడు అనే రాజు ధర్మబద్ధంగా రాజ్యాన్ని పొంది చాలా యజ్ఞాలు చేశాడు. అశ్వమేధయాగాన్ని చేయ నిశ్చయించి నల్లలేడి వంటి ఆకారమూ, నీలపు చెవులూ కల గుర్రాన్ని భూతలంపై తిరగటానికి విడచిపెట్టాడు. ఇదే తీర్థంలో ఋషిప్రవరుడు సంవర్తుడు మరుత్తమహారాజుచే సత్రయాగం చేయించాడు. రాజేంద్రా ! ఇక్కడ స్నానం చేసిన మానవుడు పరిశుద్ధుడై లోకా లన్నింటిని ప్రత్యక్షంగా చూడగలడు. పాపాలనుంచి విముక్తిని పొందుతాడు. ఇక్కడ కూడ స్నానం చెయ్యి. తరువాత సోదరులతో కూడి, స్నానం చేసి, మహర్షులచే ప్రశంసింపబడి, ధర్మజుడు లోమశునితో ఇలా అన్నాడు. "మహర్షీ ! తపస్సంపన్నులగు మీరు సత్యపరాక్రములు. మీ కృపచే నేను సర్వలోకాలనూ చూడగలుగుతున్నాను. ఇక్కడే ఉండి పాండవశ్రేష్ఠుడైన అర్జునుని చూడగలుగుతున్నాను." లోమశుడు పలుకుతున్నాడు. "మహాబాహూ ! నీవు నిజం చెప్పావు. మహర్షులు అందరూ ఇక్కడ స్నానం చేసి మూడులోకాలలోని చరాచరప్రాణుల నన్నింటిని చూస్తున్నారు. ఈ సరస్వతీ తీర్థాన్ని దర్శించే పుణ్యం కలవారు మాత్రమే ఈ ప్రదేశంలో సంచరిస్తారు. కొంతేయా ! ఈ తీర్థాలను సేవిస్తే నీ పాపాలు పటాపంచలవుతాయి. దేవర్షులు, బ్రహ్మర్షులు, రాజర్షులు ఈ తీర్థంలో సారస్వత యజ్ఞాలు అనుష్ఠించారు. ఇది పంచయోజన విస్తీర్ణం అయిన ప్రజాపతి యజ్ఞవేదిక. ఇది యజ్ఞాచరణశీలం కల కురుమహారాజు క్షేత్రం."

130. విభిన్నతీర్థాలమహిమ, ఉశీనరరాజు కథ.

లోమశుడు అన్నాడు – "రాజా ! ఇక్కడ మానవులు శరీరాన్ని విడచి స్వర్గాన్ని చేరుకొంటారు. మరణించాలి అని అనుకొనేవారు కూడ ఈ తీర్థానికి వేలకొద్దీ వస్తారు. రాజా! ప్రాచీనకాలంలో దక్షప్రజాపతి యజ్ఞసమయంలో "ఇక్కడ మరణించిన మానవులు స్వర్గాన్ని సాధిస్తారు" అని ఆశీర్వదించాడు. ఇది సుందరమూ, దివ్యమూ అయిన సరస్వతీనది. దీని ప్రవాహవేగ మెక్కువ. దీనిపేరు **సరస్వతీ వినశన తీర్థం**. ఇది నిషాద రాజ్యద్వారం. నిషాదుల సంబంధంచే దోషం పొందిన సరస్వతి వారికి కనపడకుండా ఉండాలని ఇక్కడే భూమిలోనికి చొరబడింది. దీనిపేరు **చమసోద్భేద తీర్థం**. ఇక్కడ సరస్వతీ నది ప్రత్యక్షంగా కనిపిస్తుంది. సముద్రంలో కలవాలి అనుకొనే నదులన్నీ ఈమెను అనుసరించాయి. ఇది లోపాముద్ర అగస్త్యుని భర్తగా వరించిన చోటు. సింధు నదీ తీరాన ఉన్న గొప్పతీర్థం. ఈ

* వి సం యూపోఽలూఖలికాఃసారస్వతసత్రయాగాలలో ఋషులు రోలువలే తయారు చేసుకున్న మొదలుగల యూపస్తంభాది యజ్ఞసాధనాలతో సరస్వతీనదీతీరాలలో అవభృథాలకు వెళతారు.(నీల)

ప్రకాశించే తీర్థం **ప్రభాసతీర్థం**. ఇది ఇంద్రునికి చాలా ఇష్టమయింది. పవిత్రం, పాపనాశనం కూడ. ఇదే **విష్ణు పదమనే** పేరుగల దివ్యతీర్థం. పరమపావని అయిన విపాశానది ఇక్కడే ఉంది. ఈ తీర్థంలో వసిష్ఠముని పుత్రశోకంతో పీడితుడై, తన శరీరాన్ని పాశాలతో కట్టుకొని నదిలో దూకాడు. కాని పాశాల నుంచి విడివడి నదినుంచి బయటికి వచ్చాడు. ఇది పుణ్యప్రదమయిన కాశ్మీరదేశం. ఇక్కడ చాలమంది ఋషులు నివసించారు. నీసోదరులతో సహా దీన్ని దర్శించు.ఉత్తరప్రాంతపు ఋషులు, యయాతి అగ్ని, కశ్యపుల సంవాదం ఇక్కడే జరిగింది. ఇదే మానససరోవరానికి ద్వారం అని చెబుతారు. ఈ పర్వత మధ్యభాగంలో పరశురాముడు ఆశ్రమం నిర్మించాడు. సత్యవిక్రముడైన పరశురాముడు అందరికీ సుపరిచితుడే. ఈ ఆశ్రమం విదేహదేశానికి ఉత్తరంగా ఉంది. ఈ ప్రదేశాన్ని వాయువు కూడ దరి చేరలేదు.

కౌంతేయా ! ఇది మరో ఆశ్చర్యకరమైన విషయం. ఈ తీర్థంలో నివసించే సాధకులకు యుగాంతంలో స్వేచ్ఛారూపాన్ని ధరించగల శక్తి, ప్రమథగణాలతో, పార్వతితో కూడిన శంకరుని ప్రత్యక్షదర్శనం కలుగుతుంది. ఈ సరోవరతీరాన, చైత్రమాసంలో శుభాలను కోరే యాజకులు, అనేక రకాల యజ్ఞాలతో, పరివారగణంతో కలిసి శివుని ఆరాధిస్తారు. ఈ సరస్సులో, శ్రద్ధతో, జితేంద్రియుడై, స్నానం ఆచమనం చేస్తే పాపాలు పోయి శుభలోకాలను చేరుతాడు. ఈ సరస్సుకి **ఉజ్జానకం** అనిపేరు. ఇక్కడే కుమారస్వామి, అరుంధతీ సహితుడు అయిన వసిష్ఠుడు సాధన చేసి సిద్ధిని, శాంతిని పొందారు. ఇది **కుశవంతం** అనే మడుగు. ఇక్కడే కుశేశయం అనే పేరుగల పద్మం వికసిస్తుంది. ఇది **రుక్మిణీదేవి** ఆశ్రమం. ఇక్కడ ఆమె కోపాన్ని జయించి శాంతిని పొందింది. ఏది యోగసిద్ధికి సంక్షేపస్వరూపం అని పూర్వం విన్నావో, దేన్ని చూస్తే సమాధి ఫలం లభిస్తుందో ఆ **భృగుతుంగమనే** పర్వతం నీ ఎదుట ఉంది. దాన్నే నీవు చూస్తున్నావు. రాజేంద్రా ! వితస్తానదిని చూడు. ఇది పాపాలు పోగొట్టే నది. దీని నీరు చల్లగా, నిర్మలంగా ఉంటుంది. దీని ఒడ్డున చాలామంది మహర్షులు నివసిస్తున్నారు. యమునా నదికి రెండువైపుల ప్రవహించే జల, ఉపజల అనే నదులను చూడు. రాజు ఉశీనరుడు ఇక్కడ యజ్ఞం చేసి, ఇంద్రుని మించిన స్థానం దక్కించుకొన్నాడు. ఉశీనరుని మహిమ తెలిసికొనటం కోసం ఒకసారి అగ్ని, ఇంద్రుడు అతని రాజసభకు వచ్చారు. వరాల నివ్వగల వారిరువురు ఆ సమయాన శిబిని పరీక్షింప నిశ్చయించి ఇంద్రుడు డేగగా; అగ్ని పావురంగా మారి అతని యజ్ఞమండపానికి వచ్చారు. తన రక్షణకై ఆశ్రయాన్ని కోరిన పావురం డేగ భయంతో రాజు తొడలను చేరి దాగి ఉంది.

131. డేగకు శిబి తనశరీర మాంసము ఇచ్చి పావురమును రక్షించుట.

డేగ పలికింది – 'రాజా ! రాజులు అందరిలో నీవే ధర్మాత్ముడవు అని పెద్దలు చెబుతున్నారు. కాని నీవు ధర్మానికి విరుద్ధం అయిన పని ఎలా చెయ్యాలి అనుకొంటున్నావు? ఆకలిచే బాధపడే మాకు ఈ పావురం భక్ష్యపదార్థంగా నిర్ణయింపబడింది. నీవు ధర్మలోభంతో దీన్ని రక్షించకు. నిజానికి నీవు దీనికి ఆశ్రయం ఇచ్చి ధర్మలోపం చేస్తున్నావు.' రాజు పలికాడు – 'ఈ పావురం నీకు భయపడి, మిక్కిలి వణకుతూ ప్రాణరక్షణ కోరి నన్ను చేరింది. ఇది తన ప్రాణరక్షణ కోరింది. ఈ విధంగా అభయాన్ని కోరి ఆకస్మాత్తుగా వచ్చిన పావురానికి రక్షణ కల్పించడమే పరమధర్మం. దీన్ని ఎందుకు నీవు గుర్తించలేకపోతున్నావు? పావురం దీనంగా మాటిమాటికి వణుకుతోంది. చూడు. నా సమీపానికి ప్రాణరక్షణకై వచ్చింది. దీన్ని విడవటం వలన నింద కలుగుతుంది. **బ్రాహ్మణుని చంపినవాడి పాపం, జగన్మాతగోవును చంపినవాడి పాపం, శరణు కోరిన వాడిని విడవటంతో వచ్చిన పాపమూ సమానం.**' డేగ పలికింది 'రాజా ! ప్రాణులన్నీ ఆహారంతో వృద్ధి చెందుతాయి. ఆహారాన్ని బట్టే పెరుగుదల, ప్రాణమూ ఏర్పడుతున్నాయి. ఏది విడవటం కష్టమో, దాన్ని విడచి చాలారోజులు జీవించగలడు. ఆహారాన్ని విడచి మాత్రం చిరకాలం జీవించలేడు. నేడు మీ కారణంగా నా భోజనం నాకు దక్కలేదు. కావున నా ప్రాణాలు నన్ను విడచి మృత్యులోకం చేరతాయి. నాకు మృత్యువు రాగా నా కుటుంబం అంతా నశిస్తుంది. ఒక్కపావురాన్ని రక్షించి చాలమందిని చంపుతున్నావు. **ఎవని ధర్మం పరులధర్మాన్ని బాధిస్తుందో అది చెడ్డ ధర్మం. అనలు ధర్మమే కాదు. పరధర్మానికి విరోధం కాని ధర్మమే ధర్మం.* పరస్పరం ప్రతికూలధర్మాలు ఎదురుపడినప్పుడు గురు-లాఘవచర్చ చెయ్యాలి. ఇద్దరికీ బాధలేని ధర్మాన్ని ఆచరించాలి. ధర్మాధర్మనిర్ణయం చేసే సమయంలో గురు, (ఎక్కువ) లాఘవ (తక్కువ) విధానంపై దృష్టి ఉంచాలి. దేని వల్ల ఎక్కువ పుణ్యం కలుగుతుందో దాన్ని ఆచరించాలి.**'

'పక్షిరాజా! నీవు చాలా శుభప్రదంగా మాట్లాడుతున్నావు – నీవు గరుత్మంతుడవా? నీవు ధర్మజ్ఞుడవే. సందేహం లేదు. నీ మాటలన్నీ చిత్రంగాను, ధర్మబద్ధంగాను ఉన్నాయి. నీకు తెలియని ధర్మం లోకంలో లేదని తెలుసుకొన్నాను. శరణాగతులను విడిచిపెట్టడం మంచిది అని ఎలా అనుకొంటున్నావు ? ఆహారం కోసమే నీ ప్రయత్నం అంతా.

---

* ధర్మం యో బాధతే ధర్మః న స ధర్మః కుధర్మ తత్ ।
అవిరోధాత్ తు యో ధర్మః స ధర్మః సత్యవిక్రమ ॥ 11

నీకొరకు ఆహారం వేరే రూపంలో కల్పించటానికి వీలు అవుతుంది. అది ఈ పావురం కంటే ఎక్కువే. గోవు, ఆబోతు, పంది, లేడి, దున్న ఏదైనా కోరుకో. లేదా దానితో సమానం అయిన వేరొకటి కోరుకో.' వెంటనే డేగ పలికింది - 'నేను పందిని తినను. లేళ్ళను గాని అంతకంటె గొప్పవాటిని గాని తినను. దొరికిన ప్రాణికంటె వేరొకదానితో నాకు పని ఏమి? ఇది నాకు దేవతలచే ఇవ్వబడిన ఆహారం. దాన్ని నాకోసం విడచిపెట్టు. రాజా ! డేగ పావురాలను తినటం అనాదిగా వస్తున్న ఆచారం. ధర్మతత్త్వాన్ని తెలియక అరటిబోదె(సారహీన ధర్మం)ను ఆశ్రయించవద్దు.' రాజు చెప్పాడు - 'శిబి వంశీయుల సమృద్ధం అయిన రాజ్యాన్ని నీకు అర్పిస్తాను. ఏ వస్తువును కోరితే దాన్ని సమకూరుస్తాను. శరణు కోరి వచ్చిన ఈ పావురాన్ని మాత్రం విడువను. ఏ కోరిక తీరిస్తే దీన్ని విడుస్తావో ఆ కోరిక కోరుకో. తీరుస్తాను. పావురాన్ని మాత్రం ఇవ్వను.'

డేగ పలికింది - 'రాజా! నీవు దీనిపై ప్రేమతో ఉన్నట్లయితే దీని శరీరమాంసానికి సమానమయిన మాంసాన్ని నీ శరీరం నుండి కోసి ఇయ్యి. ఈ త్రాసులో పావురం మాంసంతో నీ శరీరమాంసం సమానం అయితే దాన్ని ఇస్తే చాలు. నాకు తృప్తి కలుగుతుంది.' రాజు పలికాడు - 'డేగా ! నీవు నా మాంసాన్ని కోరటమే నాపై అనుగ్రహాన్ని చూపినట్లు భావిస్తాను. ఇప్పుడే నా శరీరమాంసాన్ని కోసి, తూచి ఇస్తాను.' అని శిబిచక్రవర్తి తన మాంసాన్ని స్వయంగా కోసి పావురాన్ని తూచటం ప్రారంభించాడు. మాంసం వేసేకొద్దీ రెండవపళ్ళెంలోని పావురం బరువు పెరగసాగింది. మళ్ళీమళ్ళీ కోసి వేయసాగాడు రాజు. ఎంత మాంసం శరీరం నుంచి కోసివేసినా అది పావురంతో సమానం కాలేదు. వెంటనే రాజు స్వయంగా తనే లేచి వచ్చి త్రాసులో కూర్చున్నాడు. డేగ పలికింది - 'ధర్మస్వరూపా! నేను ఇంద్రుడను. ఇతడు అగ్ని. నీ ధర్మాచరణాన్ని తెలియగోరి యజ్ఞశాలకు వచ్చాం. నీ శరీరం నుంచి మాంసాన్ని కోసి సమర్పించటంవలన ప్రకాశించే నీ కీర్తి లోకాలన్నింటిని దాటి పెరుగుతోంది. భూలోకంలో మనుష్యులు చెప్పుకొన్నంతవరకు నీ పేరు, నీకీర్తి చిరస్థాయిగా ఉంటాయి.' ఆ విధంగా పలికి ఇంద్రుడు స్వర్గానికి చేరాక ఉశీనరరాజు శిబి కూడ భూమ్యాకాశాలను వ్యాపించి దేదీప్యమానశరీరంతో స్వర్గానికి చేరాడు. రాజా ! ఆ మహాత్ముని ఆశ్రమం ఇదే. ఈ పవిత్ర ఆశ్రమాన్ని నీవు, నేను కలిసి చూద్దాం. దీనివల్ల పాపం నశిస్తుంది. ఆ రాజు ఎల్లప్పుడు బ్రాహ్మణులకు, సనాతన దేవతలకు, మునులకు దర్శనం ఇస్తూ ఉంటాడు.

132. అష్టావక్రముని జన్మవృత్తాంతము, జనకుని సభకు ఆయన రాక.

లోమశుడు పలికాడు. – 'ఉద్దాలకుని కుమారుడు శ్వేతకేతువు. భూమిపై మంత్రశాస్త్రంలో అతనితో సమానుడు వేరొకడు లేడు. ఇదే అతని ఆశ్రమం. ఎల్లప్పుడు ఫలపుష్పసమృద్ధి కల చెట్లతో నిండి ఉంటుంది. ఈ ఆశ్రమంలోనే శ్వేతకేతువు మానుషదేహం పొందిన సరస్వతిని దర్శించాడు. "వాణీ స్వరూపవు అయిన నిన్ను దర్శించాను" అని ఆమెతోనే అతడు స్వయంగా అన్నాడు. పూర్వయుగంలో శ్రేష్ఠులు, మామ అల్లుళ్ళు అయిన ఋషులు ఇద్దరు ఉన్నారు. వారిలో అష్టావక్రుడు కహోడుని పుత్రుడు. శ్వేతకేతువు ఉద్దాలకుని పుత్రుడు. వీరిలో శ్వేతకేతువు మామ. అష్టావక్రుడు అల్లుడు. ఒకానొక సమయాన మామ, అల్లుడు కలిసి విదేహరాజు యజ్ఞమండపానికి వెళ్ళారు. వీరు ఇరువురు సాటిలేని విద్వాంసులు, శాస్త్రార్థచర్చలు అక్కడ జరిగితే, బందిని, వారు ఓడించారు. కొంతేయా ! విప్రశ్రేష్ఠుడు అష్టావక్రుడు వాదప్రతివాదాల్లో నిపుణుడు. బాల్యంలో అష్టావక్రుడు జనకుని యజ్ఞమండపానికి పోయి తన ప్రతిపక్షం అయిన బందిని ఓడించి నదిలో ముంచివేశాడు. అతడు ఉద్దాలకుని దౌహిత్రుడు. ఇది అతని పవిత్రాశ్రమం. నీవు సోదరసహితంగా ఈ ఆశ్రమంలో ప్రవేశించి కొంతసేపు ఉపాసించు.' ధర్మరాజు పలికాడు – "లోమశా ! అతని ప్రభావం ఎలాంటిది? వాదంలో తన శత్రువు అయిన బందిని ఓడించాడు కదా! ఏ కారణంగా అతడు అష్టావక్రుడు అయ్యాడో దాన్ని నాకు వివరంగా చెప్పు." లోమశుడు పలికాడు – "ఉద్దాలక మహర్షికి కహోడుడు అనే శిష్యుడు ఉన్నాడు. ఇంద్రియనిగ్రహం, నియమం కలిగి ఆచార్యుని సేవించాడు. గురువు ఆజ్ఞానుసారం చాలాకాలం విద్యాభ్యాసం చేశాడు. కహోడుడు వినయం కలిగి ఉద్దాలకుని సేవలో నిమగ్నం అయ్యాడు. గురువు శిష్యుని సేవాభావాన్ని గుర్తించి, సంపూర్ణ వేదశాస్త్ర జ్ఞానాన్ని ఇచ్చి, తన పుత్రిక సుజాతను భార్యగా చేశాడు. కొంతకాలానికి సుజాత గర్భవతి అయింది. ఆమె గర్భం తేజస్సుతో ప్రకాశిస్తోంది. ఒకనాడు గాఢంగా వేదాధ్యయనంలో మునిగిన తండ్రితో గర్భస్థ శిశువు అన్నాడు. 'మీరు రాత్రి అంతా శ్రమపడి వేదాధ్యయనం చేస్తున్నారు. కాని శుద్ధ మయిన ఉచ్చారణ అందులో లేదు.' శిష్యులమధ్యలో కుమారునిచే నిందింపబడిన కహోడుడు కోపంతో కడుపులోని బాలుని 'పొట్టలో ఉండి ఇలా నిందిస్తున్నావు కనుక నీవు శరీరంలో ఎనిమిది వంకరలు పొందుతావు' అని శపించాడు.

అతని శాపం ప్రకారం ఎనిమిది వంకరలతో కుమారుడు పుట్టాడు. అతడే అష్టావక్రుడు. శ్వేతకేతుడు అతని మామ. కాని విద్యలో అతనితో సమానుడు. సుజాత కడుపులోని గర్భం పెరగసాగింది. సుజాత గర్భబాధ భరించలేక బాధపడుతూ ఏకాంతంలో భర్తను

ధనాన్ని సంపాదించమని కోరింది. 'నా కడుపులోని శిశువుకు పదవనెల నడుస్తోంది. నేను ధనహీననై ఈ కష్టం ఎలా భరిస్తాను? మీ దగ్గర కొంచెం కూడ ధనం లేదు. ప్రసవకాలానికి తగిన ధనం ఉంటేనే ఈ ఆపద గట్టెక్కుతాం.' భార్య మాటలు విని కహోడుడు ధనం కోసం జనకమహారాజు వద్దకు వెళ్ళాడు. అపుడు శాస్త్రాలు తెలిసిన బంది ఆ బ్రహ్మర్షి కహోడుని ఓడించి నీటిలో ముంచివేశాడు. కహోడుడు బంది చేతిలో ఓడి, నీటిలో మునిగాడు అని ఉద్దాలకుడికి తెలిసింది. వెంటనే సుజాత వద్దకు పోయి 'అష్టావక్రునికి ఈ వృత్తాంతం చెప్పవద్దు' అన్నాడు. సుజాత పుత్రునికి చెప్పక ఈ విషయాన్ని దాచింది. పుట్టిన తరువాత కూడా అష్టావక్రునికి ఈ విషయం తెలియలేదు. ఉద్దాలకునే అతడు తండ్రిగా భావించాడు. శ్వేతకేతువును తన సోదరుడిగా తలచాడు.

తరువాత అష్టావక్రునికి పన్నెండు ఏళ్ళు వచ్చాయి. ఒకనాడు తండ్రి వంటి ఉద్దాలకుని ఒడిలో కూర్చున్న అష్టావక్రుని శ్వేతకేతువు క్రిందికి లాగివేసి 'ఇది నీ తండ్రి ఒడికాదు' అన్నాడు. శ్వేతకేతుని మాటలకు ఉద్దాలకుని మనస్సు గాయపడింది. అతనికి చాల దుఃఖం కలిగింది. తల్లి వద్దకు పోయి "నా తండ్రి ఎక్కడ ఉన్నాడు" అని అష్టావక్రుడు ప్రశ్నించాడు. దీనురాలై సుజాత జరిగిన వృత్తాంత మంతా కుమారునికి చెప్పింది. ఈ రహస్యాన్ని విని అతడు శ్వేతకేతువుతో 'మనం ఇద్దరం జనకుని యజ్ఞానికి పోదాం. ఆ యజ్ఞంలో చాల ఆశ్చర్యకరమయిన మాటలు వినవలసి ఉంది. మనం ఇద్దరం అక్కడ విద్వాంసుల(బ్రాహ్మణుల) శాస్త్రచర్చలు విందాం. మంచి మంచి విందులు తిందాం. అక్కడికి పోవటంవలన మన విచక్షణాశక్తి, తెలివి పెరుగుతాయి. సుమధుర స్వరంతో వేదమంత్రాల పవిత్రఘోషలు వినపడతాయి' అన్నాడు. అపుడు ఆ మామ అల్లుళ్ళు సంపదతో తులతూగే జనకుని యజ్ఞానికి వెళ్ళారు. అష్టావక్రుడు యజ్ఞమండపమార్గంలో రాజునే కలిశాడు. ఆ సమయాన ద్వారపాలకునిచే మార్గానికి దూరంగా నెట్టి వేయబడి ఇలా అన్నాడు.

133. అష్టావక్రుడు ద్వారపాలకునితో, జనకునితో మాట్లాడుట.

అష్టావక్రుడు పలికాడు. – "బ్రాహ్మణుడు మార్గంలో లేనప్పుడు అంధునికి, చెవిటివానికి, స్త్రీలకు, బరువుమోసేవానికి, రాజుకూ మార్గం ఇవ్వాలి. బ్రాహ్మణుడు ఆ మార్గంలోకి వస్తే ముందుగా అతనికే మార్గం కల్పించాలి."

రాజు : "నేను నీకోసం మార్గాన్ని ఇస్తున్నాను. ఏ దారి నీకిష్టమైతే దానిలో సంచరించు. అగ్ని చిన్నదైనా తేలికగా చూడరాదు. బ్రాహ్మణులకు ఇంద్రుడైనా నమస్కరిస్తాడు."

అష్టా : "మేము ఇద్దరం నీ యజ్ఞం చూడాలని వచ్చాం. మాకు కోరిక చాలాబలంగా ఉంది. మేము అతిథులుగా వచ్చాం. నీ యజ్ఞంలో ప్రవేశించడానికి ద్వారపాలకునికి అనుజ్ఞ ఇయ్యి అని కోరుతున్నాం. మేము ఇరువురం ఈయజ్ఞాన్ని దర్శించడానికి వచ్చాం. పైగా జనకునితో కలిసి మాట్లాడ గోరుతున్నాం. ఈ ద్వారపాలుడు మమ్ము అడ్డగిస్తున్నాడు. మేం కోపంతో మండిపోతున్నాం."

ద్వార : మేము బంది ఆజ్ఞను పాలించేవారం. మేం చెప్పే మాట మీరు వినండి. యజ్ఞశాలలో బ్రాహ్మణబాలకులు ప్రవేశింప వీలుకాదు. వృద్ధులు, బుద్ధిమంతులు ఆయిన బ్రాహ్మణులే ప్రవేశించాలి.'

అష్టా : 'ఈ యజ్ఞశాల వృద్ధుల కోసం తెరిస్తే అప్పుడు ఆయినా మమ్మల్ని ప్రవేశించ నివ్వాలి. మేము వృద్ధులం. తపస్సంపన్నులం, బ్రహ్మచర్య నియమంతో ఉన్నాం. వేదప్రభావం మాపై ఉంది. మేం పెద్దవారిని సేవిస్తాం. ఇంద్రియనిగ్రహం కల వాళ్లం, జ్ఞానశాస్త్రంలో ఆరితేరినవారం. వయస్సును బట్టి చిన్నవాడని బ్రాహ్మణులను అవమానింపరాదు. చిన్న అగ్నికణం కూడ తాకినప్పుడు కాలుతుంది.'

ద్వార : 'ఏకాక్షర బ్రహ్మను బోధించే అనేక రూపాలు గల సరస్వతీరూపమైన వాక్కు నీకు తెలిస్తే చెప్పు. నీవు నిన్ను బాలకునిగా తెలుసుకో. స్వయంగా ఎందుకు ప్రశంసించుకొంటున్నావు? విద్వాంసుడు ఈ లోకంలో దుర్లభుడు.'

అష్టా : 'శరీరం పెరిగితే జ్ఞానం పెరగదు. బూరుగు విత్తనం పెరిగేకొద్దీ సారంలేనిది అవుతుంది. చిన్న చెట్టైనా పండ్లు, కాయలు ఎక్కువగా ఉంటే అదే పెద్ద చెట్టు. ఫలాలు లేని చెట్లు పెరిగినా వ్యర్థమే.'

ద్వార : 'బాలకులు వృద్ధులనుంచే బుద్ధిని నేర్చుకొని కాలంతో వృద్ధులు అవుతారు. కొలదికాలంలో జ్ఞానం సంపాదించటం అసంభవం. నీవు బాలుడవై వృద్ధునివలె ఎందుకు మాట్లాడుతున్నావు?'

అష్టా : 'జుట్టు నెరిసినంత మాత్రాన వృద్ధుడు కాలేడు. బాలుడైనా జ్ఞాని అయితే దేవతలు అతనిని వృద్ధ డని కీర్తిస్తున్నారు. వయస్సుచే, ధనంచే, బంధువులు ఎక్కువగా ఉండటంచే వృద్ధుడుగా లెక్కింపబడడు. అనూచానంగా మహర్షులు ఏర్పరచిన ధర్మమార్గమే మాకు గొప్పది. రాజసభలో బందిని చూడగోరి వచ్చాను. ద్వారపాలకా ! కమలాల మాల నుభరించే జనకునికి నా రాకను తెలియజెయ్యి. నేడు నీవు విద్వాంసులతో శాస్త్రచర్చ చేసే మమ్ములను చూస్తావు. వాదం ముదిరి బందికూడా ఓడిపోవటం గమనిస్తావు. వేదవేదాంగనిపుణులైన బ్రాహ్మణులు, పురోహితులు జనకుడు, విద్వాంసులు నా శ్రేష్ఠత్వాన్నిగాని,

లఘుత్వాన్నిగాని నేడు గుర్తిస్తారు.

ద్వార : 'వినయవంతులై, నేర్పుగల వారికి మాత్రమే వీలైన సభలో పదేళ్ళవయస్సు గల నీవు ఎలా ప్రవేశిస్తావు. నేను ఏదో ఒక ఉపాయంతో నిన్ను లోపల ప్రవేశపెట్టటానికి ప్రయత్నిస్తాను. యజ్ఞశాల వెలుపల ఉన్న రాజు దగ్గరకు తీసుకొని వెళ్ళి నీ విద్వత్తును ప్రదర్శించు. యజ్ఞమండపంలో రాజు నీమాటలు వినగలిగే దూరంలో ఉన్నాడు. స్తోత్రాలతో అతనిని ప్రసన్నం చేసుకో. అతడు అనుగ్రహించి నీకు ప్రవేశం కల్పిస్తాడు. ఆ పై నీకోరికను కూడ తీరుస్తాడు.'

అష్టా : 'నీవు జనక వంశంలో శ్రేష్ఠుడివి. చక్రవర్తివి. నీయందే సంపద సమృద్ధిగా ఉంది. ఈనాటి కాలంలో యజ్ఞకర్మలను నీవే ఆచరిస్తున్నావు. పూర్వకాలంలో యయాతి మాత్రమే నీవంటివాడు. నీవద్ద బంది అనే ప్రసిద్ధ విద్వాంసుడు ఉన్నాడు. వాదవివాదాల్లో పడిన బ్రాహ్మణులను శాస్త్రచర్చలో ఏదో ఒకవిధంగా ఓడిస్తాడు. నీ మనుష్యులతోనే నిస్సందేహంగా నీటిలో మునిగేలా చేస్తాడు అని మేం విన్నాం. నేను బ్రాహ్మణులద్వారా ఈ సమాచారాన్ని తెలిసికొని అద్వైత బ్రహ్మపదార్థ చర్చకై వచ్చాను. ఆ బంది ఎక్కడ ఉన్నాడు? సూర్యుడు నక్షత్రాలను కాంతిహీనం చేసినట్లు నేను అతనిని ఓడిస్తాను.'

రాజు : 'నీవు వాదంలో తలపడే వాని శక్తి తెలియక కుతూహలపడుతున్నావు. ప్రతివాదుల శక్తి తెలిసినవాడే ఇలా మాట్లాడాలి. వేదవేదాంగాలు చదివిన చాలామంది బంది ప్రభావాన్ని గుర్తించారు. బంది వాదబలాన్ని తెలియక జయించాలి అని భావిస్తున్నావు. ఇంతకుపూర్వం బంది వద్దకు వచ్చినవారంతా సూర్యునిముందు తారలవలె ఓడిపోయి వెళ్ళారు. జ్ఞానోన్మత్తులైన బ్రాహ్మణులు ఎంతమందో బందిని జయించాలని వచ్చి, అతని శక్తిముందు నిలువలేక ఓడిపోయారు. ఓడినవారు మారుపలుకక సభనుంచి బయటకు వెళ్లి పోయారు. వారు సభాసదులతో ఏ ముఖంతో మాట్లాడుతారు?'

అష్టా : 'మా వంటి వారు బందికి ఎదురుపడలేదు. అందుకే భయం లేక సింహంలా ఉన్నాడు. నేడు నా చేతిలో ఓడి, మౌనంగా ఉండిపోతాడు. కదలని ఇరుసుతో విరిగిన బండి చక్రంలా మారిపోతాడు.'

రాజు : 'ఎవడు ముప్పది అవయవాలు, పన్నెండు అంశాలు, ఇరవై నాలుగు పర్వాలు, మూడు వందల అరవై అరల పదార్థాలు తెలుసుకుంటాడో వాడే జ్ఞాని.'

అష్టా : 'పన్నెండు అమావాస్యలు, పన్నెండు పూర్ణిమలు ఇరవై నాలుగు పర్వాలు, ఋతురూపాలు అయిన ఆరునాభులు, మాసాలు పన్నెండు అంశాలు, దినాలు మూడు వందల అరవై, ఇలా నిరంతరం తిరిగే కాల చక్రమే నిన్ను రక్షిస్తుంది.'

రాజు : 'రెండు గుర్రాలవలె కలిసి ఉండి డేగవలె హఠాత్తుగా ఆకాశంలోంచి దిగుతాయో ఆ రెండింటి గర్భాన్ని ఏ దేవతలు ధరిస్తారు. వారు దేన్ని పుట్టిస్తారు?'

అష్టా : 'ఆ రెండు నీ శత్రువుల ఇండ్లపై కూడ పడవు. వాయువు సారథిగా కల మేఘం ఈ రెంటి గర్భాన్ని ధరిస్తుంది. ఆ రెండు మళ్ళీ మేఘరూపమైన గర్భాన్ని పుట్టిస్తాయి.'

రాజు : 'నిద్రించే సమయంలో కండ్లు మూయనిది ఏది? పుట్టినా దేనికి నడిచే శక్తి ఉండదు?, దేనికి హృదయం ఉండదు?, ఏది వేగంగా పెరుగుతుందో తెలుపు?'

అష్టా : 'చేప నిద్రిస్తున్నా కళ్ళు తెరిచే ఉంచుతుంది. గుడ్డు జన్మించినా కదల లేదు. రాతికి హృదయం లేదు. నది వేగంతో పెరుగుతూ ఉంటుంది.'

రాజు : 'నీ శక్తి అమానుషం, దైవికం. నీవు బాలుడవు అయినా నా దృష్టిలో వృద్ధుడవే. వాద ప్రతివాదాల్లో నిన్ను మించినవాడు లేడు. నీకు యజ్ఞమండపంలో ప్రవేశం కల్పింపబడుతోంది. నీవు కలవాలి అనుకొన్న బంది ఇతడే.'

134. అష్టావక్రుడు బందిని ఓడించుట.

అష్టా : 'ఈ సభ సాటిలేని ప్రభావం గల రాజసమూహంతో నిండి ఉంది: వీరిలో బందిని నేను గుర్తించలేను. ఒకవేళ గుర్తిస్తే అగాధజలంలో హంసవలె అతన్ని తప్పక పట్టి వేయగలను. నీచే పరాజితులు అయిన పండితులు నీటమునిగే నియమం కల్పించబడింది. కాని నా ఎదుట నీవు ఈనాడు మాట్లాడలేవు. ప్రళయకాలాగ్ని సమీపంలో ఉన్న నది అగ్ని వేడికి ఇంకినట్లు నా ఎదుటపడిన నీ వాదశక్తి నశిస్తుంది. నా ఎదుట నిలకడగా కూర్చో.'

బంది : 'నిద్రిస్తున్న పెద్దపులిని నన్ను మేల్కొల్పకు, దవడలను నాకే సర్పంగా అనుకో. పాదాలతో త్రొక్కి శిరస్సున కాలుమోపిన వానిని సర్పం కరవక విడువదు తెలుసుకో. బలం లేకపోయినా గర్వంతో పర్వతాన్ని చేతితో కొట్టేవాడి చేయి, గోళ్ళు చీలి నాశన మవుతాయి. పర్వతానికి ఏమాత్రం గాయం ఏర్పడదు'

అష్టా : 'మైనాకుని కంటె పర్వతాలన్నీ ఎలా చిన్నవో, లేగదూడలు ఆబోతులకంటె ఎలా చిన్నవో అలా భూమండలంలోని రాజులందరు జనకున కంటె తక్కువ వారే. దేవతలలో మహేంద్రుడు, నదులలో గంగ శ్రేష్ఠమైన విధంగా రాజులలో జనకుడే గొప్పవాడు. కావున బందిని నా సమీపానికి రప్పించండి.'

బంది సభలోకి వస్తుండగనే కోపించిన అష్టావక్రుడు గర్జిస్తూ బందితో ఇలా

అన్నాడు. 'నేనడిగిన ప్రశ్నలకు నీవు సమాధానం చెప్పు. నీవు అడిగిన వాటికి నేను సమాధానం చెబుతాను.'

'ఒక్కడే అగ్ని అనేకరకాలుగా ప్రకాశిస్తున్నాడు. ఒకే సూర్యుడు లోకానికి అంతటికీ వెలుగును ప్రసాదిస్తున్నాడు. శత్రునాశం చేయగల ఇంద్రుడు ఒక్కడే వీరుడు. పితృదేవతల ప్రభువు యముడు ఒక్కడే.'

అష్టా : 'ఇంద్రాగ్నులు మిత్రులు, కలిసి సంచరిస్తారు. అలాగే దేవర్షులు పర్వతనారదులు. అశ్వినీదేవతలు, రథచక్రాలు, దంపతులు ఇద్దరుగా బ్రహ్మచే సృష్టింపబడ్డారు.'

బంది : 'ఈ ప్రజలు కర్మవశాన దేవ, నర, పశుపక్ష్యాదులుగా పుడుతున్నారు. ఋక్సామ యజుర్వేదాలు కలిసి యజ్ఞవిధిని సాగిస్తున్నాయి. అధ్వర్యులు ప్రాతఃసవనం, మధ్యాహ్నసవనం, సాయంసవనం అని మూడుయజ్ఞాలు చేస్తున్నారు. స్వర్గ, నరక, పాతాళాలు అని మూడులోకాలు, సూర్య అగ్ని చంద్రులనే మూడుజ్యోతులు ఉన్నాయి.'

అష్టా : 'బ్రాహ్మణులకు నాలుగు ఆశ్రమాలు. నాలుగు వర్ణాల వారు యజ్ఞభారం మోస్తున్నారు. ముఖ్యదిక్కులు నాలుగు. వర్ణాలు నాలుగు. అకార ఉకార మకార అర్ధమాత్రలు. వాక్కులు నాలుగుపాదాలతో కూడి ఉంటాయి.'

బంది : 'అగ్నులు అయిదు. పంక్తి ఛందస్సు ఐదు పాదాలు కలది. యజ్ఞాలు అయిదు. ఇంద్రియసంఖ్య అయిదు. వేదంలో పంచచోడలనే అప్సరసలు ఉన్నారు. పంచనద ప్రదేశం అన్నిటికంటె పవిత్రతమం.'

అష్టా : 'అగ్నిస్థాపనలో దక్షిణరూపంగా ఆరు గోవులనివ్వాలి. ఆరు ఋతువులతో కాలచక్రం పూర్తి అవుతుంది. జ్ఞానేంద్రియాలు ఆరు. కృత్తికా తారలు ఆరు. వేదాల్లో సాద్యస్కం అనే యజ్ఞం ఆరు రకాలుగా కనపడుతోంది.'

బంది : 'గ్రామ్యపశువులు ఏడు. ఆరణ్యక పశువులు ఏడు. ఛందస్సులు ఏడింటితో యజ్ఞం నిర్వహింపబడుతోంది. ఋషులు ఏడుగురు ప్రసిద్ధులు. పూజలో ఏడు ఉపచారాలు ఉన్నాయి. వీణతీగలు కూడ ఏడే.

అష్టా : 'త్రాసులో ఎనిమిది రాళ్ళు ఉంటాయి. సింహాన్ని చంపగల శరభమృగానికి ఎనిమిది కాళ్ళు. దేవతల్లో ఎనిమిదిమంది వసువులు ఉన్నారు. యజ్ఞాల్లో ఎనిమిది కోణాల్లో యూపస్తంభ నిర్మాణం జరుగుతుంది.'

బంది : 'పితృయజ్ఞంలో అగ్నిని ప్రజ్వలింపచేసే సామిధేనుల సంఖ్య తొమ్మిది. సృష్టి తొమ్మిది పదార్థాల సంయోగంతో జరుగుతుంది. బృహతీఛందానికి తొమ్మిది అక్షరాలు. ఒకటి నుంచి తొమ్మిది అంకెలే గణనకు మూలం.'

అష్టా : 'సంసారంలో పురుషునికి పది దిశలు నిర్దేశింపబడ్డాయి. పదివందలతో సహస్రం ఏర్పడుతుంది. తల్లి గర్భంలో శిశువుని పదిమాసాలు మోస్తుంది. నిందింపతగినవారు పదిమంది. శరీరావస్థలు పది. పూజనీయులు కూడ పదిమందే.'

బంది : 'పశ్వేకాదశి అనే యాగానికి పదకొండు పశువులు పదకొండు యూపాలు ఉంటాయి. ప్రాణులకు పదకొండు వికారాలు ఉంటాయి. స్వర్గంలో రుద్రులు పదకొండు మంది.'

అష్టా : 'ఒక సంవత్సరానికి పన్నెండు నెలలు. జగతీఛందానికి పాదానికి పన్నెండు అక్షరాలు ఉంటాయి. ద్వాదశాహం ప్రాకృత యజ్ఞంగా చెప్పబడింది. సూర్యులు పన్నెండుమంది అని జ్ఞానులు వర్ణిస్తున్నారు.'

బంది : 'త్రయోదశి తిథుల్లో గొప్పది. భూమిపై పదమూడు ద్వీపాలు ఉన్నాయి.'

లోమశుడు చెప్పాడు. 'ఇంతవరకు పలికి బంది ఆగిపోయాడు. మిగిలిన సగభాగాన్ని అష్టావక్రుడు చెప్పాడు.'

అష్టా : 'కేశి అనే రాక్షసుడు శ్రీ మహావిష్ణువుతో పదమూడు రోజులు యుద్ధం చేశాడు. అతిఛందస్సు అనే ఛందస్సులో పదమూడు అక్షరాలు లేక అంతకంటె ఎక్కువ అక్షరాలు ఉంటాయి అని వేదం చెప్తోంది.' ఇది విని సూతపుత్రుడైన బంది నిశ్శబ్దంగా ఉన్నాడు. తలవంచుకుని ఆలోచనలో పడ్డాడు. అష్టావక్రుడు చెబుతుండగానే శ్రోతలలో, దర్శకులలో గొప్ప కలకలం బయలుదేరింది. జనక చక్రవర్తి యజ్ఞం సుసంపన్నం కాగా నాలుగువైపుల కోలాహలం వ్యాపిస్తుంటే బ్రాహ్మణులు అంతా చేతులు జోడించి, అష్టావక్రుని, సమీపించిసాదరంగా నమస్కారాలు చేశారు. అష్టావక్రుడు అన్నాడు – 'బంది పూర్వం చాలమంది విద్వాంసులను శాస్త్రచర్చలో ఓడించి నీటిలో ముంచాడు. కావున ఇతనికీ ఇదే గతి పట్టాలి. ఇతనిని తీసుకువెళ్ళి నీటిలో బలవంతంగా ముంచండి.' బంది పలికాడు. 'నేను వరుణపుత్రుడను. నీవలె నా తండ్రి యజ్ఞం పన్నెండు సంవత్సరాలు జరుగుతోంది. దాన్ని చేయడానికి కొంతమంది శ్రేష్ఠబ్రాహ్మణులను ఎన్నుకొని నీటిలో ముంచి వరుణలోకం పంపాను. వారందరు వరుణుని యజ్ఞం చూడడానికి వెళ్ళారు. తిరిగి మళ్ళీ ఇక్కడికి వస్తారు. నేను పూజనీయుడు అయిన అష్టావక్రుని పూజిస్తాను. ఈయన వలన నేను నాతండ్రిని కలుస్తున్నాను.'

అష్టా : 'బంది చేతిలో ఓడిన విద్వాంసులైన బ్రాహ్మణులు సముద్రంలో ముంచబడ్డారు. అతని మేధాశక్తిని నేను నా బుద్ధితో ఎలా నివారించానో నా మాటలు విన్న ఈ సభలోని విద్వాంసులే తెలుసుకోగలరు. అగ్ని స్వభావం చేత దహనశీలి. ఆయన పరీక్షా సమయంలో

సత్పురుషుల ఇండ్లను(శరీరాల్ని) దహించడు. అలాగే సత్పురుషులు వినమ్రులైన బాలకుల మాటలనుంచి మేలును మాత్రం గ్రహిస్తారు. జనకా ! నీవు ఒకరకపు చెట్ల ఆకులో భోజనం చేసి, తేజస్సు తగ్గి, బందిమాటలు వింటున్నావు. లేదా అతని స్తోత్రాలు నిన్ను మత్తెక్కించాయి. అంకుశందెబ్బ తిని, కూడ మావటిని గుర్తించని ఏనుగువలె నామాటలు వినలేకపోతున్నావు.'

జనక : నేను దివ్యం, అలౌకికం అయిన మీ మాటను వింటున్నాను. నీవు నిజంగా దివ్య స్వరూపుడవు. నీవు శాస్త్రచర్చలో బంది ని ఓడించావు. నీ కోరిక నేడు తీరింది. బంది నీ చేతిలో ఓడిపోయాడు.

అష్టా : 'బంది జీవించి యుంటే నాకు ఏ ప్రయోజనమూ లేదు. ఇతని తండ్రి వరుణుడే అయితే తప్పక ఇతడు జలాశయంలో మునిగితీరాలి.'

బంది : 'నేను నిజంగా వరుణరాజ పుత్రుడను. నాకు నీటిలో మునిగితే భయం లేదు. ఈ అష్టావక్రుడు ఎప్పుడో నీటిలో మునిగిన తన తండ్రి కహోడుని ఇప్పుడే చూడగలడు.'

లోమశుడు పలికాడు. పిమ్మట గతంలో నీట మునిగిన బ్రాహ్మణులందరూ వరుణుని పూజల నందుకొని జనకుని సమీపంలో లేచి ప్రత్యక్షం అయ్యారు. కహోడుడు అన్నాడు. 'జనకా ! లోకంలో ప్రజలు సత్కర్మల ద్వారా పుత్రసంతానాన్ని ఇందుకే కోరుతారు. నే నే పనిని చేయలేకపోయానో దాన్ని నాకుమారుడు పూర్తిచేశాడు. జనకా! ఒక్కొక్కప్పుడు బలంలేనివానికి బలవంతుడు, మూర్ఖునికి పండితుడు, అజ్ఞానికి జ్ఞానవంతుడు అయిన పుత్రులు పుడతారు. నీకు శుభమగుగాక! యుద్ధంలో స్వయంగా యముడు తీక్ష్ణమైన గొడ్డలితో శత్రువుల శిరస్సులను నరికివేస్తాడు. జనక చక్రవర్తి యజ్ఞంలో గొప్పదైన ఔక్థ్యసామగానం జరుగుతోంది. యథావిధిగా సోమరసం త్రాగుతున్నారు. దేవగణం ప్రత్యక్షంగా దర్శనం ఇస్తూ తమ తమ పవిత్రభాగాలను స్వీకరించారు.' లోమశుడు పలికాడు - 'బందిచే ఓడి ముంచబడిన విప్రులు అందరు అధికతేజస్సుతో ప్రత్యక్షం అయ్యారు. రాజు ఆజ్ఞ గైకొని బంది స్వయంగా సముద్రంలో మునిగాడు. అష్టావక్రుడు తండ్రిని పూజించి, స్వయంగా బ్రాహ్మణుల పూజలు అందుకొని, బందిని జయించి, తన మామతో కలిసి, తన ఆశ్రమానికి తిరిగివచ్చాడు.

కహోడుడు, తల్లి సుజాత దగ్గర ఉండగా, అష్టావక్రునితో - 'నీవు శీఘ్రంగా సమంగానదిలో ప్రవేశించు.' అన్నాడు. తండ్రి ఆజ్ఞపై నదిలో మునిగిన అతని శరీరావయవాలు సక్రమంగా మారాయి. సమంగానది అష్టావక్రుని ప్రవేశంతో పుణ్యనదిగా మారింది. దీనిలో

స్నానం చేసి మానవుడు పాపాన్ని పోగొట్టుకొంటాడు. కావున నీవు కూడ ధర్మరాజా! భార్యాసోదరులతో దీనిలో మునిగి ఆచమనాదులు చెయ్యి. నీవు నమ్మకంతో భార్యాపుత్రాదులతో, బ్రాహ్మణులతో కలిసి ఇక్కడ ఒక్కరాత్రి మాత్రం ఉండి, నాతో కూడి, పవిత్రకర్మలు ఆచరిస్తూ, పుణ్యవనాలు తిరుగుతూ, యాత్రను కొనసాగించు.'

135. యవక్రీత చరిత్ర.

లోమశుడిలా అన్నాడు. 'రాజా ! ఈ ప్రకాశించే నది పేరు మధువిల. దీనినే సమంగ అంటారు. ఇదే కర్దమిలక్షేత్రం. ఇక్కడే భరతుడు పట్టాభిషిక్తుడు అయ్యాడు. శచీపతి అయిన ఇంద్రుడు వృత్రుని వధించిన కారణంగా రాజ్యలక్ష్మికి దూరమైనాడు. అతడు సమంగానదీస్నానం చేసి పాపవిముక్తు డయ్యాడు. మైనాకపర్వతమధ్యంలో **వినశన తీర్థం** ఉంది. అదితి ఇక్కడే పుత్రులను కోరి సాధ్యదేవతలకు బ్రహ్మోదనం అనే అన్నం సిద్ధం చేసింది. భరతశ్రేష్ఠులారా! పర్వతశ్రేష్ఠమైన హిమాలయాన్ని అధిరోహించి అపకీర్తిని వ్యాపింపచేసే పేరు కూడ పలుకరాని దారిద్ర్యదశను దూరం చేయండి. రాజా ! ఇది కనఖలా పర్వతశ్రేణి. ఇక్కడే మహానది గంగ మిక్కిలి ప్రకాశవంతంగా ఉంది. పూర్వకాలంలో సనత్కుమారమహర్షి ఇక్కడే స్నానం చేసి సిద్ధులను పొందాడు ధర్మరాజా! ఈ నదిలో స్నానమాడు - పాపాల నుండి విముక్తుడ వవుతావు. కౌంతేయా ! జలంతో నిండిన ఈపుణ్యసరోవరంలో, భృగుతుంగ పర్వతమొది ఉష్ణిగంగ అనే తీర్థంలో నీవు నీ మంత్రులతో స్నానం చెయ్యి. కౌంతేయా! ఇది స్థూలశిరుని అందమైన ఆశ్రమం. ఇక్కడ అభిమానాన్ని, కోపాన్ని విడచిపెట్టాలి. పాండవా ! ఇది రైభ్యుని రమణీయాశ్రమం. విద్వాంసుడు భరద్వాజుని పుత్రుడు అయిన యవక్రీతుడు ఇక్కడే నశించాడు.'

యుధిష్ఠిరుడు ప్రశ్నించాడు. "తపస్సుచే ప్రతాపవంతుడు అయిన భరద్వాజుడు ఎలా యోగంలో ప్రవేశించాడు? ఆ ముని కుమారుడు యవక్రీతుడు ఎందుకు నశించాడు? వీటిని అన్నింటిని నిజంగా వినగోరుతున్నాను. దేవతలతో సమానులయిన ఋషుల చరిత్ర వింటే నా మనస్సుకు చాలా ఆనందం కలుగుతుంది. భరద్వాజుడు, రైభ్యుడు. ఇద్దరూ ప్రాణస్నేహితులు. వారు నిరంతరం ఈ వనంలో చాలాప్రేమతో నివసించేవారు. రైభ్యునికి అర్వావసువు, పరావసువు అనే ఇద్దరు కుమారులు. భరద్వాజునికి యవక్రీతు డను ఒక్కడే కుమారుడు. రైభ్యుడు, అతని పుత్రులు కూడ విద్వాంసులే. భరద్వాజుడు కేవలం తపస్సంపన్నుడు. బాల్యంలోనే వీరిరువురి కీర్తి నలుదిక్కులా వ్యాపించింది. తాపసి అయిన తన తండ్రిని సత్కారం లేనివానిగా, పుత్రులతో కూడిన రైభ్యుని సత్కరింపబడేవానిగా

బ్రాహ్మణులు ఆదరించటాన్ని యవక్రీతుడు గమనించాడు. దానితో తేజోవంతుడైన యవక్రీతుడు దుఃఖాన్ని పొంది, దాని ద్వారా క్రోధాన్ని పొంది, వేదాల జ్ఞానానికై గొప్ప తపస్సు చేశాడు. యవక్రీతుడు ప్రజ్వలింపబడే అగ్నిలో తన శరీరాన్ని తపింపచేసి, ఇంద్రుని మనస్సులో సంతాపాన్ని కలిగించాడు. యుధిష్ఠిరా! ఇంద్రుడు యవక్రీతుని వద్దకు వచ్చి "నీవు ఎందుకు ఘోరతపస్సు చేస్తున్నావు" అని అడిగాడు.

యవక్రీతుడు అన్నాడు - "ద్విజాతులకు చదవకుండానే వేదాలజ్ఞానం కలగాలి అని నేను ఘోరతపస్సు ప్రారంభించాను. నేను స్వాధ్యాయం కోసం ఈ ప్రయత్నం చేస్తున్నాను. తపస్సు ద్వారా అన్ని విషయాల జ్ఞానాన్ని పొందాలి అనుకొంటున్నాను. గురుముఖంగా వేదాలజ్ఞానం చాలాకాలంగా శిష్యులకు సంప్రాప్తిస్తోంది. నా ప్రయత్నమంతా వేగంగా వేదజ్ఞానం ద్విజాతులకు కలగడం కోసమే." ఇంద్రుడు పలికాడు. 'బ్రహ్మర్షీ! నీవు వెళ్లే ఈ మార్గం సరి అయినది కాదు. స్వాధ్యాయాన్ని గురువునుంచి నేర్చుకొంటే నీకు ఏం నష్టం కలుగుతోంది? రా! గురువునుండే వేదం నేర్చుకో.' ఇలా పలికి ఇంద్రుడు అదృశ్యం అయ్యాడు. అత్యంతపరాక్రమంతో యవక్రీతుడు మళ్ళీ తపస్సు చేశాడు. అతడు ఘోరతపస్సుతో తపఃఫలాన్ని సాధిస్తూ దేవరాజైన ఇంద్రుని తపింపచేశాడు యవక్రీతుని తపస్సుని గమనించి, మళ్లీ ఇంద్రుడు అతనిని సమీపించి, వారిస్తూ ఇలా అన్నాడు. 'ప్రారంభించిన ఈ ప్రయత్నం ఫలించేది కాదు. నీ ఆలోచన సరి అయింది కాదు. నీకు, నీ, తండ్రికి వేదాలు భాసిస్తాయి. అపుడు యవక్రీతుడు ఇలా అన్నాడు. 'ఇంద్రా! నీవు నా కోరికను తీర్చనట్లయితే నేను మరల కఠోరతపస్సు ఆచరిస్తాను. ఆ సమయంలో అసాధ్యం అయిన నియమాలు పాటిస్తాను. నీవు నా పూర్తిమనోరథాన్ని తీర్చనట్లయితే నా శరీరంలోని ప్రతి అవయవాన్ని క్రమంగా తీసి అగ్నిలో హోమం చేస్తాను. ఈ విషయాన్ని నీవు బాగా గుర్తుంచుకో.'

ఆ మహాత్ముని నిశ్చయం తెలిసిన, ఇంద్రుడు అతనిని నివారించే ఉపాయాన్ని ఆలోచించాడు. వెంటనే ఇంద్రుడు బ్రాహ్మణరూపం ధరించాడు. అతడు తాపసి. వందల ఏళ్ళు కలవాడు. క్షయరోగంతో బాధపడే దుర్బలుడుగా మారాడు. గంగాతీరంలో యవక్రీతుడు ఎక్కడ స్నానాచమనాలు చేస్తాడో అక్కడ ఇసుకతో సేతువును నిర్మించాడు. బ్రాహ్మణశ్రేష్ఠుడైన యవక్రీతుడు తన మాటను విననందు వల్ల బ్రాహ్మణవేషధారి ఇంద్రుడు గంగానదిని ఇసుకతో నింపసాగాడు. ఇంద్రుడు ఒక్కొక్క పిడికిలితో ఇసుకను గంగలో వేస్తూ యవక్రీతునికి చూపించి గంగపై సేతునిర్మాణం ఆరంభించాడు. ప్రయత్నశీలి అయిన ఆ బ్రాహ్మణేంద్రుని చూసి యవక్రీతుడు నవ్వుకొని అతనితో ఇలా అన్నాడు. 'ఇదేమి? మీరు దేన్ని కోరి ఈ

ప్రయత్నం చేస్తున్నారు? మీరు ఎంత గొప్పగా యత్నించినా ఇది వ్యర్థమే.' ఇంద్రుడు పలికాడు. 'ఈ సేతునిర్మాణం గంగానదిపై చేస్తాను. గంగను దాటటానికి మంచి మార్గం సిద్ధమవుతుంది. దీన్ని దాటడానికి జనులు మాటిమాటికి ప్రయాసపడుతున్నారు.' యవక్రీతుడు పలికాడు. 'నీకు సేతునిర్మాణం సాధ్యం కాదు. ఇది గొప్ప ప్రవాహం గల నది. అశక్యం అయిన పని నుంచి బుద్ధిని మరల్చి సాధ్యం అయ్యే పని ప్రారంభించు.' అపుడు ఇంద్రుడు 'నీవు చదువకుండా వేదజ్ఞానం పొందాలని తపస్సు ప్రారంభించావు. అది అసాధ్యం. అలాగే నేను గంగానదికి సేతువు కట్టాలని ప్రారంభించాను.' అన్నాడు.

యవక్రీతుడు అన్నాడు – 'మీసేతుబంధనం నిరర్థకం అయినట్లే నా ఈ ప్రయత్నం కూడా నిష్ప్రయోజనం అని నీవు భావిస్తే సాధ్యమైన దాన్ని ఆచరించు. నాకు మంచి వరాలనిమ్ము. వాటిద్వారా నేను వృద్ధిని పొంది, ప్రతిష్ఠను గైకొంటాను.' అతనికై వరాలను ఇంద్రుడు అనుగ్రహించాడు. 'నీతండ్రితో సహా నీకు వేదజ్ఞానం యథేచ్ఛగా కలుగుతుంది. నీ కోరిక తీరుతుంది. నీవు తపస్సును వీడి ఆశ్రమానికి వెళ్ళు.' అన్నాడు. ఇలా వరాలు పొంది, కోరికలు తీర్చుకొని, తండ్రివద్దకు చేరి యవక్రీతుడిలా అన్నాడు. 'తండ్రీ! నీకు, నాకు వేదజ్ఞానం సంపూర్ణంగా కలుగుతుంది. మనం ఇతరులకంటె గొప్పవారం కాగలం. ఈ వరాలన్నీ నాకు సిద్ధించాయి.'

భరద్వాజుడు అన్నాడు. 'నాయనా ! ఈ విధంగా మనోరథాలను, వరాలను పొంది మానవుడు అహంకారియై, దీనుడై, చివరికి శీఘ్రంగా నశిస్తాడు. ఈ విషయంలో దేవతలు చెప్పిన కథను వివరిస్తాను. విను. పూర్వకాలంలో శక్తిమంతుడు అయిన బాలధి అనేపేరుగల తాపసి ఉండేవాడు. పుత్రులు లేని కారణంగా సంతాపం పొంది అతడు అసాధ్యం అయిన తపస్సు ఆచరించాడు. దేవతాసమానుడు అయిన పుత్రుడు కలగాలని తపస్సు చేశాడు. చివరికి ఒక కుమారుణ్ణి పొందాడు. అతనిపై దేవతలు దయ చూపారు. కాని దేవతలతో అతనిని సమానునిగా చేయలేదు. వరాలు ఇస్తూనే 'మరణధర్మం కల మానవుడు ఎన్నడూ దేవసమానుడు కాడు. ఏదో ఒకనిమిత్తంగా ఇతని ఆయువు తీరుతుంది' అన్నారు. బాలధి అన్నాడు – ఈ పర్వతాలు అక్షయాలు అయినట్లు నా కుమారుడు కూడా చిరంజీవి కావాలి. ఈ పర్వతాలే అతని ఆయువుకు నిమిత్తాలు. ఈ పర్వతాలు ఇక్కడ శాశ్వతంగా ఉన్నంతవరకు నా పుత్రునికి మరణం రాకూడదు.' అన్నాడు. పిమ్మట బాలధికి పుత్రుడు జన్మించాడు. అతని మేధ ఎక్కువగా ఉన్నందున మేధావి అని విఖ్యాతి కల్గింది. స్వభావంచేత అతడు క్రోధశీలి. తన ఆయుర్దాయం విషయంలో దేవతల వరదానం విని, గర్వంతో ఋషులను అవమానించసాగాడు. ఇంతేగాక ఋషులను,

మునులను పరాభవించాలనే అభిప్రాయంతో భూమిపై తిరగసాగాడు. ఒకనాడు మేధావి గొప్పశక్తిమంతుడు, విద్వాంసుడు అయిన ధనుష్షాక్షుని చేరాడు. అతనిని పరాభవించగా ఆ వీర్యవంతుడు మేధావిని "బూడిద కమ్ము" అని శపించాడు. కాని అతడు బూడిద కాలేదు. ధనుష్షాక్షుడు ధ్యానంలో మేధావిని రోగహీనునిగా, మృత్యుహీనునిగా తెలుసుకొన్నాడు. అతని ఆయుర్దాయాన్ని నశింపచేసే కారణం తెలిసి, దున్నపోతులతో పర్వతాలను చీల్చాడు. నిమిత్తం నాశనం కాగా ఆ శిశువు శీఘ్రంగా మరణించాడు. మృతపుత్రుని గైకొని ఆ తండ్రి మిక్కిలిగా రోదించాడు.

దీనమానవునివలె విలపిస్తున్న అతని దగ్గర చేరి మునులు ఒక గాథను వినిపించారు. అది విను. మరణధర్మం గల మానవుడు దైవవిధానాన్ని ఎదిరించలేడు. అందుకే ధనుష్షాక్షుడు పర్వతాలను దున్నలతో చీల్చి, అతనిని చంపాడు. తాపసబాలకుడు వరాలు పొందినా గర్వంతో నిండి ఉన్నందున శీఘ్రంగా నశించాడు. నీవు మాత్రం ఆ విధంగా ఉండరాదు. ఈ రైభ్యముని శక్తిశాలి. అతని ఇద్దరు కుమారులు అలాంటివారే. నీవు సోమరితనం వీడి రైభ్యుని వద్దకు పోకుండా జాగ్రత్తపడు. నిన్ను హెచ్చరించటానికి ఇదే కారణం. రైభ్యుడు తాపసి, కోపశీలుడు, కోపిస్తే నీకు తీవ్రమైన అపకారం చేయగలడు. అనగానే యవక్రీతుడు పలికాడు. 'నేను అలాగే చేస్తాను. మీరు మనస్సులో సంతాపాన్ని విడచిపెట్టండి. మీరు నాకు పూజింపతగినవారైనట్లే, రైభ్యుడు కూడ నాకు పితృసమానుడే.' అన్నాడు. లోమశుడు ఇలా అన్నాడు. 'తండ్రితో ఇలా తియ్యగా పలికి యవక్రీతుడు నిర్భయంగా వ్యవహరిస్తున్నాడు. ఇతర మునులకు బాధ కలిగించి సంతోషాన్ని అనుభవిస్తున్నాడు.'

136. యవక్రీతుడు రైభ్యుని కోడలితో వ్యభిచరించి రాక్షసునిచేతిలో చనిపోవుట.

లోమశుడు చెపుతున్నాడు – 'ఆ రోజుల్లో యవక్రీతుడు నిర్భయంగా భూమి నాలుగు దిక్కుల తిరుగసాగాడు. వైశాఖమాసంలో ఒకనాడు రైభ్యుని ఆశ్రమం చేరాడు. పుష్పించిన చెట్లతో అందంగా ఉన్న ఆశ్రమంలో ఆడుకిన్నెరలా మెరిసిపోతూ సంచరిస్తున్న రైభ్యుని కోడలిని చూశాడు. ఆమెను చూస్తూనే కామపరవశుడై, ఆలోచనాశక్తి నశించి, సిగ్గుపడే ఆమెతో సిగ్గు లేకుండా "నన్ను నీవు సంతోషపెట్టు" అని అడిగాడు. యవక్రీతుని శీలస్వభావాలు తెలిసిన ఆమె అతని శాపానికి భయపడింది. రైభ్యుని తేజాన్ని స్మరించి, అలాగే అని అంగీకరించి, అతని సమీపానికి చేరింది. ఏకాంతానికి తీసుకుపోయి రమించి, యవక్రీతుడు ఆమెను శోకసముద్రంలో ముంచేశాడు. ఇంతలో రైభ్యుడు తన ఆశ్రమానికి

వచ్చాడు. తనకోడలు పరావసుని భార్య దుఃఖిస్తోందని రైభ్యుడుదని గుర్తించి, మధురస్వరంతో అనునయిస్తూ ఏడవడానికి కారణమడిగాడు. పవిత్ర లక్షణాలు గల ఆమె పూర్తి ఉదంతాన్ని మామకు చెప్పింది. స్వయంగా, బాగా ఆలోచించి, తాను చేసిన ఆచరణ అంతా వివరించింది. యవక్రీతుని చేష్ట వింటూనే రైభ్యుని హృదయం భయంకర క్రోధంతో ప్రజ్వలించింది. అతని అంతఃకరణాన్ని బూడిద చేస్తున్నట్లు అయింది.

తాపసి అయిన రైభ్యుడు స్వభావంచేతనే కోపశీలి. ఆ సమయంలో క్రోధం అతన్ని పూర్తిగా ఆవేశించింది. తన జటను ఒకదానిని పెరికి, బాగా శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించిన అగ్నిలో హోమం చేశాడు. ఒక స్త్రీ రూపంలో కృత్య ఆవిర్భవించింది. ఆమె తన కోడలితో సమానం అయిన రూపసంపద కలిగి ఉంది. మళ్ళీ ఒకజటను పెరికి అగ్నిలో పడవేశాడు. అందులోంచి ఒక రాక్షసుడు ఆవిర్భవించాడు. అతని కన్నులు చాల భయంకరంగా ఉన్నాయి. ఆకారం భయంకరంగా ఉంది. వారిరువురు రైభ్యునితో 'మీ ఆజ్ఞ పాలిస్తాం' అని అన్నారు. క్రోధంతో నిండిన మహర్షి 'యవక్రీతుని చంపండి' అన్నాడు. వారు అలాగే అని యవక్రీతుని చంపే కోరికతో అతని వెంటపడ్డారు. రైభ్యుడు సృష్టించిన కృత్య అతని ముందు అందమైన స్త్రీగా ప్రత్యక్షమై, అతనిని మోహపరవశుని చేసి, అతని కమండలం అపహరించింది. కమండలం దూరమైన వెంటనే అతని శరీరం అపవిత్రం అయిపోయింది. ఆ దశలోఆ రాక్షసుడు చేతిలో త్రిశూలంతో యవక్రీతునివైపు పరుగుపెట్టాడు. శూలహస్తుడై రాక్షసుడు తరుముతుండగా 'నన్ను చంపడానికి వస్తున్నాడు' అని తలచి యవక్రీతుడు ఒకమార్గంలో పరుగెత్తాడు. ఆ మార్గం ఒక సరోవరం వైపుగా సాగింది. ఇతడు వెళ్ళడంతో సరోవరంలో నీరు ఇంకిపోసాగింది. సరోవరాన్ని అన్నివైపులా చూస్తూ పరుగెడుతుంటే వెళ్ళినచోటల్లా నీరు ఇంకిపోయింది.

చేతిలో శూలం తీసుకొని భయానకరాక్షసుడు పరుగెత్తి రాగా యవక్రీతుడు భయంతో తండ్రిఅగ్నిహోత్ర గృహంలో ప్రవేశించాడు. ఆ సమయంలో ఒక శూద్రజాతీయుడు అగ్నిహోత్రగృహాధికారిగా ఉన్నాడు. అతడు అంధుడు. అతడు గుమ్మంలోకి వస్తున్న యవక్రీతుని బలంగా పట్టుకొంటే అతడు అక్కడే ఆగిపోయాడు. శూద్రుడు పట్టుకొన్న యవక్రీతుని ఆ రాక్షసుడు శూలంతో గుండెల్లో పొడవగా ప్రాణాలు పోయి, అక్కడే నేలపై పడ్డాడు యవక్రీతుడు. యవక్రీతుని చంపి, రాక్షసుడు రైభ్యుని వద్దకు వచ్చాడు. రైభ్యుని అనుజ్ఞ పొంది, తన భార్యతో కలిసి, అతనిని సేవింపసాగాడు."

137. భరద్వాజుడు పుత్రశోకముతో విలపించి రైభ్యుని శపించి అగ్నిలో ప్రవేశించుట.

లోమశుడు పలికాడు - "భరద్వాజుడు ప్రతి దినం చేసే స్వాధ్యాయాన్ని పూర్తిచేసి, చాలాసమిధలు గైకొని, ఆశ్రమానికి తిరిగి వచ్చాడు. గతంలో అతనిని చూచి అగ్నులన్నీ లేచి స్వాగతం పలికేవి. అతని పుత్రుడు చంపబడ్డాడు. కావున అగ్నులు పూర్వం వలె లేచి నిలబడి స్వాగతం చెప్పలేదు. అగ్నిహోత్ర గృహంలో ఈ మార్పును గమనించి, మహాతపస్వి అయిన భరద్వాజుడు అక్కడ కూర్చున్న అంధగృహరక్షకుని ఇలా అడిగాడు. 'దాసుడా! నా అగ్నులు పూర్వంలాగ నన్ను స్వాగతించకపోవడానికి కారణం ఏమిటి? ఒకవైపు నీవు కూడ పూర్వం మాదిరిగా లేవు. ఈ ఆశ్రమంలో అందరూ కుశలంగా ఉన్నారా? మందబుద్ధిగల నాపుత్రుడు రైభ్యుని వద్దకు పోలేదు కదా? ఈ విషయాన్ని నాకు శీఘ్రంగా చెప్పు. నా మనస్సు శాంతించటం లేదు.' అంధుడు పలికాడు - 'నీకుమారుడు మందబుద్ధితో రైభ్యుని చేరి, బలవంతుడైన రాక్షసునిచే చంపబడి, భూమిపై పడి ఉన్నాడు. శూలహస్తుడైన రాక్షసుడు తరుముతుంటే ఈ అగ్నిశాలద్వారంలో నేను నివారించాను. నిశ్చయంగా అపవిత్రుడవటం వలన జలంకోసం ఇక్కడకు వచ్చాడు. శూలహస్తుడైన రాక్షసుడు వెంటనే చంపివేశాడు.' భరద్వాజుడు పుత్రమరణవార్తను శూద్రుని నుంచి విని, మరణించిన పుత్రుని గూర్చి ఎక్కువగా దుఃఖించాడు. భరద్వాజుడు పలికాడు - 'బ్రాహ్మణుల హితంకోరి నీవు తపస్సు చేశావు. బ్రాహ్మణులు అభ్యసించకపోయినా వేదజ్ఞానం కలగాలని నీ సంకల్పం. బ్రాహ్మణులపట్ల మంగళమైన ఆలోచన కలిగిన నీవు నిరపరాధులగు ప్రాణు లందరిని హింసించే కాఠిన్యాన్ని పొందావు. రైభ్యుని ఆశ్రమానికి పోవద్దని పదే పదే హెచ్చరించినా నీవు పెడచెవిన పెట్టి కాల, అంతక, యమ సదృశుడు అయిన అతనిని చూడటానికి పోయావు. తేజోవంతుడు, గొప్పవాడు అయినా ఆయన బుద్ధి నీచమైంది. నీవు నావంటి ముదుసలికి ఒక్కడవే పుత్రుడవు అని తెలిసినా అతడు కోపానికి లొంగిపోయాడు. రైభ్యుని కఠిన కర్మ వశాత్తు పుత్రశోకాన్ని పొందాను. ప్రాణాలు ఇష్టమైనవి అయినా నీవు లేనందున వాటిని తప్పక విడుస్తాను. పాపాత్ముడనైయిన నేను పుత్రశోకంతో వ్యాకులత చెంది నా శరీరాన్ని విడుస్తున్నాను. అలాగే రైభ్యుని జ్యేష్ఠపుత్రుడు నిరపరాధి అయిన తన తండ్రిని హత్య చెయ్యాలి. లోకంలో పుత్రసంతానం లేని వారే అదృష్టవంతులు. వారు పుత్రోశోకాన్ని అనుభవించక సుఖిస్తారు. పుత్రశోకంతో కలవరపాటు చెంది సఖులను, ప్రియులను శపించిన ఆర్తుల కంటె పాపాత్ముడు ఎవడు? నేను నా పుత్రుని మరణం చూచి భరించలేక మిత్రుని శపించాను. ఇలాంటి ఆపదను నాకంటె

వేరొకడు ఎవడు అనుభవిస్తాడు?' ఈవిధంగా దుఃఖించి, భరద్వాజుడు పుత్రునికి దహనసంస్కారాలు చేసి, మండుతున్న అగ్నిలో స్వయంగా ప్రవేశించాడు."

138. బ్రహ్మ హత్య మండి పరావసువు విముక్తుడగుట. రైభ్య భరద్వాజ యవక్రీతులు తిరిగి జీవించుట.

లోమశుడు పలికాడు - 'ఇదే రోజుల్లో పరాక్రమవంతుడైన బృహద్యుమ్నుడు అనే రాజు ఒక యజ్ఞాన్ని ప్రారంభించాడు. రైభ్యుడు అక్కడ యాజకుడు. బృహద్యుమ్నుడు యజ్ఞసమాప్తికై రైభ్యపుత్రులైన అర్వావసుపరావసులను సహాయకులుగా చేశాడు. తండ్రి ఆజ్ఞ గైకొని వారిరువురు రాజు చేసే యాగానికి వెళ్ళారు. ఆశ్రమంలో రైభ్యుడు, పరావసుని భార్య మాత్రమే ఆ సమయంలో ఉన్నారు. ఒకరోజున పరావసువు ఇంటిని చూడడానికి వచ్చాడు. ఆ సమయంలో నల్లలేడిచర్మంతో బంధింపబడిన తండ్రిని వనంలో చూశాడు. రాత్రి చివర ఘడియలో అంధకారం కొద్దిగా ఉంది. పరావసువు నిద్రచే అంధుడై మృగచర్మం కప్పుకుని, దట్టమైన అడవిలో తిరిగే తండ్రిని హింస్రజంతువు అని భావించాడు. మృగం అని భావించి తండ్రిని అతడు చంపాడు. అలా చేయటానికి ఇష్టపడకపోయినా, హింస్రపశువుల నుంచి తన శరీరరక్షణకై క్రూరకార్యాన్ని ఆచరించాడు. తండ్రికి ప్రేతకార్యాల నన్నింటిని పూర్తిచేసి తిరిగి యజ్ఞమండపానికి వచ్చి తన సోదరుడైన అర్వావసువుతో అన్నాడు. 'సోదరా! ఈ యజ్ఞకర్మను నీవు ఒక్కడివీ నిర్వహించలేవు. ఇటు నేను హింస్రపశువుగా ఎంచి తండ్రిని చంపాను. నీవు నా కొరకు బ్రహ్మహత్యను నివారించే వ్రతాన్ని ఆచరించు. నేను రాజు యజ్ఞాన్ని పూర్తిచేస్తాను. నేను ఈ పనిని ఒంటరిగానైనా చేయగలవాడిని.' అర్వావసువు పలికాడు. 'నీవు బుద్ధిమంతుడైన బృహద్యుమ్నుని యాగాన్ని పూర్తి చెయ్యి. నీకొరకు నేను ఇంద్రియనిగ్రహంతో బ్రహ్మహత్యకు ప్రాయశ్చిత్తం చేస్తాను.' లోమశుడు పలికాడు - "అర్వావసువు సోదరుని కోసం బ్రహ్మహత్యకు ప్రాయశ్చిత్తాన్ని పూర్తి చేసి, మళ్ళీ యజ్ఞంలో కలిశాడు. అటుపైన యజ్ఞంలో ప్రవేశించిన సంతోషంతో అర్వావసువును చూసి పరావసువు గద్గదస్వరంతో బృహద్యుమ్ననితో ఇలా అన్నాడు. 'ఇతడు బ్రహ్మహత్య చేశాడు. యజ్ఞాన్ని చూడడానికి ఇతనికి ప్రవేశంలేదు. బ్రహ్మహత్యచేసినవాడు చూపుతోనే ఇతరులను పీడిస్తాడు. సంశయం లేదు.' లోమశుడు చెప్పాడు - పరావసువు మాటలు వింటూనే బృహద్యుమ్నుడు అర్వావసుని లోపలికి రానివ్వవద్దని తన సేవకులను ఆజ్ఞాపించాడు. సేవకులచే నెట్టివేయబడిన అర్వావసువు మాటిమాటికి' నేను బ్రహ్మహత్య చెయ్యలేదు' అని చెప్పాడు. కాని రాజసేవకులు అతనిని బ్రహ్మహత్య చేసినాడని సంబోధించారు.

అర్వావసువు తాను చేసిన బ్రహ్మహత్య ఏమిటో తెలుసుకోలేకపోయాడు. 'ఈ బ్రహ్మ హత్య నా సోదరుడు చేశాడు. నేను వానిని ఆ పాపం నుండి విడిపించాను.' అర్వావసువు అలా అంటూ కోపంతో సేవకులు అనే మాటలు పడ్డాడు. మహాతపస్వి అయిన అతడు ఇక మాట్లాడకుండా వనానికి వెళ్లిపోయాడు. ఆ బ్రహ్మర్షి సూర్యుని ఉద్దేశించి ఉగ్రతపస్సు చేశాడు. రహస్యమయిన సూర్య అష్టాక్షరి జపించాడు. తరువాత సూర్యుడు స్వస్వరూపంతో ప్రత్యక్షమయ్యాడు. అర్వావసుని తపస్సుకు దేవతలంతా మెచ్చుకొన్నారు. పరావసుని నిరాకరించారు. అపుడు అగ్ని మొదలైన దేవతలు అతనికి వరమిచ్చారు. అపు డతడు దేవతలను "తన తండ్రి బ్రతకాలనీ, తన సోదరుడు నిర్దోషి కావాలనీ, తండ్రికి తన చావు గుర్తుండకూడదనీ కోరాడు. భరద్వాజుడు, యవక్రీతుడూ ఇద్దరూ బ్రతకాలనీ, సౌరమంత్రం ప్రతిష్ఠింపబడాలనీ" కోరాడు. అట్లే అని దేవతలంతా వరాలిచ్చారు. ధర్మజా! వెంటనే మునులంతా మళ్లీ బ్రతికారు. అపుడు అగ్ని మొదలైన దేవతలతో యవక్రీతుడు ఇలా అన్నాడు. 'నేను వేదమంతా చదివాను. తపస్విని, వేదవేత్తను అయిన నన్ను రైభ్యుడు ఇలా అనుచితంగా ఎలా చంపగలిగాడు?' దేవతలు పలికారు. 'యవక్రీతా! నీవు ఏమి అంటున్నావో దాన్ని అలాగే భావించకు. గురువు లేకపోయినా నీవు సుఖంగా సర్వవేదాలు పరించావు. ఈ రైభ్యుడు చాలా కష్టాలను సహించి, తన మంచి పనులతో గురువులను సంతోష పెట్టి, ఉత్తమ వేదజ్ఞానాన్ని పొందాడు.' అగ్న్యాది దేవతలు యవక్రీతునితో ఇలా పలికి, వారి నందరిని తిరిగి బ్రతికించి, స్వర్గానికి వెళ్ళిపోయారు. ఇది రైభ్యముని పవిత్ర ఆశ్రమం. ఎల్లప్పుడు ఫలపుష్పసమృద్ధి కలది. రాజశ్రేష్ఠ ! ఇక్కడ వసించి పాపాన్ని అంతటినీ పోగొట్టుకొంటావు.

139. పాండవుల ఉత్తరదిగ్యాత్ర.

"ఇప్పుడు నీవు ఉశీరబీజం, మైనాకం, శ్వేతం, కాలశైలం అనే పర్వతాలను దాటి ముందుకు వచ్చావు. ఇది గంగానది. ఏడుధారలతో ప్రకాశిస్తోంది. రజోగుణం లేని తీర్థం ఇది. ఇక్కడ ఎల్లప్పుడు అగ్ని ప్రకాశిస్తూ ఉంటాడు. ఈ అద్భుతతీర్థం మనుషులకు చూడ శక్యం కాదు. మీరందరు ఏకాగ్రచిత్తులు కండి. వ్యగ్రతలేకుండా మీరు ఈ తీర్థదర్శనం చేయండి. కొంతేయా ! ఇది దేవతల క్రీడాస్థలం, వారి పాదాలగుర్తులు కలిగి ఉంది. మీరు సావధానులైతే దాన్నీ దర్శిస్తారు. కాలశైలపర్వతాన్ని దాటి మీరు ముందుకు సాగండి. ఇది దాటి మనం కైలాసం, మందరాచలం ప్రవేశిస్తాం. ఇవి క్రమంగా, మాణివరుడు అనే యక్షుని, కుబేరుని నివాసాలు. తీవ్రగమనం కల ఎనభైవేల మంది

గంధర్వులు, వారి కంటె నాలుగు రెట్లున్న యక్షులు ఇక్కడ నివసిస్తారు. వారి ఆకారాలు, రూపాలు రకరకాలు. వారు వేరు వేరు ఆయుధాలు ధరిస్తూ యక్షరాజైన మాణిభద్రుని సేవలో లగ్నమై ఉంటారు. ఇక్కడ వారి సమృద్ధి అధికంగా ఉంది. తీవ్రగతిలో వారు వాయుసమానులు. వారే తలుచుకుంటే దేవేంద్రుని కూడ తన స్థానం నుంచి తొలగిస్తారు. ఆ యక్షరాక్షసులచే రక్షింపబడుతున్నాయి ఈ దుర్గమపర్వతాలు. కావున మీరు ఇంకా అధికంగా ఏకాగ్రచిత్తులై ఉండండి. కౌంతేయా ! కుబేరుని మంత్రులు, రౌద్రులు, మైత్రులు అనేపేరు గల రాక్షసులు మనకు ఎదురుపడతారు. నీవు పరాక్రమంతో సంసిద్ధంగా ఉండు. రాజా ! ఈ కైలాసపర్వతం ఆరు యోజనాలు ఎత్తు ఉంటుంది. ఇక్కడకు దేవతలు వస్తూ ఉంటారు. దీనికి దగ్గరలో విశాలాపురి (బదరికాశ్రమతీర్థం) కలదు. కౌంతేయా ! కుబేరుని భవనంలో యక్ష, రాక్షస, కిన్నర, నాగ, గరుడ, గంధర్వులు ఎంతో మంది నివసిస్తున్నారు.

నీవు భీమసేనుని బలంచే, నా తపస్సుచే రక్షింపబడతావు. ఇంద్రియనిగ్రహంతో ఉండి ఈ తీర్థాల్లో స్నానం చెయ్యి. వరుణరాజు, యముడు, గంగ – యమున, ఈ పర్వతమూ ప్రత్యేకంగా నిన్ను రక్షించుగాక. మరుద్గణాలు, అశ్వినీదేవతలు, నదులు, సరోవరాలు నీకు శుభం చెయ్యాలి. దేవతలు, రాక్షసులు, వసువులు కూడ నీకు మేలు చేయుదురుగాక! "గంగా ! ఇంద్రుని బంగారు పర్వతమైన మేరువునుండి నీధ్వని నాకు వినిపిస్తోంది. ఈ రాజా ధర్మజుడు ఆజమీఢ రాజవంశీయులలో గొప్పవాడు. నీవు పర్వతాలనుంచి ఇతనికి రక్షణ కలిగించు. ఈ పర్వత పంక్తుల్లో ప్రవేశించే ఇతనిని ఆదరించు." అని గంగా నదితో పలికి బ్రాహ్మణశ్రేష్ముడైన లోమశుడు ధర్మజునితో 'నీవు ఏకాగ్రచిత్తుడవు అయి ఉండు' అని ఆదేశించాడు. యుధిష్ఠిరుడు పలికాడు. "లోమశమహర్షి వ్యాకులపాటు ఇదివరకు చూడనిది. మీరు ద్రౌపదిని రక్షించండి. ప్రమాదంలో పడవద్దు. ఇది దుర్గమప్రదేశం. పరిశుద్ధ మయిన నియమాలు పాటించండి." ధర్మజుడు మహాబలశాలి అయిన భీమునితో ఇలా పలికాడు. 'నీవు సావధానుడవై ద్రౌపదిని రక్షించు. భీమా! అర్జునుడు దగ్గర లేని భయప్రద సమయాల్లో ద్రౌపది నిన్నే సేవిస్తుంది.' పిమ్మట మహాత్ముడైన యుధిష్ఠిరుడు నకులసహదేవుల వద్దకు పోయి, శిరస్సును చుంబించి, చేతితో శరీరం అంతా నిమిరాడు. నేత్రాల నుంచి కన్నీళ్ళు జలజలరాలుతుండగా 'మీరు భయపడవద్దు. సావధానులై ముందుకు సాగండి' అని వారితో అన్నాడు.

140. పాండవులు గంధమాదన హిమాలయాలకు బయలుదేరుట.

యుధిష్ఠిరుడు అన్నాడు. "భీమసేనా! ఇక్కడ విశాలకాయులు, బలవంతులు అయిన రాక్షసులు దాగి ఉన్నారు. అగ్నిహోత్ర, తపఃప్రభావాలతో మాత్రమే మనం ముందుకు సాగగలం. భీమా ! నీవు బలాన్ని ఆశ్రయించి ఆకలిదప్పికల్ని తొలగించుకో. శారీరకశక్తి, నేర్పునూ ఆశ్రయించు. కైలాసపర్వతాన్ని గూర్చి మహర్షి చెప్పినమాటలు నీవు కూడ విన్నావు కదా! నీ బుద్ధిని ఉపయోగించి చూడు. ద్రౌపది ఈ దుర్గమారణ్యంలో ఎలా నడువగలదు? సహదేవుడు, ధౌమ్యుడు, సారథి, వంటవాండ్రు, సేవకగణం. రథాలు, గుఱ్ఱాలు, కష్టాలు తట్టుకోలేని బ్రాహ్మణులు వీరందరితో వెనుకకు తిరుగు. నేను, నకులుడు, లోమశమహర్షి ముగ్గురం మాత్రం నియమపాలనం చేస్తూ ఇక్కడ నుంచి ముందుకు సాగుతాం. స్వల్పాహారాన్ని గ్రహిస్తూ ప్రాణాలు నిలబెట్టుకొంటాం. నీవు హరిద్వారంలో ఏకాగ్రచిత్తుడవై నారాకకోసం ఎదురుచూడు. నేను వచ్చే వరకు ద్రౌపదిని రక్షిస్తూ అక్కడే ఉండు.' భీముడు పలికాడు – 'ద్రౌపది శ్రమతో అలసి, మానసిక దుఃఖంతో ఉన్నది. ఈ మంగళమూర్తి అర్జునుని చూడాలనే కోరికతో, ఉత్సాహంగా మనతో ముందుకు సాగుతోంది. సంగ్రామంలో ఎన్నడూ వెనుకంజవేయని అర్జునుని చూడక పోవడం చేత మీ మనస్సు కూడా మిక్కిలి దుఃఖం కలిగి ఉంది. సహదేవునికి, నాకు, ద్రౌపదికి వేరే చెప్పాల్సింది ఏముంది? బ్రాహ్మణు లందరు పరిచారకులతో ఇక్కడి నుంచే వెనుకకు తిరగవచ్చు. వంటవారు, సారథులతో సహా ఎవరు వెనుకకు తిరిగి వెళ్ళాలో వారందరు వెడతారు. రాక్షసులతో నిండిన ఈ పర్వతమీద నిన్ను ఒక్కడిని వీడి నేను వెనుకకు పోను. ద్రౌపది కూడ నిన్ను విడచి వెనుకకు వెళ్ళాలని అనుకోవడం లేదు. సహదేవుడు కూడ నీ పై అనురాగంతో నిన్నే అనుసరిస్తాడు. ఇతని మనస్సును నేను బాగా తెలిసినవాడను. మేమందరం అర్జునుని చూడాలనే కోరికతో ఉన్నాం. తపిస్తున్నాం. మనమందరం కలిసే వెడదాం. అనేక గుహలతో నిండిన ఈ పర్వతం రథగమనానికి అనుకూలం కాకపోతే కాలినడకనే వెడదాం. మీరు విచారింపవలదు. ద్రౌపది నడవలేకపోతే నేను ద్రౌపదిని ఎత్తుకొని తీసుకువస్తాను. ఇది నా ఆలోచన. మీరు విరక్తిపొందవద్దు. మాద్రీనందనులైన నకులసహదేవు లిద్దరికీ దుర్గమప్రదేశాల యందు సాయంచేసి తీసుకువస్తాను."

ధర్మరాజు అన్నాడు – "నీ ఉత్సాహం చూస్తే నీవు నకులసహదేవులను, పాంచాలిని మోసేభారం పెరిగినవాడిగా కనిపిస్తున్నావు. ఈ సాహసం నీలోనే ఉంది. వేరొకరిలో లేదు. నీబలం, కీర్తి, ధర్మం, యశస్సు పెరుగుగాక! ద్రౌపదితో సహా నకులసహదేవులను స్వయంగా తీసుకొనిపోగల శక్తి నీకు ఉంది. దానివల్ల నీకు శ్రమకలగకుండుగాక. నిన్నెవరూ ఎదిరించకుందురు గాక." అప్పుడు ద్రౌపది నవ్వుతూ అంది. 'నేను మీతో కలిసే

వస్తాను. నాగురించి మీరు దుఃఖింపవలదు.' లోమశుడు పలికాడు 'గంధమాదన పర్వతానికి తపస్సుచే వెళ్ళగలరు. మనం తపశ్శక్తి సంపాదించాలి. నకులుడు, సహదేవుడు, భీమసేనుడు, నేను, నీవు తపోబలంతో అర్జునుని చూడగలం.' ఈ విధంగా మాట్లాడుకొంటూ వారు ముందుకుసాగారు. కొంతదూరం పోయేసరికి కుళిందదేశాధిపతి సుబాహువు యొక్క విశాల రాజ్యం కనిపించింది. అది ఏనుగులు, గుఱ్ఱాలు అధికంగా కలిగి, వందలకొద్దీ పులింద, కిరాత, తంగణాది, అడవిజాతుల వారితో నిండి ఉంది. దేవతలు సేవించే హిమాలయం అక్కడకు దగ్గరలోనే ఉంది. ఆశ్చర్యాన్ని కలిగించే అనేకవస్తువులు అక్కడ కనిపించాయి. కుళిందరాజు సుబాహువు తన రాజ్యానికి పాండవులు వచ్చారని తెలిసి సరిహద్దుల్లో సత్కరించి, ఆదరించి, తన వారిగా చేసుకొన్నాడు. మరునాడు ఉదయం హిమాలయానికి బయలుదేరారు. ఇంద్రసేనాదిసేవకులను, సూపాధ్యక్షులను, వంటవారినీ, ద్రౌపది యొక్క వస్తు సామగ్రినీ, సుబాహువుకు అప్పగించి ద్రౌపదితో కలిసి పాండవులు కాలినడకన ముందుకు సాగారు. వారి మనస్సులో అర్జునుని చూడాలనే తీవ్రమైన కోరిక ఉంది. హర్షంతో, ఉల్లాసంతో ఆ ప్రదేశం నుంచి ముందుకు కదిలారు.

141. ధర్మరాజు గంధమాదనమువకు పోవుటకు నిశ్చయించుట.

ధర్మరాజు ఇలా అన్నాడు. "ద్రౌపదీ భీమసేన నకులసహదేవులారా! మీరు సావధానంగా వినండి. పూర్వం చేసిన పనుల ఫలం అనుభవింపక తప్పదు. మనం రాజవంశీయులం. అయినా వనసంచారం చేస్తూ ఉన్నాం. మనం దుర్బలులమయి కష్టాలు అనుభవిస్తున్నాం. అయినా ఒకరితో ఒకరు ఉత్సాహంగా మాట్లాడుకొంటున్నాం. తెలియని మార్గంలో కూడ చురుకుగా ముందుకు సాగుతున్నాం. మన అందరి హృదయాల్లో అర్జునుని చూడాలనే ఒకే ఒక కోరిక బలంగా ఉంది. ఇంత కష్టపడినా ధనంజయుని సమీపంనుంచైనా చూడలేకపోతున్నాను. దూదిరాశిని అగ్ని మండించినట్లు ఈ ఆలోచన నా శరీరావయవాలను దహిస్తోంది. అతనిని చూడాలనే బలమైన కోరికతో మీ అందరితో కలిసి ఈ వనానికి వచ్చాను. దుశ్శాసనుడు ద్రౌపది జుట్టును పట్టుకుని లాగాడు. అనే విషయం గుర్తుకు వచ్చినప్పుడు నా మనస్సు శోకంతో నిండిపోతోంది. భయంకరమైన విల్లు ధరించి, జయింప శక్యంకాని, బలసంపన్నుడు అయిన అర్జునుని చూడని కారణంగా చాలాదుఃఖం కలుగుతోంది. అర్జునుని చూడాలనే తీవ్రమైన కాంక్షతో, నేను మీతో కలిసి, అనేకతీర్థాలలో, సుందరారణ్యాల్లో, సరోవరతీరాల్లో సంచరిస్తున్నాను. ఇప్పటికి అర్జునుని చూచి అయిదు సంవత్సరాలు గడిచింది. వీరుడు, సత్యసంధుడు అయిన అర్జునుని చూడకపోవడంతో దుఃఖంతో పరితపిస్తున్నాను. చామనచాయ రంగు కలిగి,

సింహ పరాక్రమం, పొడవైన బాహువులూ కల అర్జునుని చూడనంతవరకు నాకు బాధ కలుగుతూ ఉంటుంది. అస్త్రవిద్యాప్రవీణుడు, యుద్ధకుశలుడు, సాటిలేని ధనుర్ధరుడు అయిన అర్జునుని చూడక పోవడంతో నాకు తీవ్రదుఃఖం కలుగుతోంది. యుద్ధసమయాన శత్రుమూకలలో కోపించిన యమునివలె సంచరించే వాని మూపురం సింహంవలె ఉన్నతమై ఉంటుంది. మదగజంవలె ప్రకాశించే ఆ అర్జునుని ఇంతవరకు కలియలేదు. నాకు దుఃఖం కలుగుతోంది. పరాక్రమంలో, సంపదలో ఇంద్రునితో సమానుడై నకుల సహదేవులకంటె పెద్దయై, ఉగ్రధనుర్ధరుడై, అజేయుడై, వీరశ్రేష్ఠుడై, తిరుగులేని అర్జునుని దర్శనం కలుగక మిక్కిలి తపిస్తున్నాను. చిన్నవారిచే ఆక్షేపింపబడినా, ఓర్పుకల సరళమార్గంలో నడుస్తూ, శరణాగతులకు అభయమిచ్చే అర్జునుడు, వక్రగమనంతో మాయతో దెబ్బతీస్తే ఇంద్రునికి కూడ యముడు అవుతాడు. విషం వలె భయంకరమైనవాడు. శత్రువు పట్ల కూడా ప్రసన్నుడు, దయాళువు, ప్రతాపవంతుడు, అభయప్రదాత అయిన బీభత్సుడు మనందరికి రక్షణ. యుద్ధంలో శత్రువులను బాధించగల దిట్ట. అతడు మనకు సర్వ రత్నాలు తెచ్చియిచ్చి, సుఖాన్ని కలిగించాడు. అర్జునుని పరాక్రమం వల్ల జాతిరత్నాల రాసులు మన కోశాగారాన్ని చేరాయి. వాటిని అన్నింటిని ఇప్పుడు సుయోధనుడు స్వాధీనం చేసుకొన్నాడు. అర్జునుని బాహుబలం వల్ల నా రత్నసంభరితమయిన సభ ముల్లోకాల్లో ప్రసిద్ధిని పొందింది. పరాక్రమంలో శ్రీకృష్ణునితోను, యుద్ధంలో కార్తవీర్యార్జునునితోను సమానమయి, జయింపవీలుకాని అర్జునుని చాలారోజులనుండి చూడలేకపోయాను. భీమా! అర్జునుడు తన పరాక్రమంతో బలరామునితోనూ, అజేయుడైన శ్రీకృష్ణునితోను పోటీపడుతున్నాడు. అర్జునుడు బాహుబలంలో, ప్రభావంలో ఇంద్రసముడు. వేగంలో వాయుసమానుడు. ముఖంలో చంద్రసముడు, కోపంలో మృత్యుసమానుడు. అలాంటి నరశ్రేష్ఠుడైన అర్జునుని చూడాలని మనమంతా గంధమాదనపర్వతం చేరుకొన్నాం. విశాలమయిన బదరీవనం ఉన్న నరనారాయణాశ్రమం ఇదే. ఉత్తమమయిన ఈ పర్వతం మీదనే యక్షులు సదా నివసిస్తారు. ఇంతేగాక రాక్షసు లనేకులు గల కుబేరుని నది ఇక్కడే ఉంది. అక్కడికి తపస్సు చేస్తూ కాలినడకనే వెడదాం. ప్రయాణసాధనాలతో ఆ ప్రదేశానికి వెళ్లటం కష్టం. లోభి, క్రూరుడు, ప్రశాంతతలేనివాడు ఆ ప్రదేశాన్ని చేరలేడు. అర్జునుని వెదకుతూ మనం శస్త్రాస్త్రాలు దాల్చి, వ్రతనియమం పాటించే బ్రాహ్మణులతో కలిసి ఆ ప్రదేశానికి వెడదాం. ఇంద్రియసంయమం లేనివారు, ఆ పర్వతానికి చేరితే ఈగలు, దోమలు, సింహ, వ్యాఘ్ర, సర్పాలబారిన పడతారు. ఇంద్రియనిగ్రహం ఉంటే అవి కనపడనే కనపడవు. కావున మనం అర్జునుని చూడగోరి ఇంద్రియనిగ్రహం పాటించి, మితాహారంతో

గంధమాదనపర్వతాన్ని చేరుదాం."

142. లోమశుడు వరాహావతారమును వర్ణించుట.

లోమశుడు ఇలా అన్నాడు. "నీవు అన్ని పర్వతాలను జాగ్రత్తగా చూశావు. నగరాలు, వనాలతో కూడిన నదులను చూశావు. ప్రభావం కల తీర్థదర్శనం, జలపానం స్వయంగా నీ చేతులతో చేశావు. ఈ మార్గం పవిత్రమయిన మందరాద్రివైపు పోతుంది. మీరందరు ఉద్విగ్నతకు లోనుకాక ఏకాగ్రచిత్తంతో ఉండండి. ఇది దేవతల నివాసం. దీనిపైకి మీరు చేరాలి. పుణ్యకర్మలు ఆచరించే దివ్యర్షుల నివాసం. రాజా ! ఇది మంగళప్రదం అయిన నీటితో ప్రవహించే మహానది అలకనంద (గంగ). దేవర్షిలోకం దీనిలో సదా స్నానం చేస్తుంది. బదరికాశ్రమం నుంచి ఉద్భవించింది. ఆకాశసంచారులు, అంగుష్ఠమాత్రపరిమాణం గల వాలఖిల్యులు దీన్ని సేవిస్తారు. గంధర్వులు నిత్యం దీన్ని కొలుస్తారు. ఇక్కడ సామగానం చేసేవారి పుణ్యధ్వనులు వ్యాపించి ఉంటాయి. సామవేదంలోని ఋక్కులు గానం చేస్తారు. మరీచి, పులహుడు, భృగువు, ఆంగిరసుడు ఇక్కడ జపతపోవేదాధ్యయనాలు చేస్తారు. దేవతలరాజైన ఇంద్రుడు మరుద్గణాలతో ఇక్కడే ప్రతిరోజు జపాదులు చేస్తాడు. సాధ్యులు, అశ్వినీదేవతలు ఆ సమయంలో అతనిని అనుసరిస్తారు. చంద్రుడు, సూర్యునితో, నక్షత్రాలతో, గ్రహాలతో పగలు, రాత్రి ఈ నదీయాత్ర చేస్తున్నాడు. హరిద్వారంలో ఈ నదీజలాన్ని ప్రత్యక్షంగా శంకరుడే శిరస్సుపై ధరించాడు. దీనిచే లోకానికి రక్షణ ఏర్పడింది. మీరందరు ఇంద్రియనిగ్రహంతో ఉండి, ఐశ్వర్యాన్ని ఇచ్చే అలకనంద ఒడ్డుపై నిలబడి సాదరంగా నమస్కరించండి.' మహాత్ముడైన లోమశుని మాటలు విని పాండవులు ఏకాగ్ర చిత్తంతో ఆకాశగంగకు నమస్కారం చేశారు. గంగకు నమస్కరించి ధర్మాచరణమందు ఆసక్తిగల పాండవులు ఋషిగణాలతో కలిసి ఆనందంతో ముందుకుసాగారు. దూరం నుంచే ప్రకాశించే శక్తిగల తెల్లని మేరుపర్వతంతో సమానమయిన పర్వతాన్ని వారు చూశారు. అది అన్నిదిక్కులకు వ్యాపించి ఉంది. 'పాండవులు దీని గురించి ప్రశ్నిస్తారు' అని ముందే తెలిసిన లోమశుడు ప్రవచనకళలో ఆరితేరిన వాడు కావడం వల్ల వారితో ఇలా పలికాడు.

"అన్నివైపులకు ప్రసరించి, సుందరంగా కైలాసపర్వతశిఖరంవలె ప్రకాశించే ప్రదేశాన్ని నీవు చూస్తున్నావు. ఇవి రాక్షసరాజైన నరకుని ఎముకలు. పర్వతంపై రాతిశిలలపై ఉండడంవల్ల పర్వతసమానంగా అనిపిస్తున్నాయి. దేవేంద్రుని హితంకోరి శ్రీమహావిష్ణువు పూర్వకాలంలో ఈ రాక్షసుని ఇక్కడ వధించాడు. ఆ నరకాసురుడు పదివేల సంవత్సరాలు తపస్సుచేసి వేదాధ్యయనాలతో, పరాక్రమంతో ఇంద్రునిస్థానాన్ని అభిలషించాడు. దితికుమారుడు అయిన అతడు తపశ్శక్తితో బాహుబలంతో అజేయుడై, నిత్యం దేవతలను పీడించసాగాడు

'నరకాసురుడు బలవంతుడు, పైగా ధర్మంగా నియమాలను పాలిస్తున్నాడు' అనే భయంతో ఇంద్రుడు వ్యాకులపడసాగాడు. అతడు మనస్సులోనే వినాశంలేని విష్ణువును ధ్యానించాడు. ఆది పూర్తికాగానే సర్వాంతర్యామి అయిన శ్రీపతి అక్కడ ప్రత్యక్షం అయ్యాడు. ఆ సమయంలో ఋషులు, దేవతలు అతనిని స్తోత్రం చేశారు. అతనిని చూస్తుండగానే అంతవరకు ప్రకాశించిన అగ్నితేజం నశించింది. వరాలిచ్చే శ్రీ మహావిష్ణువును చూచి ఇంద్రుడు అంజలి ఘటించి, నమస్కరించి, మాటిమాటికి శిరస్సు వంచి, కనిపించాడు. పిమ్మట వృత్తాంతమంతా ఆయనకు నివేదించి, ఎవని వల్ల భయం ఏర్పడిందో వివరించాడు. "నీకు రాక్షసరాజైన నరకుని వలన కలిగిన భయాన్ని తెలుసుకొన్నాను. అతడు తన తపఃప్రభావంచే ఇంద్రపదవిని పొందాలి అనుకొంటున్నాడు. తపస్సువల్ల అతనికి ఆ ప్రభావం ఏర్పడింది. కాని నేను నీ పట్ల ప్రేమకలవాణ్ణి. ఆ రాక్షసుని నేను చంపి తీరతాను, కొంతకాలం ఓపికపట్టు." అని పలికి తేజోవంతుడైన విష్ణువు ఆ రాక్షసుని తాకి, ప్రాణాల్ని హరించాడు. అతడు వజ్రపు దెబ్బతిన్న పర్వతం వలె నేలపై పడ్డాడు. కావున మాయద్వారా చంపిన నరకాసురుని ఎముకలే ఇవి. రెండవదైన విష్ణువు చేష్టను వివరిస్తాను. ఇది లోకంలో వ్యాపించి ఉన్నదే.

ఒకానొక సమయంలో భూమి ఒక సముద్రం జలంలో మునిగి, పాతాళానికి చేరింది. ఆ సమయంలో శ్రీమహావిష్ణువు ఒకదంతంగల అడవిపంది రూపం దాల్చి భూమినిపైకి తీశాడు. ధర్మరాజు అడిగాడు – "మహర్షీ! విస్తరంగా నా కీ కథను తెలియజెయ్యి. పాతాళంలోకి వందలకొద్దీ యోజనాల వరకు భూమి ఎందుకు మునిగింది? భూభారాన్ని వహించగల ఈ ధరణి ఏ విధంగా విష్ణువుచే ఉద్ధరింపబడిందో, దానికి అతడు ఏ ఉపాయం ఆలోచించాడో చెప్పు. సస్యా లన్నింటినీ పుట్టించే ఈ పవిత్ర భూమి ఎవని కారణంగా వందలయోజనాలు సముద్రంలో మునిగింది? అప్పటి పరమాత్మ దర్శనం ఎవరివలన లోకానికి కలిగింది? ఉన్నది ఉన్నట్టుగా నాకు వివరించు. ఆ వృత్తాంతాన్ని పూర్తిగా వినగోరుతున్నాను." లోమశుడు పలికాడు – "నీవు ప్రశ్నించిన దాన్ని పూర్తిగా నీకు వివరిస్తాను. విను. ఈ కల్పంలోని సత్యయుగంలో జరిగిన విషయం ఇది. ఒకప్పుడు లోకంలో భయంకరపరిస్థితి ఏర్పడింది. ఆ సమయంలో ఆదిదేవుడు యముని పనిని కూడ ఆచరిస్తున్నాడు. యముని పని ఆచరించే అతని ప్రభావంచే ప్రాణులకు మృత్యువు కలగటం లేదు. పుట్టుక మాత్రం యథావిధిగా సాగుతోంది. పక్షిసంఘాలు పెరిగిపోయాయి. ఆవులు, ఎద్దులు, గేదెలు, మేకలు, గుఱ్ఱాలు, మాంసాహారులైన జంతువులు అలాగే వృద్ధి చెందాయి. అలాగే మనుష్యులు వేలకువేలుగా, పదివేలకు పదివేలుగా వర్షాకాలంలో నీరు పెరిగినట్లు పెరిగిపోసాగారు. ఇలాంటి సమయంలో భయంకరపరిస్థితి ఏర్పడి,

భూమి అతిభారం వలన వందయోజనాల సముద్రంలో మునిగిపోయింది. భూమి శరీరావయవాలన్నీ పీడను అనుభవిస్తున్నాయి. భారంతో కదలలేక వెంటనే భూమి నారాయణుని శరణు కోరింది.

భూమి పలికింది . 'మీరు నాపై దయచూపండి. చిరకాలం నేను ఉండేలాగ చేయండి. నేను భారంతో క్రుంగిపోతున్నాను. నాకు ప్రాణాలు నిలిచేలా లేవు. నా ఈ భారాన్ని తొలగించేందుకు మీరే తగినవారు. మిమ్ము శరణుకోరుతున్నాను. నాపై దయచూపండి.' భూమి మాటలు విని నారాయణుడు ప్రసన్నుడై వినసొంపైన మధురవచనాలను ఆమెతో ఇలా పలికాడు. 'నీవు భారంతో క్రుంగిపోయావు. దాన్ని గురించి నీవు భయపడకు. నీవు తేలికపడే ఉపాయం ఇప్పుడే చేస్తాను.' లోమశుడు పలికాడు . "పర్వతా లనే కుండలాలు కల భూమిని తనచోటికి పంపి విష్ణువు ఒకేఒక కోరతో ప్రకాశించే అడవిపందిగా మారిపోయాడు. ఎఱ్ఱటి కళ్ళతో భయం పుట్టిస్తున్నట్లు తన శరీరతేజంతో పాగను చిమ్ముతూ అక్కడే పెరగసాగాడు. అతడు ప్రకాశిస్తూ ఒకే ఒక కొమ్ముతో భూమిని భరించి, నాశంలేనివాడై వందలయోజనాలు భూమిని పైకి తీశాడు. దాన్ని పైకి తీస్తుండగా గొప్ప కలకలం బయలుదేరింది. దేవతలు, ఋషులు, తపోధనులు క్షోభించిపోయారు. స్వర్గం, ఆకాశం, భూమి అంతటా హాహాకారాలు వ్యాపించాయి. ఏ దేవతా, ఏ ప్రాణీ స్థిరంగా ఉండలేకపోయారు. వెంటనే దేవతలు, ఋషులు బ్రహ్మవద్దకు చేరారు. అప్పుడు బ్రహ్మ తేజస్సుతో వెలిగిపోతూ ఆసనంపై కూర్చుని ఉన్నాడు. లోకసాక్షియైన బ్రహ్మను సమీపించి, ప్రాణులందరు చేతులు జోడించి, ఇలా అన్నారు. లోకాలన్నీ కల్లోల పడుతున్నాయి. చరాచరప్రాణులన్నీ వ్యాకులపడ్డాయి. సముద్రాలు అల్లకల్లోలమవుతున్నాయి. ఈ భూమి వందల కొద్ది యోజనాలు సముద్రంలో మునిగిపోయింది. ఎవరి ప్రభావంచే ఈ అద్భుతం జరుగుతోంది? ప్రపంచమంతా వ్యాకులమై ఉంది. మీరు శీఘ్రంగా కారణాన్ని తెల్పండి. మేం అచేతనులమై ఉన్నాం."

బ్రహ్మ చెప్పాడు – "రాక్షసులమూలంగా ఎలాంటి భయమూ లేదు. అన్నివైపులా ఇలా సంక్షోభం వ్యాపించడానికి కారణం ఏమిటో వినండి. సర్వవ్యాపకుడు, నాశంలేనివాడు, నారాయణుడు. అతని కారణంగా ఈ కల్లోలం లోకంలో ఏర్పడింది. ఈ భూమి అంతా యోజనాల కొద్దీ లోపలకి మునిగిపోయింది. దాన్ని ఉద్ధరించే ప్రయత్నంలో ఈ అద్భుతం జరిగింది. దానిని పైకి లేవనెత్తుతూ ఉంటే సంక్షోభం ఏర్పడింది. దీనికి కారణాన్ని మీరు తెలుసుకోండి. మీ లోపలి సందేహాలు తీర్చుకోండి." దేవతలు పలికారు – "భూమిని ఉద్ధరించే ఆ ప్రాణి ప్రసన్నుడై ఎక్కడ అవతరించాడు. ఆది చెప్తే ఆ ప్రదేశానికి మేం వెడతాం." బ్రహ్మ పలికాడు మీకు శుభం చాలా సంతోషం. శ్రీమహావిష్ణువు నందనవనంలో ఉన్నాడు. అతనిని దర్శించండి. ఆ వనసమీపంలో పూజ్యుడు, లోకభావనుడు అయిన

శ్రీమహావిష్ణువు వరాహరూపంలో ప్రకాశిస్తున్నాడు. భూమిని ఉద్ధరించే వేళలో ప్రళయకాలాగ్నిలా ప్రకాశిస్తున్నాడు. ఇతని వక్షస్థలంపై శ్రీవత్సం అనే పుట్టుమచ్చ స్పష్టంగా కనిపిస్తోంది. రోగశోకాలు లేని భగవంతుని వరాహరూపాన్ని మీరంతా తిలకించండి." లోమశుడు పలికాడు - "పిమ్మట ఆ స్వామిని చూసి ఆయన మహిమలు విని, ఆయన ఆజ్ఞను గైకొని, బ్రహ్మను ముందుంచుకొని, దేవతలు ఎలా వచ్చారో అలా వెళ్ళారు. ఈ కథ విని పాండవులు ప్రసన్నులై, లోమశుడు చూపే మార్గంలో ఉత్సాహంగా ముందుకు సాగారు.

143. గంధమాదనయాత్రలో పాండవులపై గాలితో కూడిన జడివాన.

పిమ్మట ధనుర్ధారులలో శ్రేష్ఠులైన పాండవులు ధనుస్సు, బాణాలు, డాలు, కత్తి, వ్రేళ్ళకు తొడుగులు ధరించి బ్రాహ్మణులతో, ద్రౌపదితో గంధమాదన పర్వతంవైపు బయలుదేరారు. సరస్సులు, నదులు, పర్వతాలు, వనాలు దాటి గంధమాదన వనంమీది వృక్షచ్ఛాయలను తనివితీరా చూశారు. ఫలపుష్పాదులతో నిండిన ఇలాంటి ప్రదేశాన్ని వారు ఇంతకుముందు చూడలేదు. ఈ పర్వతంపై దేవర్షుల సముదాయం నివసిస్తోంది. పాండవులు పరమాత్మ చింతనలో మనస్సు లగ్నం చేసి నిమ్నోన్నత ప్రదేశాల్లో ఫలాలను తింటూ ముందు సాగారు. ఆ మార్గంలో చాలరకాల మృగాలు ఉన్నాయి. వాటి సంఖ్య కూడ ఎక్కువగా ఉంది. ఋషులు, సిద్ధులు, దేవతలు అక్కడ సంచరిస్తున్నారు. గంధర్వాప్సరసలకు ఇష్టమై కిన్నరగణంచే సేవింపబడే ఆ పర్వతానికి పాండవులు చేరారు. పాండవులు గంధమాదనం పై కాలుమోపగానే పెద్దగాలితో గొప్పవర్షం కురవసాగింది. అటుపైన ఆకులతో కలిసిన ధూళి ఎక్కువగా ఎగిరి భూమిని, ఆకాశాన్ని, స్వర్గాన్ని ఒక్కసారిగా ఆవరించింది. ధూళిచే ఆకాశం కప్పబడింది. కొంచెం కూడ ఎదుటి వస్తువు కనబడటం లేదు. ఒకరితో ఒకరికి మాట్లాడడానికి అవకాశం లేకపోయింది. గాఢాంధకారం కన్నులనావరించి ఒకరినొకరు చూడలేకపోయారు. రాళ్ళచూర్ణంతో కూడి, గాలి తలోవైపుకి లాగివేస్తోంది. ప్రచండవాయువేగానికి విరిగి, భూమిపై పడిన చెట్లధ్వనులతో ఆ పర్వతప్రాంతం మారుమ్రోగింది. ఆకాశం ఈ వేగానికి క్రిందపడుతోందా? పర్వతం చీలిపోతోందా? అని ఆ గాలిని చూసి మోహితులై పాండవులు అనుకొన్నారు. పిమ్మట వారి దారిలో పడిన వృక్షాలను, పుట్టలను చేతితో తప్పించుకొంటూ భయపడి, బాగా గాలివీచినప్పుడు అక్కడక్కడ దాగి, ముందుకు పోయారు. ఆ సమయాన బలశాలి అయిన భీమసేనుడు చేతితో ధనుస్సు గైకొని ద్రౌపదిని తన సమీపంలో ఉంచుకొని ఆ ప్రదేశంలోని చెట్టును ఆశ్రయించి

నిలబడ్డాడు. ధర్మరాజు, ధౌమ్యుడు అగ్నిహోత్రసామగ్రి తీసికొని ఆ వనంలో ఎక్కడో దాగారు. సహదేవుడు పర్వతంపై సురక్షిత స్థానంలో దాగాడు. నకులుడు, ఇతరబ్రాహ్మణులు, లోమశుడు చెట్లను ఆశ్రయించి భయపడి అక్కడక్కడ దాగి ఉన్నారు. క్రమంగా గాలి తగ్గి, ధూళి శమించి గొప్పజలధారలతో వర్షం పడసాగింది. శీఘ్రంగా ఛటఛటాశబ్దంతో వజ్రపాతంతో సమానంగా మేఘమాలలు, అన్నివైపుల చంచలంగా ప్రకాశించే మెరుపుతీగలు సంచరించసాగాయి. వడగళ్ళతో కూడిన వర్షధారలు అన్ని దిక్కులూ కప్పివేస్తూ వేగపు గాలులతో కురియసాగాయి. అక్కడ నాలుగువైపులనుంచి జలం సముద్రగామినులైన నదులరూపంగా కనిపిస్తోంది. మట్టితో, నురుగుతో కలిసి ఉంది. నురుగుపడవలతో నిండి అగాధజలం ప్రవహిస్తూ ఉంది. నదులు విరిగిపడుతున్న చెట్లతో ధ్వనిచేస్తూ వేగంగా ప్రవహిస్తున్నాయి. కొంతసేపటికి ధ్వని, వాయువు తగ్గిపోగా నీరు లోతైన ప్రదేశాలకు చేరింది. సూర్యుడు ఉదయించాడు. వీరులందరు వారివారి స్థానాలనుంచి బయటకు వచ్చి గంధమాదన పర్వతానికి బయలుదేరారు.

144. ద్రౌపది మూర్ఛ, ఘటోత్కచుని రాక.

పాండవులు రెండు మైళ్ళు నడిచే సరికి ద్రౌపది నడువలేక చతికిలబడి పోయింది. అలసి, దుఃఖిస్తూ దీనంగా నున్న పాంచాలి సుకుమారి అవటంచేత ఆ గాలివానకు మూర్ఛపోయింది. వ్యాకులపాటుతో వణుకుతూ తెలివితప్పి రెండు చేతులతో రెండు తొడలనూ పట్టుకొంది. ఏనుగు తొండాలవంటి తొడలు పట్టుకుని వణకుతూ, ఆరటిచెట్టువలె వేగంగా భూమిపై పడింది. సుందరాంగియై చెట్టునుంచి జారి, క్రిందపడుతున్న తీగవలె ఉన్న ద్రౌపదిని నకులుడు త్వరగా వచ్చి, పట్టుకొన్నాడు. నకులుడు అన్నాడు – 'రాజా! నల్లటి నేత్రాలు గల ద్రౌపది అలసి భూమిపై పడిపోయింది. ఈమెను ఒక్కసారి చూడు. దుఃఖానికి తగని ఈమె దుఃఖాన్ని పొంది తట్టుకోలేకపోతోంది. శ్రమచెందిన ఈమెను ఊరడించు.' రాజు ఆ మాట విని, దుఃఖం పొంగి, భీమసహదేవులతో కలిసి అక్కడికి పరుగెత్తి వచ్చాడు. ద్రౌపది ముఖకాంతి వాడిపోయింది. ఆమె చిక్కిపోయి ఉంది. ఆమెను ఒడిలోనికి తీసుకొని శోకపీడితుడై ధర్మరాజు విలపించసాగాడు. యుధిష్ఠిరుడు పలికాడు 'సురక్షితగృహాల్లో హంసతూలికా తల్పాలకు అర్హురాలయిన ఈమె భూమిపై పడిపోయింది. సుకుమారమైన ఈమె పాదాలూ, పద్మకాంతి కల ఈ ముఖమూ నా కోసం శ్రమపడుతూ నల్లబడి పోయాయి. ద్యూతాసక్తితో బుద్ధిని కోల్పోయిన నేను ద్రౌపదిని తీసుకొని క్రూరమృగాలతో నిండిన అడవిలో తిరుగుతున్నాను. ద్రుపదమహారాజు వివాహసమయంలో' పాండవులను పొంది సుఖించగలవు అని' చెప్పి మరీ కన్యాదానం చేశాడు. కాని నా

పాపపుపనులచే ఈమె సుఖాన్ని పొందక శ్రమ, దుఃఖం, మార్గాయాసం కలిగి ఈనాడు భూమిపై అచేతనంగా పడి ఉంది.' ధర్మరాజు అలా విలపిస్తుండగా ధౌమ్యాది పురోహితగణం అక్కడకు వచ్చింది. వారు ఆయనను ఊరడించి, ఆశీస్సులతో పూజించారు. రాక్షసులను వినాశనం చేసే మంత్రాలను, జపాన్ని, శాంతికర్మలను ఆచరించారు. శాంతికోసం పరమర్షులచే మంత్రాలు పరింపబడుతూంటే తమ చల్లనిచేతులతో పాండవులు ద్రౌపదిని పదేపదే నిమిరారు. చల్లని నీటితో వాయువు సోకగానే ఆమెకు సుఖం .కలిగింది. పాంచాలి మెల్లమెల్లగా తెలివి తెచ్చుకొంది. దీనావస్థలో ఉన్న ద్రౌపదిని పట్టుకొని, లేడిచర్మం పరచి, పడుకోబెట్టి, విశ్రమింపచేశారు. అపు డామెకు స్పృహ వచ్చింది. నకుల సహదేవులు ఆమె ఎట్టటి పాదాలను వింటినారిచే కాయలు కాసిన చేతులతో మెల్లగా ఒత్తసాగారు. ధర్మరాజు కూడ ఆమెను చాలావిధాలుగా ఊరడించాడు. భీమసేనునితో ఇలా పలికాడు. 'ఇక్కడ నుంచి ఎత్తుపల్లాలైన పర్వతాలు చాలా ఉన్నాయి. మంచుకారణంగా నడవడానికి వీలుగా లేవు. వాటిపై ద్రౌపది ఎలా నడవగలదు?' భీమసేనుడు చెప్పాడు – 'రాజా! మీరు విచారించవద్దు. నేను కవలలను, ద్రౌపదిని, మిమ్ములను కూడ ఎత్తుకొని నడవగలను. హిడింబకుమారుడు, మహావీరుడు, నాతో సమానమైన బలం కలవాడు. ఆకాశంలో సంచరించగల ఘటోత్కచుడు నామాటగా మిమ్ములను అందరినీ వీపుపై ఎక్కించుకొని, ఎగురగలడు.' ధర్మరాజు అంగీకారంతో భీముడు ఘటోత్కచుని తలచుకొన్నాడు. తలవడంతోనే ధర్మాత్ముడైన ఘటోత్కచుడు ప్రత్యక్షమయ్యాడు. బ్రాహ్మణులకు, పాండవులకు నమస్కరించి, వారిచే అభినందితుడై భయంకరపరాక్రమం గల తన తండ్రితో ఇలా అన్నాడు. 'నీవు స్మరించగానే నిన్ను సేవించాలని శీఘ్రంగా వచ్చాను. ఆజ్ఞాపించు. నేను మీ పనులన్నింటినీ పూర్తిచేస్తాను.' అది విని, భీమసేనుడు ఆనందంతో కుమారుని కౌగిలించుకొన్నాడు.

145. ఘటోత్కచుడు పాండవులను గంధమాదనమునకు చేర్చుట.

ధర్మరాజు అన్నాడు. 'బలవంతుడు,శూరుడు, సత్యవాది, రాక్షసశ్రేష్ఠుడు, మన భక్తుడు, ఔరసపుత్రుడు అయిన ఘటోత్కచుడు ఆలస్యం చేయక మనలను శరీరానికి హాని కలుగకుండా ద్రౌపదీసహితంగా గంధమాదనం చేర్చాలి.' సోదరుని మాటలు విన్న భీమసేనుడు తనకుమారుని ఇలా ఆదేశించాడు. 'ఘటోత్కచా! నీతల్లి ద్రౌపది అలసిపోయింది. నీవు ఆకాశంలో ఎదురులేక సంచరిస్తావు. ఆకాశమార్గాన ఈమెను తీసుకొని ఎగిరి రావలసింది. ఈమెను భుజాలపై నుంచుకొని మామధ్యనుండియే ఆకాశమార్గాన తీసికొనిరా! కొంచెం కూడా కష్టం లేకుండా మెల్లమెల్లగా ప్రయాణం చేయి. నీకు మేలు జరుగుతుంది.' అనగానే ధర్మజుని, ధౌమ్యుని, కవలలను, ద్రౌపదిని నేను ఒక్కడనే సహాయం లేకుండా

తీసుకొనిపోగలను. ఇంకా చాలామంది శూరులు, ఆకాశచారులు కామరూపులు అయిన నాసేవకులు బ్రాహ్మణు లందరినీ మోసుకొంటూ వస్తారు.' అని పలికి ఘటోత్కచుడు ద్రౌపదీదేవిని తన వీపుపై ఎక్కించుకొని, పాండవులను, ఇతరులు మోసుకొనిరాగా బయలుదేరాడు. లోమశమహర్షి సిద్ధులు సంచరించేమార్గంలో తన తపఃప్రభావంతో రెండవసూర్యునిలా సాగిపోతున్నాడు. ఘటోత్కచుని ఆజ్ఞానుసారం అతని సేవకులు బ్రాహ్మణులను తమవీపులపై మోసుకొని వెంట బయలుదేరారు.

ఇలా సుందరవనాలు, ఉద్యానవనాలు చూస్తూ వారు విశాల అనే బదరీవనాన్ని చేరుకొన్నారు. వారు వేగమూ, శీఘ్రగమనమూ కల రాక్షసులచే మోయబడుతూ చాలాదూరాన్ని స్వల్పదూరం వలె దాటారు. మ్లేచ్ఛులతో నిండినప్రదేశాలను, రత్నాలగనులతో కూడిన ప్రదేశాలను, కొండలపై ధాతువులచే ప్రకాశించే ప్రదేశాలను చూశారు. విద్యాధరులు, వానరులు,కిన్నరులు, కింపురుషులు, గంధర్వులు అక్కడ అన్నిచోట్ల కనిపించారు. నెమళ్ళు, చమరీమృగాలు, వానరాలు, రురుమృగాలు, అడవిపందులు, గవయమృగాలు అడవి దున్నలతో ఆ ప్రదేశాలు నిండి ఉన్నాయి. అక్కడ అన్నివైపుల నదులు ప్రవహిస్తున్నాయి. ఎన్నో రకాల పక్షులు సంచరిస్తున్నాయి. ఆ ప్రదేశం నానావిధాలైన మృగాలు, వానరాలతో ప్రకాశిస్తూ ఉంది. మదించినపక్షులు, లెక్కలేనన్ని చెట్లు కలిగిన ఉత్తరకురు దేశాలను దాటి, వారు ఆశ్చర్యవిషయాలకు నిలయం అయిన కైలాస పర్వతాన్ని చూశారు. దాని సమీపాన ఉన్న నరనారాయణుల బదరికాశ్రమాన్ని వీక్షించారు. అది నిత్యం ఫలపుష్పాలతో నిండి ఉంటుంది. అక్కడ ఉన్న రేగుచెట్లు వాటి కాండాలు గుండ్రంగా ఉన్నాయి. దట్టమైన నీడలు, చిక్కగా ఉన్నచెట్లు, శోభకలిగి, శుభవృక్షాల ఆకులతో నిండి ఉన్నాయి. వాటి శాఖలు విశాలంగా కనిపించాయి. మిక్కిలి కాంతితో ప్రకాశిస్తున్నాయి. దివ్యఫలాలతో నిండి ఉన్నాయి. ఆ ఫలాలనుంచి మధుధారలు స్రవిస్తున్నాయి. మహర్షులు ఆ ప్రదేశాన్ని సేవిస్తున్నారు. మదోన్మత్తాలై, ఆనందంతో నిండిన పక్షులు అక్కడ ఎక్కువగా ఉన్నాయి. అక్కడ ఈగలు, దోమలు లేవు. చాలా రకాలైన పళ్లు, సరోవరాలు ఉన్నాయి. పచ్చికబయళ్ళు ఉన్నాయి. వాటిని గంధర్వులు సేవిస్తున్నారు. ఆ ప్రదేశం సహజంగానే సమంగా ఉంది. మంచుచే ఆవరింపబడి మృదుస్పర్శ కలిగి ఉంది. ముళ్ళు ఎక్కడా కన్పించటం లేదు. ఈ ప్రదేశంలోనే గొప్ప రేగుచెట్టు వీర్పడింది. అక్కడకు చేరి మహాత్ములైన ఆ పాండవులు బ్రాహ్మణులతో సహా రాక్షసుల వీపులనుంచి మెల్లగా క్రిందకు దిగారు. పిమ్మట బ్రాహ్మణసహితులై పాండవులు నరనారాయణ నిలయం అయిన ఆ ప్రదేశాన్ని సందర్శించారు.

అంధకారం, తమోగుణం రెండూ అక్కడ లేవు. వనం అంతా దట్టంగా ఉండటంచేత

సూర్యకిరణాల స్పర్శకూడా లేదు. ఆకలి, దప్పిక, శీతం, ఉష్ణం లేక శోకదూరమై ఉంది. ఆ పవిత్రతీర్థం మహర్షిగణంతో, బ్రాహ్మీలక్ష్మితో నిండి ఉంది. ధర్మహీనులైన నరులకు చొరశక్యం కానిదై ఉంది. ఆ ఆశ్రమం బలి, దేవపూజ, హోమాలతో అర్చింపబడి ఉంది. దివ్యాలైన పుష్పాలగంధం అంతటా వ్యాపించి ఉంది. అన్నివైపుల చక్కగా అలుకబడి ఉంది. విశాలాలైన అగ్నిగృహాలు, స్రుక్కులు, స్రువాలు, సుందరయజ్ఞపాత్రలు కల ఆ ఆశ్రమం జలంతో నిండిన కలశాలతో, ఉట్లతో శోభిల్లుతోంది. అది ప్రాణులందరికీ శరణు నిచ్చుచోటు. బ్రహ్మఘోషలు మారుమ్రోగుతున్నాయి. అందరికీ నివాసయోగ్యమైనది. శ్రమను పోగొట్టేదిగా ఉంది. ఆ శోభించే ఆశ్రమం వర్ణనకు సాధ్యం కానిది. దేవతాకార్యాలచే దాని శోభ పెరిగింది. ఫలమూలాలు తినేవారు, జితేంద్రియులు, నల్లలేడి చర్మాలు దాల్చినవారు, తపస్సుచే పరిశుద్ధమైన అంతరంగం కల వారు సూర్య, అగ్ని సములు అయిన మహర్షులు, యతులు, మోక్షేచ్ఛగలవారు, బ్రహ్మభూతులు, వేదవాదులు అక్కడ ఉన్నారు. తేజోవంతుడైన ధర్మరాజు జితేంద్రియుడై, పవిత్రుడై ఆ ఋషుల వద్దకు సోదరులతో సహా వెళ్లాడు. ఆ దివ్యజ్ఞానులు తమవద్దకు వచ్చిన ధర్మజుని వీక్షించి, ప్రసన్నులై అతనికి అనేక విధాలుగా ఆశీర్వాదాలను ఇచ్చారు. వేదవాదులు, అగ్నిసములు అయిన వారందరు, యథావిధిగా అతనిని సత్కరించి అతనికి పుష్ప, ఫలాలు, మూలాలు, జలం సమకూర్చారు. ధర్మరాజు మహర్షుల నుండి ప్రేమపూర్వక సత్కారాన్ని పొంది, పరిశుద్ధంగా గ్రహించి చాలాప్రసన్ను డయ్యాడు. ధర్మజుడు సోదరులతో, భార్యతో కలిసి స్వర్గంతో సమానసౌఖ్యంకలిగి, దివ్యగంధంతో నిండి, ఆహ్లాదకరమైన ఆ నరనారాయణుల ఆశ్రమాన్ని ప్రవేశించాడు. అతనితో వేదవేదాంగ పారంగతులైన బ్రాహ్మణులు అనేకులు కూడా ప్రవేశించారు. ధర్మాత్ముడైన యుధిష్ఠిరుడు దేవ, ఋషిపూజిత అయిన గంగతో ప్రకాశించే నరనారాయణ స్థానాన్ని చూశాడు. నరశ్రేష్ఠులైన పాండవులు ఆ స్థానాన్ని చూస్తూనే సంతసించి తిరుగసాగారు. మహర్షులు సేవించే మధువు స్రవించే ఫలాలతో కూడిన దది. దాన్ని చేరి బ్రాహ్మణులతో సహా అక్కడ పాండవులు నివసించారు. సంతోషంతో నిండి సుఖంగా కాలం గడిపారు.

బంగారు శిఖరాలతో ప్రకాశించే మైనాకునిపై, అనేకవిధాల పక్షులతో కూడిన ఆ ప్రదేశం శీతలజలాలతో నిండిన బిందు సరస్సు అనే చెరువు కలిగి ఉంది. వాటిని అన్నింటినీ చూస్తూ, పాండవులు ద్రౌపదితో విహరించసాగారు. అది సమస్త ఋతువులలోని పుష్పాలతో ప్రకాశిస్తోంది. ఆ వనంలో అందమై వికసించిన చెట్లు, ఫలభారంతో వంగిన చెట్లు కనిపిస్తున్నాయి. కోకిలలతో నిండిన చెట్లతో ఆ వనమంతా రమ్యంగా ఉంది. చెట్ల ఆకులు చిక్కగా, దట్టంగా ఉన్నాయి. ఎక్కువ నీడను ఇస్తున్నాయి. అక్కడ సరస్సులు నిర్మలజలంతో నిండి కనిపించాయి. వికసించిన కమలాలు, కలువలు అన్నివైపుల శోభను

నింపుతున్నాయి. పాండవులు సుందరసరోవరాలను చూస్తూ ఆనందంతో సంచరించారు. గంధమాదనపర్వతం మీది గాలి సువాసన, సుఖస్పర్శ కల్గి ఉంది. ద్రౌపదితో సహా పాండవులను ఆహ్లాదపరుస్తోంది. ఆ విశాల బదరీవృక్ష సమీపాన ఉత్తమతీర్థాలతో ప్రకాశించే చల్లని నీరుగల గంగ ప్రవహిస్తోంది. ఆ గంగలో అందమైన కమలాలు వికసించి ఉన్నాయి. దాని తీరాలు, పుష్పాలతో, మణులతో ప్రకాశిస్తూ మనస్సుకు ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి. ఆ విశాలబదరీవృక్షాలను చూస్తూ పాండవులు ఆనందించారు. దేవర్షులు సంచరించే, దుర్గమ దేశంలో పవిత్రగంగాజలంతో దేవతలకు, ఋషులకు, తర్పణాలు ఇచ్చారు. అక్కడ వారికి తర్పణాలు చేస్తూ జపం చేసుకొంటూ బ్రాహ్మణ సహితులై, శుచులై పాండవులు నివసించారు. ద్రౌపది ఆడుతున్న విచిత్ర క్రీడలను చూస్తూ ఆనందంతో సంచరించారు.

146. భీమసేనుడు సౌగంధికపుష్పాలు తెచ్చుటకు పోవుట - హనుమంతుని కలియుట.

ఆ పురుషశ్రేష్ఠులు పాండవులు పరమపవిత్రులై ధనంజయుని దర్శనం కోరి అక్కడ ఆరు రాత్రులు గడిపారు. పిమ్మట ఈశాన్య దిక్కు నుంచి వాయువు యథేచ్ఛగా వీస్తూ, సూర్యునివలె ప్రకాశించే వేయి దళాల దివ్యకమలాన్ని తెచ్చి ముందు పడవేసింది. అది చాల అందంగా ఉంది. దివ్యగంధం కలిగి ఉంది. గాలి కొనివచ్చిన పవిత్రపుష్పాన్ని సౌగంధికాన్ని ద్రౌపది పరికించి ఎంతో సంతోషించి, భీమునితో ఇలా అంది. 'భీమసేనా! ఉత్తమమై ప్రకాశవంతమైన ఈ దివ్యపుష్పం చూడు. దీని దివ్యగంధం ఆఘ్రాణిస్తే ఆనందంగా ఉంది. సుగంధమే దీని స్వరూపం. దీన్ని ధర్మజునకు కానుకగా ఇస్తాను. నాకోరిక తీర్చటానికి నీవు కామ్యకవనానికి వెళ్లి ఇంకా తీసుకొనిరా. నీకు నాపై ప్రేమ ఉంటే నాకోసం వీటిని చాలా తీసుకురా. వాటిని నేను మన కామ్యకవనంలోని ఆశ్రమానికి తీసుకువెడతాను.' - అని పలికి సుందరమైన కనుకొలకులు గల సాధ్వి ద్రౌపది పుష్పాన్ని తీసుకొని ధర్మజునికి చూపడానికి వెళ్లింది. భీముడు తన ప్రియురాలి మనోభావాన్ని గుర్తించి ఆమెకు ప్రియాన్ని చేయగోరి అక్కడి నుంచి బయలు దేరాడు. అలాంటి పూలనే చాలా తీసుకొని రావటానికి వెంటనే ఆ గాలి వచ్చిన వైపుకి బయలుదేరాడు. బంగారు తొడుగు కల విల్లు తీసుకొన్నాడు విషసర్పాల్లాంటి బాణాలు తీసుకొన్నాడు. కోపించిన సింహంవలె, మదం స్రవించిన ఏనుగువలె ఉన్నాడు. విల్లు, బాణాలు ధరించిన ఆ భీముని ప్రాణులన్నీ చూశాయి. వాయుపుత్రునకు మాత్రం అలసట, వైక్లబ్యం, భయం, తొందరపాటు లేవు. ద్రౌపదికి ప్రియాన్ని చేయగోరి, తన బాహుబలాన్ని ఆశ్రయించి,

భయమోహాలు లేక, బలవంతుడై ఎదురుగా ఉన్న పర్వతశిఖరం అధిరోహించాడు. ఆ పర్వతం చెట్లు, లతలు, తీగలతో కప్పబడి నీలిరంగు శిలలు కలిగి ఉంది. కిన్నరులు అక్కడ సంచరిస్తున్నారు. శత్రుతాపనుడైన భీమసేనుడు ఆ పర్వతంపై చరించాడు. చాల రంగులలో ధాతువులు, చెట్లు, మృగాలు, పక్షులు కలిగి, విచిత్రశోభతో పర్వతం ప్రకాశిస్తోంది.

భూమి సమస్త ఆభరణాలు కల తన భుజాన్ని పైకెత్తినట్లుగా అందంగా ఆ గంధమాన పర్వతం చరియలు కనిపించాయి. ఆ శిఖరం ఎటుచూసినా అందంగా ఉంది. పుంస్కోకిలల నాదాలు, తుమ్మెదల ఝంకారాలు గాఢంగా వినిపిస్తున్నాయి. వాటిని ఆసక్తిగా గమనిస్తూనే మనస్సులో తన పని గురించి ఆలోచిస్తున్నాడు. అన్ని ఋతువుల పుష్పాలగంధమూ అధికంగా వ్యాపించింది. దాన్ని ఆఘ్రాణిస్తూ మదించిన ఏనుగులా ఉన్నాడు. గంధమాదనం మీదుగా వీచే గాలి వింజామరవలె సేవిస్తోంది. తండ్రికి పుత్ర సంస్పర్శ సుఖం కలిగిస్తున్నట్లు అదే సుఖం గంధమాదన పర్వతంమీది గాలితో భీమసేనునికి కలుగుతోంది. ఆ సమయంలో యక్షులు, గంధర్వులు, బ్రహ్మర్షులు, దేవర్షులు సేవించే ఆ విశాల పర్వతానికి అన్నివైపులా పుష్పాలకోసం దృష్టిని ప్రసారించాడు. అనేక ధాతువులచే రంజితమై, ఏడాకుల అరటి ఆకులతో విభిన్నాలైన రంగులు కలిసి అంగుళుల ద్వారా త్రిపుండ్రాలు దాల్చినట్లు ఉంది. ఆ కొండ పర్వతశిఖరానికి ఇరువైపులా లగ్నమైన మేఘాలశోభ రెక్కలు దాల్చి నృత్యం చేస్తున్నట్లు అనిపిస్తోంది. నిరంతరం ప్రవహించే జలం, పర్వతకంఠానికి వేసిన ముత్యాల హారంలా ఉంది. పర్వతగుహలు, పాదలు, సెలయేళ్లు అన్నీ మనోహరంగా ఉన్నాయి. అప్సరసల అందెల ధ్వనులచే నృత్యం చేసే నెమళ్ళు వింతగా కనిపించాయి. దిగ్గజాల దంతప్రహారాల గుర్తులు పర్వత శిలలపై ఉన్నాయి.. పల్లంవైపు ప్రవహించే నదుల నుండి వచ్చే నీరు కలత చెందక ప్రవహిస్తే పర్వతంపైట జారినట్లుంది. భయం తెలియని లేళ్ళు లేతగడ్డి పరకలు కొరుకుతూ భీమునివైపు కుతూహలదృష్టితో చూస్తున్నాయి. మనోహరనేత్రాలు, గొప్ప వేగమూ కల భీమసేనుడు తనవేగంతో దగ్గరలోని లతా సమూహాల్ని కదుపుతూ హర్షంతో ఆటలాడుతూ ముందుకు సాగుతున్నాడు. అతడు తన ప్రియురాలు ద్రౌపది కోరికను తీర్చటానికి సిద్ధమయ్యాడు. అతడు చాల ఎత్తుగా ఉన్నాడు. బంగారు రంగుతో ఉన్నాడు. అతని అవయవాలు సింహపు అవయవాల్లా బలంగా కనపడుతున్నాయి. మదించిన ఏనుగుయొక్క విక్రమమూ, వేగమూ కలిగి ఉన్నాడు. మదించిన ఏనుగులాంటి ఎఱ్ఱటి కళ్ళు భీమునివి. మదించిన ఏనుగుల్ని యుద్ధంలో వెనుకకు మళ్లించేవాడు అతడు. ప్రియుని జతలో కూర్చున్న యక్ష గంధర్వ స్త్రీలు చేష్టలుడిగి ఆశ్చర్యంతో అతనిని చూస్తున్నారు. సౌందర్యానికి

నూతన అవతారంలా ఉన్నాడు. అతడిని యక్షగంధర్వ స్త్రీలందరూ తాము కనపడకుండా చూస్తున్నారు. గంధమాదనశిఖరాలపై ఒక ఆటగాడిలా తిరుగుతున్నాడు. దుర్యోధనుడు చేసిన అపకారాల్ని స్మరించుకొంటూ వనవాసిని అయిన ద్రౌపదికి ప్రియం చెయ్యాలని సిద్ధం అయ్యాడు. "అర్జునుడు స్వర్గంలో ఉండగా నేను సౌగంధిక పుష్పాలకై రాగా ధర్మరాజు ఒక్కడూ పనులన్నీ ఎలా సాధిస్తాడు? ధర్మరాజు నకులసహదేవులపై మిక్కిలి ప్రేమ కలిగి ఉన్నాడు. వారి బలంపై అతనికి నమ్మకం లేదు. (అంటే వారిని ఏ పనికీ పంపడు) శీఘ్రంగా పుష్పాలు ఎలా లభిస్తాయి?" అని ఆలోచిస్తూ గరుడునితో సమాన వేగంతో ముందుకు పోతున్నాడు. అతని మనస్సు వికసించిన పూలున్న పర్వతాల చరియల మీద లగ్నమైంది.

ద్రౌపది వాక్యాలే దారిలో ఆహారంగా, భీముడు శీఘ్రంగా బయలుదేరాడు. వాయువేగం కల భీమసేనుడు పర్వతసమయాల్లోని భూకంపాలు, పిడుగుపాటు లాంటి ఉత్పాతాలతో సమంగా ఉన్న తన పాదాల సవ్వడితో భూమిని కంపింపచేస్తూ, ఏనుగుల మందలను భయపెడుతూ నడవసాగాడు. భీమసేనుడు సింహాలను, పెద్దపులులను, మృగాలను మర్దిస్తూ, తన వేగంతో పెద్దపెద్ద చెట్లనూ తీగల్ని లాగివేస్తూ ముందుకు సాగుతున్నాడు. అతడు పైపైకి పోతుంటే గజరాజు పర్వతశిఖరాగ్రం వైపు సాగుతున్నట్లు ఉంది. మెరుపు తీగల వల్ల ప్రకాశించే మేఘాలవలె గట్టిగా గర్జించాడు. భీమసేనుని భయంకర గర్జనచే పులులు గుహలను వీడి పరుగుపెట్టాయి. వనంలో నివసించే ప్రాణులు లోపల దాగాయి. భయపడిన పక్షులు ఆకాశంలోకి ఎగిరాయి. మృగాల గుంపు దూరంగా పరుగులు తీశాయి. ఎలుగుబంట్లు చెట్లను విడచాయి. సింహాలు గుహలను విడచిపెట్టాయి. పెద్ద పెద్ద సింహాలు విజృంభిస్తూ దున్నలను చూస్తున్నాయి. భయపడిన ఏనుగులు ఆడఏనుగులతో కలిసి ఆ వనం విడిచి ఇంకొక మహావనానికి చేరుకున్నాయి. అడవి పందులు, మృగాల గుంపులు, దున్నలు, గవయ మృగాలు, వ్యాఘ్రాలు, నక్కలు, చిలుకలు, చక్రవాకాలు, చాతక, హంస, కారండవ, ప్లవ, కోకిల, క్రౌంచాదులు గాబరాపడి, నోళ్ళు తెరిచి, పెద్దగా అరుస్తూ తలకొక దిక్కుకూ ఎగిరాయి. ఆడఏనుగుల కటాక్ష బాణాలకు లొంగిన ఏనుగులు, సింహాలు, పెద్దపులులు కోపించి, భీమసేనునిపై విరుచుకుపడ్డాయి. మలమూత్రాల్ని విడుస్తూ, భయంతో, చలించిన మనస్సులతో, నోళ్ళు తెరిచి రౌద్రంగా ధ్వనులు చేశాయి. భీమసేనుడు తన బాహుబలంతో ఒక ఏనుగుతో మరికొన్ని ఏనుగుల్ని, ఒక సింహంతో మరొక సింహాన్ని చంపి, మిగతావాటిని అరచేతి దెబ్బలతో చంపాడు. భీమసేనుని దెబ్బలకు సింహాలు, వ్యాఘ్రాలు, తరక్షువులు భయంతో మలమూత్రాల్ని ఒక్కసారిగా విడచాయి. భీమసేనుడు శీఘ్రంగా వాటిని విడచి, తన గర్జనతో దిక్కుల్ని ప్రతిధ్వనింపచేస్తూ ఒక

వనంలో ప్రవేశించాడు. గంధమాదన శిఖరాలపై భీముడు చాల యోజనాలు వ్యాపించిన అందమైన అరటి తోటను చూశాడు. మహాబలుడైన వాయుపుత్రుడు అరటితోపులో తిరుగుతూ, మదం స్రవించే ఏనుగు వలె దాన్ని పడవేస్తూ, తాడిచెట్లంత ఎత్తైన చెట్లను పెకలించి భూమిపై విసరసాగాడు. తన బలపరాక్రమాలపై గర్వంతో, గొప్ప తేజంతో నరసింహుని వలె గర్జిస్తూ ఉన్నాడు. పిమ్మట పెద్ద పెద్ద జంతువులపై దాడిచేశాడు. రురు, వానర, సింహాలు, దున్నలు జలజంతువులపై దాడి చేశాడు. పశుపక్ష్యాదుల ధ్వనికి, భీమసేనుని గర్జనకు వేరే వనంలో ఉన్న మృగాలు, పక్షులు కూడ భయపడ్డాయి.

భయసూచకమగు మృగ, పక్ష్యాదుల శబ్దాన్ని విని, వేలకొద్దీ పక్షులు ఆకాశంలోకి ఎగిరాయి. భీముడు ఇది చూచి జల పక్షుల వెంటపడ్డాడు. కొంత దూరం పోయిన పిదప అందమైన సరస్సును చూశాడు. సరోవరతీర మంతా వ్యాపించిన బంగారు అరటిచెట్లు మెల్లని గాలికి కదలి అగాధ జలాశయాన్ని వింజామరల్లా వీచాయి. దానిలో ఎన్నో కమలాలు కలువలు వికసించి ఉన్నాయి. బంధనంలేని ఏనుగువలె భీముడు సరోవరంలోకి దిగి జలక్రీడలాడ మొదలుపెట్టాడు. చాలసేపు స్నానంచేసి సరోవరంలో క్రీడించి, అమిత తేజోవంతుడైన భీముడు సరోవరం నుంచి బయటపడి, వేగంగా అరటితోపులో ప్రవేశింపబోయాడు. ఆ సమయంలో భీముడు తన శక్తినంతటినీ కూడతీసికొని వేగంగా శంఖాన్ని ఊదాడు. అది అన్ని దిశలా మారుమ్రోగింది. ఆ శంఖధ్వనితో, భీమసేన గర్జనతో అతని చప్పట్ల శబ్దంతో పర్వతగుహలన్నీ ప్రతిధ్వనించాయి. పర్వతాలపై వజ్రం వేసినప్పుడు మోగినట్లుగా మ్రోగిన భుజాస్ఫాలనానికి గుహల్లో నిద్రించే సింహాలు గర్జించాయి. సింహాలనాదానికి భయపడిన ఏనుగులు కూడ తొండాలు ఎత్తి, పర్వతం మారుమ్రోగేలా ఘీంకారాలు అప్రయత్నంగా చేశాయి.

ఏనుగుల ఘీంకారాల్ని విన్న కపిశ్రేష్ముడైన హనుమంతుడు అరటితోపులో ఉండి, తన సోదరుడు భీమసేనుని రాకను గుర్తించి ఇటువైపు వచ్చాడు. భీమసేనుని మేలుకోరి స్వర్గంవైపు పోయే మార్గాన్ని ఆంజనేయుడు అడ్డగించాడు. భీమసేనుడు ఈ మార్గంలో వెళ్ళకూడదని, ఒక మనుష్యుని రాకపోకలకు వీలైనంత దారిలో కూర్చున్నాడు. అరటిచెట్లు దట్టంగా ఉండటం వలన ఆ దారి చాలా అందంగా ఉంది. భీముని రక్షణకే హనుమంతుడు ఆ దారిలో అడ్డుగా కూర్చున్నాడు. అరటితోపుగుండా వచ్చే భీమసేనుడు ఈ దారిలో శాపాన్ని గాని, తిరస్కారం గాని పొందకూడదని ఆలోచించి హనుమంతుడు వనానికి వెలుపల దారిని నిరోధించాడు. ఆ సమయాన తన శరీరాన్ని అతడు పెంచివేశాడు. నిద్రాసక్తుడై ఆ అరటితోట మధ్యలో కూర్చున్నాడు. ఇంద్రధ్వజం వలె ప్రకాశించే తోకను

వజ్రాయుధపు దెబ్బ అనిపించేటట్లు భూమిపై చరిచాడు. ఆ తోక చేసిన ధ్వని గుహల అంతర్భాగాల్లో అన్నివైపుల ప్రతిధ్వనించింది. ఒక ఆబోతు రంకెలా ఉంది. తోకను చరుస్తూండడం వలన చలించిన ఆ మహాపర్వత శిఖరాలు గిరగిర తిరిగి అన్నివైపుల విరిగి పడసాగాయి. ఆ శబ్దం ఏనుగు ఘీంకారం వలె మార్మ్రోగి పర్వత చరియ లంతటా వ్యాపించింది. ఇది విని భీమసేనుడు మిక్కిలి ఉత్సాహంతో పులకాంకురాలు కలిగి ఆ శబ్దం పుట్టిన చోటు వెదకుతూ అరటి తోటలో తిరగసాగాడు. అరటితోపు మధ్యలో విశాలమై, మందమైన రాతిపలకపై భీమసేనుడు వానరశ్రేష్ఠుడైన హనుమంతుని చూశాడు. మెరుపుతీగ కాంతితో చూడశక్యం కాని రంగుతో ప్రకాశిస్తున్నాడు. అతని గర్జన వజ్రాయుధం పడిన శబ్దంతో సమంగా ఉంది. అతడు మెరుపు తీగలా చంచలంగా ఉన్నాడు.

చేతులను మడిచి, బలిసిన పొట్టి శిరస్సు క్రింద ఆన్చాడు. భుజాలు పెద్దవిగా ఉండటంచేత కృశించిన నడుముతో ఉన్నాడు. అతని పొడవైన తోక చివర కొంచెం వంగి ఉంది. దాని నిండా పొడవైన వెంట్రుకలు ఉన్నాయి. పైకి ఉండటం వలన జెండాలా ఉంది. పెదవులు చిన్నవిగా, నాలుక – ముఖం ఎఱ్ఱగా, చంచలమైన కనుబొమలు, నోటిలో మెరిసే దంతాలు తెల్లగా, పదునుగా ఉన్నాయి. అతని ముఖం ప్రకాశించే కిరణాలు గల చంద్రునిలా ఉంది. ముఖానికి లోపల తెల్లని దంతాలు కాంతిని పెంచుతూ ఆభరణాల సొగసును కలిగిస్తున్నాయి. బంగారు అరటిచెట్ల మధ్యలో ప్రకాశించే తేజోవంతుడు హనుమంతుడు బంగారు రంగు గల అరటి చెట్ల మధ్యలో ఉన్నాడు. వెలిగిపోయే శరీరంతో భగభగమండే అగ్నిలా ఉన్నాడు. తేనె రంగుకళ్లతో అటుఇటూ చూస్తున్నాడు. బుద్ధిమంతుడైన భీమసేనుడు పెద్ద శరీరమూ, చాలా బలమూ కల హనుమంతుని చూస్తే స్వర్గ మార్గాన్ని అడ్డగించి హిమాలయపర్వతంలా కనిపించాడు. భయం ఎరుగని భీముడు ఆ పెద్ద తోటలో ఒంటరిగా ఉన్న అతనిని సమీపించి, సింహనాదం చేశాడు. అది గొప్ప పిడుగుధ్వనిలా ఉంది. ఆ శబ్దానికి మృగాలు, పశుపక్ష్యాదులు భయపడ్డాయి. ధైర్యశాలి హనుమంతుడు కొద్దిగా కళ్లు తెరిచి అతనిని తిరస్కారపూర్వకంగా ఎఱ్ఱటి కళ్ళతో చూసి చిరునవ్వుతో దగ్గరకు వచ్చాక ఇలా అన్నాడు.

'ఏ కారణంగా హాయిగా నిద్రించే రోగినైన నన్ను నీవు నిద్ర లేపావు? అన్ని ప్రాణులపై దయ చూపాలి అని నీకు తెలుసు గదా ! మేము పశువుల గర్భాన పుట్టాం, ధర్మం తెలియని వాళ్లం. నరులు బుద్ధి కలవారు. ఇతర ప్రాణులపై దయ చూపుతారు కదా! మీవంటి బుద్ధిమంతులు ధర్మాన్ని నాశనం చేసే శరీర, వచన, మానసిక దోషాలయందు ఎందుకు ప్రవర్తిస్తారు ? నీకు ధర్మం తెలియదు, జ్ఞానం లేదు. నీవు పండితుల సేవ

చేయ లేదు. చిన్నతనం వలన మందబుద్ధితో మృగాలను కష్టాలకు గురిచేస్తున్నావు. చెప్పు. నీవు ఎవడవు, ఎందుకీ వనానికి, వచ్చావు? ఇక్కడ మనుష్యులకు, మనుష్య భావాలకు కూడా ప్రవేశం లేదు. నీవు ఎక్కడికి పోవాలో చెప్పు. నీవు ఎక్కడికి చేరాలి. ఇక ముందున్న పర్వతం మానవులకు ప్రవేశింప వీలుకానిది. దీని నెక్కటం మరీ కష్టం. సిద్ధపురుషులకు మాత్రమే ఇది తేలిక. ఇది దేవలోకానికి పోయే దారి. మనుష్యులకు అసాధ్యం అయినది. నీపై దయతో నిన్ను వారిస్తున్నాను. ఇది తెలుసుకో, ఇకపై ముందుకు పోవటం చాలా కష్టం. నాపై నమ్మకం ఉంచు. నీకు అన్ని విధాల ఈ ప్రదేశానికి స్వాగతం పలుకుతున్నాను. ఈ పండ్లు అమృత సమానమయిన రుచికలవి. వీటిని హాయిగా తిని వెనుకకు మరలు. అనవసరంగా చావును కొనితెచ్చుకోకు. నా మాట మేలు కలిగిస్తుంది అనుకొంటే ఆచరించు."

147. హనుమద్భీమసేనుల సంభాషణ.

భీముడు హనుమంతుని మాటలు విని తిరిగి ఇలా పలికాడు. "నీవు ఎవడవు ? ఎందుకు ఈ కోతి రూపాన్ని పొందావు. నేను బ్రాహ్మణుని అనంతరం ఉండే క్షత్రియ వర్ణానికి చెందినవాడిని. నేను చంద్రవంశపురాజును, కురు కులంలో కుంతీగర్భంలో పుట్టాను. వాయువు అనుగ్రహంతో పుట్టిన పాండవుణ్ణి. నన్ను అందరూ భీమసేనుడు అంటారు." కురువీరుడైన భీమసేనుని మాటలు చిరునవ్వుతో విని వాయుకుమారుడయిన హనుమంతుడు భీమునితో ఇలా అన్నాడు. "నేను వానరుడను. నీకు నీ కోరిక కొద్దీ దారిని ఇవ్వలేను. నీవు వెనుకకు తిరగటం మంచిది. దుఃఖాన్ని పొందకు - భీముడు బదులు పలికాడు - నా ప్రాణాలు కష్టాల్లో పడినా, ఏ దుష్పరిణామం జరిగినా నిన్ను ఏమాత్రం అడుగను. లే. నాకు పోవడానికి దారి ఇయ్యి. నా వల్ల నీవు వ్యథ పొందవు. - హనుమంతుడు పలికాడు. - నాకు పైకి లేచే శక్తి లేదు. వ్యాధితో బాధ పడుతున్నాను. తప్పక వెళ్ళాలి అనుకుంటే నన్ను దాటి ముందుకు సాగు. - భీమసేనుడు పలికాడు - "నిర్గుణుడైన పరమాత్మ ప్రాణులందరిలో నెలకొనియున్నాడు. ఆ జ్ఞానం కల నేను మిమ్ము అవమానించను. దాటి వెళ్ళను. శాస్త్రాలు చదివిన నాకు ఆ భగవంతుని స్వరూప జ్ఞానం లేకపోతే హనుమంతుడు సముద్రాన్ని దాటిన విధంగా ఈ పర్వతాన్ని మిమ్మల్ని దాటి వేస్తాను." హనుమంతుడు పలికాడు - "ఆ హనుమంతుడు ఎవడు? సముద్రాన్ని ఎందుకు దాటాడు ? అతని గురించి చెప్పగలిగితే చెప్పు అని అడుగుతున్నాను." భీముడు అన్నాడు. "వానరశ్రేష్ఠుడు హనుమంతుడు నా అన్న. ప్రశంసింప దగిన సద్గుణాలు కలవాడు. బుద్ధిబలం, ధైర్యం కలవాడు. రామాయణంలో మిక్కిలి ప్రసిద్ధి చెందిన శ్రీమంతుడు.

ఆ హనుమంతుడు రాముని భార్యను వెదికేవేళలో నూరుయోజనాల విస్తారం గల సముద్రాన్ని ఒక్క అంగలో దాటినవాడు. ఆ పరాక్రమవంతుడు నా సోదరుడు. అతని తేజంతో సమానమైన తేజస్సుకలవాడిని. బలంలో, పరాక్రమంలో, యుద్ధంలో నిన్ను ఎదుర్కొనటంలో సమర్థుడిని. పైకి లే. నాకు దారిని ఇయ్యి. నా పౌరుషాన్ని ఈ రోజు ప్రత్యక్షంగా చూస్తావు. నా ఆజ్ఞను పాటించని నిన్ను యమసదనానికి పంపుతాను." బాహువీర్యంతో గర్వితునిగా, బలమత్తునిగా అతనిని తెలిసికొని హనుమంతుడు మనస్సులోనే అపహసించుకొని అతనితో అన్నాడు. "నాపై దయ చూపు. నాకు పైకి లేచే శక్తి లేదు. ముసలితనం ఆవరించింది. నాపై దయతో నాతోకను కొంచెంగా తొలగించి ముందుకు సాగు." హనుమంతుడు పలికిన మాటలు విని, తన బాహుబలంతో గర్వితుడై, అతనిని తనకంటె తక్కువ పరాక్రమవంతునిగా భావించి, వేగంగా తోకపట్టుకొని యమలోకానికి విసిరివేస్తాను అని నిశ్చయించుకొన్నాడు. చులకనభావంతో ఎడమచేతితో నవ్వుతూ తోకను పట్టుకొన్నాడు. ఆ తోకను భీముడు కదప లేకపోయాడు. ఇంద్రధనుస్సు కొనల వలె సమున్నతాలైన తన రెండు భుజాలతో తోకను ఎత్తప్రయత్నించి విఫలుడైనాడు. కనుబొమలు ఎగరవేస్తూ, కళ్ళను గిరగిరా త్రిప్పుతూ కనుబొమముడిని బిగించాడు. చెమట పట్టింది. కాని ఆ తోకను పైకి ఎత్త లేకపోయాడు. ఎంత ప్రయత్నించినా తోకను పైకెత్తలేక సిగ్గుతో తలవంచుకొని ఆ వానరుని ప్రక్కనే ఉండిపోయాడు. అతని సమీపానికి చేరి నమస్కరించి దోసిలి ఘటించి ఇలా పలికాడు. "అనుగ్రహించు, వానరశ్రేష్ఠా, నేను కఠోరంగా మాట్లాడాను క్షమించు నీవు సిద్ధుడవు కాని, దేవతవు కాని, గంధర్వుడవు కాని, గుహ్యకుడివి కాని అయి ఉండాలి. వానర రూపం ధరించటంలోని ఆంతర్యాన్ని నాకు వివరించి చెప్పు. ఇది రహస్యం కాకపోతే నాకు తప్పక వినిపించు. శిష్యుడు గురువును కోరినట్లు కోరుతున్నాను. నీ శరణు కోరుతున్నాను. దయతో నాకు తెలుపు." హనుమంతుడు పలికాడు. "నీ మనస్సులో నన్ను గురించి తెలుసుకోవాలి అనే కుతూహలం ఉంటే నా వృత్తాంతాన్ని పూర్తిగా విను. నేను జగత్రాణ స్వరూపుడైన వాయుదేవత అనుగ్రహంతో కేసరి అనే బలవంతుడైన వానరుని క్షేత్రంలో పుట్టాను. నాపేరు హనుమంతుడు. పూర్వకాలంలో వానర రాజులు, వానర గణపతులు, మహాపరాక్రమవంతులు సూర్యపుత్రుని సుగ్రీవుని, ఇంద్ర పుత్రుని వాలిని సేవించారు. వాయువుకు అగ్ని స్నేహితుడైనట్లు ఆ రోజుల్లో నాకు సుగ్రీవునితో స్నేహం ఉండేది. ఒకానొక కారణంగా వాలి తన సోదరుని సుగ్రీవుని ఇంటి నుంచి వెడలగొట్టాడు. అప్పుడు చాలా రోజులపాటు నాతో సుగ్రీవుడు కలిసి ఉన్నాడు. ఆ సమయంలో విష్ణువు దశరథకుమారుడు శ్రీరాముడుగా భూమిపై అవతరించాడు. అతడు తండ్రికి ఇష్టాన్ని చేయగోరి సోదరునితో, భార్యతో కలిసి దండకారణ్యానికి

చేరాడు. దండకారణ్యానికి చేరిన శ్రీరాముని భార్య బలవంతంగా దురాత్ముడైన రావణునిచే మోసంతో అపహరింపబడింది. బంగారు రత్నకాంతుల శరీరం గల మాయలేడి రూపంలో వచ్చిన మారీచుని సహకారంతో రాముని వంచించి సీత నపహరించాడు.

148. హనుమంతుడు సంక్షేపముగా రాముని చరిత్ర వినిపించుట.

"భార్య అపహరింపబడగా సోదరునితో కలిసి ఆమెను అన్వేషిస్తూ శ్రీరాముడు ఋష్యమూక పర్వతంపై వానరశ్రేష్ఠుడైన సుగ్రీవుని చూశాడు. అతనితో శ్రీరామునికి అగ్ని సాక్షికంగా స్నేహం కుదిరింది. శ్రీరాముడు వాలిని చంపి సుగ్రీవుని కిష్కింధా రాజ్యానికి రాజును చేశాడు. ఆ సుగ్రీవుడు రాజ్యాన్ని పొంది, సీతను వెదకటానికి వందలకొద్దీ, వేలకొద్దీ వానరులను అన్ని దిక్కులకూ పంపాడు. పిమ్మట వానరకోటులతో కూడి నేను సీతను అన్వేషిస్తూ దక్షిణ దిక్కుగా బయలుదేరాను. వృద్ధుడు అయిన సంపాతి 'రావణుని గృహంలో నిర్బంధింపబడిన'దని సీత వృత్తాంతాన్ని వివరించాడు. రాముని కార్యసిద్ధికై నేను నూరు యోజనాల సముద్రాన్ని శీఘ్రంగా ఎగిరి, ఆవలి ఒడ్డుకు చేరాను. నేను మొసళ్ళతో నిండిన సముద్రాన్ని నా బలంతో దాటి దివ్యసౌందర్యం గల సీతాదేవిని రావణుని లంకలో చూశాను. రాఘవపత్నిని - సీతను అశోకవనంలో కలిసి ప్రాకారాలు, అంతస్థుల భవనాలు, తోరణద్వారాలు కల లంకను తగులబెట్టి శ్రీరాముని పేరును చాటి చెప్పి, తిరిగి వచ్చాను. నా మాటలు విని, తామరల వంటి కళ్ళు గల రాముడు ఆలోచించి, సముద్రంపై ఆనకట్ట కట్టి, సైన్యంతో సహా వానరకోటులతో మహాసముద్రాన్ని దాటాడు. తరువాత రాముడు యుద్ధంలో బంధుమిత్ర పరివార సమేతంగా రాక్షసవీరుల్ని, లోకకంటకుడైన రావణుని చంపివేశాడు.

రావణుని చంపి, రాముడు ధార్మికుడైన విభీషణుని లంకారాజ్యానికి రాజుగా చేశాడు. నష్టపోయిన వేదవిద్య వలె రామునిచే తన భార్య తిరిగి తీసుకొని రాబడింది. సాధ్వియైన సీతతో కలిసి రాముడు వేగంగా అయోధ్యాపురికి తిరిగివచ్చాడు. పిమ్మట శ్రీరాముడు అయోధ్యా రాజసింహాసనంపై ఆసీనుడైనాడు. ఆ సమయంలో రాముని ఒక వరం అడిగాను. నీ కథ లోకంలో శాశ్వతంగా ఉన్నంతవరకు నేను జీవించే వరం ఇయ్యి. అని. రాముడు సంతోషించి వెంటనే అంగీకరించాడు. 'భీమసేనా ! ఆ సీతాదేవి కృపచే ఇక్కడ నివసిస్తూ స్వేచ్ఛానుసారంగా దివ్యభోగాల్ని అనుభవిస్తున్నాను. రాముడు పదకొండు వేల సంవత్సరాలు రాజ్యం చేసి తరువాత తన వైకుంఠానికి చేరాడు. ఈ స్థానంలో అప్సరసలు, గంధర్వులు రాముని గుణగానం చేస్తూ నన్ను ఆనందపరుస్తున్నారు.

ఈ మార్గం మనుష్యులకు ప్రవేశింపవీలైంది కాదు. అందుకే నేను దేవతలు సేవించే దారిని అడ్డగించి పడుకొన్నాను. ఈ మార్గంలో వస్తుండగా ఎవడు నిన్ను అడ్డుకోలేదు. శపించలేదు. ఇది దేవతలు సంచరించే దారి. మానవులు సంచరించలేరు. నీవు వెళ్ళాలనుకున్న ఆ సరోవరం ఇదే.'

149. హనుమంతుడు యుగధర్మాలు వర్ణించుట.

హనుమంతుడు పలికిన మాటలకు భీమునికి చాలా ఆనందం కలిగింది. నమస్కరించి, ఆనంద పరవశత్వంతో హనుమంతుని గూర్చి మధురంగా మాట్లాడుతూ "నాకంటె ధన్యుడు వేరొకడు లేడు. కపిశ్రేష్ఠుడవు, పూజ్యుడవు అయిన నీ దర్శనం నాకు దక్కింది. నీవు నాపై ఎంతో దయచూపావు. నీ దర్శనంతో నాకు చాలా తృప్తి కలిగింది. నేను నీ ద్వారా నాకిష్టమైన పనిని పూర్తి చేసుకోవాలి అనుకొంటున్నాను. సముద్రం దాటినప్పటి సాటిలేని నీరూపాన్ని చూడాలని భావిస్తున్నాను. నాకు సంతృప్తి కలుగుతుంది. నీ మాటలపై నాకు నమ్మకం ఏర్పడుతుంది." ఇలా పలికిన వెంటనే నవ్వి, తేజోవంతుడైన హనుమంతుడు భీమునితో అన్నాడు. "నీవు నా పూర్వరూపాన్ని చూడలేవు. ఇతరులు ఎవరూ కూడ చూడలేరు. ఇప్పటి సమయానికి అప్పటి సమయానికి చాలా తేడా ఉంది. కృతయుగ సమయం వేరు, త్రేతాయుగ, ద్వాపరాల్లో వేరు, ఇది అన్ని వస్తువుల్ని నాశనం చేసే సమయం. అలాంటి రూపం నాకు కూడ ఇప్పుడు లేదు. భూమి, నదులు, పర్వతాలు, సిద్ధులు, దేవతలు, మహర్షులు ఆనాడు కాలాన్ని అనుసరించారు. యుగాన్ని, కాలాన్ని అనుసరించి శరీరం, బలం, ప్రభావాల్లో తేడా గోచరిస్తుంది. పెరుగుతూ, తరుగుతూ ఉంటాయి. నీవు ఆ రూపం చూడాలని పట్టుపట్టవద్దు. నేనుకూడ యుగ ధర్మాన్ని అనుసరిస్తాను. **కాలాన్ని అతిక్రమించటం ఎట్టి వానికైనా అసాధ్యం.** వెంటనే భీముడు "యుగాలు ఎన్ని? వాటి ఆచారాలు ఏవి ? ధర్మ, అర్థ, కామ తత్త్వాములు, శుభాశుభ కర్మలు, వాని ప్రభావాలు, ఉత్పత్తి వినాశాల గురించి తెలియజెయ్యి." అన్నాడు.

హనుమంతుడు పలికాడు - "అన్నింటికంటె మొదటిది కృతయుగం. అప్పుడు ధర్మం పరిపూర్ణంగా ఉంది. ఆ ఉత్తమయుగంలోని ప్రజలు వారి కర్తవ్యాల్ని చక్కగా ఆచరించారు. వారు చెయ్యాల్సిన పనులు మిగలలేదు. కావున **కృతయుగం** అనే పేరు వచ్చింది. ఆ యుగంలో ధర్మాలు క్షీణించలేదు. పిల్లలు తల్లిదండ్రు లుండగా చనిపోలేదు. కొంత కాలానికి ఆ యుగంలో ప్రాధాన్యత తగ్గసాగింది. దేవతలు, దానవులు, గంధర్వులు, యక్షులు, రాక్షసులు నాగులు వీరికి పరస్పరం భేదభావం లేదు. 'అమ్మోట - కొనుట'

అనే వ్యవహారమే లేదు. ఋగ్వేద, యజుర్వేద, సామవేదాల, మంత్ర, అక్షరాలలో విభాగం లేదు. వ్యవసాయాదులు లేవు. చింతన ధ్యానం చేతనే అందరికీ ఆ ఫలం వచ్చేది. **సత్యయుగంలో ఒకే ధర్మం ప్రధానం. అది త్యాగం. సన్యాసం.** ఆ యుగంలో జ్వరాదులు, ఇంద్రియనాశం, అసూయ, దుఃఖాలవల్ల వచ్చే రోదనలు, గర్వం, వికారం కూడా లేవు. యుద్ధాలు, సోమరితనం, ద్వేషం, చాడీలు చెప్పటం, భయం, దుఃఖం, ఈర్ష్య, పరోత్కర్ష చూడలేకపోవటం లేవు. యోగులకు ఆశ్రయం, శ్రేష్ఠమైన బ్రహ్మ స్వరూపుడు, సర్వప్రాణుల అంతరాత్మ అయిన నారాయణుడు శుక్ల వర్ణంతో ఆ యుగంలో ప్రకాశించాడు. బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు స్వభావసిద్ధం అయిన శుభ లక్షణాలు కలిగి ఉన్నారు. ఈ యుగంలో ప్రతివారు తమతమ కర్తవ్యాలు నిర్వహించటంలో తత్పరులై ఉన్నారు. పరమాత్మయే అందరికీ ఆశ్రయింపదగినవాడు అయ్యాడు. అతనిని పొందటానికి సదాచారాలు పాటించాలి. అందరూ పరమాత్మ జ్ఞానాన్ని పొంది తీరాలి. పరబ్రహ్మను ఉద్దేశించే వారు సత్కర్మల్ని ఆచరించాలి. ఇలా ఉత్తమ ధర్మాలఫలం లభించింది. ఆ యుగంలోని ప్రజలు పరమాత్మయందే మనస్సులు లగ్నంచేశారు. ఒకే నామమంత్రాన్ని, విధుల్ని ఆచరించేవారు. వర్ణాశ్రమాల్ని బట్టి వేరువేరుగా ధర్మాలు ఉన్నా ఒకే వేదాన్ని, ఒకే మంత్రాన్ని ఆచరిస్తూ ధర్మబద్ధులై ఉండేవారు. సత్యయుగంలో ప్రజలు సకాలంలో చేసే నాలుగు ఆశ్రమాలకూ సంబంధించిన అనుష్ఠానం ఆచరించి, కర్మఫలాలపట్ల ఆసక్తి కోరిక లేక పోవడం వల్ల ఉత్తమగతుల్ని పొందారు. చిత్తవృత్తుల్ని పరమాత్మపై నిలిపి అతనితో ఆత్మను అనుసంధానం చేసే ధర్మం కృతయుగంలో ఉంది. చాతుర్వర్ణ్యానికి ధర్మం నాలుగు పాదాలతో సంపూర్ణంగా ఉంది. సత్త్వరజస్తమోగుణ ప్రాబల్యం లేనిది కృతయుగం.

త్రేతాయుగాన్ని గురించి విను. ఈ యుగంలోనే యజ్ఞాలు ప్రారంభం అయ్యాయి. ఈ యుగంలో ధర్మం యొక్క ఒక పాదం నశించింది. అచ్యుతుడు ఎఱ్ఱటిరంగులో ఉంటాడు. ప్రజలు సత్యతత్పరులు, యథావిధిగా యాగాలు, ధర్మం ఆచరించేవారు త్రేతాయుగంలో యజ్ఞధర్మాలు, సత్కర్మలు ప్రారంభం అయ్యాయి. ప్రజలు తమ సంకల్పానుసారం వేదోక్త కర్మలను, దానం ద్వారా అభీష్టాల్ని పొందేవారు. త్రేతాయుగంలో మనుష్యులు ధర్మ, తపో, దానాదుల నుంచి చలించకుండా ఆచరించారు. స్వధర్మ పరాయణులై, క్రియాపరులై ప్రవర్తించారు.

ద్వాపరయుగంలో ధర్మం రెండు పాదాలతో నడిచింది. విష్ణువు పచ్చటి రంగు కలిగి ఉన్నాడు. వేదం నాలుగు రకాలుగా ఋగ్యజుస్సామాథర్వలుగా ఏర్పడింది. నాలుగు వేదాలు తెలిసినవారు, కొంతమంది మూడువేదాలు తెలిసినవారు, రెండువేదాలు తెలిసినవారు

ఒకవేదమే, తెలిసినవారు, కొంతమంది కొన్ని ముక్కులు కూడ తెలియనివారై ఉన్నారు. శాస్త్రాలు భిన్నభిన్నాలు కాగా క్రియలు కూడ అనేకవిధాలు అయ్యాయి. తపస్సు, దానమందే ప్రజలు ప్రవర్తించటం చేత ప్రవృత్తి ఏర్పడింది. ద్వాపరంలో ఒక్కవేదజ్ఞానమూ పూర్తిగా లేనందున వేదాలు అనేకంగా విభాగం పొందాయి. ఈ యుగంలో సాత్త్వికబుద్ధి లోపించినందువల్ల సత్యమందు కొద్దిమందే నిలిచారు. సత్యం పలకకపోవడం వలన వ్యాధులు అనేకం పుట్టాయి. కోరికలు, ఉపద్రవాలు దైవసంబంధాలై పీడించసాగాయి. ప్రజలంతా బాధలకు గురియై తపస్సు ఆచరించారు. కోరికలు తీర్చుకోవడానికి స్వర్గప్రాప్తి కోసం ఇతరులు యజ్ఞాలు చేశారు. ఇలా ద్వాపరయుగం వచ్చిన మీదట అధర్మపరులై ప్రజలు క్షీణించసాగారు. కలియుగంలో మాత్రం ధర్మం ఒక్కపాదమే మిగిలి ఉంది. తామసయుగ ప్రభావంచేత కేశవుడు కృష్ణుడు నల్లబడినాడు. వేదాచారాలు, ధర్మయజ్ఞ క్రియలు సన్నగిల్లాయి. ఈతి బాధలు, వ్యాధులు, సోమరితనం, క్రోధాది ఉపద్రవాలు, మనోవ్యధలు, ఆకలిబాధలు ఒక్కసారిగా విజృంభిస్తాయి. యుగాలు మళ్ళీ మారుతుండగా ధర్మం పెరుగుతుంది. తరుగుతుంది, ధర్మం క్షీణమైతే లోకం క్షీణిస్తుంది. లోకం నశిస్తే దానివల్ల కలిగే భావాలు నశిస్తాయి. యుగనాశం వల్ల ఏర్పడిన ధర్మాలు మనుష్యుల అభీష్టాలకు విపరీతఫలాల్ని ఇస్తాయి. ఇదే కలియుగవర్ణన, అచిరకాలంలో వస్తుంది. చిరంజీవులైనా ఈ విధంగా యుగధర్మాన్ని అనుసరించితీరాలి. **నీవు వా పురాతన రూపాన్ని చూడడానికి కుతూహలం చూపావు. అది పరికాదు. తెలివైనవాడికి నిష్ప్రయోజన విషయాలపై ఆసక్తి ఉండదు.** యుగాల సంఖ్య విషయంలో నీవు అడిగాన దానికి సమాధానంగా ఇదంతా నీకు చెప్పాను. నీకు కళ్యాణమగుగాక, నీవు వెళ్లిరా."

150. తన పూర్వశరీరమును హనుమంతుడు చూపుట, చాతుర్వర్ణ్య ధర్మ ప్రకటనము.

భీమసేనుడు పలికాడు – "నీపూర్వరూపాన్ని చూడక ఏ విధంగాను వెనుతిరగను. నీవు నన్ను అనుగ్రహించి నీ రూపాన్ని నాకు చూపించు." ఇలా పలికిన భీముని మాటలు విని, హనుమంతుడు సాగరలంఘన సమయంలో ఉన్న రూపం చూపించాడు. సోదరుని హితం కోరి తన స్వరూపాన్ని తిరిగి తెచ్చుకున్నాడు. అతని శరీరం ఎత్తు, పొడుగు, వెడల్పులలో నమ్మలేనంతగా విస్తరించింది. అమితతేజస్వి హనుమంతుడు చెట్లతో సహితంగా ఆ అరటితోపును కప్పి, గంధమాదనం కంటె ఉన్నతమై ఎదుట నిలిచాడు. విశాలమైన,

ఉన్నతమైన అతని శరీరం రెండవ పర్వతంలా ఉంది. ఎఱ్ఱటి కళ్ళు, పదునైన కోరలు, వంగిన కనుబొమలు కలిగి ఉన్నాడు. ఆ వానరవీరుడు తన తోకను అటూ ఇటూ త్రిప్పుతూ దిక్కుల వరకు వ్యాపించి కనిపించాడు. అనిర్వచనీయ మయిన ఆ సోదరుని రూపాన్ని చూచి భీముడు ఆశ్చర్యపడ్డాడు. మాటిమాటికి రోమాంచం కలిగింది. హనుమంతుడు తేజంలో సూర్యుడిలా కనిపించాడు. బంగారు పర్వతంలా అతని శరీరం మెరుస్తోంది. అతని శరీరకాంతితో ఆకాశం మెరుస్తూంటే చూడలేక భీముడు కళ్ళు మూసుకున్నాడు. హనుమంతుడు నవ్వుతూ భీమసేనునితో అన్నాడు. 'నా ఈ పెద్ద రూపాన్ని మాత్రమే నీవు చూశావు. ఇంతకన్నా నేను పెరగగలను. ఆ రూపాన్ని నీవు చూడలేవు. నా మనస్సు ఎంత కావాలనుకొంటుందో అంత రూపం నాకు వస్తుంది. భయానక శత్రువుల ఎదుట నా రూపం మరింతగా పెరిగిపోతుంది.

హనుమంతుని భయంకరాకారం వింధ్యపర్వతంతో సమానంగా ఉంది. రౌద్రంగా ఉంది. అది చూచి భీముడు కంగారుపడ్డాడు. భీముని శరీరంపై పులకాంకురాలు కలిగాయి. చేతులు జోడించి ఉదార హృదయంతో ఎదుట నిలబడి హనుమంతునితో అన్నాడు. 'మహానుభావా ! నీ శరీర వైశాల్యం ప్రత్యక్షంగా చూచాను. నీవు నీ అంతట నీ శరీరాన్ని తగ్గించు. నీవు ఉదయించిన సూర్యునివలె వెలిగిపోతున్నావు. నేను నీవైపు చూడలేను. నీవు సాటిలేని మైనాక పర్వతంలా కనిపిస్తున్నావు. నేడు నా మనస్సులో ఈ విషయాన్ని ఆలోచిస్తే ఆశ్చర్యం కలుగుతోంది. నీవు ప్రక్కనే ఉండగా శ్రీరాముడు రావణసంహారం చేశాడు. నీవు ఒక్కడివే బాహుబలాన్ని ఆశ్రయించి యోధులు, వాహనాలతో కూడిన లంకను వేగంగా నాశనం చేయ సమర్థుడవు. నీకు అసాధ్యం ఏదీ లేదు. యుద్ధభూమిలో సైనికులతో సహా కలిసినా కూడా రావణుడు నిన్నొక్కడినీ ఎదిరించలేడు.' భీముని మాటలు విని హనుమంతుడు మాటల్లో స్నేహం, గాంభీర్యం కనిపించేలా ఇలా అన్నాడు. 'నీవు పలికినది నిజమే. ఆ రాక్షసాధముడు నిజానికి నాకు ఎదురుపడ లేడు. లోకకంటకుడు రావణుడు నాచేతుల్లో చస్తే శ్రీరాముని కీర్తి తగ్గి ఉండేది అని ఉపేక్షించాను. పరాక్రమవంతుడైన రాముడు రాక్షస గణసహితంగా రావణుని చంపి సీతను అయోధ్యకు తీసుకొనివచ్చాడు. దీనివల్ల మనుష్యుల్లో ఆయన కీర్తి విస్తరించింది. తెలివిగలవాడా ! నీవు సోదరుని హితం కోరి వాయుదేవునిచే రక్షింపబడుతూ క్లేశంలేని, కుశల మయిన దారిలో నడు. ఇదీ సౌగంధికవనానికి పోయేదారి. ఇది యక్షరాక్షసులచే రక్షింపబడే కుబేరుని ఉద్యానవనం. అక్కడకు చేరి వెంటనే ఆ సరోవరంలోని పూలను కోయవద్దు. ప్రత్యేకించి మనుష్యులచే దేవతల రూపాలు గౌరవింపతగినవి."

పూజ, హోమం, నమస్కారం, మంత్రం, భక్తిభావం ఉంటే దేవతలు ప్రసన్నులై దయచూపుతారు. నీవు దుస్సాహసం చేయవద్దు. నీ ధర్మాన్ని ఆచరించు స్వధర్మనిష్ఠుడవై పరమధర్మాన్ని తెలిసి ఆచరించు. ధర్మస్వరూపం తెలియక, పెద్దల్ని సేవింపక బృహస్పతి సమానులైనా ధర్మార్థాలు తెలుసుకొనలేరు. ఒక్కొక్కప్పుడు అధర్మం ధర్మంగాను, ధర్మం అధర్మం గాను పిలువబడుతుంది. ధర్మాధర్మాల స్వరూపం వేరుగా తెలుసుకోవాలి. బుద్ధిహీనులు ఈ విషయంలో మోహాన్ని పొందుతారు. సదాచారం వల్ల ధర్మం ఏర్పడుతుంది. ధర్మమందే వేదాలు స్థిరపడ్డాయి. వేదాలవల్ల యజ్ఞాలు పుట్టాయి. యజ్ఞాల చేతనే దేవతల ప్రతిష్ఠ నిలబడుతోంది. వేదాచార విధానాలు చెప్పే యజ్ఞాల ద్వారా దేవతల జీవనం నడుస్తోంది. బృహస్పతి శుక్రాచార్యుడు చెప్పిన నీతులే మానవులకు రక్షకాలు. అంగళ్ళు, పన్నులు, వర్తకాలు, వ్యవసాయం, గోవులు, మేకల,గొట్టెల పెంపకం, ఇలాంటి ధర్మానుకూలాలైన జీవనవృత్తుల ద్వారా మూడువర్ణాలవారు అందరూ లోకాన్ని రక్షిస్తున్నారు. వేదత్రయం, వార్త, దండనీతి ఇది క్రమంగా బ్రాహ్మణుల, వైశ్యుల, క్షత్రియుల జీవికను నిర్వహించేవి. తెలివైన వారిచే ఈ వృత్తులు సరిగా ప్రయోగింపబడటంచేత లోకయాత్ర నిర్వహించబడుతోంది. లోకయాత్ర ధర్మంగా లేకపోతే, భూమిపై వేదోక్త ధర్మం పాలింపబడకపోతే, దండనీతి సక్రమంగా లేకపోతే ఇదంతా మర్యాదలేనిదవుతుంది. ప్రజలు కృషి, గోరక్ష, వాణిజ్యాలలో ఆసక్తులు కానియెడల నశిస్తారు. చక్కగా ప్రదర్శిస్తే ఈ మూడు వృత్తులూ ప్రజల్లో ధర్మాన్ని పెంచుతాయి.

ద్విజాతులకు ముఖ్యధర్మం సత్యమే. ఇది ధర్మం యొక్క ప్రధాన లక్షణం. యజ్ఞ, స్వాధ్యాయ, దానాలు మూడూ ద్విజుల సామాన్య ధర్మాలు. యజ్ఞాలు చేయించటం, చదువు చెప్పటం, దాన స్వీకారం బ్రాహ్మణుల లక్షణాలు. క్షత్రియులు పరిపాలన చెయ్యాలి. వైశ్యులు పశువుల్ని పోషించాలి. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యుల్ని సేవించటమే శూద్రుల ధర్మం. భైక్ష్యం, హోమం, వ్రతం లేకుండానే మిగిలిన వర్ణాల సేవయే వారికి ముఖ్యం. అందరినీ రక్షించటం క్షత్రియుల కర్తవ్యం. అందుకే నీధర్మం కూడ అదే. నీ ధర్మాన్ని నీవు ఆచరించు. వినయంతో, జితేంద్రియుడవై ఉండు. వృద్ధులతో, సత్పురుషులతో, బుద్ధిమంతులతో, వేదవిద్వాంసులతో చర్చించి వారి దయకులోనై దండనీతిని పాటించు. వ్యసనపరుడైన రాజుకు పరాభవం ఎదురౌతుంది. నిగ్రహాను గ్రహాలతో రాజు లోకాన్ని పరిపాలిస్తే లోకంలో మర్యాదలు, నియమాలు స్థిరపడతాయి. అందువలన దేశంలో, కోటలో తన శత్రువుల మిత్రుల సైనికుల స్థితి, వృద్ధి క్షయాల పరిస్థితి చారుల ద్వారా ఎప్పుడూ తెలుసుకుంటూ ఉండాలి. సామ, దాన, భేద, దండోపాయాలు, గుప్త చారులు,

ఉత్తమబుద్ధి, సురక్షిత మంత్రాంగం, పరాక్రమం, నిగ్రహానుగ్రహాలు సామర్థ్యం సర్వరాజులకూ కార్యసాధకాలు. సామ, దాన, భేద, దండ, ఉపేక్ష లనే నీతుల్ని విడివిడిగా గాని, అన్నింటిని గాని ప్రయోగించి కార్యాల్ని సాధించాలి. సకలరాజనీతులూ, గుప్తచారులూ మంత్రాంగంపై ఆధారపడి ఉంటాయి. ద్విజులతో చక్కగా సంప్రదించి నిర్ణయించిన మంత్రాంగం అన్నిచోట్ల ఫలిస్తుంది. స్త్రీ, మూఢ, బాల, లోభి, నీచపురుషులతో మంత్రాంగం చేయరాదు. వారిలో ఉన్మాద లక్షణం ఉంటుంది. **విద్వాంసులతో మంత్రాంగం చెయ్యాలి. సమర్థులచే పనుల చేయించాలి. స్నేహితులతో నీతులను ప్రయోగించాలి. మూర్ఖుల్ని పూర్తిగా విడచిపెట్టాలి.**

ధర్మకార్యాల్లో ధార్మికుల్ని, ధన విషయాల్లో అర్థశాస్త్ర పండితుల్ని, స్త్రీల విషయంలో నపుంసకుల్ని, కఠినమైన పనుల్లో క్రూరుల్ని నియమించాలి. కార్యప్రారంభంలో స్నేహితుల, శత్రుపక్షాల అభిప్రాయం తీసుకోవాలి. అటువంటి కార్యాకార్యవివేకబుద్ధితో శత్రువుల బలాబలాలను వారి పనులద్వారా తెలుసుకోవాలి. స్వబుద్ధితో ఆలోచించి, శరణాగతుల విషయంలో, శ్రేష్ఠమైన పనులు చేసేవారి విషయంలో అనుగ్రహం చూపాలి. మర్యాదల్ని మంటగలిపే వారియెడల దండనీతిని చూపించాలి. నిగ్రహానుగ్రహాల్లో ఉండి రాజు పరిపాలిస్తే లోకంలో మర్యాదలు (హద్దులు) సురక్షితాలై ఉంటాయి. నేను నీకు ఈ కఠోరరాజ్యధర్మాన్ని ఉపదేశించాను. దీని మర్మం తెలియటం అసాధ్యం. ధర్మాన్ని విభాగం చేసికొని వినయశీలివై దీన్ని ఆచరించు. తపస్సు, ధర్మం, ఇంద్రియనిగ్రహం, యజ్ఞాచరణల ద్వారా మానవులు (బ్రాహ్మణులు) స్వర్గాన్ని చేరుకొంటారు. దాన, ఆతిథ్య, రూప ధర్మాలతో వైశ్యులు ఉత్తమగతులు పొందుతారు. నిగ్రహానుగ్రహపాలనచే క్షత్రియులు స్వర్గాన్ని అందుకొంటారు. బాగా దండనీతిని ప్రయోగించి కామ,ద్వేష రాహితులై, లోభంలేక, కోపాన్ని విడచిన క్షత్రియులు సత్పురుషుల లోకాన్ని చేరుకొంటారు."

151. హనుమంతుడు భీముని ఊరడించి అంతర్ధానమగుట.

పిమ్మట స్వేచ్ఛగా పెంచిన రూపాన్ని తగ్గించి హనుమంతుడు భీముని గాఢంగా రెండు బాహువులతో కౌగిలించుకున్నాడు. సోదరుని కౌగిలించుకొన్న భీముని అలసట ఒక్కసారిగా నశించింది. అంతా అతనికి అనుకూలంగా సవ్యంగా కనపడసాగింది. బలశాలి భీమునికి తన బలం పెరిగిం దనిపించింది. 'నాతో సమానమైనవాడు లేడు' అనుకొన్నాడు. పిమ్మట హనుమంతుడు కళ్ళల్లో నీరు నిండగా సుహృద్భావంతో గద్గదస్వరంతో భీమునితో ఇలా పలికాడు. 'నీవు నీ నివాసానికి వెళ్ళు. ప్రసంగాల మధ్యలో అప్పుడప్పుడు నన్ను

తలచుకో. నేను ఇక్కడ నివసిస్తున్నాను అని ఎవరితోను చెప్పకు. కుబేరుని భవనాన్ని వదలివచ్చే దేవాంగనలు, గంధర్వ స్త్రీలు వచ్చే సమయం ఆసన్నమైంది. నిన్ను చూసిన నా కళ్ళు సఫలతను పొందాయి. నీవంటి మానవశరీర స్పర్శచే భగవంతుడైన శ్రీరాముని శరీర స్పర్శ గుర్తుకు వచ్చింది. శ్రీరాముడు సాక్షాత్తుగా శ్రీమహావిష్ణువు. జగత్తుకు పరిపూర్ణ ఆనందాన్ని ఇచ్చేవాడు. సీతాదేవి ముఖపద్మానికి సూర్యుడు. రావణుడు అనే చీకటిని పోగొట్టే సూర్యుడు. మనుష్యుల శరీర సంస్పర్శ నీ ద్వారా పొందాను. నాదర్శనం నీకు అమోఘమైన ఫలాన్ని ఇస్తుంది. నీవు నన్ను పెద్ద అన్నగా భావించి ఏదైనా వరం కోరుకో. నీ కోరిక అదే అయితే గజపురంలో ప్రవేశించి నీచులైన ధార్తరాష్ట్రుల్ని చంపివేస్తాను. రాళ్ళతో నగరాన్ని నాశనం చేసి నీవశం చేస్తాను. దుర్యోధనుని బంధించి నీవద్దకు తీసుకువస్తాను. నీ కోరిక ఏదైనా అది తప్పక తీరుస్తాను.'

ఆంజనేయుని మాటలు విని, భీమసేనుడు మిక్కిలి హర్షోల్లాసాలతో హనుమంతునితో అన్నాడు. 'నా పని అంతా మీరు చేసినట్లే భావిస్తాను. మీకు మంగళం అగుగాక! నా కోరిక ఏమంటే మీరు ఎల్లప్పుడు నా పట్ల దయతో ఉండండి. మీ అండతో పాండవులు సురక్షితు లైనట్లే. మీ ప్రభావంచే మేం మా శత్రువుల్ని జయిస్తాం.' ఇలా పలికిన భీముని మాటలు విని హనుమంతుడు 'సోదరుడవు అవటం వలన, స్నేహంవలన నీకు ప్రియాన్ని ఆచరిస్తాను. గ్రహించు. బాణశక్తిచే పీడితులైన శత్రువుల సేనలో ప్రవేశించి నీవు సింహనాదం చేసినప్పుడు దానితో కలిపి, నేను సింహనాదాన్ని చేసి దాని శక్తిని పెంచుతాను. నేను అర్జునుని రథంపై ధ్వజరూపంలో ఉండి భయంకర సింహనాదాల్ని చేస్తాను. శత్రువులను మీరు తేలికగా చంపగలరు' అని పలికి భీమునికి మార్గాన్ని తెలిపి హనుమంతుడు అక్కడే అంతర్ధానం అయ్యాడు.

152. భీముడు సౌగంధిక వనమునకు వెడలుట.

హనుమంతుడు అంతర్ధానం అయ్యాక బలశాలి భీముడు అతడు చెప్పిన దారిలో గంధమాదన పర్వతంపై తిరుగసాగాడు. దారిలో ఆయన రూపాన్ని, విశాల శరీరాన్ని, బంగారు రంగు కాంతిని తలచుకుంటూ శ్రీరాముని గొప్పతనం, ప్రభావం భావించుకుంటూ ముందుకు సాగాడు. సౌగంధిక వనం కోసం బయలుదేరి మధ్యలో అక్కడ సుందరవనాల్ని, ఉద్యానవనాల్ని చూశాడు. వికసించిన చెట్లతో విచిత్రమయిన, సరస్సులు, నదులు గల్గి, అనేక రకాల పుష్పాలతో ప్రకాశించే వనాల్ని పరికించాడు. శరీరమంతా బురదతో ఉన్న మదించిన ఏనుగుల గుంపుల్ని, కురవడానికి సిద్ధంగా ఉన్న మేఘాల్ని అవలోకించాడు.

నోటిలో గడ్డిపరకలు గల్గి, చంచలమైన కళ్లున్న ఆడులేళ్ళతో కూడిన మగ లేళ్ళను చూస్తూ భీమసేనుడు వేగంగా నడవసాగాడు. అడవిదున్నలు, అడవి పందులు పెద్దపులులు సంచరించే ఆ వనంలో నిర్భయంగా పరాక్రమంతో తిరుగసాగాడు.

అంతులేని పువ్వుల గంధాలతో, ఎట్టటి చిగురుటాకులతో మృదువైన గాలికి కదుల్తున్న చెట్లు అరణ్యంలో భీముని యాచిస్తున్నట్లు ఉన్నాయి. పద్మాలు అనే దోసిలి ఘటించి మదించిన తుమ్మెదలచే సేవింపబడే ప్రియతీర్థ వనాలనూ, నదులనూ మార్గంలో దాటుతూ పోతున్నాడు. భీముని మనస్సు, దృష్టి వికసించిన పర్వత సానువులందు లగ్నమైంది. ద్రౌపదీ వచనాలే అతనికి దారిలో ఆహారమయి శీఘ్రంగా బయలుదేరాడు. రోజు గడుస్తుండగా నాలుగువైపులా లేళ్ళు తిరిగే వనంలో బంగారు పద్మాలు గల విశాలానదిని వీక్షించాడు. ఆ నది హంసలు, కారండవాలు, చక్రవాక పక్షులతో ప్రకాశిస్తోంది. ఆ నది ఆ పర్వతానికి స్వచ్ఛసుందర పద్మాలతో దండను తయారుచేసి అర్పిస్తున్నట్లు ఉంది. ఆ నదిలో గొప్ప సౌగంధికవనాన్ని భీమసేనుడు చూశాడు. ఆ వనం ప్రభాతకాల సూర్యుని కాంతిలా ప్రీతిని కలిగిస్తోంది. ఆ వనాన్ని చూచి భీముడు మనస్సులో **"కోరిక తీరింది."** అని భావించి వనవాసంతో బాధపడే ద్రౌపదిని మనస్సులో గుర్తుచేసుకొన్నాడు.

153. కుబేరుని అనుచరులు భీమునిరాకను గురించి ప్రశ్నించుట.

వైశంపాయనుడు అన్నాడు - ఈ విధంగా ముందుకుసాగి భీముడు కైలాస పర్వత శిఖరంమీద రాక్షస గణంచేత రక్షింపబడే సుందరవనాన్నీ, రమణీయ సరోవరాన్నీ చూశాడు. ఆ సరస్సు పర్వతజలంతో నింపబడుతోంది. చూడటానికి చాలా అందంగా దట్టమైన నీడలు కలిగి ఎన్నో చెట్లు లతలతో వ్యాప్తమై ఉంది. ఆకుపచ్చని తామరలతో కప్పబడి ఆ సరోవరం ఉంది..బంగారు రంగు తామరపూలు ఉన్నాయి. అనేక జాతుల పక్షులు ఉన్నాయి. బురదలేని రేవులు చాల అందంగా కనిపించాయి. కొండచరియల మీద నుంచి జారే సుందర జలంతో నిండి ఆ సరోవరం చాలా అందంగా ఆశ్చర్యకరంగా లోకానికి మంగళకరంగా కనిపిస్తోంది. భీముడు ఆ సరోవరంలో అమృతపు రుచితో సమానమయిన చల్లని స్వచ్ఛమైన జలాన్ని పాట్టనిండా తాగాడు. ఆ సరోవరం దివ్యసౌగంధికాలతో నిండి (రమణీయంగా) ఉంది. సుగంధభరితం అయిన బంగారు తామరలతో కప్పబడి ప్రకాశిస్తోంది. ఆ తామరల కాడలు వైడూర్యపురంగులో ఉన్నాయి. చూడటానికి చిత్రంగా, అందంగా ఉన్నాయి. హంసలు కారండవాలు ఆ సరస్సులో తిరుగుతున్నాయి. నిర్మలమైన పుప్పొడి వాటికి అంటుకుంటోంది.

అది కుబేరుని క్రీడాస్థలం. గంధర్వులు, అప్సరసలు, దేవతలు దాని గొప్పతనాన్ని పొగడుతారు. దివ్యఋషి గణం, యక్షులు, కింపురుషులు, రాక్షసులు, కిన్నరులు దాన్ని సేవిస్తున్నారు. కుబేరుడే ప్రత్యేకశ్రద్ధతో దానికి రక్షణవలయం ఏర్పాటుచేశాడు. బలవంతుడు భీమసేనుడు ఆ సరస్సును చూచి మిక్కిలి ఆనందంతో ప్రసన్నుడయ్యాడు.

మహారాజు కుబేరుని ఆజ్ఞానుసారం క్రోధవశులనే రాక్షసులు చిత్రవిచిత్ర ఆయుధాలతో, వేషభాషలతో లక్షమంది దానిని పరిరక్షిస్తున్నారు. ఆ సమయంలో భయానక పరాక్రమాన్ని ప్రదర్శించ గల భీముడు లేడి చర్మాన్ని ధరించి ఉన్నాడు. బంగారు భుజాభరణాలు ధరించాడు. ధనుస్సు, గద మొదలైన ఆయుధాలు వ్రేలాడదీసుకున్నాడు.

శత్రువుల్ని చీల్చటంలో సమర్థుడు, భయం లేనివాడు, తామరల్ని తీసుకుపోవాలనే కాంక్షగల భీముని చూచిన ఆ రాక్షసుల మధ్య కోలాహలం బయల్దేరింది. 'నరశ్రేష్ఠుడు ఆయుధ ధారియై మృగచర్మాన్ని కప్పుకొని దేన్ని కోరి ఇక్కడకు వచ్చాడు? ఆడిగి తెలుసుకోవాలి.' అప్పుడు వారందరు వృకోదరుని సమీపించి 'నీవెవరవు ఎందుకు వచ్చావు? మునివేషం ధరించి, ఆయుధాలు గ్రహించి దేనికోసం వచ్చావు?' దాన్ని పూర్తిగా చెప్పు అని ప్రశ్నించారు.

154. భీముడు క్రోధవశులను జయించి సౌగంధికపుష్పాలు సంగ్రహించుట.

భీముడు పలికాడు - 'నేను పాండుమహారాజు కుమారుణ్ణి. ధర్మరాజు తరువాత పుట్టినవాణ్ణి. విశాల అనే పేరు గల బదరీతీర్థానికి చేరి సోదరులతో సహా ఉంటున్నాను. పాంచాల రాజకుమారి నా భార్య ద్రౌపది అక్కడ గాలివాటున పడిన సౌగంధిక పుష్పాన్ని చూచి, దాని పరిమళానికి ఆనందించి ఇంకా కొన్నింటిని కోరింది. నేను పవిత్రురాలైన ధర్మపత్ని కోసం, పుష్పాల్ని కానుకగా ఇవ్వాలని తీసుకుపోవడానికి వచ్చాను. రాక్షసులారా! తెలుసుకోండి.' రాక్షసులు పలికారు - 'ఇది కుబేరుని ఉద్యానవనం. అతనికి ఎంతో ఇష్టమైంది. మనుజధర్మాలు గల మనుష్యులు ఇక్కడ విహరింప వీలుకాదు. దేవర్షులు, యక్షులు, దేవతలు యక్షరాజు కుబేరుని అనుమతిపొంది, ఇక్కడి జలాన్ని త్రాగి, ఆనందిస్తారు. గంధర్వులు, అప్సరసలు ఈ నియమంతో ఇక్కడ విహరిస్తారు. దురాచారపరుడైన పురుషుడు ఎవడైనా కుబేరుని అవమానించి, ఈ ప్రదేశంలో విహరించాలి అనుకొంటే అతడు నశిస్తాడు. సందేహం లేదు. పైగా నీవు బలవంతంగా కుబేరుని ఆజ్ఞను ధిక్కరించి తామరల్ని అపహరింపకోరావు. ధర్మరాజు సోదరుణ్ణి అని పరిచయం చేసుకొన్నావు. అది ఎలా ? కుబేరుని అనుమతి ముందుగా తీసికొని ఈ సరోవరంలో నీరుత్రాగు, పువ్వులు

తీసుకో, లేకపోతే నీకు ఈసరోవరాన్ని చూడడానికి కూడ శక్యం కాదు.'

భీమసేనుడు అన్నాడు - 'రాక్షసులారా! నేను ఈ సమీపంలో ఎక్కడా కుబేరుణ్ణి చూడలేదు. చూచినా నేను నా అంతట యాచించను. "రాజులు యాచన చేయరాదు" అని సనాతన ధర్మం. ఆ క్షత్రియ ధర్మానికి నేను ఎన్నడూ హాని కలిగించను. ఈ అందమైన సరోవరం పర్వతపు సెలయేళ్ళతో ఏర్పడింది. ఇది కుబేరుని నివాసంలో లేదు. ఇందలి నీరు, ఈ సరోవరం అన్ని ప్రాణులకు, కుబేరునకు సమానంగా వాడుకొన వీలైనది. అందరికీ సంబంధించిన వస్తువుల విషయంలో ఒకరు వేరొకర్ని అడగాల్సిన పనిలేదు.' అని రాక్షసులందరితో పలికి బాహుబల సంపన్నుడు భీమసేనుడు అసహనంతో ఆ సరోవరంలో దిగాడు. ఆ సమయాన కోపించిన రాక్షసులు భీముని "వద్దు" అలా చేయవద్దు అని మాటలతో నివారించారు. భీముడు వారిని లెక్కచేయక సరోవరంలో దిగాడు. ఇది చూచి, వారు అతనిని ఆపటానికి గట్టిగా అరిచారు. 'ఇతన్ని పట్టుకోండి బాధించండి, నరకండి, వండుకు తిందాం.' అని కోపంతో పలుకుతూ కళ్ళు గిరగిరా తిప్పుతూ ఆయుధాలు పైకెత్తి అతని వైపు పరుగెత్తారు. వెంటనే భీముడు యమదండంతో సమానమయి బంగారు తాపడం గల మహాగదను తీసికొని వేగంగా వారిపై పడ్డాడు.. ఇలా అన్నాడు - 'ఆగండి. ఆగండి.' అని ! అది చూచిన క్రోధవశులు భీమసేనుని చంపటానికి తోమరాలు, పట్టిశాలు గ్రహించి, వేగంగా పరుగెత్తి, అతనిని నాలుగువైపుల నుంచి చుట్టుముట్టారు.

భీమసేనుడు కుంతీ గర్భం నుంచి వాయువు కారణంగా పుట్టాడు. శూరుడు, వేగవంతుడు, శత్రుహంతకుడు, సత్యధర్మాల్ని పాలించేవాడు, శత్రువులకు పరాక్రమంలో లొంగనివాడు. భీముడు శత్రువుల మార్గాల్ని, వారి శస్త్రాస్త్రాల్ని వేగంగా నాశనం చేసి, సరోవర సమీపంలో వందకుపైగా రాక్షసుల్ని చంపివేశాడు. వారు భీమసేనుని బలాన్ని, విద్యాబలాన్ని, పరాక్రమాన్ని బాహుబలాన్ని చూచి అందరూ కలిసినా ఎదిరింప లేక యుద్ధాన్ని విడిచి వెనుకకు తిరిగారు. భీమసేనుని దెబ్బలకు క్రోధవశులు, క్షతగాత్రులు అయ్యారు. ఆకాశానికి ఎగిరి, తెలివితప్పి, గాయాలు భరించలేక కైలాస శిఖరాల వైపు పారిపోయారు. శత్రువులను జయించగల భీమసేనుడు దైత్య దానవ సంహారం చేసినప్పటి ఇంద్రునితో సమమయిన పరాక్రమం చూపి, శత్రువులను మట్టుపెట్టి, సరోవరంలో ప్రవేశించి, స్వేచ్ఛగా బంగారు కమలాలను తీసుకొన్నాడు. తిరిగి అమృతంతో సమాన రుచిగల మధుర జలాన్ని త్రాగి తేజస్సు బలం పొందాడు. సుగంధభరితాలైన ఉత్తమ సౌగంధిక పుష్పాల్ని పెకలించి మరీ తీసుకున్నాడు. భీమబలపీడితులైన క్రోధవశులు,

భయభ్రాంతులై, ధనాధ్యక్షుడైన కుబేరుని చేరి, యుద్ధంలో వారు చూసిన భీముని బలపరాక్రమాల్ని వర్ణించి చెప్పారు. వారి మాటలు విని దేవశ్రేష్ఠుడు కుబేరుడు నవ్వి రాక్షసులతో అన్నాడు – 'భీముడు కావలసిన పుష్పా లన్నింటిని తీసుకొనుగాక! ద్రౌపదికొరకే అతడు వచ్చాడు అని నాకు తెలుసును.' కుబేరుని ఆజ్ఞ గైకొని వారు రోషంవిడిచి, భీముని వద్దకు పోయి, సరోవరతీరంలో ఒంటరిగా స్వేచ్ఛగా విహరిస్తున్న అతనిని చూశారు.

155. యుధిష్ఠిరాదులు గంధమాదనము చేరుట.

పిమ్మట భీముడు ఎన్నోరకాలై విలువైన, దివ్యమైన, నిర్మలమైన సౌగంధిక పుష్పాలను సంగ్రహించాడు. ఇంతలో గంధమాదన పర్వతంపై శీఘ్రంగా గాలి వీచసాగింది. అది ,రాళ్ళను, ఇసుకను పైకి తీసుకువస్తోంది. దాని తాకిడి తీక్ష్ణంగా ఉంది. ఏదో ఒక పెద్దయుద్ధం జరగబోతోందని సూచనగా చెప్తోంది. పిడుగుపాటుతో భయానకం అయిన ఉల్క భూమిపై పడింది. అంధకారం ఆవరించి సూర్యుడు శూన్యంగా కన్పించాడు. అతని కిరణాలు కప్పబడి ఉన్నాయి. భీముడు రాక్షసులపై పరాక్రమం చూపేటప్పుడు గొప్ప గర్జనతో భూమి కంపించింది. ధూళి వర్షంలా కురవసాగింది. దిక్కులు ఎఱ్ఱబడ్డాయి. మృగాలు, పక్షులు కఠోరంగా అరవసాగాయి. జగత్తు అంతా చీకటి ఆవరించి ఏ వస్తువూ కనపడకుండా పోయింది. ఇంతేకాక ఇంకా భయంకరాలైన ఉత్పాతాలు కనిపించాయి. అది చూచిన యుధిష్ఠిరుడు అన్నాడు – 'మనలను ఎవరు జయింపగలరు ? తమ్ములారా ! సిద్ధంగా ఉండండి. మీకు మేలు కలుగుతుంది. మనం పరాక్రమం చూపే సమయం ఆసన్నమయింది. నేను లక్షణాల్ని బట్టి గ్రహించాను.' అని పలికి తన్నివైపులా కలయజూచాడు. భీముడు కనిపించక ధర్మాత్ముడు యుధిష్ఠిరుడు ద్రౌపదిని, నకుల సహదేవులను సమీపించి, భీముని గురించి అడిగాడు.

"పాంచాల రాజపుత్రీ! భీముడు ఎక్కడ ? ఏ పని చేస్తున్నాడు ? సాహసశీలి భీముడు ఏదైనా సాహసకార్యాన్ని ఆచరించాడా? ఈ ఉత్పాతాలు ఆకస్మాత్తుగా సంభవించే గొప్ప సంగ్రామాన్ని సూచిస్తున్నాయి. ఇవి నాలుగువైపుల విజృంభించి భయాన్ని కలిగిస్తూ ఉన్నాయి." అలా పలికిన ధర్మరాజుతో చక్కగా నవ్వుతూ మనస్విని పట్టమహిషి ద్రౌపది ప్రియాన్ని కోరుతూ ఇలా పలికింది. "నేడు సౌగంధిక పుష్పం వాయువుచే ఎగురగొట్టబడి మాముందు పడింది. నేను ప్రసన్నతతో భీమునికి ఇచ్చి ఇలాంటి పుష్పాలు మరిన్ని నీవు చూచినట్లైతే వాటిని తీసుకొని శీఘ్రంగా ఇక్కడకురా." అన్నాను. "మహాబాహువులు గల భీముడు నా ప్రియంకోరి నిశ్చయంగా వాటిని తీసికొని రావాలని ఈశాన్య దిక్కుగా

బయలుదేరి వెళ్ళాడు." ద్రౌపది మాటలు విని యుధిష్ఠిరుడు "మనమందరం భీముడు పోయిన దారిలో తొందరగా వెడదాం" అని కవలలతో అన్నాడు. "ఘటోత్కచా ! నీపరిచారకులు అలసిన, కృశించిన బ్రాహ్మణులను మోయుగాక, నీవు కూడ ద్రౌపదిని వీపుపై ఎక్కించుకో. భీము డిక్కడికి దూరంగా వెళ్ళాడని నాకు అనిపిస్తోంది. ఇది నా విశ్వాసం. ఎందుకంటె అతడు వెళ్ళి చాల సమయం గడిచింది. అతడు వేగంలో వాయు సమానుడు.

వైనతేయునివేగంతో భూమిని దాటటంలో దిట్ట. ఆకాశంలోకి ఎగిరి స్వేచ్ఛగా ఎక్కడికైనా దుముకగలడు. రాక్షసులారా! మీ ప్రభావంచే ముందుగా భీముని వెదకుదాం. అతడు బ్రహ్మవాదులపట్ల అపరాధం చెయ్యకుండా ఉండేలోపు అతనిని చేరుదాం." 'అలాగే' అని పలికిన ఘటోత్కచాదులు కుబేరుని సరోవరం తెలిసినవారవడం చేత పాండవుల్ని, బ్రాహ్మణుల్ని లోమశునితో సహా వీపులపై ఎక్కించుకొని ఆనందంతో బయలుదేరారు. వారందరు వేగంగా పోయి సుందరవనస్థలిలో సౌగంధిక పుష్పాలతో నిండిన కొలను చూశారు. ఆ సరోవరతీరంలో భీమును వీక్షించారు. అతనిచే చంపబడ్డ పెద్దపెద్ద కన్నులు గల యక్షుల్ని కనుగొన్నారు. శరీరం తెగినవారు, కళ్ళు భుజాలు, తొడలు ఛిన్నాభిన్నమైన వారు, తలలు పగిలిన వారు ఆ సరోవరం తీరంలో ఉన్నారు. ప్రక్కనే భీముడు నిలబడి ఉన్నాడు. అతని క్రోధం తగ్గలేదు. కళ్ళు తెరిచినవి అలానే ఉన్నాయి. పళ్ళు, పెదవులు కొరుకుతున్నాడు. గదను చేతులతో త్రిప్పుతూ సరోవర తీరంలో అలాగే నిలబడ్డాడు. ప్రజానాశం చేసే సమయంలో దండధరుడైన యమునిలా ఉన్న అతన్ని చూచి ధర్మరాజు దగ్గరకు చేరి, ఎన్నోసార్లు కౌగలించుకున్నాడు. మధురవచనాలతో 'కొంతేయా! ఏం పని చేశావు! సాహసం ఎల్లవేళలా పనికిరాదు. నీకు మంగళమగుగాక. దేవతలకు అనిష్టాన్ని కలిగిస్తుంది. నా ప్రియాన్ని నీవు కోరితే మళ్ళీ ఇలాంటి సాహసం చేయవద్దు.' అని భీమునికి ఉపదేశం చేసి సౌగంధిక పుష్పాన్ని తీసుకొని ఆ సరోవరతీరంలో దేవతల్లా విహరించారు.

ఇంతలో శిలాయుధాలు గ్రహించిన మహాకాయులు ఆ ఉద్యానవన పాలకులు ప్రత్యక్షమై ధర్మజునికి, లోమశమహర్షికి, నకులసహదేవులకు ఇతర బ్రాహ్మణులకు శిరస్సులు వంచి వినయంతో నమస్కరించారు. ధర్మరాజు వారినందరినీ ఊరడించాడు. రాక్షసులు ప్రసన్నులయ్యారు. ఆ కురుశ్రేష్ఠులు కుబేరుని ఆధీనంలో కొంచెం కాలం గడిపి, ఆనందాన్ని అనుభవించి, గంధమాదన పర్వత సానువుల్లో అర్జునుని రాకకై ఎదురు చూడసాగారు.

156. అశరీరవాణి ఆదేశము - పాండవులు నరనారాయణుల ఆశ్రమము చేరుట.

వైశంపాయనుడు పలికాడు - అక్కడే సౌగంధికసరోవర తీరంలో నివసిస్తూ ఒకరోజున ధర్మరాజు ద్రౌపదితో, సోదరులతో, బ్రాహ్మణులతో ఇలా అన్నాడు. "మనం అనేక తీర్థాలను చూశాం. మనస్సుకి ఆహ్లాదాన్ని కల్గించే అనేక వనాలను మనం వీక్షించాం. ఇవన్నీ పూర్వకాలం దేవతలు, మునులు సంచరించిన ప్రదేశాలు. క్రమంగా పెద్దల ఆజ్ఞ ప్రకారం వీటిలో మునిగి ఫలితం పొందాం. మనం ఋషుల పూర్వచరిత్ర, వారి పవిత్ర కర్మలు, రాజర్షుల కథలు విన్నాం. మంగళకరమైన ఆశ్రమాలు తిరిగాం. ప్రత్యేకించి బ్రాహ్మణులతో సహా తీర్థాల్ని సేవించాం. మనం ఎల్లప్పుడు పుష్పాలతో, జలంతో దేవతల్ని అర్చిస్తున్నాం. ఆయా ప్రదేశాల్లో లభించిన ఫలాలతో పితరుల్ని పూజించాం. సుందర పర్వత ప్రదేశాల్లో, రమ్యమైన సరస్సుల్లో, పవిత్రమైన సముద్రజలాల్లో, మహాత్ములతో కలిసి స్నానాచమనాలు చేశాం. ఇలా, సరస్వతి, సింధువు, యమున, నర్మద మొదలగు తీర్థాల్లో బ్రాహ్మణులతో కలిసి పవిత్రస్నానాలు, ఆచమనాలు ఆచరించాం. హరిద్వారాన్ని దాటి అందమైన పర్వతాల్ని చూశాం, హిమవత్పర్వతం అనేకరకాలైన బ్రాహ్మణులతో కూడి ఉంది. విశాలమైన బదరీతీర్థం, దాన్ని ఆనుకొని ఉన్న నరనారాయణాశ్రమం, సిద్ధులు, దేవర్షులు పూజించే దివ్యసరోవరం దర్శించాం. మహాత్ముడు లోమశుడు యథాక్రమంగా మందిరాల, పుణ్యప్రదేశాల దర్శనం చేయించాడు. ఇది సిద్ధులు సేవించే కుబేరుని నివాస స్థానం. ఇప్పుడు మనం కుబేర భవనంలో ప్రవేశించడానికి ఉపాయం ఆలోచించు."

ఇలా ధర్మరాజు పలికేసరికి అశరీరవాణి సమాధానం ఇచ్చింది. "ఈ కుబేరుని నివాసం నుండి ముందుకు పోవటం అసాధ్యం. ఏ దారిలో నీవు ఇక్కడకు వచ్చావో అదే దారిలో బదరీ అనే నరనారాయణాశ్రమానికి తిరిగివెళ్ళు. అక్కడి నుంచి నీవు సిద్ధ చారణులు సేవించే చాల పుష్పఫలాలున్న వృషపర్వుని ఆశ్రమం చేరతావు. అదిదాటి ఆర్ష్టిషేణాశ్రమంలో ఉండు. అక్కడ కుబేరుని నివాసస్థానం దర్శిస్తావు." ఇంతలో దివ్య సుగంధభరితం, పవిత్రం, ఆహ్లాదకరం , శీతలం అయిన వాయువు వీస్తూ పుష్పవర్షం కురిసింది. ఆకాశం నుంచి దివ్యవాణిని విని అందరూ ఆశ్చర్యపోయారు. ఋషులకు, బ్రాహ్మణులకు విశేషంగా రాజర్షులకు ఆశ్చర్యం కలిగింది. ఆ ఆశ్చర్యకరమైన మాటల్ని విని ధౌమ్యమహర్షి ఇలా అన్నాడు. "దీనికి సమాధానం ఇవ్వటం మనకు సాధ్యంకాదు. ఇలా జరగనివ్వండి." ఆ మాటలను ధర్మరాజు స్వీకరించి నరనారాయణాశ్రమానికి తిరిగివచ్చి, భీమసేనాది సోదరులతో, ద్రౌపదితో సుఖంగా నివసించాడు. అతనితో ఉన్న బ్రాహ్మణులు

కూడ ఆతని సంరక్షణలో సుఖంగా ఉన్నారు.

157. జటాసుర వధ.

గంధమాదనపర్వతంమీద పాండవులంతా బ్రాహ్మణులతో కలిసి అర్జునుని రాకకోసం నిరీక్షిస్తున్నారు. రాక్షసులూ, ఘటోత్కచుడూ వెళ్లిపోయారు. తరువాత ఒక రోజున భీముడు లేకుండా చూసి ఒకరాక్షసుడు బ్రాహ్మణరూపంలో ధర్మరాజును, నకులసహదేవులను, ద్రౌపదిని ఎత్తుకొనిపోయాడు. ఆ బ్రాహ్మణుడు మంత్రనిపుణుడ ననీ, అన్ని శాస్త్రాలు తెలిసినవాడ ననీ చెప్పుకొని పాండవులను నిత్యమూ సేవిస్తున్నాడు. వాడు పాండవుల ధనుస్సులూ మొదలయినవానినీ, ద్రౌపదినీ ఎత్తుకొనిపోవాలని సమయంకోసం నిరీక్షిస్తున్నాడు. వాడు దుర్మార్గుడు - పాపాత్ముడు. వాడి అసలు పేరు జటాసురుడు. (వాడే అందరినీ ఎత్తుకుపోయాడు.) ఆ విప్రుని పోషణభారమంతా ధర్మరాజే వహించేవాడు. వాడు పాపాత్ముడనీ, నివురుగప్పిన నిప్పు అనీ ధర్మరాజుకు తెలియదు. ఒకరోజున భీముడు వేటకు వెళ్లాడు - ఘటోత్కచుడూ అనుచరులూ వెళ్లిపోయారు. లోమశుడు మొదలయిన మహర్షులంతా స్నానాలు చెయ్యడానికీ, పూలు కోసుకొనడానికీ వెళ్లారు. ఆ సమయం చూసి ఈ బ్రాహ్మణరూపంలోనివాడు వికృతమైన రాక్షసరూపం దాల్చి, పాండవుల ఆయుధాలనూ, ద్రౌపదినీ, ముగ్గురు పాండవులనూ ఎత్తుకొని పారిపోయాడు. సహదేవుడు ప్రయత్నంతో ఎలాగో తప్పించుకొని బయటపడ్డాడు. వెంటనే అతడి దగ్గరున్న ఆయుధాల్లోంచి ఒక కత్తిని లాగి, భీముడు వెళ్లినవైపు చూసి కేకలు పెడుతూ పరుగెత్తాడు. ధర్మరాజు జటాసురునితో 'మూర్ఖుడా! నీధర్మం తరిగిపోతోంది. దానిపై నీవు దృష్టిసారించటంలేదు మనుష్యులు, పశుపక్ష్యాది ఇతర ప్రాణులన్నీ ధర్మంపై దృష్టి నిలుపుతాయి. విశేషించి రాక్షసులు ధర్మంపై మరింత దృష్టి నిలుపుతారు.

రాక్షసులు ధర్మానికి మూలం. ఉత్తమమైన ధర్మం వారికి తెలుసు. ఇదంతా పరిశీలించి నీవు మా దగ్గర నిలు. రాక్షసా! దేవతలు, ఋషులు, సిద్ధులు, పితృదేవతలు, గంధర్వులు, ఉరగులు, రాక్షసులు, పక్షులు, జంతువులు అలాగే పురుగులు, చీమలు మొదలైనవి మనుష్యులపై ఆధారపడి బ్రతుకుతున్నాయి. నీవు కూడ మనుష్యులవల్లే బ్రతుకుతున్నావు. ఈ మనుష్యలోకం సమృద్ధిగా ఉంటే (లోటు లేనిదై ఉంటే) మీ అందరి లోకాలకు లోటుండదు. ఈ లోకం స్థితి బాధాకరమైతే దేవతలు కూడ శోకంలో మునుగుతారు. మనుష్యులచేత యథావిధిగా హవ్యకవ్యాలతో పూజింపబడితేనే దేవతలకూ వృద్ధి కలుగుతుంది. రాక్షసా! మేము రాష్ట్రపాలకులం, సంరక్షకులం కూడా. రాష్ట్రం

రక్షించబడకపోతే ఐశ్వర్య మెక్కడినుండి వస్తుంది? సుఖ మెలా కలుగుతుంది? నిరపరాధియైన రాజును అవమానించటం రాక్షసుడికైనా తగనిపని. నరభక్షకా! మావైపునుండి మీపట్ల అణువంత అపచారమైనా జరుగలేదు. దేవతలకు సమర్పించి మిగిలిన ప్రసాదరూపమైన అన్నాన్ని, శక్తిమేరకు గురువులకు, బ్రాహ్మణులకు భోజనంగా అందిస్తాం. ఎల్లవేళలా గురువులకు, బ్రాహ్మణులకు తలవంచి నమస్కరిస్తాం. **ఏ వ్యక్తీ ఎన్నడూ స్నేహితులకూ; నమ్మినవారికీ ద్రోహం చెయ్యకూడదు. ఎవరి అన్నం తిన్నామో, ఎవరివల్ల ఆశ్రయం పొందామో వారికి ద్రోహం చెయ్యటం తగదు.** నీవు మాచేత గౌరవింపబడుతూ మా ఆశ్రయంలో సుఖంగా ఉన్నావు. దుర్మార్గుడా! మా అన్నం తిని మమ్మల్నే హరించాలని నీకెట్లా అనిపించింది? బ్రాహ్మణుని వేషంలో ఆచరించినదంతా వృథా. పెద్దరికం వృథా. నీబుద్ధి కూడ వృథాయే. ఈపరిస్థితివల్ల నీవు వ్యర్థంగా చావుకు చిక్కవలసి వచ్చింది. నేడు వృధాగా నీప్రాణం పోగొట్టుకోబోతున్నావు. దుష్టబుద్ధివై అన్నిధర్మాలను విడిచావు. మాకు ఆయుధాలనందించి, యుద్ధంలో గెలిచి ద్రౌపదిని పట్టుకెళ్ళు. అజ్ఞానంచేత, నమ్మకద్రోహం, ఎత్తుకుపోవటంలాంటివి చేశావో ఈ లోకంలో పాపాన్ని, చెడ్డపేరునూ మూటకట్టుకుంటావు. రాక్షసా! నీవిప్పుడు ఈ మానవజాతిస్త్రీని తాకి, చేసిన పాపం భయంకరమైన విషం లాంటిది. కుండ ఎత్తుకుని విషం త్రాగినట్లే అయ్యింది.' తరువాత యుధిష్ఠిరు డతనికి బరువెక్కాడు. బరువువల్ల క్రుంగిపోతున్న ఆ జటాసురుడు వెనుకటివలె వడివడిగా వెళ్ళలేకపోతున్నాడు. అప్పుడు యుధిష్ఠిరుడు ద్రౌపదితో, నకులునితో ఇలా అన్నాడు.

'ఈమూర్ఖుడైన రాక్షసునికి భయపడకండి. నేను వీడి నడకను అడ్డుకున్నాను. దగ్గర్లో భీముడుండవచ్చు. కొద్దిసేపటిలో రాక్షసుడు ప్రాణాలతో మిగలడు.' రాజా! బుద్ధి మొద్దుబారిన ఆ రాక్షసుని చూసి, సహదేవుడు యుధిష్ఠిరునితో ఇలా అన్నాడు. 'రాజా! క్షత్రియుడు యుద్ధంలో శత్రువు నెదుర్కొని ప్రాణాలను విడవాలి లేదా జయించాలి. ఇంతకంటె మంచిపని ఏముంది? రాజా! మనం వీడితో యుద్ధం చేసి చంపేద్దాం. క్షత్రియధర్మాన్ని ఆచరించేందుకు అనుకూలమైనచోటు, వేళా లభించాయి. ఈ సమయం యథార్థమైన పరాక్రమాన్ని ప్రకటించుకొనేందుకు అందివచ్చింది. మనం జయించినా, జయింపబడినా ఉత్తమగతులను పొందుతాం. ఈ రాక్షసుడు బ్రతికుండగా సూర్యు డస్తమిస్తే నేను క్షత్రియుడ నని ఎన్నిటికీ అనుకోకు. రాక్షసా! నేను పాండుకుమారుడైన సహదేవుణ్ణి. నన్ను చంపి ఈమెను పట్టుకెళ్ళు. లేదా నాచేతిలో చచ్చి ఇక్కడే నిద్రిస్తావు.' అని సహదేవు డంటూండగా అనుకోకుండా భీముడు కనిపించాడు – అతడు వజ్రాయుధం

దాల్చిన ఇంద్రుడులా గద చేతపట్టుకుని వస్తున్నాడు. అతడు తన సోదరు లిద్దర్నీ, ద్రౌపదినీ చూశాడు. నేలమీద నిలిచి రాక్షసుని అధిక్షేపిస్తున్న సహదేవుని చూశాడు భీముడు. రాక్షసుడు కాలవశంచేత త్రోవతప్పి అక్కడక్కడే తిరుగుతున్నాడు. అక్కడ అలా దైవం కూడా వాడిని నివారించింది. ఆ పరిస్థితిలో సోదరులనూ, ద్రౌపదినీ తీసుకుపోతున్న రాక్షసుని చూసి కోపంతో "పాపీ! నిన్ను శస్త్ర పరీక్షాసమయంలోనే నేను కనిపెట్టాను నీమీద నాకు నమ్మకం లేదు. అప్పుడు నీవు బ్రాహ్మణవేషంలో నీ అసలు రూపాన్ని కప్పిపుచ్చావు. మాకు ఇష్టంకాని మాటలు మాట్లాడలేదు కాబట్టి చంపలేదు. మాకిష్టమైన పనుల్లో ఆసక్తితో ఉంటూ, మాకిష్టం లేనిపనులు చెయ్యకుండా, బ్రాహ్మణరూపంలో అతిథివై వచ్చి, ఏ అపరాధం చెయ్యని నిన్ను ఎలా చంపగలను? రాక్షసుడవని తెలిసినా. చంపినవాడు నరకానికి పోతాడు. తగిన సమయం రానందున నీకు చావు రాలేదు.

ఇవాళ నీకు చావు మూడింది. అందుకే, అద్భుతాలు చేసే కాల ప్రభావం వల్ల, ద్రౌపదిని ఎత్తుకుపోవాలనే బుద్ధి నీకు కలిగింది. కాల మనే దారానికి వ్రేలాడే గాలాన్ని మ్రింగావు. నీళ్ళలో చేపలా నీ నోరు కుట్టినట్లైంది. ఇంక ఇపుడు ఎలా బ్రతుకుతావు? ముందు నీ కిష్టమయినవైపుకు కాని, ఇపుడు వెడుతున్న వైపుకు కాని ఇక వెళ్లలేవు. బకుడు, హిడింబుడు వెళ్ళిన మార్గంలోనే వెళతావు." ఇలా భీము డనగానే మృత్యుప్రేరణతో భయపడిన రాక్షసుడు వారందర్నీ వదిలి యుద్ధానికి దిగాడు. కోపంతో పెదవులు కదలుతూండగా మళ్ళీ భీముడితో "ఓరీపాపీ! నాకు దిక్కులు తోచకపోవటమేమీ కాదు. నీవల్ల ఆలస్యమైంది. యుద్ధంలో నీవు చంపిన ఆ రాక్షసులకు నీరక్తంతో ఈరోజు తర్పణం చేస్తాను." ఇలా రాక్షసుడు చెప్పగా కోపంతో సాక్షాత్తు యముడిలా ఉన్న భీముడు, పెదవుల కొసలు నాకుతూ, నవ్వుతూన్నట్లు ఉండి, కోపంతో ఎరుపెక్కిన కళ్ళతో **ఆగు ఆగు** అంటూ, బాహువులకు పని దొరికిందని భావిస్తూ, రాక్షసుడివైపు పరుగుతీశాడు. అప్పుడు యుద్ధంకోరుతున్న భీముణ్ణి గమనించి, రాక్షసుడు కూడ మాటిమాటికీ నోరు తెరుస్తూ, కొసలు నాకుతూ, బలి ఇంద్రుణ్ణి ఎదుర్కొన్నట్లు సంసిద్ధుడై పరుగుతీశాడు. భీముడు కూడ నిలకడగా యుద్ధానికి తలపడ్డాడు. రాక్షసుడు కూడ జంకకుండా ముష్టియుద్ధాన్ని కోరాడు. వారిద్దరికీ దారుణంగా బాహుయుద్ధం జరుగుతూఉంటే నకుల సహదేవులిద్దరూ పరుగెత్తుకొని వచ్చారు. భీముడు నవ్వుతూ వారిద్దర్నీ వారించాడు. 'ఈ రాక్షసుడికి నేను చాలు. మీరు చూస్తూ ఉండండి' అన్నాడు. యుధిష్ఠిరుని ఉద్దేశించి. 'మహారాజా! నా మీద, సోదరుల మీద, ధర్మంమీద, మంచిపనులుమీద, యజ్ఞాదుల మీద, ఒట్టువేసి ఈ రాక్షసుణ్ణి చంపితీరుతానని ప్రతిజ్ఞ చేస్తున్నాను.' ఇలా పలికి రాక్షసుడూ, భీముడూ

పరస్పరం పోటీపడి బాహుయుద్ధం చేశారు.

ఆ భీమ రాక్షసులిద్దరికి దేవదానవుల యుద్ధంలా పోరుసాగింది. కసి, పగలతో ఇద్దరూ తలపడుతున్నారు. ఉరిమే మేఘాల్లా గర్జిస్తూ, మహాబలవంతులైన వాళ్ళిద్దరూ చెట్లను పెకలించి విసురుకొంటూ ఒకరినొకరు కొట్టుకొంటున్నారు. బలిష్ఠ లయిన వాళ్ళిద్దరూ తొడలతో పెద్దచెట్లను విరగ్గొట్టారు. ఒకరిని మరొకరు కోపంతో చంపెయ్యా లనుకొంటున్నారు. స్త్రీకోసం పూర్వం సోదరులైన వాలిసుగ్రీవులు తలపడినట్లు, ఇద్దరూ వృక్షాలతో యుద్ధం చేయడంవల్ల, చెట్లు అన్నీ తరిగిపోయాయి. మాటిమాటికీ అరుస్తూ, వాళ్ళిద్దరూ చెట్లను విసురుకొంటూ కొట్టుకొన్నారు. భారతా! అక్కడ చెట్లన్నింటినీ నేలకూల్చిన తరువాత చెట్లను మెలిపెట్టి ఒకరినొకరు కొట్టుకొన్నారు.ఒకరినొకరు చంపాలని రాళ్ళను తీసుకొని యుద్ధం చేశారు. రెండు మహాపర్వతాలు పెద్దపెద్దమేఘాలతో తలపడ్డట్లు వారిద్దరూ యుద్ధం చేశారు. చాలావేగం కల పిడుగుల్లాంటి పెద్దబండరాళ్ళతో ఒకరినొకరు చావమోదుకొన్నారు. ఇద్దరూ బలగర్వంతో తలపడి, మళ్ళీచేతుల్తో పట్టుకొని ఏనుగుల్లాగా లాక్కున్నారు. భయంకరమైన పిడిగుద్దులతో ఒకరినొకరు కొట్టుకున్నారు. పెద్దపెద్ద ఆకారాలు కల వాళ్ళిద్దరిమధ్య కొనసాగుతున్న ఆ యుద్ధం వల్ల కటకటాశబ్దం వెలువడింది. తరువాత ఐదుతలలపాములా ఉన్న పిడికిలి బిగించి, భీముడు రాక్షసుడి తలపై కొట్టాడు. భీముని పిడికిలి పోట్లతో దెబ్బతిన్న ఆ రాక్షసుణ్ణి చూసి, బాగా అలసిపోయా డనుకొన్నాడు భీముడు. గొప్పభుజాలు కల దేవసమానుడయిన భీముడు తనరెండు చేతులతో రాక్షసుని పైకెత్తి బలంగా నేలపైకి కొట్టాడు. వాడి అవయవా లన్నింటిని భీముడు పొడిపొడి చేశాడు. పిడికిలితో కొట్టి, తలను శరీరంనుండి వేరుచేశాడు. భీమసేనుని బలంతో జటాసురునితల పళ్లతో కొరుక్కొంటున్న పెదవులతో, తేలవేసిన కళ్ళతో చెట్టునుండి జారిన పండులా పడింది. పళ్ళతో కొరుక్కుంటున్న పెదవులతో, రక్తంతో తడిసి ముద్దై తల పడిపోయింది. మరుత్తులు ఇంద్రుని స్తుతించినట్లు భీముని బ్రాహ్మణోత్తములు కొనియాడారు. అందరూ యుధిష్ఠిరుని సమీపించారు.

158. పాండవులు ఆర్ష్టిషేణుని ఆశ్రమము చేరుట.

ఆ రాక్షసుని చంపిన తరువాత, మళ్ళీ నారాయణాశ్రమానికి వచ్చి ధర్మరాజు నివసించాడు. ద్రౌపదితో సహా సోదరు లందరినీ రావించి సోదరుడైన అర్జునుని గుర్తుకు తెచ్చుకొని ఇలా అన్నాడు. 'అడవిలో తిరుగుతున్న మనకు నాలుగేళ్ళు క్షేమంగా గడిచాయి. ఆ అర్జునుడు ఐదవయేట తిరిగివస్తానని సూచించాడు. పర్వతరాజు అయిన కైలాసానికి

చేరాం. కైలాసశిఖరంమీద పుష్పించిన చెట్లవరుసలతో మదించిన కోకిలలతో, తుమ్మెదలతో, నెమళ్లతో, చాతకపక్షులతో ప్రతిరోజూ పండుగలా ఉంది. పెద్దపులులు, పందులు, దున్నపోతులు, గవయమృగాలు, లేళ్ళు, క్రూరజంతువులు, పాములు, రురుమృగాలతో నిండి ఉంది. వికసించిన వేయిరేకుల పద్మాలు, నూరురేకుల పద్మాలు అలాగే కలువలూ ఉన్నాయి. పవిత్రమయిన ఆ పర్వతం మీద దేవతలూ, రాక్షసులూ కూడ ఉన్నారు. అపరిమితమైన తేజస్సుగల అర్జునుడు అతనిరాకను చూడగోరే మనకు సంకేతరూపమైన ప్రతిజ్ఞ చేశాడు.అస్త్రవిద్యను నేర్వటానికి ఐదుసంవత్సరాలు దేవలోకంలో ఉంటానని చెప్పాడు. అస్త్రాలను పొందిన (అర్జునుని) ఇక్కడ కలుసుకొంటాం. దేవలోకం నుండి ఈ లోకానికి తిరిగివచ్చిన అర్జునుని చూస్తా' మంటూ ధర్మరాజు బ్రాహ్మణు లందరిని పిలిచాడు. ఆ తాపసు లందరికీ పిలిచిన కారణం చెప్పాడు. గొప్ప తపస్సు చేసిన వారందరికీ పాండవులు ప్రదక్షిణం చేసి సంప్రీతిని కలిగించారు. ఆ బ్రాహ్మణులు శుభాన్ని, క్షేమాన్ని ఆశిస్తూ "భరతశ్రేష్ఠా ! త్వరలో ఈ కష్టం సుఖంగా పరిణమించబోతోంది. క్షత్రియధర్మంతో కష్టాలన్నింటిని అధిగమించి భూమిని పాలించగలుగుతావు" అన్నారు. రాజు ఆ తాపసుల మాటలను శిరస్సువంచి స్వీకరించాడు. శత్రుతాపను డయిన ధర్మరాజు ఆ బ్రాహ్మణులతో, సోదరులతో కలసి రాక్షసులు వెంటరాగా, లోమశమహర్షి రక్షణలో ముందుకు సాగాడు.

సుప్రతుడూ, తేజస్వి అయిన ధర్మరాజు సోదరులతో కలసి కొంతమేర కాలినడకన వెళ్లాడు. కొన్నిచోట్ల రాక్షసులు ఎత్తుకొని తీసుకు వెళ్లారు. యుధిష్ఠిరమహారాజు కష్టాలను తలుచుకొంటూ, సింహాలు, పులులు, ఏనుగులతో నిండిన ఉత్తరదిక్కు వైపు వెళ్ళాడు. కైలాసం, మైనాకపర్వతం, గంధమాదనపర్వతపాదాలు, శ్వేతపర్వతాన్ని చూస్తూ సాగాడు. హిమాలయపర్వతాల వరుస పైభాగంలో ఎన్నో పుణ్యజల ప్రవాహాలను చూస్తూ పదిహేడవనాడు పవిత్రమైన హిమాలయపు వెనుకభాగాన్ని చేరాడు. తీగెలతో కూడి పవిత్రమైన హిమాలయపు వెనుకభాగంలో ఉన్న గంధమాదనపర్వతాన్ని పాండవులు చూశారు. ఎగిసి పడే నీటితుంపురులతో మొలిచి, పూలు పూసిన చెట్లతో నిండిన వృషపర్వుని పవిత్రమైన ఆశ్రమాన్ని చూశారు. పాండవులు ఆ రాజర్షిని సమీపించి, సేదదీరి, ఆ వృషపర్వునికి నమస్కరించారు. ఆ రాజర్షి భరతవంశశ్రేష్ఠులైన వారిని కన్నకొడుకుల్లాగా ఆదరించాడు. శత్రుమర్దనులైన పాండవులు గౌరవంతో అక్కడ ఏడురాత్రులు నివసించారు. ఎనిమిదవనాడు లోకప్రఖ్యాతుడైన ఆ ఋషి వృషపర్వుని అనుమతితో ప్రయాణం సాగించా లనుకొన్నారు. తగిన సమయాలలో బంధువుల్లాగా సత్కరించబడే ఆ బ్రాహ్మణులను ఒక్కొక్కరిని పరిచయం చేసి వృషపర్వుని వద్ద న్యాసంగా ఉంచారు. (తిరిగి పొందుతామని అప్పజెప్పారు.)

మహాత్ముడైన ఆ వృషపర్వుని ఆశ్రమంలో మిగిలిన సామగ్రిని, యజ్ఞపాత్రలను, రత్నాలను, ఆభరణాలను దాచారు. భూతభవిష్యత్తులు తెలిసి, సర్వధర్మవేత్త అయిన వృషపర్వుడు పాండవులకు కన్నబిడ్డలకులాగా ధర్మం ఉపదేశించాడు. మహాత్ములైనవారు అతని అనుమతితో ఉత్తరదిక్కువైపుకు సాగారు. అప్పుడు రాజర్షి వృషపర్వుడు ఆ ప్రాంతా న్నెరిగిన బ్రాహ్మణులకు పాండవులకప్పచెప్పి, బయలుదేరిన వారివెంట తానూ కొంతదూరం వెళ్ళాడు. పాండవులతో కొంతదూరం నడిచి, ఆశీస్సు లందజేసి, మార్గాన్ని తెలియజెప్పి వృషపర్వుడు వెనుదిరిగాడు.

యుధిష్ఠిరుడు సోదరులతో కలసి ఎన్నోరకాలైన జంతువులు గల ఆ మార్గంలో కాలినడకన ముందుకుసాగాడు. చెట్లతో నిండిన కొండచరియల్లో ఉంటూ పాండవులు నాలుగవనాడు శ్వేత(హిమాలయ)పర్వతాన్ని ప్రవేశించారు. గొప్పమేఘంలా ప్రకాశిస్తూ, శుభప్రదమైన జలంతో నిండిన మణులు, బంగారం, వెండి శిలలగుట్టలుగా నున్న హిమాలయాన్ని చూశారు. హిమాలయంలో ఆ అందమైన చోటు ఎన్నో గుహలతో, ప్రవాహాలతో, శోభాయమానమైన రాళ్ళతో, తీగెలతో, చెట్లతో నిండి ఉంది. ఆ పాండవులు వివిధవృక్షాలను చూస్తూ తాము చేరదలచిన చోటుకు వృషపర్వుడు చెప్పిన మార్గాన కదలసాగారు. కొండపై భాగాన గల గుహలను దాటటం చాలా కష్టం. అలాంటి దాటలేని గుహలను, వారు ఎన్నింటినో తేలికగా దాటుకొంటూ సాగారు. ధౌమ్యుడు, ద్రౌపది, పాండవులు, లోమశమహర్షి కలిసి వెనుకంజ వేయకుండా వెళ్లారు. జంతువులు, పక్షులతో తీగెలతో, కోతులతో నిండి మనోహరంగా ఉన్న పద్మసరస్సులతో, గుంటలతో నిండిన పవిత్రమైన మాల్యవంత మహాపర్వతాన్ని ఆ మహానుభావులు సమీపించారు. అది కింపురుషులకు నివాసం; సిద్ధచారణులచేత సేవించబడే గంధమాదనపర్వతాన్ని గగుర్పాటుతో పాండవులు చూశారు. విద్యాధరులు, కిన్నరస్త్రీలు సంచరించే పర్వతం అది. ఏనుగుల గుంపులు, సింహాలు, పులులతోకూడిన గంధమాదన పర్వతాన్ని చూశారు.

శరభమృగనాదంతో ధ్వనిస్తూ అనేక జంతువులతో నందనవనం లాంటి ఆ గంధమాదన పర్వతాన్ని చూశారు. మనసును, హృదయాన్ని ఆనందింపచేసి, ఆశ్రయాన్నిచ్చే శుభకరమైన అడవిలో వీరులైన పాండవులు సంతోషంతో వరుసగా ప్రవేశించారు. ద్రౌపదితో కూడిన ఆ వీరులు మహాత్ము లైన ఆ బ్రాహ్మణులతో సంతోషప్రదమైన మంగళ ధ్వనులను వింటూ ప్రవేశించారు. పక్షులు వెలువరించే మధురమైన శబ్దాలను వింటున్నారు. ఆ అడవి అన్ని ఋతువులలో లభించే పండ్లతో నిండుగా ఉన్నది. అన్ని ఋతువుల్లో పూసే పూలతో ప్రకాశిస్తోంది. పండ్లబరువుతో వంగిన మామిడి, అంబాళ, కొబ్బరి,తుమికి చెట్లను

చూస్తూ కదిలారు. ముంజాతక, జీర, దానిమ్మ, మాదీఫల, పనస, గజనిమ్మ, మునగ, ఖర్జూర, ఆమ్ల, ప్రబ్బలి చెట్లను చూస్తూ కదిలారు. పారావత, క్షౌద్ర, కడిమి, మారేడు, నేరేడు, గుమ్మడి రేగు చెట్లను చూస్తూ సాగారు. జువ్వి, మేడి, మర్రి, రావి, పాల, భల్లాతక, ఉసిరి, కరక, విభీతక చెట్లను చూస్తూ సాగారు. గార, కలివె చెట్లను, తుమికి మొ ఇతర వృక్షాలను గంధమాదన చరియలందు చూస్తూ సాగారు. అమృతం వంటి రుచికరాలైన పండ్లతో అల్లుకొని ఉన్న ఆ చెట్లను చూస్తూ అలాగే సంపంగి, అశోక, మొగలి, పొగడ, సురపొన్న, ఏడాకుల అరటి, కొండగోగు, మొగలి, కొడిసె, మందార, నల్లకలువ పూలచెట్లను, పారిజాత, ఎర్రకాంచనం, దేవదారుచెట్లను, శాల, మద్ది, చీకటి, పిప్పల, హింగుక చెట్లను చూస్తూ సాగారు. బూరుగ, మోదుగ, అశోక, ఇరుగుడు, సరళచెట్లను చూస్తూ సాగారు. వెన్నెలపులుగులు, బెగ్గురు పులుగులు, తుమ్మెదులు, చిలుకలు, కోకిలలు, పిచ్చుకలు, పచ్చపిట్టలు, వన్నెపులుగులు, ప్రియక, చాతకపక్షులు అలాగే అనేకరకాలైన పక్షుల వీనుల విందైన తియ్యని కూతలతోనున్న చెట్లను, చేపలతో నిండి మనోహరమైన సరస్సులను చూశారు. ఆ సరస్సులలో కలువలు, తెల్లతామరలు ఎర్ర తామరలు, నల్ల కలువలు, ఎర్రకలువలు అల్లుకొన్నాయి. ధూమ్రవర్ణపు ముక్కు, కాళ్ళు గల హంసలు, కొంగలు, మద్గువులు అందులో ఉన్నాయి. ఇంకా ఇతర జలపక్షులు తామరలందలి మకరందం త్రాగి మత్తెక్కి సంతోషంతో ఉన్నాయి.

పద్మాలలోపలి భాగాలనుండి జారిన పుప్పొడి, కేసరాల ఎర్రదనంచే ఎర్రబారిన; శ్రావ్యమైనధ్వనులు చేసే తుమ్మెదలతోకూడిన సరస్సులను చూశారు. పద్మసమూహాలతో అంతటా అలంకరింపబడిన చెరువులను గంధమాదనపర్వత సానువులందు ఆ నరశ్రేష్ఠులు చూశారు. ఆ పొదరిళ్లలో నెమళ్లు విహరిస్తున్నాయి. అవి క్రీడిస్తున్నపుడు మేఘగర్జనం వినపడింది. దానితో అవి ఎంతో కలత పడ్డాయి. చిత్ర ఫించాలు విప్పుకొని మధురంగా కేకారవాలు చేస్తున్నాయి. అలా నాట్యం చేసే నెమళ్లను చూశారు పాండవులు. కొన్ని నెమళ్లు తమ ప్రియసఖులతో క్రీడిస్తున్నాయి. కొన్ని చిగురుటాకుల పొదరిళ్లలోను, కొన్నిపైభాగం మోద నృత్యాలు చేస్తున్నాయి. చెట్లమోద కిరీటాలవలె ఉండి కొన్ని - మరికొన్ని చెట్ల తొట్టలలో ఉండి నాట్యం చేస్తున్నాయి. కొండ శిఖరాలమోద మన్మథబాణాలవలె ప్రకాశించే బంగారువన్నె సిందువారపుష్పాలను పాండవులు చూశారు. ఆ వనాల్లో పాండవులు చక్కని చెవికమ్మలవలె ఉన్న కొండగోగుపూలను, ఎర్రని ముళ్లగోరింటపూలను దర్శించారు. ఆ చెట్లు బారులు తీరి ఉన్నాయి. అవి కామోత్సాహాన్ని కలిగించే మన్మథ బాణాలవలె ఉన్నాయి. తిలకం దిద్దినట్లున్న తిలకవృక్షాలను, మన్మథబాణాలవంటి గున్నమామిడి చెట్లనూ

చూశారు. దావాగ్నిలా ప్రకాశించే పుష్పాలమీద కూడ తుమ్మెదలు ఝంకారాలు చేస్తూ వ్రాలుతున్నాయి. ఆ కొండ చరియల్లో కొన్నివృక్షాలు ఎట్టగా ఉన్నాయి. కొన్ని కాటుకలా నల్లగా ఉన్నాయి. కొన్ని వైడూర్యాలవలె పుష్పాలతో శోభిస్తున్నాయి. ఆ కొండశిఖరాల మీద మద్దిచెట్లు, కానుగచెట్లు, పాటలాలు, పొగడలు, బారులుగా తీర్చిదిద్దినట్లు ఉన్నాయి. స్వచ్ఛమైన స్ఫటికాల్లాగా తెల్లని రెక్కలు గల పక్షులతో, కలహంసలతో కూడి బెగ్గురు పక్షుల ధ్వనులతోనున్న తామరలు, కలువల కలబోతగా నుండి, చల్లని నీళ్ళుగల సరస్సులను కొండచరియ లందంతటా పాండవులు చూస్తూ సాగారు.

క్రమంగా ఇలా ఆ వీరులు చుట్టూ చూస్తూ సుగంధం వెదజల్లే పూలవరుసలను, రసంతో నిండుగానున్న పండ్లను, మనసుకు హత్తుకొనే కొలనులను, మనోహరమైన చెట్లను ఆశ్చర్యంతో పెద్దపెద్ద కళ్ళతో చూస్తూ పాండవులంతా ప్రవేశించారు. తామర, కలువ, ఎర్రకలువ, తెల్లతామరల పరిమళంతో, హాయినిస్తూ గాలి తాకుతోంది. తరువాత యుధిష్ఠిరుడు 'భీమసేనా! ఈ గంధమాదనపర్వతపు టడవి శోభాయమానంగా ఉంది 'మనసుకు ఆనందాన్నిచ్చే ఈ అడవిలో దేవతావృక్షాలు, అనేకరకాలుగా ఉన్న తీగెలు, ఆకులు, పూలు, పండ్లు ఉన్నాయి. ఈచెట్లు పూలతో నిండి ఉన్నాయి. కోయిలగుంపులతో క్రిక్కిరిసి ఉన్నాయి. ముళ్ళచెట్లే లేవు. పూలు పూయనివే లేవు. గంధమాదనచరియలందున్న చెట్లు నిగారింపుగల ఆకులు, పండ్లతో ఉన్నాయి. మధురంగా తుమ్మెదలు రొదచేస్తున్నాయి. కొలనుల్లో తామరలు బాగా వికసించాయి. ఆడ ఏనుగులతో కూడిన ఏనుగులు పద్మాలను లాగుతున్నాయి చూశావా! తామరలు, కలువల వరుసలుగల ఈ పరస్సులా ఉందో పూదండదాల్చి సాక్షాత్తూ ఆకారం దాల్చిన మరియొక లక్ష్మిలా ఉంది. ఈ శ్రేష్ఠమైన అడవిలో, ఈ చెట్లు అనేక పూల సువాసనలతో నిండుగా ఉన్నాయి. ఈ చెట్ల వరుసలు తుమ్మెదల గానంతో ప్రకాశిస్తున్నాయి. భీమా! చూడు. చుట్టూ దేవతలు విహరించటానికి తగిన చక్కని చోట్లెలా ఉన్నాయో, భీమా! మానవులకు లభించని మార్గాన్ని చేరుకొన్నాం. మనమిప్పుడు సిద్ధులమయ్యాం. తీగెల కొనలు పూలతో, చెట్లు చక్కగా పూసి, లతలతో పెనవేసుకుని, ఈ గంధమాదనం చరియల్లోని ప్రకాశిస్తున్నాయి. భీమా! ఆడనెమళ్ళతో కలిసి తిరుగుతూ నెమళ్ళు చేస్తున్న ధ్వని ఈ పర్వత చరియల్లో గర్జనలా ఉంది విను. చకోరాలు, శతపత్రాలు, మదించిన కోకిలలు, చిలుకలు మొదలైన పక్షులు విరబూసిన ఈ పెద్దచెట్లపై ఎలా వాలుతున్నాయో గదా! భీమా! చెట్ల పైభాగాన నున్న పక్షులు ఎర్రగా, పచ్చగా లేత ఎరుపురంగులో ఉన్న ఎన్నో చకోరపక్షులు ఒకదానినొకటి చూసుకొంటున్నాయి. ఆకుపచ్చని, లేతఎరుపురంగుగల పచ్చికలవద్ద, కొండలనుండి జాలువారే

జలపాతాలలో బెగ్గురుపక్షులు కనబడుతున్నాయి. ప్రాణులన్నింటి మనసులనాకర్షించే తియ్యని పలుకులను తుమ్మెదలు, చక్రవాకాలు, రాబందులు పలుకుతున్నాయి.

నాలుగుదంతాలతో, కమలంరంగుతో ప్రకాశించే ఏనుగులు ఆడ ఏనుగులతో కలసి వైడూర్యపురంగు కొలనులో క్రీడిస్తూ ఉన్నాయి.

ఎన్నో తాటిచెట్ల ఎత్తుగల కొండచరియల నుండి నీటిధారలు పడుతున్నాయి. శరత్కాలపు మేఘాలవంటి సూర్యకాంతులతో అనేకరజత (వెండి) ధాతువులు ఆ కొండను ప్రకాశింపజేస్తున్నాయి. కొన్నిచోట్ల కాటుకరంగుతో, కొన్నిచోట్ల బంగారు రంగుతో ధాతువులు కనబడుతున్నాయి. హరితాలధాతువులు కొన్నిచోట్ల, కొన్నిచోట్ల ఇంగులక ధాతువులు సంధ్యాకాలపు మేఘసమూహంలాంటి మణిశిలల గుహలు ఉన్నాయి. ఎఱకుందేలు రంగువంటి గైరిక ధాతువులు కొన్నిచోట్ల, కొన్నిధాతువులు తెల్ల మేఘాల్లాగా, కొన్ని నల్లమేఘాల్లాగా, లేత సూర్యునికాంతిగలవి కొన్నీ కనబడుతున్నాయి. కాంతులు విరజిమ్మే ఎన్నోరకాల ఈ ధాతువులు ఈ కొండకు శోభనిస్తున్నాయి. వృషపర్వుడు చెప్పినట్లు గంధర్వులు తమ ప్రియురాండ్రతో, కింపురుషులతోను కొండపై భాగాల్లో కనబడుతున్నారు. తాళం సమానంగా ఉన్న గీతాల, సామలధ్వని ప్రాణు లన్నింటి మనసుల నాకట్టుకుంటూ తరచూ వినబడుతోంది. పరమపవిత్రమూ, శుభకరమూ అయిన ఈ దేవనది మహాగంగను దర్శించు. ఇక్కడ హంసలసమూహం నివసిస్తోంది. ఋషులు, కిన్నరులు సేవిస్తున్నారు. ధాతువులు, నదులు, కిన్నరులు, జంతువులు, పక్షులు, గంధర్వులు, అప్సరసలు, మనోహరమైన అడవులు, నూరుతలలతో ఎన్నో ఆకారాలు గల పాములతో కూడిన ఈ పర్వతరాజును శత్రుమర్దనుడవైన భీమా! చూడవయ్యా ! అంటూ ఇలా ఆ శూరులు సంతోషం నిండిన మనసులతో ఉత్తమమైన గమ్యస్థానాన్ని చేరుకొన్నారు. పాండవులు ఆ పర్వతరాజాన్ని దర్శించి తృప్తిపడలేదు. మాలలుగా ఉన్న పూలతో, పండ్లతో ఉన్న చెట్లుగల రాజర్షి ఆర్ష్టిషేణుడి ఆశ్రమాన్ని చూశారు. తరువాత కఠోర తపస్సుతో కృశించి, నాడులే కనబడుతూ ఆన్నిధర్మాల్లో పారంగతుడైన ఆర్ష్టిషేణుని వారు చేరుకొన్నారు.'

ఇది వనపర్వం మొదటిభాగం



భారతం ఎందుకు చదవాలి ?

1. మనం భారతీయులం కనుక. భారతీయులుగా పెరగాలంటే భారతీయులుగా మిగలాలంటే భారతం చదివి తీరాలి.
2. నీవు - నేను అనే భేదం విడిచి మనం అనే భావం పెరగాలంటే... భారతం చదివి తీరాలి.
3. మనల్ని మనం చక్కగా పరిపాలించుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
4. ప్రపంచంలో మన ఉనికిని నిలుపుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
5. ప్రజలంతా నా బంధువులు, మిత్రులు అనే భావం పెరగాలంటే... భారతం చదివి తీరాలి.
6. దేవ, ఋషి, పితృఋణాలతో పాటు మనుష్యఋణం తీర్చుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
7. పాలించడమంటే చెప్పుకిందం తొక్కడం కాదనీ రక్షించడమనీ తెలియాలంటే... భారతం చదివి తీరాలి.
8. బుద్ధిజీవి అయిన మానవుడు వయసులో ఉన్నపుడే భారతం చదివితే ఇరవైరకాల శాస్త్రాలు రెండూ అందుకోగలడు. కనుక ముందుగా యువతరం భారతం చదివి తీరాలి.
9. తీవ్రబుద్ధి మనిషి మనస్సును చీలుస్తుంది - సద్బుద్ధి మనుషుల మనస్సులను బుద్ధులను కలుపుతుంది. ఆ భావన కోసం... భారతం చదివి తీరాలి.